# సైన్స్ ఫిక్షన్ కథలు

కె.ఆర్.కె. మోహన్



4901

4569

కె.ఆర్.కె.మోహన్

# సైన్స్‌ఫిక్షన్ కథలు

కథా నిలయం
4569
శ్రీకాకుళం

శ్రీముఖ పబ్లికేషన్స్
ఫ్లాట్ నెం. 101, కంచి రెసిడెన్సి
పి & టి కాలని, దిల్‌సుఖ్‌నగర్
హైద్రాబాద్ - 500 060
ఫోన్: 4065900

**Science fiction (Short stories)**
by
**K.R.K. Mohan**

ISBN - 81-85168-01-6

© with the writer

**First Edition**
15-2-2001

※ ఈ పుస్తకం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పాక్షిక ఆర్థిక సహాయంతో ప్రచురితం

Price Rs. 120/-

**Cover design**
Chandra

**DTP**
Manu Graphics
1031, Chikkadpally
Hyderabad-20.

**Printed at**
G.A. Graphics
Redhills, Hyderabad.

**Distributors**
(1) All branches of Visalandhra
(2) Navodaya Publications, Opp. Lane to Aryasamaj, Koti, Hyderabad.
(3) Navayuga Distributors, Koti, Hyderabad.
(4) Booklinks, Near YMCA, Narayanaguda, Hyderabad.

కథా నిలయం
4569
శ్రీకాకుళం

# అంకితం

సైన్స్ ఫిక్షన్‌కి ఆద్యుడై

భవిష్యద్దర్శనంతో అనేక శాస్త్రీయ విషయాల్ని ఊహించి

అవి వాస్తవరూపం ధరించడానికి కారణభూతుడై

ప్రపంచ గతినే మార్చిన

**జూల్స్ వెర్న్**‌కు

వినమ్రతతో .....

**-కె.ఆర్.కె. మోహన్**

# మోహనం

తమ 'సైన్స్ ఫిక్షన్' కథల గురించి అభిప్రాయం కావాలని కె.ఆర్.కె. మోహన్‌గారు అడిగినప్పుడు నేను కాదనలేకపోవడానికి కారణాలు రెండు. ఒకటి మోహన్‌గారిపై నాకున్న గౌరవం. రెండవది ఆయనకు నాపై ఉన్న అభిమానం. అందుకే అభిప్రాయం చెప్పే ప్రాయమూ, సైన్స్ ఫిక్షన్ గురించిన అత్యాధునిక పరిజ్ఞానమూ లేకపోయినా - మోహన్‌గారి కథల గురించి మాటలు చెప్పడానికి సాహసిస్తున్నాను. అవసరంకొద్దీ నేను చాలా అవతారాలు ఎత్తవలసి వచ్చింది. అటువంటి అవతారాలలో ఒకటి- సైన్స్ రచయిత అవతారం. ఉద్యోగరీత్యా స్వయంగా రాయకపోయినా కొందరినయినా ప్రేరేపించి వైజ్ఞానిక శాస్త్ర రచనలూ, వైజ్ఞానిక శాస్త్ర ప్రాతిపదికగల కాల్పనిక రచనలూ చేయించిన అనుభవం కొంత నాకూ ఉంది.

'సైన్స్ ఫిక్షన్' అనే పదబంధాన్ని 'వైజ్ఞానిక కాల్పనిక సాహిత్యం' అని అనువాదం చేయవచ్చునేమో! ఈ సాహిత్య ప్రక్రియ ఇరవయ్యవ శతాబ్దంలో విశేషంగా అభివృద్ధి చెందింది. 18వ శతాబ్దంలో వాల్టేర్ రాసిన 'మైక్రోమెగాస్'లో అంతరిక్షయాత్ర కనిపిస్తుంది. అలాగే జోనాథన్ స్విఫ్ట్ రాసిన 'గలివర్స్ ట్రావెల్స్'లో విపరీత సంస్కృతులు కల ప్రాంతాలలోకి జరిపిన యాత్రల వృత్తాంతరాలు ఉన్నాయి. ఆరోజుల్లోనే చంద్రుడి మీదకీ, తక్కిన గ్రహాలకూ జరిపిన ఊహాయాత్రల కథలూ వచ్చాయి. 19వ శతాబ్దంలో ఎడ్గర్ అలెన్‌పో, నాతనియెల్ హాథోర్న్, ఫిట్జ్ జేమ్స్ ఓబ్రియన్ వంటివారు రాసిన కథలలో వైజ్ఞానిక కల్పనలు కనిపిస్తాయి. 19వ శతాబ్దంలో వైజ్ఞానిక శాస్త్ర ప్రాతిపదిక నుండి వైదొలగకుండా రచనలు చేసిన జూల్స్ వెర్న్‌ను హెచ్.జి.వెల్స్‌నూ వైజ్ఞానిక కాల్పనిక సాహిత్యపు తొలి రచయితలుగా చెప్పుకోవచ్చు.

'సైన్స్ ఫిక్షన్' అనే పదబంధాన్ని రూపొందించిన వారు హ్యూగో గెర్న్స్‌బాక్ (1920లో). ఆయన 'అమేజింగ్ స్టోరీస్' అనే పత్రిక నెలకొల్పి అందులో 'సైన్స్‌ఫిక్షన్' మాత్రమే ప్రచురించేవాడు. అయితే ఆ పత్రికలో వెలువడిన కథలకు పెద్ద గుర్తింపు రాలేదు. మరి కొన్నేళ్లకు జాన్ డబ్ల్యూ కాంప్‌బెల్ జూనియర్ సంపాదకత్వంలో మొదలయిన 'అస్టవుండింగ్ సైన్స్‌ఫిక్షన్' పత్రిక - సైన్స్‌ఫిక్షన్‌కు పెద్ద పీట వేసింది. ఐసాక్ ఆసిమోవ్, ఆర్థర్ సి. క్లార్క్, రాబర్ట్ ఎ. హీన్‌లీన్ వంటి ఉద్దండులు సైన్స్ ఫిక్షన్‌కు సాహిత్యస్థాయి కల్పించారు. అంతేకాదు. సైన్స్ ఫిక్షన్‌కు విశేష ప్రజాదరణ లభించడానికీ ఆసిమోవ్ వంటి వారి రచనలు తోడ్పడ్డాయి. ఆల్డస్ హక్స్‌లీ, సి.ఎస్. లూయిస్ వంటి మేధావులు కూడా సైన్స్‌ఫిక్షన్ రచనలు చేసి ఆ ప్రక్రియకు విశేష గౌరవం కలిగించారు.

'సైన్స్ ఫిక్షన్' అనే పదబంధంలో రెండు అంశాలున్నాయి. సైన్స్ ఒక అంశం. ఫిక్షన్ రెండవ అంశం. అంటే వైజ్ఞానిక కాల్పనిక సాహిత్యంలో విజ్ఞాన శాస్త్రవిశేషాలతోబాటు కాల్పనికత ఉంటుంది. అంటే అందులో చెప్పే వైజ్ఞానిక శాస్త్ర విషయాలలో కల్పన ఉండకూడదు. వైజ్ఞానిక

శాస్త్ర ప్రాతిపదికమీద కల్పన జరిగితే సొగసయిన వైజ్ఞానిక కాల్పనిక సాహిత్యం రూపొందుతుంది. కొందరు అభూత కల్పననూ, అశాస్త్రీయ విశేషాలను మేళవించి కృతకమైన వైజ్ఞానిక కాల్పనిక సాహిత్య సృష్టి చేసే ప్రయత్నం చేశారు. నేతిబీరకాయ సామ్యం ఇక్కడ చెప్పకూడదేమో!

అంటే 'సైన్స్ ఫిక్షన్'లోని వైజ్ఞానిక శాస్త్ర విశేషాలకు గట్టి ప్రాతిపదిక ఉండాలి. ఆ ప్రాతిపదికమీద సృజనాత్మక సాహిత్య రచనచేసే నేర్పుతో మంచి సాహిత్యం సృష్టించడం అందరికీ వీలయ్యే పనికాదు. 'ఇట్లు జరగడానికీ వీలుందేమో' అనిపిస్తూ సాగేదే ఉత్తమమైన వైజ్ఞానిక కాల్పనిక సాహిత్యం. అంతరిక్షయాత్ర, మరమనుషుల వాడకం ఒకప్పుడు 'సైన్స్ ఫిక్షన్' కు పరిమితం. కాలక్రమాన అవి మానవుల అనుభవంలోకి వచ్చాయి. మానవ మేధస్సుకు అందనివి ఎన్నో! కాలం గురించీ, రోదసీ గురించీ మానవుల అవగాహన ఇంకా పరిమితమే.

కె.ఆర్.కె.మోహన్ గారి 'సైన్స్ ఫిక్షన్' కథలలో వైజ్ఞానికమైన ప్రాతిపదికతో బాటు కథా రచనలో ఆయనకు గల ప్రతిభ బాగా కలిసివచ్చింది. ఆర్ష విజ్ఞానంతో ఆయనకు గల పరిచయమూ చాలాకథలకు కొత్త వన్నెలు దిద్దాయి. ఈ కథలలో అంతస్సూత్రాలుగా కనిపించే కొన్ని అభిప్రాయాలు ఆలోచనామృతాలు. మనిషి వైజ్ఞానికంగా ఎంత ఎదిగినా తన ఉనికికి తానే భంగం కలిగించుకునే పనులు చేయకూడదని మోహన్‌గారు సున్నితంగా చెబుతారు. వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనలు అభివృద్ధికి ఎంతగా తోడ్పడుతాయో అంతగా వినాశనానికీ దారి తీయవచ్చు. భవిష్యత్తు గురించిన ఆలోచనలలో ఈ వినాశనం గురించిన అవగాహన ఉండాలన్నది మోహన్‌గారి సూచన. ఈ సూచన వాచ్యంగా చేయకపోవడం ఒక ప్రత్యేకత. అలాగే వైజ్ఞానిక శాస్త్ర పరిణామాలను స్వార్థం కోసం వాడుకూడదనీ హెచ్చరిస్తారు మోహన్‌గారు.

ఈ సంపుటంలోని కథలలో కొన్ని వైజ్ఞానిక కాల్పనికతకు అతీతమైనవి. ఒక ఇతివృత్తం వేర్వేరు కోణాలలో చెప్పిన సందర్భాలూ ఒకటి రెండు ఉన్నాయి. మనిషిని నడిపించేది మెదడు. ఏ మనిషికయినా మెదడు తొలగించి మరొకరి మెదడు అమరిస్తే ఆ అమర్చిన మెదడుకు కొత్త శరీరం దొరుకుతుంది కానీ ఈ శరీరం తొడుగులో ఉన్న వ్యక్తికి కొత్త మెదడు దొరకదు. గుండె అమర్చడం నిన్న కల్పన. నేడు సాధ్యం. మెదడు అమర్చడం ఎప్పటికి సాధ్యమో! వైజ్ఞానికంగా సాధ్యమయినా దానివల్ల మానసిక సాంఘిక పరిణామాల గురించి తీవ్రంగా ఆలోచించాలి అంటారు మోహన్‌గారు.

'మాయమైన మమ్మీ' అనే కథ మమ్మీల గురించి తెలిసిన విశేషాల ఆధారంగా రూపొందిన రచన. మొత్తం సంపుటంలో వైజ్ఞానిక ప్రాతిపదిక బలంగా లేని కథ ఇదేనని చెప్పాలి.

మనసు చేసే మాయ గురించిన కథలూ ఈ సంపుటంలో ఉన్నాయి. అయితే కథలకు అవసరమయినంత కాల్పనికతను మాత్రం జోడించి సంయమనం పాటించి ఆ కథలకు వన్నె తెచ్చారు రచయిత.

సైన్స్ ఫిక్షన్ రచన కత్తిమీద సాము వంటిది. సైన్సుకూ, ఫిక్షనుకూ పాకం సరిగా కుదరాలి కదా! ఈ పాక శాస్త్రంలో మోహన్‌గారి ప్రావీణ్యం ఈ కథలలో కనిపిస్తుంది. వైజ్ఞానిక శాస్త్ర విషయంలో పెద్దగా పరిచయం లేనివారు కూడా ఈ కథలను హాయిగా చదువుకోవచ్చు. చాలా కథలలో ముందు ముందు ఏం జరుగుతుందో కథ ఏమలుపు తిరుగుతుందో అనే ఉత్కంఠ స్థితి పోషించడం - రచయితగా మోహన్‌గారు సాధించిన పరిపక్వతకు గుర్తు.

విజ్ఞాన శాస్త్ర విషయాలు ఆకళింపుచేసుకోవడం ఒక ఎత్తు. వాటి పరిమాణాలనూ పరిణామాలనూ పరిశీలించి తమదే అయిన అభిప్రాయాలు ఏర్పరుచుకొని, ఆ ఏర్పరుచుకొన్న అభిప్రాయాలను పదిమందికీ అర్థం అయ్యే తీరులో రాయడం మరొక ఎత్తు. మోహన్‌గారి విజయం రహస్యం ఇదే.

తక్కిన భారతీయ భాషలలో వస్తున్న సైన్స్ ఫిక్షన్‌తో సరితూగగల వాసి ఉన్న కథలు రాసిన మోహన్‌గారు ఇంకా ఎన్నో వైజ్ఞానిక కాల్పనిక రచనలు చేయాలనీ, ఆ రచనలతో మరెన్నో సంకలనాలు వెలువడాలనీ కోరుకుంటున్నాను.

నా చేత ఈ మాటలు రాయించిన మోహన్‌గారి పెద్ద మనసుకు నా ధన్యవాదాలు.

**- పి.ఎస్. గోపాలకృష్ణ**

# ముందుమాట

**ఫిక్షన్** అంటే కల్పన. కథలు, నవలలు కల్పనలే. నిజానికి ఈ ప్రక్రియలు మన భారతీయ సాహిత్యానికి కొత్త. ఇవి ఆంగ్లభాషా ప్రభావంతో, పాశ్చాత్య సాహిత్యం నుంచి మనకు దిగుమతి అయినవే. మనకుండిన కథలన్నీ పురాణేతిహాసాలకు సంబంధించినవి. లేదా రాజుల, యువరాజుల శౌర్య, శృంగార లీలలకు సంబంధించినవి. సాంఘిక పరిస్థితులు, సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని రచించినవి బొత్తిగాలేవు. నవలలైతే అసలేలేవు. నిజానికి 'నావెల్' అన్న ఇంగ్లీషు పదాన్ని 'నవల'గా తెలుగు చేసుకున్నాం. అయితే ఒక్క శతాబ్దకాలంలో ప్రపంచంలో ఏ భాషా సాహిత్యానికీ తీసిపోని స్థాయికి ఎదిగింది తెలుగు సాహిత్యం.

గత శతాబ్దంనుంచీ ఆంగ్ల సాహిత్యంలో మరో ప్రక్రియ మొదలైంది. అదే సైన్స్ ఫిక్షన్- అంటే శాస్త్రీయ అంశాలను ఆధారంచేసుకుని సృష్టించిన కల్పనా సాహిత్యమన్నమాట. దీనికి ఆద్యుడు జూల్స్ వెర్న్. ఆయన రాసిన "ఎరౌండ్ ది మూన్" అన్న నవలలో రాకెట్ ద్వారా చంద్రునిమీదకు అంతరిక్ష యాత్రికులను పంపడం ఇతివృత్తం. ఆనాడు అంటే 19వ శతాబ్దపు ఉత్తర భాగంలో ఇది కేవలం ఒక ఊహా కల్పన మాత్రమే. కాని 1969లో అది జూల్స్ వెర్న్ ఊహించిన రీతిలోనే వాస్తవం అయింది.

అలాగే జూల్స్ వెర్న్ "జర్నీ ఇన్‌టు ది ఇంటీరియర్ ఆఫ్ ఎర్త్" అన్న నవల రాశారు. అందులో ఆయన భూగర్భంలో అంతర్వాహినులుగా నదులు, సముద్రాలు, సరస్సులు, జల జీవాలు, అల్పజీవాలు ఉంటాయని రాశాడు. ఆ రోజుల్లో అందరూ భూగర్భంలో మట్టి, నీరు, బాగా లోలోన అయితే కరిగిన ఇనుము ఉంటాయని వేరేమీ ఉండవని భావించేవారు. అందువల్ల వెర్న్ పేర్కొన్న అంశాలను అద్భుతమైన కల్పనగా మాత్రమే తీసుకున్నారు. కాని ఈ శతాబ్దంలో జరిపిన పరిశోధనలు ఆయన ఊహలన్నీ అక్షర సత్యాలని నిరూపించాయి. 'గల్ఫ్ స్ట్రీం' అమెజాన్ నదికన్నా పెద్దదైన అంతర్వాహిని అని తెలిసింది. ఇది భూగర్భంలో వేలమైళ్ళు ప్రయాణించి, అంతర్వాహినిగా అట్లాంటిక్ మహాసముద్రంలో కలుస్తుంది. ఇటువంటివి వేలాదిగా భూగర్భ నదులున్నాయి. ఈ శతాబ్దపు పరిశోధనలు ఒక అంతర్వాహిని విశాఖపట్నం దగ్గర బంగాళాఖాతంలో కలుస్తున్న విషయాన్ని బహిర్గతం చేశాయి. దీనికి అప్పటి ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌గారి గౌరవ సూచనంగా 'కృష్ణ' అని పేరు పెట్టారు. ఇది తెలుగువారందరికీ ఆనందం కలిగించే విషయం.

జూల్స్‌వెర్న్ గత శతాబ్దంలోనే "ట్వెంటీథౌజెండ్ లీగ్స్ అండర్ ది సీ" అన్న నవల రాశాడు. అందులో శాస్త్రజ్ఞుల బృందం సబ్ మెరీన్‌లో సముద్ర గర్భంలో పరిశోధనలు జరుపుతుంది. నిజానికి అప్పటికి సబ్ మెరీన్‌కి రూపకల్పనే జరగలేదు. పైగా సముద్ర గర్భం అంతా నున్నగా, చిక్కని మట్టితో ఉంటుందనుకునేవారు. కాని వెర్న్ సముద్ర గర్భంలో కొండలు, పర్వత శ్రేణులు, లోయలు, అడవులు, విభిన్నమైన జీవజాలం ఉంటాయని రాశాడు. ఈ శతాబ్దంలో

జరిగిన సాగర గర్భ పరిశోధనలు అవన్నీ వాస్తవాలని నిరూపించాయి. విచిత్రమేమిటంటే సబ్ మెరీన్ నిర్మాణం సరిగ్గా వెర్న్ వర్ణించినట్లుగానే జరిగింది. ఇలా ఆయన రాసిన సైన్స్ ఫిక్షన్ అంశాలు ఇంచుమించు అన్నీ వాస్తవాలు అయ్యాయి.

నిజానికి టి.వి.లు, కంప్యూటర్లు, స్పేస్ లాబ్‌లు, అవయవాల మార్పిడులు, జన్యుమార్పిడులు-ఇవన్నీ ఈ శతాబ్దపు పూర్వభాగంలో సైన్స్‌ఫిక్షన్. కాని అవన్నీ కొద్ది దశాబ్దాలలోనే వాస్తవాలయ్యాయి.

ఊహాకి శాస్త్రీయపరమైన ఆధారం వుండి అది ఇంకా వాస్తవ రూపం ధరించనంతకాలం, అది సైన్స్ ఫిక్షన్ అవుతుంది. శాస్త్రీయ ఆధారాలకంటే ఊహాలకే ప్రాధాన్యం ఉన్నప్పుడు అది "ఫాంటసీ" అవుతుంది. ఉదాహరణకి "'ఆలీస్ ఇన్ వండర్‌లాండ్", "స్నోవైట్ అండ్ సెవెన్ డ్వార్ఫ్స్", "గల్లీవర్స్ ట్రావెల్స్"-ఇవన్నీ ఫాంటసీలు. మొన్నమొన్నటివరకు "ఆలీబాబా నలభై దొంగలు" ఫాంటసీయే. అందులో "ఓపెన్ సెసేమ్" అనగానే గుహ తలుపు తెరుచుకుంటుంది. ఈనాడు రిమోట్ కంట్రోల్‌తో, వాయిస్ రికగ్నిషన్‌తో మూసివున్న తలుపులు తెరవడం సాధ్యమే. అంటే అలనాటి ఫాంటసీ, శాస్త్రీయ వాస్తవం అయిందన్నమాట. అదేకథలో ఆ తలుపు తెరుచుకోడానికి ఏదైనా శాస్త్రీయ పరమైన ఊహ చేసి ఉంటే, అది సైన్స్‌ఫిక్షన్ అయ్యుండేది. ఆ తర్వాత అది వాస్తవ రూపం ధరించి ఉండేది.

ఇంగ్లీషులో సైన్స్‌ఫిక్షన్‌కు సంబంధించి వేలాది కథలూ, నవలలూ వచ్చాయి. వాటిలో ఎన్నో వైజ్ఞానిక వాస్తవాలయ్యాయి. అయితే భారతీయ భాషలలో సైన్స్ ఫిక్షన్ ఎక్కువగా రాలేదు. ఉన్నంతలో బెంగాలీ, మరాఠీ, కన్నడ భాషలలో కొంచెం ఎక్కువగా వచ్చింది.

ప్రపంచ ప్రఖ్యాత చిత్రదర్శకుడు సత్యజిత్‌రే మంచి సైన్స్‌ఫిక్షన్ రచయిత. ఫ్రెడ్‌హోయిల్‌తో కలిసి విశ్వావిర్భావ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన జె.వి.నార్లికర్ ప్రఖ్యాత మరాఠీ సైన్స్‌ఫిక్షన్ రచయిత. అలాగే శ్రీనరహరి (కన్నడం), ఎ.యస్. పురుషోత్తమన్ (తమిళం) పేరున్న సైన్స్‌ఫిక్షన్ రచయితలు. చివరి ముగ్గురితో నాకు సన్నిహిత పరిచయం ఉంది. వారి కథలు కొన్నింటిని నేను తెలుగులో అనువదించి 'విపుల'లో ప్రచురించడం జరిగింది.

ఇంక తెలుగు విషయం చూసుకుంటే రాశిపరంగా తక్కువే వచ్చాయి. అయితే వచ్చిన వాటిలో ఎక్కువ భాగం ఉత్తమమైనవే. ఈ శతాబ్దపు పూర్వభాగంలోనే టేకుమళ్ళ రాజగోపాలరావుగారు "విహంగయానం" అన్న వైజ్ఞానిక నవలను రచించారు. కొడవటిగంటి, కొమ్మూరి సాంబశివరావువంటివారు సైన్స్‌ఫిక్షన్ కథలు రాశారు. తెలుగులో సైన్స్ ఫిక్షన్ రచయితలు ఎక్కువగా లేరు. ఉన్నవారుకూడా రాసిపరంగారాసింది తక్కువే. తెలుగులో సైన్స్ ఫిక్షన్ ఎక్కువగా రాసిన కొద్దిమందిలో నేను ఒకడిని. నాకు సైన్స్‌లో మొదటినుంచీ అభినివేశం ఉండడం, ఈనాడులో 'జ్ఞాననేత్రం', ఉదయంలో 'విజ్ఞాన వీచికలు', ఆంధ్రజ్యోతిలో 'విజ్ఞాన చంద్రిక', ఆంధ్రప్రభలో 'విజ్ఞానప్రభ', శ్రీవాణిలో "సైన్స్‌వాణి" వంటి సైన్స్‌కాలమ్స్ నిర్వహించడం, నేను మంచి సైన్స్ ఫిక్షన్ రాయడానికి దోహదం చేశాయి. 1994లో [illegible]ప్పు 'ఎన్.సి.ఎస్.టి.సి అవార్డు' ను బొంబాయిలోని నెహ్రూప్లానిటేరియం డైరెక్టర్

జె.జె.రావల్‌తో సంయుక్తంగా పంచుకోవడం, ఈ అవార్డును మన రాష్ట్రంనుంచి పొందిన వాడిని ఇప్పటికి వరకూ నేను ఒక్కడినే కావడం (మహీధర నళినీ మోహన్‌గారికి కూడా వచ్చిందికాని ఆ కేటగిరీ వేరు), సైన్స్‌కు సంబంధించిన రచనలను నిర్దుష్టంగా రాయడానికి ప్రేరేపించాయి. ఇప్పటివరకు సైన్స్‌ఫిక్షన్‌లు ఎనభైకి పైగా కథలూ, మూడు నవలలు, ఐదు నాటికలు, అనేక వ్యాసాలూ రాశాను. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచేకాక, మద్రాసు కేంద్రం విజయవాడ కేంద్రాలనుంచి ప్రసంగాలూ, ఢిల్లీ కేంద్రంనుంచి ఆంగ్ల ప్రసంగం చేశాను. ఇంతకుముందు నా సైన్స్‌ఫిక్షన్ రచనలను పుస్తక రూపంలో తీసుకురాలేదు. కొన్ని న్యూస్ ప్రింట్‌మీద అచ్చుకావడంతో శిథిలమైపోయాయి. కొన్ని అతీగతీ తెలీకుండా పోయాయి. అందుబాటులో ఉన్నవాటితో ఈ సంకలనాన్ని తెస్తున్నాను. బహుశా ఇదే తెలుగులో వచ్చిన తొలి సైన్స్ ఫిక్షన్ కథల సంకలనం అనుకుంటాను.

ప్రతిభాషలోనూ సైన్స్ ఫిక్షన్‌లో ఎక్కువగా వచ్చింది అంతరిక్ష యాత్రల గురించి నేను రాసిన వాటిలో కూడా ఎక్కువ భాగం స్పేస్ ట్రావెల్‌కి సంబంధించినవే. విశేషమేమిటంటే నా మొట్టమొదటి కథ 'సైన్స్‌ఫిక్షన్'కి సంబంధించినదే. దాని పేరు "చంద్రమండలయాత్ర' ' ఇది 'చుక్కాని' పక్షపత్రికలో 1959 జూన్ 15 సంచికలో ప్రచురితమై విశేషంగా పాఠకాదరణ పొందింది. గురుత్వాకర్షణ శక్తికి ప్రభావితం కాని పదార్థంతో చేసిన అంతరిక్ష నౌకలో చంద్రమండలయాత్ర చేయడం ఇందులోని ఇతివృత్తం. చంద్రుని నేలలోపల నగరాలు, కాలనీలు, వృక్షజాలం, నీరు, బుద్ధిజీవులు, భూయాత్రికుల నౌక చెడిపోవడం, చంద్రునికి వచ్చిన అంగారక గ్రహవాసులు, చంద్రమండలవాసులతో కలిసి వారు తిరిగి భూమికి రావడం నా ఊహలో చోటుచేసుకొన్న కొన్ని అంశాలు.

సరిగ్గా 10 సంవత్సరాల తర్వాత 1969లో తొలిసారిగా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై కాలు మోపాడు. ఆయాత్రతో చంద్రమండలం నిర్జీవలోకం అని నిరూపితమయింది. అయితే ఇటీవల చంద్రుని గర్భంలో నీరున్న విషయం బయటపడడం, నా ఊహల్లో ఒక దానికి జీవం పోసినట్లయింది. అలాగే నేను ఊహించినట్లుగానే చంద్రుని నేలలోపల కాలనీలను నిర్మించడం, వృక్షజాలాన్ని పెంచడం వంటి వాటికి పథకాలు రచిస్తున్నారు శాస్త్రజ్ఞులు. ఒకటి రెండు దశాబ్దాలలో ఇవి వాస్తవం కానున్నాయి.

ఇంక 1980 దశకంలో నేను రాసిన అంగారక గ్రహయాత్రకు సంబంధించిన కథలలో అంగారకుడు ఒకప్పుడు భూమిలో అంతర్భాగమనీ, ఏకారణం చేతనో విడిపోయాడనీ, విడివడ్డ భాగంలో ఇనుము అధికంగా ఉండడంతో అది నీటిని విడగొట్టి ఐరన్ ఆక్సయిడ్‌గానూ, హైడ్రోజన్‌గానూ మార్చిందనీ, హైడ్రోజన్ అంతరిక్షంలోకి ఎగిరిపోయిందనీ, ఎర్రని ఐరన్ ఆక్సయిడ్ మిగిలిపోయిందనీ అందుకే అంగారకుడు రక్తవర్ణంలో ఉంటాడనీ రాశాను. అంగారకునిమీద ఒకప్పుడు బ్రహ్మాండమైన జీవనదులు పారేవనీ, జంతువులు, వృక్షాలూ బుద్ధిజీవులు కూడా ఉండేవారనీ, నీరు, ఆక్సిజన్ పోవడంతో ఇవన్నీ అంతరించాయనీ, త్రవ్వకాలు జరిపితే వీటి అవశేషాలు బయటపడ్తాయనీ రాశాను. వీటిలోని సత్యాసత్యాలను

గానున్న కొద్ది దశాబ్దాలలో అంగారక గ్రహానికి జరుగనున్న మానవ యాత్రలు పరీక్షిస్తాయి. ఇప్పటికైతే అంగారకునిమీద నూరుకోట్ల సంవత్సరాల ముందు బ్రహ్మాండమైన నదులు పారాయనడానికి సాక్ష్యాలు దొరికాయి.

నేను రాసిన సైన్స్‌ఫిక్షన్ కథలో "ఆపరేషన్ ఆల్ఫా సెంటారీ" గురించి ప్రత్యేకంగా చెప్పాలి- అప్పటి ఆంధ్రభూమి వీక్లీ ఎడిటర్ సికరాజుగారు 1977లో ఒక మంచి సైన్స్‌ఫిక్షన్ రాసి ఇమ్మన్నారు. వెంటనే 'విశ్వాంతరాళంలో విజయయాత్ర" అన్న పెద్ద కథను రాసిచ్చాను. అయితే అది మరీ పెద్దది కావడంతో దానిని కుదించి "సిరియస్" అన్నపేరుతో 1-12-1977 సంచికలో ప్రచురించారు. దానిని సంక్షిప్తీకరించడం నాకు అసంతృప్తి కలిగించింది. ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారం పదార్థం శక్తిగానూ, శక్తి పదార్థంగానూ మారగలదు. ఈ లెక్కన అంతరిక్ష యాత్రికులు శక్తిగా మారితే కాంతివేగంతో అనంతదూరాలలో ఉన్న నక్షత్ర మండలలో ప్రయాణంచేసి తిరిగి అక్కడ యధారూపం పొందవచ్చుగా. మళ్ళీ కాంతిరూపంతో భూమినిజేరి యధారూపం పొందవచ్చుగా. ఈ ఇతివృత్తంతో 'సిరియస్' నక్షత్ర మండలానికి యాత్రను కథగా రాశాను. నిజానికి టెలిఫోన్లో జరుగుతుందేమిటి? మన మాటలు విద్యుత్‌గా మారి అవతలవైపుకు వెళ్ళి అక్కడ మళ్ళీ మాటలుగా మారుతున్నాయి. అలాగే రేడియో, టి.వి ప్రసారాలూనూ. అటువంటప్పుడు మనుష్యులను, శక్తిగామార్చి శక్తిని మనుష్యులుగా మార్చి అంతరిక్షయాత్రలు జరపడం సైద్ధాంతికపరంగా సాధ్యమేనని నా అభిప్రాయం. అయితే ఆ కథను సంక్షిప్తచేసినందువల్లనో ఏమోకాని దానికి ఆశించినంత ప్రతిస్పందన పాఠకులనుంచి రాలేదు. దానిని సంక్షిప్తంచేశారన్న అసంతృప్తి నాలో ఉండిపోయింది. అయితే సికరాజుగారికి నేనంటే ఉన్న అభిమానం కొద్దీ ఒకసారి పిలిచి "మీరు రాసియ్యాలేకాని మీసైన్స్ ఫిక్షన్ కథలు ప్రతినెలా ఒకటి మా మాస పత్రికలో వేస్తాను" అన్నారు. ఆ ప్రోత్సాహంతో 1980 దశకంలో చాలా ఎక్కువగా సైన్స్ ఫిక్షన్ కథలు ఆ పత్రికలో రాశాను. రాసివ్వడంలో నేను ఆలస్యం చేసి ఉండవచ్చుకాని, ఇచ్చాక ఆయన ఆలస్యం చేసింది ఎప్పుడూ లేదు. మరుసటి నెల సంచికలో ఆ కథ వచ్చి తీరేది. అంతటి అభిమానం ఆయనది. అదశకంలోనే ఆంధ్రభూమి మాసపత్రికలో "తేజోలింగ రహస్యం" అన్న పూర్తి నవల వచ్చింది. సికరాజుగారి అభిమానానికి నేను ఎప్పుడూ ఋణపడి ఉంటాను.

ఇదిలాఉండగా 1993లో ఉదయం ఆదివారం అనుబంధం చూస్తుండిన చైతన్య ప్రసాద్‌గారు వారపత్రికకు ఒకమంచి సైన్స్‌ఫిక్షన్ కథ రాసిమ్మని అడిగారు. అప్పుడు నేను ఆంధ్రభూమికి 1977లో రాసిచ్చిన కథగురించి, నాలో మిగిలిపోయిన అసంతృప్తి గురించి ఆయనకు చెప్పి ఆ కథ చదవమని ఇచ్చాను. అది ఆయనకు బాగా నచ్చింది. వెంటనే ధారావాహికంగా వేస్తానన్నారు. అయితే అప్పటికి పదిహేనేళ్ళు దాటిపోవడంతో ఆ కథకి స్వల్ప మార్పులు చేసి "ఆపరేషన్ ఆల్ఫా సెంటారీ" అన్న పేరుతో ఇచ్చాను. దానిని ఆయన సీరియల్‌గా ...ని బొమ్మలతో వేశారు. అది విశేషమైన పాఠకాదరణ పొందింది. ఆ సీరియల్ బాగా ...తో అప్పుడు ఆకాశవాణి, హైద్రాబాద్ కేంద్రంలో సైన్స్ కార్యక్రమాలు చూస్తుండిన యస్.వి.

ప్రసాద్ గారు ఫోన్ చేసి, ఆ సీరియల్‌ని, సీరియల్ నాటికగా మలిచి వారికిమ్మన్నారు. వారు కోరిన విధంగా తయారు చేసి ఇచ్చాను. నాలుగువారాలు సీరియల్‌గా వచ్చిన ఆనాటకం శ్రోతలనుంచి అపూర్వమైన ఆదరణ పొందింది. శ్రోతలు ఎన్నో ఆసక్తికరమైన ప్రశ్నలు వేయడంతో, నా చేత ప్రత్యేకంగా ప్రశ్నోత్తరాల కార్యక్రమం ప్రసారం చేశారు. ఒక విశేషమేమిటంటే ఒక రచయిత ఈ ఇతివృత్తంతో తాను 1984లో 'స్వాతి'లో ఒక కథ రాశాననీ, నా కథ దానికి కాపీ అని ఆకాశవాణి వారికి రాశాడు. ఆ ఉత్తరం చూసి, నేను 1-12-1977 ఆంధ్రభూమి వీక్లీకాపీ తీసుకు వెళ్ళి అందులో పడిన "సిరియస్" కథను చూపించాను. మరి ఎవరి కథను ఎవరు కాపీకొట్టినట్లు? " ఏం చేస్తాం. రచయితలలో కూడా ఇటువంటి శాల్తీలుంటాయి" అన్నారు ఆయన నవ్వుతూ. "ఆపరేషన్ ఆల్ఫా సెంటారీ" సీరియల్ నాటిక అపూర్వ స్పందన పొందడంతో ప్రసాద్‌గారు మరోమంచి సీరియల్ నాటికను రాసిమ్మని అడిగారు. ఆయన కోరిక మేరకు "అవనిగర్భంలో అద్భుతయాత్ర" అన్న మరో సైన్స్ ఫిక్షన్‌సీరియల్ రాసిచ్చాను. అది కూడా శ్రోతలనుంచి విశేషాదరణను పొందింది.

ఇంకో ఆసక్తికరమైన విషయం. 1986 నవంబరు ఆంధ్రభూమి మాసపత్రికలో నా కథ "హైలీపై హేపీ జర్నీ" అన్న కథను రాశాను. హైలీతోకచుక్క 76 సంవత్సరాలకొకసారి భూమిని సమీపిస్తుంది. ఈకాలంలో సౌరమండలం మొత్తాన్ని చుట్టి వస్తుంది. అందువల్ల అంతరిక్షయాత్రికులు ఈ హైలీతోకచుక్కపై దిగి దానినే అంతరిక్షనౌకగా వాడుకుంటూ సౌరమండలంలోని గ్రహాలనూ, ఉపగ్రహాలనూ పరిశోధించడం ఇందులోని ఇతివృత్తం.

ఇదిలా ఉండగా 1994లో అమెరికాలోని నాసాకేంద్రం,గ్రహాంతర యానానికి కొత్తసూచనలు చేయవలసిందిగా పత్రికల్లో ప్రకటించింది. భూమికి తక్కువ వ్యవధిలో కొన్ని తోకచుక్కలు సమీపిస్తుంటాయి. అటువంటి వాటిలో ఎంకీస్ కామెట్ (Enckie's comet) ఒకటి. ఇది ప్రతి 3సంవత్సరాల 4 నెలలకి ఒకసారి భూమిని సమీపిస్తుంది. దీనిపైకి రిమోట్‌కంట్రోల్‌తో నడిచేయంత్రాలను దింపితే అవి ఈ మూడేళ్ళలో సౌరమండలం అంతా చుట్టి గ్రహాలు, ఉపగ్రహాలను పరిశీలించవచ్చు. అలాగే ఈ తోకచుక్క నే అంతరిక్షనౌకగా వాడుకుని సౌరమండలంలో వివిధగోళాలకు యాత్రలుచేయవచ్చు. ఇట్టి సూచనలను నేను వారికి సవివరంగా పంపాను. అయితే దురదృష్టవశాత్తూ నేను ఆ ప్రకటనను ఆలస్యంగా చూడడంతో, నా సూచనలు వారికి గడువుతేదీ తర్వాత అందాయి. అయినా నా సూచనలు వారికి విశేషంగా ఆసక్తి కల్పించాయి. ఆ విషయమై వారు సుదీర్ఘమైన ఉత్తరం రాస్తూ నా సూచనలు గడువుతేదీ తర్వాత అందాయి కనుక ఏమీచేయలేమనీ, అయితే 2002లో తిరిగి చేపట్టే పరిశీలన కోసం నా సూచనలను భద్రపరిచామనీ రాశారు. మరి చూడాలి. వచ్చే సంవత్సరం నా సూచనలపై వారి స్పందన ఎలా ఉంటుందో.

ఇకపోతే ఈ 23 కథలలో "గుండెల్లో గుండె", "ప్రాణం వచ్చిన ప్రతిమ", "నలభై ఎనిమిది గంటలు" అన్న మూడుకథలు వాస్తవానికి "సైన్స్ ఫిక్షన్" పరిధిలోకి రావు. కాని వాటిని ఈ కథల్లో చేర్చడానికి కారణం లేకపోలేదు. గుండెమార్పిడి ఓ యాభైయేళ్ళ క్రిందట

సైన్స్‌ఫిక్షన్. కాని ఈనాడు సామాన్యంగా జరుగుతుండిన వైద్యప్రక్రియ. అయితే ఆలోచనల నిలయం మనసుకాగా, రాగద్వేషాలు ఉండేది గుండెలో నంటారు. అందుకే ఆవేశం వస్తే గుండె మరీ వేగంగా కొట్టుకోవడం, పట్టరాని సంతోషం వచ్చినా, దుఃఖం కలిగినా బరువెక్కడం జరుగుతుంటుందంటారు. శరీరశాస్త్రరీత్యా గుండె కేవలం ఒక అంగం మాత్రమే. నేను రాసిన "గుండెలోగుండె" కథలో బద్ధశత్రువులుగా ఉన్న ఇద్దరు రాజకీయనాయకులలో ఒకరికి రెండవవాని గుండెను అమర్చడం జరుగుతుంది. అప్పటినుంచి అతను తనమీదే పగపెంచుకుంటుంటాడు. అతనికి అమర్చిన గుండెలో గూడుకట్టుకున్న కసి ప్రభావం అది. గుండెకి ఆవేశాలు రాగద్వేషాలు నిజంగా ఉన్నాయా? గుండె మార్పిడి జరిగిన వ్యక్తి ప్రవర్తనను మార్పిడికి ముందు, మార్పిడి తర్వాత గమనిస్తే, ఈ ప్రశ్నకు సమాధానం దొరకవచ్చు వైద్యుల దృష్టిని ఈ అంశంవైపు మరల్చాలనే ఉద్దేశంతో ఈ కథను ఇందులో చేర్చడం జరిగింది.

రెండవకథ "ప్రాణంవచ్చినప్రతిమ". మన పూర్వీకుల విశ్వాసం ప్రకారం జీవకళ ఉట్టిపడే శిల్పాలకు అప్పుడప్పుడు జీవచైతన్యం కలుగుతుందనీ, అవి సజీవపాత్రలుగా మారుతాయని, ఇది ఇలాఅయితే మనసుకు ఉన్న శక్తి అతి విచిత్రమైనది. మనం మన ఆలోచనలలో రకరకాల రూపాలను క్షణంలో ఊహించుకోగలం, ఆ ఆలోచనల తీవ్రత ఎక్కువైతే ఆరూపాలే సజీవపాత్రలలాగా కళ్ళముందున్న భ్రాంతి కలుగుతుంది. "ప్రాణం వచ్చినప్రతిమ" కథలో జీవకళ ఉట్టిపడే ఒక శిల్పసుందరి. తనని సందర్శించడానికి వచ్చిన ఒక చిత్రకారునికి తనకథ వినిపిస్తుంది. అది కేవలం భ్రాంతి. గతంలో విన్న కథ మస్తిష్కపు పొరలలోనుంచి బయటకు వచ్చి ఆభ్రాంతి కల్పించిందా? మనసుకున్న శక్తి ఎటువంటిది? ఈ విషయమై ముమ్మరంగా పరిశోధనలు జరపవలసిన అవసరాన్ని గుర్తుచేస్తుంది ఈ కథ.

ఇంక చివరగా "నలభైఎనిమిది గంటలు" కథ. ఇందులో ఒక బాలుడు తన పడవ సముద్రంలో మునిగిపోగా, అచేతన స్థితిలో ఒక తిమింగలం వీపుమీద పడి వెళ్తుంటాడు. స్పృహ వచ్చాక భయపడిపోతాడు. నిజానికి "తిమింగలం" పేరు వినడానికి, వాటి ఆకారం చూడడానికి భయంకరంగా ఉన్న అవి అంతటి ప్రమాదకరమైనవి కావు. శాస్త్రజ్ఞుల పరిశోధనలు డాల్ఫిన్ చేపలు జంతువులలో బాగా తెలివితేటలు ఉన్నవనీ, అవి మనుష్యుల స్నేహం కోరుకుంటాయని వెల్లడిచేశాయి. మనపురాణాల్లో పేర్కొన్న "మత్స్యకన్య" ఈ జాతికి చెందినదేమో! మత్స్యకన్య ప్రశంస "మెర్‌మెయిడ్" అన్న పేరుతో పాశ్చాత్య దేశాలలో కూడా ఉంది. చేపశరీరం, శిరస్సుతో సహా స్త్రీరూపం గల చేపల ఫోటోలు కూడా పేపర్లలో వచ్చాయి. ఇది అటుంచి డాల్ఫిన్స్‌కి వైర్‌లెస్ ట్రాన్స్‌మీటర్‌లు తగిలించి సముద్రగర్భపు రహస్యాలను ఛేదించే ప్రయోగాలు చేస్తున్నారు శాస్త్రజ్ఞులు. బహుశా తిమింగలాలుకూడా డాల్ఫిన్స్ కంటే ఎక్కువగా శాస్త్రీయ ప్రయోగాలకు ఉపయోగపడవచ్చు. శాస్త్రవేత్తలదృష్టిని ఈ అంశంపై నిలిపేందుకు ఈ కథను చేర్చడం జరిగింది.

ఇంక చివరగా ఒక సైన్స్‌ఫిక్షన్ రచయితగా నాకు కలిగిన అపురూపమైన గౌరవాన్ని, మరువలేని మధురానుభూతిని ముందుంచి నా ముందుమాటను ముగిస్తాను.

1999 జనవరిలో మద్రాసులో ఇండియన్ అసోసియేషన్ ఫర్ సైన్స్ ఫిక్షన్ స్టడీస్ వారి వార్షిక సమావేశం జరిగింది. ఒక సభ్యునిగా నేను ఆ సమావేశాలకు హాజరయ్యాను. పలురాష్ట్రాలనుంచి చాలామంది సైన్స్‌ఫిక్షన్ రచయితలు వచ్చారు. వారిలో చాలమందితో నాకు పూర్వపరిచయం ఉంది. ఆ సమావేశాన్ని అప్పటి మద్రాసు యూనివర్శిటీవైస్ ఛాన్స్‌లర్ ప్రారంభించవలసి ఉంది. అయితే అనివార్య కారణాలవల్ల ఆయన రాలేకపోయి ఆ విషయాన్ని చివరినిమిషంలో తెలిపారు. అప్పుడు సమావేశ నిర్వాహకులు నా దగ్గరకు వచ్చి ఒక సీనియర్ సైన్స్‌ఫిక్షన్ రైటర్‌గా ఆ సమావేశాన్ని ప్రారంభించవలసిందిగా నన్ను కోరారు. అది అపూర్వమైన అనూహ్యమైన గౌరవం. సభప్రారంభ సమయానికి హాలులో జనం పల్చగా ఉన్నారు. వారిని చూసి నా ప్రారంభవాక్యాలు ఇలా సాగాయి. "ఇక్కడ సమావేశమైన వారందరూ సైన్స్‌ఫిక్షన్ రచయితలు, సైన్స్‌ఫిక్షన్ పట్ల అభిరుచి ఉన్నవారు హెచ్.జి.వెల్స్ గొప్ప సైన్స్‌ఫిక్షన్ రైటర్ అని మీకు తెలుసు. ఆయన రాసిన "The invisible man" నవలలో హీరో అదృశ్యంగా ఉంటాడు. H.G.Wells సిద్ధాంతం ప్రకారం, మనిషి అదృశ్యంగా మారడం సాధ్యమే. అటువంటి అదృశ్యసభికులు ఎందరో ఈ సమావేశమందిరంలో ఉన్నారని కార్యక్రమాన్ని ఆసక్తితో గమనిస్తున్నారని నా నమ్మకం. అందువల్ల హాలులో కనిపిస్తున్నవారు కొద్దిమందే అయినా, హాలు అదృశ్యసభికులతో నిండి ఉందని నా నమ్మకం. అందువల్ల కనిపిస్తున్న సభికులకీ అదృశ్య సభికులకీ అభినందనలు తెలుపుతూ, ఈ సమావేశాన్ని ఇనాగరేట్ చేస్తున్నాను" ఆ మాటలు వినగానే హాలు చప్పట్లతో దద్దరిల్లింది. మీటింగ్ అయ్యాక ఎందరో, స్థానిక ప్రముఖులతో సహా నా దగ్గరకు వచ్చి సందర్భోచితంగా చేసిన ప్రసంగానికి అభినందించారు. ఆ సమావేశంలో నన్ను ఆ అసోసియేషన్‌కి వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేను ఇప్పటికీ ఆ పదవిలో ఉన్నాను.

ఒకటి రెండు దశాబ్దాలకు ముందు అంటే నేను ముమ్మరంగా సైన్స్‌ఫిక్షన్ రాస్తుండిన రోజుల్లో దీనికి సంబంధించిన సమాచారం, పుస్తకాలు, పత్రికలు చాలా తక్కువ ఉండేవి. విషయాలు కూడా తక్కువ. కంప్యూటర్ అప్పటికి రంగ ప్రవేశం చేయలేదు. ఇంటర్నెట్ అన్న మాట ఎవరూ వినలేదు. ఇప్పుడు ఇవన్నీ ఉన్నాయి. ఏ సమాచారం కావలసినా ఒక్క బటన్ నొక్కడంతో లభ్యం అవుతోంది. ఇన్ని మంచి అవకాశాలు ఉన్న రోజుల్లో కొత్త విషయాలు, కొత్త తరహాలు సైన్స్ ఫిక్షన్‌లో చోటుచేసుకోవాలని నా ఆకాంక్ష. నా సైన్స్‌ఫిక్షన్ కథలు కొందరికైనా స్ఫూర్తినిచ్చి ఈ దిశలో కృషి చేసే విధంగా ప్రేరణ కల్గిస్తే ఈ ప్రచురణకి సార్థకత చేకూరిందనే భావిస్తాను.

ఈ పుస్తకానికి అభిప్రాయం రాసిన గౌరవనీయులు, ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ సైన్స్ రచయిత పి.ఎన్ గోపాల కృష్ణగారు కదిలే విజ్ఞాన సర్వస్వం. ఎన్నో విషయాలతోపాటు సైన్స్‌ఫిక్షన్‌లో కూడా ఆయన అథారిటీ-

కథానదస్సులు, కథాసమీక్షలు చేపట్టి, కథానికను ఒక ఉద్యమంగా నడిపి, తెలుగు కథానికకు పూర్వ వైభవం తీసుకువచ్చిన డా॥ వేదగిరి రాంబాబు నాకు ఆత్మీయమిత్రుడు.

ప్రతివిషయంలోనూ ఆయనిచ్చిన సహకారంతోనే ఈ పుస్తకం ఇంత అందంగా తయారయింది. వీరిద్దరికీ నా కృతజ్ఞతలు పుస్తక ముఖంగా తెలుపుకుంటున్నాను.

ఈ పుస్తకానికి ముఖచిత్రం వేసిన చంద్ర, అలాగే పుస్తకాన్ని డి.టి.పి చేసిన శ్రీ కుడుపూడి భాస్కర్రావులు ఈ పుస్తకం అందంగా రావడానికి వీరిరువురూ కారకులే. వారికి నా ధన్యవాదాలు. తెలుగులో వస్తున్న ఇలాంటి సైన్స్‌ఫిక్షన్ చదువుతూ, ఇటువంటి రచనలు చేసే రచయితలను ప్రోత్సహిస్తున్నటువంటి అభిరుచిగల పాఠకులకు నా నమస్కారాలు.

**-కె.ఆర్.కె.మోహన్**

హైదరాబాద్
15-2-2001

# కథాక్రమం


1. చంద్రమండల యాత్ర ........ 1-11
2. పరలోకవాసి ........ 12-27
3. మనిషిలో మనిషి ........ 28-39
4. హైలీ పై హేపీజర్నీ ........ 40-46
5. అంగారక గ్రహయాత్ర ........ 47-59
6. ప్రళయాగ్ని ........ 60-72
7. నాట్యంచేసిన నగరం ........ 73-84
8. అరవైగా మారిన ఇరవై ........ 85-93
9. మాయమైన మమ్మీ ........ 94-104
10. ప్రాణంవచ్చిన రోబోట్‌లు ........ 105-118
11. అంతరిక్షంలో ఆరు రోజుల ఖైదు ........ 119-128
12. థ్రిల్లింగ్ డెత్ ........ 129-139
13. సమసిపోయిన సంక్షోభం ........ 140-149
14. యల్లోడెత్ ........ 150-160
15. మనిషి-మర ........ 161-168
16. విశ్వాంతరాళంలో విజయయాత్ర ........ 169-188
17. మరవిప్పిన మర్మం ........ 189-201
18. ప్రాణం వచ్చిన ప్రతిమ ........ 202-207
19. నలభై ఎనిమిది గంటలు ........ 208-217
20. ఆపరేషన్ ఆల్ఫా సెంటారీ ........ 218-229
21. గుండెల్లో గుండె ........ 230-235
22. సమాధిలో చైతన్యం ........ 236-242
23. ఒకమనిషి ఇద్దరైతే ........ 243-256

కథా నిలయం
4569
శ్రీకాకుళం

# చంద్రమండల యాత్ర

అది నల్లమల కొండలలో ఒక నిర్జన అటవీ ప్రాంతం. దట్టంగా పెరిగిన చెట్లు గాలికి చేసే చప్పుడులూ, పక్షులూ, జంతువులూ మొదలైన వాటితో ఆ ప్రదేశం బీభత్సంగా ఉంటుంది. అటువంటి నిర్జన ప్రదేశంలో ప్రముఖ భూతత్వ శాస్త్రవేత్త, ఖగోళ శాస్త్రవేత్త అయినటువంటి డాక్టర్ మోహన్ ఆయన పరివారమూ గుడారం వేశారు. డాక్టర్ మోహన్‌కి, ఖగోళ శాస్త్రమన్నా, భూతత్వ శాస్త్రమన్నా, చిన్నతనం నుంచీ మిక్కిలి అభిరుచి. ఖగోళ శాస్త్రంలో ఆయన డాక్టరేట్ బిరుదు సంపాదించాడు. ఆయన లాంటి అభిరుచులే కలిగి ఉండి, ఎల్లప్పుడూ ఆయనకు తోడునీడగా ఉండేటటువంటి డాక్టర్ ప్రసాద్ కూడా ఆయన వెంట ఉన్నారు. ఆయన వైద్య శాస్త్ర నిపుణుడు. వారు చదివిన చదువులు వేరు అయినప్పటికీ వారి అభిరుచులూ, అభిలాషలూ ఒకే కోవకు చెందినవి. ఇద్దరి మధ్య ఏవిధమైన అరమరిక లేదు.

ఖగోళ శాస్త్ర విజ్ఞానంలో పాశ్చాత్య దేశాలు సాధిస్తున్న అభివృద్ధిని చూసి, మోహన్ భారత దేశంకూడా ఎప్పుడు ఆ విధంగా తయారవుతుందా అని బాధపడేవాడు. అతని తండ్రి చనిపోయి మూడేళ్ళు అయింది. మోహన్ ఇప్పుడు స్వతంత్రుడు, అందుచేత, స్వంతంగా ఖగోళ పరిశోధనశాఖ నెలకొల్పాలనే ఉద్దేశంతో స్వతహాగా ఆంధ్రుడననే అభిమానం కలవాడవడంచేత, తగిన ప్రదేశంకోర్కై ఆంధ్రదేశం పర్యటిస్తున్నాడు తన పరివారంతో తన వ్యాపారం, తను లేకపోయినా, నిర్విఘ్నంగా జరిగే ఏర్పాట్లుచేసి, ఈపనికి పూనుకొన్నాడు ఆయన.

నల్లమల కొండలలో వారు విడిదిచేసిన ప్రాంతం. ఖగోళ వేధశాలా నిర్మాణానికి అనువుగా కనిపించింది. అక్కడి వాతావరణం కూడా, చుట్టూ దట్టంగా చెట్లూ, చామలు ఉండటంచేత, మిగిలిన ప్రదేశాలపై ఉండేదానికంటే స్వచ్ఛంగా ఉంది. ఆకారణంగా, నక్షత్రాలను గ్రహాలను పరిశీలించడం సులభమవుతుంది. ఆ కొండ శిఖరం మేఘాలకంటే ఎత్తుగా ఉండడంచేత మేఘాల అడ్డంకులు చాలా అరుదుగా వస్తాయి.

అదీగాక ఆ ప్రాంతంలో మరొక ప్రత్యేకతకూడా ఉంది. అక్కడికి కొద్దిమైళ్ళ దూరంలో చాలా పెద్ద ఇనప గనులు ఉండడానికి అవకాశం ఉన్నట్లు మోహన్ కనుగొన్నాడు. అవి ఎంత లోతున ఉన్నదీ, వాటి నాణ్యత ఎటువంటిదీ, మొదలైన విషయాలు, ఖగోళ పరిశోధనశాలా నిర్మాణం పూర్తి అయ్యాక పరిశోధించడానికి తలపెట్టాడు ఆయన.



ఖగోళ పరిశోధన శాలా నిర్మాణానికి రెండేళ్లు పట్టింది, ప్రధానమంత్రిచే ప్రారంభోత్సవం జరిగింది. డాక్టర్ మోహన్, తన పరిశోధన శాల ప్రపంచంలో దేనికీ తీసిపోదనీ, ప్రభుత్వ సహకారముంటే, ప్రపంచంలోని అన్ని పరిశోధన శాలలలోనూ, తలమానికంగా చేయగలనని నుడివాడు. ప్రధానమంత్రి తమ చేతనైన సహాయం చేయడానికి సర్వదా సిద్ధమేనని చెప్పారు.

డాక్టర్ మోహన్, తనజీవిత కాలంలో, అంతర్గ్రహ యాత్ర చేయాలని ఉవ్విళ్ళూరుతుండేవారు. కాని అది నెరవేరే విషయంకాదని ఆయన అనుకుంటూండేవారు. ఏమంటే దానికి బ్రహ్మాండమైన రాకెట్లను నిర్మించాలి. ఆ రాకెట్లను నడపడానికి, అమితమైన ఇంధనాన్ని సమకూర్చాలి. ఇవి ఏ ఒక్క వ్యక్తి మూలంగా జరిగేవికావు. ప్రస్తుత పరిస్థితులలో మన భారతదేశం కూడా అపనికి పూనుకోలేనటువంటి స్థితిలో ఉంది. కాని మోహన్ కలలు నిజమయ్యే రోజు సమీపంలోనే ఉందనే విషయం ఎవరు ఊహించగలరు?

పరిశోధనాశాల చాలా చైతన్యవంతముగా పనిచేస్తోంది అందుచేత మోహన్, తాను కొత్తగా కనుగొన్న ఇనుప గనులవైపు దృష్టి మళ్ళించాడు. ఆ రోజు గనులున్న ప్రదేశంలో డైనమైట్‌ను పెట్టి ప్రేల్చడానికి సిద్ధంగా ఉన్నారు. మోహన్, ప్రసాద్ దూరాన్నుంచి, బైనాక్యులర్సులో దృశ్యాన్ని పరికిస్తున్నారు.

ఢాం... అని డైనమైట్ ప్రేలింది. చిచ్చుబుడ్డిలో మల్లే రాళ్ళు పైకి ఎగురుతున్నాయి. ఇంతలో మోహన్, ప్రసాద్, తమ కళ్ళను తామే నమ్మలేని దృశ్యాన్ని చూశారు. ఆశ్చర్యంలో వాళ్ళు

చైతన్యరహితులైపోయారు. కొంతసేపటికి తెప్పరిల్లి ఒకరినొకరు ప్రశ్నార్థకంగా చూసుకొన్నారు.

వాళ్ళను అంతగా విభ్రాంతులను చేసిన దృశ్యం ఏమిటంటే, సరిగా డైనమైట్‌ను ఉంచిన ప్రదేశానికి, చుట్టూ ఉన్న కొద్ది ప్రదేశాన్నుంచి ఎగిరిన రాళ్ళు, క్రిందకు రాకుండా రాకెట్లవలె ఆకాశంలోకి నిలువుగా ఎగిరిపోయాయి. అవింత సంగతిని గురించి పరిశీలించడానికి వాళ్లిద్దరూ హుటాహుటిని అక్కడికి పయనమయ్యారు.

డైనమైట్‌ను స్వతహాగా ఉంచినచోట, గోయి ఏర్పడి, దానిలో చుట్టూరా సుమారు ఒక చదరపు గజము మేరకు తెల్లటి, గట్టి సదార్థము ఏర్పడింది. దానిమీద కొన్ని కొండరాళ్ళు చెదురుగా పడివున్నాయి. మోహన్ ఆ ప్రదేశం వేడిగా ఉందో, ఏమో అని చూసే ఉద్దేశంతో తన కుడికాలు ఇవతలపెట్టి, ఎడమకాలును ఆ పదార్థంపై పెట్టాడు. పెట్టీ పెట్టగానే మోహన్ ఒక వెర్రికేక వేశాడు. ప్రసాద్ ఉలిక్కిపడి "ఏమిటి? కాలు కాలిందా?" అంటూ దగ్గరకు వచ్చాడు. మోహన్ తన ఎడమకాలును ఇవతలకు తీసి దానిమీద కాలు పెట్టగానే నా ఎడమకాలు అతి తేలికగాను, కుడికాలుకు ఎవరో బలంగా లాగివేస్తున్నట్లు గానూ అనిపించింది. ఆ లాగుడికి నాకాలు ఊడిపోతుందేమో ననిపించి అప్రయత్నంగా కేకవేశాను" అన్నాడు.

"చిత్రంగా ఉందే! నేను రెండు కాళ్లూ పెట్టి చూస్తాను" అంటూ ప్రసాద్ ఆ ప్రదేశంపై రెండు కాళ్ళూ పెట్టి నుంచున్నాడు. వెంటనే ఆనందావేశంతో "నావాళ్ళు ఎంతో తేలికగా ఉంది. గాలిలోకి తేలిపోతానేమో అనిపిస్తోంది" అంటూ సంతోషంతో ఎగిరి గంతు వేశాడు. గంతువేశాడో లేదో, ప్రసాద్ నిలువుగా గాలిలోకి ఎగరడం ప్రారంభించాడు. వెంటనే మోహన్ ఒక్క ఎగురు ఎగిరి అతని రెండుకాళ్లూ పట్టుకొని క్రిందకు లాగాడు. దానితో ఇద్దరూ కలిసి కొంతభాగం తెల్లటి పదార్థంపైనా, కొంత ప్రక్క నేలమీదా పడ్డారు. ఇద్దరూ ఒక్కసారే బాధకలిగినట్లు అరిచారు. నేలమీద పడినవారి దేహభాగానికి ఎవరో లాగివేస్తున్నట్లు బాధ కలిగింది. ఇద్దరూ దొర్లుకుంటూ పూర్తిగా ఇవతలి నేలమీదకు వచ్చేశారు.

కొంత సేపటివరకూ ఈ చిత్రానుభూతిలో వారు నిశ్చేష్టులై అలాగే ఉండిపోయారు. ఇంతలో ఉన్నట్టుండి మోహన్ "ప్రసాద్ ఈ రహస్యాన్ని నేను ఛేధించాను" అని కేక పెట్టాడు. ప్రసాద్ ప్రశ్నార్థకంగా చూశాడు.

మోహన్ "ఇక్కడి నేలలో ఉన్న పదార్థం ఏదో విచిత్రమైంది. దానిమీద డైనమైట్‌ను ప్రేల్చినప్పుడు జనించిన ఉష్ణంవలన, ఇక్కడి పదార్థం డైనమైట్‌తో కాని, లేక అంతర్గతంగా కాని రసాయనిక సంయోగం చెందింది. ఆవిధంగా ఏర్పడ్డ పదార్థం భూమ్యాకర్షణశక్తిని నిరోధించేదిగా తయారయింది. ఈ పదార్థానికి "గ్రావైట్" అని పేరు పెట్టుదాం అన్నాడు.

ప్రసాద్ "అయితే ఈ పదార్థం ఆకాశంలోకి ఎందుకు ఎగిరిపోలేదు? అని అడిగాడు.

మోహన్ "ఉపదార్థం ఏర్పడ్డది కొద్దిప్రదేశంలో మాత్రమే, పైగా డైనమైట్ ప్రేలినప్పుడు ఏర్పడిన గోయి గోడలు దీనిని నొక్కివేస్తున్నాయి" అన్నాడు.

ప్రసాద్"అయితే ఆ గోడల మట్టిని తీసి వేస్తే ఇది పైకి ఎగిరిపోతుందా?" అని అడిగాడు.

మోహన్ "ఎగరదు ఎందుకు అంటే అది నిశ్చలస్థితిలో ఉంది. దానికి గమనం కలిగితే ఎగురుతుంది. ఉదాహరణకు ఇంతకుముందు నీవు గ్రావైట్‌మీద నిలబడినప్పుడు నీవు పైకి ఎగరలేదు.

...ప్పుడైతే పైకి గంతువేశావో నీకు చలనంకలిగి అప్పుడే పైకి ఎగరబోయావు. పదార్థ విజ్ఞానశాస్త్ర సూత్రాల ప్రకారం ప్రతి పదార్థానికి నిశ్చలస్థితి ఉంటుంది. దీనినే ఇనెర్షియా (Inertia) అంటారు. అటువంటి పదార్థానికి గమనం కలిగించితే అవరోధాలు లేనంతవరకూ అది గమనం కలిగించిన దిశలో ప్రయాణం చేస్తూనే ఉంటుంది. నీవు మొదట నిలబడినపుడు నీ దేహం నిశ్చల స్థితిలో ఉంది. నీవు ఎగిరినపుడు నీ దేహానికి గమనం కలిగింది. నేను నిన్ను పట్టుకొని నీ దేహానికి అవరోధం కలిగించకపోయినట్లయితే నీవు ఆకాశంలోకి నిటారుగా వెళ్లేవాడివే. సాధారణ పరిస్థితులలో మన గమనానికి భూమ్యాకర్షణ శక్తి అవరోధం కల్పిస్తుంది. దాన్ని అధిగమించగలుగుతే అనంతవిశ్వంలో గ్రహాంతరయానం సులభమవుతుంది" అన్నాడు. ప్రసాద్ "అయితే ఈ గ్రావైట్‌ను ఉపయోగించి మనం గ్రహాంతరయానం ఎందుకు చేయగూడదు?" అన్నాడు. మోహన్ "నిజమే ప్రసాద్. నాకు ఇంకా తట్టనేలేదు. మన కలలన్నీ నిజమవుతాయి" అని ఆనందంలో మిత్రుని ఆలింగనం చేసుకొన్నాడు.

మోహన్, ప్రసాద్ గ్రావైటును గురించి అనేక పరిశోధనలనుచేసి, దాని సహాయంతో అంతర్గ్రహయాత్ర సాధ్యమేనన్న నిశ్చయానికి వచ్చారు. తమ ప్రయత్నాన్ని స్థూలంగా ప్రభుత్వానికి చెప్పి, తమకు వలసిన విధంగా ప్రభుత్వాన్ని సహాయం చేయమని అర్థించారు. ప్రభుత్వం అందుకు సమ్మతించింది.

గ్రావైటును తగినంత ఉత్పత్తిచేసి, దానితో 20 అడుగుల వ్యాసంగల ఒక పెద్ద గోళాన్ని నిర్మించారు వారు. అది గాలి తాకిడికి గమనం కలిగి ఎగిరిపోకుండా, గట్టిగా త్రాళ్ళతో నేలకు కట్టివేశారు. ఆ గోళానికి చుట్టూ పదహారు కిటికీలు అమర్చారు. ఆ కిటికీల తలుపులు గ్రావైటుతో చేయబడ్డాయి. వాటి లోపలి భాగం, పగలని, గట్టి గాజుతో చేయబడింది. ఈ గోళంపై ఆకర్షణశక్తి ఏమీ ఉండదు. కాని గ్రావైట్ తలుపులను తెరచినట్లయితే లోపల గాజు ఉన్న కారణంచేత ఆ ప్రదేశంపై ఆకర్షణశక్తి ఉంటుంది. గోళానికి కట్టిన త్రాళ్ళను ఊడదీస్తే, గోళం తెరచిన కిటికీ దిశగా పయనిస్తుందన్నమాట. ఆ విధంగా అవసరమైన కిటికీలను తెరుచుకొని, గోళాన్ని ఏదిశలో పడితే, ఆ దిశలో ప్రయాణం చేసేటట్లు చేయవచ్చును. ఇవి గాక, గ్రావైట్‌ను, కొన్ని రసాయనిక పదార్థాలతో సంయోగపరచి, పారదర్శకముగా ఉండే పదార్థమును తయారు చేశారు. ఈ పదార్థంతో అన్ని దిశలా చూడగలిగే విధంగా ఎనిమిది కిటికీలు అమర్చారు. ఈ పదార్థంపైగూడా ఆకర్షణ శక్తి ఉండదు. ఇంతేగాక, గోళంలోపలికి వెళ్ళడానికి, బయటకు రావడానికి ఒక తలుపు అమర్చబడింది. అవసరమైన పరికరాలన్నీ అమర్చబడినాయి.

గోళంలో మోహన్, ప్రసాద్ వెళ్ళడానికి నిశ్చయించారు. వారితోబాటు లైకా టామీ అనే రెండు కుక్కలను కూడా తీసుకు వెళ్ళడానికి నిశ్చయించారు. తమకు ఆరు నెలలకు సరిపడే భోజన పదార్థాలను సమకూర్చుకొన్నారు. వారం రోజులలో ఈ గోళం చంద్రమండలానికి బయలుదేరుతుంది.

ఆరోజు ఆదివారం. నాటి ఉదయం ఎనిమిది గంటలకు, గోళం ప్రయాణం మొదలిడుతుంది. నల్లమల అటవీ ప్రాంతం జనంతో క్రిక్కిరిసిపోయింది. ప్రధానమంత్రి ప్రారంభోత్సవం చేయడానికి వచ్చారు.

మోహన్, ప్రసాద్ అందరివద్దా సెలవుపుచ్చుకొన్నారు. ప్రధానమంత్రి వారిద్దరినీ ఆలింగనం చేసుకొన్నారు. అందరికీ ఆనందంతో బాటు ఆవేదన కూడా ఉంది. వారిద్దరు బ్రహ్మచారులే జీవితాన్ని అనుభవించనివారు. దేశానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చినవారు. అటువంటివారు ఈ లోకాన్ని వదలివెళ్లిపోతున్నారు తిరిగి వస్తారో రారో ! రాకపోవడానికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందరి

ముఖాల్లోనూ, ముఖ్యంగా వారి బంధువుల ముఖాల్లో ఆవేదన ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. సమయం గడుస్తున్న కొద్దీ వారి ఆవేదన అంతకంతకు ఎక్కువవుతోంది. ఉదయం 7.30 అయింది. వారిద్దరూ గోళంలోకి వెళ్ళారు ఆఖరిసారి అందరి సెలవూ తీసుకున్నారు. తలుపు మూతపడింది. లోపల కుర్చీలలో కూర్చుని నడుములకు, కుర్చీలకు పటకాలు బిగించారు.

సమయం 7-45 అయింది. గోళానికి కట్టిన ఒక్కొక త్రాటిని విప్పుతున్నారు. 8 గంటలు అయింది. ప్రధానమంత్రి చివరిత్రాటిని విప్పారు. అంతా చూస్తుండగా గోళం తారాజువ్వల్లే ఆకాశంలోకి లేచింది. పదిహేను నిమిషాలైనా గడవకముందే అనంతాకాశంలో అదృశ్యమయింది.

గోళం కట్లనుండి విడిపడి ప్రయాణం మొదలిడగానే ఒక్కసారి కుదిపినట్లయింది మిత్రులిద్దరకూ. భూమ్యాకర్షణశక్తి పైకిపోయినకొలది సెకనుకు 32 అడుగుల చొప్పున తగ్గుతుంది. అందుచేత గోళం బయలుదేరినప్పటినుంచీ ప్రతి సెకనుకూ 32 అడుగులచొ॥న వేగాన్ని హెచ్చిస్తూ ప్రయాణం సాగిస్తోంది. ఆ దృశ్యాన్నే వింతగా చూస్తున్నారు మిత్రులిద్దరూ. చూస్తుండగానే బల్ల పరుపుగా ఉన్న భూమి వంపుగా గోళంగా మారింది నీలిసముద్రం. మధ్య పచ్చనినేల, నల్లని కొండలు పైన తెల్లని మేఘాలు అంతా ఎంతో మనోజ్ఞంగా ఉంది. చంద్రుని కళవలె భూకళకూడా కనిపిస్తోంది. భూమిపై పగటి రాత్రి ప్రదేశాలు, వారు ఒకే కంటితో చూడగలుగుతున్నారు. అంతసేపూ గోళంలో ఉన్న యంత్రాలు, బజ్...మని శబ్దాన్ని వినిపిస్తూ వచ్చాయి. ఆ శబ్దం అంతకంతకు తగ్గుతూ చివరికి ఆగిపోయింది.

మోహన్: "మన గోళం భూమిపైన ఉండే గాలి పొరలలో ప్రయాణం చేయడం వల్ల ఆ శబ్దం ఏర్పడింది. ఇప్పుడు అది, గాలి పొరలను ఇంచుమించు పూర్తిగా దాటివేసిందన్న మాట. అంటే సుమారు ఆరు వందల మైళ్ళు ఎత్తున ఉన్నాం మనం' అని దూరాన్ని కొలిచే యంత్రం చూసి "మన శాస్త్రజ్ఞుల లెక్కలు సరియైనవే. ఇప్పుడు యంత్రం 670 మైళ్ళు చూపుతోంది చూడు. ఇంత వేగంతో మరే ఇతర పదార్థమైనా ప్రయాణిస్తే అది గాలి రాపిడికి మండిపోయేదే. కాని మన పరిశోధనల మూలంగా తయారయిన ఈ గోళం అంతటి రాపిడినీ తట్టుకోగలిగింది. పైగా ఈ పదార్థంలో ఉండే ప్రత్యేకత మూలంగా ఉష్ణం లోనికి ప్రసరించదు. లోనిది బయటకిపోదు. ప్రస్తుతం గోళం ఉపరితలం, రాళ్ళను సైతం కరగించేటంతటి వేడిమి కలదై ఉంటుంది" అన్నాడు.

ప్రసాద్: "అన్నీ బాగానే ఉన్నాయి. కాని ఒక్క సందేహం మిగిలింది. గోళం భూమి మీద నిశ్చల స్థితిలో ఉంది గదా. అటువంటప్పుడు కట్లు విప్పగానే అది గాలిలోకి ఎలా ఎగిరింది?" అన్నాడు.

మోహన్: "నీ ప్రశ్న అమాయకంగా ఉంది. గోళంపై భూమ్యాకర్షణశక్తి ప్రభావం లేదు. అందుచేత దానికి ఏ మాత్రపు చలనం కలిగినా, సెకనుకు 32 అడుగుల చొప్పున వేగాన్ని పెంచుకుంటూ వెళ్ళిపోతుంది. గాలివీయడంవలన కలిగే చలనం చాలు అది పైకి ఎగిరిపోవడానికి" అన్నాడు.

ప్రసాద్: "కాస్త కాఫీ తాగుదాం" అని ప్రక్కనున్న ఫ్లాస్కు అందుకొని కప్పులో కాఫీ పోయబోయాడు. కానీ కాఫీ కప్పులో పడక, తిన్నగా గోళం మధ్యగా పోయింది. కొంత ప్రసాద్ బట్టలమీద ఒలికింది. ప్రసాద్ ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయాడు.

మోహన్‌కు నవ్వు ఆగలేదు. తనివితీరా నవ్వాక "ఈ గోళంలో, దానిలోపలి భాగం మామూలు పదార్థాలతో చేయడం వలన, ఈ గోళపు ఆకర్షణ శక్తి గోళం మధ్యలో ఉంటుంది. అందుచేత సహజంగా

ప్రతి వస్తువు అటువైపు ఆకర్షించబడుతుంది. మన దేహానికికూడా, గోళానికి ఉన్నంత కాకపోయినా చెప్పుకోతగ్గంత ఆకర్షణ శక్తి ఉంది. అందుకే కొంత కాఫీ నీమీద ఒలికింది. ఎక్కువ భాగం గోళం మధ్యకి పోయింది. తాడు పుచ్చుకొని, గోళం మధ్యగా కప్పును తీసుకు వెళ్ళు. కాఫీ అందులో పడుతుంది. అప్పుడు జాగ్రత్తగా కప్పును మూసి కాఫీ తీసుకురా.'' అని సలహా ఇచ్చాడు.

మోహన్ చెప్పినట్లు చేయబోయాడు ప్రసాద్ కప్పును గోళం మధ్యకు తీసుకు వెళ్ళడంలో అతని చేయి త్రాటిని వదిలింది. అంతే, అతను నిలుచున్నవాడు నిలుచున్నట్లే గోళం మధ్యకి పోయి తేలడం మొదలుపెట్టాడు. అతని చేయి పుచ్చుకొని తనవైపు లాగాడు ప్రసాద్. ఎల్లాగయితే వారు ఇద్దరూ కాఫీ వగైరాలు పూర్తిచేశారు.

వాళ్ళు కిటికీలోనుంచి భూమివైపు చూశారు. భూమిబాగా చిన్నదయిపోయింది. ఎటు చూసినా నక్షత్రాలు విపరీతమైన కాంతితో, ఎలక్ట్రిక్ దీపాల్లా మెరుస్తున్నాయి. వాటి వెనక నల్లటి ఆకాశం ఒకవిధమైన భయం కొల్పుతూవుంది.

"మోహన్ ! మన భూమిమీద గాలి ఉండడమువలన, అది సూర్యకాంతిలోని నీలికిరణములను చెదరగొట్టి, ఆకాశం నీలంగా ఉన్నట్లు భ్రమ కల్పిస్తుంది. కాని ఈ విశ్వాంతరాళంలో గాలి లేని కారణంవలన ఆకాశం నల్లగా కన్పిస్తోంది'' అని విశదపరిచాడు.

మధ్యాహ్నం భోజనం అయినాక వారు భూమికి రేడియో సందేశం ఇచ్చారు. తాము సుఖంగానే ఉన్నామనీ, తమ ప్రయాణం అనుకున్నట్లే జరుగుతోందనీ.

ప్రసాద్ "అయితే ఇప్పటికి మనం సగం రోజు మాత్రమే ప్రయాణం చేశాము. ఇంకా మూడున్నర రోజులు ప్రయాణం చేయాలన్న మాట'' అన్నాడు.

మోహన్ "అవును అప్పడే మొహం మొత్తిందా"? అన్నాడు. ప్రసాద్'' అదికాదు. రాత్రింబవళ్ళ తేడా తెలియరాక పోవడంతో. కాలగమనం ఆగిపోయిందేమోననిపిస్తోంది'' అన్నాడు.

ఆ విధంగా వారి ప్రయాణం ఆరోజు, మరునాడుకూడా గడిచింది. మూడవరోజు ప్రొద్దున ఏ కారణంచేతనో లైకా కుక్క మరణించింది. మిత్రులిద్దరూ దాని మృతికి చాలా విచారించారు. దాని మృతదేహాన్ని విశ్వాంతరాళంలో వదిలివేయడానికి నిశ్చయించారు.

ప్రసాద్ "మనం దీనిని బయటకు పారవేయడానికి తలుపు తెరిస్తే లోనిగాలి బయటకు పోతుందేమో!'' అన్నాడు. మోహన్ 'మరేమీ ప్రమాదం లేదు. గోళంయొక్క ఆకర్షణశక్తి మూలంగా గాలిలోపలనే ఉంటుంది'' అన్నాడు.

ప్రసాద్ లైకాను తలుపుతీసి బయటకు వదిలివేశాడు. బయట గాలికూడా గడ్డకట్టుకుపోయేటంత చల్లగా ఉంది.

లోపల కూర్చున్న ప్రసాద్‌కు, కిటికీలో నుంచి ఒక వింత దృశ్యం కనిపించింది. అమాంతంగా మోహన్ భుజంతట్టి "చూడు చూడు మనలైకా మన గోళం వెంబడే వస్తోంది'' అన్నాడు.

మోహన్ "అవును. ఈ కిటికీద్వారా కుక్క ఆకర్షించబడింది. ఈ కిటికీకి ఉన్న గ్రావైట్ తలుపులను

మూసివేస్తే అది విశ్వాంతరాళంలోకి అల్లావెళ్ళిపోతూ ఉంటుంది. ఈ చలిలో అది ఎన్ని వేల సంవత్సరాలైనా అల్లాగే ఉంటుంది. ఏదైనా గ్రహంకాని, ఇటువస్తే ఇది అటు ఆకర్షించబడి దానిపైపడిపోతుంది. లేకుంటే అలా అనంతయాత్ర చేస్తూనే ఉంటుంది." అన్నాడు.

ఇంతలో భయంకరమైన విపత్తు ఒకటి తారసిల్లబోయింది. కిటికీలోంచి చూస్తున్న వాళ్ళకు, అనతిదూరంలో పెద్ద ఉల్క ఒకటి బ్రహ్మాండమైన వేగంతో, గోళంవైపువస్తూ కన్పించింది. నిముషంలో అది వచ్చి గోళాన్ని గ్రుద్దివేస్తుంది. అంతటితో ఆ గోళం చరిత్ర, మిత్రులిద్దరి చరిత్ర పరిసమాప్తి అవుతుంది. ప్రమాదం కనిపెట్టిన మోహన్ చంద్రునివైపు వుండే నాలుగు కిటికీలను త్వరితంగా తెరచివేశాడు. వెంటనే గోళం వేగాన్ని పుంజుకొంది. ఉల్క ఇంచుమించు గోళాన్ని దూసుకుంటూ వెళ్ళిపోయింది. అది తనతోపాటు లైకాదేహాన్ని తీసుకుపోయింది.

ఆ విధంగా మూడురోజులు గడిచాయి. ఇంక ఒక్కరోజు మాత్రమే చంద్రమండలయాత్రకి మిగిలి ఉంది. ఇప్పుడే గోళాన్ని జాగ్రత్తగా అదుపులో పెట్టుకోవాలి. మధ్యాహ్నం రెండు గంటలకు గోళం నిరాకర్షణ ప్రదేశాన్ని చేరింది. ఆ ప్రదేశంలో గోళంపై, భూమి, చంద్రుల ఆకర్షణ విరుద్ధ దిశలలో సమానంగా ఉంటుంది. (ఈ దూరం చంద్రుడికీ, భూమికీ మధ్యగల దూరంలో సుమారుగా 2,37000మైళ్ళు) భూమి నుంచి ఆరింట అయిదు వంతుల వద్ద, చంద్రుని నుంచి ఆరింట ఒక వంతు వద్ద ఉంటుంది. ఇందుకు కారణం చంద్రుని ఆకర్షణ భూమియొక్క ఆకర్షణ కంటె సుమారు ఆరు రెట్లు తక్కువ అవడమే) ఆ ప్రదేశం చేరగానే మోహన్, గ్రావైట్ తలుపులు గల కిటికీల నన్నిటినీ మూసివేశాడు. అందుచే గోళం చంద్రుని చుట్టూ దీర్ఘ అండవృత్తాలు చేయడం మొదలుపెట్టింది. అక్కడి నుంచి టెలిస్కోప్ ద్వారా వారు చంద్రమండలాన్ని పరిశీలించడం మొదలుపెట్టారు.

ఆ పరిశోధనలు అయ్యాక మళ్లీ, చంద్రుని వైపు ఉండే కిటికీని తెరిచాడు మోహన్. గోళం వేగాన్ని పుంజుకుంటూ ప్రయణం సాగిస్తోంది చంద్రునివైపు, ఆ విధంగా మరి ఒకరోజు గడిచింది. వారు చంద్రమండలం చేరడానికి ఇంక పదహారు గంటలు మాత్రమే ఉంది.

ఆరోజు గురువారం. అంటే వారు బయలుదేరి నాలుగురోజులు గడిచిందన్నమాట. ఆ రోజు ఉదయం సుమారు పది గంటలకు వారుచంద్రునిపై దిగగలరు. వారు గోళంలోనుంచి చంద్రుని పరిశీలిస్తున్నారు. మోహన్ ఉత్సాహంతో 'అదిగో అది టైకో పర్వతం, అవి అపెనైన్ పర్వత శ్రేణులు, అది ఎరాటోస్థీన్సు వలయపర్వతం, అది ఆశాసముద్రం అని పేరిడబడిన చంద్రమైదానం" అని చూపిస్తున్నాడు. చంద్రునిపై ఎత్తయిన కొండలు, గుండ్రంగా, కోట గోడలల్లే ఉన్నట్లు వలయపర్వతాలు. వాటి మధ్య నిటారుగా ఉన్నట్టి కొండలు. అంతా వింతగా కనిపిస్తోంది. ఒక ప్రక్క చంద్రుని రాత్రి. మరియొక ప్రక్క చంద్రుని పగలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారు గ్రహాంతర యానదుస్తులు ధరించి, ప్రాణవాయువును జాగ్రత్త పరుచుకున్నారు. కుక్కకు కూడా అన్నీ అమర్చారు. గోళపువేగాన్ని క్రమక్రమంగా తగ్గిస్తూ జాగ్రత్తగా నడుపుతున్నారు. చంద్రుడిపై దిగడానికి, అనువైన ప్రదేశం కొరకు వారు పరికిస్తున్నారు. అంత ఎత్తునుంచి వారికి చంద్రునిపై చెట్లు, చేమలు ఏవైనా వున్నాయో లేవో ఏమీ కనిపించడం లేదు.

వారుచంద్రునిపై సుమారు 200మైళ్ళ ఎత్తున ఉన్నారు. గోళం నెమ్మదిగా దిగుతోంది. గోళం 50మైళ్ళ ఎత్తుకు దిగింది. చంద్రుని ఉపరితలం కొంచెం కొంచెం స్పష్టంగా కనిపిస్తోంది. అది పరిశీలిస్తున్న

సమయంలో ఉన్నట్టుంది. గోళం లోని శబ్దగ్రహణయంత్రం, బజ్.... మని శబ్దం చేయడం మొదలు పెట్టింది.

"అరె... చంద్రునిపై గాలి ఉందే! ఏబది మైళ్ళ ఎత్తువరకే ఉండడము చేత మన భూశాస్త్రజ్ఞులు కనిపెట్టలేక పోయి ఉండాలన్న మాట." అని ఆశ్చర్యాతిరేకంతో అన్నాడు మోహన్. ఈ ఆనందంలో గోళం యొక్క కిటికీలను అదుపులో పెట్టలేదనే విషయాన్ని వారు విస్మరించారు. గోళం మహావేగంతో చంద్రునిపై పడుతోంది. ఎదురుగావున్న కొండను ఢీకొనేటట్లు. కిటికీలను సరిదిద్దే అవకాశం కూడా లేదు. సిద్ధంగా ఉన్న పారాచ్యూట్లను తగిలించుకొని, కుక్కతో సహా ఇద్దరూ దూకేశారు. గోళంలో నుంచి వెంటనే ఎవరో వీపులను బలంగా లాగినట్లనిపించింది. తలెత్తి చూస్తే పారాచ్యూట్లు తెరచుకొన్నాయి. అంటే చంద్రునిపై గాలి ఉందని నిర్ధారణ అయింది. వారు చూస్తుండగానే గోళం టైకో పర్వతాన్ని ఢీకొంది. వాళ్ళు నెమ్మదిగా గోళానికి సుమారు రెండుమైళ్ళ దూరంలో దిగారు.

గోళంగతి ఏమైనదో అనివారిద్దరూ. భయంగా దాని దగ్గరకు పరిగెత్తారు. వాళ్ళ కాళ్ళు నేలమీద ఆనటము లేదు. తేలిపోతున్నట్లున్నాయి. ఇక్కడ గంతువేస్తే అక్కడికి వెళ్ళిపడుతున్నారు. ఎంతదూరమైనా ఇట్టే పరిగెత్తవచ్చుననిపించింది. అందుకు కారణం చంద్రుని ఆకర్షణశక్తి భూమియొక్క దానికంటే ఆరురెట్లు తక్కువ అవడమే. రెండు మైళ్ళదూరం వెళ్ళడానికి వారికి పదినిముషాలు కూడా పట్టలేదు.

గోళం తునాతునకలై ఉంది. గ్రానైటు ముక్కలు అనేకం అంతరిక్షంలోకి ఎగిరిపోయాయి. భోజనసామగ్రి, దుస్తులు రేడియో ప్రసారయంత్రం చెల్లాచెదరుగా పడిఉన్నాయి. రేడియో ప్రసారక యంత్రం చెడిపోయింది. సుమారు ఒక గంట అవస్థపడి దానిని బాగుచేశారు వారిద్దరూ ప్రమాదం గురించిభూమికి వార్త పంపించారు. కాని ఎంత ప్రయత్నించినా భూమినుంచి సమాధానం రాలేదు.

మోహన్ నిస్పృహతో "రేడియో తరంగాలను గూర్చిన మన ఊహలు తప్పు అయి ఉండవచ్చు. లేదా మన యంత్రం మనకు తెలియని విధంగా చెడిపోయి ఉండవచ్చు. ఇంక మనకూ భూమికి ఏ విధమైన సంబంధం లేనట్లే. ఈ నిర్జనలోకంలో మనకు మృత్యువు తప్పదు." అన్నాడు. ప్రసాద్ "అవసరం కలిగినప్పుడే మనిషి బుద్ధి వికసిస్తుంది. మనకు ఏదో ఒక ఉపాయం తట్టకపోతుందా" అని ఊరడించాడు ప్రసాద్.

మోహన్ "ముందు మనం మన సామగ్రిని ఎక్కడైనా జాగ్రత్త చేసుకోవాలి పద. ఏ గుహ అయినా కనిపిస్తుందేమో" అన్నాడు.

అనతి దూరంలోనే ఆ టైకో పర్వతంలో ఒక గుహ కన్పించింది. వారు అందులోకి వెళ్ళిచూశారు. వాళ్ళకి అమితాశ్చర్య ఆనందాలు కలిగాయి. ఆ గుహలోపల వెలుగును వెదజల్లే మొక్కలు ఉన్నాయి. వాటి వెలుగుతో గుహ ప్రకాశవంతంగా ఉంది.

మోహన్ "చూడు. ఈ గుహ మనకు చాలా అనువుగా ఉంది. చంద్రమండలంలో, అల్పతరగతి వృక్షజాలం ఉంది, ఇంకా ఎటువంటి జీవం ఉందో ముందు మన సామానును ఇక్కడికి చేర్చు కోవాలి!" అన్నాడు.

వారిద్దరూ వాళ్ళ వస్తుసామగ్రి దగ్గరకు వెళ్ళారు. ఆ సామగ్రి అంతనీ, ఏ విధంగా గుహకు చేర్చడమా అనిపించింది వారికి.

ప్రసాద్ "ఇంకా కొన్ని గ్రానైటు ముక్కలు నిశ్చల స్థితిలో ఉన్నాయి కదా. వాటి సహాయంతో మనం ఈ సామగ్రి అంతటినీ సులువుగా తీసుకొని పోవచ్చు"అన్నాడు.

ఆ ప్రకారంవారు, గ్రానైట్‌ను ఉపయోగించి అతిత్వరలో సామానును గుహకుచేర్చారు వారు. టామీ ముగ్గురూ భోజనాలు పూర్తిచేశారు. హాయిగా నిద్రపోయి లేచారు. చంద్రమండలాన్ని పరిశోధించడానికి సిద్ధమయ్యారు. ఆ గుహ గుర్తుగా వుండేటట్లు, ఒక గ్రాటికి ఒక గ్రానైట్ ముక్కనుకట్టి, దానికి భారతపతాక కట్టారు. అది గాలిలో నిటారుగా నిలిచి ఎగిరింది. మొదటిసారి చంద్రమండల యాత్ర చేసిన కీర్తి భారతదేశానికి దక్కింది.

గుహను వదలి బయటకు వెళ్ళేముందు వారు చంద్రమండల వాతావరణాన్ని పరిశోధించారు. అందులో ప్రాణవాయువు ఉన్నప్పటికీ, తక్కువ పరిమాణంలో ఉన్నట్లు స్పష్టమయింది. నెమ్మదిగా చంద్రమండల వాసానికి అలవర్చ తర్వాత ఆ గాలిని పీల్చుకొని బ్రతకవచ్చని నిర్ధారణ అయింది.

మిత్రులిద్దరూ, టామీతో బయటికి వచ్చారు. కొద్దిపాటి తినుబండారాలు, నీటితో, ముగ్గురు మహదానందంతో చకచక వెళ్ళిపోతున్నారు. దారిలో అనేక కొండలు, గుట్టలూ, లోయలూ అన్నీ వస్తున్నాయి. చిత్రమేమంటే ఎక్కడా జీవచిహ్నం కాని, నీటి చిహ్నం కాని, కన్పడలేదు. అంతా మృతభూమి లాగా ఉంది. ఆ విధంగా 100మైళ్ళ పైగా ప్రయాణం చేశారే గాని వారు ఎంతదూరం వచ్చింది గమనించలేదు. ఆ సమయంలో వారు అపెనైన్ పర్వతశ్రేణులలో ఒక శిఖరంపై ఉన్నారు. ఈ శిఖరాగ్రం నుంచి వారు నలుదెసల పరికించి చూశారు. ఇంతలో మోహన్ ముఖం వివర్ణమయింది.

అతను "కొంప మునిగింది ప్రసాద్, కాళరాత్రి ముంచుకువస్తోంది. అటు చూడు. జీమూతంలాగా ఎల్లా వస్తోందో. మనం వదలిన గుహ ఈ కాళరాత్రిలో కలిసి పోయింది. ఈ భయంకర రాత్రి 15 రోజులకు కాని అంతమవదు. ఈ పదిహేను రోజులలో మనం మన గుహను జేరుకోలేం బహుశా ఈ లోపల మనం ఆకలితో దప్పికతో మరణించవచ్చు. అంతకంటె ముఖ్యం ముందు ఇక్కడ నుండి మనం పగటి ప్రదేశాలకు పారిపోవాలి. రాత్రి ఈ దిశగానే తరుముకు వస్తోంది" అన్నాడు.

వారు ముగ్గురూ గ్రానైటు సహాయంతో పరుగు ప్రారంభించారు. పగటి ప్రదేశాలవైపు అలా ఎంతదూరం పరిగెత్తారో వారికే తెలియదు. వారు బాగా అలసిపోయారు. దగ్గరలో ఉన్న ఒక గుహలో విశ్రాంతి తీసుకోడానికి కూర్చున్నారు. వారికి తెలియకుండానే ముగ్గురూ నిద్రాదేవి ఒడిలో తలదాచుకున్నారు.

ఆ విధంగా ఎంతసేపు నిద్రపోయారో ఏమో ఉన్నట్లుండి టామీ మొరుగుతూ గుహలోపలికి వెళ్ళుతోంది. టామీ మొరుగుతూనే ఉంది. దాని వెనకాల వారిద్దరూ గుహలోకి వెళ్ళారు. ఆ గుహ ఏవిధమైన గదులు లేకుండా ఉంది. లోనికి వెళ్తున్నకొద్దీ వెల్తురు ఎక్కువయింది. భూమిమీద వృక్షజాలానికీ, అక్కడ ఉన్న దానికీ ఎక్కడా పోలికలేదు. గుహపై భాగంలో సుమారు ప్రతి 50 గజాలకూ, సుమారు రెండు అడుగుల వ్యాసం కలరంధ్రాలు ఉన్నాయి. వాటిలోంచి సూర్యరశ్మి లోనికి వస్తోంది. ఆ విధంగా ఇంకా కొంత దూరం వెళ్ళేసరికి గుహ అంతమయి పెద్దలోయ వచ్చింది. ఆ బ్రహ్మాండమైన లోయచుట్టూ

సుమారు నాలుగు మైళ్ళ ఎత్తువున్న వర్తులాకారపు కొండలు ఉన్నాయి. ఆ లోయలో బ్రహ్మాండమైన ఒక చంద్రమండల పట్టణం కానవచ్చింది. ఆ కొండ చరియల్లో కూడా అనేక గృహాలు ఉన్నాయి. అన్నీ కూడా కొండరాతితో కట్టినవే. ఆ చంద్రమండలమానవ నిర్మిత నగరం కన్నుల పండువగా ఉంది. ఆ లోయలో అనేకములైన వృక్షాలు ఉన్నాయి. వింత వింత పుష్పాలలో వింత వింత సౌరభాన్ని వెదజల్లుతూ, ఆ దృశ్యాలని తిలకిస్తూ వారు ఆశ్చర్య సాగరమగ్నులై నిలబడి పోయారు. తిరిగి టామీ మొరుగుతో వారికి స్పృహ వచ్చింది. వారికి సుమారు 12 అడుగుల దూరంలో ముగ్గురు చంద్రమండల మానవులు నిలబడి ఉన్నారు. వారు నాలుగు అడుగుల ఎత్తుమాత్రమే ఉన్నారు. తల, కాళ్ళు, చేతులు పెద్దవిగా ఉన్నాయి. పొట్ట చిన్నదిగా ఉంది. తలమీద జుట్టు చాలా ఒత్తుగా ఉంది. కళ్ళు, ముక్కుకూడా పెద్దవిగా ఉన్నాయి. కళ్ళు, ముక్కు, తల మనకంటె ఎక్కువ వంపుగా వుండి మానవులకంటె ఎక్కువ భాగాన్ని చూసేవిగా ఉన్నాయి. వారు వింత దుస్తులను, చెప్పలను ధరించారు. వారిలో మధ్యవ్యక్తి ఒక ప్రధాన ఉద్యోగివలె ఉన్నాడు. మిగతా ఇద్దరూ అతని అంగరక్షకులవలె, చేతులలో ఆయుధములు వంటివి ధరించి, ప్రక్కన నిలబడినారు.

టామీ మొరుగుడు ఎక్కువ అయింది మోహన్ దానిని అదుపుచేసి చేయి పైకి ఎత్తాడు. మరొక చేయి పిస్టల్‌మీద ఉంది. మధ్యవక్తి కూడా చేయి పైకి ఎత్తాడు. మరియొక చేతితో అతని జేబులో ఉన్న ఏదో యంత్రాన్ని సవరించాడు. వెంటనే మిత్రులిద్దరకూ "ఎవరు మీరు? మేము మీకు మిత్రులమే. భయంవలదు." అని ఆ వ్యక్తి చెప్పినట్లు భావం కలిగింది. ఆవిచిత్రానుభూతికి ఇద్దరూ ఆశ్చర్యపోయి ఒకరినొకరు చూసుకున్నారు. ఇంతలో మళ్లీ వారికి "ఆశ్చర్యం అవసరంలేదు. మా యంత్ర సహాయంతో భాష తెలియకపోయినా ఒకరి భావాలు మరిఒకరు అర్థంచేసుకోవచ్చు. భాష ఏదైనా అందరి భావాలు ఒకే విధంగా ఉంటాయి. అవి మస్తిష్కంలో అందరికీ ఒకే విధమైన విద్యుత్తరంగాలను కల్పిస్తాయి. ఆ విద్యుత్తరంగాలను మా యంత్రం గ్రహించి మా భాషలో అనువదించి మెదడుకి అందజేస్తుంది అదే విధంగా మా భావాలను మీకు అందజేస్తుంది." అని అన్నట్లు భావన కలిగింది.

రహస్యం అవగాహన చేసుకున్న మిత్రులిరువురూ తాము వచ్చినపనీ, జరిగిన విషయములూ అన్నీ విశదపరచారు.

ఆవ్యక్తి తన పేరు "చంసుమా" అని తను చంద్రమండల శాంతి సైన్యాధికారిననీ వారిని తమ అతిథులుగా ఆహ్వానిస్తున్నామనీ చెప్పాడు.

చంసుమా ఆహ్వానాన్ని అంగీకరించి వారు చంద్రమండల అతిథులుగా వెళ్ళారు. చంద్రమండల ప్రధాని "సుంసుమా" వారికి ఘనమైన స్వాగతం ఇచ్చాడు. వారు అనేక విషయాలు చర్చించారు. తత్ఫలితంగా ఈ క్రింది విషయాలు తెలియవచ్చాయి.

చంద్రమండలంలో శీతోష్ణాలు అత్యధికంగా ఉన్నాయి కనుక వారు లోతైన లోయలలో పట్టణాలు నిర్మించుకున్నారు. అటువంటివి కొద్దిమాత్రమే ఉన్నాయి. అదిగాక మానవ నిర్మిత గృహాలను, నేలను తొలిచికూడా వారు నగరములు నిర్మించారు. సూర్యరశ్మిని అద్దముల ద్వారా గుహలలోనికి, నేలలోనికి ప్రసరింపచేస్తారు. చంద్రమండలంలోని మొక్కలు సూర్యరశ్మిని గ్రహించి రాత్రులందు, ఉష్ణమును ప్రసరిస్తాయి. చంద్రమండలం పైకి అచైతన్యంగా కనిపించినా, అది ఎంతో చైతన్యవంతమై అభివృద్ధి చెందింది. చంద్రమండలంలో పురపెద్దలచే ఎన్నుకొనబడే ప్రభుత్వం ఉంది. అక్కడ యుద్ధం బెడదలేదు.

అక్కడ అందరూ శాంతికాముకులు. వైజ్ఞానిక అభివృద్ధి వారి లక్ష్యం.

మోహన్ సుంసుమాను తాము తిరిగి భూమికి వెళ్ళే మార్గం ఏమైనా ఉందా? అని అడిగాడు. సుంసుమా "మరిచాను. అంగారక గ్రహవాసులు భూమిమీద దిగాలని ప్రయత్నిస్తున్నారు. వారు కూడా శాస్త్రవిజ్ఞానంలో ఎంతో ముందంజ వేశారు. వారు మా చంద్రమండలాన్ని అంతరగ్రహ స్థావరంగా ఏర్పరచుకొన్నారు. వారికి మాకు మైత్రి ఉంది. అందుచేత మా సంయుక్త కృషిలో బాగా అభివృద్ధి చెందిన ఎగిరే పళ్ళెములను నిర్మించాము. వాటిలో మామండలం వారు అంగారక వాసులు కూడా భూమిమీద అనేక పర్యాయములు ఎగిరాము. కాని భూమిమీద ఎక్కడ చూసినా విధ్వంసకరచర్యలు కన్పిస్తున్నాయి. ఆటంబాంబులు, హైడ్రోజన్ బాంబులు ప్రేల్చబడుతున్నాయి. నాశనకాండ తాండవిస్తోంది. వైజ్ఞానిక కృషి వక్రమార్గం పట్టింది. అందుచేత వారితో మేము, మైత్రి ప్రయత్నాలు జరిపితే, అవి మా మనుగడకే భంగమేమోననే భయంతో మేము ఇంకా భూమిమీద దిగలేదు. మా లోకాలు శాంతి ప్రయోజనాల కోసం, విజ్ఞానాభివృద్ధి గావించాయి. కాని మీ లోకంలో జరిగే విధ్వంసక కృషికి మేము తల ఒగ్గవలసిందే. అంగారక వాసులు తిరిగి మా మండలానికి నాలుగు నెలలలో వస్తారు. వారుసమ్మతిస్తే మీరు వారి ఎగిరే పళ్ళెములలో భూమికి వెళ్ళవచ్చు. ఈ లోపల భూవాసులకు ఈ విషయమై వార్తపంపించండి. వారు మైత్రికి సిద్ధంగా ఉంటే అందరూ వెళ్ళవచ్చు. అంగారక వాసులు వచ్చేవరకూ మీరు మా లోకం మందే పర్యటించండి." అన్నాడు.

మోహన్ "మా రేడియో ప్రసారకయంత్రం చెడిపోయింది. దానిని మీ నిపుణులతో సరిచేయించండి." అని అన్నాడు. సుంసుమా అందుకు ఒప్పుకున్నాడు.

మోహన్ పంపిన వార్తలను విని భూలోకం ఉత్సాహంతో అట్టుడికినట్లు ఉడికిపోయింది. ప్రపంచంలోని అన్నిదేశాలూ తమ విబేధాలను మరచి, త్రిలోకవాసులకు అఖండ స్వాతగమివ్వడానికి ఏకగ్రీవంగా ఆమోదించి, సమైక్య కృషి ప్రారంభించాయి.

నాలుగు నెలలపాటు మిత్రులిరువురూ చంద్రమండలం యావత్తూ పర్యటించారు. అక్కడి మొక్కలను, జంతువులను, స్త్రీపురుషులను, వింతలూ, విశేషాలూ అన్నీ పరిశీలించారు.

అనుకున్నట్లుగానే అంగారకవాసులు చంద్రమండలంపై విడిశారు. త్రిలోక వాసులకు రాయబారాలు జరిగాయి. చంద్రమండలవాసులు, చంసుమా, సుంసుమాలతో కలసి నలుగురు, అంగారక వాసులు నలుగురు, భూవాసులు ఇద్దరు మొత్తం పదిమంది, ఎగిరే పళ్ళెములో భూమిని చేరడానికి నిశ్చయించారు. వీరంతా, పదిరోజుల అనంతరం భూమికి రాబోతున్నట్లు భూమికి వార్తను పంపారు. టామీని చంద్రమండలానికి కానుకగా అర్పించారు.

ఆరోజు శనివారం అదే రోజు మధ్యాహ్నం మూడుగంటలకి, హైద్రాబాద్ నగరంలో ఎగిరే పళ్ళెం దిగింది. ప్రపంచం నలుమూలల నుంచీ, కోటాను కోట్ల జనం త్రిలోకవాసులకు అఖండ స్వాగతం ఇచ్చారు. విశ్వాంతరాళయాత్రా గౌరవం ప్రథమంగా ఆంధ్రదేశానికి, తద్వారా భారతదేశానికి దక్కింది.

**చుక్కాని, 15-6-1959** ✪

# పరలోకవాసి

అది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్. సుమారు పదిహేను ఎకరాల ఆవరణ మధ్య నాలుగు అంతస్తుల సువిశాల భవనంలో ఉంది ఆసంస్థ. ప్రపంచ ప్రఖ్యాతిగొన్న ఆ సంస్థ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన ఎందరో జీవశాస్త్రజ్ఞులను తయారుచేసింది. అంతేకాదు ఆ సంస్థలో పనిచేస్తూ, ఉన్నత పదవుల మీద ఇతరదేశాలకు పోయి, అక్కడి పౌరసత్వం స్వీకరించిన కొందరు భారతీయ శాస్త్రజ్ఞులు, నోబెల్ బహుమతివంటి అత్యున్నత పురస్కారాలను పొందారు కూడా. ఆ సంస్థలో పనిచేయడంకాని, దానితో ఏవిధమైన సంబంధం కలిగి వుండడం కాని ఒక గౌరవంగా భావిస్తారు శాస్త్రజ్ఞులు. అంతటి మహోన్నత చరిత్ర కలిగినట్టిది ఆ సంస్థ.

ఎల్ ఆకారంలో ఉన్న ఆ బ్లాక్‌లో ఒక వింగ్‌లో లైబ్రరీ ఉంది. మరో వింగ్‌లో లేబొరేటరీలు ఉన్నాయి. ఈ రెండు విభాగాల్లోను నిరంతరం నిశ్శబ్దం తాండవిస్తూ ఉంటుంది. ఎవరిమటుకు వారు తదేక ధ్యాసతో లైబ్రరీలో చదువుకుంటుండడం కాని, దీక్షగా పరిశోధనలు జరుపుకుంటుండడం కాని చేస్తుంటారు. మాట్లాడవలసిన అవసరం వచ్చినపుడు నెమ్మదిగా ఇతరులకు డిస్టర్బెన్స్ లేకుండా మాట్లాడుకుంటారు. ఈ రెండు చోట్లాకూడా ప్రశాంత గంభీర వాతావరణం నెలకొని ఉంటుంది ఎప్పుడూ. దూరంగా విడిగావున్న మరో బ్లాక్‌లో అడ్మినిస్ట్రేటివ్ వింగ్ ఉంది. పాలనకి సంబంధించిన వ్యవహారాలన్నీ ఆ ఆఫీసులో జరుగుతుంటాయి.

లైబ్రరీలో ఏదో సరికొత్త బయాలజీ పుస్తకాన్ని సీరియస్‌గా చదువుతోంది గీత. ఒక సందర్భంలో ఆమెకు ఏదో అనుమానం వచ్చింది. ఆనంద్ దగ్గరకువెళ్ళి ఆ అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలనుకుంది ఆమె. వారిద్దరూ కూడా ఆ సంస్థలో డాక్టరేట్ పొందిన శాస్త్రజ్ఞులే. ఆనంద్ మంచి మేధావి. ఎటువంటి చిక్కు సమస్యనైనా సులువుగా విశ్లేషించగలడు.

గీత వెళ్ళేసరికి ఆనంద్ లాబొరేటరీలో తీవ్రంగా ఏదో పరిశోధనలో మునిగి ఉన్నాడు. పలకరిస్తే అతన్ని డిస్టర్బ్ చేసినట్లు అవుతుందేమో అని, తటపటాయిస్తూ కొంచెం దూరంగానే నిలబడి పోయింది గీత.



పరిశోధనలో ఎంత గాఢంగా మునిగి వున్నా గీత రాకను గమనించాడు ఆనంద్. చేతిలో వున్న టెస్ట్ ట్యూబ్‌ను స్టాండ్‌లో పెట్టేస్తూ "రా గీతా, ఆగిపోయావే?" అంటూ ఆప్యాయంగా పలకరించాడు.

"పానకంలో పుడకలాగా పరిశోధన మధ్యలో అడ్డువస్తే, అయ్యగారికి అలకొస్తుందేమో నని ఆగిపోయాను". అంది గీత చిలిపిగా. వాళ్ళిద్దరూ సహశాస్త్రజ్ఞులే కాక వారి మధ్య ప్రేమానుబంధం వుంది. త్వరలోనే వివాహం కాబోతోంది వారికి.

"నా ఆలోచనల్లో కూడా పుడకలాగా అడ్డువస్తే, పరిశోధనని ఆపేశాను. ఆ.. ఇప్పుడు చెప్పు. ఏమిటి సంగతి?" అన్నాడు ఆనంద్.

"జీవకణాలను లక్షలాది సంవత్సరాలు సజీవంగా ఉంచడం సాధ్యమా? నా ఉద్దేశం జీవితాన్ని లక్షలాది సంవత్సరాలు పెంచాలని కాదు, జీవాన్ని నిద్రాణస్థితిలోకి కాని మరే స్థితిలోకి కాని పంపి స్తంభింపజేసి, కొన్ని లక్షల సంవత్సరాల తర్వాత మళ్ళీ చైతన్యం పొందించడం సాధ్యమా? ఇందాక ఒక పుస్తకం చదువుతుంటే, భవిష్యత్తులో సైన్స్ సాధించగల విజయాలలో దీనిని కూడా ఒకటిగా పేర్కొన్నాడు రచయిత. దీని విషయంలో అనుమానం వచ్చి నిన్ను అడగటానికి వచ్చాను" అంది గీత.

"శాస్త్రరీత్యా ఇది సాధ్యమే. ఉదాహరణకి గింజల్నే తీసుకుందాం. ఆ గింజల్ని ఓ డబ్బాలో వేసి వుంచినంత కాలం అవి అలాగే ఉంటాయి. అంటే వాటిలో జీవం నిద్రాణ స్థితిలో ఉందన్నమాట. వాటిని

నేలలో పాతి నీరు పోసినప్పుడు అవి మొలకెత్తుతాయి. అంటే అనుకూల పరిస్థితులలో జీవం బహిర్గత మవుతుందన్నమాట. అయితే గింజలలో జీవం నిద్రాణస్థితిలో ఎంతకాలం ఉంటుందనే అంశం, ఆయా గింజల లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. మొక్కల సంగతి సరే. కొన్ని కీటకాల సంగతే చూద్దాం. గొంగళిపురుగుల వంటి కీటకాలు ఆకుల్ని బాగామేసి, గూడు కట్టుకొని నిద్రపోతాయి. కొన్ని నెలల తర్వాత అందులోంచి సీతాకోకచిలుకలు బయటికి వస్తాయి. మరికొన్ని సూక్ష్మజీవుల, అల్పజీవాల సంగతి చూద్దాం. పరిస్థితులు అనుకూలంగా లేనపుడు, అంటే నీరు గడ్డకట్టే శీతలంలో కాని, మండుటెండలలో కాని, తమచుట్టూ ఒక కవచాన్ని ఏర్పరచుకొని దీర్ఘనిద్రలోకి వెళ్ళిపోతాయి. పరిస్థితులు తిరిగి అనుకూలించినప్పుడే అవి కవచాన్ని బద్దలు కొట్టుకొని బయటకు వస్తాయి. ఇవి నిద్రావస్థలో ఉన్నప్పుడు అన్ని జీవవ్యాపారాలు పూర్తిగా స్తంభించి పోతాయి. మరి వాటికి తిరిగి జీవ చైతన్యం ఏ విధంగా వస్తోంది? దీనికి సమాధానం శాస్త్రవేత్తలకి ఇంకా అంతుపట్టనే లేదు."

"ఇవన్నీ నాకు తెలిసిన విషయాలే, నాకే కాదు. బయాలజీలో సామాన్య పరిజ్ఞానం ఉన్నవారికి కూడా తెలిసినవే. నా పాయింట్ నీకు సరిగా అర్థం అయినట్లు లేదు, కృత్రిమ గర్భోత్పత్తి కోసం పశువుల వీర్యాన్ని లిక్విడ్ నైట్రోజన్‌లో నిలువ ఉంచగలుగుతున్నాం కదా మనుష్యులలో స్త్రీ అండాన్ని తీసి టెస్ట్‌ట్యూబ్‌లో ఫెర్టిలైజ్ కావించి "టెస్ట్‌ట్యూబ్ బేబీస్"ను సృష్టించడం జరుగుతోంది కదా. అయితే ఈ రెండు సందర్భాలలోనూ జీవం చైతన్య వంతంగానే ఉంటుంది. దీనికి బదులు ఫలదీకరణం చెందిన అండంలోని జీవాన్ని నిద్రాణస్థితిలోకి పంపి కొన్ని లక్షల సంవత్సరాల తర్వాత దానికి చైతన్యం కల్పిస్తే ఎలా ఉంటుంది? అప్పటికి జీవ పరిణామం చాలా ఎక్కువగా జరిగి ఆ మానవుల రూపురేఖలే మారిపోవచ్చు. అటువంటి వారి మధ్య ఈ కొత్త జీవి ఎలా ఉంటుంది? అసలు ఇది సాధ్యమేనా?"

"ఏం... ఏమైనా సైన్స్ ఫిక్షన్ చదివావా ఏమిటి?" అన్నాడు ఆనంద్ నవ్వుతూ.

"సైన్స్ ఫిక్షన్ వ్రాసిన ఒక జీవశాస్త్రజ్ఞుడి వ్యాసాలు చదివాను. ఫలదీకరణం చెంది నిద్రాణంగా వున్న అండాల్ని ఇతర గ్రహాలకు కూడా పంపి మానవజాతిని అభివృద్ధి చేయవచ్చునని సూచించాడు ఆ రచయిత. అది ఊహే అయినా, శాస్త్రీయ పరంగా చాలా చక్కగా వివరించాడు ఆయన."

"అరే.... చాలా విచిత్రంగా ఉందే!" అన్నాడు ఆనంద్ ఆశ్చర్యంగా.

"ఏమిటి.... ఈ ఊహా"! ఆ సామాన్య ఊహ ఆనంద్‌కి ఆశ్చర్యం కలిగించినందుకు ఆశ్చర్యపోతూ అడిగింది గీత.

"ఊహకాదు. ఇప్పుడు నేను చేస్తున్న ప్రయోగానికీ, ఈ ఊహకీ పూర్తి సంబంధం ఉంది." అన్నాడు ఆనంద్.

"రియల్లీ.. ఇటీజ్ సింప్లీ వండర్‌ఫుల్" అంది గీత పట్టరాని ఆశ్చర్యంతో.

"ఇటీవల మన దేశం అంగారక గ్రహానికి మానవ రహిత అంతరిక్ష నౌకలను పంపింది కదా. అవి అక్కడి మట్టిని, శిలలను భూమికి తీసుకు వచ్చాయి కదా. వాటిలో కొన్నింటిని అంగారక గ్రహంలో ఇప్పుడు కాని, మునుపెప్పుడు కాని ఏ విధమైన జీవమైనా ఉందా అనే విషయం పరిశోధించడానికి మన ఇన్‌స్టిట్యూట్‌కి ఇచ్చారు. ఆ పరిశోధనలను నేను చేస్తున్నాను" అన్నాడు ఆనంద్.

"అవును. నాకు తెలుసు. పోతే ఇంతకు ముందు అమెరికన్లు పంపిన వైకింగ్ నౌకలు, రష్యా, మనదేశం వంటి దేశాలు పంపిన నౌకలు, అక్కడ ఏ విధమైన జీవం, కనీసం గడ్డికాని, ఆఖరికి సూక్ష్మజీవులు కాని లేవని నిరూపించాయి కదా."

"ఆ మాట నిజమే. అయితే ఒకప్పుడు అంగారకుని మీద జీవనదులు ప్రవహించిన దాఖలాలు ఉన్నాయి. అక్కడి వాతావరణంలో ఆక్సిజన్ ఉంది. గ్రహం మీద స్వల్పపరిమాణంలోనైనా నీరుంది, ఇప్పటికీ చైతన్య వంతంగా వున్న అగ్ని పర్వతాలున్నాయి అక్కడ. ఈ పరిస్థితులన్నీ అక్కడ జీవం ఆవిర్భవించడానికీ, పరిణామం చెందడానికీ అనుకూలమైన పరిస్థితులే.

"కాని..."

"మరి జీవం ఉన్నట్లు సాక్ష్యం ఎందుకు దొరకలేదూ అని నీ అనుమానం?"

అంగారకుని మీద పరిస్థితులు క్రమేపీ మారి ఏరకమైన జీవం ఉండడానికి ఆస్కారం లేకుండాపోయింది. అయితే ఒకప్పుడు అక్కడ జీవం ఉండిందనే నా నమ్మకం. నా నమ్మకమే కాదు చాలామంది శాస్త్రజ్ఞుల నమ్మకం కూడా. అయితే తొలిసారిగా అక్కడినుంచి మట్టిని, శిలలను తీసుకొనివచ్చింది ఇప్పుడే. అదికూడా మనదేశమే. ఇప్పుడు నేను జరుపుతున్న పరిశోధనలు నా నమ్మకాన్ని బలపరుస్తున్నాయి."

"నిజంగా?"

"అవును... ఇలారా..." అంటూ ఎక్స్‌పరిమెంటింగ్ టేబుల్ దగ్గరగా ఆమెను తీసుకువెళ్ళాడు ఆనంద్.

"ఇదుగో.... ఇవి అక్కడినుండి తెచ్చిన మట్టి, శిలల నమూనాలు. వీటిని పరీక్షిస్తే భూమిమీద నాలుగు కోట్ల సంవత్సరాలకి ముందు ఉండిన సూక్ష్మ జీవులు అక్కడకూడా ఉన్నట్లు ధ్రువపడ్తోంది. అంతకన్నా అత్యంత విచిత్రమైనది ఇంకోటి ఉంది"

"ఏమిటది?"

"ఈ గ్లాస్ కేస్‌లో ఒక చిన్న భరిణ వంటిది ఉంది చూశావా"

"అవును....కనిపిస్తోంది?"

"ఎవరో మంచి పనితనం ఉన్న కళాకారుడు అందంగా చేసినట్లుగా ఉంది"

"అవునా...ఇది అంగారకుని నుంచి తెచ్చిన ఒక మట్టి పెళ్ళలో దొరికింది."

"అరే... ప్రకృతి సహజంగా ఎంత అందమైన భరిణ తయారయింది! ఎట్‌టైమ్స్ ట్రూత్ ఈజ్ మోర్ థ్రిల్లింగ్ దాన్‌ఫిక్షన్" అని సామెతఉంది. దీన్ని చూస్తే "ఇన్‌మెనీ కేసెస్-నేచర్ కెన్ ప్రొడ్యూస్ ఫార్ బెటర్ థింగ్స్ దాన్ మాన్" అని అనవచ్చేమో!"

"ఇది స్వాభావికంగా ఏర్పడిందని ఎందుకు అనుకుంటున్నావు?"

"మరి?" అంతులేని ఆశ్చర్యంతో అడిగింది గీత.

''ఈ భరిణ ఎవరో బుద్ధి జీవులు చేసినదే. ఇందులో ఫెర్టిలైజ్డ్ ఎగ్ ఉంది. భరిణలోపల పూర్తిగా ఎయిర్ టైట్ చేసి అది చెడిపోకుండా ఉంచారు. పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఇది జీవం పొందగలదని నా నమ్మకం''.

''వాట్ ఎ వండర్! అంటే ఇది ఒకప్పటి అంగారక గ్రహవాసులకి సంబంధించిన అండమన్న మాట.''

"అని ఖాయంగా చెప్పలేను. ఎందుకంటే ఈ అండం మానవజాతి అండాన్ని పోలిఉంది. అంగారక గ్రహవాసులు మానవ జాతిని పోలివుండేవారో లేక అప్పటి భూవాసులు అంతరిక్ష నౌకల ద్వారా కావాలని మానవ అండాల్ని అక్కడికి పంపారో తేల్చుకోలేకపోతున్నాను"

''అదెలా సాధ్యం? అంతరిక్షశాస్త్రం అభివృద్ధి చెందింది ఇటీవల దశాబ్దాలలోనే కదా? అటువంటప్పుడు భూవాసులు అక్కడికి ఎలా పంపగలరు?''

''అంతరిక్ష శాస్త్రం ఇటీవలనే అభివృద్ధి చెందిందని మనం అనుకుంటున్నాం. కాని అది సరికాకపోవచ్చు. ఎందుకంటే మన భూమిమీద చరిత్రకి అందని బహు ప్రాచీన కాలంలోనే అతిగొప్ప నాగరికతలు విలసిల్లిన దాఖలాలున్నాయి. అవన్నీ నామరూపాలు లేకుండా తుడిచి పెట్టుకుపోయాయి. అట్టివారి విజ్ఞానం అంతరిక్షయానాన్ని సాధించి ఉండవచ్చుకూడా అంతదాకా ఎందుకు ఈజిప్టులోని పిరమిడ్లనే తీసుకుందాం. ఇంజనీరింగ్ ఇంతగా అభివృద్ధి చెందిన ఈ కాలంలో కూడా అటువంటి నిర్మాణాలను కట్టడం సాధ్యంకాదు. అలాగే ఢిల్లీలోని ఇనుప స్తంభమూను. మెటలర్జీలోని ఎన్ని మెలుకువలను ఉపయోగించినా అంతటి స్వచ్ఛమైన ఇనుమును తయారు చేయడం ఇప్పటికీ సాధ్యంకాదు. ఇటువంటివి ఈ భూమిమీద ఎన్నో ఉన్నాయి. విజ్ఞాన శాస్త్రంలో ఇట్టి విజయాలను సాధించిన పూర్వీకులకి అంతరిక్షయానం సాధ్యమై ఉండదని ఎందుకనుకోవాలి?''

''ఇవన్నీ భూవాసులు కట్టినవి కావని, ఇతర నక్షత్రమండలాలకు చెందిన బుద్ధిజీవులు భూమికి వచ్చారని, ఇవి వారి నిర్మాణాలనీ సిద్ధాంతీకరించిన గ్రంథం ఒకటి చదివాను.

"అవును నేనూ చదివాను. ఆవిధంగా భావించడానికి కొన్ని ఆధారాలున్నాయి. ఆ గ్రంథంలో ప్రతిపాదించిన దాని ప్రకారం ఈ బుద్ధిజీవులు "ప్లియైడ్స్" నక్షత్ర మండలం నుంచి వచ్చి ఉండాలి. కాని నేటి మన విజ్ఞానం ప్రకారం ఇది అసాధ్యం. ఎందుకంటే మనకి అతిసమీపంలో వున్న ఆల్ఫాసెంటరీ నక్షత్రం నుంచి సెకనుకి 1,86,000 మైళ్ళ వేగంతో ప్రయాణంచేసే కాంతే భూమిని చేరడానికి నాలుగు సంవత్సరాలుపడ్తుంది. ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారం ఏ పదార్థము కాంతివేగాన్ని అందుకోలేదు. ఈ లెక్కన ఆ నక్షత్ర మండలం జేరడానికి, మనకి వున్న అత్యంతవేగంగా పోయే రాకెట్లను ఉపయోగించినా లక్షల సంవత్సరాలు పడ్తుంది. అయితే ఆ బుద్ధిజీవులు మనకంటే ఎంతగానో పరిణామం చెందినవారు కావడం వల్ల వేరే పద్ధతులలో దీనిని సుసాధ్యం చేసుకుని ఉండవచ్చు''.

"ఆ లెక్కన అంతరిక్ష యానంలో వారి జీవవ్యాపారాల్ని స్థంభింపజేసుకుని భూమిని జేరాక తిరిగి జీవం పొంది ఉండవచ్చుగా"

"క్వైట్ పాజిబుల్ ఈ విషయంలో మన అంతరిక్ష శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేస్తున్నారు. కొందరు

శాస్త్రవేత్తల ఊహప్రకారం జీవం ఇతరలోకాల నుండి ఉల్కల ద్వారా కాని, మరేవిధంగా గాని భూమికి వచ్చి అభివృద్ధి చెందింది. ఈ ఊహే కనుక నిజమైతే పరలోక బుద్ధిజీవులు జీవం స్తంభింప చేసిన అండాల్ని తీసుకొచ్చి భూమి మీద కూడా ఉంచి ఉండవచ్చు."

"గతంలో ఈ భూమిమీద బాగా అభివృద్ధి చెందిన నాగరికతలు ఉండేవని చెప్పావు కదా. వారెవరైనా అంగారకుని మీదకి ఈ స్థితిలో వున్న అండాల్ని పంపి ఉండవచ్చుగా. ఇందాక ఈ మాట నువ్వే అన్నావు"

"నిజమే. అదీ నిజమే. ఈ అండాన్ని టెస్ట్ ట్యూబ్ బేబీస్ విషయంలో లాగా టెస్ట్ ట్యూబ్‌లో తగిన రసాయనాలలో వేసి ఉంచుతాను.. నా ఉద్దేశం ప్రకారం ఇది జీవ చైతన్యం పొందుతుంది. అదే జరిగితే దీనిని కృత్రిమమైన తల్లి గర్భంలో పెంచుతాను. అప్పుడు దీనిని గురించి స్పష్టమైన అవగాహన మనకి ఏర్పడుతుంది.

"ఇటీజ్ రియల్లీ థ్రిల్లింగ్" అంది గీత ఆశ్చర్యంతో.

"నా పరిశోధన విజయవంతం అయితే అంతరిక్ష యానంలో నూతనాధ్యాయం మొదలవుతుంది. భూవాసులుకూడా ఇతర గ్రహాలకే కాదు, నక్షత్రమండలాలకు కూడా యాత్రలు చేయగలరు. అప్పుడు "వసుధైక కుటుంబం" అన్న సూక్తికి బదులు "విశ్వైక కుటుంబం" అన్న సూక్తి ఆవిర్భవిస్తుంది" అన్నాడు ఆనంద్.

"విష్ యు బెస్ట్ ఆఫ్ లక్" అంది గీత.

"వై? యు సే విష్ ఆజ్ బెస్ట్ ఆఫ్ లక్.... ఆ...ఈ అండం కనుక జీవం పొందితే ఇందాకటి నీ ప్రశ్నకి సరియైన సమాధానం లభిస్తుంది" అన్నాడు ఆనంద్.

అటు తర్వాత తన పరిశోధనలో నిమగ్నమైపోయాడు ఆనంద్. గీత తిరిగి లైబ్రరీకి వెళ్ళిపోయింది.

* * * *

రెండు రోజులు గడిచాయి.

గీత లైబ్రరీలో ఏవో పుస్తకాలు రిపేర్ చేస్తోంది.

ఆనంద్ వడివడిగా అడుగులు వేసుకుంటూ ఆమె వద్దకు వచ్చాడు.

మామూలుగా అయితే లైబ్రరీకి వచ్చే వాళ్ళు నెమ్మదిగా, శబ్దం చేయకుండా వస్తారు.

ఆనంద్ సంగతి సరేసరి. అటువంటిది ఆ రోజు అతను ఆ విధంగా రావడంతో ఆ అలికిడికి అటువైపు తిరిగి చూసింది గీత.

ఆమెను చూస్తూనే "గీతా...గీతా" అంటూ దగ్గరగా వచ్చాడు ఆనంద్.

ఆ కేకలకు ఇబ్బందిగా ముఖం పెట్టింది ఆమె. లైబ్రరీలో వున్న ఇతరుల మెడలుకూడా ఒక్కసారిగా అతనివైపు తిరిగాయి. గీత "సైలెన్స్ ప్లీజ్" అని వున్న బోర్డువంక వేలు చూపించింది.

అప్పుడు ఆనంద్ ఈ లోకంలోకి వచ్చాడు. తన ప్రవర్తనకి సిగ్గు పడుతూ గీతకి దగ్గరగా వచ్చి "ఒక్కసారి లేబొరేటరీలోకి రా" అన్నాడు.

గీత మౌనంగా ముందుకి సాగింది.

లాన్సులోకి రాగానే "గీతా! మన ఎక్స్‌పెరిమెంట్ సక్సెస్‌ఫుల్ అయింది" అన్నాడు ఆనంద్ పట్టరాని సంతోషంతో.

"ఏదీ!...అంగారకుని శిలలో దొరికిన ఆ అండందా...?" అంది ఆమె ఆశ్చర్యంతో.

"అవును, అదే. ఆ అండానికి జీవచైతన్యం వచ్చింది. ఎంబ్రియోగా మారి ఎదుగుతోంది. మరో విషయం. దాని గ్రోత్ ఫెంటాస్టిక్‌గా ఉంది. మనుష్యుల ఎంబ్రియో కంటే ఎన్నోరెట్ల వేగంగా అది ఎదుగుతోంది. ఈ లెక్కన పూర్తి ఆకారం కొద్ది రోజుల్లోనే వస్తుందేమో అని అనిపిస్తోంది" అన్నాడు ఆనంద్.

"స్ట్రేంజ్" అని ఏదో ఆలోచిస్తూ వడివడిగా లేబొరేటరీలోకి దారితీసింది గీత. ఆమెకంటే ముందు అంగలు వేసుకుంటూ ఎక్స్‌పెరిమెంటల్ టేబుల్ దగ్గరకి వెళ్ళాడు ఆనంద్.

ఎక్స్‌పెరిమెంటల్ టేబుల్ మీద ఒక పెద్ద గ్లాస్ జార్ ఉంది. అందులో ఏదో ద్రవం ఉంది. ఆ జార్ మీద బిగుతుగా ఒక మూత ఉంది. దానికి రెండు రంధ్రాలున్నాయి. ఒక రంధ్రంలో ఉన్న ట్యూబ్ ఆక్సిజన్ సిలిండర్‌కి కనెక్ట్ చేసి ఉంది. మరో రంధ్రంలో ఉన్న గొట్టం, మరో జార్లో ఉన్న సున్నపు తేటలోకి ఉంది. ఈ మొత్తం ఏర్పాటు అంతా ఒక పెద్ద గ్లాసుకేసులో ఉంది. లోపల జార్‌లోని ద్రవంలో, తల్లి గర్భంలో రెండు నెలల వయసున్న పిండం యొక్క ఆకారం ఒకటి తేలుతూ కనిపిస్తోంది.

"ఇందులో...లోపలి జార్‌లో గర్భిణీ స్త్రీల గర్భాశయంలో ఉండేటటువంటి ద్రవాన్ని పిండానికి కావలసిన కొన్ని పోషక పదార్థాలను ఉంచాను. ఆక్సిజన్ సిలిండర్ ద్వారా పిండానికి ప్రాణవాయువు అందుతుంది. విడుదలయిన కార్బన్ డైఆక్సయిడ్ సున్నపు తేటలో కలిసి కాల్షియం కార్బొనేట్ లవణం అయి క్రిందకి దిగుతుంది. దీని ద్వారా శ్వాస ప్రక్రియ ఏ స్థాయిలో జరుగుతోందో తెలుసుకోవచ్చు. ఈ ఏర్పాటు వల్ల ఇతర వాతావరణ ప్రభావంకాని, సూక్ష్మజీవుల కంటామినేషన్‌కాని ఉండదు. నిన్న ఒక చిన్న బిందువుగా ఉన్న పిండం, ఈ రోజుకి అప్పుడే ఎంతగా ఎదిగి పోయిందో చూడు" అన్నాడు ఆనంద్.

"చాలా విచిత్రంగా ఉందేది. కళ్ళతో చూస్తున్నాం కనుక నమ్మాల్సి వస్తోంది కాని చూడకుంటే నమ్మశక్యం కాకుండా ఉంది. అది సరేకాని ఈ పిండం యొక్క శరీరం ఇలా ఉందేమిటి? గాజుపలకలాగా ట్రాన్స్‌పరెంట్‌గా ఉంది. ఆకారం మాత్రం మానవ పిండంలోనిదిగానే ఉంది".

"నిజమే. ఈ పిండ దేహ నిర్మాణం పూర్తిగా సెల్యులోజ్‌తో తయారయినట్లు అనిపిస్తోంది. సెల్యులోజ్‌కున్న విచిత్ర లక్షణం అది ఏ రూపాన్నయినా సంతరించుకోగలదు. ఆకారంబట్టి ఇది మానవ పిండం అనిపిస్తున్నా, ఈ లక్షణం చూస్తే ఈ జీవం మన భూమికి సంబంధించినది కాదేమోనని పిస్తోంది".

"ఏమైనా పిండం మరి కొంత ఎదిగేసరికి బహుశా అసలు సంగతి తెలియవచ్చు. ఇది పూర్తిగా ఎదిగి బ్రతకగలగాలేకాని, అనేక సృష్టి రహస్యాలు తెలియవచ్చు" అంది గీత.

"నేననుకోడం, ఇది పూర్తి ఆకారం చెందడానికి వారం పది రోజులు చాలు. ఈ పెరుగుదల చూసినా, ఇది భూమికి సంబంధించిన ప్రాణికాదన్న అనుమానాన్ని బలపరుస్తోంది. అంగారకుడి మీది ... శక్తి భూమ్యాకర్షణ శక్తికంటే బాగా తక్కువ. అందువల్ల సహజంగా అక్కడి జీవుల పెరుగుదల

భూమి మీదకంటే చాలా వేగంగా జరుగుతుంది'' అన్నాడు ఆనంద్.

"అంటే అంగారక గ్రహం మీద ఉండిన బుద్ధిజీవులు తమ అద్భుత వైజ్ఞానిక ప్రగతితో ఈ విధంగా తమ సంతతిని దాచిపెట్టారంటావా? ఇప్పుడయితే ఎటువంటి జీవమూ అక్కడ లేదే'' అంది గీత.

"మన భూమి మీద కూడా ఎన్నో గొప్ప నాగరికతలు వెల్లివిరిసి చివరికి నామ రూపాలు లేకుండా తుడిచిపెట్టుకుపోయాయని చెప్పానుకదా. అంగారక గ్రహంమీద కూడా అలాగే జరిగి ఉండవచ్చు. ఏ కారణం చేతనో ఆ గ్రహం నివాసయోగ్యం కాకుండా పోయి అన్ని రకాల జీవులూ పూర్తిగా అంతరించి ఉండవచ్చు. ప్రకృతి సహజమైన మార్పుల వల్ల జీవావశేషాలూ, నాగరికత చిహ్నాలూ అన్నీ అంగారక గర్భంలోకి వెళ్ళిపోయి ఉండవచ్చు. ఈ ప్రమాదాన్ని పసికట్టి ఆ లోకపు శాస్త్రజ్ఞులు ఈ విధంగా, ఫలదీకరణం చెందిన వారి జాతి పిండాల్ని నిశ్చేతన స్థితిలో భద్రపరచి ఉండవచ్చు. అంగారక గ్రహం చాలా ఎర్రగా ఉంటుందన్న విషయం నీకు తెలిసిందే గదా! అక్కడి నేలలో ఇనుము చాలా ఎక్కువగా ఉంది. అది క్రమేపీ అక్కడి వాతావరణంలోని ఆక్సిజన్‌ను ఇంచుమించు పీల్చివేసి ఐరన్ ఆక్సయిడ్‌గా మారిపోయింది. ఈ కారణం చేత అక్కడ జీవకోటి అంతరించి ఉండవచ్చని నా అనుమానం'' అన్నాడు ఆనంద్.

"ఏమైనా కొద్ది రోజుల్లోనే ఈ విషమ సమస్య విడివడుతుందిగా లెటజ్ వెయిట్ అండ్‌సీ'' అంది గీత.

"మరో ముఖ్య విషయం. ఈ విషయం ఎవ్వరికీ చెప్పొద్దు. మన ప్రయోగం విఫలం అయితే మనల్ని ఫూల్స్ క్రింద జమకట్టారు అందరూ. ఫలప్రదం అయిందా మోస్ట్-సెన్సేషనల్ న్యూస్‌క్రింద విడుదల చేయవచ్చు'' అని హెచ్చరించాడు ఆనంద్.

"అవును ఆ విషయం నాకుమాత్రం తెలీదా'' అంటూ సెలవు తీసుకొని వెళ్ళిపోయింది గీత.

* * * *

మర్నాడు అనుకోకుండా ఆఫీస్ డ్యూటీ మీద ఢిల్లీ వెళ్ళవలసి వచ్చింది గీతకి. తిరిగి వచ్చేసరికి పది రోజులుపట్టింది. అన్నాళ్ళూ ముళ్ళ మీద కూర్చున్నట్లే గడిపింది ఆమె. ఎక్కడున్నా ఆమె ఆలోచనలన్నీ ఆనంద్ జరుపుతున్న పరిశోధన మీదనే ఉన్నాయి. ఎప్పుడెప్పుడు వెళ్ళి ఆ జీవం ఏ విధంగా రూపొందిందో చూడాలన్న ఆరాటం ఆమెలో ప్రబలింది. తిరిగి రాగానే తిన్నగా ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళింది. అప్పటికి రాత్రి ఎనిమిది గంటలు అయింది. మామూలుగా ఆ సమయంలో అక్కడ ఎవరూ ఉండరు. ఏవైనా తీవ్రమైన, అత్యవసరమైన పరిశోధనలు చేస్తుంటే మాత్రం కొందరు శాస్త్రజ్ఞులు లాబొరేటరీలో ఉంటారు. రాగానే ఆనంద్ ఇంటికి ఫోన్ చేసింది గీత. ఒంటరివాడైన అతని ఇంటినుంచి రెస్పాన్స్ రాకపోవడంతో, లాబొరేటరీలోనే ఉండి ఉంటాడని తిన్నగా అక్కడికి వెళ్ళింది గీత. అనుకున్నట్లుగానే లాబొరేటరీలో ఆనంద్ ఉండేచోట లైట్లు వెలుగుతూ కనిపించాయి. మెట్లెక్కుతూ "డాక్టర్ ఆనంద్ లోపల ఉన్నారా?'' అని చౌకీదార్‌ని అడిగింది.

"ఉన్నారమ్మా. అసలు ఆయన ఇంటికే పోవడంలేదు. ఇక్కడే ఉంటున్నారు'' అని సమాధానం చెప్పాడు చౌకీదార్.

ఉత్సాహంతో గబగబా మెట్లెక్కి వెళ్ళి లేబొరేటరీ హాల్‌లోకి ప్రవేశించింది గీత. ఆనంద్ కుర్చీలో కూర్చుని ఏదో సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు. వెనకాలే వెళ్ళి "హలో ఆనంద్" అంటూ భుజాలు పట్టుకుంది.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు ఆనంద్.

అతన్ని చూస్తూనే ఒక్కసారి భయంతో వెనుకంజ వేసింది గీత.

ఆనంద్ ముఖం బాగా పాలిపోయి ఉంది. ఒళ్ళు కూడా బాగా వడలిపోయినట్లుంది.

"ఆనంద్...ఏమిటి ఇలా ఉన్నావు?' ఆరోగ్యం బాగాలేదా?" అని అడిగింది గీత ఆందోళనగా. ఆనంద్ ఏమీ మాట్లాడలేదు. కొంచెంసేపు ఆమెవంక నిశితంగా చూస్తుండిపోయాడు.

అతను అలా చూడడం గీతకి ఏమిటోగా అనిపించింది. ముఖ్యంగా అతని కళ్ళల్లోకి చూస్తుంటే, చెప్పలేని భయం అనిపించింది. ఏదో అనాలని, ఏవో అడగాలని అనుకొని కూడా ఏమీ చేయలేక ఊరుకుండిపోయింది.

కొంచెంసేపు తేరిపార చూశాక ఆనంద్ "సారీ గీతా.... ఏమీ లేదు. ఈ ఎక్స్‌పెరిమెంట్‌తో చాలా అలిసిపోయాను. అందుకే అలా ప్రవర్తించాను. ఏమీ అనుకోకు" అన్నాడు.

"మైగాడ్. నీ అవతారం చూస్తే, నువ్వు మాట్లాడకపోయేసరికీ, ఏమైందోననీ భయపడి చచ్చాను. థాంక్‌గాడ్. ఇంతకీ నీ ఎక్స్‌పెరిమెంట్ ఏమైంది?" అని అడిగింది గీత.

"సక్సెస్‌ఫుల్. మనం ఊహించినట్లు ఆ జీవి అంగారక గ్రహానికి చెందినదే. ఆ పిండం వారం రోజులలోనే పూర్తి వ్యక్తిగా మారింది అంతేకాదు. అద్భుతమైన శక్తితో, నా మెదడులో నిక్షిప్తమైన విజ్ఞానాన్ని, ఆలోచనలను, ఆఖరికి మన భాషను కూడా త్రుటిలో గ్రహించాడు. మన భాషలో, నాతో తన చరిత్రను కూడా చెప్పాడు" అన్నాడు ఆనంద్.

"వండర్‌ఫుల్..... ఏడీ ఎక్కడున్నాడు అతను?" అంది గీత ఉత్సుకతతో.

"ప్రస్తుతం ఇక్కడలేడు. వివరాలన్నీ రేపు చెప్తాను" అన్నాడు ఆనంద్.

"పోనీ...అతని కథ ఏదో చెప్పాడన్నావు. అదైనా చెప్తావా?" అంది గీత కొంత నిరుత్సాహంతో.

"అలాగే. కొన్ని కోట్ల సంవత్సరాల క్రిందట మన భూమీ, అంగారకుడూ కలిసే ఉండేవట. అప్పుడు ఈ బృహద్గోళం మీద ఎంతో గొప్ప పరిణామం చెందిన నాగరికత గల మనుషులు ఉండేవారట. ఒకసారి ఈ గోళగర్భంలో బ్రహ్మాండమైన ప్రేలుడు సంభవించి ఒక ముక్క అంతరిక్షంలోకి విసిరివేయబడిందట. అదే అంగారక గ్రహంగా మారిందట. మన శాస్త్రజ్ఞులు కొంతమంది భూమీ, అంగారకుడూ, చంద్రుడూ ఒకప్పుడు కలిసి ఉండేవని భావించారు. భూమికీ, అంగారకుడికీ దిన పరిమాణం ఒక్కటే. ఇంకా ఎన్నో పోలికలూ ఉన్నాయి. ఈ ఊహ నిజమేనని ఆ అంగారక గ్రహజీవి చెప్పిన మాటలు ధ్రువపరుస్తున్నాయి"

"నువ్విలా అంటుంటే నాకో విషయం గుర్తుకి వస్తోంది మనం చదివే నవగ్రహస్తోత్రంలో అంగారకుని భూమి గర్భ సంభూతం" అనీ "భౌమ్య" అనీ "కుజుడు" అనీ పేర్కొనడం జరిగింది. ఈ మాటల అర్థం అంగారకుడు భూమినుంచి ఉద్భవించాడని. అంటే ప్రాచీన భారతీయులకి ఈ విషయం తెలుసన్న [illegible] అంది గీత.

"ప్రాచీన భారతీయులు చెప్పిన ఎన్నో విషయాలు ఈనాటి శాస్త్రజ్ఞులు కనుగొంటూనేఉన్నారు".

"అది సరే. ఆ గ్రహ వాసి ఇంకేమి చెప్పాడు?"

"అదే చెప్పొస్తున్నాను. భూగర్భంలో కరిగిన ఇనుము ఎక్కువ ఉంటుందని నీకు తెల్సుగా భూగర్భంలో ప్రేలుడు సంభవించి అంగారకుడు విడిపోయినప్పుడు, ఈ ఇనుము చాలా పెద్ద మొత్తంలో అంగారక గ్రహం మీద పడింది. క్రమేపీ, ఈ ఇనుము గ్రహంపైన బాగా వ్యాపించింది. అది గాలిలో ఉన్న నీటి ఆవిరిమూలంగా, వాతావరణంలోని ఆక్సిజన్‌ను క్రమక్రమంగా పీల్చి వేయసాగింది. చివరికి అంగారక గ్రహం నివాసయోగ్యం కాకుండా పోయింది. అక్కడ ఉన్న సకల జీవజాలమూ నశించింది. ప్రకృతి సహజమైన మార్పుల మూలంగా కొన్ని కోట్ల సంవత్సరాలకి వాటి అవశేషాలు కూడా పైకి కనిపించకుండా పోయాయి. అంగారకుని నేలలో తగు మాత్రం తవ్వితే అక్కడ జీవావశేషాలే కాకుండా అప్పటి వారి నగరాలను, నిర్మాణాలను కూడా కనుగొనవచ్చు. రానున్న ప్రమాదాన్ని గుర్తించిన అక్కడి శాస్త్రజ్ఞులు వారి జాతి ఫెర్టిలైజ్డ్ ఎగ్స్‌ను ఈ విధంగా భద్రపరిచారు. భూమివంటి అనుకూల పరిస్థితులు ఉండే గ్రహాల మీద, వాటికి స్పందన కల్పిస్తే తిరిగి వారి జాతి వృద్ధిచెందగలదన్నమాట."

"ఒక్క విషయం. ఇంతటి అద్భుతమైన వైజ్ఞానిక ప్రగతిని సాధించిన అంగారక గ్రహవాసులు, ఇతర గ్రహాల మీదికి వలసపోయివుండవచ్చుగా?"

"ఆ విషయం కూడా చెప్పాడు అతను. ఒకప్పుడు అంగారకుడికీ, బృహస్పతికీ మధ్య ఒక పెద్ద గ్రహం ఉండేదట భూమి వంటి పరిస్థితులు కలిగిన ఆ గ్రహం మీదకి అక్కడివారు వలసపోయారట. అయితే వారి నాగరికత, విజ్ఞానం వెర్రితలలు వేయడంతో విభిన్నవర్గాల మధ్య ద్వేషాసూయలు ప్రబలడంతో, పరస్పరం అణుబాంబులు ప్రయోగించుకోవడంతో, ఆ గ్రహం ముక్కలు ముక్కలుగా ప్రేలిపోయి, వారి నాగరికత, జాతి అంతరించాయట.

"అరే. ఈ విషయం మన ఖగోళ శాస్త్రజ్ఞులు కూడా అంటున్నదే. ఒక్కప్పుడు అంగారక, గురుగ్రహాల మధ్య ఉండిన ఒకగ్రహం ముక్కలు అయిపోయి ఆస్టిరాయిడ్స్ అని మనం పిలిచే అల్పగ్రహాలుగా మారిపోయిందని, బోడ్‌వంటి శాస్త్రజ్ఞులు శాస్త్రీయంగా నిరూపించారు. అయితే ఈ నాగరికత విషయం ఎవరికీ తెలియదు".

"సరిగ్గా చెప్పావు. ఇప్పుడీ వ్యక్తి చెప్పకపోతే మనకి తెలిసేది కాదు. వారు అద్భుతమైన వైజ్ఞానిక ప్రగతిని సాధించడంతో, ఇతరుల విజ్ఞానాన్ని, భాషలను కేవలం మేధాశక్తి తరంగాల మార్పిడి మూలంగా గ్రహించగలిగే ప్రక్రియను కనుగొన్నారు. అందుకే అతను నాకీ విషయాలన్నీ మన భాషలో చెప్పగలిగాడు.

"ఆ అద్భుత వ్యక్తిని చూడాలని నాకు ఎంతో ఆరాటంగా ఉంది అంది గీత.

"సరే. చూద్దుగాని. ఉండు ఇప్పుడే వస్తాను" అంటూ దగ్గర్లో వున్న ఒక గదిలోకి వెళ్ళాడు ఆనంద్. మరో ఐదు నిమిషాలలో బరువైన ఒక బస్తాను భుజాల మీద పెట్టుకొని బయటకు వచ్చాడు.

ఆశ్చర్యంతోనూ, చెప్పలేని ఆందోళనతోనూ, తెలియని భయంతోనూ ఆ మూటవైపు చూసింది గీత.

"ఏం .అంగారక గ్రహవాసిని చంపి ఈ బస్తాలో వేసి తెచ్చాననుకొన్నావా?" అంటూ చిలిపిగా నవ్వాడు ఆనంద్. ఆ సమయంలో అతని నవ్వుకూడా గీతకి భయాన్ని కల్పించింది. ఆమె ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది.

"అదేం కాదు. ఆ అంగారక గ్రహవాసి ఇక్కడ లేడు. మరోచోట ఉన్నాడు. మనం ఇప్పుడు అక్కడికే వెళ్తున్నాం. ఈ సంచీలో కొన్ని పరికరాలు ఉన్నాయి" అంటూ ముందుకు సాగాడు ఆనంద్.

మౌనంగా అతనిని అనుసరించింది గీత.

గారేజ్ దగ్గరకు వెళ్ళి మూటని క్రిందకు దింపాడు ఆనంద్. లోపల్నుంచి కారును బయటకు తీసుకు వచ్చాడు. డిక్కీ తెరిచి అందులో ఆ మూటను ఉంచాడు. తాను లోపల స్టీరింగ్ దగ్గర కూర్చుని, "కమాన్" అని గీతను పిలిచాడు. తలుపు తెరిచి గీత వెళ్ళి అతని ప్రక్కనే కూర్చుంది.

కారు జోరుగా సాగిపోతోంది.ఏవేవో ఆలోచనలతో మనసు నిమగ్నమై ఉన్న గీత ఏమీ మాట్లాడకుండా కూర్చుంది. మధ్య మధ్య ఆనంద్ తనవంక నిశితంగా ఓరచూపులు చూస్తుండడం గమనించింది.

కొంచెం సేపట్లో ఆనంద్ కారు ఊరిపొలిమేరలు దాటింది.

"ఆనంద్...మనం ఎక్కడికి వెళ్తున్నాం?"అంది గీత తెలియని భయంతో.

"నువ్వు ఇంతకు ముందెప్పుడూ చూడని చోటికి వెళ్తున్నాం. ఎక్కడికో ఇప్పుడే చెప్పేస్తే ఎలా? కొంచెం సస్పెన్స్ ఉండొద్దూ?" అంటూ కారు వేగం పెంచాడు.

ఆనంద్ సాధారణంగా గంభీరంగా ఉంటాడు. సరదాగా మాట్లాడేటప్పుడు కూడా సూటిగా మాట్లాడుతాడు. పరిశోధన ఫలించిందన్న ఉత్సాహంతోనో యేమో, ఈ రోజు సస్పెన్స్ మొదలుపెట్టాడు.

అతను ఆ విధంగా మాట్లాడడం గీతకు నచ్చలేదు. నిశ్శబ్దంగా ఉండిపోయింది. మరో అరగంటలో కారు రోడ్డుకి కొంచెం దూరంలో ఉన్న ఒక పాడుబడ్డ బంగాళా ముందు ఆగింది. ఆనంద్ దిగి మెట్లెక్కి తలుపుకి ఉన్న తాళం తీయసాగాడు.

గీత ఒక్కసారి నలువైపులా కలియజూసింది. ఎటుచూసినా నిర్మానుష్యం. చుట్టుప్రక్కల కనుచూపు మేరలో ఒక్క గుడిసె కూడా లేదు. కీచురాళ్ళ అరుపులు. ఆ వాతావరణం, పరిసరాలు ఆమె గుండెల్ని అవియజేస్తున్నాయి. అయితే అది వెన్నెల రాత్రి కావడంతో కొంతలో కొంతనయంగా ఉంది. తెలియని భయం ఆమెని ఆవహించింది. అయితే ఆనంద్ దగ్గరే వున్నందుకు కొంత ధైర్యం తెచ్చుకుంది.

ఆనంద్ టార్చిలైట్ సాయంతో తాళం తీసి తిరిగి కారు దగ్గరకు వచ్చాడు. డిక్కీని తెరిచి అందులోని మూటని బయటకు తీశాడు. డిక్కీని తిరిగి మూసి, ఆ మూటని భుజానికి యెత్తుకుని "రా...లోపలికి" అంటూ ముందుకి సాగాడు.

భయం భయంగా, మౌనంగా అతన్ని అనుసరించింది గీత.

లోపలికి వెళ్ళాక భయంతో పిడచకట్టుకుపోయిన నాలుకతో "ఆనంద్ ఏమిటిదంతా? మనం ...ఎక్కడున్నాం?" అంది గీత.

"భయపడకు. ఇదీ నా లేబొరేటరీయే. అంగారక గ్రహవాసి అక్కడ ఉంటే ఇతరుల కంటపడ్తాడని, ఇక్కడికి మార్చాను. అతన్ని చూద్దుగానిరా పైగా నీకు ఎన్నో విషయాలు చెప్పాలి" అంటూ ఆమె చేయి పుచ్చుకొని నడవసాగాడు.

ఎప్పుడూ అతని స్పర్శతో పులకరించే గీతకి, ఆ క్షణంలో అతని స్పర్శ భరించలేనిదిగా అనిపించింది. వంటి మీద వందలాది గొంగళి పురుగులు పాకుతున్నట్లనిపించింది. పైకి ఏమీ అనలేక ఆవేదనను మూగగా భరించింది.

ఉన్నట్లుండి ఆనంద్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. అకస్మాత్తుగా అతను గీతను ప్రక్కనే ఉన్న స్తంభానికి అదిమిపట్టి, అక్కడే వున్న త్రాడుతో ఆ స్తంభానికి కట్టేశాడు.

భయంతో గీత పై ప్రాణాలు పైనే పోయాయి. అమిత భయంతో అరవలేకపోయింది. కాళ్ళుచేతులూ కదపలేకపోయింది.

"భయంగా ఉంది కదూ ఇదీ 'సస్పెన్స్'లో భాగమే" అంటూ ఆమెవంక నిశితంగా చూశాడు ఆనంద్.

అతని చూపులను భరించలేకపోయింది గీత. ఆ కళ్ళు చూస్తుంటే ఏదో పాతాళలోకపు లోతులు కనిపిస్తున్నాయి. ఆ కళ్ళల్లో ఎప్పుడూ వుండే ప్రేమ, అనురాగం లేవు. క్రౌర్యం, ఆవేశం గూడుకట్టుకొని ఉన్నాయి.

"ఇలాగే ఉండు. ఇప్పుడే వస్తాను" అంటూ టార్చితో దారి చూసుకొంటూ వడివడిగా ఆ మూటను ఈడ్చుకుంటూ దూరంగా వున్న ఒక గదిలోకి తీసుకువెళ్ళాడు. ఆ తర్వాత కొంచెం సేపటికి బయటకు వచ్చి తలుపుకి గొళ్ళెం పెట్టాడు. వడివడిగా నడుచుకుంటూ, గీత వైపు విషపు నవ్వుతో చూస్తూ బయటకు వెళ్ళిపోయాడు. బయట తలుపుకి తాళం వేసినట్లూ, ఆ తర్వాత కారులో వెళ్లినట్లూ శబ్దాలు వినిపించాయి.

అప్పటికి కొంచెం తేరుకొంది గీత. ఆనంద్ ప్రవర్తన ఆమెకి ఏమీ అర్థం కాలేదు. కొంపతీసి అంగారక గ్రహవాసి అతన్ని హిప్నటైజ్ చేయలేదుకదా? అనిపించింది. ఆ ఆలోచన రావడంతో ఆమె శరీరం భయంతో గజగజ వణికిపోయింది. ఈ పరిస్థితిలో ఆనంద్ తనని ఏమి చెయ్యదలుచుకున్నాడో, ఏమి చేస్తాడోనని బెదిరిపోయింది. ముందు ఇక్కడ నుంచి బయటపడాలనుకుంది. కాని ఎలా?

ఆనంద్ గీతను చేతులమీదుగా త్రాటిని పోనిచ్చి స్తంభానికి గట్టిగా కట్టి ఉంచాడు. చేతులు అటూ ఇటూ కదలగలుగుతున్నాయేకాని, ముడి స్తంభంవెనుకవైపున ఉండడంతో, దానిని విప్పడం అసాధ్యం. తాడు గట్టిగా ఉండడంతో చేతుల్ని కదిపి, ఒళ్ళు విదిలించి తెంపడం కూడా అసాధ్యం.

ఏమి చేయాలో అని ఆలోచిస్తున్న గీత మస్తిష్కంలో ఒక ఆలోచన మెరిసింది. ఆమె కోటుజేబులో లైటర్ ఉంది. లేబొరేటరీలో ఎక్స్‌పెరిమెంట్స్ చేసేటప్పుడు తరచుగా బర్నర్స్ వెలిగించవలసి రావడం పరిపాటి. అందువల్ల వీలుగా ఉండడం కోసం సైంటిస్టులు తమ ఓవరాల్ పాకెట్‌లో లైటర్‌ను ఉంచుకుంటుంటారు. లైటర్ సంగతి జ్ఞాపకానికి రాగానే ఆమె దానిని తీసి వెలిగించి తనని కట్టి వేసిన తాడు క్రింద ఉంచింది. నిమిషంలో ఆ త్రాడు కాలి తెగిపోయింది. గీత కట్లు విప్పుకుంది. బయట

గుమ్మం దగ్గరికి పరిగెత్తింది. తలుపు లాగితే రాలేదు. ఆనంద్ బయట తాళం వేసుకొని వెళ్ళిన విషయం జ్ఞాపకం వచ్చింది. "ఈ దయ్యాల కొంపలోంచి బయట పడడం ఎలాగా?" అని ఆలోచిస్తున్న గీతకి, ఆనంద్ తన వెంట తెచ్చిన మూట విషయం జ్ఞప్తికి వచ్చింది.

"అందులో ఏముండి ఉంటుంది? ఆ అంగారక గ్రహవాసి చచ్చిపోతేనో, లేక అతన్ని చంపో, ఆనంద్ ఆ మూటలో పెట్టలేదు కదా? ఆ మూటలో ఏదో పరికరాలు ఉన్నాయని అతను అన్నమాట ఆమెకి నిజం అనిపించలేదు. అప్పటివరకూ ఆ అంగారక గ్రహవాసిని తనకు చూపించకపోవడం ఆమె అనుమానాల్ని బలపరిచింది. ఎలాగో బయటకిపోయేది లేదు కనుక, ఆ మూట రహస్యం ఏదో తెల్సుకోవాలనుకుంది.

లైటర్ సహాయంతో దారి చూసుకుంటూ ఆనంద్ మూటను తీసుకుని వెళ్ళిన వైపుకి వెళ్ళింది గీత. ఆ మూలగా ఒక చిన్న గది, దాని తలుపులకు గొళ్ళెం పెట్టి ఉండడం కనిపించింది. నెమ్మదిగా ఆ గొళ్ళెం తీసి ఆ గదిలోకి ప్రవేశించింది. గదిలో ఏమీ కనిపించలేదు. తాను వేరే గదిలోకి వచ్చిందేమో ననుకుంటూ మళ్ళీ గదంతా కలియజూసింది. ఒక మూల నేలమీద మూత కనిపించాయి. వెంటనే అక్కడికి వెళ్ళి ఆ మూతని పైకెత్తింది. క్రింద సెల్లార్, దానిలోనికి పోడానికి మెట్లు కనిపించింది. మెట్లు దిగి లైటర్ వెలుగులో నలువైపులా చూసింది. ఎదురుగుండా కనిపించిన దృశ్యం చూసి కొయ్యబారిపోయింది.

ఎదురుగుండా ఒక స్తంభానికి ఆనంద్ త్రాటితో కట్టబడి వున్నాడు. స్పృహ కోల్పోయిన స్థితిలో అతని తల ప్రక్కకి వాలిపోయి ఉంది.

"ఇదేమిటి? ఆనంద్ ఇప్పుడేగా బయటికి వెళ్ళాడు. ఇంతలో అతన్ని ఎవరు ఈ స్థితిలో ఇక్కడ పడేశారు?" అని ఆశ్చర్యపోయింది. అసలు ఇతను ఆనందేనా అన్న అనుమానం వచ్చి నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసింది. అతనికి కొంచెం ప్రక్కగా లేబొరేటరీ నుంచి ఆనంద్ మోసుకొచ్చిన సంచీ ఖాళీగా పడి ఉంది.

"అయితే ఆ సంచీలో తెచ్చింది ఇతన్నన్నమాట అయితే అతను ఎవరు? నకిలీ ఆనందా? అలాగయితే ఎవరు అసలు? ఎవరు నకలు?"-లేబొరేటరీలో ఆ సాయంత్రం కలిసినప్పటినుంచి, ఇక్కడికి వచ్చేవరకూ తన వెంట వచ్చిన ఆనంద్ ప్రవర్తన జ్ఞాపకానికి వచ్చింది గీతకి అతనే నకిలీ ఆనంద్ అయ్యుండాలి. ఇక్కడ వున్న వాడు నిజమైన ఆనంద్ అయి ఉండాలి. అనుమాన నివృత్తి కోసం అతని దగ్గరకు వెళ్ళి కదుపుతూ "ఆనంద్... ఆనంద్" అంటూ పిలిచింది.

ఆనంద్‌కి శ్వాస ఆడుతూనే ఉంది. కాని స్పృహలో లేదు.

గీతకి ఎప్పుడూ దగ్గర ఇన్‌హేలర్ ఉంచుకొని మధ్య మధ్య పీలుస్తుండడం అలవాటు. వెంటనే ఇన్‌హేలర్ తీసి ఆనంద్ ముక్కు దగ్గర పెట్టింది.

కొంచెం సేపట్లోనే ఆనంద్‌కి తెలివి వచ్చింది. గీతను చూసి "గీతా నువ్వా...ఇక్కడున్నావా? వాడు నిన్నేం చెయ్యలేదుకదా?" అన్నాడు.

అతని కళ్ళలోకి సూటిగా చూసింది గీత. "సందేహంలేదు. ఇతనే నిజమైన ఆనంద్" అనుకుంది.

''మాటలు తర్వాత ముందు మనం ఇక్కడినుంచి బయట పడాలి'' అంటూ ఆనంద్ కట్లు విప్పింది.

ఇద్దరూ మెట్లెక్కబోతుండగా పైన అడుగుల చప్పుడు వినిపించింది.

"వాడొస్తున్నట్లున్నాడు పద. ఈ ప్రక్కన దాక్కుందాం" అంటూ ఆ గదికి ప్రక్కవున్న ఒక హాలులోకి దారి తీశాడు ఆనంద్ గీత చేయిపుచ్చుకొని.

ఆ హాలులో గోడవారగా వెదురుబుట్టలలో యాసిడ్ సీసాలు ఉన్నాయి. వాటి వారగా నిలబడ్డారు వాళ్ళిద్దరూ. లైటర్‌ను ఆర్పేసింది గీత.

సెల్లార్ గదిలో ఒక వ్యక్తి తిరగాడుతున్న శబ్దం, టార్చి కాంతి అటూ ఇటూ ప్రవర్తిస్తున్న దృశ్యం ఆ నకిలీ ఆనంద్, అసలు ఆనంద్ కోసం వెతుకుతున్నట్లు చెప్తున్నాయి.

కొంచెం చేపట్లో ఆ వ్యక్తి వారు దాగున్న హాలులోకి వచ్చాడు. టార్చిలైట్‌ను అన్నివైపులకీ ప్రసరించాడు. గోడ మీద పడి ప్రతిఫలించిన స్వల్పకాంతిలోనే నకిలీ ఆనంద్ ముఖం అతి భీకరంగా కనిపిస్తోంది. ఇప్పుడు అతనికి ఆనంద్ రూపం లేదు. ఔట్‌లైన్ మానవ రూపాన్ని పోలివున్నా, ఆకారం మాత్రం ఏదో వింతగా ఉంది.

వాళ్ళిద్దరూ అతని కంట పడనే పడ్డారు. ''ఓ ఇక్కడున్నారా? గీతా... నువ్వు విడిపించుకోవడమే కాకుండా ఆనంద్‌ని కూడా విడిపించావన్నమాట. బాగుంది. కాని ఇప్పుడెక్కడకి పోతారు?'' అంటూ వారి వైపు రాసాగింది ఆ ఆకారం.

'రాకు...అక్కడే ఉండు'' అని గట్టిగా అరిచాడు ఆనంద్.

అయినా అతను ముందుకు వస్తూనే ఉన్నాడు. ఏం చేయాలో, ఎలా తప్పించుకోవాలో అర్థం కాలేదు అతనికి. అతని దగ్గర ఏవిధమైన ఆయుధం లేదు. దగ్గర్లో కనీసం ఒక కర్రన్నాలేదు.

ఆ ఆకారం దగ్గరకి వచ్చేసింది. కనివెళ్ళగక్కుతున్న చూపులతో వాళ్ళిద్దర్నీ పట్టుకోడానికి చేతులు సాచింది.

భయంతో అటూ ఇటూ చూశాడు ఆనంద్. అకస్మాత్తుగా ఆనంద్ మస్తిష్కంలో ఒక మెరుపు మెరిసింది. ప్రక్కనే వున్న ఆసిడ్ సీసాను బలంగా ఆ వ్యక్తిమీదకు విసిరాడు. సీసా క్రిందపడి పగిలియాసిడ్ వలికి ఆ వ్యక్తిముందు ప్రవహించసాగింది. పొగలుకక్కుతున్న నైట్రిక్ ఆసిడ్ వాసనతో హాలు నిండిపోయింది.

ఆ యాసిడ్ ఆ వ్యక్తి పాదాలకు తగిలిందో లేదో, అతను వెర్రికేక వేసి కుప్పగా కూలిపోయాడు. ఏమి జరిగిందోనని లైటర్ వెలిగించింది గీత.

ఆ వ్యక్తి శరీరం చూస్తూండగా యాసిడ్‌లో కరిగిపోయింది.

వెంటనే పరుగు పరుగున ఆ ఇంట్లో నుంచి బయటపడి స్వచ్ఛమైన చల్లని గాలిని పీల్చుకోసాగారు. ఆ తర్వాత కారులో తన ఇంటికి బయలుదేరాడు ఆనంద్.

ఇంటికి వెళ్ళాక జరిగిందంతా వివరంగా చెప్పాడు ఆనంద్.

''అంగారక గ్రహం మీద ఆకర్షణశక్తి భూమ్యాకర్షణ శక్తికంటే బాగా తక్కువ. వాతావరణం కూడా బాగా తక్కువే. ఈ కారణాలచేత అక్కడి జీవుల పెరుగుదల అతివేగంగా జరుగుతుంది. దీనికితోడు

ఏనాటికైనా తమ జాతి తిరిగి వృద్ధిచెందాలన్న దృఢదీక్షతో, అద్భుతమైన వైజ్ఞానిక ప్రగతిని సాధించిన అంగారక గ్రహవాసులు తమజాతి సజీవ అండాన్ని నిద్రాణస్థితిలో భద్రపరచగలగడమే కాక, మందుల సారాన్ని మనం కాప్స్యూల్స్‌లో నింపినట్లు, వారి జాతి జీవలక్షణాలనూ, విజ్ఞానాన్ని కూడా, ఈ అండంలోని జీన్స్‌లో సంకేతాల రూపంలో ఉంచగలిగారు. దీనివల్ల ఏమవుతుందంటే, అనుకూల పరిస్థితులలో ఆ అండం అతిత్వరలో పూర్తి ఆకారాన్ని పొందడమే కాక విజ్ఞానాన్ని జీర్ణించుకున్న పరిపూర్ణ అంగారక గ్రహవాసిగా మారగలదు. ప్రతి మనిషి మస్తిష్కం నుంచీ, జీవ విద్యుత్ తరంగాలు వెలువడుతుంటాయి. మెదడులో ఆలోచనలు, జ్ఞాపకాలు, తెలివితేటలు ఇవన్నీ సంకేతాల రూపంలో ఉంటాయి. వెలువడినప్పుడు తరంగాల రూపంలో బయటికి వస్తాయి. ఈ తరంగాలను తమ మెదడుద్వారా గ్రహించి ఎదుటివారి విజ్ఞానాన్ని జ్ఞాపకాలనీ, ఆలోచనలనీ గ్రహించగల నేర్పు ఈ గ్రహవాసులకి ఉంది. మరో విషయం ఈ అంగారక గ్రహవాసుల దేహనిర్మాణం పూర్తిగా సెల్యూలోజ్‌తో జరిగింది. సెల్యూలోజ్‌కి వున్న ప్రత్యేకత ఏమిటంటే ఇది ఏ రూపాన్నయినా పొందగలదు. ఏ జీవపదార్థంతోనైనా కలిసిపోగలదు.

వారం రోజులలోనే ఈ అండం పూర్తి ఆకారం చెందిన అంగారక గ్రహవాసిగా మారింది. అప్పుడు అతనికి ఉన్న రూపం, ముందు మనం చూసినట్లుగానే ఉంది. ఎప్పుడైతే అతను పరిపూర్ణుడై చైతన్యాన్ని పొందాడో నా మెదడులోవున్న ఆలోచనలనీ, విజ్ఞానాన్నీ, ఆఖరికి మనభాషనీ కూడా గ్రహించేశాడు. నాతో మాట్లాడాడు. తన కథ అంతా చెప్పాడు. తన జాతిని తిరిగి వృద్ధి చేయాలని తనకున్న సంకల్పాన్ని తెలియజేశాడు. అదెలా సాధ్యం అని నేనడిగిన దానికి రెండు మార్గాలు చెప్పాడు. వారికీ మన మనుష్యులకీ వున్న స్వారూప్యం వల్ల, మన స్త్రీలద్వారా సంతానాన్ని కని వృద్ధిచేయడం ఒకటి. అది వీలుకాకపోతే తన శరీరం నుంచే స్త్రీ అండాలనీ, పురుష బీజాలనీ ఉత్పత్తి చేసి వాటి సంయోగం ద్వారా సంతానాన్ని కని వృద్ధి చేయడం రెండోది. మన జీవ శాస్త్రజ్ఞుల ఊహ ప్రకారం కూడా ఇది సాధ్యమైనట్టిదే. అయితే ప్రస్తుత అంగారక గ్రహం వారికి నివాసయోగ్యంకాదు. వారు వలనపోయిన గ్రహం ముక్కలయిపోయింది. సౌరమండలంలో మరి ఏ ఇతర గ్రహమూ వారికి అనువైనది కాదు. అందువల్ల మన భూమి మీదనే వారి జాతిని వృద్ధి చేయాలన్న ఆలోచన ఉన్నట్లు తెలిపాడు"

"మరి అతనికి నీరూపం ఎలా వచ్చింది? నిన్నూ నన్నూ చంపాలని ఎందుకు చూశాడు?" అంది గీత.

"అదే చెప్తున్నాను. సెల్యులోజ్‌కి ఏ రూపాన్నయినా పొందేశక్తి ఉందని చెప్పాను గదా. అందుకే సులువుగా నా రూపం పొందగలిగాడు. ఇలా చేయడం వల్ల ఒక మానవజాతి మనిషిగా, ఎవరికీ అనుమానం లేకుండా తిరుగుతూ మన విజ్ఞానాన్ని గ్రహించేయవచ్చు. నా మెదడులోని విజ్ఞానాన్ని ఆ విధంగా గ్రహించి నిన్ను గుర్తుపట్టగలిగాడు కూడా. అంటే నా జ్ఞాపకాలను తాను గ్రహించాడన్న మాట. అయితే నాలోని జ్ఞానాన్ని పూర్తిగా గ్రహించడం లేబరేటరీలో సాధ్యంకాదు కనుక నన్ను ఇక్కడికి తీసుకువచ్చాడు.

"మరి ఈ ప్రదేశం గురించి అతనికి ఏమి తెలుసు? ఎలా తెలుసు?" అంది గీత.

"ఆ విషయాలను కూడా నా జ్ఞాపకాలనుంచే గ్రహించాడు. ఇక్కడ ఒకప్పుడు యాసిడ్ ఫ్యాక్టరీ ఉండేది. తర్వాత ఈ కంపెనీ దివాలా తీయడంతో, కోర్టువారు దీనికి సీలువేశారు. ఆ కేసు ఎన్ని సంవత్సరాలకీ

తెగకపోవడంతో, ఇది దయ్యాల కొంపగా మారిపోయింది. సెల్లార్‌లో వున్న యాసిడ్ సీసాలను ఎవరూ గమనించలేదేమో అలాగే ఉండిపోయాయి. అసలు సెల్లార్ ఉన్నట్లే ఎవరూ గమనించి ఉండరు. పైభాగంలో ఉన్న సామాన్లను ఎవరికి అందినవి వారు పట్టుకుపోయారు. ఈ కొంప పాడు బడ్డంతో ఇక్కడికి ఎవరూ రావడం మానేశారు. ఇటువంటి నిర్మానుష్యమైన చోట నా పరిశోధనలు బాగా జరుగుతాయి అనుకుంటుండేవాడిని. ఆ ఆలోచనలను గ్రహించి ఈ ప్రదేశాన్ని ఎన్నుకున్నాడు అతను.

"ఎప్పుడైతే తమజాతిని వృద్ధి చేయాలనుకున్నాడో, వెంటనే నా రూపం పొంది, నన్ను అశక్తుని చేసి బస్తాలోవేసి ఇక్కడి తీసుకువచ్చాడు. నీ మీద నాకు ప్రేమ ఉండడంతో ఆ ఆలోచనల్ని గ్రహించి, నిన్ను ప్రేమించి, నీద్వారా తన జాతిని వృద్ధి చేయాలనుకున్నాడు. నాలోని విజ్ఞానాన్ని పూర్తిగా గ్రహించాక నన్ను, ఈ ప్రపంచంలోని మానవజాతిని అంతటినీ అంతంచేసి, వారి జాతిని ఇక్కడ అభివృద్ధి చేయాలనుకున్నాడు".

"అయితే నిన్నూ, నన్నూ అక్కడ కట్టి పడేసి, ఎక్కడికో ఎందుకు వెళ్ళాడు!"

"నేననుకోడం అతను మళ్ళీ లేబొరేటరీకే వెళ్ళాడు.

అంగారక శిలలో ఇంకా మూడు భరిణలు నాకు కనిపించాయి. వాటిని, కొన్ని పరికరాలను ఇక్కడికి తెచ్చి మిగిలిన వారికి చైతన్యం కలిగించాలనుకొని ఉంటాడు. అతను ఈ స్థలాన్ని ఎన్నుకోవడం మనకి వరప్రసాదమైంది. సెల్యూలోజ్‌కి వున్న మరో లక్షణం, అది వెంటనే యాసిడ్‌లో కరిగిపోతుంది. అది తెలిసి అతనిమీద యాసిడ్ పొయడంతో, అతను కరిగిపోయాడు" అంటూ ముగించాడు ఆనంద్.

"మైగాడ్! ఎంతటి డ్రెడ్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్! ఈ విషయం మనం ప్రకటిద్దామా?" అంది గీత.

"లాభం లేదు. మనం చెప్పేదాన్ని నిరూపించడానికి ఋజువు లేవీలేవు. అందువల్ల ఇది కట్టుకథ అని కొట్టిపారేస్తారే కాని ఎవరూ నమ్మరు" అన్నాడు ఆనంద్.

"పోనీలే. ఈ అనుభవం మనిద్దరికే ప్రత్యేకం. సీసాలో బిగిసివున్న దయ్యాన్ని బయటకు తీశావు. ఎలాగైతేనే దాన్ని తిరిగి భూస్థాపితం చేశావు. నువ్వే నిజమైన హీరోవి" అంది గీత.

"నేను హీరో అయితే, నువ్వు హీరోయిన్‌వి." అంటూ ఆప్యాయంగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు ఆనంద్.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, అక్టోబర్ 1984** ✪

# మనిషిలో మనిషి

"డాక్టర్... ఎలా వుంది మా రవికి?" - ఆందోళనతో అడిగాడు సేర్ భజరంగ్ ప్రసాద్. కళ్ళంబట రాలబోతున్న అశ్రువులను బలవంతాన అణుచుకుంటున్నాడు ఆయన.

"చూడండి... యాక్సిడెంట్ చాలా పెద్దది. తలకి బలమైన గాయం కావడంతో మెదడు బాగా దెబ్బతింది." అన్నాడు సర్జికల్ స్పెషలిస్ట్ డాక్టర్ జగన్నాథ్.

"అయితే మా రవికి ఏం ప్రమాదం లేదు కదా! వాడు మా ఒక్కగానొక్క కొడుకు డాక్టర్‌గారూ వాడికేమైనా అయితే మేము భరించలేం. ఎంత డబ్బైనా సరే వాడిని బాగుచేయండి డాక్టర్"- దీనంగా డాక్టర్ గారి చేతులు పట్టుకుని వేడుకున్నాడు భజరంగ్ ప్రసాద్.

ఒక విషాదహాసం డాక్టర్‌గారి పెదవులమీద చోటుచేసుకుంది.

"చూడండి సేర్. డబ్బుతో మనం ప్రాణాలు నిలబెట్టగలిగితే ఈ లోకంలో అసలు చావులే వుండవు. మీ అబ్బాయికి ప్రాణభయమైతే లేదుకాని..."

"కాని .... చెప్పండి డాక్టర్... ప్లీజ్"

"మెదడులో దెబ్బతిన్న భాగాన్ని తొలగించవలసి వుంటుంది. ఇది తప్పదు. ఇందువల్ల అతను చూపుకోల్పోయే ప్రమాదం వుంది. మెదడుకి ఆపరేషన్ చేయకపోతే అసలు ప్రాణానికే ముప్పు."

"డాక్టర్... అలా అనకండి డాక్టర్- వాడి చీకటి బ్రతుకు నేను ఊహించుకోలేను. మీరు ఏమైనా చేయండి డాక్టర్- వాణ్ణి ఎలాగైనా కాపాడండి." అంటూ భోరుమన్నాడు భజరంగప్రసాద్.

"చెప్పాను కదా అబ్బాయికి ప్రాణభయం లేదని. మీ అదృష్టం బాగుంటే అబ్బాయికి చూపు పోకపోవచ్చు. కాని ఒక అనుభవజ్ఞుడైన సర్జన్‌గా ఈ అవకాశం ఇంచుమించు లేదనే చెప్పగలను. ఒక బాధ్యతగల డాక్టర్‌గా మీకు బాధకలిగించే ఈ వాస్తవాన్ని చెప్పక తప్పదు."

"గుండెలు మూత్రపిండాలు కాలేయం వంటి భాగాలను మార్పిడి చేస్తున్న ఈ రోజుల్లో విజ్ఞానశాస్త్రం ...గానో అభివృద్ధిచెందిన ఈ కాలంలో బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేసి మా వాడిని కాపాడలేరా డాక్టర్!"



"సూత్రరీత్యా మెదడు మార్పిడి సాధ్యమే అయినా ఆచరణలో ఇంకా అది సాధ్యంకాలేదు. ఒకవేళ అది సాధ్యమైనా మీకేం ప్రయోజనం లేదు."

"ఎందుచేత డాక్టర్?"

"అవును. మనిషికి వ్యక్తిత్వం ఇచ్చేది మెదడే. మెదడు తీసి మెదడు పెట్టామనుకోండి. శరీరం మాత్రం అబ్బాయిది అవుతుంది. మనిషి మాత్రం ఎవరి మెదడు పెట్టామో అతనే అవుతాడు. అలాంటి వ్యక్తి మిమ్మల్ని ఎవరినీ గుర్తించను కూడా లేదు. అసలు మీ ఇంటికి సంబంధించిన జ్ఞాపకాలే వుండవు. ఆ మెదడుకి సంబంధించిన వ్యక్తి జ్ఞాపకాలే వుంటాయి. మీ వాడి కళ్ళతో తన వాళ్ళని గుర్తుపట్టాడు."

"అదెలా?"

"నిజమే. మనిషి దేహం మైక్ వంటిది. మైక్ వెనక తెలుగులో మాట్లాడితే తెలుగుమాటలు వినిపిస్తాయి. ఇంగ్లీషు మాట్లాడితే ఆ పలుకులు మైక్ లోంచి వస్తాయి. ఇలా ఏభాషలో మాట్లాడితే ఆయా భాషల మాటలు వినిపిస్తాయి. మగవారు మాట్లాడితే మగకంఠం, ఆడవారు పలికితే స్త్రీ కంఠం ఇలా ఏ వ్యక్తి మాట్లాడితే ఆ మాటలే వినిపిస్తాయి. అదే విధంగా ఏవ్యక్తి మెదడు శరీరంలో వుంటే ఆ వ్యక్తి ఆదేశాల ప్రకారమే ఆ దేహం నడుచుకుంటుంది కాని, మీ అబ్బాయిలాగా కాదు-మెదడు మార్చడం వల్ల సజీవంగా వున్న మీ అబ్బాయి రూపం మీ కళ్ళముందు వుంటుంది కాని ఆ వ్యక్తి మాత్రం మీవాడు కానేరడు."

"మైగాడ్... డాక్టర్‌గారూ...మీరు చెప్పిన మాటలు వింటుంటే నా మతిపోతోంది. ఎవరో వ్యక్తిని మావాడి రూపంలో చూసుకుంటూ, మా అబ్బాయిగా ఎలా భావించుకోగలను డాక్టర్! ఇంక మా అబ్బాయి గతి ఇంతేనా!" అంటూ వాపోయాడు భజరంగ్ ప్రసాద్.

"చూడండి. ఉన్న పరిస్థితి చెప్పాను. నిజానికి ఇప్పటికీ పూర్తిగా మెదడు మార్చిడి సాధ్యంకానేలేదు. ఒకవేళ సాధ్యమైతే పరిస్థితి ఎలా వుంటుందో చెప్పాను. అయితే మెదడులో నలభై శాతంవరకూ కూడా ట్రాన్స్‌ప్లాంట్ చేయవచ్చు. మీ అబ్బాయికి దృష్టి కనక పోతే అవసరమైన మేరకు బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేసి దృష్టిని తెప్పించవచ్చు. అందుకు నేను గ్యారంటీ ఇయ్యగలను."

"అయితే ఇంక సమస్య ఏముంది డాక్టర్?" ఆశ కళ్ళలో మెరుస్తుండగా అడిగాడు భజరంగ ప్రసాద్.

"అదిఅంత సులభంకాదు. ముందు రవి మెదడుకి ఆపరేషన్ చేయాలి. మీఅదృష్టం బాగుంటే అతనికి చూపు పోకపోవచ్చు కాని నేను ముందే చెబుతున్నట్లు ఇది ఇంచుమించు అసంభవం. ఆపరేషన్ గాయాలు మానడానికి కొన్నినెలలు పడుతుంది. ఆ తర్వాత మీ అబ్బాయికి అనువైన మెదడు దొరకాలి. అప్పుడు మాత్రమే ట్రాన్స్‌ప్లాంట్ సాధ్యమవుతుంది.

"మెదడు దొరకడం అంత సమస్యఏముంది. తెల్లారి లేస్తే ఎంత మంది చనిపోవడంలేదు. అటువంటివారి మెదడు ఏదైనా దొరకదా? ఎంత డబ్బుకావలసినా వెదజల్లుతాను."

"అక్కడే పొరబడుతున్నారు మిస్టర్ భజరంగ్. చనిపోయిన వారిమెదడు పనికి రాదు. ట్రాన్స్‌ప్లాంట్‌కి అవసరమైన మెదడు తాజాగా ఉండాలి. అంటే యాక్సిడెంటులో అకస్మాత్తుగా చనిపోయిన వారి మెదడు పనికి వస్తుంది. అదేనా చనిపోయిన ఆరుగంటలలోపల తీసి భద్రపరిస్తేనే ఆ వ్యక్తికూడ ఇంచుమించు మీవాడి వయసు కలిగి ఉండాలి. ఇవన్నీ సమకూడినపుడు విజయవంతంగా ట్రాన్స్‌ప్లాంట్ చేసి మీ అబ్బాయికి దృష్టి తెప్పించవచ్చు. ఇదంతా జరగాలంటే కనీసం నాలుగైదు నెలలు పడ్తుంది."

"అంటే అప్పటివరకూ మా రవి గుడ్డివాడుగా ఉండిపోవలిసిందేనా?"

"తప్పదు".

"ఈ లోగా ఎవరైనా ఆరోగ్యవంతుడైన కుర్రవాణ్ణి చంపించి అతని మెదడు తీసుకుంటేనో!"-- అంతటి భయంకరమైన ఆలోచన వచ్చినందుకు తనమీద తనకే అసహ్యంవేసింది భజరంగ్‌కి.

"చూడండి. టైం అవుతోంది. మీ అబ్బాయి మెదడుకి ఇప్పుడు ఆపరేషన్ చేయాలి అందుకు మీరు అనుమతిస్తూ ఈ ఫారంమీద సంతకం పెట్టాలి."

అంటూ ఒక ఫారం ముందు పెట్టాడు డాక్టర్ జగన్నాథ్.

మారు మాట్లాడకుండా దానిమీద సంతకం పెట్టాడు భజరంగ్.

డాక్టర్ జగన్నాథ్ ఆ ఫారం తీసుకుని వెంటనే పేషెంటు దగ్గరకి వెళ్ళిపోయాడు.

"మరికొంచెం సేపట్లో ఆపరేషన్ థియేటర్‌లోనికి స్ట్రెచర్ వెళ్ళింది.

వెనకాలే ఒక వైద్యుల బృందం డాక్టర్ జగన్నాథ్ ముందు నడుస్తుండగా యూనిఫాంలలో లోనికి

వెళ్లింది.

ఆపరేషన్ థియేటర్ తలుపులు మూసుకున్నాయి.

డోర్‌పైనున్న రెడ్‌బల్బ్ వెలిగింది.

ఆరు గంటల కాలం అతి భారంగా గడిచింది.

అది ఆరు యుగాలుగా అనిపించింది. బయటవున్న భజరంగ్ ప్రసాద్‌కీ, అతని వారికీ.

ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి.

స్ట్రెచర్‌మీద మెడవరకూ తెల్లని దుస్తులు కప్పిన రూపం బయటకు వచ్చింది. అచేతనంగా వున్న రవి తలకి దట్టంగా కట్లు ఉన్నాయి. స్ట్రెచర్‌ని స్పెషల్ వార్డులోకి తీసుకువెళ్తుండగా ఆత్రంగా దానిని సమీపించారు భజరంగప్రసాద్, ఆయన వాళ్ళూ.

ఓవరాల్ విప్పుకుంటూ దగ్గరకు వచ్చాడు డాక్టర్ జగన్నాథ్.

"సేఠ్‌జీ...ఆపరేషన్ క్వైట్ సక్సెస్‌ఫుల్" అన్నాడు.

"అయితే మా అబ్బాయి చూపు..."

"దాని సంగతి అప్పుడే తెలీదు.

అబ్బాయికి స్పృహవచ్చాక తెలుస్తుంది. స్పృహ రావడానికి ఇంకా ఆరుగంటలు పడ్తుంది."

"థాంక్యూ డాక్టర్... మీ ఋణం జన్మలో తీర్చుకోలేను"

"డోన్ట్‌బాదర్...గాడ్ ఈజ్ గ్రేట్.."

రవిని స్పెషల్ వార్డ్‌లోకి తీసుకెళ్ళి బెడ్‌మీద పరుండబెట్టారు. భజరంగప్రసాద్ ఆయన భార్య బెడ్‌ప్రక్కనే కూర్చున్నారు. మిగిలినవారు బయట వరండాలో కూర్చుని మధ్యమధ్య లోనికి వచ్చి చూసిపోసాగారు.

రవికోసం ప్రత్యేకంగా ఉంచిన నర్స్ తరచుగా అక్కడికి వచ్చి పేషెంటుని చూసి వెళ్తోంది.

సాయంత్రం ఆరుగంటలు కావస్తుండగా రవికి తెలివి రాసాగింది. నెమ్మదిగా అటూ ఇటూ కదలసాగాడు.

వెంటనే నర్స్ వెళ్ళి డాక్టర్ జగన్నాథ్‌కి ఈ విషయం తెలిపింది.

నిజానికి అప్పటికి ఆయన డ్యూటీ అయిపోయినా, రవికోసం ఆయన ప్రత్యేకంగా ఉండిపోయాడు. కబురు అందగానే అక్కడికి ఆయన హుటాహుటిన వచ్చాడు. రాగానే ఏదో ఇంజక్షనిచ్చాడు. మరో పది నిమిషాలలో రవికి పూర్తి తెలివి వచ్చింది. మూలుగుతూ కళ్ళు తెరిచాడు.

"అమ్మా... నేనెక్కడున్నాను" అన్నాడు హీనస్వరంతో.

"బాబూ". అంటూ భుజాలు నిమరసాగింది తల్లి.

"నాయనా- రవీ.." అంటూ ప్రక్కన కూర్చుని కొడుకు చేతిని ఆప్యాయంగా చేతిలోకి తీసుకున్నాడు భజరంగ్‌ప్రసాద్.

"అమ్మా.. నాకేం కనిపించడం లేదు. నాన్నగారూ... నా కేమైంది!" అన్నాడు రవి కళ్ళు పెద్దవి చేయ ప్రయత్నిస్తూ.

అతని తల్లిదండ్రులు దిగాలుగా డాక్టర్ జగన్నాథ్ ముఖంలోకి చూశారు.

ఒక్కసారి గొంతు సవరించుకున్నాడు డాక్టర్ జగన్నాథ్.

"చూడు మిస్టర్ రవీ. నేను డాక్టర్ జగన్నాధ్ మాట్లాడుతున్నాను. నీకు యాక్సిడెంటు అయింది కదా. ఆపరేట్ చేయవలసి వచ్చింది. ఇప్పుడేమీ ఫర్వాలేదులే. నీ గాయాలు తగ్గేవరకూ నీకు ఏమీ కనిపించదు. ఆ తర్వాత అంతా సరిగానే వుంటుంది. డోన్ట్ వర్రీ. జస్ట్ బేర్" అన్నాడు.

"అమ్మా... నేను గ్రుడ్డివాడినై పోయానా! నాన్నగారూ నేనేం చేయాలి!" అన్నాడు రవి గద్గదస్వరంతో

"ఇది నీ గాయాలు మానేవరకేనని చెప్పాను కదా. యూ ఆర్ ఎ బ్రేవ్‌మాన్. వైడుయు ఫియర్ " అంటూ రవి భుజం తట్టాడు డాక్టర్ జగన్నాథ్.

రవి ఏమీ మాట్లాడకుండా తల ప్రక్కకు తిప్పుకున్నాడు.

"ఓకే బాయ్. నేను మళ్ళీ వస్తాను. హావ్ గుడ్ రెస్టు" అంటూ సేఠ్‌జీని బయటకు రమ్మని సైగ చేశాడు డాక్టర్ జగన్నాద్. ఆయన వరండాలోకి రాగానే "చూడండి! రవి గ్రుడ్డివాడైనట్లు అతనికి ఎంత మాత్రం తెలియకూడదు. ఈ గ్రుడ్డితనం తాత్కాలికమేనన్న నమ్మకం అతనికి వుండాలి. లేదా ప్రమాదం. భగవంతుడి దయవల్ల అతనికి పూర్తిగా తగ్గే సమయానికి తగిన బ్రెయిన్ దొరికి ట్రాన్స్‌ప్లాంటేషన్ కూడా పాజిబుల్ కావచ్చు. మీరు మాత్రం ధైర్యంగా ఉంటూ, మీ అబ్బాయిధైర్యం కోల్పోకుండా వుండేటట్లు చూసుకోవాలి..."అని హెచ్చరించాడు.

"అలాగే సార్!" అంటూ నమస్కరించాడు భజరంగ ప్రసాద్.

* * * *

నాలుగు నెలలు గడిచిపోయాయి.

గ్రుడ్డి జీవితానికి అలవాటు పడుతున్నాడు రవి. ఈ చీకట్లోంచి వెలుగు రాకపోతుందా అన్న ఆశ లోలోపల వెలుగుతోంది.

డాక్టర్ జగన్నాథ్ నగరంలో వున్న ఆస్పత్రుల అధికారులందరికీ ప్రమాదంలో మరణించిన యవ్వనవంతుల దేహాలు దొరికితే వారి మెదళ్ళు సేకరించి భద్రపరిచే ప్రయత్నాలు చేయలసిందిగా అభ్యర్థనలు పంపాడు. పోస్టుమార్టంకి వచ్చే దేహాల మెదళ్ళను అమ్మితే ఎంతైనా వెచ్చించి కొనడానికి భజరంగ్‌ప్రసాద్ సిద్ధంగా వున్నాడు.

రవి గాయాలు పూర్తిగా మానాయి. అతనికి ఏరోజైనా మెదడు ట్రాన్స్‌ప్లాంట్ చేయవచ్చు. అనువైన మెదడు దొరకడమే ఆలశ్యం.

ఆరోజు డాక్టర్ జగన్నాథ్ దగ్గర్నుంచి భజరంగప్రసాద్‌కి ఫోన్ వచ్చింది.

"చూడండి సేఠ్‌జీ... ఈ రోజు ప్రొద్దున్న హత్యగావించబడ్డ ఒక వ్యక్తి శవం మా హాస్పటల్‌కి వచ్చింది. పోస్టుమార్టం నా సమక్షంలో జరిగింది. ఆరోగ్యమంతమైన ఆ మెదడును మీ అబ్బాయికి

ట్రాన్స్‌ప్లాంట్ చేయడానికి పనికి వస్తుంది. ఆ మెదడును మీకు అమ్మడానికి వాళ్ళను ఒప్పించాను. మీరు సరేనంటే ఆ మెదడును తీసి భద్రపరిచి, ట్రాన్స్‌ప్లాంటేషన్‌కి ఏర్పాట్లు చేస్తాను'' అన్నారు ఆయన.

''డాక్టర్‌గారూ.. నన్నడగాల్సిన అవసరం ఏముంది? మీరు ఎలాచెబితే అలాగే. నేను వెంటనే అక్కడికి వస్తాను.'' అన్నాడు భజరంగ్ ప్రసాద్ పట్టరాని సంతోషంతో.

''సరే... మీరు రవిని తీసుకుని హాస్పటల్‌కి వచ్చేయండి. వెంటనే ఇన్‌పేషంట్‌గా అడ్మిట్ చేసుకుంటాను. ఈ లోగా మెదడుని తీసి భద్రపరుస్తాను.'' అన్నాడు డాక్టర్ జగన్నాథ్.

రవి మెదడులో దెబ్బతిన్న భాగాన్ని తీసేసి కొత్తమెదడులోని సుమారు ఇరవైఐదు శాతం భాగంతో ట్రాన్స్‌ప్లాంట్ చేశాడు డాక్టర్ జగన్నాథ్. ఆపరేషన్ అత్యంత విజయవంతంగా జరిగింది.

ఆపరేషన్ పూర్తి అయ్యాక ''యూ ఆర్ వెరీ లక్కీ సేఠ్‌జీ. మీవాడి కోసమేనా అన్నంత మంచి మెదడు దొరికింది. చాలా సక్సెస్‌ఫుల్‌గా ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. ఈ కొత్త మెదడుని బాడీ రిసీవ్ చేసుకోవడంలో ఎటువంటి ప్రాబ్లెమ్స్ ఉండవనే నా నమ్మకం. మీ రవికి డిఫినిట్‌గా చూపు వస్తుంది. దేరీజ్ నోడౌట్ ఎబౌట్ ఇట్'' అన్నాడు డాక్టర్ జగన్నాథ్ సంతోషంతో.

''డాక్టర్‌గారూ.... మీ రుణం తీర్చుకోలేను'' అంటూ ఆయన కాళ్ళమీద పడ్డాడు.

''నో... నో... డోన్ట్‌బి సిల్లీ...'' అంటూ ఆయన్ని లేవనెత్తారు డాక్టర్.

* * * *

ఆ రోజు రవికి కట్లు విప్పుతారు. దృష్టిని పరీక్షిస్తారు.

డాక్టర్ జగన్నాథ్ రవి గదిలోకి ప్రవేశించాడు. నర్సువెంట వుంది.

గదిలో లైట్లను బాగా డిమ్ చేశారు.

''చూడు మిస్టర్ రవీ... నీ తలకి కట్లు విప్పుతాం నేను చెప్పినప్పుడు నెమ్మది నెమ్మదిగా కళ్ళు తెరు''. అని కట్లు విప్పసాగాడు డాక్టర్.

కొంచెం సేపు గడిచింది.

''యస్ రవీ! నెమ్మదిగా కళ్ళు తెరు''

రవి మొగ్గలువిచ్చుకుంటున్నట్లు నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

''చెప్పు నీకు కనిపిస్తోందా?''

కనిపిస్తోంది డాక్టర్‌గారూ- మసక మసకగా వుంది గుడ్డిదీపం వెలుగులో చూస్తున్నట్లనిపిస్తోంది''.

''వెరీగుడ్''! అంటూ నెమ్మదిగా గదిలో కాంతిని పెంచసాగాడు.

''డాక్టర్‌గారూ! నాకు బాగాకనిపిస్తోంది. నేను మామూలుగా చూడగలుగుతున్నాను'' అన్నాడు రవి ఆనందంగా.

''వెరీగుడ్ బాయ్.... ఐయామ్ రియల్లీ వెరీ హేపీ'' అంటూ భుజం తట్టాడు డాక్టర్ జగన్నాథ్.

భజరంగప్రసాద్, ఆయనవాళ్ళ ఆనందానికి అవధులు లేవు.

"ఓ.కె. నేనుమళ్ళీ వస్తాను. హావ్‌గుడ్ రెస్ట్. కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకో. ఈ రోజు ఎక్కువగా మాడవద్దు." అంటూ బయటికి వచ్చాడు డాక్టర్.

"డాక్టర్‌గారూ... అబ్బాయి ఇంకా ఎన్నాళ్ళు ఇక్కడ వుండాలి?" అని అడిగాడు సేఠ్ భజరంగ ప్రసాద్.

"జస్ట్ త్రీ డేస్. మూడురోజులు అవగానే డిశ్చార్జి చేస్తాం. ఇదేనా అబ్జర్వేషన్ కోసమే. ఈ రోజు రాత్రి నాకు డ్యూటీ కూడా వుంది. ఈ రాత్రి మధ్య మధ్య వచ్చి రవిని చూస్తుంటాను కూడా నా రెస్ట్‌రూం కూడా మీ వార్డుకి దగ్గర్లోనే వుంది. మీరు దేనికీ భయపడనక్కర్లేదు. యువర్ బాయ్ ఈజ్ క్వైట్ ఆల్‌రైట్"

"థ్యాంక్యూ డాక్టర్‌గారూ! మీకు నా కృతజ్ఞతలు ఎలా తెలియజెప్పాలో అర్థం కావడంలేదు. మా అబ్బాయికి మీరు పునర్జన్మ ఇచ్చారు. మీకు మేమంతా జన్మంతా రుణపడి వుంటాం." అన్నాడు భజరంగ్ ప్రసాద్ చేతులెత్తి నమస్కారం చేస్తూ.

"దట్సాల్‌రైట్!" అంటూ బయటికి వెళ్ళాడు డాక్టర్ జగన్నాధ్.

* * * *

రాత్రి రెండు గంటలు అవుతుంది.

అంతా నిశ్శబ్దం అలముకుని వుంది. కీచురాళ్ళ అరపులు భయం కల్పిస్తున్నాయి.

నైట్‌డ్యూటీలో ఓ రౌండ్‌కొట్టి డార్మిటరీకి వచ్చి అప్పుడే కుర్చీలో కూర్చున్నాడు డాక్టర్ జగన్నాధ్.

సేఠ్ భజరంగప్రసాద్ కంగారుగా రొప్పుతూ అక్కడికి వచ్చాడు.

ఆయన కంగారుచూసి ఆత్రంగా లేచినుంచున్నాడు డాక్టర్.

"డాక్టర్‌గారూ! రవి నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి భయంగా వెర్రికేకలు పెడుతున్నాడు. భుజంతట్టి లేపినా కేకలు ఆపడంలేదు" అన్నాడు భజరంగ్.

"పదండి" అంటూ చేతిలో స్టెతస్కోప్‌తో వడివడిగా ముందుకుసాగాడు డాక్టర్ జగన్నాధ్. వెనకాలే వెళ్ళాడు భజరంగ్.

నిద్రలో ఇంకా అరుస్తూ కాళ్ళూ, చేతులూ కొట్టుకుంటూనే వున్నాడు రవి.

చెంపలమీద గట్టిగా తట్టి లేపాడు డాక్టర్ జగన్నాధ్.

మెలకువ వచ్చి భయంగా ఆయన వంక చూడసాగాడు రవి.

"ఏమైంది రవీ... ఏమైంది? ఏమైనా పీడకల వచ్చిందా?"

రవి మౌనంగా తల అటూ ఇటూ తిప్పి చూశాడు. తల్లీ, తండ్రీ కనిపించారు.

"చాలా భయంకరమైన కలవచ్చింది. డాక్టర్‌గారూ. ఎవరో త్రాగుబోతు నా కళ్ళముందే ఓ చిన్నపిల్లని ఏసికి చంపివేశాడు. నేను అడ్డు వెళ్ళబోతే గొడ్డలితో నన్ను నరకడానికి వచ్చాడు."అన్నాడు రవి.

"ఓ ఇటీజ్ ఎ నైట్‌మేర్. కొంచెం మంచినీళ్ళు త్రాగి కళ్ళు మూసుకుని పడుకో."

"ఇది కలలాగా అనిపించడంలేదు డాక్టర్‌గారూ! నిజంగా నన్నెవరో చంపడానికి వస్తున్నట్ల

నిపిస్తోంది'' అన్నాడు రవి భయంగా

''కొన్ని కలలు అంత భయంకరంగానే వుంటాయి. మరేం ఫర్వాలేదు. మేమంతా ఇక్కడే ఉన్నాంగా.

రవి అన్ఈజీగా పడుకున్నాడు. కలతనిద్రేకాని కమ్మని నిద్ర రానేలేదు. ఆ కలతనిద్రలో కూడా ఆ పీడకలే పదే పదే వెంటాడసాగింది. ఆ విషయం మర్నాడు ప్రొద్దున తండ్రికీ, డాక్టర్ జగన్నాథ్‌కి కూడా చెప్పాడు.

''కలల కేముంది. డోన్ట్ బాదర్'' అన్నాడు ఆయన.

అంతా నార్మల్‌గా ఉండడంతో ఆ రోజురవిని డిశ్చార్జ్ చేశారు.

రవిని బీచ్‌కి ఇతర ప్రదేశాలకీ, సినిమాలకీ తరచుగా తీసుకు వెళ్తుండమని సలహా ఇచ్చాడు డాక్టర్ జగన్నాథ్. అందువల్ల అతని దృష్టి అనవసర విషయాలమీద నుంచి మారుతుందనీ రకరకాల దృశ్యాలకు కళ్ళు అలవాటు పడుతాయని చెప్పాడు ఆయన.

ఆయన దగ్గర సెలవు తీసుకుని రవిని ఇంటికి తీసుకుపోయాడు భజరంగ్.

* * * *

ఆ రోజు రవి మిత్రులతో కలిసి సినిమాకి వెళ్ళాడు.

సినిమాలో ఒక త్రాగుబోతు తండ్రి త్రాగిన మైకంలో పిల్లను చావబాదుతుంటాడు. అడ్డుపడబోయిన తల్లిని గొడ్డలితో నరకబోతాడు. ఆ దృశ్యం చూడగానే రవి కంగారుగా, భయంగా వెర్రికేకవేసి హాలు బయటకు పరిగెత్తుకు వచ్చాడు. ఆ దృశ్యం, అతనికి వచ్చిన కల ఒకే విధంగా వున్నాయి, అతని వెనకనే మిత్రులు బయటకు వచ్చి అతన్ని ఇంటికి తీసుకువచ్చారు.

ఇంటికి వచ్చాక కూడా రవికి భయం తగ్గలేదు. వళ్లంతా చెమటలు పట్టేసింది. ఊరికే బెదురుచూపులు చూడసాగాడు. భజరంగ్ ప్రసాద్ వెంటనే డాక్టర్ జగన్నాథ్‌కి ఫోన్ చేశాడు. మరో అరగంటలో ఆయన వచ్చారు.

సంగతి విన్నాక ఆయన ''రవీ! ఈ సినిమా నువ్వు ఇంతకు ముందు చూశావా?'' అని అడిగాడు.

''లేదు'' అన్నాడు రవి.

''ఇది రిలీజై వారం రోజులే అయింది!'' అన్నాడు రవి స్నేహితుడు ఒకడు.

''విచిత్రంగా ఉందే!'' అని అస్పష్టంగా అనుకుని ''కొన్ని కొన్ని కలలు వాస్తవ సంఘటనలంత బలంగా మనసుమీద ముద్రవేస్తాయి. ఆ కలని నువ్వు మర్చిపోకపోవడం. సినిమాలో అటువంటి దృశ్యమే కాకతాళీయంగా కనిపించడం వల్ల నువ్వు ఇంతగా బెంబేలు పడిపోయావు. టేక్ ఇట్ ఈజీ!'' అని కాంపోజ్ ఇంజక్షన్ ఇచ్చి సెలవు తీసుకున్నాడు డాక్టర్ జగన్నాథ్.

''బంగారంలా వున్న పిల్లవాడు స్నేహితులతో కలిసి పిక్నిక్‌కి వెళ్ళడమేమిటి? ఘాట్‌రోడ్డుమీద అతని మోటార్‌సైకిల్ గోడకు ఢీకొట్టి యాక్సిడెంట్ అవడమేమిటి? దృష్టి పోవడమేమిటి? తిరిగి వచ్చిందని సంతోషిస్తుంటే మళ్ళీ ఈ ఉత్పాతం ఏమిటి? భగవంతుడా మమ్మల్ని రక్షించు'' అంటూ తనలో తనే కుమిలిపోసాగాడు సేఠ్ భజరంగ్ ప్రసాద్.

కొంచెం సేపటికి రవి ప్రశాంతంగా నిద్రపోయాడు.

వెంటవచ్చిన స్నేహితులు సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

* * * *

నాలుగు రోజుల గడిచింది. ఆ కల రవిని భయంకరంగా కాకపోయినా నీలినీడవలె వెంటాడుతోంది.

ఆ రోజు రవి స్నేహితులతో కలిసి బీచ్‌కి షికారుకి వెళ్ళాడు. ఆ దగ్గర్లోనే బెస్తవారి పల్లె వుంది. ఆరోజు అక్కడ ఏదో జాతర వుంది. దూరాన్నుంచే నానా కోలాహలంగా వుంది. సరదాకొద్దీ అదేదో చూద్దామని మిత్రులందరూ బయలుదేరారు.

జాతర వేడుకలు కొంచెంసేపు చూసి తిరుగుముఖం పట్టారు.

ఆ పల్లెలోంచి వస్తుంటే ఉన్నట్లుండి ఒక గుడిసె ముందు ఆగిపోయాడు రవి. ఉన్నట్లుండి అతనిముఖం కోపంతో ఎర్రబడి పోయింది. కళ్ళు నిప్పులు చెరగసాగాయి.

ఆ గుడిసె ముందు ఒక ఆరేళ్ళ పిల్లాడు మట్టిలో ఆడుకుంటున్నాడు.

చింపిరిజుట్టు, మాసిన బట్టలు ముక్కుచీమిడి -చూట్టానికి అసహ్యంగా వున్నాడు. వాడిని చూడగానే రవి ఆప్యాయంగా "బుజ్జీ!" అంటూ దగ్గరికి తీసుకున్నాడు.

ఆ పిల్లవాడు బెదిరిపోయి రవివంకే చూస్తుండిపోయాడు.

"బుజ్జీ... చిట్టి అక్క ఏదీ.... ఆ.. అవును నాన్న దాన్ని చంపేశాడుగా?" అని అంటుండగానే గొంతు పెరిగిపోయింది. పట్టరాని కోపంతో - "ఏడీ ఆ తాగుబోతు సచ్చినోడు" అంటూ ఒక్క అరుపు అరిచాడు.

"నాన్నని పోలీసోళ్ళు పట్టుకుపోయారుగా" అన్నాడు ఆ పిల్లవాడు భయంతో.

ఈ సందడికి చుట్టుపక్కలవాళ్ళు పోగయ్యారు.

వాళ్ళలో ఒకామెను చూస్తూ "పిన్నమ్మా ఈన నన్ను బుజ్జీ అంటున్నాడు. నాన్న ఏడీ అని అడిగాడు" అంటూ ఆమెను వాటేసుకున్నాడు.

"ఎవరు బాబూ నువ్వు?" అంటూ దగ్గరకు వచ్చింది ఆమె.

"నేను.... నేను" అంటూ రవి ఏదో చెప్పబోతుండగా అతని స్నేహితుడు బలవంతాన అతని నోరుమూసి అవతలికి ఈడ్చుకుపోయారు.

"ఏంది పట్నంబాబులూ?" అంటూ ఎవరో అడిగారు.

" మా వాడికి మతి చలించింది. ఏమీ అనుకోకండి" అంటూ ఒక స్నేహితుడు సమాధానం చెప్పి ముందుకి సాగిపోయాడు.

ఈ ఆకస్మిక సంఘటనకి విస్తుపోయి పట్నంబాబుల వంకే చూస్తుండిపోయారు పల్లెవారు.

దారిలో రవిని పట్టుకోవడం చాలా కష్టం అయిపోయింది. మిత్రుల్ని గుర్తుపట్టనట్లే ప్రవర్తించసాగాడు.

ఏదో లోకంలో వున్నట్లు చూస్తూ "ఏదీ ఆ దొంగనాయాల. నా చిట్టిని చంపేశాడు. నన్ను చంపాలని చూశాడు. వాణ్ణి బతకనివ్వను. పీకపిసికి చంపేస్తాను" అంటూ మాటిమాటికీ అరవసాగాడు. పళ్ళు కొరుకుతూ, పిడికిలి బిగించసాగాడు.

రవికి ఏమైందో స్నేహితులకి అర్థం కాలేదు. అమితమైన ఆందోళనతో అతి కష్టంమీద అతన్ని ఇంటికి చేర్చారు.

ఆవేశంతో అలసిపోయి ప్రక్కమీద ఒరిగిపోయాడు రవి.

వెంటనే డాక్టర్ జగన్నాథ్‌కి ఫోన్ చేశారు.

ఆయన హుటాహుటిన అక్కడికి వచ్చాడు.

అప్పటికి ఇంకా రవి నిద్రపోతూనే వున్నాడు.

డాక్టర్‌గారిని ప్రక్కగదిలోకి తీసుకువెళ్ళి జరిగిందంతా వివరంగా చెప్పారు మిత్రులు.

"డాక్టర్‌గారూ.. ఏమిటి? మా వాడికి ఏదైనా దయ్యంకాని, భూతంకాని పట్టలేదు కదా! లేకుంటే ఈ కలలేమిటి? ఈ చేష్టలేమిటి?" అంటూ వాపోయాడు సేట్ భజరంగప్రసాద్.

"ఊ!" అని భారంగా నిట్టూర్చాడు డాక్టర్ జగన్నాథ్.

"మనం ఇవేవో కలలని ఇన్నాళ్ళూ అనుకున్నాంకాని. ఇతని కేసులో కలలను మించినదేదో ఉంది. ఈ కేసు సైక్రియాట్రిస్ట్‌కి రిఫర్ చేయాల్సిందే. ఈ విషయంలో డాక్టర్ వాసు సూపర్ స్పెషలిస్ట్. రవిని రేపు ఆయన దగ్గరకు తీసుకువెళ్తాను" అన్నాడు ఆయన.

"ఈ లోగా మళ్ళీ అది తిరగబెడ్తే?" ఆందోళనగా అడిగాడు భజరంగ్.

"అదేదో మోమెంటరీ ఫిట్. మళ్ళీ వస్తుందని అనుకోను. ఇప్పుడు ఇంజక్షన్ ఇచ్చి వెళ్తాను. ప్రశాంతంగా పడుకుంటాడు" అంటూ ఇంజక్షన్ ఇయ్యడానికి లోనికి వెళ్ళాడు డాక్టర్ జగన్నాథ్.

* * * *

మర్నాడు ప్రొద్దున్నే డాక్టర్ వాసు దగ్గరికి రవిని తీసుకుని వెళ్ళాడు డాక్టర్ జగన్నాథ్. డాక్టర్ వాసుతో ప్రైవేట్‌గా కేసు వివరాలన్నీ చెప్పాడు.

"రవిని నేను ఇన్- పేషెంట్‌గా ఆడ్మిట్ చేసుకుంటాను. సైక్రియాట్రిక్ టెస్ట్లు అన్నీ చేస్తాను, ఈలోగా మీరు నాకో సహాయం చేయాలి" అన్నాడు డాక్టర్ వాసు.

"చెప్పండి. అంతకంటేనా?"

"నిన్న రవి ఏదో ఇంటి ముందుకి వెళ్ళగానే అక్కడి పిల్లవాడిని "బుజ్జీ!" అని పలకరించాడనీ, ఆవేశంతో ఎవర్నో చంపుతానని అరిచాడనీ చెప్పారు కదా ఆ ఇంట్లో వున్నవారిని గురించి వివరాలు తెలుసుకోండి. ఇటీవల ఆ ఇంట్లో ముఖ్యమైన సంఘటనలు ఏమైనా జరిగాయేమో వాకబు చేయండి."

"అవును. ఆ ఇంటికీ ఈ కేసుకీ ఏదో సంబంధం వుందనే నా నమ్మకం! రవి నాన్నగారు ఇది పునర్జన్మ కేసు కాదుగదా అని అనుమానిస్తున్నారు. ఆ ఇంట్లో వారిని గుర్తుపట్టడం. ఇవన్నీ ఆ అనుమానాలను

కల్పిస్తున్నాయి."

"పునర్జన్మ సిద్ధాంతానికి శాస్త్రీయమైన వివరణ ఏదీ లేదు. పునర్జన్మలుగా భావించిన ఎన్నో కేసుల రహస్యం కూడా సైక్రియాట్రీ ద్వారా ఛేదించడం జరిగింది.'

"అవును నిజమే. పునర్జన్మని నేనునమ్ముతానని కాదు, సందర్భం వచ్చింది కాబట్టి చెప్పాను అంతే!' అన్నాడు డాక్టర్ జగన్నాధ్.

"ఓ.కె.మీరు సాధ్యమైనంత త్వరగా నేనడిగిన సమాచారం తెలుపండి. "

"ష్యూర్ !" అంటూ సెలవు తీసుకున్నాడు డాక్టర్ జగన్నాథ్.

* * * *

మర్నాడు ప్రొద్దున డాక్టర్ వాసుదగ్గరకి వచ్చాడు డాక్టర్ జగన్నాథ్.

"డాక్టర్! మీరు అడిగిన సమాచారం సేకరించాను. ఆఇంట్లో రంగడుఅనే త్రాగుబోతు ఉండేవాడు. ఓ రోజు బాగా త్రాగివచ్చి, తాను చెప్పిన పని చేయలేదన్న వెర్రి కోపంతో పదేళ్ళ కూతుర్ని గొంతుపిసికి చంపేశాడు. దాంతో రంగడి భార్య నర్సమ్మ వెర్రికోపంతో వాడి పీకపిసికి చంపాలని వెళ్ళిందట. ఈలోగా రంగడు గొడ్డలి తీసుకొని ఆమె మెడ నరికి చంపేశాడు. ఆ నర్సమ్మ మెదడులో భాగాన్నే రవికి ట్రాన్స్‌ప్లాంట్ చేయడం జరిగింది. ఇప్పుడు నాకు అర్థమైంది అతనికి ఒకే రకమైన కలలు జ్ఞాపకాలు ఎందుకు వస్తున్నాయో? అతనికి ట్రాన్స్‌ప్లాంట్ చేసిన మెదడు భాగంలో ఆమె జ్ఞాపకాలు దాగిన భాగాలు కూడా ఉన్నాయన్నమాట. అందుకే అవకాశం వచ్చినప్పుడల్లా ఆ కసి ఆవేశంగా వెలువడుతోంది. "అనిచెప్పాడు డాక్టర్ జగన్నాద్.

"నిన్ననేను రవిని హిప్నటిక్ స్లీప్‌లోకి పంపి అతని మనసులోని ఆలోచనలు బయటపెట్టించాను. మీరు చెప్పినదే అతనూ చెప్పాడు. భర్త పీకపిసికి చంపాలనే ఆవేశం చల్లారకుండానే ఆమె తల తెగిపోవడంతో బలీయమైన ఆ భావాలు అలాగే ఉండిపోయాయి. ఏదోవిధంగా ఆ ఆవేశం చల్లారేవరకు ఈ కలలు వెంటాడుతునే ఉంటాయి."

వారు అలా మాట్లాడుకుంటుండగా రవి అటువచ్చాడు.

"హలో రవీ! హౌఆర్‌యూ?" అని అడిగాడు డాక్టర్ జగన్నాథ్.

"పర్వాలేదండి- కానీ నాకు ఏమిటో ఎవర్నో పీకపిసికి చంపివేయాలని పిస్తోంది. పట్టరాని ఆవేశం వస్తోంది. నాకు తెలియకుండానే ఎవరి గొంతునేనా పిసికి చంపివేస్తానేమోనని భయం వేస్తోంది" అన్నాడు రవి.

డాక్టర్‌లు ఇద్దరూ ఒకరి ముఖం ఇంకొకరు చూసుకున్నారు.

"హాయిగా రెస్ట్ తీసుకో రవీ! అనవసరపు ఆలోచనలు మానెయి. డాక్టర్ వాసుగారు ట్రీట్‌మెంట్ మొదలుపెట్టారుగా త్వరలోనే తగ్గిపోతుంది" అని ధైర్యం చెప్పాడు డాక్టర్ జగన్నాథ్.

రవి తన రూంలోకి వెళ్ళిపోయాడు.

"ఇతని కేసు కాంప్లికేట్ అయ్యేట్లుంది. ఆలస్యం చేస్తే ఎవర్నైనా చంపగలడు!" అన్నాడు డాక్టర్ జగన్నాథ్.

''అవును.వెంటనే ఇతని బ్రెయిన్‌కి ఆపరేట్‌చేసి ఆ జ్ఞాపకాలు నిక్షిప్తమైన భాగాన్ని తొలగించాలి. లేదా ఆ రంగడిని తెప్పించి అతని పీక పిసికించేటట్లు చేసి ప్రాణం మాత్రంపోకుండా అతన్ని రక్షించాలి'' అన్నాడు డాక్టర్ వాసు.

''పీక పిసికించి రిస్క్ తీసుకోవడం కంటే ఆపరేట్ చేయడమే మంచిది. దానిని నేను సులువుగానే చేయగలను.'' అన్నాడు డాక్టర్ జగన్నాథ్.

''వెరీగుడ్. దెన్ యు ప్రొసీడ్ ఎట్ ది ఎర్లీయెస్ట్'' అన్నాడు డాక్టర్ వాసు.

* * * *

ఆపరేషన్ రూంలో డాక్టర్ జగన్నాథ్ నాయకత్వంలో రవి మెదడుకి ఆపరేషన్ చేయడానికి అంతా సిద్ధమయింది. మత్తుమందువల్ల స్పృహ లేకుండా అచేతనంగా టేబుల్‌మీద పడుకుని వున్నాడు రవి.

బయట వెయిటింగ్ రూంలో డాక్టర్ వాసు డైలీ చూస్తున్నాడు.

సేఠ్ భజరంగప్రసాద్, అతని వారూ మరోప్రక్క ఆందోళనగా కూర్చున్నారు.

ఆనాటి డైలీలో ఒక వింత కేసు డాక్టర్ వాసు దృష్టిని ఆకర్షించింది. అది చదువగానే ఆయన ముఖం వివర్ణమై పోయింది.

థియేటర్ తలుపులు ధడాలున తెరుచుకున్నాయి.

కంగారుగా ఆ గదిలోకి దూసుకువెళ్ళాడు డాక్టర్ వాసు.

లోపల దృశ్యం చూసి నిశ్చేష్టుడై పోయాడు.

ఆపరేషన్ టేబుల్‌మీదున్న రవి లేచి కూర్చుని ఆవేశంతో బుసలు కొడుతున్నాడు. ఉడుంపట్టులాంటి అతనిచేతుల పట్టులో డాక్టర్ జగన్నాథ్ మెడ ఇరుక్కుని వుంది. దానిని విడిపించుకోవడానికి ఆయన విలవిలా కొట్టుకుంటున్నాడు. మిగిలినవారు రవి చేతులు ఎంత గట్టిగా లాగినా అవి ఊడిరావడం లేదు.

కొద్ది నిమిషాలలోనే డాక్టర్ జగన్నాథ్ మెడ వాల్చేశాడు. ఆయన ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆవేశం తగ్గగానే రవి అలసిపోయి అచేతనంగా పడిపోయాడు.

డాక్టర్ జగన్నాథ్ ప్రాణాలు కాపాడాలని డాక్టర్లు ఎంతో ప్రయత్నించారు కాని ఫలితం లేకపోయింది.

బొంబాయిలోని ఒక పెద్ద హాస్పిటల్‌లో గత మార్చిలో సరిగ్గా ఇట్టి సంఘటనే జరిగింది. ఆపరేషన్ చేయవలసిన పేషెంట్ అకస్మాత్తుగా లేచి సర్జన్ పీక నులిమి చంపేశాడు. అలా ఎందుకు జరిగిందో అంతుపట్టలేదని ఆ వార్తను గురించి ఆనాటి పత్రికలో వుంది. అందుకే అది చదివి అంతగా నిర్విణ్ణుడయ్యాడు డాక్టర్ వాసు.

''బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేయగలుగుతున్నాం కాని సురక్షితంగా ఇంకా చేయలేకపోతున్నాం!'' అనుకుంటూ వివర్ణ వదనంతో బయటకు వచ్చాడు డాక్టర్ వాసు.

బయటకు ఉబికి వచ్చిన డాక్టర్ జగన్నాథ్ గ్రుడ్లు తమ చూపుల ద్వారా ఈ మాటల్నే అంటున్నట్లు అనిపించింది ఆయనకు .

**యువ, ఆగస్టు 1986** ✪

# హైలీపై హేపీ జర్నీ

అది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ రీసెర్చ్ కార్యాలయం. దాని డైరక్టర్ రవి అస్ట్రనామికల్ చార్ట్ ముందువేసుకుని తీవ్రంగా ఏదో ఆలోచిస్తున్నాడు. ఆయన అంతకుముందు ఎన్నో అంతరిక్ష నౌకలలోనూ, స్పేస్ షటిల్స్‌లోనూ విజయవంతంగా ప్రయాణం చేసివచ్చాడు. ఆయనకున్న పరిజ్ఞానం, అనుభవం దృష్ట్యా అచిరకాలంలోనే ఆయనకి ఆ ఇన్‌స్టిట్యూట్ డైరక్టర్ పదవి లభించింది. ఆయన పర్యవేక్షణలో ఆ సంస్థ అంతరిక్షానికి, గ్రహాంతరాయానానికి సంబంధించిన ఎన్నో పరిశోధనలు విజయవంతంగా నిర్వహించింది. ప్రపంచంలోని అటువంటి సంస్థలలో ఒక ప్రముఖస్థానం ఆక్రమించింది. రానున్న ఐదేళ్ళలో అంగారక గ్రహానికి మనుష్యులని పంపడానికి ఒక పథకాన్ని కూడా రూపొందించాడు ఆయన. ప్రభుత్వం అందుకు ఆమోదం తెలిపి ప్రాథమిక అవసరాలకు కావలసిన నిధులను కూడా సమకూర్చింది. ఆ యాత్రలో రవి అతని అనుచరుడు కిషోర్ ఉంటారనేది బహిరంగ రహస్యమే. వారిద్దరూ సహ అంతరిక్ష యాత్రికులే కాకుండా సన్నిహితమిత్రులు కూడా.

కిషోర్ ఆ గదిలోకి ప్రవేశించాడు. రవి తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు కనిపించడంతో మౌనంగా నిలబడిపోయాడు.

అతని రాకను గ్రహించి తల ప్రక్కకు త్రిప్పి ''రా... కూర్చో'' అన్నాడు రవి.

కిశోర్ అతని ప్రక్కనే కూర్చుంటూ ''ఏమిటి తీవ్రంగా ఆలోచిస్తున్నావు?'' అని అడిగాడు.

''ఏంలేదు. ఈ సంవత్సరం చివరలో హాలీస్ కామెట్ భూమిని సమీపిస్తున్న విషయం నీకు తెలిసిందే కదా?'' అన్నాడు రవి.

''అవును. 76 సంవత్సరాలకు ఒకసారి వస్తూ ఆకాశంలో అత్యంత అందాలను వెదజల్లే తోకచుక్క అంట. దానిని చూడాలని ఎంతగానో ఉవ్విళ్ళూరుతున్నాను'' అన్నాడు కిశోర్.

''ఈ సారి ఇందులో ఒక ప్రత్యేకత వుంది. ఈ పర్యాయం ఈ తోకచుక్క భూమికి కేవలం ఏడులక్షల కిలోమీటర్ల దూరంలోకి వస్తోంది. అందువల్ల ఈ అవకాశాన్ని మనం ఉపయోగించుకోవాలని



అనుకుంటున్నాను'' అన్నాడు రవి.

''ఎలా?'' అని అడిగాడు కిశోర్ ఆసక్తితో.

''తోకచుక్కలు మన సౌరకుటుంబంలోని చిట్టచివరి ప్లూటో గ్రహానికి అవల వున్న విషయం తెలిసిందే కదా. ఈ తోకచుక్కలు సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నప్పుడు గ్రహాల్ని సమీపిస్తుంటాయి. ఈ తోకచుక్క మీదికి మనం అంతరిక్ష నౌకలో దిగామనుకో. ఆ తోకచుక్కతో పాటు మనం సౌరమండలం మొత్తాన్ని చుట్టిరావచ్చు. కొద్ది లక్షల కిలోమీటర్ల దూరంనుంచి మన అత్యంత శక్తిమంతమైన టెలిస్కోప్‌ల ద్వారా గ్రహాల్ని వాటి ఉపగ్రహాల్ని పరిశోధించవచ్చు'' అన్నాడు రవి.

''నీ ఆలోచన అద్భుతంగావుంది. కానీ ఈ హేలీ తోకచుక్క తిరిగి భూమిని సమీపించడానికి డెబ్బైఆరేళ్ళు పడ్తుందే! అంతకాలం మనం అంతరిక్షయానం చేస్తుండగలమా?'' అన్నాడు కిశోర్ సందేహం వ్యక్తం చేస్తూ.

''అలా అని నేను అనడంలేదు. రానున్న ఐదేళ్ళలో మనం అంగారక గ్రహయాత్రకి సన్నాహాలు చేస్తున్నాం కదా! భూమి తర్వాత ఈ తోకచుక్క సమీపించేది అంగారక గ్రహాన్నే. అది అంగారక గ్రహాన్ని సమీపించేసరికి దాని ఉపగ్రహమైన ఫోబాస్ మీద దిగుదాం. హేలీ కామెట్ ఆకర్షణశక్తి చాలా తక్కువ కనుక దానిపైనుంచి తక్కువ ఇంధనాన్ని ఉపయోగించి అంతరిక్షంలోకి ఎగిరి రెట్రోరాకెట్ల ద్వారా ఫోబాస్ మీదకి సాఫ్ట్‌లాండింగ్ చేయవచ్చు. అక్కడినుంచి అంగారక గ్రహాన్ని నిశితంగా పరిశీలించి

కావాలనుకున్నప్పుడు తిరిగి భూమికి వచ్చేయవచ్చు.''అన్నాడు రవి.

''ఎలా?'' అని సందేహం వ్యక్తం చేశాడు కిశోర్.

''ఫొబాస్ అతిచిన్న ఉపగ్రహం. దాని వ్యాసం కేవలం 25 కిలోమీటర్లు. అందువల్ల దానిమీద నుంచి కూడా అతి తక్కువ ఇంధనాన్ని ఉపయోగించి అంతరిక్షంలోకి ఎగిరి భూమికి తిరిగి రాగలదు మన నౌక'' అని వివరించాడు రవి.

''ఆలోచన అయితే బాగానేవుంది కానీ మన యాత్ర పూర్తి అవడానికి ఎన్నోనెలలు, బహుశా ఏడాదిపైగా పట్టవచ్చు. అంతకాలం మనకి కావలసిన ఆహారం, నీరు వెంట తీసుకెళ్ళడం సాధ్యమా?'' అన్నాడు కిశోర్.

''ఈ విషయంలో కూడా హేలీ కామెట్ మనకి ఎంతగానో ఉపయోగపడగలదు అనే నా నమ్మకం'' అన్నాడు రవి.

''ఎలా?'' అని అడిగాడు కిశోర్ కుతూహలంతో.

''తోకచుక్కలలో ఉండేదేమిటి?'' అని ప్రశ్నించాడు రవి.

శాస్త్రజ్ఞులకి తెలిసిందే కదా. పైన తలభాగం గట్టి పదార్థంతో ఉండి చుట్టూ వాయువులు ఉంటాయి. సూర్యుని అది సమీపించినప్పుడు గడ్డకట్టిన వాయువులు కరిగి తోకగా ఏర్పడుతాయి'' అన్నాడు కిశోర్.

''ఆ విషయం కాదు నేనడుగుతోంది. తలభాగం దేంతో తయారయింది'' అన్నాడు రవి.

''తలలో మట్టి, ధూళి, పెద్దపెద్ద రాళ్ళు, గడ్డకట్టిన స్థితిలో నీరు, అమోనియా, మిథేన్ వంటి వాయువులు వుంటాయి.'' అన్నాడు రవి.

''అవునా. అక్కడ నీరు ఉంది కనుక దానిని మనం ఉపయోగించుకోవచ్చు. అలాగే నత్రజని కలిగిన అమోనియా, మిథేన్ కార్బన్ కాంపౌండ్స్ వున్నాయి కనుక, తగిన కల్చర్‌మీడియంను సృష్టించి మనం అక్కడ ఆల్గేలైచెన్ వంటి ప్రాథమిక వృక్షజాలాన్ని పెంచవచ్చునని నా విశ్వాసం. ఆల్గేని లైచెన్‌ని ఆహారంగా తీసుకోవచ్చునని నీకు తెలుసుగా. ఇదిగాక భూమినుంచి మనకి సరిపడా ప్రత్యేకమైన ఆహారాన్ని, నీటిని తెచ్చుకోవచ్చు'' అన్నాడు రవి.

'' అంటే నీ ఆలోచన ప్రకారం భూమినుంచి మనం బయటపడగలిగి హేలీతోకచుక్క మీద వాలగలిగితే దానినే మన అంతరిక్ష నౌకలాగా ఉపయోగించుకుని మన ఇందనం ఖర్చుకాకుండా అంగారక గ్రహ సమీపానికి యాత్ర చేసి రావచ్చునన్న మాట'' అన్నాడు కిశోర్.

''సరిగ్గా చెప్పావు. అదే నా ఆలోచన. ఆలోచనే కాదు. ఇది ఆచరణసాధ్యం అని నా నమ్మకం అన్నాడు రవి.

''బాగుంది. నీ ఆలోచన అద్భుతంగా వుంది. ఈ లెక్కన మనం మరొక పనికూడా చేయవచ్చు'' అన్నాడు కిశోర్ ఆలోచనగా.

''ఏమిటది?'' అని అడిగాడు రవి ఉత్సాహంగా.

''తోకచుక్కల ఆవిర్భావం గురించి శాస్త్రజ్ఞులలో విభిన్న అభిప్రాయాలు వున్నాయి. కొందరు అవి

అసలు మన సౌరమండలానికి చెందినవి కావని భావిస్తే ఇంకొందరు అవి సౌరమండలంలో సూర్యుడు, గ్రహాలు, ఉపగ్రహాలు ఏర్పడగా మిగిలిన దుమ్ము ధూళిలతో ఏర్పడ్డాయని ఊహిస్తున్నారు. మరికొందరు అంగారక గురు గ్రహాల మధ్య ఒకప్పుడు ఉండి ముక్కలయిపోయిన ఒక పెద్ద గ్రహంలోని ముక్కలని విశ్వసిస్తున్నారు. మనం హేలీ తోకచుక్క మీద దిగి ప్రత్యక్షంగా పరిశోధించడంవల్ల తోకచుక్కల రహస్యం సరిగా అవగతం చేసుకోగలం. కొన్ని నెలలపాటు మనం ఈ తోకచుక్క మీదనే ఉంటాం కనుక అవసరమైన పరిశోధనలను సమగ్రంగా చేసుకోవడనానికి వీలవుతుందని నా నమ్మకం'' అన్నాడు కిశోర్.

''శహబాష్... నా ఆలోచనే నీకూ వచ్చింది. అంగారక గ్రహ పరిశోధన నా ప్రధాన లక్ష్యం కనుక ముందుగా ఆ విషయాన్నే చెప్పాను. ఒక్క దెబ్బకి రెండు పిట్టలన్నట్లు ఈ యాత్ర మూలంగా మనం తోకచుక్కనీ, అంగారక గ్రహాన్ని కూడా పరిశోధించగలం'' అన్నాడు రవి.

''నాకు మరో ఆలోచనకూడా వస్తోంది'' అన్నాడు కిశోర్.

''ఏమిటది?'' అని అత్యంత ఉత్సాహంగా అడిగాడు రవి.

''మనదేశం ఎలాగూ వచ్చే ఐదేళ్ళలో మానవుల్ని అంగారక గ్రహంమీద దింపడానికి సన్నాహాలు చేస్తోంది కదా. అలాంటప్పుడు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని హేలీ కామెట్ మీదనుంచి ఏకంగా అంగారకుని మీదనే దిగవచ్చుగా. అంటే ఈ తోకచుక్క అంగారకునికి అతి సమీపంగా రాగానే టేక్ ఆఫ్ చేసి అంగారకుని మీద సాఫ్ట్ లాండింగ్ చేయవచ్చుగా. మధ్యలో ఫొబాస్ మీద దిగడం ఎందుకు?'' అన్నాడు కిశోర్.

రవి ఒక్కక్షణం ఆలోచించాడు. ''నువ్వు చెప్పింది వాస్తవమే. కానీ ఫొబాస్ మీద దిగాలనుకోడానికి కారణాలు లేకపోలేదు'' అన్నాడు.

''అపోలో-II'' చంద్రుడిమీద దిగడానికి ముందు అమెరికా అంతరిక్ష నౌకలని చంద్రుని సమీపానికి పంపి చంద్రునిపై దిగగల స్థానాలను సర్వేచేసింది. అలాగే అంగారకుని మీద దిగగల ప్రాంతాలను గుర్తించడానికి కూడా ఇటువంటి సర్వే ఎంతైనా అవసరం. ఇందుకు ఫొబాస్ ఎంతైనా అనుకూలంగా ఉంటుంది. ఇది అంగారకుని నుంచి కేవలం 5825 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది అంగారక గ్రహాన్ని 7 గంటల 37 నిముషాలలో చుట్టివస్తుంటుంది. అందువల్ల అక్కడినుంచి అంగారక గ్రహం మొత్తాన్ని సర్వే చేయడం చాలా సులువు అవుతుంది'' అన్నాడు రవి.

''ఆగాగు. అమెరికా 1976లో వైకింగ్ నౌకలను అంగారకుని మీద దింపింది కదా. అంటే అవి సర్వేచేసిన ప్రదేశాలే కదా. అక్కడే మనం దిగవచ్చుకదా?'' అన్నాడు కిశోర్.

''అందుకే అక్కడ కాక వేరెక్కడైనా దిగాలని భావిస్తున్నాను నేను'' అన్నాడు రవి.

''అదేమిటి?'' అని ఆశ్చర్యంగా అడిగాడు కిశోర్.

''అవును. వైకింగ్‌లు దిగిన ప్రాంతంలో ఎటువంటి జీవమూలేదని అవి పంపిన సమాచారం ద్వారా తెలిసింది. మళ్ళీ అక్కడే దిగి పరిశోధించాల్సిన అవసరం ఏముంది? అంగారకుని మీద జీవం మనుగడకు అవసరమైన పరిస్థితులు ఉన్నాయి. అందువల్ల భూమిలో సగంకంటే పెద్దగ్రహమైన అంగారకునిలో ఏవో కొన్ని ప్రాంతాలలోనైనా ఏదో రకమైన జీవం ఉండితీరుతుందని ఎందరో శాస్త్రజ్ఞులు

భావిస్తున్నారు. సహారా ఎడారిలో ఓ చోటదిగి ఆ మందు ఇసుకలో ఏ విధమైన మొక్కలుకాని, పురుగులుకాని కనిపించకపోతే దానిని బట్టి భూమిమీద జీవం లేదని పరలోకవాసులు భావిస్తే ఎంత పొరపాటో అలాగే వైకింగ్‌లు దిగిన ప్రదేశం ఆధారంగా అంగారకుని మీద జీవంలేదని భావించడం అంతే పొరపాటని వీరు వాదిస్తున్నారు. ఒకసారి మనం అంగారకుని మీద దిగామంటే మనం పరిశోధించగలిగింది చాలా తక్కువ ప్రాంతమే. కనుక ఫోబాస్ నుంచి పరిశోధిస్తే మొత్తం గ్రహాన్ని సమగ్రంగా చూడవచ్చు. అనువైన ప్రాంతాలు అనేకమైన వాటిని గుర్తించవచ్చు" అన్నాడు రవి ఒక్కబిగిన-

"నువ్వు చెప్పింది నిజం. నేనంత దూరం ఆలోచించలేదు" అన్నాడు కిశోర్.

"అంతేకాదు. భూమివంటి పెద్ద గ్రహం పైనుంచి అంతరిక్షంలోకి దూసుకుపోవాలంటే ఎంతో ఇంధనం ఖర్చు అవుతుంది. అలాగే ఒక పెద్ద గ్రహమైన అంగారకుని మీద నుంచి కూడా తిరిగి అంతరిక్షంలోకి వెళ్ళాలంటే ఇందులో సగంపైనే ఇంధనం ఖర్చవుతుంది. ఇంత పెద్ద ప్రయోగం చేయాలంటే కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయి. అందువల్ల అంగారకుని నుంచి ఎగిరే ప్రసక్తిలేకుండా ఫోబాస్ మీదనుంచే ఆ గ్రహాన్ని పరిశోధిస్తే ఆ తర్వాత నెలలతరబడి అంగారకుని మీద మకాం పెట్టి ఎంతో ప్రయోజనాత్మకమైన పరిశోధనలను చేయడానికి అవకాశం కలుగుతుంది. ఇప్పుడైతే కేవలం భూమినుంచి టేక్ ఆఫ్‌కి అయ్యే ఖర్చు మాత్రమే ప్రధానమైనది అవుతుంది" అన్నాడు రవి.

"ఓ.కె! మరైతే మన అంతరిక్ష యాత్రకి ముహూర్తమే తరువాయి అన్నమాట" అన్నాడు కిశోర్.

"అవును. దీనికోసం సమగ్రమైన ప్రపోజల్‌ను ప్రభుత్వానికి పంపుతాను. వారి ఆమోదం రాగానే తర్వాత కార్యక్రమం మొదలవుతుంది" అన్నాడురవి.

అప్పటికి ఆ ప్రస్తావన ముగిసింది.

* * * *

రవి పంపిన ప్రపోజల్‌కి ప్రభుత్వ ఆమోదం త్వరలోనే లభించింది. అందుకు అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం కేటాయించింది. వినూత్నమైన ఈ ఆలోచన ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనాన్ని సృష్టించింది.

శ్రీహరికోట షార్ సెంటర్లో రాకెట్ సిద్ధమవుతోంది. అదే రవి, కిశోర్‌లను అంతరిక్షంలోకి తీసుకుపోయి హైలీకామెట్ మీద దింపుతుంది. మరికొన్ని విభాగాలు అంతరిక్ష యాత్రలో వారికి కావలసిన ఆహారం, నీరు, దుస్తులు ఇతర అవసరాలను అమర్చడంలో నిమగ్నమై ఉన్నాయి.

అర్ధసంవత్సరం గడిచిపోయింది. ఇంక నాలుగు రోజుల్లో ఫిబ్రవరి నెల వస్తుంది.

ఆ నెలలోనే హైలీస్ కామెట్ భూమికి అతిచేరువగా వస్తుంది.

ఫిబ్రవరి రాగానే రాత్రిపూట ఆకాశంలో మసకమసకగా చీపురుకట్ట ఆకారం కనిపించసాగింది. రోజురోజుకీ అది మరింత కాంతిమంతం కాసాగింది.

ఫిబ్రవరి 27 వచ్చింది. ఆ రోజు రాత్రి ఆకాశంలో బాణాసంచా కాలుస్తున్నట్టు కాంతులు వెదజల్లసాగింది హైలీకామెట్.

మర్నాడే అది అతి చేరువగా వచ్చేది.

షార్ కేంద్రంలో రాకెట్ సిద్ధంగా ఉంది. ప్రొద్దున 10-30కి బయలుదేరుతుంది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఎందరో ప్రముఖులు, దేశవిదేశ శాస్త్రజ్ఞులు, పాత్రికేయులందరూ ఎంతో ఉత్కంఠతో ఆ కార్యక్రమాన్ని గమనిస్తున్నారు.

రవి, కిశోర్ స్పేస్ దుస్తులు ధరించి రాకెట్లోకి ప్రవేశించారు.

కౌంట్ డౌన్ ప్రారంభం అయింది.

10, 9, 8, 7, 6, 5, 4, 3, 2, 1, 0 అంకెలు చూపసాగింది ఎలక్ట్రానిక్ గడియారం. చివరి అంకెరాగానే భూనభోంతరాళాలు దద్దరిల్లే శబ్దంతో దిగువనుంచి బ్రహ్మాండమైన అగ్నిజ్వాల వెలువడుతుండగా రాకెట్ నిలువుగా ఆకాశంలోకి లేచింది. చూస్తుండగానే కొంచెం సేపట్లో కనుమరుగైపోయింది. ఫస్టుస్టేజి, సెకెండ్ స్టేజి రాకెట్లు విడిపోయాక రవి, కిశోర్ ఉన్న థర్డు స్టేజి రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోయింది.

* * * *

రాకెట్ బయలుదేరి 27 గంటలు దాటింది. హైలీకామెట్ అంతకంతకీ పెద్దగా అద్భుతంగా వర్ణించడానికి అలవికాని అందంతో అంతరిక్షంలో మెరిసిపోతోంది. దాని కాంతిముందు ఆకాశంలో అంతకుముందు పాదరసం బుడ్లలాగా మెరుస్తుండిన నక్షత్రాలు కనుమరుగయ్యాయి.

రాకెట్ హైలీకామెట్‌ని బాగా సమీపించింది. సమయానికి రెట్రోరాకెట్‌ని పేల్చారు. మరికొద్ది నిముషాలలో ఆ తోక చుక్క మీద రాకెట్ సాఫ్టలాండింగ్ చేసింది.

ముందు రాకెట్ కిటికీల్లోంచి నలువైపులా చూశారు. అన్నివైపులా రాళ్ళు, వాటి మధ్య మంచుముద్దలు కనిపిస్తున్నాయి. సూర్యకాంతికి ఆ మంచుగడ్డలు మెరిసిపోతున్నాయి. కొద్దిసేపట్లో వారిద్దరూ నిచ్చెనను బయటికి జరిపి రాకెట్లోంచి బయటకు వచ్చారు. నేల గట్టిగానే ఉంది. వారిద్దరూ ఆ 'తోకచుక్క' మీద కొంతదూరం తిరిగివచ్చారు. తోకచుక్క వ్యాసం చిన్నది కావడంతో ఆకాశం దగ్గర్లోనే నేలని తాకుతున్నట్లు అనిపిస్తోంది. ఆకర్షణశక్తి బాగా తక్కువ కావడంతో ఎంత నెమ్మదిగా నడిచినా గెంతుతున్నట్లుంటోంది. జాగ్రత్తగా తిరిగి కొంత మట్టిని మంచుశిలలను తీసుకుని రాకెట్లోకి వెళ్ళారు.

* * * *

నెలలు గడిచిపోతున్నాయి. తోకచుక్కల్ని భారతీయులు 'ధూమకేతువులు' అంటారు. ఆ ధూమకేతు వాహనం మీద అంతరిక్షంలో రవి, కిశోర్‌ల అంతర్గ్రహయాత్ర సాగుతోంది. అక్కడి నుంచి వారు ఈ అనంత విశ్వంలోని గ్రహాలను, నక్షత్రాలను, గాలక్సీలను టెలిస్కోపుద్వారా పరిశోధించసాగారు. తోకచుక్కమీద సేకరించిన మట్టిని, శిలలను, మంచుగడ్డలను, వాయువులను రాకెట్‌లోని లేబరేటరీలో పరిశోధించసాగారు. వాటి ఫలితాలను గమనించి "నా అభిప్రాయం ప్రకారం తోకచుక్కలు అంగారక గురుగ్రహాల మధ్య ఉండిన గ్రహం ప్రేలిపోయినప్పుడు ఏర్పడిన శకలాలు అన్నవాదం నిజమనిపిస్తోంది" అన్నాడు రవి.

మరి కొద్దిరోజులలో హైలీస్ కామెట్ అంగారక గ్రహానికి బాగాచేరువయ్యింది. సరైన సమయంలో అక్కడినుంచి టేక్ ఆఫ్ తీసుకుని ఫొబాస్ ఉపగ్రహం మీద తమ రాకెట్‌ను దింపారు రవి, కిశోర్‌లు

ఫొబాస్ పైన గట్టి గ్రానైట్ శిలలు వున్నాయి. నీరు, వాయువులు ఏవీలేవు. ఈ గ్రానైట్ శిలల్ని బట్టి

ఫోబాస్ కూడా ఆ పేలిపోయిన గ్రహంలో భాగమని ఇది అంగారకుని ఆకర్షణ వల్ల ఉపగ్రహంగా మారిందని అనిపిస్తోంది. అంగారకుని రెండో ఉపగ్రహమైన డైమోస్ కూడా ఇట్టిదే అని నా అభిప్రాయం'' అన్నాడు రవి.

ఫోబాస్ నుంచి అంగారక గ్రహాన్ని టెలిస్కోప్ ద్వారా మాగ్నెటిక్ సర్వేద్వారా ఇంకెన్నో పద్ధతుల ద్వారా నిశితంగా పరిశీలించారు రవి కిశోర్‌లు. ధ్రువాలమీద పేరుకున్న మంచును చూశారు. హిమాలయాల కంటే మూడురెట్లు అంటే 15 మైళ్ళు ఎత్తున్న నిక్స్ ఒలింపిక్స్ పర్వతాలని చూశారు. 20వేల అడుగుల లోతు, 75 నుండి 150 మైళ్ళ వెడల్పుతో 2300 మైళ్ళ పొడవున్న బ్రహ్మాండమైన లోయను చూశారు. అనేక ఎండిపోయిన నదుల్ని, ఎర్రని మట్టిగుట్టల్ని చూశారు.

''అంగారకుడి మీద ఒకప్పుడు పెద్ద నదులు పారాయని, అగ్ని పర్వతాలు విజృంభించాయని శాస్త్రజ్ఞుల విశ్వాసం. మన పరిశోధనలు ఈ అభిప్రాయాలు వాస్తవమని నిరూపిస్తున్నాయి. బహుశా ఒకప్పుడు జీవం, బుద్ధిజీవులు కూడా ఉండి కాలక్రమేణా అంగారక గ్రహ అంతర్భాగంలోకి వెళ్ళిపోయి ఉండవచ్చు. అంగారక గ్రహం మీదకి దిగినప్పుడు వాటిని అన్వేషించాలి'' అన్నాడు కిశోర్.

అంగారక గ్రహంమీద మనుష్యులు దిగగలిగిన ప్రాంతాలను ఎన్నింటినో గుర్తించి తమ పరిశోధనలను పూర్తి చేసుకున్నారు. ఎప్పటికప్పుడు భూమితో సంబంధాలు పెట్టుకున్నారు. తమ లక్ష్యం పూర్తి అయ్యాక ఫోబాస్‌కి, అంగారకునికి వీడ్కోలు చెప్పారు.

ఫోబాస్ మీదనుంచి టేక్ ఆఫ్ చేసిన రాకెట్ భూమివైపు అంతరిక్షంలోకి దూసుకుపోయింది. అనంతవిశ్వంలో అద్భుత యాత్రానుభవాలను నెమరువేసుకుంటూ తాము బయలుదేరిన విషయం భూకేంద్రానికి తెలియజేశారు రవి, కిశోర్‌లు.

**ఆంధ్రభూమి మాసపత్రిక నవంబర్ 1986** ✪

# అంగారక గ్రహయాత్ర

అది పాపికొండలలోని అటవీ ప్రాంతం. దట్టంగా పెరిగిన చెట్లు గాలికి చేసే చప్పుళ్ళు, పక్షులరవాలు, జంతువుల అరుపులు మొదలైనవాటితో ఆ ప్రదేశం భయం కల్పించేట్లుగా ఉంది. అటువంటి నిర్జన ప్రదేశంలో ప్రముఖ భూతత్వ శాస్త్రవేత్త డాక్టర్ మూర్తి తన పరివారంతో గుడారం వేసుకొని ఉన్నాడు. అక్కడికి కొంచెం దూరంలో విస్తారమైన ఇనుపగనులు వుండే అవకాశం ఉన్నట్లు ఆయన బృందం కనుగొంది. వాటినిసర్వేచేసే ఉద్దేశంతో అక్కడే కాంప్ వేసుకొని ఉన్నాడు ఆయన.

డాక్టర్ మూర్తి వృత్తిరీత్యా భూతత్వ శాస్త్రజ్ఞుడైనా ప్రవృత్తిరీత్యా ఖగోళశాస్త్రవేత్త. అంతరిక్షశాస్త్రం అంటే అయనకి ప్రత్యేకమైన అభినివేశం ఉంది. డాక్టర్ ఆనంద్ ఆయన ప్రాణస్నేహితుడు. వృత్తిరీత్యా ఆయన వైద్యుడేకాని, ఆయనకి కూడా ఖగోళశాస్త్రమంటే ప్రత్యేక అభిమానం. ఈ అభినివేశమే వారిద్దరినీ సన్నిహితులను చేసింది. వారిద్దరు కలిసి డాక్టర్ మూర్తి సొంతంగా నెలకొల్పుకున్న ఖగోళ వేధశాలలో ఎన్నో పరిశోధనలు చేస్తుండేవారు. ఖగోళ విషయంలో అమెరికా, రష్యాలు అద్భుతమైన ప్రగతిని సాధించాయి. రష్యా తొలిసారిగా అంతరిక్షంలోకి మానవుని ప్రవేశపెట్టగలిగితే, అమెరికా ఏకంగా చంద్రమండలంపైనే తొలిమానవుని దింపగలిగింది. రష్యా మానవరహిత శకటం "మూన్ బగ్గీ"ని చంద్రునిమీద తిరుగాడ జేసి అనేక ప్రాంతాల శిలలను సంగ్రహించి భూమికి తెప్పించగలిగింది. ఈ రెండు దేశాలుకూడా మానవరహిత అంతరిక్ష నౌకలను అంగారక శుక్రగ్రహాల మీదకి పంపగలిగాయి. భారతదేశం కూడ ఈ రెండు దేశాలవలె అంతరిక్ష రంగంలో అద్భుత విజయాలు సాధించాలని మిత్రులిద్దరు ఉవ్విళ్ళూరుతుండేవారు. తాము గ్రహాంతర యానం చేయగలిగితే తమజన్మ ధన్యమవుతుందని కలలు కంటుండేవారు.

ఆ రోజు ఇనుపగనులున్న ప్రదేశంలో డైనమైట్ పెట్టి ప్రేల్చడానికి అంతాసిద్ధం అయింది. మూర్తి ఆనంద్‌లు దూరాన్నించి బైనాక్యులర్స్‌తో ఆ దృశ్యాన్ని తిలకించడానికి సిద్ధంగా ఉన్నారు.

"ఢాం" అంటూ డైనమైట్ పేలింది. చిచ్చుబుడ్డినుండి వచ్చే రవ్వల్లా పెద్ద పెద్ద రాళ్ళు ఎగిరిపడుతున్నాయి. మట్టి, పొగ కలసి కుక్కగొడుగు ఆకారంలో ఆకాశంలోకి లేచాయి. ఆ దుమ్ములోనుంచి రాళ్ళు క్రింద పడ్తుండటం కనిపిస్తోంది. ఇంతలో వారిద్దరు తమ కళ్ళను తామే నమ్మలేని దృశ్యాలను



చూశారు. అదిచూసి వారు ఆశ్చర్యంతో కొయ్యబారి పోయారు. కొంచెంసేపటికి తెప్పరిల్లి ఒకరినొకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు.

వాళ్ళను అంతగా విభ్రాంతులను చేసిన దృశ్యం ఇది. సరిగా డైనమైట్‌ను ఉంచిన చోటికి చుట్టూ వున్న కొద్ది ప్రదేశాన్నుండి ఎగిరిన రాళ్ళు క్రిందకు రాకుండా రాకెట్లులా ఆకాశంలోకి నిటారుగా ఎగిరిపోయాయి. ఆ వింత సంఘటనను పరిశోధించడానికి వారిరువురూ హుటాహుటిన అక్కడికి బయలుదేరారు.

డైనమైట్ స్వతహాగా ఉంచినచోట గోయి యేర్పడింది. దాని చుట్టూ సుమారు ఒక గజం మేరకు తెల్లటి గట్టి పదార్థం ఏర్పడింది. దానిమీద కొన్ని రాళ్ళు చెదురుగాపడి ఉన్నాయి. అక్కడి ఉష్ణోగ్రతను కొలిచే ఉద్దేశంతో మూర్తి జేబులో నుంచి తెర్మామీటర్‌ను తీసి ఆ పదార్థం మీద ఉంచాడు. అక్కడి ఉష్ణోగ్రత మామూలుగానే ఉంది. వెంటనే ఒక కాలును దానిమీద పెట్టి దాని గట్టిదనాన్ని పరీక్షించే ఉద్దేశంతో అదిమాడు. వెంటనే అప్రయత్నంగా ఒక వెర్రికేక పెట్టాడు. ఆనంద్ ఆ అరుపుకు ఉలిక్కిపడి "ఏమైంది?" అంటూ దగ్గరకు వచ్చాడు.

మూర్తి తన ఎడమకాలును దానిమీద నుంచి ఇవతలకుతీసి "ఈ పదార్థంమీద కాలు పెట్టగానే ఎడమకాలు అతితేలికగానూ, ఇవతల నేలమీదవున్న కుడికాలును ఎవరో బలంగా లాగివేస్తున్నట్లుగానూ అనిపించింది. ఆ లాగుడుకి నా కాలు ఊడిపోతుందేమోననిపించి అప్రయత్నంగా కేకవేశాను" అంటూ జరిగింది వివరించాడు.

"చిత్రంగా వుందే? నేను రెండు కాళ్ళు పెట్టి చూస్తాను" అంటూ ఆనంద్ తన రెండు కాళ్ళుపెట్టి నుంచున్నాడు. వెంటనే అనందాతిరేకంతో "నా వళ్ళు ఎంతో తేలికగావుంది. గాలిలోకి తేలిపోతానేమోననినిస్తోంది" అంటూ ఎగిరి గంతేశాడు. గంతేశాడోలేదో నిలువుగా గాలిలోకి ఎగరడం ప్రారంభించాడు. వెంటనే మూర్తి ఒక్క ఎగురు ఎగిరి ఆనంద్ రెండు కాళ్ళు పట్టుకొని క్రిందకు లాగాడు. ఇద్దరు కలిసి తెల్లటి పదార్థంమీద సగభాగంగానూ, ప్రక్క నేలమీద సగభాగంగానూ ఉండేటట్లు పడ్డారు. వెంటనే ఇద్దరూ ఒకేసారి బాధకలిగినట్లుగా అరిచారు. నేలమీద పడిన వారిదేహభాగాన్ని ఎవరో లాగివేస్తున్నట్లు బాధ కలిగింది. ఇద్దరూ దొర్లుకుంటూ పూర్తిగా ఇవతలి నేలమీదకు వచ్చేశారు.

కొంత సేపటివరకు వాళ్ళు ఆ విచిత్రానుభూతికి నిశ్చేష్టులై అలాగే ఉండిపోయారు. ముడిపడిన మూర్తి కనుబొమలు చూస్తుంటే అతనేదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లనిపిస్తోంది. అంతలో ఉన్నట్లుండి మూర్తి "ఆనంద్ ఈ రహస్యాన్ని నేను ఛేదించాను" అని గట్టిగా అరిచాడు.

ఆనంద్ అతనివంక ప్రశ్నార్థకంగా చూశాడు. "ఇక్కడి నేలలోవున్న పదార్థంలో ఏదో ప్రత్యేకత ఉంది. దానిమీద డైనమైట్‌ను ప్రేల్చినప్పుడు జనించిన ఉష్ణంవలన దానికి రసాయనిక మార్పు కలిగింది. ఆ విధంగా యేర్పడిన నూతన పదార్థం భూమ్యాకర్షణ శక్తిని నిరోధించేదిగా తయారయింది. గ్రావిటీ (గురుత్వాకర్షణ)ని లేకుండా చేసే ఈ పదార్థానికి 'గ్రావైట్' అని పేరుపెడ్దాం" అన్నాడు మూర్తి.

"అయితే ఈ పదార్థం పూర్తిగా ఎందుకు ఆకాశంలోకి ఎగిరిపోలేదు" అని అడిగాడు ఆనంద్.

"ఈ పదార్థం ఏర్పడింది కొద్ది ప్రదేశంలో మాత్రమే. ఏర్పడిన పదార్థంలో చాలా భాగం మనం చూస్తుండగానే పైకి ఎగిరిపోయింది. మిగిలిన దానిని డైనమైట్ ప్రేలినప్పుడు ఏర్పడిన గోడలు నొక్కి వేస్తున్నాయి" అని విశదీకరించాడు మూర్తి.

"అయితే ఆ గోడలమట్టిని తీసివేస్తే ఇది పైకి ఎగిరిపోతుందా?" అని మళ్ళీ ప్రశ్నించాడు ఆనంద్

"ఎగరదు. ఎందుకంటే అది నిశ్చల స్థితిలో ఉంది. అందువల్ల దానికి చలనం కలిగితేనే ఎగురుతుంది. ఉదాహరణకు అంతకుముందు నువ్వు గ్రావైట్‌మీద నిలబడినప్పుడు నీవు పైకి ఎగరలేదు. ఎప్పుడైతే పైకి గంతువేశావో అప్పుడు నీకు చలనం కలిగి పైకి ఎగిరిపోబోయావు. భౌతిక శాస్త్ర సూత్రాల ప్రకారం ప్రతి పదార్థానికి నిశ్చలస్థితి ఉంటుంది. అట్టి పదార్థానికి చలనం కలిగించితే అవరోధాలు లేనంత వరకు అది గమనం కలిగిన దిశలో వెళ్ళిపోతూనే ఉంటుంది. నీవు మొదట నిలబడినప్పుడు నీ దేహం నిశ్చల స్థితిలో ఉంది. నీవు ఎగిరినప్పుడు నీ దేహానికి చలనం కలిగింది. నేను నిన్ను పట్టుకొని నీ గమనానికి అవరోధం కలిగించి ఉండకపోయినట్లయితే నీవు ఆకాశంలోకి అలా నిటారుగా వెళ్ళిపోతుండేవాడివే. మన గమనం భూమ్యాకర్షణను అధిగమించగలిగితే అనంతవిశ్వంలో గ్రహాంతరయానం సులభమవు తుంది" అన్నాడు మూర్తి వివరంగా.

"అయితే గ్రావైట్‌ని ఉపయోగించి మనం గ్రహాంతరయానం చేయవచ్చా?" అని అడిగాడు ఆనంద్.

"నిజమే ఆనంద్! నాకు ఆ ఆలోచనే రాలేదు. మనం నిజంగా గ్రహాంతరయానం చేయగలం. మన కలలన్నీ నిజమవుతాయి" అంటూ పట్టరాని ఆనందంతో మిత్రుని ఆలింగనం చేసుకున్నాడు మూర్తి.

# 2

మూర్తి, ఆనంద్‌లు గ్రానైట్‌ను గురించి అనేక పరిశోధనలు చేశారు. దానిని ఉపయోగించి అంతరిక్షయాత్ర చేయడం, సాధ్యమేననే నిర్ణయానికి వచ్చారు. తమ పరిశోధనా ఫలితాలను ప్రభుత్వానికి తెలియజేశారు. అంతే కాదు పత్రికాముఖంగా ప్రపంచమంతటికీ తెలియజేశారు. వారి పరిశోధన లోకవ్యాప్తంగా గొప్ప సంచలనాన్ని సృష్టించింది. అనేకమంది శాస్త్రవేత్తలనుంచి సంస్థల నుండి వారికి తరపరంపరగా అభినందన సందేశాలు అందసాగాయి. దానితో వారు ముప్పిరిగొన్న ఉత్సాహంతో స్వయంగా గ్రహాంతరయానం చేయడానికి సంకల్పించారు. ఒకరోజు అదే విషయమై మిత్రులిద్దరూ చర్చించసాగారు.

"ఈ అనంతవిశ్వంలో కోటాను కోట్ల లోకాలలో జీవం ఉన్నా ఇప్పటి మన విజ్ఞానంతో సౌరకుటుంబాన్ని దాటిపోలేం. మరి మనం ఏ గోళానికి యాత్ర సల్పితే బాగుంటుంది?" అని అడిగాడు ఆనంద్.

"మన భూమికి అత్యంత సమీపంగా ఉన్న ఉపగ్రహం చంద్రుడు. దీనిమీద మానవులు కాలూని పరిశోధించడం జరిగింది. అంతకుమించి 'ల్యూనిక్‌లు, 'మూన్‌బగ్గీలు' వంటి వాటిద్వారా నిశితమైన పరిశోధన విశేషంగా జరిగింది. ఇంకా జరుగుతోంది. ఈ పరిశోధనలవల్ల చంద్రునిపై ఏ రకమైన జీవం, ఆఖరికి బాక్టీరియాకూడా లేదని తేలింది. ఇకపోతే మన భూమికి బాగా దగ్గరగాఉన్న గ్రహాలు బుధుడు, శుక్రుడు. బుధుడిమీద కూడా చంద్రునిపైవలె గాలిగాని, నీరుగాని, ఏ విధమైన జీవంగానిలేదు. పైగా అది సూర్యుడికి అతి సమీపంగా ఉండడము వలన దానిపైన లోహాలుకూడా కరిగిపోయేటంత వేడి ఉంటుంది. అందువలన ఈగ్రహంపై కనీసం కాలూనడం కూడా సాధ్యంకాదు. శుక్రునిపైన కూడా సీసం కూడా కరిగిపోయేటంత భరించలేని ఉష్ణం ఉంటుంది. నీరులేదు. పైగా భూమిమీదకంటే నూరురెట్లు ఎక్కువ దట్టంగా వాతావరణం ఉంది. అక్కడి తీవ్రమైన ఎండలమూలంగా ఈ దట్టమైన వాతావరణం మూలంగా మన ఊహకి అందనంత పెద్ద ఇసుక తుఫానులు నిత్యమూ వస్తుంటాయి, ఏతావాతాకాలిన పెనాలవంటి ఉపరితలాలుగల ఈ రెండు గ్రహాలమీద ఏ విధమైన జీవకోటి ఉండే అవకాశం లేదు. మనం వెళ్ళి చేయగలిగిందీ లేదు. ఇకపోతే గురు, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో గ్రహాలు సూర్యునినుంచి పందల కోట్ల మైళ్ళ దూరంలో ఉన్నాయి. బుధ, శుక్రులు నిప్పులుకక్కే గోళాలలయితే ఇవన్నీ అతిశీతల గ్రహాలు. వేలాదిమైళ్ళ మేరకు గడ్డకట్టిన మంచుతోనూ, మిథేన్, అమోనియావంటి విషవాయువులతోనూ నిండివున్న గ్రహాలు. వీటిమీద కూడా జీవకోటివుండే అవకాశం ఎంతమాత్రం లేదు. అందువల్ల మన అంతరిక్ష యాత్రకి ఇవికూడా పనికిరానివే" అంటూ వివరించసాగాడు డాక్టర్ మూర్తి.

"ఆగాగు. మధ్యలో అంగారకుడిని వదిలేశావు" అంటూ అడ్డుతగిలాడు డాక్టర్ ఆనంద్.

"వదిలేయలేదు. కావాలనే చెప్పలేదు. ముందు మనకి పనికిరాని వాటిని ఏరేస్తే పనికివచ్చేవాటి గురించి విపులముగా చర్చించుకోవచ్చు. అంగారకుడు బుధ, శుక్రుల్లా కాలూన్చలేనట్టి ఉష్ణగ్రహం కాదు. చల్లగ్రహమే కాని గురు, శని మొదలైన వాటివలె అతిశీతల గ్రహం కాదు. పైగా మన భూమికీ, అంగారకుడికీ కొన్ని పోలికలున్నాయి. రెండిటి దిన పరిమాణం ఒక్కటే. దీనిపైనా వాతావరణం ఉంది. కనీసం ధృవాల

దగ్గర మంచు రూపంలో నీరుంది. ఋతువుల మార్పులు జరుగుతాయి. వీటన్నింటినిబట్టి జీవజాలం వుండే అవకాశం ఇక్కడ ఉంది. మన అంతరిక్షయానానికి అనువైన యాత్రా స్థలంకూడా ఇదే.

"అంతరిక్షశాస్త్రంలో ప్రత్యేక ప్రజ్ఞ కలిగిన నువ్వు ఇలా మాట్లాడుతుంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. అమెరికా జరిపిన వైకింగ్ ప్రయోగాల ద్వారా అంగారకుడిమీద వృక్షజాలంకాదుకదా. కనీసం గడ్డిపరకలుకూడా లేవని నిరూపితమయింది. ఆఖరికి సూక్ష్మజీవులు వున్న దాఖలాలుకూడా కనిపించలేదు. వైకింగ్ అంతరిక్ష నౌకలు తీసి భూమికి పంపిన వేలాది ఫొటోలలో కేవలం శిలలేతప్ప ఎటువంటి వృక్షజాలంగాని జీవకోటిగాని ఉన్న సూచనైనా కనిపించలేదు. అటువంటప్పుడు అంగారకునిమీద జీవకోటి ఉండే అవకాశం ఉందనే పాత భావాన్ని తిరిగి నువ్వు పాడుతున్నావంటే ఏమనాలో తెలియడంలేదు" అన్నాడు ఆనంద్.

మూర్తి చిరునవ్వునవ్వాడు "నువ్వు చెప్పింది నిజమే కాదనను. అంగారకుని మీద వైకింగ్ జరిపిన ప్రయోగ ఫలితాలు కొన్ని సూక్ష్మజీవుల ఉనికిని తెలియజేశాయి. కాని ఈ మార్పులకి కారణం సూక్ష్మజీవులు కాదు-అక్కడ ఏర్పడుతున్న రసాయనిక మార్పులవల్లనే అని కొందరు అభిప్రాయపడ్డారు. ఏమైనా ఈ విషయంలో శాస్త్రజ్ఞులమధ్య అభిప్రాయ భేదాలున్నాయి. ఆ మాట అలా ఉంచు. వైకింగ్ పంపిన ఫొటోలద్వారా ఆగ్రహంమీద ఒకప్పుడు పెద్ద పెద్ద నదులు పారినట్లు, అవి ఇంకిపోయినట్లు వెల్లడి అవుతోంది. సర్వసృష్టికి మూలంగాలి, నీరు. కనుక ఈ రెండు ఉన్నప్పుడు పైగా అక్కడ నదులు పారుతుండినప్పుడు అందులో జీవసృష్టి కూడా జరిగి వుండవచ్చు. ఏ దశవరకు ఆ పరిణామం జరిగిందో ఇప్పుడు చెప్పలేం. వైకింగ్ పంపిన ఫొటోలు కొన్నింటిలో పెద్ద పెద్ద గోడలు, ఆనకట్టలు, వంతెనలు వంటి దృశ్యాలున్నాయి. వాటి తీరుచూస్తే అవి సహజంగా యేర్పడినవి కాకుండా ఎవరిచేతనైనా నిర్మించబడ్డాయేమో అనిపిస్తుంది. అంగారకునిమీద ఎటువంటి జీవకణజాలపు ఉనికీ గమనించబడలేదు. కనుక ఇవన్నీ సహజంగా యేర్పడిన శిలలేనని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. అయితే నా అభిప్రాయం ప్రకారం అంగారకుడిమీద గతంలో జీవసృష్టి జరగడమేకాకుండా అది అభివృద్ధి చెందిన నాగరికత కలిగిన మానవుని దశ వరకు పరిణామం చెందింది. ఆ తర్వాత ఏ కారణం చేతనో ఆ గ్రహం మీద పరిస్థితులు జీవజాలపు మనుగడకు ప్రతికూలంగా మారాయి. అందువలన క్రమక్రమంగా అక్కడ సర్వసృష్టి పూర్తిగా అంతరించింది. నదులు ఎండిపోయాయి. చెట్లు అంతరించటంతో గాలిలో ప్రాణవాయువు అంతకంతకే తగ్గిపోయింది. నీరు కొద్దిమేరకు కేవలం ధ్రువాల దగ్గరే. అదికూడా మంచురూపంలో మిగిలిపోయింది. నిజానికి ఈ మంచుకూడా నీటిదికాదని, కార్బన్‌డై ఆక్సైడ్ ఘనీభవించగా యేర్పడినదని కొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం. ఆ విషయం అలావుంచు. సృష్టి అంతరించడంతో క్రమముగా ఇసుక తుపానులు అక్కడి నిర్మితమైన ఊళ్ళని, నగరాలని ఇసుకతో కప్పివేశాయి. అతి ఎత్తైన గోడలు, వంతెనలు వంటివి మాత్రమే ఇసుకలోనుంచి తలలు పైకెత్తి ఇందాక నేను చెప్పినట్లు ఫొటోలలో కనిపిస్తున్నాయి. ఇదంతా అంగారకుని గత చరిత్ర గురించి నా ఊహ. ఇదెంతవరకు నిజమో అక్కడికి వెళ్తేగాని తెలియదు. మరో విషయం ఈ ఊహే నిజమైతే మన భూమికికూడా అంగారకునిపై కలిగిన ప్రమాదం వంటిదే కలిగి ఇక్కడి సృష్టికూడా అంతరించవచ్చు. ఆ ప్రమాదానికి కారణమేమిటో తెలుసుకొనగలిగితే భూమిమీద అలాంటిది జరగనీయ కుండా జాగ్రత్తపడ వచ్చు" అన్నాడు మూర్తి.

"నువ్వు చెప్పింది సహేతుకంగా ఉంది. అన్నట్లు మరో విషయం జ్ఞప్తికి వచ్చింది కొందరు శాస్త్రజ్ఞుల

అభిప్రాయం ప్రకారం భూమి, అంగారకుడు, చంద్రుడు ఈ మూడూ మొదట్లో ఒకే గోళంగా ఉండేవి. ఆ తర్వాత ఏ కారణం వల్లనో ఈ గోళం మూడు భాగాలుగా విడిపోయింది. అదే కనుక నిజమైతే భూమిమీద ఆ కాలంలో ఉండిన జీవజాలం అవశేషాలు అంగారకునిపైనా లభించవచ్చు. ఈ సిద్ధాంతాన్ని సరిచూడడానికి కూడా అక్కడికి పోవడం అవసరం'' అన్నాడు ఆనంద్.

''బాగా చెప్పావు. నువ్వు చెప్పిన సిద్ధాంతం సరియైనదే కావచ్చుననడానికి కొన్ని సాక్ష్యాలున్నాయి. చంద్రునిమీద వలెనే అంగారకుడిమీదకూడా వలయపర్వతాలు (క్రేటర్స్), గోతులున్నాయి. భూమికి, అంగారకునికి దిన పరిమాణం 24 గంటలే. ఇంకా ఎన్నో భౌతిక శాస్త్ర సిద్ధాంతాలకు అనుగుణమైన సాక్ష్యాలు ఉన్నాయి. మన ప్రాచీన హైందవ శాస్త్రజ్ఞులుకూడా అదే భావాన్ని వ్యక్తం చేశారు. చంద్రుడు సముద్ర మథన సమయంలో భూమినుండి పుట్టాడని పురాణాలు చెప్తున్నాయి. నవగ్రహ స్తోత్రంలో అంగారకుని ''ధరణీ గర్భ సంభూతం'' అంటే భూమినుంచి పుట్టినవానిగా పేర్కొనడం జరిగింది. ఈ సిద్ధాంతాలను పరిశోధించాలంటే అంగారకగ్రహయాత్ర అవసరం'' అన్నాడు మూర్తి.

''ఇంకేం! అంగారక గ్రహయాత్ర కోసం ఒక పథకాన్ని సిద్ధంచేద్దాం. ఆ పథకానికి అవసరమైన మొత్తాన్ని సమకూర్చడంకోసం మన ప్రభుత్వానికేకాక, ప్రపంచవ్యాప్తంగా విజ్ఞప్తులు పంపుదాం. చరిత్ర సృష్టించి, మన దేశపు కీర్తిని అంతరిక్షంలోనికి పంపుదాం'' అన్నాడు ఆనంద్.

''అలాగే చేద్దాం'' అంటూ లేచాడు మూర్తి. ఆ రోజుకి ఆచర్చ ముగిసింది.

## 3

మూర్తి, ఆనంద్‌లు చేసిన విజ్ఞప్తికి ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రోత్సాహకరమైన ప్రతిస్పందన వచ్చింది. అచిరకాలంలోనే అవసరాన్ని మించిన మొత్తం సమకూరింది. ఆ ప్రోత్సాహంతో వారు పథకాన్ని అమలుపరచే ప్రయత్నాలు చురుకుగా సాగించ మొదలుపెట్టారు.

వారు గ్రావైట్‌ను తగినంత ఉత్పత్తి చేసి దానితో 20 అడుగుల వ్యాసంగల ఒక పెద్ద గోళాన్ని నిర్మించారు. అది గాలితాకిడికి చలనంకలిగి ఎగిరిపోకుండా, దానిని గట్టిగా తాళ్ళతో నేలకి బిగించారు. ఆ గోళానికిచుట్టూ పదహారు కిటికీలు అమర్చారు. ఆ కిటికీల తలుపులను మాత్రం గ్రావైట్‌తో చేశారు. వాటిలోపలి భాగం పగలని గట్టిగాజుతో చేయబడింది. ఆ కిటికీల తలుపులు అన్నీ మూసేస్తే ఆ గోళంపై ఎట్టి ఆకర్షణశక్తి ఉండదు. కాని ఏదైనా కిటికీకి వున్న గ్రావైట్ తలుపులను తెరిచినట్లయితే లోపల గాజు ఉన్న కారణంచేత ఆ ప్రదేశంపై ఆకర్షణ ఉంటుంది.

గోళానికి కట్టిన తాళ్ళను ఊడదీస్తే, గోళం తెరచిన కిటికీ దిశగా పయనిస్తుందన్నమాట. ఆ విధంగా అవసరమైన కిటికీలను తెరుచుకొని గోళాన్ని ఏ దిశలోపడితే ఆ దిశలో ప్రయాణం చేసేటట్లు చేయవచ్చు. ఇది కాక గ్రావైట్‌ను కొన్ని రసాయనిక పదార్థాలతో సంయోగపరచి, పారదర్శకంగా ఉండే పదార్థాన్ని తయారుచేశారు. దీనితో అన్ని దిశలా చూడగలిగే విధంగా ఎనిమిది కిటికీలను అమర్చారు. ఈ కిటికీలపై కూడా ఆకర్షణ శక్తి ఉండదు. ఇంకా గోళంలోపలికి వెళ్ళడానికి, బయటకు రావడానికి ఒక తలుపును అమర్చారు. గోళంలోపల అంతరిక్షయానానికి అవసరమైన సరుకులనన్నీ అమర్చారు.

ఆ రోజు ఆదివారం. ఉదయం ఎనిమిది గంటలకు గోళం ప్రయాణం మొదలిడుతుంది. ఆ

నిర్జన అటవీ ప్రాంతం జనంతో క్రిక్కిరిసిపోయింది. మూర్తి, ఆనంద్‌లు అందరివద్ద సెలవు తీసుకున్నారు. 7-30 గంటలకు గోళంలోపలికి వెళ్ళారు. వెంట షాగీ, జాకీ అనే రెండు కుక్కలను తీసుకుని వెళ్ళారు. వాళ్ళు లోపలికి వెళ్ళగానే. తలుపు మూసుకుంది. లోపల కుర్చీలలో కూర్చుని నడుముకు పటకాలు బిగించుకున్నారు. అక్కడ జనసందోహంలో ఆనందంతోపాటు ఆందోళనకూడా చోటుచేసుకుంది. మూర్తి, ఆనంద్ ఇద్దరూ బ్రహ్మచారులే. జీవితాన్ని అనుభవించనివారు. చిన్నవయసులోనే దేశానికి ఎంతో పేరు ప్రతిష్ఠలు తెచ్చినవారు. అటువంటివారు ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోతున్నారు. తిరిగి వస్తారో...రారో! రాకపోవడానికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందరి ముఖాలలోనూ, ముఖ్యంగా వారి బంధువుల ముఖాలలో ఆవేదన, ఆందోళన ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. నిమిషాలు గడుస్తున్నకొద్దీ అవి అంతకంతకి ఎక్కువవుతున్నాయి.

సమయం 7-45 అయింది. గోళానికి కట్టిన త్రాళ్ళని ఒక్కొక్కదాన్ని విప్పారు. సరిగ్గా ఎనిమిది గంటలకు ప్రధానమంత్రి ఆ అంతరిక్షయాన ప్రారంభ సూచకంగా చివరి త్రాటిని విప్పారు. చూస్తుండగా గోళం తారాజువ్వలాగా ఆకాశంలోకి లేచింది. పదిహేను నిమిషాలైనా గడవకముందే అనంతాకాశంలో అదృశ్యమయింది.

గ్రానైట్ కిటికీలద్వారా భూమి కనిపిస్తోంది. ఆ దృశ్యాన్నే వింతగా చూడసాగారు మిత్రులిద్దరూ చూస్తుండగానే బల్లపరుపుగా ఉన్న భూమి వంపుగా, ఆపైన గోళంగా మారిపోయింది. నీలిసముద్రం, మధ్యన పచ్చని నేల, నల్లని కొండలు, ఆ పైన తెల్లని మేఘాలు-అంతా ఎంతో మనోజ్ఞంగా ఉంది. చంద్రుని కళవలె భూమికి కూడా కళ కనిపిస్తుంది. భూమిపైన పగటి, రాత్రి ప్రదేశాలను వారు ఒకే కంటితో చూడగలుగుతున్నారు.

అంతవరకూ గోళంలో ఉన్న యంత్రాలు బజ్...మంటూ శబ్దాన్ని వినిపిస్తూ వచ్చాయి. ఆ శబ్దం అంతకంతకు తగ్గుతూ చివరకు ఆగిపోయింది.

"మన అంతరిక్ష నౌక భూమిపైనుండే గాలిపొరలలో నుంచి ప్రయాణం చేయడం వలన ఆ శబ్దం ఏర్పడింది. ఇప్పుడు అది భూ వాతావరణాన్ని ఇంచుమించు పూర్తిగా దాటివేసిందన్నమాట. అంతటి వేగంతో మరే ఇతర పదార్థమైనా ప్రయాణించిఉంటే, అది గాలిరాపిడికి మండిపోయేదే. కాని మన పరిశోధనల మూలంగా ప్రత్యేకంగా తయారయిన ఈ గోళం అంతటి రాపిడిని తట్టుకోగలిగింది. పైగా దీని ప్రత్యేకత మూలంగా ఉష్ణంలోనికి ప్రసరించదు. ప్రస్తుతం ఈ గోళోపరితలం రాళ్ళను సైతం కరిగించేటంతటి వేడిమికలదై ఉంటుంది" అని వివరించాడు మూర్తి.

ఆనంద్ ఫ్లాస్క్ అందుకొని కప్పుల్లో కాఫీ పోయబోయాడు. కాని కాఫీ కప్పులో పడకుండా తిన్నగా గోళం మధ్యకి వెళ్ళిపోయింది. కొంచెం అతని బట్టలమీదకు ఒలికింది. అతను ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయాడు. మూర్తికి నవ్వాగలేదు. తనివితీరా నవ్వాక "ఈ గోళం లోపలిభాగం మామూలు పదార్థంతో చేయబడటంవలన, దాని ఆకర్షణశక్తి గోళం మధ్యలో ఉంటుంది. అందువలన సహజంగా ప్రతివస్తువు అటువైపు ఆకర్షింపబడుతుంది. నీ దేహానికికూడా కొంత ఆకర్షణశక్తి ఉండటంవలన కొంచెం కాఫీ నీమీద పలికింది. ఎక్కువ భాగం గోళం మధ్యకు పోయింది. తాడుపుచ్చుకొని గోళం మధ్యకు

కప్పును తీసుకెళ్ళు. కాఫీ అందులో పడుతుంది. అప్పుడు జాగ్రత్తగా కప్పును మూసి కాఫీ తీసుకురా'' అని సలహా ఇచ్చాడు.

మూర్తి చెప్పినట్లే చేయబోయాడు ఆనంద్. కప్పును గోళంమధ్యకు తీసుకొనిపోవడంతో అతని చేయి త్రాటిని వదిలింది. అంతే...అతను నించున్నవాడు నించున్నట్లే గోళం మధ్యకుపోయి తేలడం మొదలుపెట్టాడు. మూర్తి అతని చేయి పట్టుకొని తనవైపు లాగాడు. ఎలాగైతే వారు కాఫీలు పూర్తి చేశారు.

వాళ్ళు కిటికీలోంచి భూమివైపుకు చూశారు. భూమిబాగా చిన్నదైపోయింది. ఎటుచూసినా నక్షత్రాలు విపరీతమైన కాంతిలో ఎలక్ట్రిక్ దీపాలలాగా మెరుస్తున్నాయి. వాటి వెనుక నల్లని ఆకాశం ఒక విధమైన భయాన్ని కొల్పుతోంది.

మూర్తి ''మన భూమిమీద వాతావరణం ఉండడంవలన అది సూర్యకాంతిలోని నీలికిరణాలను చెదరగొట్టి ఆకాశం నీలంగా ఉన్నట్లు భ్రమకల్పిస్తుంది. కాని విశ్వాంతరాళంలో గాలి లేనందువల్ల ఆకాశం నల్లగా కనిపిస్తుంది'' అని విశదపరిచాడు.

## 4

ప్రయాణం మూడు రోజులు సాగింది. ఆ రోజు ఏ కారణం చేతనో జాకీ అన్న కుక్క మరణించింది. మిత్రులిద్దరూ దాని మృతికి చాలా విచారించారు. దాని మృతదేహాన్ని విశ్వాంతరాళంలో వదిలివేయడానికి నిశ్చయించారు.

ఆనంద్ ''మనం దీనిని బయటకు పారవేయడానికి తలుపుతీస్తే లోనిగాలి బయటకు పోతుం దేమో!'' అని సందేహాన్ని వ్యక్తం చేశాడు.

''మరేం ఫర్వాలేదు. గోళం యొక్క ఆకర్షణ శక్తి మూలంగా గాలి లోపలనే ఉంటుంది'' అని సందేహనివృత్తి చేశాడు మూర్తి.

ఆనంద్ గోళం తలుపుతీసి జాకీదేహాన్ని బయటకు వదిలేశాడు. బయట గాలికూడా గడ్డకట్టుకుపోయేటంత చల్లగా ఉంది. తలుపుమూసి తిరిగివచ్చి తన స్థానంలో కూర్చున్నాడు. అతనికి కిటికీలోనుంచి ఒక వింత దృశ్యం కన్పించింది. అమాంతంగా అతను మూర్తి భుజంతట్టి ''చూడుచూడు జాకీ దేహం మన గోళం వెంబడే వస్తోంది'' అని చూపించాడు.

మూర్తి ''అవును మనం తెరచి ఉంచిన ఈ కిటికీ ద్వారా కుక్క ఆకర్షించబడింది. దీని గ్రానైట్ తలుపులను మూసివేస్తే అది విశ్వాంతరాళంలోకి అలా వెళ్ళిపోతూనే ఉంటుంది. ఈ చలిలో అది ఎన్నివేల సంవత్సరాలు గడిచినా చెక్కుచెదరకుండా అలాగే ఉంటుంది. ఏదైనా గ్రహంకాని, ఉపగ్రహంకాని ఇటువస్తే ఇది అటు ఆకర్షించబడి దానిపై పడిపోతుంది. లేకుంటే అలా అనంతయాత్ర చేస్తూనే ఉంటుంది' అని వివరించాడు.

ఇంతలో భయంకరమైన విపత్తు ఒకటి తారసిల్లబోయింది. కిటికీలోనుంచి చూస్తున్న వాళ్ళకు అనతిదూరంలో ఒక ఉల్క బ్రహ్మాండమైన వేగంతో గోళంవైపు వస్తూ కన్పించింది. నిమిషంలో అది వచ్చి గోళాన్ని గుద్దివేస్తుంది. అంతటితో ఆ గోళం చరిత్ర, మిత్రులిద్దరి చరిత్ర పరిసమాప్తి అవుతుంది. ప్రమాదం

కనిపెట్టిన మూర్తి ఉల్కకు వ్యతిరకదిశలో ఉన్న నాలుగు కిటికీలను త్వరగా తెరిచేశాడు. వెంటనే గోళం ఆ దిశగా వేగాన్ని పుంజుకుంది. ఉల్క గోళాన్ని ఇంచుమించుగా దూసుకుంటూ వెళ్ళిపోయింది. అది తనతోపాటు జాకీ దేహాన్ని కూడా తీసుకునిపోయింది. వీరికి ప్రమాదం తప్పింది.

నెలరోజులు గడిచాయి. అంగారక గ్రహాన్ని చేరడానికి ఇంకా ఒక్క రోజు మాత్రమే మిగిలివుంది. అప్పుడే గోళాన్ని జాగ్రత్తగా అదుపులో పెట్టుకోవాలి. మధ్యాహ్నం రెండు గంటలకు గోళం అంగారక గ్రహపు ఆకర్షణ పరిధిలోకి జేరి ఆ గ్రహం చుట్టూ దీర్ఘ అండవృత్తాలు చేయసాగింది. అక్కడనుంచి టెలిస్కోప్ ద్వారా వారు అంగారక గ్రహమండలాన్ని పరిశీలించడం మొదలుపెట్టారు.

రోదసినుంచి అంగారక గ్రహాన్ని పరిశోధించడం పూర్తి అయ్యాక అంగారకుడి వైపునుండే కిటికీని తెరిచాడు మూర్తి. గోళం వేగాన్ని పుంజుకుంటూ గ్రహం దిశగా పయనించసాగింది. రోదసినుంచి గ్రహంతోపాటు అంగారకుని ఉపగ్రహాలైన ఫొబాస్, డైమోస్‌లను కూడా పరిశోధించారు. అవి రెండూ అతిచిన్న అల్పగోళాలు. వాటి వ్యాసం కొద్ది కిలోమీటర్లు మాత్రమే. అవి అంగారకునికీ, గురుగ్రహానికి మధ్యన ఉన్న వేలాది అల్పగ్రహాలకు చెంది, అంగారకుని ఆకర్షణచేత లాగబడి ఉపగ్రహాలుగా మారినవై ఉంటాయని భావించాడు మూర్తి.

గోళం అంగారకునికి బాగా చేరువ అయింది. మూర్తి, ఆనంద్ టెలిస్కోప్ ద్వారా గ్రహోపరిభాగాన్ని అత్యంతోత్సాహంతో పరిశీలిస్తున్నారు. మంచుతో కప్పబడిన ధ్రువాలు, పెద్ద పెద్ద మైదానాలు, వలయపర్వతాలు చెల్లాచెదురుగావున్న శిలలు అన్నీ వింత అందంతో కనిపిస్తున్నాయి. గ్రహంమీద పగలు, రాత్రి భాగాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గ్రహోపరితలంమీద మాత్రం చెట్టుచేమలు ఏమీ ఉన్నట్లు కనిపించడంలేదు. గోళం గ్రహోపరితలాన్ని బాగా సమీపించింది. గోళం మహావేగంతో క్రిందకు దూసుకుపోతోంది. ఆ సమయంలో గ్రానైట్ తలుపులను జాగ్రత్తగా మూసి గోళం వేగాన్ని అదుపుచేసి ఎంతోనేర్పుతో నేలమీదికి దింపాలి. అయితే దురదృష్టవశాత్తు ఆ సమయంలో అంగారక గ్రహంపై ఉన్న కిటికీ ఒకటి ఏ కారణంచేతనో మూసుకోవడం మానివేసింది. ఎంత ప్రయత్నించినా అది మూసుకోలేదు. ఇంక సమయములేదు. మరో పది, పదిహేను నిముషాలలో అది మహావేగంతో అంగారకగ్రహాన్ని ఢీకొని తునాతునకలైపోతుంది.

మూర్తి వెంటనే "ఆనంద్! నువ్వు ధరించిన గ్రహాంతరయాన దుస్తుల్ని సరిచూసుకో సాగీకీ కూడా సరిచూడు. వెంటనే పారాచ్యూట్‌ను తగిలించుకో. నీ చేత్తో సాగీని పట్టుకో నేను పారాచ్యూట్ తగిలించుకుంటాను. వెంటనే మనం క్రిందకు దూకేయాలి. వీలైతే చేతికందిన సామాను తీసుకుందాం" అన్నాడు త్వరత్వరగా.

మూర్తి చెప్పినట్లే చేశాడు ఆనంద్. మూర్తికూడా పారాచ్యూట్ తగిలించుకున్నాడు. గోళం మహావేగంతో నేలను సమీపిస్తోంది. మిత్రులిద్దరూ సాగీతో సహా, గోళం తలుపుతీసి క్రిందకు దూకేశారు. వెంటనే ఎవరో వాళ్ళ వీపుల్ని బలంగా లాగినట్లనిపించింది. పారాచ్యూట్లు తెరుచుకున్నాయి. వాళ్ళు నెమ్మదిగా క్రిందకు దిగసాగారు. అంగారకుని మీద గాలి ఉండడంవల్ల పారాచ్యూట్లు ఉపకరించాయి.

చూస్తుండగా మరునిమిషంలో గోళం ఒక విశాలమైన మైదానాన్ని ఢీకొని తునాతునకలైపోయింది.

వెంటనే మంటలు లేచి అతిత్వరలోనే చల్లారిపోయాయి. అంగారకుని వాతావరణంలో ప్రాణవాయువు అతితక్కువగా ఉండడం వల్ల ఇలా జరిగింది.

గోళం పడిన స్థలానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో మూర్తి, ఆనంద్ ఉన్నారు. వ్యవధి లేకపోవడంవల్ల ఏ విధమైన సామానునీ వారు వెంట తెచ్చుకోలేకపోయారు. గోళం గతి ఏమైనదోనన్న దిగులుతో వారు ఆ దిశగా పరుగెత్తారు. వాళ్ళ కాళ్ళు నేలమీద తేలిపోతున్నాయి. ఇక్కడ గంతువేస్తే అక్కడికి పోతున్నారు. ఎంతదూరమైనా ఇట్టే పరుగెత్త వచ్చు ననిపించింది. ఇందుకు కారణం అంగారకునిమీద ఆకర్షణ భూమిమీదకంటే బాగా తక్కువ కావడమే. ఆ మూడు కిలోమీటర్ల దూరం వెళ్ళడానికి వారికి పదినిమిషాలుకూడా పట్టలేదు.

వారు గోళం కూలిపోయిన చోటును చేరుకున్నారు.

గోళం తునాతునకలై ఉంది. గ్రానైట్ ముక్కలు అనేకం అంతరిక్షంలోకి ఎగిరిపోయాయి. భోజనసామగ్రి, దుస్తులు, రేడియో ప్రసారక యంత్రంతో సహా యంత్రాలన్నీ ముక్కలు ముక్కలయి ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

ఆనంద్! మన అంతరిక్షయాత్ర ఈ విధంగా పరిసమాప్తి అవుతుందనుకోలేదు. ఇక మనకీ భూమికీ రుణం తీరిపోయింది. ఈ నిర్జన లోకంలో మనకు మృత్యువు తప్పదు" అన్నాడు ఆవేదనతో మూర్తి.

"దిగులుపడకు మూర్తీ. అవసరం కలిగినప్పుడే మనిషిబుద్ధి వికసిస్తుంది. మనకు ఏదోఒక ఉపాయం తట్టకపోదు. ఒకవేళ మనం మరణించినా అది వీర మరణం అవుతుంది" అని ప్రోత్సాహపరిచాడు ఆనంద్.

"ముందు మనం ఈ చెల్లాచెదురైన మన సామాగ్రిలో పనికివచ్చే దాన్ని ఏరుకుని ఎక్కడైనా భద్రపరచుకోవాలి. ఈ దగ్గరలో మంచిచోటు ఏమైనా కనిస్తుందేమో వెతుకుదాం పద" అన్నాడు మూర్తి.

అనతి దూరంలోనే ఒక కొండ, అందులో ఒక గుహ కనిపించాయి. మూర్తి, ఆనంద్ అందులోకి వెళ్ళి చూశారు. అక్కడి దృశ్యం చూసి వాళ్ళకి అమిత ఆనందాశ్చర్యాలు కలిగాయి. ఆ గుహలోపల వెలుగును వెదజల్లే మొక్కలున్నాయి. గోడలనుంచి నీరు ఊరి సన్నధారలుగా కారుతోంది. మొక్కల వెలుగుతో గుహ ప్రకాశవంతంగా ఉంది.

మూర్తి "ఈ గుహ మనకి అనువుగా ఉంది. అంగారక గ్రహం మీద అల్పతరగతి జీవజాలం ఉందని రుజువైంది. అయితే నేలపైన బొత్తిగాలేకపోవడంతో వైకింగ్ నౌకలు దీని ఉనికిని గుర్తించలేకపోయాయి. ఇంకా ఇక్కడ ఎటువంటి జీవం ఉందో! ముందు మన సామాను ఇక్కడకు చేర్చుకున్నాక అన్వేషిద్దాం" అన్నాడు.

వారిద్దరూ, చెదిరిపోయిన సామగ్రిదగ్గరకు వెళ్ళారు. దానిని ఏ విధంగా గుహకు తీసుకువెళ్ళాలో అన్న సమస్య ఎదురయింది.

ఆనంద్ "అక్కడ ఇంకా కొన్ని గ్రానైట్ ముక్కలు నిశ్చలస్థితిలో పడి ఉన్నాయి కదా! వాటి సహాయంతో ఈ సామగ్రిని మనం సులువుగా తీసుకొని పోవచ్చు" అన్నాడు.

"అవును. అంతేకాదు మన బూట్లకు అడుగున ఈ గ్రానైట్ ముక్కలను కట్టుకుంటే అతివేగంతో పరిగెత్తవచ్చు" అన్నాడు మూర్తి.

ఆ ప్రకారం వారు గ్రానైట్ ఉపయోగించి అతిత్వరలో సామానును గుహకు చేర్చారు. తక్కిన భోజన పదార్థాలని షాగీతోసహా ఆరగించారు. అలసటకి వాళ్ళకి నిద్రముంచుకొచ్చింది. కొంత సేపు ఆదమరచి నిద్రపోయి లేచారు. అంగారక గ్రహ మండలాన్ని పరిశోధించడానికి సిద్ధమయ్యారు. ఆ గుహ గుర్తుగా ఉండేటట్లు ఒకత్రాటికి గ్రానైట్ ముక్కను కట్టి దానికి భారత పతాకను కట్టారు.

మొదటిసారిగా అంగారక గ్రహంపై కాలూనిన కీర్తి భారతదేశానికి దక్కింది. మిత్రులిద్దరూ అంగారక గ్రహ పరిశోధనకు బయలుదేరారు. మట్టి అంతా ముదురు ఎరుపురంగులో ఉంది. అందుకనే అంగారక గ్రహం భూమినుంచి చూస్తే కణకణలాడేనిప్పులా ఎర్రగా మెరుస్తూ కనిపిస్తుంది. ఆ మట్టిని పరీక్షించి చూశాడు మూర్తి. అందులో ఐరన్ ఆక్సయిడ్ ఎక్కువున్నట్లు అనిపించింది. ఏ కారణంచేతనో గాలిలోని ప్రాణవాయువుని ఆ మట్టి పీల్చివేసిందన్నమాట. అంటే ఒకప్పుడు అక్కడి వాతావరణంలో ఆక్సిజన్ పుష్కలంగా ఉందన్నమాట. మరికొంతదూరం పోయేసరికి లోయ వంటిది కనిపించింది. దగ్గరకుపోయిచూస్తే అక్కడ ఒకప్పుడు పెద్ద నది ప్రవహించినట్లనిపించింది. అక్కడి నేలకూడా మెత్తగా, ఇసుకలాగా ఉంది. అక్కడ లోతుగా త్రవ్వితే నీరు ఉంటుందన్న నమ్మకం కలిగింది మూర్తికి. అయితే ఎక్కడా ఎటువంటి మొక్కలుకాని, కీటకాలుగాని కనిపించలేదు.

ఆ ప్రాంతాన్ని పరిశోధించిన మూర్తి "దురదృష్టవశాత్తు మన యంత్రాలు, పరికరాలు అన్నీ నాశనమైపోయాయి. అందువల్ల ఏ విషయాన్ని ఖచ్చితంగా చెప్పలేకపోతున్నాను. ఇంతవరకు నేను గమనించినదాని ప్రకారం బహుశా ఒకప్పుడు అంగారకుడు భూమిలో అంతర్భాగమే. చంద్రుడుకూడా కలిసే ఉండవచ్చు. గాలి, నీరు, తగిన ఉష్ణోగ్రత ఉన్న ఈ చోట గతంలో జీవసృష్టి అవతరించింది. నా నమ్మకం ప్రకారం ఇక్కడ నేలనిత్రవ్వితే తప్పక పురాతన అవశేషాలు బయటపడతాయి" అన్నాడు.

"అటు చూడు. ఈ నదిలాంటిదాని ఒడ్డున ఏదో గోడలాగా కనిపిస్తోంది" అన్నాడు ఆనంద్.

ఇద్దరూ దగ్గరికివెళ్ళి చూశారు. అది కేవలం గోడకాదు. రాతితో కట్టిన ఒక పెద్ద భవనంలో భాగం. ఆశ్చర్యంతో వాళ్ళు కొంతసేపు అలాగే ఉండిపోయారు.

మూర్తి "మనం అనుకున్నట్లే ఒకప్పుడు ఇక్కడ మానవుని వరకూ పరిణామం చెందిన జీవం ఉండిందన్న మన అనుమానం నిజమయింది. మరి ఈ సృష్టి ఎందుకు అంతరించిందో?" అంటూ ముందుకు సాగాడు.

ఆ కట్టడం దగ్గరికి వెళ్ళేసరికి వాళ్ళు మరింత ఆశ్చర్యంతో మునిగిపోయారు. అది బ్రహ్మాండమైన పిరమిడ్. లోపలికి పోయి చూస్తే గోడలమీద ఎన్నో చిత్రాలు, మధ్యలో నేలమీద పెద్ద పెట్టెలలో మమ్మీలున్నాయి. గోడలకున్న మణులు కాంతులీనుతున్నాయి. లోపల కొన్ని మొక్కలుకూడా వెలుగును వెదజల్లుతున్నాయి.

"ఈ విచిత్రం చూశావా! మన భూమి మీద ఈజిప్టు దేశంలో, నైలు నదితీరంలో ఎన్నో బ్రహ్మాండమైన పిరమిడ్‌లు ఉన్నాయి. వాటిని ఇతర గ్రహవాసులు నిర్మించారన్న సిద్ధాంతం ఒకటి ఉంది. ఇక్కడకూడా

ఈ పిరమిడ్‌లు చూశాక ఈ సిద్ధాంతం నిజమేనేమోననిపిస్తుంది. ఇతర నక్షత్ర మండలాలకు చెందిన బుద్ధిజీవులు మన భూమిమీద, ఈ అంగారక గ్రహంమీద కూడా ఈ పిరమిడ్‌లు నిర్మించి ఉండవచ్చు. ఈ కుడ్య చిత్రాలని పరిశీలిస్తే, ఇక్కడి చరిత్ర మనకేమైనా తెలుస్తుందేమో. కాని ఇక్కడి వెల్తురు చాలదు'' అన్నాడు మూర్తి. మరికొంచెం సేపటిలో సూర్యుడు బాగా పైకి వచ్చాడు. ఆ పిరమిడ్ ద్వారాలు సూర్యునికి అభిముఖంగా ఉండడంతో వెల్తురు బాగా లోపలికి వచ్చింది. దాంతో గోడలమీద చిత్రాలు స్పష్టంగా కనిపించసాగాయి.

ముందు వాళ్ళిద్దరు సమాధులలోని మృతదేహాలు పరిశీలించారు. అవి మానవ దేహాలనేపోలి ఉన్నాయి. అయితే వారు బాగా పొడగరులు. వేషధారణకూడా ప్రాచీన మానవులదిలాగానే ఉంది.

"భూమిమీద, అంగారకుడిమీద ఒకే విధమైన మానవరూపాలు ఉండడం, ఈ రెండిటిమీద సృష్టి ఒకేరకంగా పరిణమించడాన్ని సూచిస్తోంది. ఇది ఈ రెండు గ్రహాలు ఒకప్పుడు కలిసి ఉండేవన్న వాదాన్ని బలపరుస్తోంది'' అన్నాడు మూర్తి.

ఆ తర్వాత కుడ్య చిత్రాలను ఇద్దరూ పరిశీలించారు. "మూర్తీ! నీ ఊహనిజమే కావచ్చు. ఈ చిత్రాలు క్రమంగా చూస్తే, ఈ గ్రహ చరిత్ర అవగతమవుతోంది'' అన్నాడు ఆనంద్ ఆనందంతో.

"అవును. ఇదిగో ఈ చిత్రంలోని గోళం మన భూమినిపోలి ఉంది. తర్వాత చిత్రంలో గోళం చిన్నదిగా ఉంది. అది బహుశ అంగారకుడు భూమినుంచి విడిపోవడాన్ని సూచించవచ్చు. తర్వాతి చిత్రాలలో అడవులు, నగరాలు, మనుష్యులు, జంతువులు కనిపిస్తున్నాయి. అంటే జీవజాలంతో ఈ లోకం కళకళలాడుతుండేదన్నమాట. ఆ తర్వాతి చిత్రాలలో అణుబాంబుల విస్ఫోటం కనిపిస్తోంది. చివరి చిత్రాలలో చెట్లని నరికివేయడం, నేల ఎర్రగా మారడం కనిపిస్తోంది. చివరి చిత్రాలలో నగరాలు కూరుకుపోవడం, కొన్ని అంతరిక్ష నౌకలు ఇతర గ్రహాల దిశగా పోవడం కనిపిస్తోంది'' అన్నాడు మూర్తి.

"ఇప్పుడు ఈ గ్రహం చరిత్ర నాకు బాగా అర్థమయింది. సస్యశ్యామలంగా విజ్ఞానాభివృద్ధిలో విలసిల్లుతుండిన ఈ లోకంలో విజ్ఞానం వెర్రితలలు వేసింది. వివిధ దేశాలు అణ్వాయుధాలను ప్రయోగించాయి. ఫలితంగా కాలుష్యం ఏర్పడి, రేడియో ధార్మికశక్తివల్ల ఇక్కడి జీవజలానికి ఎంతో ముప్పు ఏర్పడింది. పైగా విచక్షణారహితంగా చెట్లను కొట్టివేయడంతో గాలిలోని ఆక్సిజన్ అంతకంతకు తగ్గిపోయింది. అణ్వస్త్రాలవల్ల నేల స్వభావంకూడా మారి, గాలిలోవున్న ఆక్సిజన్‌ని పీల్చివేసింది. చివరకి ఈ లోకం నివాసయోగ్యం కాకుండా పోయింది. అంతటితో ఇక్కడ మిగిలినవారు అంతరిక్ష నౌకలలో ఇతర గ్రహాలకు వలస పోయారు'' అన్నాడు ఆనంద్.

"సరిగ్గా చెప్పావు. ఈ చిత్రంలో సూచించినదాని ప్రకారం వీరు గురుగ్రహం దిశగా వెళ్ళారు. అయితే గురుగ్రహం వాసయోగ్యంకాదు. కాని దాని ఉపగ్రహాలైన కాలిస్టో, గానిమేడ్ వంటి వాటిమీద నీరు, గాలి ఉన్నాయి. బహుశా అటువంటి వాటిమీదకు వెళ్ళి ఉండవచ్చు'' అన్నాడు డాక్టర్ మూర్తి.

"ఎంత విచిత్రం! మనభూమి చరిత్రకీ, అంగారకుని చరిత్రకీ ఎంతటి సామ్యం ఉంది. ఇక్కడ జరిగిన పొరపాట్లే మన భూమిమీదకూడా జరుగుతున్నాయి. ఈ లెక్కన మన భూమికూడా త్వరలోనే నివాసయోగ్యం కాకుండా పోయి, మనం కూడా వేరే లోకాలకు వలసిపోవలసి రావచ్చును. ఈ కఠిన

వాస్తవాన్ని మనవారికి తెలియజేయడం ఎలా? కనీసం మన ట్రాన్సిస్టర్‌కూడా పనిచేయడంలేదుకదా!" అని వాపోయాడు ఆనంద్.

ఇద్దరూ కలిసి మరికొంచెం ముందుకి వెళ్ళారు.

"ఆనంద్! అటుచూడు. అక్కడ ఉన్న గోళం మనం చూసిన చిత్రాలలోని అంతరిక్షనౌకవలె ఉందికదూ?" అంటూ వడివడిగా అటు నడవసాగాడుమూర్తి.

ఇద్దరూ కలిసి మరికొంచెం ముందుకి వెళ్ళారు. దానిని సమీపించిచూస్తే అది నిజంగా అంతరిక్షనౌకే. నిశితమైన మూర్తి దృష్టికి అందులోని యంత్రాల్ని పనిచేయించే విధానం తెలియడానికి ఎంతో సమయం పట్టలేదు. ఆ గోళాన్ని నిర్మించిన పదార్థాన్ని పరీక్షించి ఆనందంతో ఎగిరి గంతువేశాడు.

"ఆనంద్...ఇది కూడా గ్రానైట్‌తోనే చేయబడింది. దీనిని నేలకు గట్టిగా కట్టివేశారు. వీళ్ళుకూడా ఇటువంటి నౌకలలోనే ప్రయాణించారన్నమాట. ఈ నౌకని వాళ్ళవాళ్ళెవరికోసమో ఉద్దేశించి ఉంటారు. చివరకు అది మనకి ఉపయోగపడ్తోంది" అన్నాడు పట్టలేని ఆనందంతో.

ఆ నౌకలోని రేడియోయంత్రం ద్వారా జరిగినదానిని వివరిస్తూ భూమికి సందేశం పంపాడు మూర్తి. ఆ తర్వాత అంగారక గ్రహం మీదున్న అల్పజాతి వృక్షజాలాన్ని, శిలలనూ, మట్టినీ, ఇంకా ఎన్నింటినో నౌకలోకి జేర్చారు వాళ్ళు. వారి పిరమిడ్లలోని సమాధులదగ్గర రసాయన పదార్థాలతో నిలవ ఉంచిన ఆహార పదార్థాలు, పళ్ళూ ఉన్నాయి. వాటినీ, ఒక మమ్మీనీ కూడా నౌకలోకి ఎక్కించారు. వీలైనంతవరకు గ్రహాన్ని పరిశోధించారు.

మర్నాడు ఉదయమే నౌకలోకి ప్రవేశించారు డాక్టర్ మూర్తి, ఆనంద్. లోపలనుంచి వేసిన ముడిని విప్పారు. వెంటనే అంతరిక్ష నౌక ఆకాశంలోకి లేచింది. మూర్తి ఆధ్వర్యంలో అది అంతకంతకూ వేగం పుంజుకుంటూ భూమివైపు పయనించసాగింది, శునకమిత్రంతో సహా.

సైన్స్‌వాణి, మార్చి 1987 ✪

కథా నిలయం
4569
శ్రీకాకుళం

# ప్రళయాగ్ని

అమెరికాలో వేల సంఖ్యలో భారతీయ శాస్త్రజ్ఞులున్నారు. వారిలో గణనీయమైన సంఖ్యలో ఆంధ్రప్రదేశ్‌కి చెందినవారున్నారు. అమెరికాలో మన శాస్త్రవేత్తలకి మంచి పేరూ, గౌరవమూ, గుర్తింపూ ఉన్నాయి. వారు తెలివిగల వారనీ, కష్టించి పనిచేస్తారనీ ప్రతీతి.

డాక్టర్ కెనడీ అమెరికాలో మంచి పేరున్న జియోఫిసిస్ట్. ఆ రోజు రాత్రి ఆయన తన సొంత లేబొరేటరీలో ఏవో శిలలను పరిశోధిస్తున్నాడు. ఆ పరిశోధన ఎంతో ఆసక్తికరంగా ఉండడంతో అర్ధరాత్రి రెండు గంటలైనా కాలం సంగతి మరిచిపోయాడు.

ఉన్నట్లుండి ఆకాశంలో పెద్ద వెలుగు, దానినంటి జుయ్యిమంటున్న శబ్దమూ వినిపించాయి. కిటికీలో నుంచి వచ్చిన ఆ వెలుగుతో ఆయన గది పట్టపగలుగా మారిపోయింది. వెంటనే ఆయన బాల్కనీలోకి వచ్చి చూశాడు. దగ్గరలో ఉన్న గుట్ట వెనకాల అతి కాంతిమంతమైన ఉల్క ఒకటి రాలిపోతూ కనిపించింది. అది నేలను తాకగానే పెద్ద చప్పుడూ, ఆ వెంటనే ఉవ్వెత్తుగా ఎగిసిన మంటలూ కనిపించాయి. ఆ ఉల్క అక్కడికి దగ్గరలోనే ఉన్న గుట్ట వెనుక పడ్డట్లు గమనించాడు.

మర్నాడు ప్రొద్దున్నే డాక్టర్ కెన్నడీ ఆ ప్రాంతానికి వెళ్ళాడు. ఆ ఉల్కా పాతం వల్ల ఏర్పడ్డ గోతిని సులువుగానే గుర్తించాడు. అది సుమారు ఇరవై అడుగుల లోతు, ముప్పది అడుగుల వైశాల్యంతో గరాటు ఆకారంలో ఏర్పడింది. ఆ దగ్గరల్లోని తుప్పలూ, దుబ్బులూ ఆ వేడికి మాడిపోయాయి. ఆ ఉల్క ఏమంత పెద్దదయి ఉండకపోవచ్చు. అందుకనే సూటిగా నేలలో బాగాలోతుగా దిగిపోయి ఉంటుంది. అందువల్ల ఎంత వెదికినా అది కనిపించలేదు.

ఆ గోయి చుట్టూ లేచిన మట్టినీ, మాడిపోయిన మొక్కల్నీ పరీక్షిస్తుంటే ఒకచోట మట్టిలోనించి ఏదో తళుక్కుమంటూ కనిపించింది. కోడిగ్రుడ్డు పరిమాణంలో ఇంచుమించు గుండ్రని ఆకారంలో ఉన్న ఆ శిలను బయటికి తీసి పరీక్షించాడు డాక్టర్ కెనెడీ. అది ఆ ఉల్కలోభాగం కాని, లేదా దానితోపాటు వచ్చిగాని ఉండాలి. అదీగాకపోతే అమిత ఉష్ణంతో మండుతూ వచ్చిన ఆ ఉల్కవేడికి అక్కడి నేలలోని పదార్థం ఏదైనా అలా మారిపోయి ఉండాలి. అటువంటి శిలలు వేరే ఏమైనా అక్కడ దొరుకుతాయోమోనని



జాగ్రత్తగా వెతికాడు, కాని అటువంటివేమీ కనిపించలేదు. వెంటనే ఆ శిలను ఒక గుడ్డలో చుట్టి ఆ మూటను తన కిట్‌లో పెట్టుకుని తిరిగి తన లేబొరేటరీకి చేరుకున్నాడు డాక్టర్ కెనెడీ.

లేబొరేటరీకి చేరగానే ఆ శిలపై ప్రాథమిక పరీక్షలు జరిపాడు అయన. ఆ శిల బరువు మామూలు గ్రానైట్ శిలకంటే ఎక్కువగా ఉంది. కార్బన్ అమిత ఒత్తిడికి, ఉష్ణానికీ గురి అయితే వజ్రంగా మారుతుంది. ఇది కూడా వజ్రం కాదు కదా అని పరిశోధించాడు. వజ్రం అయితే ఇంకా ఎక్కువ బరువు ఉంటుంది. పైగా కోతకోయక ముందు వజ్రానికి ప్రత్యేకమైన ప్రకాశం ఉండదు. అదీగాక వజ్రం కొన్ని కోణాలలోనే ప్రకాశిస్తుంది. కాని ఇది స్వయంప్రకాశంగా ఉంది. ఎండలో దాని కాంతి కనపించడం లేదుగానీ ఏ కొంచెం నీడలోనైనా, చీకటిలోనైనా అది ఎంతో ప్రకాశమానం అవుతోంది. అయితే ఆ ప్రసారం కిరణాల రూపంలోకాక పల్చగా వ్యాపించినట్లు ఇంకా సరిగ్గా చెప్పాలంటే పౌర్ణమి వెన్నెలలాగా, మబ్బులలో నుంచి వచ్చే సూర్యకాంతి లాగా ఉంది. అటువంటి లక్షణాలున్న శిలను డాక్టర్ కెన్నెడీ అంతకుముందెప్పుడూ చూడలేదు. అసలు అది భూమికి సంబంధించిన దేనినీ పోలి ఉన్నట్లనిపించడంలేదు. వేరే పనులు ఉండడంతో అప్పటికి ఆ పరిశోధన ఆపి దానిని జాగ్రత్తగా గుడ్డలో చుట్టి ఆ మూటని అల్మారాలో పెట్టి తాళం వేశాడు ఆయన.

* * * *

మర్నాడు తిరిగి ఆ శిలను పరిశోధించడం మొదలుపెట్టాడు డాక్టర్ కెనెడీ. ముందుగా దానిని

వివిధ కోణాలలో ఫొటోలుతీశాడు. ఆ తర్వాత ఆ ఫిల్మ్‌ను డెవలప్ చేస్తూ దిగ్భ్రాంతి చెందాడు. ఎందుకంటే అప్పటికే ఆ సరికొత్త ఫిల్మ్ పూర్తిగా ఎక్స్‌పోజ్ అయిపోయి వుంది. అలా ఎందుకు జరిగిందో వెంటనే ఆయనకు అర్థంకాలేదు.

తర్వాత అల్మారాలోనుంచి మరో కొత్త ఫిలింతీశాడు. దాంతో మళ్ళీ వేరే ఫిల్మ్‌తో ఫొటోలు తీసి డెవలప్ చేయబోయాడు. ఈసారి ఆయనకి మతిపోయినట్లయింది. ఈ ఫిల్మ్‌కూడా పూర్తిగా ఎక్స్‌పోజ్ అయిపోయింది. జాగ్రత్తగా ఆలోచించేసరికి ఆ కల్‌ప్రిట్, ఆ అసలు నేరస్తుడు ఆ విచిత్ర శిలేనని బోధపడింది.

డాక్టర్ కెనెడీ కొత్త ఫిలిం రోల్‌వున్న కిట్‌లోనే ఆ శిలను కూడా వేశాడు. దానిని గుడ్డలో బాగాచుట్టినా, దాని రేడియేషన్ మూలంగా ఆ ఫొటో ఫిల్మ్ ఎక్స్‌పోజ్ అయిపోయింది. తర్వాత అల్మారాలో పై అరలో చెక్కపెట్టెలో గుడ్డమూటలో ఆ శిలను ఉంచాడు. అదే అల్మారాలో అట్టడుగు అరలో బ్రీఫ్‌కేస్‌లో ఫొటో ఫిల్మ్‌లున్నాయి. అయినప్పటికీ వాటిలోంచి తీసిన ఫిల్మ్‌కూడా పూర్తిగా ఎక్స్‌పోజ్ అయిపోయిందంటే ఆ శిలనుంచి అమిత శక్తిమంతమైన రేడియేషన్ వస్తోందన్న మాట. తన అనుమాన నివృత్తికోసం అల్మారాలో ఉన్న మిగతా ఫిల్మ్‌లను కూడా డెవలప్‌చేసి చూశాడు డాక్టర్ కెనెడీ. ఆయన ఊహించినట్లే అవన్నీ కూడా పూర్తిగా ఎక్స్‌పోజ్ అయిపోయి ఉన్నాయి. ఆ తర్వాత ఆ శిలనుంచి వస్తున్న రేడియేషన్ స్థాయిని తెలుసుకోవడానికి కొన్ని ప్రయోగాలు చేశాడు డాక్టర్ కెనెడీ. అవి సంభ్రమాన్ని కల్పించే ఫలితాలను ఇచ్చాయి.

అతి తీవ్రమైన యురేనియం రేడియేషన్‌ను కూడా సీసం హరించి వేస్తుంది. అందువల్ల గట్టి మందమైన సీసపు గోడలుగల కేస్‌లో ఈ శిలను ఉంచి ఫిలింపై ఎక్స్‌పోజ్ చేశాడు డాక్టర్ కెనెడీ. అయినా ఆ ఫిలిం పూర్తిగా ఎక్స్‌పోజ్ అయిపోయింది. ఇనుము, గోడలు, చెక్కవంటి వేవీకూడా ఆ రేడియేషన్‌ని ఆపలేకపోయాయి.

తర్వాత ఆ శిలను తీసుకుని డార్క్‌రూంలో ఉంచాడు డాక్టర్ కెనెడీ. దానినుంచి కళ్ళుమిరుమిట్లు గొలిపే కాంతివచ్చింది. ఎక్స్‌రేస్ వంటివి తీక్షణమైన కిరణాలు కంటికి కనిపించవు. కాని ఈ విచిత్ర శిల ఒకప్రక్క తీక్షణమైన రేడియేషన్‌ని విడుదల చేస్తూనే మరోవంక కనిపించే కాంతిని కూడా వెదజల్లుతోంది.

ఆ తర్వాత ఆ శిలనుంచి వచ్చే కాంతిని, రేడియేషన్‌నీ స్పెక్ట్రొగ్రాఫ్ ద్వారా పరీక్షించాడు డాక్టర్ కెనెడీ. విజిబుల్ బాండ్‌లో అంతటి తీక్షణమైన రేడియేషన్‌ని ఇంతకు ముందెవరూ గుర్తించలేదు. అలాగే అది ఏర్పరచిన లైన్లు శాస్త్రవేత్తలకు తెలిసిన ఏ స్పెక్ట్రంలోనూ లేవు. అవి ఇన్‌ఫ్రారెడ్ బాండ్‌కి అవలగా వున్నాయి.

డాక్టర్ కెనెడీ ఆ శిలమీద మరికొన్ని పరిశోధనలు చేశాడు అవి మరింత విభ్రాంతికరంగా ఉన్నాయి. యురేనియం ధాతువు రేడియేషన్‌ను విడుదల చేస్తూ డికేఅవుతుంటుంది. కాని ఈ శిలలో పదార్థం తరిగిపోయేటట్లు లేదు. దానిని ఎండలో వుంచితే సూర్యునినుంచి వచ్చే ప్రసారాన్ని తనలో హరించుకుంటోంది. సాట్యురేషన్ పాయింట్ రీచ్ అయాక తిరిగి ఆ ప్రసారాన్ని విడుదల చేస్తోంది.

ఆ శిలా లక్షణాలను గమనించిన డాక్టర్ కెనెడీకి ఒక ఆలోచన వచ్చింది. బలహీనంగా వుండే సన్నని దారాన్ని కలిపి పేనితే గట్టి త్రాడు ఏర్పడుతుంది. అలాగేకాంతి కిరణాలను పేనినట్లుగా చేసి లేజర్ కిరణాలను సృష్టిస్తారు. ఇవి అమిత శక్తిమంతమైనవి. శక్తి ప్రసారంలో ఆల్ఫా, గామా, కాస్మిక్ వంటి

కిరణాలు అమిత శక్తిమంతమైనవి. వీటిని లేజర్ కిరణాలుగా మారిస్తే అవి ఊహాకందనంతటి శక్తిగలవవుతాయి. లేజర్ కిరణాల ఉత్పత్తిలో 'రుబీ' (కెంపు) ప్రధానపాత్ర వహిస్తుంది. ఇప్పుడు కనుగొన్న శిల ద్వారా ఇట్టి లేజర్ కిరణాలను ఉత్పత్తి చేయవచ్చుననిపించింది డాక్టర్ కెనెడీకి. ఆయన అంచనాప్రకారం కేవలం ఒక్క కిలోగ్రాం శిలా పదార్థంతో మొత్తం అమెరికా ఖండపు శక్తి అవసరాలను ఎన్నో దశాబ్దాలపాటు తీర్చవచ్చు. అది జరగాలంటే అసలు ఆ శిలలోని పదార్థం ఏమిటో, దాని లక్షణాలేమిటో స్పష్టంగా తెలియాలి. అప్పుడు అట్టి పదార్థాల్ని ఉత్పత్తిచేయడం సాధ్యమవుతుంది. అయితే ఇందుకు తనొక్కడి కృషి చాలదనిపించింది డాక్టర్ కెనెడీకి. అమెరికాలోని నాసా కేంద్రంలో న్యూక్లియర్ ఫిసిస్ట్‌గా పరిశోధనలు జరుపుతున్న భారతీయుడు డాక్టర్ రంగనాథ్ సహాయం తీసుకోడం మంచిదనిపించింది. పైగా ఆయన డాక్టర్ కెనెడీకి ఆప్తమిత్రుడు కూడా.

ఆ మర్నాడే డాక్టర్ రంగనాథ్ దగ్గరికి వెళ్ళాడు డాక్టర్ కెనెడీ. తాను కనుగొన్న శిల విషయం చెప్పి, ఒక్కసారి తన లేబొరేటరీకి వచ్చి దానిని పరీక్షించమని కోరాడు.

డాక్టర్ కెనెడీ చెప్పిన విషయాలు విని విస్తుపోయాడు డాక్టర్ రంగనాథ్. వారం రోజుల తర్వాత తప్పక వస్తానని మాట ఇచ్చాడు ఈ లోగానే వెళ్ళాలని అతని మనసు ఎంతగా ఆరాటపడ్తున్నా పనుల ఒత్తిడితో సాధ్యంకాలేదు.

* * * *

వారం రోజులు గడిచాయి.

ఆ మర్నాడే డాక్టర్ కెనెడీ లేబొరేటరీకి వెళ్ళాలనుకున్నాడు డాక్టర్ రంగనాథ్.

ఆ రాత్రి భోజనం అయ్యాక రాగింగ్ చైర్‌లో ఊగుతూ ఏదో ఆలోచిస్తున్నాడు. ఉన్నట్లుండి బొయ్యిమంటూ ప్రమాద హెచ్చరిక చేస్తూ సైరన్‌కూత వినిపించింది. ఆ విధమైన హెచ్చరిక వస్తే వివరాల కోసం రేడియోనో, టి.వి.నో ఆన్ చేసుకోవాలి. ఇదిగాక పోలీసులు వ్యాన్‌లలో తిరుగుతూ మైకులద్వారా ప్రజలను హెచ్చరిస్తుంటారు. అనుకోని ప్రమాదం ఏర్పడినప్పుడు ప్రజల్ని అప్రమత్తుల్ని చేయడానికి అమెరికా ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లనుచేసింది.

వెంటనే టి.వి ఆన్‌చేశాడు డాక్టర్ రంగనాథ్.

అందులో డిస్ట్రిక్ట్ పోలీసు కమిషనర్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్నాడు.

"డియర్ సిటిజన్స్ నార్త్‌మూర్ పట్టణానికి ముప్పది మైళ్ళ దూరంలో ఉన్న ఉడ్స్‌లో మంటలు చెలరేగుతున్నాయి. అవి అన్నివైపులా గంటకి సుమారు వందగజాల చొప్పున వ్యాపిస్తున్నాయి. ఫైర్ బ్రిగేడ్‌లు ఆ మంటల్ని ఆర్పడానికి నిర్విరామంగా కృషిచేస్తున్నాయి. కాని వాటిని ఆర్పడం సాధ్యంకావడంలేదు. అందువల్ల ఈ ఉడ్స్‌కి అరవై మైళ్ళ వ్యాసంలో గలవారందరూ తమ స్థావరాలను ఖాళీచేయడానికి సిద్ధంగా ఉండవలసిందిగా కోరుతున్నాం. ప్రజలకోసం బస్‌లను, రైళ్ళను, హెలికాప్టర్‌లను ప్రెస్ చేస్తున్నాం. ఇవి సొంత వాహనాలులేనివారికోసం. అవి ఉన్నవారు సాధ్యమైనంత త్వరగా విలువైన వస్తువులతో దూరంగా వెళ్ళిపోవాలని కోరుతున్నాం" అని చెప్పారు ఆయన.

ఆ తర్వాత టి.వి. అనౌన్సర్ ప్రతి అరగంటకీ ఈ అగ్నిజ్వాలని గురించిన సమాచారం తెలుపుతుంటామనీ, అత్యవసరైతే ఇంకా ముందే తెలియపరుస్తామని ప్రకటించాడు.

డాక్టర్‌రంగనాథ్ ఉన్న ప్రదేశం ఆ డేంజర్ జోన్‌లోనే ఉంది. అంతకన్నా ఆయనని వేధించిన విషయం మరోటుంది. డాక్టర్ కెనెడీ లేబొరేటరీ ఉన్నది ఆ ఉడ్స్‌లోనే. ఆయన ఏమయ్యాడో! ఆయన లేబొరేటరీ ఏమయిందో! అన్నిటినీ మించి ఆ విచిత్రశిల ఏమయిందో! ఆ విషయాలు తెలుసుకోవాన్న ఆత్రం ఎక్కువయింది ఆయనకి.

వెంటనే ముఖ్యమైన కాగితాలు, వస్తువులూ తీసుకుని అక్కడికి 50మైళ్ళ దూరంలో ఉన్న గ్రీన్‌వుడ్ పట్టణానికి బయలుదేరాడు. అక్కడ తన మిత్రుని ఇంట్లో వాటిని భద్రపరిచాడు. ఆ తర్వాత స్థానిక దినపత్రిక "ట్వంటీఫస్ట్ సెంచరీ" ఆఫీసుకి వెళ్ళాడు. అక్కడ న్యూస్ ఎడిటర్‌ని కలుసుకుని తనని పరిచయం చేసుకున్నాడు డాక్టర్ రంగనాథ్. న్యూస్‌కవరేజికి వాళ్ళ ప్రెస్ రిపోర్టర్స్ వెళ్తుంటే వారివెంట తనని కూడా ఆ బర్నింగ్ ఉడ్స్‌కి పంపమని కోరాడు. అందుకు ఆయన ఒప్పుకున్నాడు.

ఆ పత్రికవాళ్ళు ఒక హెలికాప్టర్‌ను సిద్ధం చేశారు. అందులో ప్రెస్ రిపోర్టర్ జాన్, ప్రెస్ ఫోటోగ్రాఫర్ జోన్స్ ఉన్నారు. వాళ్ళకి డాక్టర్ రంగనాథ్‌ని పరిచయం చేశాడున్యూస్ ఎడిటర్.

ఈ ముగ్గురితో హెలికాప్టర్ బయలుదేరింది.

"ఈ పాటికి మీకు ప్రెస్ రిపోర్ట్స్ వచ్చివుంటాయి. ఈ అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో చెప్తారా?" అని అడిగాడు డాక్టర్ రంగనాథ్.

"నిజానికి ఇది అగ్నిప్రమాదం సంభవించాల్సిన ఫారెస్ట్ కాదు. ఇక్కడ ఎక్కువగా తుప్పలు, దుబ్బులే కాని పెద్దపెద్ద చెట్లేవీ లేవు. అటువంటి చోట ఈ ప్రమాదం జరగడం, జ్వాలలు వ్యాపిస్తుండడం విచిత్రంగా ఉంది" అన్నాడు జాన్.

"ఈ ప్రమాదం ఎప్పుడు సంభవించింది" అడిగాడు రంగనాథ్.

"నిన్నరాత్రి సుమారు 12గంటలకు డాక్టర్ కెన్నెడీ లేబొరేటరీ ఉన్న ప్రాంతంలో ముందుగా మంటలు కనిపించాయట. అప్పటినుంచీ ఈ జ్వాలలు విస్తరిస్తూనే ఉన్నాయి. ఆయన లేబొరేటరీలో ఏదైనా కెమికల్ ఎక్స్‌ప్లోడ్ అయిందనుకోడానికి ఆయన జియోఫిజిస్టే కాని కెమిస్టేం కాదు"

ఆ మాట వినగానే డాక్టర్ రంగనాథ్ గుండె గుభిల్లుమంది.

డాక్టర్ కెనెడీ, ఆయన లేబొరేటరీ ఆ మంటల్లో కాలిపోయి ఉండాలి. వాటితోపాటు ఆ విచిత్ర శిల దాని రహస్యం బహిర్గతం కాకుండానే శాశ్వతంగా బూడిదై ఉంటుంది. ఈ హఠాత్పరిణామానికి ఆయన ఎంతో బాధపడ్డాడు.

హెలికాప్టర్ ముందుకి పోతుంటే దూరాన్నుంచే మంటలు కనిపించసాగాయి. హెలికాప్టర్ ఆ మండుతున్న ప్రాంతాన్ని బాగా సమీపించింది.

లాడర్స్ క్రేన్ మొదలైన వాటితో ఫైర్ ఫైటర్స్ ఎంతో ప్రయాసతో నిర్విరామంగా ఆ మంటల్ని ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు.

హెలికాప్టర్ సేఫ్ డిస్టెన్స్‌లో దిగింది.

డాక్టర్ రంగనాథ్, జాన్, జోన్స్ అందులోంచి దిగారు.

ఫొటోగ్రాఫర్ జోన్స్‌కొంచెంసేపు మామూలు కెమేరాతోనూ, మరికొంతసేపు వీడియో కెమెరాతోను ఫొటోలుతీయసాగాడు.

రిపోర్టర్ జాన్ అక్కడి ప్రజలలో డిక్‌థాంప్సన్ అనే అయన్ని ముందుగా ఇంటర్వ్యూ చేశాడు.

ఆయన ఈ విధంగా చెప్పాడు.

"మా ఫారం, ఇల్లు ఈ ఉడ్స్‌ని అనుకునే ఉన్నాయి. రాత్రి సుమారు 12 గంటలు అయివుంటుంది. అందరం ఆదమరిచి నిద్రపోతున్నాం. ఉన్నట్లుండి ఫెస్టివల్స్‌లో పేల్చే క్రాకర్ పేలినట్లు శబ్దం అయింది. జనం ఎక్కువగా ఉండేచోట అటువంటి శబ్దం ప్రత్యేకించి వినిపించదు కూడా. కాని అక్కడ జనావాసం బాగా తక్కువగా ఉండి ఎంతో నిశ్శబ్దంగా ఉండడంతో ఆ శబ్దం అంత స్పష్టంగా వినిపించింది. వెంటనే మెలకువవచ్చి చూసేసరికి బయట పట్టపగలును తలపించేటంతటి కాంతి ఉంది. వెంటనే కంగారుగా బయటకు పరుగెత్తి చూస్తే డాక్టర్ కెన్నెడీ లేబొరేటరీ ఉన్న ప్రాంతంనుంచి ఆకాశంలోకి ఎగుస్తూ మంటలు కనిపించాయి. వెంటనే ఫైర్ స్టేషన్‌కి పోలీసుస్టేషన్‌కీ ఫోన్ చేశాం.

"ఈ మంటల్లో మేమొక విచిత్రాన్ని గమనించాం. ప్రేలుడు శబ్దం అయిన కొంతసేపటివరకూ మంటలు నిట్టనిలువుగా లేచినా, ఆ తర్వాత అవి నేలబారుగా వ్యాపించసాగాయి. మామూలుగా అడవులు అంటుకొంటే పచ్చిచెట్లుకూడా కాలుతుంటాయి. కనుక దట్టంగా పొగలు వస్తుంటాయి. కాని ఈ అగ్నిజ్వాలలు పైన ఏ విధమైన పొగాలేదు. మరో విశేషం. సాధారణంగా ఇటువంటి మంటలు ఎర్రగానో పసుపు పచ్చని జ్వాలలుగానో ఉంటాయి. కాని ఈ జ్వాలలు మొత్తం ఒకేరకంగా నీలంగా ఉన్నాయి. కొంతసేపు ఆ విచిత్ర జ్వాలలను చూసి తిరిగివచ్చాం.

"కొంతసేపటికి ఫైర్ ఫైటర్స్ వచ్చారు. వారు ఎంతగా శ్రమించినా ఆ మంటలు అదుపులోకి రాలేదు. పైగా అన్నివైపులా వ్యాపించసాగాయి. దాంతో పోలీస్ సార్జెంట్ ఆ ఉడ్స్‌కి పదిమైళ్ళ దూరంలో ఉండే వారినందరినీ విలువైన వస్తువులతో వెంటనే ఖాళీచేయమని హెచ్చరించారు. మరి కొంచెం సేపట్లోనే రేడియోలలోను, టి.విలలోనూ హెచ్చరికలు వచ్చాయి. ఇక్కడి ప్రజలను ఖాళీ చేయించడానికి ట్రాన్స్‌పోర్ట్‌ను కూడా ఏర్పాటుచేశారు.

"కంగారు కంగారుగా ముఖ్యమైన, విలువైన సామాను తీసుకుని మేము బయటపడ్డాం. ఆ తర్వాత ఆ మంటలు మా ఫారాన్ని కబళించివేశాయి." అంటూ ఆవేదనతో చెప్పాడు డిక్‌థాంప్సన్.

ఈలోగా ఫైర్ బ్రిగేడ్ బాచ్ ఒకటి తిరిగివస్తూ కనిపించింది. వారిని ఆపి తన పరిచయం చెప్పుకొని వారిని ఇంటర్వ్యూ చేయసాగాడు జాన్.

ఆ బ్రిగేడ్ కమాండర్ మాంట్ గోమరీ ఈ విధంగా చెప్పాడు:

"మాకు ఈ ఫైర్ ఆక్సిడెంట్ గురించి రాత్రిచాలా ఫోన్స్‌వచ్చాయి. మా బ్రిగేడ్ ఆ ప్రాంతాన్ని చేరేసరికి ఒంటిగంట అయింది. అప్పటినుంచీ ఎన్నో మోడర్న్ టెక్నిక్స్‌తో గాసెస్‌ని ఉపయోగించి, కెమికల్స్‌ని వాడి

నీటిని జల్లి ఇలా ఎన్నో విధాలుగా నిర్విరామంగా ఫైట్ చేస్తున్నా ఆ మంటలు చల్లారకుండా వ్యాపిస్తూనే ఉన్నాయి. ఎనిమిది గంటలు పైగా మా బాచ్ పోరాడి అలసిపోయింది. రిలీఫ్ టీం రాగానే మేము తిరిగి వచ్చేస్తున్నాం" అన్నాడాయన ఎంతో మందస్వరంతో.

"ఫారెస్ట్ ఫైర్స్‌ని ఆర్పడం మీకు అలవాటేగా. మరి వీటిని అదుపు చేయలేకపోవడానికి కారణం ఏమిటి?" అని అడిగాడు జాన్.

"నిజమే. ఇంతకన్నా పెద్దమంటల్నే ఆర్పుతాం. కాని ఈ మంటలు చాలా విచిత్రంగా ఉన్నాయి. మేము ప్రత్యేకమైన హీట్ ప్రూఫ్‌దుస్తులు వేసుకుంటాం. వాటివల్ల మాకు మంటల దగ్గరఉన్నా వేడిసోకదు. కాని ఈ మంటల వేడి ప్రత్యేకంగా ఉంది ఎంతో దూరాన ఉన్నాకూడా లోపల్నుంచి ఉడికిపోతున్నట్లనిపిస్తోంది. కొద్ది గంటలలోనే విపరీతమైన అలసట వస్తోంది" అన్నాడు మాంట్‌గోమరీ.

ఆయన ముఖం, ఆయన టీమ్‌లోని వారి ముఖాలు విపరీతమైన అలసటతో వాడిపోయి ఉండడం గమనించాడు జాన్.

"ఈ మంటల్లో ప్రత్యేకత ఏమైనా ఉందా?" అడిగాడు జాన్.

"ప్రతీదీ ప్రత్యేకంగానే ఉంది. మామూలు మంటలు గాలి వాలున్నవైపుగా వ్యాపిస్తాయి. కాని గాలికీ వీటికీ ఎట్టి సంబంధమూ ఉన్నట్లు లేదు. దక్షిణంనుంచి ఉత్తరంవైపుగా విపరీతంగా గాలి వీస్తున్నా, ఈ మంటలు ప్రత్యేకంగా అటువైపు వ్యాపించడంలేదు. అన్ని వైపులకీ ఒకే మాదిరిగా వ్యాపిస్తున్నాయి.

"మామూలుగా అయితే అడవులు తగలబడుటప్పుడు జుయ్యిమని శబ్దం వస్తుంది. ఆకులుకాలుతూ చిటపట శబ్దం చేస్తాయి. కొమ్మలు మండుతూ ఫెళఫెళలాడుతాయి. ఈ మంటల్లో ఇవేవీ లేవు. కేవలం ఒకటే శబ్దం. కెమికల్స్ రియాక్టవుతున్నప్పుడు వచ్చే బుసుబుస శబ్దం. ఆకులూ, కొమ్మలూ మండుతూ రాలిపోవడంలేదు. కేవలం వెలుగుగా మారి అదృశ్యం అవుతున్నాయి. అవే కాదు. రాళ్ళూ, ఇళ్ళూ, ఇనుమూ సర్వమూ మంటలు తగలగానే వెలుగుగా మారి అదృశ్యమైపోతున్నాయి. మామూలు అగ్నిజ్వాలలకు భిన్నంగా ఇవి ఉజ్వలమైన నీలికాంతితో ఉన్నాయి. ఇట్టి మంటలు గురించి ఎప్పుడూ వినలేదు, చూడలేదు" అన్నాడు మాంట్‌గోమరీ!

"మీ మోడర్న్ ఫైర్‌ఫైటింగ్ మెథడ్స్‌లో హెలికాప్టర్స్ నుంచి న్యూట్రలైజింగ్ కెమికల్స్‌ని చల్లి మంటలు ఆర్పడం ఉందికదా! అటువంటి ప్రయత్నాలు చేశారా?" అని అడిగాడు జాన్.

"ఆ చేశాం. అవేవీ ఫలించలేదు. అయితే హెలికాప్టర్ టీం ఒక వింత కనుగొంది. మంటలు మొదలైన చోటునుంచి వ్యాపించిన చోటికి గలమధ్య భాగంలో అవంతట అవే ఆరిపోయాయి. అంటే మంటలు ముందుకి వ్యాపిస్తుంటే వెనుకనుంచి అవంతట అవే ఆరిపోతున్నాయి. ఆరిపోయిన భాగంలో నేలతోపాటు ప్రతిదీ నల్లగా మాడిపోయి ఒక విధమైన గండ్ర ఇసుకగా మారిపోతోంది".

ఈ విషయాలన్నీ ఎంతో ఆసక్తితో విన్నాడు డాక్టర్ రంగనాథ్.

ఇంటర్వ్యూ అయ్యాక "మిస్టర్ జాన్. హెలికాప్టర్‌లో వెళ్ళి మనంకూడా ఈ వింతని చూస్తే బాగుంటుంది కదా. ఇటీజ్ రియల్లీ ఫెంటాస్టిక్ " అన్నాడు రంగనాథ్.

''ఓ.... ష్యూర్.... దటీజ్ పార్ట్ ఆఫ్ మైడ్యూటీ '' అన్నాడు జాన్.

హెలికాప్టరును టేక్ ఆఫ్‌కు సిద్ధం చేస్తుండగా రేడియేషన్ డిటెక్టర్‌ని ఆన్‌చేశాడు డాక్టర్ రంగనాథ్. ఆ ప్రాంతంలో గణనీయమైన రేడియేషన్ ఉన్నట్లు ఇండికేటర్ చూపించింది.

హెలికాప్టర్ మంటలు నిలువుగా గాలిలోకిలేచి ముందుకి దూసుకుపోసాగింది. అందులోని వారందరూ కళ్ళకు ఫిల్టర్ గ్లాసెస్ పెట్టుకుని ఆ మంటల్ని గమనించసాగారు. మంటల్ని సమీపిస్తున్న కొద్దీ రేడియేషన్‌స్థాయి పెరుగుతూ, సూటిగా మంటలమీద అత్యధికంగా ఉన్నట్లు ఇండికేటర్ చూపించింది.

హెలికాప్టర్ ఎత్తుగా ఎగిరిపడుతున్న భాగాల్ని క్రాస్‌చేసి అవలకువెళ్ళింది. మండుతున్న భాగం వెడల్పు పదిమీటర్ల కంటే ఎక్కువలేదు. మంటలు ముందుకి వ్యాపిస్తుంటే వెనుకనుంచి చల్లారడం స్పష్టంగా కనిపిస్తోంది. మంటలు ఆరిపోయిన చోట రేడియేషన్‌స్థాయి అతితక్కువగా ఉండడాన్ని గమనించాడు డాక్టర్ రంగనాథ్.

ఆ ప్రాంతాన్ని కొంతసేపు పరిశీలించి కావలసిన ఫొటోలు తీసుకున్నాక హెలికాప్టర్ తిరుగు ప్రయాణం మొదలుపెట్టింది.

వారుతిరిగి వచ్చేసరికి మంటలు ఇంకాదూరం వ్యాపించాయి. సేఫ్ డిస్టెన్స్‌లో తిరిగి లాండ్ అయింది హెలికాప్టర్.

* * * *

డాక్టర్ రంగనాథ్ మస్తిష్కం ఆలోచనలతో అల్లకల్లోలంగా ఉంది. ఈ జ్వాలలు ఇలాగే సాగితే కొన్నిరోజుల్లో మొత్తం భూమండలమంతా ఏ విధమైన జీవం లేకుండా మాడిమసి అయిపోతుంది. జీవులే కాదు. రాళ్ళు, రప్పలు, నీళ్ళు సర్వమూ నల్లని ఇసుకగా మారిపోతున్నాయి. ఈ మహావిపత్తునుంచి మానవాళిని, సర్వ ప్రపంచాన్నీ కాపాడడం ఎలా?

ఉన్నట్లుండి డాక్టర్ రంగనాథ్ మస్తిష్కంలో ఒక మెరుపు మెరిసింది.

"మిస్టర్ జాన్ ఒక రిక్వెస్ట్. మళ్ళీ మనం ఒకసారి ఆ చల్లారిపోయిన పదార్థం దగ్గరికి వెళ్ళాలి. మన హెలికాప్టర్ అక్కడ లాండ్ అవాలి. ఆ నల్లని పదార్థాన్ని పరిశీలిస్తే ఆ మంటల్ని ఆర్పేమార్గం కనుగొనడం వీలవుతుందని నా నమ్మకం" అన్నాడు.

"నో.... ఐయాం సారీ. మా మిషన్ ఈ ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసి రిపోర్టు చేయడం, ఫొటోలు తీయడం వరకే. మిగిలిన వాటితో మాకేమీ సంబంధం లేదు" అన్నాడు జాన్ కర్కశంగా.

''పోనీ మీ వైర్‌లెస్ ద్వారా హోం డిపార్టుమెంట్‌తో మాట్లాడనీయండి'' అన్నాడు రంగనాథ్.

''యుకెన్ డూ దట్'' అంటూ అనుమతించాడు జాన్.

వెంటనే డాక్టర్ రంగనాథ్ హోం సెక్రటరీతో మాట్లాడాడు తనకి అర్జెంటుగా హెలికాప్టర్ కావాలని కోరాడు. జాన్ తన హెలికాప్టర్‌ని ఇయ్యలేదని తెలుసుకొని అతన్ని పిలిచి ముక్క చివాట్లు పెట్టాడు హోం సెక్రటరీ.

— ప్రకాగుప్త

"యూ ఫెలోస్ యూ థింక్ టూమచ్ ఆఫ్ యువర్ సెల్ఫ్స్ నీ హెలికాప్టర్‌ను డాక్టర్ రంగనాథ్ ఆధీనంలో ఉంచు. ఇది నేషనల్ ఎమర్జెన్సీ. దీజ్ ఆర్ మై ఆర్డర్స్, ఇఫ్ యూ డిజోబే ఐ విల్ ప్రాసిక్యూట్ యూ" అని అరిచాడు.

"అలాగే సార్. కాని రిపోర్టింగ్ డిలే అవుతుంది." అంటూ గొణిగాడు జాన్.

"స్టాప్ నాన్సెన్స్... ఒక ప్రక్కన ప్రపంచం మండిపోతోంది. నీ బోడి రిపోర్టింగ్ ఎవడికి కావాలి? ఇటీజ్ ఆల్‌రెడీ లేట్. డోన్ట్ వేస్ట్ టైం.... కారీఔట్ మై ఆర్డర్స్" అని గట్టిగా కసిరాడు హోం సెక్రటరీ.

చేసేది ఏమీలేక "హెలికాప్టర్‌ని మీ ఇష్టం వచ్చినంత సేపు వాడుకోండి" అన్నాడు జాన్ ముఖం మాడ్చుకొని.

"మీరూరండి" అన్నాడు రంగనాథ్.

"అవసరం లేదు, నేనూ, జోన్స్ ఇక్కడే వుండి రిపోర్టు రాసుకుంటాం" అన్నాడు జాన్.

ఇదంతా గమనిస్తున్న పైలట్ హెలికాప్టర్‌ని సన్నద్ధం చేయసాగాడు.

* * * *

డాక్టర్ రంగనాథ్ ఆలోచనలన్నీ ఆ వింత శిల చుట్టూనే తిరుగుతున్నాయి. "డాక్టర్ కెనెడీ ఆ శిల అంతరిక్షంనుంచి వచ్చే రేడియేషన్‌ని పీల్చుకుని తిరిగి విడుదల చేస్తోందని చెప్పాడు. అదంతట అదే ఎక్స్‌ప్లోడ్ అయిందో లేదా ఆయన ప్రయోగాలు వికటించి పేలిపోయిందో కాని, అమిత పరిమాణంలో రేడియేషన్‌ని విడుదల చేసింది. మామూలుగా అయితే ప్రేలుడు సంభవించిన చోట సర్వమూ చెల్లాచెదరైపోతుంది. కాని ఇక్కడ కేవలం పశువులు గడ్డిని మేస్తూ ముందుకి సాగినట్లు సర్వాన్ని దగ్ధం చేస్తూ ముందుకి సాగుతోంది. ఈ జ్వాల. ఈ శిల రహస్యం తెలుసుకొంటే డాక్టర్ కెనెడీ చెప్పినట్లు ప్రపంచానికంతటికీ అవసరమైన శక్తిని కొద్ది పదార్థం నుంచే తయారుచేయవచ్చు. కాని ఇప్పుడు ఆ శిలా లేదు. ఆయనా లేరు. నిజంగా ఇది మానవాళి చేస్తున్న దుష్కృతం" బాధగా నిట్టూర్చాడు డాక్టర్ రంగనాథ్.

హెలికాప్టర్ నెమ్మదిగా నేలమీదికి దిగింది.

ఎటుచూసినా నల్లని పదార్థం చిట్లంకట్టిన ఇటుకలాగ ఉంది.

హెలికాప్టర్ దిగి ఆ పదార్థాన్ని కొంచెం చేతుల్లోకి తీసుకున్నాడు రంగనాథ్. అది గట్టిగా ఓ చెంచాడు ఉందో లేదో రెండు మూడు కిలోల బరువున్నట్లు అనిపించి చేయి కిందికి వాలిపోయింది.

ఆ పదార్థాన్ని కొంచెం నలిపిచూశాడు. అది గంధ్ర ఇసుకరేణువులాగా గరగరలాడింది. దానిని ముక్కుదగ్గర పెట్టుకుని చూశాడు. ఏ విధమైన వాసనాలేదు.

"మిస్టర్ పైలెట్. హెలికాప్టర్‌లో స్పేడ్స్ వంటివి ఏమైనా ఉన్నాయా?" అని అడిగాడు రంగనాథ్.

"రెండు షవెల్స్ ఉన్నాయి. సార్" అన్నాడు పైలట్.

"వెంటనే వాటిని తీసుకుని రా. మనం ఈ పదార్థాన్ని సాధ్యమైనంత త్వరలో వీలైనంత ఎక్కువగా హెలికాప్టర్‌లో పోయాలి" అన్నాడు.

ఇద్దరూ ఆ పదార్థాన్ని షవెల్‌తో ఎత్తడం ప్రారంభించారు. అయితే అది విపరీతమైన బరువుగా ఉండడంతో తడవకు కొద్దిగానే ఎత్తగలిగారు. ఆ పదార్థం చాలా బరువుగా ఉండడంతోపాటు, రేడియేషన్ ప్రభావం వల్ల కూడా కావచ్చు. ఓ రెండు పళ్ళికలు పోసేసరికి వారికి చెప్పలేనంతటి అలసట వచ్చింది.

"టెస్టింగ్ కోసం ఇది చాలు. పైలట్, వెంటనే హెలికాప్టర్‌ని బయలుదేరినచోటికి తీసుకుపో" అన్నాడు డాక్టర్ రంగనాథ్.

హెలికాప్టర్ అగ్నిజ్వాలలను సమీపిస్తుండగా "పైలట్.హెలికాప్టర్‌ని అగ్నిజ్వాలల బోర్డరునుంచి ఒక పదిగజాల దూరంలో దించు" అన్నాడు.

హెలికాప్టర్ దిగగానే తాను షవెల్ తీసుకుని బయటకు వస్తూ పైలెట్‌ను కూడా షవెల్‌తో రమ్మన్నాడు రంగనాథ్.

షవెల్‌తో నేలపై అగ్నిజ్వాలలకు సమాంతరంగా చారికలాగా తవ్వుతూ "పైలెట్. నువ్వుకూడా షవెల్‌తో రెండో వైపునుంచి ఈ చారికను కొనసాగించు" అన్నాడు.

ఇద్దరూ సుమారు ఇరవై అడుగుల చారికను చేశాక "పైలెట్ ఇంక ఆపు. ఇప్పుడు మనం ఈ పదార్థాన్ని ఈ చారికలో వేయాలి" అంటూ షవెల్‌తో హెలికాప్టర్‌లోకి ప్రవేశించాడు.

పరీక్షల కోసం కొంత పదార్థాన్ని ఉంచి, మిగిలిన దానిని షవెల్‌తో తెచ్చి ఆ చారికలో పోయసాగాడు. పైలెట్‌కూడా ఆయన్ని అనుసరించాడు. పోయడం అయ్యాక "పైలెట్. హెలికాప్టర్‌ను మరో నూరుగజాల దూరం తీసుకుపోయి దించు" అన్నాడు రంగనాథ్.

హెలికాప్టర్ అక్కడ దిగాక బైనాక్యులర్స్ ద్వారా ఆ జ్వాలలను గమనించసాగారు వారిద్దరూ.

మరో అరగంటలో అగ్నిజ్వాలలు ఆ పదార్థం పోసిన చారిక వద్దకు వచ్చాయి.

ఆశ్చర్యం!

చూస్తుండగా ఆ జ్వాలలు ఆ చారిక ఉన్నంతమేరకే వచ్చి కొద్దిసేపట్లోనే ఆరిపోయాయి.

"సక్సెస్. గ్రాండ్ సక్సెస్" అంటూ వైర్‌లెస్ దగ్గరికి పరుగెత్తాడు రంగనాథ్. వైర్లెస్ అన్‌చేసి హోం సెక్రటరీతో మాట్లాడాడు.

"సార్.... హాపీన్యూస్... గ్రాండ్‌సక్సెస్. నేననుకున్నట్లు ఆ మంటల్ని ఆర్పగలిగాను. ఇప్పుడు మీ సహాయం వెంటనే కావాలి. ఓ వంద హెలికాప్టర్స్‌ని సాధ్యమైనంత ఎక్కువ మందితో పంపండి. వాళ్ళవెంట స్పేడ్స్, షవెల్స్ ఉండాలి. వాటితో వాళ్ళు ఆ పదార్థాన్ని తవ్వి హెలికాప్టర్‌లో పోయాలి. దానిని తీసుకువెళ్ళి జ్వాలలు వస్తున్న వైపు నేలమీద చారికలు చేసి వాటిలో పోయాలి. ఈ పదార్థం మండి ఆరిపోయింది కనుక ఆ అగ్నివ్యాపించదు. ఇది ఎంత త్వరగా జరిగితే అంత త్వరగా మంటలు ఆరుతాయి."అన్నాడు.

"ఓ.కె" అంటూ ఆ వెంటనే డిఫెన్స్ చీఫ్‌తో మాట్లాడాడు హోం సెక్రటరీ. మరో గంటలో ఆకాశంలో కొంగల్లాగా వందకి పైగా హెలికాప్టర్లు ఎగురుతూ వచ్చి రంగంలోకి దిగాయి. చకచకా, మంటలు వ్యాపిస్తున్న అన్నివైపులా నేలలో చారికలు చేసి అందులో ఆ పదార్థాన్ని తెచ్చిపోశాయి.

మరో గంటలో నాలుకలు చాస్తూ కాటేయడానికి వస్తున్న పాములాగా చకచకా వస్తున్న ఆ అగ్నికీలలు

పూర్తిగా ఆరిపోయాయి. వెంటనే ఈ శుభవార్త వైర్‌లెస్‌ద్వారా హోంసెక్రటరీకి చెప్పాడు రంగనాథ్.

ఆయన ఆనందానికి అవధులు లేవు.

"మిస్టర్ రంగనాథ్. యూ ఆర్‌ది మానహూ సేవ్‌డ్ అమెరికా అండ్ ది వరల్డ్. ది ఎంటైర్ వరల్డ్ షుడ్ ఫీల్ ప్రౌడ్ ఆఫ్ యూ" అంటూ పొగిడాడు.

* * * *

కొద్ది రోజులలో అమెరికన్ సైన్స్ కాంగ్రెస్ డాక్టర్ రంగనాథ్‌కి ఘనంగా పౌరసన్మానం జరిపింది. ఆ సందర్భంలో తనకి వచ్చిన ఆలోచనలను వివరించాడు డాక్టర్ రంగనాథ్.

"హెలికాప్టర్ నుంచి ఆ నల్లని పదార్థాన్ని చూసినప్పుడే అది కాలి కాలి ఆరిపోయిన పదార్థం అని గ్రహించాను. ఆక్సిజన్ అందకుండా నిప్పులమీద బూడిదను వేస్తే, అవి ఆరిపోయినట్లు ఈ పదార్థాన్ని ఆ జ్వాలలమీద వేస్తే అవి ఆరిపోతాయనిపించింది.

హెలికాప్టర్‌నుంచి దిగి ఆ పదార్థాన్ని పరీక్షించినప్పుడు, ఒక చెంచాడు పదార్థమే రెండుమూడు కిలోల బరువున్నట్లనిపించింది. అంటే వాటి అణుగర్భంలో ఏదో రియాక్షన్ జరిగిందన్నమాట. పాజిటివ్ ఛార్జి వుండే ప్రోటాన్లు, నెగిటివ్ చార్జివుండే ఎలక్ట్రాన్లు కలిసిపోయి న్యూట్రాన్లుగా మారిపోతాయన్నమాట. అంతేకాక ఈ న్యూట్రాన్లుకూడా దగ్గరగా ఒత్తుకు పోవడంతో విపరీతమైన బరువును పొందింది. ఈ ప్రక్రియలో కొంత పదార్థం రేడియేషన్‌గా మారిపోయింది. ఇది అతి తీవ్రమైనది కావడంతో తగిలిన ప్రతి పదార్థాన్ని దహించివేయసాగింది. ఇది రేడియేషన్ వల్ల వచ్చిన జ్వాల కనుక గాలివాలుతో నిమిత్తం లేకుండా అన్ని వైపులా వ్యాపించింది. ఎప్పుడైతే ఈ పదార్థం రేడియేషన్ ద్వారా ఏర్పడిన బూడిద అని తెలిసిందో వెంటనే దీనిని ఉపయోగించి రేడియేషన్ మూలంగా ఉత్పన్నం అయిన అగ్నిని అణచవచ్చునన్న నమ్మకం కలిగింది. అందుకే ఆ పదార్థాన్ని వ్యాపిస్తున్న జ్వాలవైపు నేలలో గోయి త్రవ్వి అందులో వేశాను. గోయి తవ్వడం వల్ల జ్వాల క్రిందినుంచి వ్యాపించకుండా ఉండిపోయింది. నా నమ్మకం వాస్తవమయింది.

"అయితే ఒక విషయం. విశ్వాంతరాళంలో అధిక ఒత్తిడికి, ఉష్ణానికి గురి అయి ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లు ఒత్తుకుపోయి న్యూట్రాన్లుగా మారిన "న్యూట్రాన్ నక్షత్రాలు" ఉన్నాయి. వీటినే "బ్లాక్‌హోల్స్" అని కూడా అంటారు. కాని భూమిమీద ఇంతటి ఒత్తిడి ఏవిధంగా కలిగిందో అర్థం కావడంలేదు. అయితే కొద్ది రోజులక్రితం డాక్టర్ కెనడీ తనకి ఒక విచిత్రమైన శిల దొరికిందనీ అది అత్యధిక ప్రమాణంలో కాస్మిక్ కిరణాలవంటి వాటిని హరించుకుని తిరిగి తీవ్రమైన రేడియేషన్‌గా విడుదల చేస్తోందనీ చెప్పాడు. దాని రహస్యం కనుగొంటే ప్రపంచానికంతటికీ శతాబ్దాలపాటు సరిపోయే శక్తిని, కొద్దిపాటి పదార్థంనుంచి తయారు చేయవచ్చుననీ, తాను ఆ దిశలో ప్రయోగాలు చేస్తున్నాననీ చెప్పాడు. బహుశా ఆ ప్రయోగం విఫలమై ఈ అనర్థం జరిగివుండవచ్చు. దురదృష్టవశాత్తు ఆయినా, ఆయన లేబొరేటరీ, ఆ శిలాలు అన్నీ దగ్ధమైపోయాయి. నా ఉద్దేశం ప్రకారం ఆ విచిత్ర శిల అంతరిక్షంనుంచి ఉల్కద్వారా భూమిని చేరింది. ఉల్కలను పరిశోధించడంవల్ల మళ్ళీ ఎప్పటికైనా అటువంటి శిలను కనుగొనవచ్చు ననుకొంటున్నాను" అంటూ ముగించాడు.

* * * *

పరిస్థితులు కుదుటపడడంతో అన్నీ మామూలుగా జరగడం మొదలుపెట్టాయి. ఆ రోజు వచ్చిన ఉత్తరాలలో డాక్టర్ కెనడీ వ్రాసిన ఉత్తరం ఒకటి ఉంది. ఆశ్చర్యానందాలతో దానిని తీసుకున్నాడు డాక్టర్ రంగనాథ్. అది ఆ అగ్ని ప్రమాదం జరిగిన రోజునే ఉదయం న్యూయార్క్‌లో పోస్టు అయింది.

అందులో ఇలా ఉంది.

"డాక్టర్ రంగనాథ్

నేను చెప్పిన శిలను చూడడానికి మీరు త్వరలోనే వస్తానన్నారు. ఈలోగా నాకు ఆ శిలను గురించి ఒక ఊహ వచ్చింది. మనకు తెలిసిన అణువులలో ప్రోటాన్లు, ఎలక్ట్రానులు ఉంటాయి. ప్రోటాన్లకు పాజిటివ్ ఛార్జి, ఎలక్ట్రాన్లకు నెగిటివ్ చార్జి ఉంటాయి. ఈ రెండు కలిసిన న్యూట్రాన్‌కి ఏ ఛార్జీ ఉండదు. ఇవన్నీ అందరికీ తెలిసిన సామాన్య విషయాలే. అయితే శాస్త్రజ్ఞులు పాజిటివ్ ఛార్జివున్న ఎలక్ట్రాన్‌ని(పాజిట్రాన్) నెగిటివ్ ఛార్జి ఉన్న ప్రోటాన్‌ని కూడా కనుగొన్నారు. ఈ రెండూ కలిసిన న్యూట్రాన్లు కూడా ఛార్జి లేకుండా ఉంటాయి. ఇటువంటి రెండు రకాల న్యూట్రాన్లు బింబం, ప్రతిబింబంలాగా ఉంటాయి. ఇటువంటివి ఉన్న పదార్థాన్ని "యాంటి మాటర్" అని అంటారని మీకూ తెలుసు. ఈ మాటర్, యాంటీమాటర్ పరస్పరం దగ్గరకి వస్తే అవి పేలిపోయి రేడియేషన్‌గా మారుతాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. నా అభిప్రాయం ప్రకారం నేను కనుగొన్న శిల అంతరిక్షంనుంచి వచ్చే కాస్మిక్ కిరణాలను పీల్చుకుంటుంది. సాట్యురేషన్ పాయింట్ రీచ్ అయ్యాక అది తిరిగి తీవ్రమైన రేడియేషన్‌ని విడుదల చేస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే పాడ్యమినుంచి పౌర్ణమి వరకూ చంద్రుని కాంతి పెరుగుతూ, తిరిగి బహుళ పాడ్యమినుంచి అమావాస్యవరకూ తరుగుతున్నట్లు, దీని రేడియేషన్‌కూడా ఉంటోంది. నా అనుమానం ప్రకారం అది ప్రసారం చేస్తున్న రేడియేషన్ యాంటీమేటర్‌కి సంబంధించింది. దీనిని ధ్రువపరచుకొనేందుకు నేను కాస్మిక్ కిరణాలను లేజర్ కిరణాలుగా మార్చి ఒక ప్రయోగం చేయదలచుకొన్నాను. అయితే ఈ ప్రయోగం విఫలమై పెద్ద ప్రమాదం జరుగవచ్చు. అందులో నా ప్రాణాలు పోవచ్చు. అందుకోసం నాకు దొరికిన శిలలో కొంతభాగాన్ని కోసి న్యూయార్క్‌లోని ఫెడరల్ బ్యాంక్‌లో లాకర్ నంబర్ 999లో ఉంచాను. ఆ లాకర్ కీ ఇందులో పంపుతున్నాను. నేను కనుక చనిపోయే పక్షంలో దానిని మీరు తీసుకుని పరీక్షలు జరుపుకోండి. నా ప్రయోగాలు విజయవంతమైతే వ్యతిరేక లక్షణాలున్న అయస్కాంత ధ్రువాలను ఉపయోగించి మోటార్లను నడపగలగడం వంటి ఎన్నో కార్యాలను నిర్వర్తించినట్లే, మాటర్ యాంటీ మాటర్ల లక్షణాలను ఉపయోగించుకొని అనంతమైన శక్తిని ఉత్పత్తి చేయవచ్చు. ఈ పరిశోధనలు నేను చేయలేకపోయినా, కనీసం మీరైనా విజయవంతంగా చేయాలని నా కోరిక.

ఉంటాను. అదృష్టం బాగుంటే మళ్ళీ మిమ్మల్ని కలుస్తాను.

మీ

డాక్టర్ కెనడీ

ఆ ఉత్తరం చదవాగానే మ్రాన్పడిపోయాడు డాక్టర్ రంగనాథ్.

"మీది ఎంతటి ముందుచూపు డాక్టర్ కెనడీ! క్రొవ్వొత్తి ఇతరులకి వెలుగునియ్యడంకోసం తనని హరింపజేసుకొన్నట్లు, ప్రపంచానికి అనంతశక్తిని ఇయ్యడం కోసం మిమ్మల్ని మీరు బలిదానం చేసుకున్నారు. సృష్టి రహస్యాలను బహిర్గతం చేయగల తాళం చెవినొకదానిని మీరు నాకిచ్చారు. దానిని ఉపయోగించి మీరు మొదలు పెట్టిన కృషిని కొనసాగిస్తాను. నేనేకాదు నా వంటి శాస్త్రజ్ఞులు ఎందరో మీ అడుగుజాడల్లో నడుస్తారు. అదే మీకు మేము సమర్పించగలనివాళి" అంటూ మనసులోనే డాక్టర్ కెనడీకి ప్రణమిల్లాడు.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, మే 1987** ✪

# నాట్యం చేసిన నగరం

దూరం నుంచి మోటార్ బోట్ వస్తున్న శబ్దం వినిపించింది.

ఆ శబ్దం అంతకంతకీ దగ్గర కాసాగింది.

డాక్టర్ రమేష్ బైనాక్యులర్స్ తీసుకొని టెర్రేస్ మీదకెళ్ళాడు.

సందేహం లేదు. అది మోటార్ బోట్, సముద్రంలోంచి వేగంగా తన లెగూన్‌లోకి వస్తోంది.

రమేష్‌కి ఒక్కసారి ఒళ్ళు గగుర్పొడిచినట్లయింది.

ఈ ఐదు సంవత్సరాలలో పరమానవుడెవరూ ఆ ఛాయలకు రాలేదు. అందువల్ల అంతకాలం తర్వాత మనుష్యులని చూడబోతున్న ఆనందం ఒకప్రక్క.

కాని ఆ వచ్చేవాళ్ళెవరు. ఎందుకొస్తున్నారు అన్న భయం మరోప్రక్క. ఆ అనుభూతుల నుంచి తేరుకోకుండానే ఆ మోటార్ బోట్ అక్కడికి వచ్చి ఆగింది.

అందులోనుంచి మాసినగడ్డం,రేగినజుట్టుతో ఒక నడివయస్కుడు దిగాడు. తిన్నగా రమేష్ దగ్గరికి వచ్చాడు.

"నా పేరు రామానుజం. ముత్యాల వ్యాపారం చేస్తాను. వాటిని దిగుమతి చేసుకొని అమ్మడం నా వ్యాపారం. దానిని చూసుకోడానికి నా మనుష్యులున్నారు. స్వాభావికంగా ముత్యాలు దొరికే ప్రదేశాలకి వెళ్ళి కొత్త కొత్త రకాల ముత్యాలను కనుగొనడం నాహాబీ. ఆ అన్వేషణలో ఇటు వస్తున్న నాకు దూరాన్నుంచి బైనాక్యులర్స్‌లో చూస్తుంటే మీరున్న ఈ ఇల్లు కనిపించింది. ఈ నిర్జన ప్రదేశంలో ఇల్లు ఉండడం చూసి ఆశ్చర్యపోయాను. ఇందులో ఉండేవారితో పరిచయం కావడంతో పాటు ఈ లెగూన్‌లో కొత్తరకం ముత్యాలు దొరుకుతాయేమో చూడవచ్చునన్న ఉద్దేశంతో ఇటు వచ్చాను" అంటూ ఏకబిగిన చెప్పుకుపోయాడు ఆ వ్యక్తి.

"నా పేరు రమేష్. మారైన్ బయాలజీలో డాక్టరేట్ పొందాను. మనదేశంలో కోరల్స్ ఉండే ప్రాంతాలు ఇంచుమించు లేవనే చెప్పవచ్చు. కాని నాగరిక ప్రపంచంతో సంబంధం లేని ఇక్కడ కోరల్స్, స్పాంజెస్, ఆయిస్టర్స్ వంటి ఎన్నో రకాల సముద్ర జీవాలున్న విషయం మా ప్రొఫెసర్‌గారు చెప్పేవారు.



ఆయన ఇక్కడ పరిశోధనలు చేసే ఉద్దేశంతో ఇల్లు, లేబొరేటరీ కూడా కట్టుకున్నారు. ఆయనకి నేనంటే ఎంతో అభిమానం. అందువల్ల ఆయన ఊహలూ, ఉద్దేశాలూ నాకు చెప్తుండేవారు. నోట్స్ నాకిచ్చేవారు. అయితే ఆయన ఒక ఆక్సిడెంట్‌లో దుర్మరణం పొందడంతో ఆయన కృషి ఆగిపోయింది. కాని మెరైన్ బయోలజీలో నాకున్న ఆసక్తికొద్దీ ఇక్కడికి వచ్చి గత ఐదేళ్ళుగా నేను పరిశోధనలు .జరుపుతున్నాను. నాకు చేదోడువాదోడుగా నా భార్య ఉంది. ఆమె నాకు భార్య, అసిస్టెంటూ, సెక్రెటరీ - అన్నీను. లోపలికి రండి. ఆమెను పరిచయం చేస్తాను. మా లేబొరేటరీని కూడా మీరు చూడవచ్చు'' అంటూ ముందుకి నడిచాడు రమేష్.

ఆయన్ని మౌనంగా అనుసరించాడు రామానుజం.

''అనితా.... ఈయన రామానుజంగారు. ముత్యాల వ్యాపారం చేస్తారట'' అంటూ పరిచయం చేశాడు.

''ఒక్క ముత్యాలే కాదమ్మా. హైదరాబాద్‌లో నాకు ఇంకా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, హైర్‌పర్చేజ్, లీజింగ్- ఇలా చాలా వ్యాపారాలున్నాయి. కొత్తరకం ముత్యాలేమైనా దొరుకుతాయేమోనన్న ఆశతో ఈ ప్రాంతంలో వెతకడానికి వచ్చాను'' అంటూ మరికొన్ని వివరాలు చెప్పాడు రామానుజం.

''పరాయి మనిషి ముఖం చూసి ఐదేళ్ళు దాటింది. ఇన్నాళ్ళకి మిమ్మల్ని చూస్తుంటే అందులోనూ

మన తెలుగు వాళ్ళని చూస్తుంటే మరీ ఆనందంగా ఉంది. మీరు కొన్నాళ్ళు మాకు అతిథిగా ఉండాలి" అంది అనిత మర్యాదగా.

"అలాగేనమ్మా....ఇప్పుడు నేను వచ్చింది కొత్తరకం ముత్యాలు దొరికే ప్రాంతాలను అన్వేషించడానికేగా. మామూలుగా అయితే ఒక్కడినే ఉండి అన్వేషించేవాడిని. ఇప్పుడు మీరు కూడా ఉండడంతో నా పని మరింత సులువవుతుంది" అన్నాడు రామానుజం.

"ఓ తప్పకుండా... ఒక మెరైన్ బయాలజిస్టుగా నేను మీకు మరింతగా సహాయపడగలను" అన్నాడు రమేష్.

"ఓ.... థ్యాంక్యూ.... అది సరే..... ఆయన సైంటిస్ట్ కనుక ఇరవై నాలుగ్గంటలూ పరిశోధనలలో మునిగితేలుతుంటాడనుకో ఇతరులతో ఉలుకూ పలుకూ లేకుండా నీకు కాలక్షేపం ఎలా అవుతుం దమ్మా?" అని అడిగాడు రామానుజం.

"ప్రతి విషయంలోనూ ఆయనతో పాలుపంచుకోవడంతో అసలు నాకు సమయమే తెలియ దండీ" అంది అనిత సిగ్గుపడుతూ.

"తర్వాత మాట్లాడుకొందాం. ముందు శుభ్రంగా స్నానం చేసి సుష్టుగా భోజనం చేసి, హాయిగా విశ్రాంతి తీసుకోండి" అన్నాడు రమేష్.

"ఓ... కె.." అంటూ తమ సామాను తెచ్చుకోడానికి మోటార్ బోట్‌వైపు వెళ్ళాడు రామానుజం. అది అతని సొంత బోటు. కావలసిన చోటుకల్లా వెళ్తుంటాడు.

గోవా, పశ్చిమాన అరేబియా సముద్రతీరాన ఉంది. గోవానుంచి బొంబాయి పైవరకూ అరేబియా సముద్రంలో ఎన్నో దీవులు ఉన్నాయి. వీటిలో నిజానికి కొన్ని సముద్రంలో ఉన్న కొండల శిఖరాలు. పెద్ద పెద్ద చెట్లతో, దట్టమైన పొదలతో, అందమైన లోయలతో ఎంతో సుందరంగా ఉంటాయి. వీటిలోని చాలా దీవులు. తీరాన్నుంచి కనిపిస్తూనే ఉంటాయి. మరికొన్ని చాలా దూరంగా ఉన్నాయి. అయితే ఈ దీవుల్లో మనుష్యులు నివసిస్తున్నవి చాలా తక్కువ. తీరానికి దగ్గరగా ఉన్న కొన్నింటిలో మాత్రమే కొందరున్నారు. వాళ్లు ప్రధానంగా బెస్తవారు.

రమేష్ ఉన్న దీవి గోవా తీరానికి సుమారు యాభై మైళ్ళదూరంలో ఉంది. దాని వైశాల్యం సుమారు వంద చదరపు కిలోమీటర్లుంటుంది. ఆ దీవి ప్రత్యేకత ఏమిటంటే రెండు కొండలు పక్కపక్కగా వచ్చి దీనిలో ఒక చివర్న కలుసుకుంటాయి. ఈ రెండు కొండల మధ్య సముద్రం సుమారు నాలుగు కిలోమీటర్లు లోనికి చొచ్చుకొచ్చి ఉప్పునీటి మడుగయింది. ఇట్టివాటిని "లెగూన్" అంటారు. ఈ లెగూన్‌లోని మరో ప్రత్యేకత ఏమిటంటే ఇందులో కోరల్ ఫార్మేషన్స్ చాలా ఉన్నాయి. కోరల్స్‌ని తెలుగులో "పగడాలు" అంటారు. ఇవి సూక్ష్మజీవాలు. వీటిలో చిన్న గులకరాళ్ళు సైజునుంచి పెద్ద పనసకాయ పరిమాణంలో కూడా ఉంటాయి. కాల్షియం లవణాలు (సున్నం)తో తయారయ్యే వీటిపైన వలయాలు వలయాలుగా ఆకారాలు ఏర్పడి చూడడానికి ఎంతో అందంగా ఉంటాయి కోరల్స్. వీటిలో రకరకాల రంగులూ, ఆకారాలు ఉంటాయి. మనం దండలుగా గుచ్చుకునే పగడాలు వంటి విలువైన వస్తువులతో వ్యాపారం చేసే ఉద్దేశం లేదు. రమేష్‌కి రకరకాల సముద్రజీవాల మీద పరిశోధనలు చేయడమే అతని లోకం- ప్రపంచం. అయితే

అతనికి ప్రత్యేకంగా ఆసక్తి కల్పించినవి కోరల్స్. వాటిలో కొత్తకొత్త రంగులున్న వాటిని సృష్టించడం, అతిపెద్ద ప్రమాణంలో తయారుచేయడం అతను స్పెషలైజ్ చేసిన పరిశోధన. వాటిలో అతను విజయం సాధించాడు కూడా.

నర మానవులు లేని ఈ దీవిలో తన ప్రొఫెసర్ నెలకొల్పిన లేబొరేటరీలో పరిశోధనలు కొనసాగిస్తున్నాడు రమేష్. బయట ప్రపంచంతో సంబంధాన్ని కలిపేది అతనికున్న మోటార్‌బోట్ ఒక్కటే. ఇంటికి కావలసిన వస్తువులు, లేబొరేటరీకి కావలసిన సామాన్లు తెచ్చుకోవలసి వచ్చినపుడు మాత్రం మోటార్ బోట్‌లో మార్మగోవా వెళ్ళి వస్తుంటాడు. అక్కడే అతని బ్యాంక్ అకౌంట్ ఉంది. వారసత్వంగా వచ్చిన ఆస్తిని అమ్మి ఆ డబ్బును ఫిక్సెడ్ డిపాజిట్‌గా బ్యాంక్‌లో వేశాడు. దానిమీద వచ్చే వడ్డీతో అతని అవసరాలన్నీ గడిచిపోతుంటాయి. అయితే ఏ కారణం చేతనో అనిత మాత్రం ఎప్పుడూ అతనివెంట వెళ్ళలేదు. ఈ ఐదేళ్ళలో ఆమె, భర్తని తప్ప మరో మనిషిని చూసింది లేదు. ఇన్నాళ్ళకి రామానుజం కనిపించాడు.

భోజనాలయ్యాక ఒక గంటసేపు హాయిగా నిద్రపోయి లేచాడు రామానుజం. అతను నిద్రలేవగానే డాక్టర్ రమేష్ తన లేబొరేటరీలోకి తీసుకెళ్ళాడు.

డాక్టర్ రమేష్ ఇల్లు తీరంమీద నీటికి బాగా దగ్గరగా ఉంది. లేబొరేటరి క్రింద సెల్లార్ పోర్షన్ ఉంది. అక్కడి నుంచి అది నీటిలోకి సుమారు నలభై అడుగుల దూరం చొచ్చుకొనిపోయి ఉంది. అంటే ఆ లేబొరేటరీకి పైనా, క్రింద మూడువైపుల అంతా నీరేనన్నమాట. నీటిలో పూర్తిగా ఒకవైపు పెద్ద అద్దం ఉంది. దానిలోంచి నీటిలో తిరుగాడే చేపలూ, ఇతర జీవాలూ, నేలని అంటివున్న కోరల్స్, బండరాళ్ళు అంటుకుని వున్న ముత్యాలచిప్పలు, ఆలిచిప్పలు వంటివి ఎంతో అందంగా కనిపిస్తుంటాయి.

లాబొరేటరీలో మధ్యగా పెద్దటేబుల్ మీద పెద్ద గ్లాసకేస్ ఉంది. అందులోని కల్చర్ మీడియంలో పెరుగుతున్న కోరల్స్ ఉన్నాయి.

అవన్నీ చూసేసరికి రామానుజానికి ఎంతోఆనందం కలిగింది.

"ఇవన్నీ చూస్తుంటే - మనవాళ్ళు పాతాళలోకం అంటారే - దాంట్లో ఉన్నట్లనిపిస్తోంది" అన్నాడు ఆయన.

"ఇదుగో చూశారా. ఇది అతిసాధారణంగా లభ్యమయ్యే కోరల్. దీనికి అతి అందమైన నీలం రంగు వచ్చేటట్లు చేయగలిగాను." అంటూ గ్లాస్‌కేస్‌లో ఉన్న ఒక కోరల్‌నుచూపించాడు రమేష్.

నిజంగా ఆ బ్లూషేడ్ అద్భుతంగా ఉంది. అంతటి నునుపు నిగారింపు ఉన్న నీలంరంగుని అతను ఎప్పుడూ చూడలేదు.

"అద్భుతం" అన్నాడు రామానుజం.

"అంతేకాదు ఈకోరల్‌ని నిమిషాల మీద అతి పెద్దగా ఎదిగేటట్లు చేయగలిగాను. చూడండి." అంటూ ఆగ్లాస్ కేస తెరిచి అందులోంచి ఒక చిన్నకోరల్ ముక్కని తీశాడు. దానిని ఒక పెద్ద బీకర్‌లో వుంచి దాని మీద ఏదో ద్రవం పోశాడు.

చూస్తుండగానే ఆ కోరల్ అన్నివైపులా ఉబ్బసాగింది. పదినిమిషాలు పట్టకుండా గురువిందగింజ పరిమాణంలో ఉన్న ఆ కోరల్ ఇంచుమించు బీకర్‌ని నింపేసింది.

"ఎంత విచిత్రం! ఇది ఎలా సాధ్యం!" అన్నాడు రామానుజం ఆశ్చర్యం పట్టలేక.

"ద్రాక్ష వంటి మొక్కలకి జిబరెల్లిక్ యాసిడ్ వంటి హార్మోన్‌లను వేస్తే విపరీతంగా పెరుగుదల కలిగి మంచి పెద్ద సైజులో కాపువస్తుందన్న విషయం మీకు తెలుసుగా. అదే విధంగా ఈ కోరల్ పెరుగదలను విపరీతంగా ప్రేరేపించగల హార్మోన్‌ను ఒకదానినినేను కనిపెట్టాను. దీనిని ఉప్పు, సున్నం ఉన్న నీటిలో కలిపితే కావలసిన కల్చర్ మీడియం తయారవుతుంది. దీనిలో వేసిన కోరల్ సున్నంలోని కాల్షియం కార్బొనేట్, ఉప్పులోని సోడియం క్లోరైడ్‌లను తీసుకుని హార్మోన్ ప్రభావంతో నిమిషాలమీద విపరీతంగా పెరిగిపోయింది" అంటూ వివరించాడు రమేష్.

రామానుజం విభ్రాంతి నుంచి కోలుకోక ముందే మళ్ళీ ఆ కోరల్‌ని బీకర్‌లో నుంచి బయటకు తీసి "దానిని నొక్కి చూడండి" అన్నాడు రమేష్.

రామానుజం దానిని నొక్కి చూశాడు. అది మెత్తగా రబ్బర్‌లాగా ఉంది.

"మామూలుగా కోరల్ గుల్లగా, కొంచెం పెళుసుగా ఉంటుంది. కాని ఇది రబ్బర్ ప్లాస్టిక్ లాగా మెత్తగా ఉంది." అన్నాడు రమేష్.

"అయితే దీనితో రబ్బర్ ప్లాస్టిక్ వంటి వస్తువులు చేయవచ్చా?" అన్నాడు రామానుజం.

"ఊహూ... ఇది జీవం ఉన్న కోరల్. జీవం ఉన్నది పెరుగుతూ ఉంటుంది...." అంటూ తల ఆడించాడు రమేష్.

రమేష్ ముఖంలోకి నిశితంగా, వింతగా చూశాడు రామానుజం.

రమేష్‌ని చూస్తుంటే అతనికి ఏదో స్ఫురణకి వచ్చింది. కాని అదేదో లీలగా అనిపించిందే కాని, ఖచ్చితంగా జ్ఞాపకానికి రాలేదు.

"మీ శాస్త్రజ్ఞులు భలేవాళ్ళు" అంటూ పక్కున నవ్వాడు రామానుజం ప్రశ్నార్థకంగా చూశాడు రమేష్.

"ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు న్యూటన్ దగ్గర ఒక పెద్దపిల్లి ఒకచిన్నపిల్లి ఉండేవట. అవి ఎక్కడెక్కడో షికార్లు కొట్టి ఏ అర్ధరాత్రో కొంపకి జేరేవట. అయితే ఆ సమయంలో తలుపులు వేసి ఉంటాయి కనుక, తలుపు దగ్గరే మ్యావ్‌మ్యావ్ అంటూ కూర్చొనేవట. వాటి బాధచూడలేక న్యూటన్ అవి సులువుగా ఇంట్లోకి రావడానికి తలుపుకి ఒకపెద్దకన్నం మరోచిన్నకన్నం చేయమని వడ్రంగికి చెప్పాడట. రెండు కన్నాలెందుకు? పెద్దకన్నం ఒక్కటి చేస్తే అందులోంచే రెండూ రాగలవు కదా అని వడ్రంగి ఎంత చెప్పినా న్యూటన్‌కి బోధపడలేదట. అప్పుడు ఆ వడ్రంగి ఒక్కటి పెద్దకన్నం చేసి అందులోంచి రెండు పిల్లుల్ని పంపి "పెద్దపిల్లి దూరగల కన్నంలో చిన్నపిల్లి దూరలేదా?" అని అడిగాడట. అప్పుడు కాని న్యూటన్‌కి ఆ విషయం అర్థంకాలేదట. అలా ఉంటాయి ఒక్కొక్కసారి మహామేధావుల తెలివితేటలు" అన్నాడు రామానుజం ఒక చిన్న సైజు ఉపన్యాసం దంచుతూ.

"ఇప్పుడు ఆ పోలిక ఎందుకు తెచ్చినట్లు?" అన్నాడు. రమేష్ ముఖం ముడుచుకుని రామానుజం అంతగాచనువు తీసుకోవడం అతనికి నచ్చలేదు.

"లేకపోతే ఏమిటి చెప్పండి మిస్టర్ రమేష్. కోరల్‌కి జీవం ఉన్నది కనుక పనికి రాదన్నారు. రబ్బర్ ప్లాస్టిక్‌గా మారాక ఆ కోరల్‌ని చంపితే పోదా?" అన్నాడు రామానుజం.

"మొత్తం మీద వ్యాపారస్థులనిపించారు" అని మాటకి మాట అంటించాడు రమేష్. "కోరల్‌ని చంపడం మీరనుకొన్నంత సులభం కాదు. అది చచ్చినట్లనిపించినా పరిస్థితులు అనుకూలిస్తే తిరిగి బ్రతకగలదు. ఆఫీస్‌టేబుల్ మీద పెట్టుకునే స్పాంజిని ఎండలో మలమల మాడ్చి సుత్తితో నుగ్గునుగ్గుగా కొట్టండి. ఇంత చిత్రహింస చేశాక అది నిజంగా చచ్చిపోయుండాలి. అవునా? దానిని తీసుకెళ్ళి నీటిలో వేయండి. దానికి ప్రాణం వచ్చి తిరిగి ఎదుగుతుంది. కోరల్ కూడా ఇటువంటిదే. అది చచ్చిపోయిందనిపించినా, అనుకోకుండా ఎప్పుడైనా తిరిగి బ్రతకవచ్చు" అన్నాడు రమేష్.

"ఇంతటి విచిత్రమైన జీవా ఇది!" అన్నాడు రామానుజం ఆశ్చర్యంతో.

"మీ వ్యాపారస్థులకి ఆసక్తి కల్పించే మరో విశేషం ఇప్పుడు మీకు చూపిస్తాను" అంటూ రమేష్ ఆ మెత్తటి కోరల్‌ని తీసి మరో పెద్ద బీకర్‌లో వేసి, ఇంకేదో ద్రావణం దాని మీద పోశాడు. కొన్నినిమిషాల తర్వాత దానిని తీసి "ఇప్పుడు నొక్కి చూడండి" అంటూ రామానుజం ముందుంచాడు.

రామానుజం దానిని నొక్కి చూశాడు. ఆయన ఆశ్చర్యానికి అంతులేదు. అది గట్టిగా రాయిలా ఉంది.

ఆయన తేరుకోకముందే ఒక సుత్తిని చేతికిచ్చి "దీన్ని పగలకొట్టండి" అన్నాడు రమేష్.

రామానుజం ఆ సుత్తి వంక నిశితంగా చూసి, ఆ కోరల్‌ని నేలమీద పెట్టి సుత్తితో బలంగా కొట్టాడు, సుత్తి ఖంగ్‌మందే కాని కోరల్‌మాత్రం విరగలేదు.

రామానుజం ఆశ్చర్యానికి అంతులేదు.

"అయితే ఇప్పుడిది చచ్చిపోయిందా?" అని అడిగాడు.

"అనే అనుకుంటున్నా ఖాయంగా చెప్పలేను. ఎందుకంటే దీనిలో జీవం ఎంతకాలం నిద్రాణస్థితిలో ఉండగలదో, ఏ పరిస్థితులలో తిరిగి పైకిరాగలదో నాకు సరియైన అవగాహన ఇంకాలేదు. ఆ విషయమై నేను ఇప్పుడు పరిశోధనలు చేస్తున్నాను" అన్నాడు రమేష్.

రామానుజంలోని బిజినెస్ మాన్ మేల్కొన్నాడు. రమేష్ సాధించిన విజయాలలో, ఆయనకి తన బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వ్యాపారాన్ని ఆకాశపుటెత్తులకు తీసుకుపోగల అవకాశం కనిపించింది. ఆయన కళ్ళముందు కోట్లాది రూపాయలు కదలాడుతున్నాయి. ఆ అపూర్వ అవకాశం కల్పించబోతున్న రమేష్ వంక ఆశ్చర్యంతో ఆనందంతో తేరిపారచూశాడు.

ఆ క్షణంలో అప్పటివరకూ మనసులో ఏదో లీలగా కదలాడుతున్న రూపం, అసలు ఆకారంలో ఒక్కసారి మెదిలింది. అతనికి ఏదో స్ఫురించి వచ్చింది.

"రమేష్‌గారూ,ఇంక మీరు ఈ పరిశోధనల్ని ఆపేయండి. మీరు నేనూ కూడా కోట్లకు పడగలెత్తే

మార్గం చూపుతాను. ఇంక ఈ అజ్ఞాత వాసంలోంచి బయటపడండి" అన్నాడు రామానుజం.

ఆమాట వినగానే గుండెగతుక్కుమంది రమేష్‌కి.

"మీరంటున్నదేమిటో నాకు అర్థంకావడం లేదు" అన్నాడు.

"ఏముందీ అర్థం కాకపోవడానికి, మీరు తయారుచేసిన ఈ హార్ట్ కోరల్‌తో ఇటుకలు, పాలిష్‌డ్ స్టోన్స్ ఒకటేమిటి మొత్తం ఇల్లు, రోడ్లు, మల్టీస్టోరీడ్ బిల్డింగ్స్ - నగరాలకి నగరాలనే నిర్మించవచ్చు. ప్రపంచ స్వరూపమే మారిపోతుంది. ఇద్దరం కలిసి హైదరాబాద్‌లోనో, ఢిల్లీలోనో మన ఆఫీసు ఓపెన్ చేద్దాం. ప్రతి రాష్ట్రంలోనూ ఫ్యాక్టరీలు పెడ్దాం. అవసరమైన పెట్టుబడిని నేను పెట్టాను. మెటీరియల్ తయారుచేసి ఇచ్చే పనిమీది మీ వాటాగా లాభాల్లో ఎనిమిదో వంతు ఇస్తాను. అదే కొన్నికోట్లు అవుతుంది" అంటూ కళ్ళు మూసుకుని తన్మయత్వంతో చెప్పుకుపోసాగాడు.

"నేను ఇందాకనే చెప్పాను. ఈకోరల్‌పై నా పరిశోధనలు ఇంకా జరుగుతున్నాయని. పరీక్షలు అన్నీ నిశితంగా సమగ్రంగా లోపరహితంగా జరిగితేనే కాని ఏ పదార్థాన్ని వ్యాపార సరళిలో ఉత్పత్తి చేయకూడదు. తొందరపడితే తెలియని ప్రమాదాలు ముంచుకురావచ్చు" అన్నాడు రమేష్.

"ఆలస్యం అయితే కోట్ల కొలది నష్టం. ఇంక ఏ పరిశోధనలూ అవసరం లేదు. వెంటనే వ్యాపారంలోకి అడుగుపెట్టండి. లేదా ఫార్ములా నాకు చెప్పండి. దానికి తగిన ప్రతిఫలం ఇస్తాను" అన్నాడు రామానుజం తొందరపెడ్తూ.

" అది మాత్రం జరగని పని. నా పరిశోధనలు పూర్తి అయితే కాని, వివరాలు ఎవరికీ చెప్పను" అన్నాడు రమేష్ దృఢంగా.

"అయితే విను మిస్టర్ రాజారావ్. నీ మీద పోలీస్ కేస్ ఇంకా పెండింగ్‌లో ఉన్న విషయం మరిచిపోకు. నిన్ను పోలీసులకు పట్టియ్యడం నిమిషం సేపుపని" అని అంటూ రమేష్, అనితల ముఖంవైపు చూశాడు.

ఆ మాట వినగానే రమేష్ ముఖం పాలిపోయింది. అనిత ముఖాన కత్తివేటుకు నెత్తుటిచుక్క లేదు.

"మిస్ అనితా.... నీ అసలు పేరు సుజాత అన్న విషయం కూడా నాకు తెలుసు. మీ ఇద్దరూ డాం స్కాండల్ కేసులో వాంటెడ్ పీపుల్ అన్న విషయం మరిచిపోకండి" బెదిరింపు స్వరంతో అన్నాడు రామానుజం.

ఐదు సంవత్సరాల క్రితం మాట.

హైదరాబాద్‌లో "ట్వెంటీఫస్ట్ సెంచరీ కన్‌స్ట్రక్షన్స్" అనే భవన నిర్మాణసంస్థ ఉండేది. ఇది మల్టీ స్టోరీడ్ బిల్డింగ్స్ కాక, మధ్యరకం డామ్‌లను కూడా నిర్మించడానికి కాంట్రాక్ట్ తీసుకొంటుండేది. అందులో రాజారావు ఒక పార్టనర్‌గా ఉండేవాడు. అక్కడే సుజాత స్టెనోగా ఉండేది. ఆమె అందచందాలకూ, సభ్యత సంస్కారాలు రాజారావుకి బాగా నచ్చాయి. అది క్రమేపీ ప్రేమగా పరిణమించి తర్వాత వారిద్దరూ ఒకింటి వారయ్యేలా చేసింది.

ఒకసారి అస్సాంలో ఒక మధ్యరకం డాం నిర్మించే కాంట్రాక్ట్ ఈ కంపెనీకి వచ్చింది. అంతపెద్ద పనిని అంతటి క్లిష్టమైన కార్యాన్ని చేపట్టడం అదే మొదటసారి. అయినా ధైర్యంతో కాంట్రాక్టుపనికి ఒప్పుకున్నారు వాళ్ళు. అయితే అనుభవం లేకపోవడంతో పాటు, మానేజింగ్ పార్టనర్ దురాశ మూలంగా కల్తీ సిమెంట్ వాడడం నిర్మాణంలో లోపాలుండడం మూలంగా, ఓసారి కురిసిన పెద్ద వర్షాలకి ఆ డామ్ కొట్టుకుపోయింది. దాంతో అది పెద్ద కేసై, సెంట్రల్ సి.బి.ఐ చేతుల్లోకి పోయింది. ఎప్పుడైతే డామ్ కూలిపోయిందో భయపడిపోయి కంపెనీ పార్టనర్స్ అందరూ కంపెనీని గాలికి వదిలేసి తలోదిక్కుకి పారిపోయారు. అప్పుడే రాజారావు సుజాతతో కలిసి తన గురువుగారైన ప్రొఫెసర్ గారి దగ్గర శరణుపొందాడు. ఆయన చనిపోయాక తమ పేర్లు రమేష్, అనితలని మార్చుకుని అజ్ఞాతవాసం గడుపుతూ పరిశోధనలు సాగిస్తున్నారు.. ఆ రోజుల్లో అందరు పార్టనర్స్‌తో పాటు రాజారావు ఫొటో కూడా ప్రముఖంగా పేపర్లలో పడింది. బిల్డింగ్స్ వ్యాపారంలో ఉన్న రామానుజానికి అందుకనే రాజారావు ముఖం బాగా గుర్తుండిపోయింది. పైగా రెండుమూడు సార్లు వాళ్ళ ఆఫీసుకు వెళ్ళడం, రాజారావుతో మాట్లాడడం కూడా జరిగింది. అప్పుడే అక్కడ సుజాతను చూశాడు. ఎటువంటి వారినైనా ఆకర్షించే సుజాతరూపం అతని మనసులో చెరగని ముద్ర వేసింది. అయితే ఎంతోమంది కస్టమర్స్‌ని కలుసుకుంటుండే రాజారావుకి, రామానుజం ముఖం ప్రత్యేకించి గుర్తులేదు. కాని రామానుజం మాత్రం వాళ్ళిద్దర్నీ సులువుగా గుర్తుపట్టాడు.

ఆ సంఘటనలన్నీ కళ్ళముందు గిర్రున తిరిగాయి వారిద్దరికీ.

"ఏమి నిర్ణయించుకున్నావు రాజారావు నేను చెప్పినట్లు మర్యాదగా నాతో వచ్చేసి కోటీశ్వరుడివికా నీ రహస్యం నేను ఎవ్వరికీ చెప్పను. నీకు ఏ ప్రమాదమూ లేకుండా కాపాడుతాను. ఇక్కడ నేను ఒంటరిగా ఉన్నానని, నాకు అపకారం చేయాలని మాత్రం ఆలోచించకండి. నా ఆత్మరక్షణలో నేనెప్పుడూ ఉంటూనే ఉంటాను" అంటూ కోటు జేబులోకి చేయి పోనిచ్చాడు రామానుజం. అక్కడ రివాల్వర్ ఉన్న విషయం తెలుస్తూనే ఉంది.

రమేష్, అనితల ముఖాలు వివర్ణమై పోయాయి.

"చూడండి- నా దగ్గర రివాల్వర్ ఉంది కనుక మిమ్మల్నేదో చేస్తానని భయపడకండి, నువ్వు బంగారుగుడ్లుపెట్టే బాతువి. చూస్తూ చూస్తూ నిష్కారణంగా నిన్ను చంపుకోను. మంచీ చెడూ ఆలోచించగలవాడివి కనుకనే మరోసారి హెచ్చరిస్తున్నాను. నాతో రాదలుచుకున్నావో పోలీసులకు చిక్కదలచుకున్నావో తేల్చుకో" అన్నాడు రామానుజం కర్కశంగా. అధికార స్వరంతో అతన్ని "నువ్వు" అనడం మొదలుపెట్టాడు.

రమేష్ అనిత వంక చూశాడు.

ఆమె దీనంగా చూస్తూ ఒప్పుకోమన్నట్లు తల ఆడించింది.

"సరే .... నీ ఇష్టం అలాగే కానీ" అన్నాడు రమేష్ అసహ్యాన్ని వెళ్ళగక్కుతూ. ఆ కోపం కొద్దీ తనుకూడా రామానుజాన్ని "నువ్వు" అనేశాడు.

అయితే కోట్లకోసం కలలు కంటున్న రామానుజానికి ఇదేమీ పట్టలేదు. రమేష్ నయాన

కాకపోయినా, భయాన్నయినా ఒప్పుకున్నాడు. అది చాలు ఆ మర్నాడే మూటా ముల్లె సర్దేసి అందరూ బయలుదేరారు.

* * * *

ఢిల్లీలో "మెట్రో కన్‌స్ట్రక్షన్స్" సంస్థ వెలిసింది. దాని సోల్ ప్రొప్రయిటర్ రామానుజం, రమేష్ రూపొందించిన హార్ట్ కోరల్‌కి "కోరలైట్" అని పేరు పెట్టారు. దానిని తయారుచేసే ఫ్యాక్టరీని ఢిల్లీ సివార్లలో స్థాపించారు. అక్కడ పనివాళ్ళు కోరలైట్‌ను భారీగా ఉత్పత్తి చేస్తుంటే దానికి అనుబంధంగా ఉన్న లేబొరేటరీలో తన పరిశోధనలు చేసుకుంటుండేవాడు రమేష్. అనిత అతనికి తోడుగా ఉండేది. వాళ్ళిద్దరూ పోలీసుల భయంతో అసలు బయటికి వెళ్ళేవారుకాదు.

రోజులు గడుస్తుంటే రామానుజం వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగింది. అచిరకాలంలోనే ఆ కోరలైట్ అసమాన ప్రచారం పొందింది. ఇళ్ళు కట్టడం దానితోనే, రోడ్లనిర్మాణం దానితోనే ఆ కోరలైట్ ఫార్ములా తెలుసుకోవాలని ఎన్నో విధాల ప్రయత్నించాడు రామానుజం. అది అతనికి తెలిస్తే రమేష్, అనితలకు నూకలు చెల్లినట్లే. ఈ విషయం వారికీ తెలుసు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ రహస్యం బయటపెట్టే వాడు కాదు రమేష్.

ఇదిలా ఉండగా రామానుజానికి చాలా పెద్ద ఆర్డర్ వచ్చింది. కేంద్రప్రభుత్వం ఢిల్లీ సమీపంలో ఒక మోడల్ టౌన్‌షిప్‌ను నిర్మించాలని తలపెట్టింది. అందుకు కావలసిన పథకం రూపొందించి మొత్తం టౌన్‌షిప్‌ని కోరలైట్‌తో నిర్మించాలని నిర్ణయించింది. దాంతో కొన్ని వందల కోట్లు విలువచేసే ఆర్డరు రామానుజానికి వచ్చింది. తగినంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇయ్యడంతో చాలా పెద్ద ఫ్యాక్టరీ పెట్టి ఇరవై నాలుగు గంటలూ పనిచేయించసాగాడు రామానుజం.

ఏడాది గడిచింది. టౌన్‌షిప్ నిర్మాణం పూర్తి అయింది. ఇంక దానిని లాంఛనంగా ఓపెన్‌చేసి ప్రజలకు అప్పజెప్పడమే తరువాయి. అయితే ప్రధానికి తీరిక లేనందువల్ల అందుకు తేదీ నిర్ణయం కాలేదు.

లాభాలు కోట్ల కొద్దీ వస్తున్నా రామానుజానికి సంతృప్తి అన్నది లేకపోయింది. కట్టు తెంచుకున్న పొగరు గిత్తలాగా అతని పేరాశ నిమిష నిమిషానికీ పెరిగిపోసాగింది. దాంతో రబ్బర్ ప్లాస్టిక్ వంటి మెత్తని కోరల్‌ని నిర్దుష్టంగా తయారుచేయమని రమేష్‌మీద ఒత్తిడి తీసుకురాసాగాడు. పరిశోధన అనేది తొందర పెట్టే అయ్యేది కాదని ఎంత నచ్చజెప్పినా అతని వ్యాపార బుద్ధికి ఎక్కేది కాదు. చివరికి ఒక నెల రోజులలోగా ఆ పరిశోధన పూర్తి చేయకపోతే రమేష్ రహస్యం పోలీసులకి చెప్తానని బెదిరించాడు కూడా.

రమేష్‌కి ఈ దినదినగండంతో ప్రాణం విసిగిపోయింది. తాను జైలుకి వెళ్ళవలసి వస్తుందని భయపడుతున్నాడే కాని ఇప్పుడు మాత్రం తాను బంధిఖానాలో గడపడం లేదూ! తాను కాని తన భార్య కాని ధైర్యంగా బయటికి వెళ్ళగలుగుతున్నారా? ఎవరితోనైనా మాట్లాడగలుగుతున్నానా? ఐదేళ్ల అజ్ఞాతవాసం తర్వాత రాకరాక ఒక్క మనిషి- రామానుజం వస్తే - దాని ఫలితం సాలెగూట్లో చిక్కుకున్నట్లయింది. ఇంతకంటే పోలీసులకే లొంగిపోయి జైలు శిక్ష అనుభవించడమే మేలు పైగా రామానుజం పెట్టిన గడువు ఇంక నాలుగు రోజులే ఉంది. అంతలోగా తన పరిశోధన పూర్తి కాకపోతే పోలీసులకేమీ అప్పజెప్పడు-

అప్పుచెప్తే అతనికే నష్టం. కాని పీడించడం విసిగించడం, వేధించడం ఎక్కువవుతుంది.

ఆ రోజు రామానుజం కంపెనీ పనిమీద కలకత్తా వెళ్లాడు. మర్నాటికి కాని రాడు. ఇదే తగిన అదననుకున్నాడు రమేష్. భార్యతో విషయం అంతా చర్చించాడు. పోలీసులకి లొంగిపోవడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చారు ఇద్దరూ.

రమేష్ భార్యతో కలిసి సెంట్రల్ సి.బి.ఐ ఆఫీసుకి వెళ్లాడు. అక్కడే తను కేసుకి సంబంధించిన ఆఫీసర్‌ని కలుసుకుని తన గురించి తన కేసు గురించీ చెప్పి తాను పోలీసులకు లొంగిపోవడానికి వచ్చానని చెప్పాడు.

ఆఫీసర్ ఆ కేసుకి సంబంధించిన ఫైల్ తెప్పించాడు.

ఆ ఫైల్‌ని శ్రద్ధగా చూసి రమేష్ వంక తిరిగి "మిస్టర్ రాజారావు యు ఆర్ ఎగ్జానరేటెడ్" అన్నాడు.

ఆయన అంటున్నదేమిటో రమేష్‌కి అర్థం కాలేదు. తన చెవులని తానే నమ్మలేకపోయాడు. నోరు వెళ్లబెట్టి ఆయన వంకే చూడసాగాడు.

"యస్. మిస్టర్ రాజారావు. ఈ కేసు మొదలైన ఒక నెల రోజుల్లోనే మా వాళ్లు మీ మేనేజింగ్ పార్టనర్ గుప్తాని అరెస్టు చేశారు. ఆయన జరిగిన దానికి పూర్తి బాధ్యత తానే స్వీకరించాడు. మీరు మరికొందరు పార్టనర్స్‌కి ఏ సంబంధమూ లేదని, నిర్దోషులనీ స్టేట్‌మెంట్ ఇచ్చాడు. కల్తీ సిమెంట్ సప్లయి చేసిన డీలర్స్‌నీ, కక్కుర్తిపడ్డ సబ్‌కంట్రాక్టర్స్‌నీ బయటపెట్టాడు. వాళ్లని అరెస్ట్ చేసి ప్రొసీడ్ అవడం జరిగింది. ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా మిమ్మల్ని నిర్దోషులుగా భావించి వాంటెడ్ లిస్టులోనుంచి తొలగించాం" అంటూ వివరించాడు సి.బి.ఐ ఆఫీసర్.

తన చెవులని నమ్మలేకపోయాడు రమేష్. ఉద్వేగం ఆపుకోలేక ఏడ్చేశాడు. అనిత కూడా ముఖం మీద రుమాలు కప్పుకుని దుఃఖించింది.

కొంచెం తేరుకున్నాక "థాంక్యూసార్" అంటూ లేచి నుంచున్నాడు రమేష్.

"ఆ మీరు రేపు ఈ సమయానికి రండి. మీ మీద ఏ విధమైన కేసూ లేదని రాతపూర్వకంగా ఇస్తాను. ఆ డాక్యుమెంట్ దగ్గరుంటే మీకు ఎప్పటికీ భయముండదు" అన్నాడు ఆ ఆఫీసర్.

ఆయనకి ధన్యవాదాలు చెప్పి ఇద్దరూ బయటికి వచ్చారు.

తాము అనవసరంగా తమ నీడని చూసి భయపడి నిష్కారణంగా ఐదేళ్లపైగా అజ్ఞాతవాసం చేశారన్నమాట. అయితే తాము అజ్ఞాతంలో ఉండడం మూలంగా రామానుజం కావాలనే ఇలా బెదిరించి తన పబ్బం గడుపుకున్నాడన్న మాట. ఆ విషయం తలుచుకోగానే అతని పీక నులిమి చంపివేయాలన్నంతకోపం వచ్చింది రమేష్‌కి.

ఏమైతేనేం ఇన్నాళ్లకి చెరవదిలింది. రేపు రామానుజానికి అతని ఉద్యోగానికీ గుడ్‌బై చెప్పి, కావాలనుకున్నచోటికి వెళ్లిపోవచ్చు.

* * * *

మర్నాడు మధ్యాహ్నం రమేష్ అనితతో కలిసి ఆ డాక్యుమెంట్ తీసుకోడానికి సి.బి.ఐ ఆఫీసుకి

వెళ్లాడు. కలకత్తాలో పని తొందరగా అయిపోవడంతో ఆ రాత్రికి రావలసిన రామానుజం మధ్యాహ్నానికే వచ్చేశాడు. తిన్నగా రమేష్ కోసం వెళ్ళాడు. రమేష్ లేబొరేటరీకి తాళం వేసి ఉంది. క్రిందటి రోజు రమేష్, అనిత ఎక్కడికో వెళ్లారనీ, ఈ రోజు కూడా ఒక గంట ముందు వెళ్లారనీ, లేబొరేటరీ అసలు తెరవనే లేదని బాయ్ చెప్పాడు.

రామానుజం మనసు కీడుని శంకించసాగింది. "వీళ్లిద్దరూ ఎక్కడికి పోయారబ్బా? ఒకవేళ తప్పించుకుపోలేదు కదా!" అనుకున్నాడు.

"ఎలా పారిపోతారు పోలీస్ కేసు మీద పెట్టుకుని!" అని తానే సమాధానం చెప్పుకున్నాడు.

ఎదురుగుండా కిటికీ ఊచలకి సాలీడు గూడుకట్టింది. ఏమీ ఎరుగని ఈగవచ్చి అందులో చిక్కుకుంది. బయటికి పోవాలని గింజుకొన్నకొద్దీ మరింత బిగుసుకుపోతోంది. ఇదంతా ఆనందంగా చూస్తున్న సాలీడు ఆ ఈగని తినడానికి ప్రయత్నిస్తోంది. ఇంతలో గింజుకుంటున్న ఈగ దారాల్ని తెంపుకొని జుయ్యిమని ఎగురుతూ వెళ్లిపోయింది. దారాలలో గట్టి తక్కువయిందో! ఈగ శక్తి ఎక్కువయిందో!

ఈగ ఎగిరిపోడాన్ని ఆశ్చర్యంగా చూస్తుండిన రామానుజానికి మరో ఆశ్చర్యం ఎదురయింది.

పారిపోతున్న ఈగను పట్టుకోవాలన్న ఆత్రంతో కాబోలు వడివడిగా వెళ్తున్న సాలీడు తన గూట్లో తానే చిక్కుకుని గింజుకోసాగింది.

సాలీళ్లు చాలా తెలివిగా గూళ్లను కట్తాయి. అవి వేసిన దారాలు కొన్నింటికి జిగురును పూస్తాయి. కొన్నింటికి పూయవు. జిగురు అంటిన దారాలు తగిలిన దోమలూ, ఈగలూ చిక్కుకుపోతే, జిగురులేని దారాలమీద నుంచి జాగ్రత్తగా పాక్కుని వెళ్లి వాటిని భక్షిస్తుంది సాలీడు. పొరబాటున జిగురువున్న దారాల మీద సాలీడు పాకితే అదికూడా సొంత గూటిలో చిక్కుకుపోతుంది. కాని అలా జరగడం అతి అరుదు. ఈ విషయాలు తెలిసిన రామానుజం ఆ సాలీడుని చూస్తూ "ఇంత తెలివిగల సాలీడూ సొంతగూటిలో ఎలా ఇరుక్కొందో" అని ఆశ్చర్యపోసాగాడు.

ఇంతలో అతనికి అనిపించింది. ఈ ఈగలాగే రమేష్ కూడా తన గూటినుంచి ఎగిరిపోలేదు కదా అని. ఎందుకైనా మంచిదని వెంటనే వెతకడానికి బయలుదేరాడు రామానుజం.

ఢిల్లీ సివార్లలో రామానుజం ఫ్యాక్టరీ ఉన్న ప్రాంతంలో యాసిడ్ ఫ్యాక్టరీలు, కెమికల్ ఫ్యాక్టరీలు చాలా ఉన్నాయి. వాటినుంచి సల్ఫర్‌డై ఆక్సయిడ్, హైడ్రోజన్ సల్ఫయిడ్, మిథేన్ వంటి ఘాటైన వాయువులు మధ్య మధ్య వెలువడి వాతావరణంలో కలిసిపోతుంటాయి. అలాగే నైట్రిక్ యాసిడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ వంటి ఘాటైన ఆమ్లాల ఆవిరులు కూడా అప్పుడప్పుడూ బయటకు వచ్చి గాలిలో కలుస్తుంటాయి. వర్షం కురిసినప్పుడు వీటిలో కొంత భాగం వానతో తిరిగి నేలమీద జేరుతాయి. ఇటువంటి వర్షాన్ని యాసిడ్ రైన్ అంటారు. దీనివల్ల కూడా కాలుష్యం ఏర్పడుతుంటుంది.

ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకోసాగాయి. పెద్ద వర్షం వచ్చే సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. రమేష్‌కోసం వెతుకుతున్న రామానుజం కారు తాను కట్టిన కోరలైట్ టౌన్‌షిప్‌కు వెళ్తోంది ఆ మబ్బుల రంగు వెలుగు, ఆ కోరలైట్ కట్టడాల రంగుకి బాగా మాచ్ అయి మొత్తం ప్రకృతి అంతటికీ ఒక వింత అందం సంతరించింది. తన విజయానికి ఒకవైపు మురిసిపోతున్నా రమేష్ గురించిన ఆందోళన రామానుజం మనసుకి శాంతి లేకుండా చేస్తోంది.

వర్షం సన్నగా మొదలైంది. అదే టౌన్‌షిప్ కట్టాక పడ్డ మొదటివాన. అంతలో అది పెద్ద వానగా మారింది. టౌన్‌షిప్‌లో జనం ఇంకా నివాసం ఏర్పరచుకోకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. విండో గ్లాసెస్ మూసేసి, నున్నని కోరలైట్ రోడ్లమీద వేగంగా కారుని నడపసాగాడు రామానుజం. సి.బి.ఐ ఆఫీసులో కావలసిన డాక్యుమెంట్స్ తీసుకుని రమేష్ అనితతో తిరిగివస్తున్నాడు. అతనూ టౌన్‌షిప్‌లో ప్రవేశించాడు.

దూరాన్నుంచి వస్తున్న కారు కనిపించింది.

"అరే...ఈయన అప్పుడే వచ్చేసినట్లున్నాడే" అన్నాడు రమేష్.

"రానీండి, మనకేం భయం. ఎలాగూ ఈ రోజుతో ఆయనకి గుడ్‌బై చెప్పదలుచుకున్నాం" అంది అనిత.

"అవుననుకో. కాని అంత త్వరగా వదుల్తాడా అని" నసిగాడు రమేష్. ఇంతలో రమేష్ కారు గోతుల మీంచి పోతున్నట్లు ఎగిరెగిరి పడసాగింది.

"ఇదేమిటబ్బా...నున్నగా ఉన్న ఈ కొత్త రోడ్లమీద ఈ కుదుపులేమిటి?" అని ఆశ్చర్యపోతున్న రమేష్‌కి కారు అద్దంలోంచి కట్టెదుట కన్పించిన దృశ్యం, కొయ్యబారిపోయేటంతటి విభ్రాంతిని కల్గించింది. కోరలైట్‌తో వేసిన రోడ్లు గుడారాలుపైకి లేచినట్లుగా పైకి లేస్తున్నాయి. క్రిందనుంచి వాటిని ఏదో పైకి నెట్టుతున్నట్లుగా పైకి లేస్తున్నాయి అవి.

"అటు చూడండి" అని భయంతో అరిచింది అనిత. ఎదురుగా. దూరాన ఉన్న ఇళ్లు అన్నీ మామూలువీ, మల్టీ స్టోరీడ్‌వి అన్నీ నీటిలో నానేసిన శనగగింజ ఉబ్బినట్లు నీరు తగిలిన స్పాంజి పెద్దదైనట్లు అన్నివైపులా పెరిగిపోతూ కనిపించాయి. అవన్నీ కూడా కోరలైట్‌తో కట్టిన ఇళ్లే. ఎదురుగా ఉన్న రోడ్డు అలలు అలలుగా పడుతూ లేస్తూ పాములాగా మెలికలు తిరిగిపోతోంది. అటుపైన ఇళ్లు అన్నివైపులా పెరిగిపోతూ ఊగిపోతున్నాయి. ఆ దృశ్యం చూస్తుంటే నగరం యావత్తూ పైశాచికంగా కరాళ నృత్యం చేస్తున్నట్లనిపిస్తోంది.

"ఓ....కోరల్‌కి ప్రాణం వచ్చిందన్నమాట. యాసిడ్ రెయిన్‌తో జీవశక్తి మేల్కొంది. అందుకే ఎదిగిపోతోంది. కోరలైట్‌కి దూరంగా పోవాలి మనం" అంటూ కారుని వెనక్కి తిప్పాడు రమేష్.

వాన స్థిరంగా కురుస్తూనే ఉంది.

దూరాన్నుంచి రామానుజం కారు ఎగిరెగిరి పడుతూ వస్తోంది. అతనూ రమేష్ కారుని చూశాడు. తనని తప్పించుకొని పోతున్నాడనుకుని తన కారు వేగం పెంచి వెంటాడసాగాడు. అంతలో పెద్ద చప్పుడుతో ఫెళఫెళా శబ్దం చేస్తూ రోడ్డుకి అటూ ఇటూ ఉన్న రెండు పెద్ద మల్టీస్టోరీడ్ బిల్డింగ్స్ కుప్పకూలి రోడ్డుకి అడ్డంగా పడ్డాయి. ఆ పడడం పడడం రామానుజం కారు మీద పడ్డాయి.

అంతే. రామానుజం కారుతో సహా నుగ్గునుగ్గయిపోయాడు.

సాలీడు తన గూట్లోనే చిక్కుకుని ప్రాణం పోగొట్టుకుంది.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జూలై 1987** ✪

# అరవైగా మారిన ఇరవై

ఒకనాడు రేడియోలు కేవలం సంపన్నుల సొత్తుగా మాత్రమే ఉండేవి. ఈనాడు దారిప్రక్కన దుకాణంవాళ్లు, రిక్షావాళ్ళు కూడా వాటిని సొంతం చేసుకోగలుగుతున్నారు. నిన్నమొన్నటి వరకు టి.వి. కూడా సంపన్నులలో కూడా పైస్థాయి వారికే పరిమితమై ఉండేది. ఆ రోజుల్లో టి.వి. ఉన్న వారి టీవి వెలిగిపోతూ ఉండేది. ఈనాడు మధ్యతరగతి వర్గాలలో అట్టడుగువారు కూడా ఈ టీవిని ఒలకబోయగలుగుతున్నారు. పదిహేను ఇరవై సంవత్సరాల క్రితంవరకు మోటారు సైకిలు ఉన్నవారికి అదొక హోదా. మోపెడ్స్‌వచ్చాక అతి సామాన్యులు కూడా శరవేగంతో ప్రయాణం చేయగలుగుతున్నారు. ఇదంతా అతిత్వరగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక విజ్ఞాన ఫలం.

ప్రపంచం 21వ శతాబ్దంలోకి దూసుకుపోయింది. అంతరిక్షయాత్రలు అతి సామాన్యం అయ్యాయి. అంతేకాదు. అంతరిక్ష నౌకలను సంపన్నులు సొంతంగా తయారు చేసుకుని గ్రహాంతరయానం చేయగలిగినంతగా సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందింది. 20వ శతాబ్దంలో ఎందరో ప్రైవేటు వ్యక్తులు విమానాలను సొంతం చేసుకోవడం విశేషం కానప్పుడు 21వ శతాబ్దంలో అంతరిక్ష నౌకలను సొంతంగా ఏర్పరచుకోగలగడంలో విడ్డూరం ఏముంది?

రజనీష్ కోటేశ్వరులకి ఏకైక సంతానం. కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ తీసుకున్నాక స్పేస్ టెక్నాలజీలో స్పెషల్ కోర్సు చేశాడు. శనిగ్రహానికున్న అతి పెద్ద ఉపగ్రహం టైటాన్ మీద భూమిమీద ఉన్నట్లే వాతావరణం నీరు ఉన్నాయి. బహుశా అక్కడ ఏదో ఒక రూపంలో జీవం ఉండవచ్చునని శాస్త్రజ్ఞుల అనుమానం. ఆ టైటాన్-మండలానికి యాత్రచేసి అక్కడి విశేషాలు తెలుసుకురావాలన్నది రజనీష్ ప్రగాఢ వాంఛ.

ఇండియాలో నేషనల్ స్పేస్ ఏజన్సీ (ఎన్.ఎస్.ఎ) అన్న సంస్థ ఏర్పడింది. ఈ సంస్థ తన అధీనంలోని వివిధ కేంద్రాల నుంచి, రాకెట్లను, అంతరిక్ష నౌకలను పంపుతుంది. మనదేశం మొదట్లో ఆర్యభట ఉపగ్రహాన్ని తయారుచేసి రష్యాలోని కేంద్రం నుంచి అంతరిక్షంలోకి పంపినట్లు ఈ సంస్థ ప్రైవేట్ వ్యక్తులు సొంతంగా ఏర్పరచుకున్న అంతరిక్ష నౌకలను, అంతరిక్షంలోకి పంపుతుంది. అందుకుగాను తగు మొత్తాన్ని ఫీగా వసూలుచేస్తుంది అంతరిక్ష నౌకల్ని తయారు చేయించుకోవడం ప్రయివేట్ వ్యక్తులకు సాధ్యమవుతుంది.



కాని అంతరిక్ష కేంద్రాల్ని నిర్మించుకోవడం సాధ్యం కాదుకదా! అందువల్ల ఎందరో ప్రైవేట్ వ్యక్తులు వారి కేంద్రాలనుంచి తమ అంతరిక్ష నౌకల్ని ప్రయోగింప జేసుకుంటుంటారు.

రజనీష్‌కి 20 ఏళ్ళు వచ్చేసరికి కోట్ల ఆస్తికి సొంతదారుడు అయ్యాడు. దాంతో ట్రైటాన్ యాత్ర గురించి అతను కంటుండిన కలలకు వాస్తవరూపం వచ్చే అవకాశం ఏర్పడింది.

రజనీష్ తనకి కావలసిన అంతరిక్ష నౌకను తయారు చేయించుకున్నాడు. విశాఖపట్నం సమీపంలో ఎన్.ఎస్.ఎ‌కి ఒక అంతరిక్ష ప్రయోగకేంద్రం ఉంది. అక్కడినుంచి 'ట్రైటాన్'ని ప్రయోగించే ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ట్రైటాన్ మీదున్న అభిమానంకొద్దీ రజనీష్ తన అంతరిక్ష నౌకకి కూడా 'ట్రైటాన్' అని పేరుపెట్టుకున్నాడు.

'ట్రైటాన్ ఒక చిన్న అంతరిక్ష నౌక. దానిని స్టీల్, డ్యురాల్యూమినియం మిశ్రమలోహంతో తయారుచేశారు. అందులో ఆరడుగులు మేర నడవడానికి వీలైన ఇన్నర్ కాబిన్ ఉంది. దానిని అంటి ఆక్సిజన్ టాంకులు ఫుడ్ టాబ్లెట్స్, శక్తినిచ్చే ఔషధాల కాప్స్యూల్స్ వంటివి ఉంచిన గది ఉంది. శ్వాస తీసుకుని వదిలేసిన గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్ నుంచి తిరిగి ఆక్సిజన్‌ని విడగొట్టి సిలిండర్లలో నింపే యంత్రం ఉంది దీనిమూలంగా కొద్దిపాటి ఆక్సిజన్‌తో ఎంతటి సుదీర్ఘ అంతరిక్షయానాలను అయినా సులువుగా చేయడం సాధ్యమవుతుంది. ఈ ట్రైటాన్‌లో వున్న ఇతర విశేషాలు-దాని ప్రోగ్రాం అంతా అదినుంచి తుదివరకూ కంప్యూటరే నిర్వహిస్తుంది. దీనికి 20వ శతాబ్దంలోలాగా లిక్విడ్ హీలియం వంటి

వాటిని ఇంధనంగా ఉపయోగించి మూడు అంచెల రాకెట్‌ల వంటి ఏర్పాట్లు అవసరం లేదు. ఆటామిక్ ప్రొపల్షన్‌తో నడిచే ఈ అంతరిక్ష నౌక కావలసిన వేగాన్ని సంతరించుకుని సూటిగా రోదసిలోకి వెళ్లిపోగలదు. ప్రోగ్రాం ప్రకారం టైటాన్‌ని చేరడానికి పదేళ్లు, తిరిగి రావడానికి పదేళ్లు మొత్తం ఇరవై ఏళ్ళు పడుతుంది.

రజనీష్ అంతరిక్ష నౌకలోకి ప్రవేశించాడు. కొంచెం సేపట్లోనే దాని తలుపులు మూసుకున్నాయి. రజనీష్ అసిస్టెంట్ డాక్టర్ గుప్తా క్రిందనుంచుని ఈ కార్యక్రమాన్ని ఆసక్తితో తిలకిస్తున్నాడు. కౌంట్‌డౌన్ ప్రారంభమయింది. పది, తొమ్మిది, ఎనిమిది, ఏడు, ఆరు, ఐదు, నాలుగు, మూడు, రెండు, ఒకటి, జీరో- నౌకని విడుదల చేసే స్విచ్ ఆన్ అయింది.

* * * *

పెద్ద చప్పుడుతో ఏదో పగిలిపోయినట్లనిపించింది రజనీష్‌కి.

ముందున్న ఇండికేటర్‌కి ఉన్న అద్దం పగిలికింద పడి ముక్కలు ముక్కలయింది. దానిని ఆన్‌చేసి చూశాడు. అది పని చేయడం లేదు. నౌక వెళ్తున్న వేగం ప్రయాణించిన దూరం, దిశ, టైం ఇవన్నీ చూపించేది ఆ ఇండికేటరే. దీనికితోడు నౌకని ఎవరో కుదిపేస్తున్నట్లు కదిలిపోతోంది. ఇది చాలక డబ్బాలో రాళ్ళు పోసి గలగల ఆడించినట్లు ఒకటే చప్పుడు. నౌకకి ఏదో జరిగింది. క్షణాలలో ఎంతో ఎత్తుకి ఎగరగల దానికి ఏ విమానం కాని ఉల్కకాని అనుకోకుండా గ్రుద్దుకోలేదు కదా! లేకపోతే అణుఇంధనంలో ఏదైనా లోపం ఉండి తగిన వేగాన్ని పొందలేక భూమ్యాకర్షణ శక్తిని వదిలించుకునే ప్రయత్నంలో నౌక ఒకటే ఊగిపోవడం లేదు కదా! ఏమో! ఏం జరిగిందో తెలుసుకోవాలనుకున్నా ఏ యంత్రమూ పనిచేయడంలేదు. నౌకకున్న కిటికీలను తెరిచి అద్దాల తలుపులలో నుంచి బయటికి చూద్దామని ప్రయత్నించాడు రజనీష్. ఏ ఒక్క కిటికీకూడా ఎంత ప్రయత్నంచేసినా తెరుచుకోలేదు.

అంటే మొత్తం మెకానిజమ్ పెద్దగా దెబ్బతిందన్న మాట.

అదృష్టవశాత్తూ నౌకలో ఎయిర్ కండిషనింగ్, లైటింగ్ మాత్రం దెబ్బతినలేదు. అసహనంగా కుర్చీలోంచి లేచి ఆరడుగులు ముందుకి నడిచాడు. రజనీష్. ఇంకా ముందుకి నడవాలన్నా వీలులేదు. అక్కడికి నౌక గోడ వచ్చేసింది. ఎదురుగా ట్రాన్స్‌పరెంట్ జార్స్‌లో ఫుడ్‌టాబ్లెట్స్, ఎనర్జైజింగ్ కెమికల్ పిల్స్ ఉన్నాయి. ఆ టాబ్లెట్స్‌లో ఉన్నది హైలీ కాన్‌సన్‌ట్రేటెడ్ అండ్ కండెన్స్‌డ్ ఫుడ్. ఆ టాబ్లెట్ ఒక్కటి చప్పరిస్తే చాలు. పూర్తి భోజనం చేసినట్లే లెక్క. ఎనర్జైజింగ్ కెమికల్ పిల్స్ వేసుకుంటే దాహం వెయ్యదు. ఒంటికి అవసరమైన శక్తి వస్తుంది.

వాటి వంక అసహనంగా చూశాడు రజనీష్ అవి తనని జీవచ్ఛవంగా నిలపగలవు అంతే.

నౌకలోని యంత్రాలన్నీ చెడిపోవడంతో భూమితో టెలివిజన్ ద్వారాగానీ రేడియోద్వారా గానీ మరే విధమైన సంబంధంలేకుండా పోయింది.ఈ లెక్కన కంప్యూటర్ ప్రోగ్రాం మాత్రం కరెక్టుగా ఉంటుందన్న నమ్మకం ఏమిటి? సుడిగాలిలో కొట్టుకుపోతున్న కాగితంలా అయింది టైటాన్ పని. అసలు అది అంతరిక్షంలోకి దూసుకువెళ్ళి ప్రయాణంచేస్తోందో లేదో! చేస్తూనే ఉండాలి. ఏ కారణం చేతనైనా ప్రయోగం విఫలమైతే నౌక కూలిపోతే ఈ సరికి తాను అసలు బతికి ఉండేవాడే కాదు- అందులోనూ ఏ మాత్రం గాయాలు లేకుండా. నౌక అంతరిక్షంలో దూసుకుపోతుండగానే దానికి ఏదో అయి ఉండాలి. అందువల్ల

యంత్రాలన్నీ చెడిపోయినా భూమ్యాకర్షణ శక్తిని ఛేదించుకుని బయటపడ్డ కారణంగా, అది అలా కుదుపులతో ఓటి బండిలాగా సాగిపోతూ వుండాలి. ఈ లెక్కన తాను ఇప్పుడు అంతరిక్షంలో ఒక ఖైదీ. అది కూడా తాను నిర్మించుకున్న గదిలో. ఇలా ఎంతకాలం సాగుతుందో! కొన్ని నెలలు సంవత్సరాలు ఆ తర్వాత దారీ తెన్నూ లేని ఆ అనంత ప్రయాణంలో ఒంటరితనాన్ని తట్టుకోలేక తన ప్రాణం పోతుంది. ఆ శవాన్ని మోసుకుంటూ వెళ్ళి టైటాన్ ఏదో గ్రహాన్నో, ఉప గ్రహాన్నో, అల్ప గ్రహాన్నో, ఉల్కనో గ్రుద్దుకొని ముక్కలు ముక్కలై పోతుంది. ఆ శకలాలు కూడా అంతరిక్షంలో అనంతయాత్ర చేస్తుంటాయి.

ఆలోచనలతో పిచ్చెక్కిపోతోంది రజనీష్‌కి.

దానికి తోడు చెవులుతూట్లు పొడిచే ఈ రణగొణధ్వని. అది చాలక ఒళ్ళు హూనం చేసేకుదుపు.

ఒక తెలుగువాడు స్వరాష్ట్రంలో ఉన్నపుడు మరో తెలుగువాడిని పట్టించుకోడు. అదే ఏ నాగాలాండ్‌లోనో మిజోరంలోనో ఉన్నప్పుడు మరో తెలుగువాడు కనిపిస్తే ప్రాణంలేచి వస్తుంది. అదే ఏ అమెరికాలోనో, కెనడాలోనో, ఏ భారతీయుడు కనిపించినా పట్టరాని సంతోషం వేస్తుంది. ఇప్పుడు భూమిని వదిలి అంతరిక్షంలో ఉన్న రజనీష్‌కి మరో మానవమాత్రుడు కాదుగదా కనీసం పిల్లి, ఎలక ఆఖరికి ఈగా, దోమా కనిపించినా చాలనిపిస్తోంది. కాని ఎయిర్ టైట్ చేసిన ఆ టైటాన్‌లోకి ఈగా దోమలు కావు గదా కనీసం సూక్ష్మజీవులూ కూడా దూరలేవు. పైగా నౌకలోని గాలినికూడా ఏ రకమైన సూక్ష్మజీవులు, వైరస్‌లూ లేకుండా శుద్ధి చేశారు. లేకుంటే ఇతర గోళాల మీదకు వెళ్ళినప్పుడు అవి అక్కడ ఉత్పాతాలను సృష్టించగలవు. అందువల్ల ప్రస్తుతం టైటాన్‌లో ఉన్న జీవి కేవలం రజనీష్ ఒక్కడే.

ఆ ఒంటరితనాన్ని భరించలేకపోతున్నాడు రజనీష్. ఈ ఏకాంత అనంతయాత్ర ఎంతకాలం! అసలు ఎంతకాలం గడిచిందో తెలిస్తేగా! కాలం అనేది సాపేక్షికం. సూర్యునిచుట్టూ భూమి తిరుగుతున్న దానిని బట్టి కాలం నిర్ణయించుకుంటున్నాం. కాని ఆ భూమినే వదిలేసినపుడు ఇంక కాలం ఎక్కడ ఉంది! దేనిని బట్టి దానిని కొలవాలి?

ఇంతకీ తన అంతరిక్ష నౌక పయనిస్తోందా లేదా? పయనిస్తూనే ఉండాలి. కాని ఆ విషయం లోపలకూచున్న తనకి తెలీదు. విమానంలో ప్రయాణం చేసేవారికీ అంతే. విమానంపైకి లేస్తున్నప్పుడూ కిందికి దిగుతున్నప్పుడు మాత్రమే అది కదులుతున్న విషయం తెలుస్తుంది. స్థిరంగా ఎగురుతున్నప్పుడు ఏ మాత్రం కదులుతున్నట్లనిపించదు. ఇంట్లో కూచున్నట్లే ఉంటుంది. అదే విధంగా తాను గుర్తించలేకపోయినా టైటాన్ కూడా ప్రయాణం చేస్తూనే ఉండాలి.

అసహనంగా అటూ,ఇటూ తిరగసాగాడు రజనీష్. ఉన్నట్లుండి ఎదురుగుండా మాసినగడ్డం, రేగినజుట్టు, ముడతలు పడ్తున్న ముఖంతో ఒక మానవాకారం కనిపించింది.

దానిని చూడగానే భయంతో గుండె ఎగిరివచ్చి గొంతులో పడ్డట్లయింది రజనీష్‌కి. విచిత్రం! అంతవరకూ ఈగా, దోమా అయినా చాలు అనుకున్న రజనీష్‌కి మనిషి కనిపిస్తే భయంతో ఒళ్ళు ముణికిపోయింది. నిజమే. సూక్ష్మజీవులు కూడా జొరలేని అంతరిక్ష నౌకలోకి మానవాకారం వచ్చిందంటే భయంకాక మరేం వేస్తుంది!

అంతలోనే ఆ ఆకారం ఎవరిదో గుర్తుపట్టాడు రజనీష్. అది తనదే. అది ఎదురుగుండా వున్న

అద్దంలో కనిపించిన తన ప్రతిబింబం! దగ్గరగా వెళ్ళి చూశాడు రజనీష్. సందేహంలేదు. అది తన రూపమే. అరే! ఇదేమిటి! గడ్డం ఇంతగా మాసింది! జుట్టు ఎదిగిపోయింది. అరే! ముఖాన్న ముడతలు కూడా వచ్చాయే! అంటే తాను గుర్తించలేదు కాని అంతరిక్ష నౌక ఇంచుమించు కాంతి వేగానికి సమానమైన వేగంతో ఎన్నో సంవత్సరాలు ప్రయాణం చేసిందన్నమాట. కాలజ్ఞానం కోల్పోయిన తనకి విషయం తెలియలేదు. అంతటి వేగంతో ప్రయాణం చేసేటప్పుడు దేహం పెరుగదల తగ్గిపోతుంది. అందుకనే గడ్డం, జుట్టూ మరీ ఎక్కువ పెరగలేదు. కాని ముఖంమీద ముడుతలు తనపెరిగిన వయసును చూపిస్తూ ఎన్నో సంవత్సరాలు గడిచిన వాస్తవాన్ని వెల్లడి చేస్తున్నాయి. అంతటి వేగంతో ప్రయాణించేటప్పుడు ఆకలి, నిద్ర వంటి జీవవ్యాపారాలు కూడా బాగా తగ్గిపోతాయి. అందుకే తనకి ఆకలి వేయ్యలేదు. నిద్రా రాలేదు.

ఇంతకీ ఇప్పుడు తాను ఎక్కడ ఉన్నట్లు? ఏమో! అసలు సౌర మండలంలోనే ఉన్నాడా? దానిని దాటి ఇతర నక్షత్ర మండలాలవైపు దూసుకుపోతున్నాడా? ఏమో!, టైటాన్ కిటికీలు తెరవడానికి మళ్ళీ గట్టి ప్రయత్నంచేసాడు రజనీష్. కాని అవి తెరుచుకోలేదు. లాభం లేదు. ఈ శూన్యంలో దిక్కులేని చావు చావవలసిందే. మళ్ళీ మరోసారి అద్దంలో ముఖం చూసుకున్నాడు. గడ్డం, జుట్టూ ఇంకా ఎదిగినట్లు అనిపించింది.

సందేహం లేదు. టైటాన్ అమితవేగంతో అంతరిక్షంలో ప్రయాణం చేస్తోంది. తన వయసు పెరిగిపోతోంది అనిపించింది రజనీష్కి.

దిగులుగా వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. అంతవరకూ లేనిది అప్పుడు విపరీతమైన అలసట అనిపించింది. ఆలోచనలతో తలతిరిగిపోతోంది.

మొదటిసారిగా నిద్ర వచ్చేటట్లనిపించింది. కళ్లు మూసుకుని నెమ్మదిగా నుదురు పట్టుకున్నాడు. నన్నకునుకుపట్టింది.

* * * *

ఎవరో తన టైటాన్ని బలంగా క్రిందికి లాగుతున్నట్లనిపించింది. విమానం నేలమీదకి దిగేటప్పుడు కలిగే అనుభూతి అది. ఉలిక్కిపడి లేచాడు రజనీష్.

సందేహంలేదు. టైటాన్ దేనిమీదికో దిగుతోంది.

కొంచెం సేపట్లోనే నేల తగిలినట్లు ఒక్క కుదుపువచ్చి నౌక ఆగిపోయింది. అంతవరకూ ఉన్న కుదుపూ, శబ్దం ఆగిపోయాయి.

నెమ్మదిగా టైటాన్ ద్వారం తెరుచుకుంది. నిచ్చెన బయటికి సాగింది. అంటే భూమి మీద రిమోట్కంట్రోల్ పనిచేస్తోందన్నమాట. లేదా సరిగ్గా సమయానికి అది బాగుపడి ఉండాలి. చల్లనిగాలి ఒంటికి తగలడంతో ప్రాణం లేచివచ్చినట్లయింది. నెమ్మదిగా లేచివెళ్లి నిచ్చెనమీది నించి క్రిందికి దిగాడు. నేలగట్టిగానే ఉంది. కాని ఎర్రని ఎరుపు. ఎటుచూసినా ఆ ఎరుపు అనంతంగా ఉంది. కొంచెం దూరంలో ఒక చెరువు కనిపిస్తోంది. దానిలోని నీరు కూడా ఎర్రగా ఆరంజి జ్యూస్లాగా ఉంది.

తలపైకెత్తి చూసాడు రజనీష్. మేఘాలు పల్చగా ఉన్నాయి. సూర్య బింబం చిన్నగా కనిపిస్తోంది. ఎండ తీక్షణంగా లేదు. సూర్యుని పరిమాణం బట్టి ఆ నేల ఎరుపు రంగుని బట్టి తన నౌక దిగింది

అంగారక గ్రహం అని గుర్తు పట్టాడు రజనీష్. తన నౌక చెడిపోవడంతో గ్రౌండ్ కంట్రోల్ వాళ్ళు తనని క్షేమంగా దారిలో అంగారక గ్రహం మీదికి దింపారన్నమాట. అయితే త్వరలోనే కమ్యూనికేషన్ సిస్టంగూడా బాగుపడవచ్చు.

పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది రజనీష్‌కి.

ఇంతలో ఎర్రని ఏడడుగులు ఎత్తున్న చెట్లు తనవైపు వస్తుండడం గమనించాడు. వాటిని అంతకుముందు దగ్గరలోవున్న చెరువు గట్టున చూశాడు. ఇప్పుడు అవి కదిలి వచ్చాయి. షేక్స్పియర్ రాసిన మాక్బెత్ నాటకం జ్ఞాపకానికి వచ్చింది. అందులో చెట్లు కదులుతూ వచ్చి చుట్టుముట్టాయి. భయంతో ఒళ్ళు బిగుసుకుపోయింది. తిరిగి నౌకలోకి వెళ్ళి పోవాలని ఎంత ప్రయత్నించినా భయంతో కాలు కదలలేదు. ఇంతలో ఒక చెట్టుబాగా దగ్గరికి వచ్చింది. రెండు కొమ్మలు సాచి రజనీష్‌ని దగ్గరకు లాక్కొంది. అతన్ని కాండానికి వేసి హత్తుకుని ఆ కొమ్మలతో బిగించి వేసింది. ఆ ఉక్కు కౌగిలినుంచి ఎంత ప్రయత్నించినా బయటపడలేక పోయాడు రజనీష్.

ఇంతలో ఆ కాండం పైభాగం వంగి రజనీష్ ముఖం దగ్గరకి వచ్చింది.

ఆశ్చర్యం! అందులో కళ్ళు, నోరు, ముక్కు అన్నీ ఉన్నాయి. అంటే ఇవి చెట్ల ఆకారంలో ఉన్న అంగారక గ్రహ జీవులన్నమాట. వాటి రక్తవర్ణం చూస్తేనే ఒళ్ళు గగుర్పొడుస్తోంది. తన ముఖం మీదకి వంగింది ఒక స్త్రీ ముఖం అనిపిస్తోంది. ఆమె తనను ముద్దాడబోవడం లేదు కదా! వాంపైర్లు రక్తాన్ని త్రాగుతాయి అంటారు. ఈ ఎర్రని జీవాలు తన ఎర్రన్ని రక్తాన్ని త్రాగబోవడం లేదు కదా!

రజనీష్ చుట్టూ ఉక్కు కౌగిలి మరింత బిగిసింది. ఆ స్త్రీ నోరు అతని నోటి దగ్గరికి వచ్చేసింది.

భయంతో వెర్రికేక పెట్టాడు రజనీష్. దబ్బుమని క్రింద పడడంతో మెలకువ వచ్చింది.

"అబ్బ...ఇదంతా కలా! ఎంత భయంకరమైన కల!" అంటూ కలయజూశాడు. నౌక ఎప్పటిలాగే వుంది, ఏ కిటికీ తెరుచుకోలేదు.

నెమ్మదిగా లేచి అద్దం ముందుకు వెళ్ళాడు రజనీష్.

తన రూపం చూసి తానే ఉలిక్కిపడ్డాడు.

ఇరవైయేళ్ళ తాను ఏబదేళ్ళ వాడిలాగా కనిపిస్తున్నాడు. గడ్డం బాగా పెరిగిపోయింది. జుట్టు భుజాలు దాటింది. సగానికిపైగా నెరిసింది కళ్ళు గుంటలైపోయాయి. దవడలు పీక్కుపోయాయి.

"అబ్బా...కనీసం ముప్పయి సంవత్సరాలు ప్రయాణం చేసి ఉంటాను. ఇంకా ఎన్నాళ్ళు ఈ అనంత యాత్ర!" అనుకుంటూ ఫుడ్ టాబ్లెట్స్, ఎనర్జయిజింగ్ పిల్స్ వేసుకుని మళ్ళీకుర్చీలో కూలబడ్డాడు రజనీష్.

* * * *

బైటాన్ శబ్దం ఆగింది. కుదుపూ లేదు. అది స్పష్టంగా దేనిమీదో దిగినట్లు తెలుస్తోంది. అయితే మాత్రం తానేంచేయగలడు. ఏ మెకానిజం పనిచేయని ఆ నౌకలో తాను బందీ.

బయట నుంచి ఎవరో నౌక తలుపుని వేటితోనో పగలకొట్టున్న శబ్దం వినిపిస్తోంది. మరికొంచెం

సేపట్లో తలుపు ఊడి కిందపడింది. లోపలికి రెండు పొడవాటి ఇనప చేతులు వచ్చాయి. ఆ రెండు చేతులూ రజనీష్‌ని పటకారుతో పట్టుకున్నట్లు పట్టుకుని బయటకు తీసికెళ్ళాయి. భయంతో అతను వేసిన కేక గొంతుదాటి బయటకు రాలేదు.

బయట ఎన్నో రోబోలు ఉన్నాయి. లోహంతో చేసిన గొట్టాలే వాటి కాళ్ళు చేతులూ, టెలివిజన్‌వంటి ముఖం, ఎర్రని బల్బుల వంటికళ్ళు. అచ్చంగా మరమనుషులలాగానే ఉన్నా, చూడటానికి పరమ భయంకరంగా ఉన్నాయి అవి. నేలకూడా అంతా లోహమయం అనిపిస్తోంది. ఇళ్ళు, చెట్లూ అన్నీ లోహమయమే.

ఆ మరమనిషి రజనీష్‌ని నెమ్మదిగా నేలమీదికి దింపాడు.

ఆ వింత జీవిని చూడడానికి ఉత్సాహంగా మిగిలిన రోబోలు వచ్చాయి. వాటిలో ఒక పొడవాటిది వాటికి నాయకుడు కాబోలు. అది దగ్గరికి రాగానే మిగిలినవి దూరంగా జరిగాయి.

"ఇది వింతజీవి. మెత్తని పదార్థంతో దీని దేహం తయారైంది. " అంటూ రజనీష్‌ని చూసి, ఆ నాయకునికి చెప్పాడు రజనీష్‌ని పట్టుకున్న రోబో.

"అలాగా అయితే ఈ రోజు మంచి విందు చేసుకుందాం" అంటూ రజనీష్‌కి దగ్గరగా రాబోయాడు ఆ నాయకరోబో

"వద్దూ...వద్దూ..." అంటూ గింజుకోసాగాడు రజనీష్. తలకి కుర్చీ కొట్టుకకోవడంతో మెలకువ వచ్చింది.

"అబ్బా... ఇదికూడా కలేనా! అంగారకుని మీద బుద్ధిజీవుల గురించి చిన్ననాడు ఊహించుకున్న ఊహల ప్రకారం ఆ కలవచ్చింది. నిత్యం రకరకాల రోబోలను చూడడంతో ఇప్పుడు ఈ కల వచ్చింది. అన్నీ భయంకరమైన కలలే" అనుకుంటూ తిరిగి అద్దం ముందుకు వెళ్ళాడు.

తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు రజనీష్.

తనకి అరవైయ్యేళ్ళు పై బడ్డ రూపం వచ్చేసింది. తలపూర్తిగా పండిపోయింది, గడ్డం మోచేయి దాటి పోయింది. బుగ్గలు లొక్కుపోయాయి.

"ఇదీ కలకాదు కదా!" అని ముందు అనుకున్నాడు. కాదని నిర్ధారణ చేసుకున్నాక-

"సందేహంలేదు. ఇప్పటికి ఎన్నో దశాబ్దాలు అంతరిక్షయానం చేస్తూనే ఉన్నాను. బహుశా ఈ పాటికి టైటాన్, సౌరమండలం దాటి ఇతర నక్షత్రమండలాలలోకి ప్రవేశించి ఉండవచ్చు కూడా" అనుకున్నాడు రజనీష్

బయటినుంచి నౌక తలుపును బలవంతంగా తెరవడానికి ఎవరో ప్రయత్నం చేస్తున్న శబ్దం వినిపించింది.

"ఇది కూడా కొత్తకల" అని బాధగా నిట్టూర్చాడు రజనీష్. కాని అది కలకాదని అతనికి తెలియడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

నెమ్మదిగా లేచి వంగిపోయిన నడుముతో, వణుకుతున్న కాళ్ళతో తలుపు దగ్గరకు వెళ్ళాడు.

అంతలో తలుపు తెరుచుకుంది.

కళ్ళు మిరమిట్లు గొలిపే ప్రకాశం కనిపించింది.

సేదదీర్చే చల్లని సముద్రంగాలి వంటికి తగిలింది.

ఎదురుగుండా డాక్టర్ గుప్తా కనిపిస్తున్నాడు.

అతన్ని చూస్తూనే చేతులు సాచి నీరసంగా అతని చేతుల్లోకి వాలిపోయాడు.

"ఎవరు మీరు? రజనీష్ ఎక్కడ! అసలు మీరు ఈ నౌకలోకి ఎలా వెళ్ళారు?" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు డాక్టర్‌గుప్తా.

"నేను..... నేనే రజనీష్‌ని" అన్నాడు హీనస్వరంతో.

"మీరా రజనీష్!" అంటూ ఆశ్చర్యంగా అతని వంక చూస్తూ, నెమ్మదిగా ప్రక్కన కూర్చోబెట్టి "మరి ఈ రూపం ఏమిటి?" అన్నాడు గుప్తా.

"ఇంచుమించు కాంతి వేగంతో సమానమైన వేగంతో, నాలుగైదు దశాబ్దాలు అంతరిక్షయానం చేస్తే ముసలితనం రాదా?"అన్నాడు రజనీష్.

"కాంతివేగం ఏమిటి? నాలుగైదు దశాబ్దాలు ఏమిటి? ఎవరు చేశారు ఆ ప్రయాణం?" అన్నాడు గుప్తా.

"ఇంకెవరు! నేనే" అన్నాడు రజనీష్ ఓపిక తెచ్చుకుంటూ.

"బాగుంది మీరు ఈ నౌకలో బిగుసుకుపోయింది కేవలం వారం రోజులు." అన్నాడు గుప్తా.

"అదేమిటి?" అన్నాడు రజనీష్ తనచెవులను నమ్మలేక.

"అవును, బ్లాస్ట్ ఆఫ్ టైంలో అటామిక్ ప్రొపల్షన్‌లో ఏదో లోటు వచ్చింది. అందువల్ల అది పైకి ఎగరలేదు. అటూ ఇటూ ఒకటే కదిలిపోసాగింది పెద్ద శబ్దంతో. దాని నుంచి విపరీతమైన రేడియేషన్ వస్తుండంతో నౌకని మేము అతికష్టం మీద అదుపుచేసి మీ దగ్గరకి రావటానికి మాకు వారం రోజులు పట్టింది" అన్నాడు గుప్తా.

"అయితే వారం రోజుల్లోనే ఇరవైయేళ్ళ నేను అరవయ్యేళ్ళ వాడినైపోయానా! ఇంక నా కలలన్నీ కల్లలే!" అంటూ మ్రాన్పడిపోయాడు. రజనీష్ ఆ షాక్ నుంచి తేరుకోకుండానే అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

దారుణమైన ఈ ట్రాజెడీకి చాలా బాధపడ్డాడు గుప్తా.

ఆ ట్రైటాన్ నౌకలోనే రజనీష్ దేహాన్నుంచి సమాధి చేయించాడు.

"వారం రోజుల్లో ఇరవైయేళ్ళ యువకుడు అరవైయేళ్ళ తాతగా ఎలా మారాడు?" అని అనేకమంది వేసిన ప్రశ్నకు ఒకటే సమాధానం చెప్పాడు డాక్టర్ గుప్తా.

"మనసు చాలా విచిత్రమైంది. దానిలో కలిగిన తీవ్రమైన భావనల ప్రభావం దేహం మీద ఎంతగానో ఉంటుంది. సంకల్పబలంతో బలహీనులు కూడా ఎన్నో క్లిష్టకార్యాలు చేయగలరు. అంతరిక్ష నౌకలో

బిగిసిపోయిన రజనీష్ తన నౌక ఇంచుమించు కాంతికి సమానమైన వేగంతో సంవత్సరాల తరబడి ప్రయాణం చేస్తోందన్న బలమైన నమ్మకానికి లోనయ్యాడు. ఐన్‌స్టీన్ సూత్రం ప్రకారం ఇంచుమించు కాంతి వేగంతో సమానమైన వేగంతో ప్రయాణించేటప్పుడు జీవవ్యాపారాలు మందగించడం, శరీరం కుంచించుకుపోవడం జరుగుతాయి. ఈ సూత్రం తెలిసిన రజనీష్ అవన్నీ తనకి అన్వయించుకున్నాడు. అతని మనోభావాలు అంత తీవ్రంగా ఉండడంతో వాటి ప్రభావం అతని శరీరం మీద పడింది. దశాబ్దాలు గడుస్తున్నాయి కనుక తాను ముసలివాడు అవుతున్నట్లు భావించుకున్నాడు ఆయన. అంతే జరిగింది. యద్భావం, తద్భవతి అన్నట్లు బలీయమైన భావాలు ఉన్నప్పుడు అలాగ జరుగుతుంది. ఇది నా భావన మాత్రమే. ఈ విషయంలో ఎన్నో పరిశోధనలు జరిగితేనే కాని, మనసుకి దేహానికి ఉన్న సంబంధం స్పష్టంగా తెలీదు దీనికి కాలమే సమాధానం చెప్పాలి" అన్నాడు.

ఆంధ్రభూమి, ఆగస్టు 1987 ✪

# మాయమైన మమ్మీ

**ఫో**న్ గంట గణగణమ్రోగింది.

నేషనల్ మ్యూజియం క్యూరేటర్ ప్రతాప్ రిసీవర్ అందుకున్నాడు.

"సార్ నేను వాచ్‌మన్ రాములుని మాట్లాడుతున్నాను. మ్యూజియంలో మమ్మీ కన్పించడంలేదు" కంగారుగా వినిపించింది అవతలి కంఠం.

"ఏమిటి నువ్వనేది. ఏమైనా దొంగతనం జరిగిందా?"

"నాకంతా అయోమయంగా ఉందిసార్. మమ్మీ ఉంచిన పెట్టెమూత తిరగేసి ఉంది. లోపల ఉండాల్సిన ఈజిప్షియన్ మమ్మీ దేహం కనిపించడం లేదు. వెనకవైపు తలుపు దగ్గరగా వేసి ఉంది."

"వేరేయేమైనా పోయాయా?"

"ఏమీ పోయినట్లనిపించడంలేదుసార్"

"సరే. నువ్వక్కడేవుండు నేనిప్పుడే వస్తున్నాను"

"చిత్తం" ఫోన్‌పెట్టేశాడు రాములు.

* * * *

మరో అరగంటలో ప్రతాప్ మ్యూజియం చేరుకున్నాడు. ఆయన్ని చూస్తూనే కంగారుగా ఎదురువెళ్ళాడు రాములు.

"ప్రొద్దున్నే ఎనిమిదిగంటలకే నా డ్యూటికి వచ్చానయ్యా. అలవాటుచొప్పున ఒక రౌండ్ కొట్టబోయే సరికి వెనకవైపు తలుపు ఓరగా ఉన్నట్లనిపించింది. తోసిచూసేసరికి గడియ లేదోమో బార్లా తెరుచుకొంది. వెంటనే కంగారుగా లోపలికి పోయిచూస్తే మమ్మీ పెట్టెమూత తిరగబడి కనిపించింది." అంటూ చెప్పకుపోతూ వెనకవైపుగా దారితీశాడు రాములు. అటూ ఇటూ చూసుకుంటూ మౌనంగా అతన్ని అనుసరించాడు ప్రతాప్.

"రాత్రి గూర్ఖా కాపలావున్నాడుగా?" అన్నాడు ప్రతాప్.



"ఉన్నాడు సార్. నేను వచ్చాకనే వెళ్ళిపోయాడు" అన్నాడు రాములు. ఎదురుగా కనిపిస్తున్న వెనుకవైపు తలుపును చూపిస్తూ "అదుగోనండయ్యా ఆ తలుపు అలాగే కొంచెం ఓరగా దగ్గరికి వేసి ఉంది. మామూలుగా దానిని లోపల్నుంచి గడియవేస్తాం" అన్నాడు రాములు.

ప్రతాప్, అతని వెంట రాములు లోనికి ప్రవేశించారు. పెద్ద పెద్ద అంగలతో మమ్మీని ఉంచిన టేబుల్ వద్దకు వెళ్ళారు. రాములు చెప్పినట్లు పై మూత తిరగబడి ఉంది. లోపనల దేహం లేదు. పెట్టె ఖాళీగా ఉంది. చుట్టుప్రక్కల ఉన్న వస్తువులన్నీ ఎక్కడివక్కడే ఉన్నట్లుగా అనిపిస్తోంది.

అప్పటికి 9.00 గంటలు కావస్తోంది. నేషనల్ మ్యూజియం తెరిచే సమయం అవుతోంది. సిబ్బంది అంతా ఇంక ఒక్కొక్కరే వస్తారు. రాముల్ని బయటి ఉంచి అసిస్టెంట్ క్యూరేటర్ రాగానే తనవద్దకు పంపమని చెప్పిపంపాడు.

మరో పది నిమిషాలులో మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ రమేష్ మరికొంతమంది సిబ్బంది రావడంతో మ్యూజియం తెరిచారు. ప్రతాప్ చెప్పిన ప్రకారం రాములు, రమేషని ప్రతాప్ దగ్గరకి పంపాడు.

ప్రతాప్ విషయం సూక్ష్మంగా చెప్పి, మ్యూజియం తలుపులు మూసివేయమనీ ఆ రోజు మ్యూజియంకి సెలవు ప్రకటించి రమ్మని పంపాడు రమేషని.

ఆ విధంగానే చేసి వచ్చాడురమేష్.

"రమేష్ గారూ మన స్టాఫ్ అసిస్టెంట్లను తీసుకుని, క్యాటలాగ్ ప్రకారం మ్యూజియంలో ఉండాల్సినవన్నీ ఉన్నాయో లేదో చెక్‌చేయండి. మమ్మీ మాయమైన విషయమైతే నిర్ధారణ అయింది. కనుక పోలీసులకు రిపోర్టు చేస్తాను" అంటూ లేచాడు.

* * * *

పోలీసులకు రిపోర్టు అందిన వెంటనే ముందు జాగ్రత్తచర్యగా వాళ్ళు దేశంలోని విమానాశ్రయాలనూ, నౌకాశ్రయాలనూ, కస్టమ్స్ కార్యాలయాలనూ, దొంగలెవరూ ఆ మమ్మీని దేశంనుంచి తరలించుకు పోకుండా వుండేటందుకు, వైర్‌లెస్ మెసేజి ద్వారా హెచ్చరించారు. ఆ వెంటనే పోలీస్ ఇన్‌స్పెక్టర్ తన సహాయకులతో మ్యూజియంకు హుటాహుటిన బయలుదేరి వచ్చారు.

పోలీసులు మ్యూజియం అంతా కలియవెదికారు. కాని ఎక్కడా మమ్మీ జాడలేదు. అయితే మమ్మీ ఉంచిన బల్ల దగ్గర్నుంచి, వెనుక ద్వారం వరకు, కాళ్ళకు గుడ్డలు కట్టుకొని నడిచివెళ్ళినట్లుగా అడుగుల జాడలు ఉన్నాయి. ద్వారం అవతల మట్టినేల ఉండడం వల్ల అడుగుల జాడలేవీ కనిపించడం లేదు.

ఇన్‌స్పెక్టర్ ఆ గుర్తులను ఫొటో తీయించి, తర్వాత ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వేసి వాటి ముద్రలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఆ సంఘటన గురించి, అందుకు సంబంధించిన మ్యూజియం సిబ్బంది అందరి దగ్గరనుంచీ, క్యూరేటర్ ప్రతాప్‌తో సహా, స్టేట్‌మెంట్స్ తీసుకున్నాడు.

ఈ తతంగం అంతా పూర్తి అయ్యే సరికి మధ్యాహ్నం మూడుగంటలు దాటింది. ఆ తర్వాత పోలీసు సిబ్బంది వెళ్ళిపోయారు. వారు వెళ్ళిపోయాక ప్రతాప్ తన ఛేంబర్‌లోకి వచ్చి సీట్లో కూర్చున్నాడు. ఆయన ముఖం గంభీరంగా ఉంది. అతని మస్తిష్కం ఆలోచనలతో బరువెక్కిపోయింది.

కొంచెం సేపట్లో రమేష్ కూడా వచ్చి ప్రతాప్ ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

"ఈ దొంగతనం చాలా విచిత్రంగా ఉంది. అసలు మమ్మీని ఎత్తుకుపోయి ఏం చేసుకుంటారో తెలీదు. పైగా వాళ్ళు ఆ దేహం ఉన్న పెట్టెను ఎందుకు వదిలేశారో అసలు అర్థం కావడంలేదు." అన్నాడు రమేష్.

"అలా అనడానికి వీలులేదు ఎందుకంటే మన మ్యూజియంలో వున్న ఈ మమ్మీ చాలా విలువైనది. ఇది ఏడువేల సంవత్సరాల క్రితం ఈజిప్టును పాలించిన రెండవ రామేశ్ కుటుంబ సభ్యులలో ఒకరిది. నిజానికి మన మ్యూజియం ఏమంత పెద్దది కాకపోయినా, అతి ముఖ్యమైన ఈ మమ్మీ వున్న కారణంగా మన మ్యూజియానికి ఒక ప్రత్యేకస్థానముంది. అందువల్ల దీనిని ఎవరైనా దొంగిలించాలని ప్రయత్నించడంలో ఆశ్చర్యంలేదు. పైగా కొందరు మమ్మీల దేహాలలో అమూల్యమైన వజ్రాలు, రత్నాలూ ఉంటాయని అపోహపడుతుంటారు. వాటికోసమైనా ఎవరైనా ఈ పనికి పూనుకుని ఉండవచ్చు."అన్నాడు ప్రతాప్ కళ్ళు మూసుకుని వ్రేళ్ళతో నుదురు నొక్కుకుంటూ.

"దొంగలు లోపలికి ఎలా వచ్చారనేది ప్రశ్న. బయటి తలుపులు తాళం వేసే ఉన్నాయి. మరి ఎలా వచ్చారో." అన్నాడు రమేష్.

"దొంగలు అనడానికి వీలులేదు. మనకి కనబడ్డది కేవలం రెండు పాదాల ముద్రలు మాత్రమే.

మన జీవితకాలంలో ఇది సాధ్యమా?''

"మన ప్రస్తుత పరిజ్ఞానం ప్రకారం ఇది అసాధ్యం. అయితే ఆత్మ ఉనికిని విశ్వసిస్తే ఇది సంభవమేననిపిస్తుంది. ఆత్మ సూక్ష్మమైన వెలుగురూపంలో ఉంటుందని మన శాస్త్రాలు చెప్తున్నాయి. శరీరం నుంచి ఆత్మను వేరుచేసుకోగలిగి తిరిగి శరీరంలోనికి ప్రవేశింపగలిగే విద్యను నేర్చుకో గలిగితే, కాంతివేగంతో సుదూరనక్షత్రమండలాల మధ్యకూడా ప్రయాణంచేయగలగవచ్చు. వారిలోకంలో ఒకదేహం, ఈలోకంలో ఒకదేహం భద్రపరుచుకుని ఉంటే కావలసినపుడు వాటిలో ప్రవేశించి బాహ్యజీవితం గడపవచ్చు. నానమ్మకం ప్రకారం ఈ ఈజిప్షియన్ మమ్మీలు ఆవిధంగా భద్రపరచబడిన దేహాలే. వాటిలోకి ఆత్మలు ఎపుడైనా ప్రవేశించి ఆ దేహాలుతిరిగి జీవించవచ్చు. సృష్టిలో అసాధ్యమైనదేదీ లేదు. మన అవగాహనలో లోపం ఉండడం వల్లే సృష్టిరహస్యాలను అర్థం చేసుకోలేకపోతున్నాం.'' - కొంచెం ఆవేశంగా చెప్పుకుపోయాడు మురళి.

"అయితే మనఅంతరిక్ష యాత్రలలో కూడ ఈపరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవచ్చుగా'' అన్నాడు ప్రతాప్.

"తప్పకుండా అయితే ఆధునిక విజ్ఞానం ఆత్మల ఉనికిని విశ్వసించడం లేదు కనుక ఆ దిశగా పరిశోధనలు జరగడంలేదు. కాని జీవవ్యాపారాలను స్థంభింపజేసి సుదీర్ఘ అంతరిక్షయాత్రలను నిర్వహించే ప్రయత్నాలను చేస్తున్నారు మన శాస్త్రజ్ఞులు అమెరికాలోని నాసాకేంద్రంలోని శాస్త్రజ్ఞులు జరిపిన పరిశోధనలలో అనేక జీవరాసులు ఒక క్రమపద్ధతిలో తమ జీవితకాలాన్ని పొడిగించుకుంటున్న విషయం కనిపెట్టారు ఈ ప్రక్రియను 'హైబెర్‌నేషన్' అంటారు. ఉదాహరణకి ధృవప్రాంతాలలోని కొన్ని జీవరాసులు చలికాలంలో దీర్ఘనిద్రలోకి వెళ్లిపోతాయి. తిరిగి వేసవివచ్చినప్పుడే అవి చైతన్యవంతమవుతాయి. అలాగే కొన్ని కీటకాలు అనుకూలంగాలేని కాలంలో తమ చుట్టూ గూడు కట్టుకుని దీర్ఘనిద్రపోతాయి. కాలం అనుకూలించినప్పుడే అవి తిరిగి బాహ్యప్రపంచంలోకి వస్తాయి. అవి దీర్ఘనిద్రలో వున్నంతకాలమూ, వాటి జీవవ్యాపారాలన్నీ పూర్తిగా ఆగిపోతాయి. అన్నివిధాలా అవి చనిపోయినట్లే లెక్క. అందాకా ఎందుకు? గింజలలో జీవం ఉంది కదా! కాని అది నిద్రాణస్థితిలో ఉంటుంది. నేలలో వాటిని పాతి నీరు పోసినప్పుడే - అంటే పరిస్థితులు అనుకూలించినప్పుడే వాటికి చైతన్యం కలిగి జీవం బహిర్గతమవుతుంది. ఇదే విధంగా అంతరిక్ష యాత్రికులను కూడా దీర్ఘనిద్రలోకి పంపి, నెలలు సంవత్సరాలు గడిచాక గమ్యస్థానం జేరాక తిరిగి మేల్కొలిపే ప్రయత్నాలు ఈ నాసాకేంద్రంలో జరుగుతున్నాయి''. అన్నాడు మురళి.

"ఆ లెక్కన అసలు, మనిషి జీవితకాలాన్నే పొడిగించవచ్చుగా?'' అన్నాడు ప్రతాప్ కొత్త ఊహ తట్టిందన్న ఆనందంతో.

"సరిగ్గా చెప్పావు. అది సంభవమే ఆ.. రామాయణంలో దశరథుడు అరవైవేల సంవత్సరాలపైబడి జీవించినట్లు చదువుకున్నాం జ్ఞాపకం ఉందా?

"అవును జ్ఞాపకం ఉంది.''

"కాని అవన్నీ వట్టి అభూతకల్పనలని మనం కొట్టేస్తాం. సరే... రామాయణం ఎప్పుడో త్రేతాయుగం నాటిమాట. మరి ఈ కలికాలంలో బాబిలోనియాలో దొరికిన శిలాశాసనాల ప్రకారం ప్రముఖుడైన అస్సీరియా

దేశపు రాజైన అసురబనిపాల్ 700 సంవత్సరాలు పైబడి జీవించినట్లు తెలుస్తోంది. అయితే ఆ చక్రవర్తి ఘనతను పెంచే ఉద్దేశంతో కావాలని ఇలా ఉత్ప్రేక్షించారని నేటివారు భావిస్తున్నారు. శాసనాలలోని ఇతర అంశాలను నిజమని నమ్మినప్పుడు ఇది అబద్ధమని ఎందుకు అనుకోవాలి?"

"అంటే వీరంతా తమ జీవితకాలాన్ని పెంచుకోడానికి ఎక్కువభాగం దీర్ఘనిద్రలో గడిపేవారనా?

"అవసరం లేదు. శ్వాసప్రక్రియను క్రమబద్ధం చేయడంవల్ల కూడా జీవితకాలాన్ని పెంచుకోవచ్చు. ఒక మామూలువ్యక్తి నిమిషానికి 15 సార్లు అంటే రోజుకి 21,600సార్లు ఊపిరిపీలుస్తాడు. ఊపిరిద్వారా దేహంలోకి ప్రవేశించే ప్రాణవాయువు నెత్తుటితో సంయోగం చెందుతుంది. ఈ రసాయనిక చర్యవల్ల దేహంలో ఉష్ణరూపంలో శక్తి విడుదలయి, సకల జీవ్యాపారాలు జరగడానికి కారణభూతమవుతోంది. అదే సమయంలో ఉష్ణం వల్ల కొన్నిజీవకణాలు నశించి దేహానికి అరుగుదల ఏర్పడుతుంది. అరుగుదల ఎక్కువైనకొద్దీ ఆ మేరకు జీవితకాలం తరిగిపోతుంటుంది. శ్వాసప్రక్రియను తగ్గిస్తే అందుకు అనుగుణంగా జీవితకాలం పెరుగుతుంది.

ఈ విషయం తెలిసిన భారతీయ యోగులు ప్రాణాయామం వంటి పద్ధతులద్వారా శ్వాసప్రక్రియను క్రమబద్ధం చేసుకుని జీవితాకాలాన్ని పెంచుకునేవారు. దశరథుడు, అసురబనిపాల్ వంటివారుకూడా ఇదే విధంగా తమ జీవితాన్ని పెంచుకొని ఉండవచ్చు."

"దశరథుడు భారతీయుడు కనుక సరే. మరి అసురబనిపాల్ సంగతి, ఈమ్లేచ్ఛ చక్రవర్తికి కూడా ఈ విద్య తెలిసి ఉంటుందా?"

"తప్పక తెలిసే ఉండవచ్చు. ప్రాచీనకాలంలో భారతీయ విజ్ఞానపు ప్రభావం సోకని ప్రాంతం అంటూ ఏదీ ఈ ప్రపంచంలో లేదు. అసలు "అసురబనిపాల్" అనే పేరు కూడా భారతీయ పదమే. దీని అసలు రూపం "అసురవాణిపాల". అంటే "అసురుల వాక్కును పాలించేవాడు అనగా అసురల అధిపతి' అని అర్థం. "వాణి" "బాని"గా మారింది. సురులంటే దేవతలు, అసురులంటే రాక్షసులన్న విషయం మనకు తెలుసు. ఈ అసురబనిపాల్ రాక్షసరాజన్నమాట."

"విచిత్రం... ఎక్కడినుండి ఎక్కడికి తీసుకుపోయావు." అని ఆశ్చర్యపోయాడు ప్రతాప్.

ఇంతలో ఫోన్ గణగణ మ్రోగింది.

ఫోన్ అందుకున్నాడు ప్రతాప్.

"హలో...సార్.... నేను రమేష్‌ను మాట్లాడుతున్నా స్వయంత్రం మ్యూజియం తాళాలు వేసుకుని వెనకతోటలోంచి వస్తుంటే పొదలమధ్య ఆ మమ్మీకి చుట్టిన బట్టలు కుప్పగా పడేసి ఉండడం చూశాను. వాటిని నా దగ్గరే భద్రపరచాను. ఆ తర్వాత మీకు ఫోన్ చేస్తే మీరు బయటకు వెళ్ళారని చెప్పారు. అందువల్ల మళ్ళీ ఇప్పుడు ఫోన్ చేస్తున్నాను." అన్నాడు అసిస్టెంట్ క్యూరేటర్.

"అలాగా..నేను భోజనం చేసి మీ దగ్గరికి వస్తాను. ఈలోగా ఏంచేయాలో నిర్ణయిస్తాను. పోలీసురిపోర్టు ఎలాగూ ఇయ్యాలి నేను వస్తాను. మీరు ఎక్కడికీ వెళ్ళకండి" అని ఫోన్‌పెట్టేసి "మైగాడ్... ఈ మమ్మీ రహస్యం మరింత జటిలం అవుతోంది." అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

"ఏమిటి సంగతి?" అని కుతూహలంగా అడిగాడు డాక్టర్ మురళి.

"అసలు మొదటినుంచీ ఈ మమ్మీ వ్యవహారం కొరుకుడు పడకుండా ఉంది. దొంగతనం చేసేవాడు పెట్టెతో సహా చేస్తాడుకాని కేవలం దేహాన్ని మాత్రమే తీసుకుపోడు. పైగా బరువైన ఈ మృతదేహాన్ని భుజాన్నవేసుకుని తీసుకుపోవడం అంతతేలిక కాదు. పైగా భుజంమీద బరువున్నప్పుడు అడుగుల గుర్తులుకూడా ఒత్తుగా ఉంటాయి, కానీ మ్యూజియంలో గుర్తులు మనిషి మామూలుగా తేలికగా నడిచి వెళ్ళిపోయినట్లున్నాయి. ఆ.. మరో విషయం. సందర్శకుల కోసం మేము ఆ మమ్మీకి కుడికాలు బొటనవేలు కనిపించేటట్లుగా కట్లు ఊడదీసి ఉంచాం. మ్యూజియంలో కనిపించిన కాలిగుర్తులలో ఒకకాలుకి పూర్తిగా గుడ్డలు, రెండోకాలికి బొటనవ్రేలుకి తప్ప మిగిలిన భాగానికి గుడ్డలు ఉన్నట్లు ఉన్నాయి. వేలుకనిపించే కాలు కుడికాలే. ఆ కాలి గుర్తులసైజు కూడా మమ్మీ పాదాల సైజంతే ఉంది. వాటిని చూసినప్పుడే నాకు అనిపించింది, ఆ మమ్మీయే నడిచివెళ్ళిపోలేదు కదా! అని. కాని ఆ మాటపైకి అంటే నేను పిచ్చివాడినని నలుగురూ నవ్వుతారని ఊరుకున్నాను. ఏ విధంగా చూసినా ఇది దొంగతనం అనిపించడంలేదు. నువ్వు చెప్పిన విషయాలు విన్నాక ధైర్యంగా మనసులో మాట నీతో అనగలుగుతున్నాను, ఇదిలా ఉండగా ఆ మమ్మీకిచుట్టిన బట్టలు మ్యూజియం వెనుక తోటలో దొరికాయని ఇప్పుడే రమేష్ ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో ఇది దొంగతనం కాదన్న విషయం ధృఢీ అయిపోయింది. దొంగిలించిన వారెవరూ బట్టలు తీసేసి, పెట్టె పారేసి ఎత్తుకుపోరు. ఏమైనా ఈ విషయంకూడా పోలీసులకి రిపోర్టు చెయ్యాలి. " ప్రతాప్ వాక్ప్రవాహం సాగిపోయింది.

"నీ ఆలోచనలు నా ఆలోచనల దారిలోనే వస్తున్నందుకు సంతోషం. నా అనుమానం నిజమయ్యేట్లుంది. అదే జరిగితే విజ్ఞానశాస్త్రంలో నూతనాధ్యాయం ప్రపంచరిత్రలో ఒక మలుపుకు నాంది పలుకుతాయి."అన్నాడు ఏదో ఆలోచిస్తూ మురళి.

"ఏమిటి నీ అనుమానం."

"ఆ మమ్మీ తిరిగి జీవించింది. నా ఉద్దేశప్రకారం పరలోకం నుంచి ఈ మమ్మీ ఆత్మ భూలోకానికి తిరిగి వచ్చింది. ముందుగా తన దేహాన్ని స్వతహాగా భద్రపరచిన పిరమిడ్‌కి వెళ్ళి అక్కడ తన దేహం కనిపించక పోవడంతో ఇక్కడకువచ్చి తనదేహంలో ప్రవేశించి ఉండవచ్చు."

"అదెలా సంభవం? ఆ దేహం ఇక్కడ ఉంటుందని ఎలా ఊహించగలదు?"

'అనేకకాంతి సంవత్సరాల దూరంలో వున్న పరలోకానికి పయనం చేయగల ప్రజ్ఞ సాధించిన మేధావులకు ఈ మాత్రం తెలుసుకోవడం అంత కష్టమా?"

"సరే అలాగే అనుకుందాం. అయితే ఇప్పుడా మమ్మీ ఏమయినట్లు?"

"నా ఉద్దేశ ప్రకారం ఆ మమ్మీ కట్లు ఊడదీసుకుని సూక్ష్మరూపం ధరించి, ఆకాశమార్గం ద్వారా తన పిరమిడ్‌కు వెళ్ళిపోయి ఉండవచ్చు. నా ఆలోచన ప్రకారం ఆపిరమిడ్‌లో ఉన్న ఇతరమమ్మీలు కూడా జీవం పొంది ఉంటాయి. ఎందుకంటే అవన్నీ ఒకే కుటుంబానికి చెందినవి. ఈ విద్యలన్నీ ప్రాచీనకాలంలో వుండేవనిమన శాస్త్రాలు చెప్తున్నాయి."

"ఆ తర్వాత ఏమవుతుంది?"

"అన్నివేల సంవత్సరాలలో భూమిమీద ఎన్నోమార్పులు వచ్చాయి. బహుశా ఈనాటి పరిస్థితులు

వాటి మనుగడకు అనుకూలంగా ఉండకపోవచ్చు. అందువల్ల అవి తమకి అనువైన సురక్షితమైన ప్రదేశం వెతుక్కుంటూ పోవచ్చు. లేదా తిరిగిఅనువైన రూపంలో పరలోకాలకు ప్రయాణం కట్టవచ్చు.'''

''కాని నీ ఊహలు నిజమో కాదో తేలేదెలా?''

''నా ఊహే కనుక నిజమైనదైతే ఈజిప్ట్‌లోని ఆ పిరమిడ్‌లోని ఇతర మమ్మీలు కూడా మాయమైనట్లు ఈ రోజు రేపో వార్తవస్తుంది '' అన్నాడు డాక్టరు మురళి ఒక విధమైన ఆత్మవిశ్వాసంతో.

గడియారం తొమ్మిదిగంటలు కొట్టింది.

''అరే వార్తల సమయం అయింది. రేడియో పెట్టాను.'' అంటూ లేచి రేడియో ఆన్‌చేసి వచ్చాడు ప్రతాప్.

ఆశ్చర్యం!

ఆనాటి వార్తలలో అత్యంత ప్రముఖమైన వార్త, ఈజిప్టులోని ఒక ముఖ్యమైన పిరమిడ్‌లో వుంచిన మమ్మీలన్నీ పెట్టెలలోంచి బయటికి వచ్చి మాయం కావడం.

సంతోషం, సంభ్రమాశ్చర్యాలతో నోటమాటరాలేదు ప్రతాప్‌కి. కొంచెం తెప్పరిల్లాక ''యు ఆర్‌రైట్' అంటూ మిత్రుని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు.

డాక్టరు మురళి ముఖంలో వేయిదీపాల వెలుగు మెరుస్తోంది.

వార్తలు పూర్తి అయ్యాయి.

''పద.. భోజనం చేసి రమేష్ ఇంటికి వెళ్లాం. తర్వాత జరగవలసిన దేమిటో అక్కడే ఆలోచిద్దాం.' అన్నాడు ప్రతాప్.

''నేనెందుకు? నువ్వు పోయిరా'' అన్నాడు మురళి.

''అలా అంటే ఎలా?'' అంత పెద్ద సమస్యని ఇంత సులువుగా తేల్చివేసిన నువ్వు లేకుంటే ఎలా?'' అన్నాడు ప్రతాప్.

''నామీదున్న అభిమానం వల్లనో , నా తర్కంలోని బలం వల్లనో నా ఊహ నిజమేనని నువ్వు నమ్ముతున్నావు, కాని పోలీసులను ఇతరులను నమ్మించడం అంత సులభం కాదు. వాళ్ళు మనల్ని ఊహాలోకాల్లో విహరించే పిచ్చివాళ్ళుగా జమకట్టారు. వాళ్ళని నమ్మించాలంటే జీవం పొందిన ఆ మమ్మీలు ప్రత్యక్షమై సాక్ష్యం చెప్పాలి. అది జరిగే పనికాదు. అందువల్ల ఈ కేసులు బహుశా పోలీసు ఫైళ్ళలో అపరిష్కృతంగానే ఉండిపోతాయి.''- అని భారంగా నిట్టూరుస్తూ అన్నాడు మురళి.

''అందుకుమనమేం జేయగలం? సమస్యను పరిష్కరించగల సాక్ష్యం ముందు పెడ్దాం. దానిని ఉపయోగించుకోవడం మానడం వారి ఇష్టం. పత్రికా ముఖంగా నీ ఆలోచనలను బయటపెట్టు. ఏనాటికైనా వాటిలోని సత్యాన్ని లోకం గుర్తించకపోదు.'' అన్నాడు ప్రతాప్ మిత్రుని భుజం తట్టూ.

''సరే . .పద.... ''అంటూ లేచాడు మురళి.

అవ్యక్తమైన ఆనందం ముఖంలో తాండవిస్తుండగా డైనింగ్ హాల్‌వైపు దారితీశాడు ప్రతాప్.

**ఆదివారం వారపత్రిక, 8-9-1983**

ఇంక లోపలికి రావడానికి మన సిబ్బందే ఎవరైనా సహకరించి ఉండవచ్చు. వెనకవైపు తలుపుకి కావాలని గడియపెట్టకుండా ఉండి ఉండవచ్చు" అన్నాడు ప్రతాప్.

ఆ మాటలకు రమేష్ ఉలిక్కి పడ్డాడు. "అది అసంభవం. ఎందుకంటే ప్రతిరోజూ తలుపుల్ని నేను దగ్గరుండి వేయిస్తాను. పైగా తాళాలు నా దగ్గరే ఉంటాయి. నిన్నకూడా తలుపులన్నీ నేనే దగ్గరుండి వేయించాను." అన్నాడు రమేష్. తనమీద అనుమానం రావచ్చున్న భయం అతని ముఖంలో గోచరించింది.

"రొటీన్‌గా జరిగే పనులలో మనం అంత శ్రద్ధ వహించం. తలుపులు వాచ్‌మెన్ వేశాడులే అనుకుంటాంకాని, నిజంగా వేశాడో లేదో నిశితంగా పరీక్షించి చూస్తామా?" అన్నాడు ప్రతాప్.

"లేదు. ఈ విషయంలో నేను ఎప్పుడూ అజాగ్రత్తగా ఉండను. ఎందుకంటే మమ్మీ వున్న ప్రక్క గదిలోనే అమూల్య వజ్రాల ఆభరణాలు ఉన్నాయి. హాలులోపలికి రాగలిగితే వాటిని దొంగిలించడం కూడా సులువే. అందువల్ల ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా చూసి తాళాలు మరీ యిస్తాను" అన్నాడు రమేష్.

"మరి ఆ దొంగలోనికి ఎలా ప్రవేశించినట్లు?"

"అదే నాకూ అర్థం కావడంలేదు. ఒకవేళ ఆ దొంగ కూడా మ్యూజియంను చూడడానికి వచ్చినట్లు వచ్చి ఎక్కడేనా నక్కి ఉన్నాడేమో."

"కావచ్చు. కాని అదే నిజమైతే ఆ దొంగ చెప్పులు లేకుండా వచ్చి అరికాళ్ళకు గుడ్డలు కట్టుకుని వెళ్ళిపోయి ఉండాలి. ఒకవేళ చెప్పులు వేసుకుని వచ్చి వుంటే వాటిని మ్యూజియంలోనే ఎక్కడో వదిలి ఉండాలి. మరి అటువంటివేమీ కనిపించలేదు."

"ఇంత పథకం ప్రకారం వచ్చినవాడు గుడ్డలు కట్టుకునే అవస్థ ఎందుకు పెట్టుకుంటాడు? ఏ రబ్బరు తొడుగులో తెచ్చుకొని సులువుగా వేసుకుని ఉండేవాడు."

"ఏది ఏమైనా ఆ దొంగ ప్రక్కనే వున్న అమూల్యాభరణాలని వదిలి మృతదేహాన్ని మోసుకుపోవడం విచిత్రంగా ఉంది. ఇప్పటికి మనకి అంతా అయోమయంగా వున్నా పరిశోధనలో అసలు రహస్యం బయట పడకపోదు. ఏమైనా ఈ సంఘటనవల్ల మన మ్యూజియం పేరు దెబ్బతింది." అంటూ లేచాడు ప్రతాప్.

రమేష్ కూడా లేచాడు. ప్రతాప్ వద్ద సెలవు తీసుకుని తన సీటుకి వెళ్ళిపోయాడు.

## 2

మ్యూజియంలో మమ్మీ మాయమైన వార్త పత్రికలలో ప్రముఖంగా వచ్చింది. ఆ వార్త డాక్టర్ మురళిని విశేషంగా ఆకర్షించింది. ఆయన యూనివర్శిటీలో లైఫ్‌సైన్సెస్ ప్రొఫెసర్‌గా ఉన్నాడు. 1960లో ఆయన అమెరికాలోని మిషిగన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ జీవశాస్త్రంలో పరిశోధనలు జరుపుతుండేవాడు. ఆయన సభ్యుడిగా వున్న డాక్టర్ల బృందం ఈజిప్షియన్ మమ్మీల మీద ఎన్నో పరిశోధనలు చేసింది. ఎన్నో ఆసక్తికరమైన విషయాలను కనుక్కుంది. అప్పటినుంచీ ఆయనకు మమ్మీలంటే ప్రత్యేకమైన ఆసక్తి ఏర్పడింది. విదేశాలలో వున్న భారతీయ శాస్త్రవేత్తలను స్వదేశానికి తిరిగి రావలసిందిగా పదే పదే భారతప్రభుత్వం చేసిన విజ్ఞప్తులననుసరించి ఆయన స్వదేశానికి తిరిగివచ్చి యూనివర్శిటీలో ఉన్నతపదవిలో

ఠిందు. డాక్టర్ మురళి, క్యూరేటర్ ప్రతాప్‌లు కాలేజ్ మేట్స్‌కాకుండా మంచి స్నేహితులుకూడా. వాళ్ళు తరచుగా కలుసుకుంటుండేవారు.

పత్రికలలో మమ్మీవార్త చూసి, విషయాలన్నీ వివరంగా తెలుసుకోడానికి, ఆరాత్రి ప్రతాప్ ఇంటికి వెళ్ళారు మురళి. కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాక సంభాషణ అసలు విషయం మీదికి వచ్చింది.

"మమ్మీలు నిజంగా ఎంతో విచిత్రమైనవి. వాటికి సంబంధించిన ప్రతి విషయమూ ఎంతో అద్భుతమైనదే కాకుండా, అభేద్యమైన రహస్యాలను కలిగినటువంటిదే" అన్నాడు మురళి.

"నిజమే. ఆ మృతదేహాలు ఎన్నోవేల సంవత్సరాలు గడిచినా ఏమాత్రం చెడిపోకుండా ఉండడం అద్భుతమైన విషయం. ఆ దేహాలే కాదు, ఆ నాటి పళ్ళూ, పూలూ, ఆహారపదార్థాలను కూడా చెడిపోకుండా ఎప్పటికీ ఉండేటట్లు చేయగలిగారంటే ఆ నాటి మేధావుల మేధస్సుకు జోహార్లర్పించవలసిందే" అన్నాడు ప్రతాప్.

"అంతేకాదు నేను మిషిగన్ యూనివర్శిటీలో వున్నప్పుడు మా శాస్త్రవేత్తల బృందం ఈ మమ్మీల మీద ఎన్నో పరిశోధనలు జరిపింది. అది 1963వ సంవత్సరం. ఆ సంవత్సరంలో మమ్మీల దేహంలోని జీవకణాలు తిరిగి జీవించగలస్థితిలో వున్నట్లు కనిపెట్టాం. ఒకవేళ వాటికి హృదయస్పందన కలిగించగలిగితే ఆ మృతదేహాలు తిరిగి జీవిస్తాయన్నమాట." అన్నాడు మురళి.

ఆనాటి ఈజిప్షియన్లు మృతదేహాలను భద్రపరుచగలగడమే కాకుండా పర్వతాల వంటి పిరమిడ్లను అత్యద్భుతంగా నిర్మించగలిగారు. మరివారే భద్రపరిచిన మమ్మీలు తిరిగి జీవిస్తాయని నమ్మి వాటికోసం, ఆ దేహాలశరసనే ఆహారం, పళ్ళూ, వస్త్రాలు వంటివి ఉంచేవారు. మరి అసమాన మేధస్సుగల వారికి మరణించినవారు తిరిగి జీవించరనేపాటి సామాన్య సత్యం తెలియదా? ఆ మేధావులు మమ్మీలను భద్రపరచినన్నూ, ఈనాటికీ వాటి దేహంలోని జీవకణాలు జీవించగలవై ఉండడం చూస్తే వారి నమ్మకానికి ఆధారం ఉందేమో ననిపిస్తుంది" అన్నాడుమురళి.

"అంటే అవి పునర్జన్మ పొందగలవా!" అన్నాడు ప్రతాప్.

"అని కాదు, పరకాయ ప్రవేశం వంటిది కావచ్చు."

"అంటే ఆత్మఉందని నీవు నమ్ముతున్నావా?"

"ఆత్మ యొక్క ఉనికిని వ్యక్తిగతంగా నేను నమ్ముతాను. దానిని లేబొరేటరీలో ప్రయోగాత్మకంగా నిరూపించలేకపోవచ్చు. కాని యోగుల మీద జరిపిన పరిశోధనల వల్ల ఆత్మ ఉందనే విశ్వాసం ప్రబలు తోంది"

"ఎలా?"

"మూడు స్థితులలో మానవదేహం చైతన్యాన్ని కోల్పోతుంది. వీటిలో మొదటిది "నిద్ర". అతి సామాన్యమైన ఈ స్థితిలో జీవచైతన్యం కేవలం ఉచ్ఛ్వాసనిశ్వాసాల ద్వారా మాత్రమే గోచరమవుతుంది. ఈ స్థితిలో పంచజ్ఞానేంద్రియాలూ ఇంచుమించు పూర్తిగా తమ శక్తిని కోల్పోతాయి.

రెండవస్థితి "మృత్యువు." ఈ స్థితిలో జీవవ్యాపారాలు పూర్తిగా, శాశ్వతంగా స్తంభించిపోతాయి.

ఇంక మూడవది, ఆధునిక శాస్త్రవేత్తలకు ఇంకా అంతుపట్టనిది అయిన "సమాధిస్థితి", దీనిని హిందూ యోగులు, సిద్ధులూ ప్రాచీనకాలంనుంచీ సాధిస్తూనే ఉన్నారు. సమాధి స్థితిలోనికి వెళ్ళిన వ్యక్తికి, శ్వాసప్రక్రియ, హృదయస్పందనంతోపాటు, సకల జీవవ్యాపారాలూ పూర్తిగా స్తంభించి పోతాయి. మృతదేహానికీ, సమాధిస్థితిలోని దేహానికీ ఏమీ తేడా ఉండదు. వైద్య పరిభాషలో దీనిని "క్లినికల్ డెత్" అని "ఫిజియోలాజికల్ డెత్" అనీ అంటారు ఆధునిక వైద్యశాస్త్రప్రకారం. ఇది మరణ స్థితే. అయితే సమాధిస్థితిలో వున్న ఈ దేహాన్ని భూస్థాపితం చేసినా, మృతదేహాలలాగా కుళ్ళిపోవడం ఉండదు. సమాధి స్థితిని సాధించిన యోగి కావాలనుకున్నప్పుడు తిరిగి సచేతనంగా బయటకు రాగలడు."

"ఆధునిక విజ్ఞానశాస్త్రం ఈ విషయంలో ఏమిచెప్తుంది?"

"యోగ విద్య పాశ్చాత్యుల దృష్టిని ఆకర్షించింది ఈ శతాబ్దంలోనేనని చెప్పవచ్చు. అందువల్ల యోగశాస్త్రంలో శాస్త్రీయమైన పరిశోధనలు ప్రారంభమైనది ఇటీవలి సంవత్సరాలలో మాత్రమే. అంటే ఈ పరిశోధనలు శైశవదశలోనే ఉన్నాయన్నమాట. అయినా ఫలితాలు మాత్రం అత్యంత ఆసక్తిదాయకంగా ఉన్నాయి."

"అదేమిటో కొంచెం వివరంగా చెప్తావా?"

"చెప్తాను. మచ్చుకి కొన్ని చెప్తాను. ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో, యోగవిద్యను కొంతవరకు సాధించిన వ్యక్తులమీద పరిశోధనలు జరిగాయి. వీరు యోగస్థితిలో వున్నప్పుడు వారి దేహంలోని జీవవ్యాపారాలు క్రమేపీ వేగం కోల్పోవడాన్ని గమనించారు. అందాకా ఎందుకు మన ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ రామచంద్రరావుగారి ఆధ్వర్యంలో కొంతకాలంగా ఈ రంగంలో ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. అవన్నీ ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి.'

"విదేశాలలో ఏమీ పరిశోధనలు జరగలేదా?"

"ఎందుకు లేదు. ముందు స్వదేశం సంగతి చెప్పాను. ఆ.... కాలిఫోర్నియా యూనివర్సిటీకి సంబంధించిన డాక్టర్ వెగ్నర్, మెషిగన్ మెడికల్ స్కూల్‌కు చెందిన డాక్టర్ బగాచి అనే శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేశారు, అలాగే జపాన్‌లోని టోక్యోయూనివర్శిటీలో, బౌద్ధులైన జెన్ సన్యాసుల మీద ప్రయోగాలు జరిగాయి. వీటన్నిటిలోనూ యోగస్థితిలో వున్నప్పుడు దేహంలో ప్రాణవాయువు వినియోగం 20శాతం తగ్గినట్లు తెలిసింది. అలాగే ఎలక్ట్రోఎన్‌సెఫెలోగ్రాఫ్ యంత్రం ద్వారా, అట్టి వ్యక్తులు అవ్యక్తమైన మానసిక ప్రశాంతస్థితిలో వున్నట్లుకూడా అవగతమయింది".

"అయితే ఈ రోజుల్లో కూడా యోగులున్నారన్నమాట."

"ఉన్నారు. కాని సమాధి స్థితిలోకి పరిపూర్ణంగా వెళ్ళగలవారు చాలా అరుదుగా ఉన్నారు. ఉదాహరణకి తపోవనానికి చెందిన జ్ఞానానందయోగి , రామానందయోగి అట్టివారే.

"యోగులందరూ భారతీయులు కావడం విశేషం."

"సహజంగా అంతే. ఎందుకంటే యోగవిద్యకి జన్మభూమి మనదేశం. అయితే పూర్వకాలంలో మనయోగులను పోలినట్టి వారు విదేశాలలో కూడా కొందరు లేకపోలేదు. గ్రీకు శాస్త్రవేత్త పైథాగరస్

భారతదేశంలో ఎన్నోవిద్యలు అభ్యసించాడు. ఆయన అసలుపేరు "పరథగుప్త". యోగవిద్యలో ఈయన నిష్ణాతుడు. ఆత్మ పునర్జన్మ, పరకాయ ప్రవేశం వంటి వాటిని ఆయన నమ్మి ప్రచారం చేశాడు. యూరపుకి చెందినవారైన నికోలస్ సెంట్ జర్మైన్, అపోలోనియస్ ఆఫ్ టాన్యా, పార్సెల్సస్ వంటి వారిని "మెన్ ఆఫ్ మిస్టరీ" అని పిలిచేవారు. వీరంతా 1400- 1700 సంవత్సరాల మధ్య జీవించినవారు.

"నువ్వు చెప్తుంటే జ్ఞాపకం వస్తోంది. ఈ మధ్య ఒక వ్యాసం చదివాను. అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో జరిపిన పరిశోధనలు ఎన్నో విశేషాలను వెల్లడిచేశాయట. ఆ వివరాలు నాకంత జ్ఞాపకం లేదు."

"అవును. ఆ విషయము నేను చెప్దామనుకున్నాను కాని మరిచిపోయాను.

"ఈ సంస్థలో ధ్యానంలో వున్న యోగులమీద పరీక్షలు జరిపారు. ఆ స్థితిలో వారి చర్మపు నిరోధకశక్తి పెరిగింది. దీనర్థం ఆత్రుతలేని ప్రశాంత స్థితిలోకి వెళ్ళడమన్నమాట. అలాగే వారి మస్తిష్కతరంగాలవల్ల కూడా వారు మానసిక ప్రశాంతతతో ఉన్నట్లు ధృవపడింది. ఇదికాక వారిరక్తంలోని లాక్టేట్ శాతం త్వరత్వరగా పడిపోయింది. అంటే శ్వాసక్రియ బాగా తగ్గిందన్న మాట. వీరి చర్మ అనిరోధనశక్తికీ, మమ్మీల చర్మ నిరోధకశక్తికీ ఎంతో స్వామ్యం ఉంది."

"అంటే ఈ మమ్మీలు సమాధి స్థితిలో వున్న యోగులు కాదుకదా?'

"సరిగ్గా నా ఆలోచనే నీకూ వచ్చింది. నీకూ నాకే కాదు. తార్కికంగా ఆలోచించే ఏవ్యక్తికైనా ఇదే అనుమానం వస్తుంది. నిజానికి మహామేధావులైన ఈజిప్షియన్లకు, పంచభూతాల్లో కలిసిపోయే మృతదేహాలను భద్రపరచవలసిన అవసరం లేదు, అందుకోసం పిరమిడ్ల వంటి బృహన్నిర్మాణాల అవసరంలేదు. అసలు ఈ పిరమిడ్ల నిర్మాణం గురించి పురాతత్త్వశాస్త్రవేత్తలు కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదిస్తున్నారు."

"ఏమిటవి?"

"ఇతర నక్షత్రమండల వాసులు వేల సంవత్సరాల క్రిందట భూమి మీదకువచ్చి పిరమిడ్ల వంటి బృహన్నిర్మాణాలను కావించారు అని. ఈ వాదనకు బలమైన సాక్ష్యాధారాలున్నాయి. పిరమిడ్ల యొక్క కొలతల నిష్పత్తి సూర్యునికీ, గ్రహాలమధ్యగల దూరపు నిష్పత్తికి సరిగ్గా సరిపోతోంది. అంతేకాదు, పిరమిడ్ల మీద చెక్కిన చిత్రాలలో అంతరిక్షనౌకలు, శిరస్త్రాణాలు ధరించిన అంతరిక్షయాత్రికులు వంటి చిత్రాలున్నాయి."

"విచిత్రంగా ఉందే." అన్నాడు ప్రతాప్ ఆశ్చర్యపోతూ.

"అంతేకాదు. వారు ఎక్కడనుంచి వచ్చినదీ, ఖగోళచిత్రాలద్వారా సూచించారు. ఈ సూచనల ప్రకారం వారు ప్లియేడ్స్ (కృత్తిక) నక్షత్రమండలానికి చెందిన ఏదో గ్రహవాసులై ఉండాలి. ఈ నక్షత్రమండలం మనకి సుమారు ఐదు కాంతి సంవత్సరాల దూరంలో ఉంది." అందుకే కావచ్చు మనవారు తిథిని కృత్తికా నక్షత్రంపైకి వచ్చిన సమయంబట్టి గణిస్తారు.

"అయ్య బాబోయ్. అంటే సెకనుకి లక్షాఎనభైయారు వేల మైళ్ళ వేగంతో ప్రయోగించే కాంతికే అక్కడనుంచి ఇక్కడికి రావడానికి ఐదుసంవత్సరాలు పడ్తుందన్నమాట. అటువంటిది గంటకి కొన్నివేల మైళ్ళ వేగంతో ప్రయాణించే మన అంతరిక్ష నౌకలు ప్రయాణించడానికి ఎన్నివేల సంవత్సరాలు పడ్తుంది.

స్వరూపమే మారిపోతుంది".

"అప్పుడు నిరుద్యోగ సమస్య ఇంకా ఎక్కువై అంతర్యుద్ధ పరిస్థితులకు దారితీస్తుందేమో!" సభికులలోంచి ఎవరో గట్టిగా అరిచారు.

అధ్యక్షులవారు బల్లమీద చేతితో చరిచి "సైలెన్స్ ప్లీజ్" అని గట్టిగా అన్నారు.

"అని ఎందుకనుకోవాలి. లెటస్ బి ఆప్టిమిస్టిక్. వైజ్ఞానిక రంగంలో విప్లవాత్మకమైన మార్పు వచ్చినప్పుడల్లా ఈ భయం ఏర్పడుతూనే ఉంది. కాని ఊహించినంత ప్రమాణంలో ప్రమాదం ఎప్పుడూ ఏర్పడలేదని చరిత్ర చెప్తోంది. ఈ విషయం కూడా అంతే. అప్పటికి అనేక రంగాల్లో ఉద్యోగావకాశాలు కలగవచ్చు" అన్నాడు మదన్.

ఇంతలో మరో ప్రశ్న కాగితం అధ్యక్షులవారికి అందింది.

దానిని తీసుకుంటూ ఆయన "సమయం మించిపోతోంది. అందువల్ల ఈ ఒక్క ప్రశ్నను మాత్రం డాక్టర్ మదన్‌కి అందజేస్తున్నాను. అటు తర్వాత వేరే ప్రశ్నలు తీసుకోవడం జరగదు. దయచేసి ఇంక పంపవద్దని మనవి" అంటూ ఆ కాగితాన్ని మదన్‌కి అందించారు.

"కంప్యూటర్‌లకు స్వయం బుద్ధిలేదన్నారు. రోబోలు కంప్యూటర్ల నియంత్రణలోనే నడుస్తాయన్నారు. బాగుంది. మరి జపాన్‌లో కనీసం ఐదు కేసులలో రోబోలు అకస్మాత్తుగావచ్చి కొందరిని తమ ఉక్కు పిడికిలితో నొక్కివేసి చంపివేశాయని పేపర్లలో చదివాం. ఇదెలా సాధ్యం" ఇదీ ప్రశ్న.

ఒక్కక్షణం మౌనంగా ఉండిపోయాడు మదన్.

ఆ తర్వాత బుర్ర గోక్కుంటూ-"వెల్. ఇది చాలా క్లిష్టమైన ప్రశ్న. ఈ వార్తలు నేనూ పేపర్లలో చదివాను. సాధారణంగా ఇలా జరగడానికి అవకాశం లేదు కాని జరిగింది. ఫీడింగ్‌లో లోటుందేమో చెప్పలేను. నిజానికి ఫీడింగ్‌లో లోపం ఉన్నా వెంటనే తెలియజేయడమో, ఆటో కరెక్షన్ చేసుకోవడమో జరిగే అవకాశం ఉంటుంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు పరిశీలిస్తేనే కాని నేనేమీ చెప్పలేను. అయితే ఈ సంఘటనలు కంప్యూటర్ నియంత్రణ మరింత నిర్దుష్టంగా ఉండాలన్న వాస్తవాన్ని గుర్తుచేస్తూ, మనకి తెలియని ఊహించని ప్రమాదాలు పొంచి ఉన్నాయని హెచ్చరిస్తున్నాయి. ఇంతకు మించి నేనేమి ప్రస్తుతం చెప్పలేను" అన్నాడు.

ఆ తర్వాత కంప్యూటర్‌లను గురించి ఆసక్తికరమైన విశేషాలు. సమీప భవిష్యత్తులో కంప్యూటర్ ప్రపంచ స్వరూపం గురించీ, మనదేశంలో ఈ రంగంలో జరుగుతుండిన కృషిని గురించీ, అందరికీ అర్థమయ్యే భాషలో, ఎంతో ఆసక్తికరంగా చెప్పి తన ఉపన్యాసాన్ని ముగించాడు డాక్టర్ మదన్.

ఆ వార్షిక సమావేశం దిగ్విజయంగా ముగిసింది.

* * * *

డాక్టర్ మదన్‌కి గార్డ్ ఇంటికి వెళ్తున్నంత సేపూ, ఇంటికి వెళ్ళాక కూడా ఆ చివరి ప్రశ్నే మనసుని వెంటాడసాగింది.

నిజమే. పేపర్లలో ఆ వార్తను తానూ చదివాడు. కంప్యూటర్ గుట్టుమట్టును క్షుణ్ణంగా ఎరిగిన తనకు, ఆ విధంగా జరగడం అసంభవమనే అనిపిస్తోంది. కాని జరిగింది. ఇదెలా సాధ్యం?

పాత పత్రికలను వెతికి ఆ న్యూస్‌వున్న పేపర్లని బయటకు లాగాడు. సుమారు రెండు నెలల క్రితం వచ్చిన వార్త అది.

జపాన్‌లో ఒక ప్రముఖ కంప్యూటర్ కంపెనీలో ఈ ఘోరం జరిగిందట. ఒక సూపర్ వైజర్ ఫ్యాక్టరీలోని యంత్రాలను తనిఖీచేస్తుండగా ఉన్నట్లుండి ఒక రోబో వెనకపాటుగా వచ్చి ఆ సూపర్‌వైజర్‌ని రెండు ఇనుప చేతులతోనూ చుట్టేసి ధృతరాష్ట్రుడి కౌగిలిలాగా ఊపిరాడకుండా నొక్కేసిందట.

ఆ సూపర్‌వైజర్ ఎంత ప్రయత్నించినా ఆ ఉక్కు కౌగిలినుంచి తప్పించుకోలేక గిలగిల కొట్టుకుంటూ ప్రాణాలు వదిలాడట. ఇటువంటివే మరో నాలుగు కేసులు కూడా ఆ దేశంలోనే జరిగాయట. ఈ విధంగా జరగడానికి కారణాలు శాస్త్ర వేత్తలకి అంతుపట్టలేదట. ఇంతకు మించి వేరే వివరాలేవీ ఆ వార్తలో లేవు. ఇవన్నీ ఇంతకుముందు చదివిన వార్తలే. అయితే అప్పుడు వాటిని అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఏదో జనరల్‌గా చదివాడంతే. ఇప్పుడు ప్రత్యేకంగా చదివితే వేరేమైనా విశేషాలు కనిపిస్తాయేమోననుకున్నాడు కాని అటువంటిదేమీ లేకపోవడంతో నిరాశ అయింది.

ఇంతలో మరుసటి నెలలోనే తనకి జపాన్ టూర్ ఉన్న విషయం జ్ఞప్తికి వచ్చింది. అక్కడ కంప్యూటర్ సంస్థలో ఉన్న ఉద్దండులందరూ తనకి పరిచయం ఉన్నవారే. ఇప్పటికి వారు ఈ విషయమై పరిశోధించి అసలు కారణాన్ని కనుగొని ఉండవచ్చు: లేదా తాను వారితో జరిపే చర్చలలో ఏదైనా ఫలితం ఉండవచ్చు.

అప్పటికి ఆ ఆలోచనకు ఫుల్‌స్టాప్ పెట్టి వేరే పనులలో నిమగ్నమయ్యాడు డాక్టర్ మదన్

* * * *

డాక్టర్ మదన్ జపాన్ వెళ్ళాడు మరుసటి నెలలోనే. అక్కడ అంతకు ముందు తాను పనిచేసిన కంపెనీ గెస్ట్‌హౌస్‌లో దిగాడు. ఆయనకి అఫీషియల్‌గా పని ఉన్నది ప్రధానంగా ఆ కంపెనీలోనే.

తాను వచ్చిన పనిలో చాలా భాగం పూర్తి అయింది.

ఆ మధ్యాహ్నం కంపెనీలోని చీఫ్ కంప్యూటర్ ఎడ్వయిజరీ సకినోవాని తన గెస్ట్‌హౌస్‌కి రమ్మని పిలిచాడు.

ఇద్దరూ సోఫాలలో కూర్చున్నారు.

బాయ్ టీ తీసుకువచ్చాడు.

అది త్రాగాక సకినోవా పైప్ ముట్టించాడు.

డాక్టర్ మదన్ సిగరెట్ అంటించాడు.

''చెప్పండి డాక్టర్ మదన్. హౌడూయూ ఫీల్ ఇన్ ఇండియా'' అని అడిగాడు సకినోవా.

''ఓ. నాచురల్లీ వెరీ హేపీ. ఆఫ్టరాల్ ఇటీజ్ మై మదర్ లాండ్'' అన్నాడు మదన్.

''ఓ. నాట్ దట్...ఐమీన్ యువర్ న్యూ ఎసైన్‌మెంట్''.

''అదా. క్వైట్ ఇంటరెస్టింగ్ అఫ్‌కోర్స్. ఇక్కడవున్న సదుపాయాలూ ఫ్రీడం అక్కడలేవనుకోండి.

అయినా నాకు జాబ్ శాటిస్‌ఫాక్షన్ ఉంది. నిజాయితీతో, కష్టించి పనిచేసే సైంటిస్ట్‌లు నా కింద చాలామందే ఉన్నారు.''

''అది సరే. డాక్టర్ సకినోవా.. మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. రెండు నెలల క్రితం పేపర్లలో ఒక న్యూస్ చదివాను. జపాన్లో ఐదు కేసులలో రోబోలు ఏ కారణం లేకుండానే ఐదుగురు మనుష్యుల్ని తమ ఉక్కు చేతులతో నొక్కేసి చంపివేశాయట. ఇది ఎలా జరిగిందో, ఆ వివరాలేమిటో చెప్తారా?''

''ఓ. సో యూ ఆల్సో న్యూ ఎబౌట్ ఇట్. వీటిలో లేటెస్ట్ కేసు జరిగింది మన కంపెనీలోనే. మీకు తెలుసుగా ప్రొఫెసర్ మికిహిటో. మీరు ఇక్కడున్నప్పుడు మీకు అసిస్టెంట్‌గా ఉండేవాడు. ఆయన ఒక రోజున మెషినరీ చెక్ చేస్తున్న సమయంలో వెనకాల నుంచి రోబో వచ్చి ఆయన్ని గట్టిగా ఇనుప హస్తాలతో నొక్కివేసింది. పూర్‌ఫెలో హి బికేమ్ ది విక్టిమ్'' అన్నాడు సకినోవా నిట్టూరుస్తూ.

''అరే. ఈ ఘోరం జరిగింది మికిహిటోకా! వాట్ ఎ పిటీ. హి వజ్ ఎ బ్రైట్ ఛాప్'' అన్నాడు డాక్టర్ మదన్.

''ఈ కేసుని థరోగా ఇన్‌వెస్టిగేట్ చేశాం. కాని ఏమీ క్లూ దొరకలేదు. ఇటీజ్ స్టిల్ ఎ మిస్టరీ'' అన్నాడు సకినోవా.

''ఇటీజ్ స్ట్రేంజ్. మికిహిటో మీద ఎవరికైనా పగ ఉండి రోబో ఆకారంతో వచ్చి ఈ పని చేసి ఉండవచ్చుగా. అఫ్‌కోర్స్. ఇది చాలా సిల్లీ ప్రశ్న అనిపించవచ్చు. కాని ఈ పాజిబిలిటీని కూడా రూల్ ఔట్ చేద్దామని'' అని అడిగాడు మదన్ కొంచెం మొహమాటపడుతూ.

సకినోవా చిరునవ్వు నవ్వాడు.

''ఆ సిల్లీ డౌట్ మాకు కూడా వచ్చింది. కాని అటువంటిదేమీ జరగలేదు. ఎందుకంటే రోబో పట్టుకోగానే ఆ పట్టు నుంచి విడిపించుకోవాలని గింజుకుంటూ భయంకరంగా కేకలు వేశాడట మికిహిటో . ఆ సమయానికి అక్కడ ముగ్గురు నలుగురు కంటే ఎక్కువమంది లేరు. మీకు తెలుసుకదా. రోబోట్‌లు వచ్చాక ఫ్యాక్టరీలలో వర్కర్ల సంఖ్య బాగా తగ్గిపోయిందని. వాళ్ళు పరుగుపరుగున వెళ్ళి ఆయన్ని రక్షించాలని చూశారు. కాని వాళ్ళు కూడా ఆ పట్టు విడిపించలేకపోయారు. పూర్‌ఫెలో. వాళ్ళ కళ్ళముందే చనిపోయాడు. ఆ తర్వాత రిమోట్ కంట్రోల్ ఆఫ్ చేశాకే రోబో పట్టు విడివడింది. రోబోట్‌ని ఓపెన్ చేసికూడా పరీక్షించారు. కాని ఏమీ అంతుపట్టలేదు''.

''మైగాడ్! ఎంత దారుణం! మరి మిగిలినవారి సంగతేమిటి?''

''ఈ విషయాలలో ఎంక్వయిరీ చేయడానికి జపాన్ ప్రభుత్వం త్రీమెన్ కమిటీని నియమించింది. దానికి ఛైర్మన్ నేనే. మేము ఈ ఐదు కేసుల్నీ క్షుణ్ణంగా పరిశీలించి రిపోర్టు తయారుచేశాం''

''ఏమని? మీ ఫైండింగ్ ఏమిటి?'' ఆత్రంగా అడిగాడు డాక్టర్ మదన్.

''నథింగ్. ఉయ్‌కుడ్ నాట్ కం టు ఎనీ కంక్లూజన్. అందుకే అన్‌సాల్వ్‌డ్ మిస్టరీగా రిపోర్టు ఇచ్చాం. ఆ రిపోర్టే నా దగ్గర ఉంది. ఇప్పుడే తీసుకువచ్చి మీకిస్తాను. మీరూ తీజర్లీగా చదవండి. మీకేమైనా

ట్లు దొరుకుతుందేమో" అంటూ లేచాడు సకినోవా.

మరి కొంచెం సేపట్లో ఆ రిపోర్టు ఇచ్చి వెళ్ళిపోయాడు.

* * * *

ఆరోజు రాత్రి నిద్రకూడా పోకుండా ఆ రిపోర్టును చాలా శ్రద్ధగా చదివాడు డాక్టర్ మదన్. అనుమానం వచ్చిన చోట పదేపదే చదివాడు. విశేషమేమిటంటే ఈ ఐదు సందర్భాలలో కూడా మరణాలు కాదు కాదు రోబోట్‌లు చేసిన హత్యలు జపాన్ కాలమానం ప్రకారం సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకు జరిగాయి. ఇవన్నీ కాకతాళీయం అనుకోవాలా? అలా అనిపించలేదు మదన్‌కి. ఇంతటి ముఖ్యమైన అంశం గురించి రిపోర్టులో ఎక్కడా ప్రస్తావన లేదు. సకినోవా వంటి మేధావి ఇంతటి ముఖ్యమైన విషయాన్ని గుర్తించలేదా? గుర్తించినా దానికేమీ ప్రాముఖ్యం లేదనుకున్నాడా? లేక దాని విషయం మరిచిపోయాడా?

జపాన్ ఎలక్ట్రానిక్ ఫ్యాక్టరీలలో ప్రతిరోజూ ఆటోమాటిక్ మెషీన్ల పీరియాడిక్ చెకింగ్ ఉంటుంది. దాని ప్రకారం ప్రతిరోజూ మధ్యాహ్నం ఇన్‌ఛార్జి సైంటిస్టులు ప్రతిరోజూ 12 గంటలలోగా అలాగే మరి కొన్ని నిర్దేశిత సమయాలకూ మెషీన్లను చెక్ చేస్తారు. అవి సరిగా ఉన్నాయని ధ్రువపరుచుకున్న తర్వాత ఆపై అజమాయిషీని రోబోలకు అప్పజెప్తారు. రిపోర్టులో ప్రత్యేకించి ఆలోచించవలసిన వేరే అంశాలేమీ కనిపించలేదు.

ఇంక రోబో చేతుల్లో మరణించిన వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాడు డాక్టర్ మదన్. ఇవన్నీ కూడా కేవలం జపాన్‌లోనే తప్ప వేరెక్కడా జరగకపోవడం ఆశ్చర్యపరచింది.

ఆ ఐదుగురూ మొకిహిటో సహా అందరూ జపాన్‌లో మంచి పేరు, ప్రఖ్యాతులున్న శాస్త్రవేత్తలే. ఒక విధంగా చెప్పాలంటే ఎలక్ట్రానిక్స్ రంగం ఇంతవేగంగా ఇంత అద్భుతంగా ప్రగతిని సాధించిందంటే అందులో వారి పాత్ర ఎంతైనా ఉంది. ఐదుగురూ ఐదు ప్రముఖ సంస్థల్లో పనిచేస్తున్నవారే. వారి కృషి నోబెల్ బహుమతి పొందడానికి అర్హమైన స్థాయిలో ఉంది.

నిజానికి ఆ సంవత్సరం బహుమతి ఆ ఐదుగురిలో ఒకరికి బహుశా మికిహిటోకి వస్తుందన్న విశ్వాసం చాలామందికి ఉంది. ఎందుకంటే మైక్రోవేవ్ ట్రాన్స్‌మిషన్‌లోనూ డిజిటల్ టెలివిజన్ టెలిఫోన్ రూపకల్పనలోనూ ఆయన చేసిన కృషి ఆయా రంగాల్లో విప్లవాన్ని తీసుకువచ్చింది. అటువంటి మహామేధావులు దుర్మరణం పొందడం చాలా విచారించవలసిన విషయం. సకినోవా కూడా తక్కువవాడు కాదు. ఆయన కృషికూడా నోబెల్ బహుమతి పొందదగిన స్థాయిలోనే ఉన్నా మొకిహిటో కృషితో పోలిస్తే తక్కువ. పైగా సకినోవా పరిశోధనలు యంత్రాల సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని మెరుగుపరచేవిగా వుంటే మికిహిటో పరిశోధనలు ప్రజా బాహుళ్యానికి ఎన్నో సౌకర్యాలు కలగజేసేవిగా ఉంటాయి. ఆయనకి బహుశ ఈ సంవత్సరంకాని పై సంవత్సరంకాని నోబెల్ బహుమతి రావచ్చు. నిజానికి ఇంతకు ముందే వస్తుందని ఆశించారు. కాని ఏ కారణం చేతనో రాలేదు.

మళ్ళీ ఆ రిపోర్టును తీసి శ్రద్ధగా చూడసాగాడు డాక్టర్ మదన్.

ఐదుగురూ కూడా మధ్యాహ్నం 12 గంటలకే చచ్చిపోవడంలోనే అసలు రహస్యం ఇమిడి ఉందనిపించింది. అది ఏమై ఉంటుందా అని తీవ్రంగా ఆలోచిస్తున్న మదన్ మనస్సులో మరో ఆలోచన

# ప్రాణం వచ్చిన రోబోట్‌లు

ఆ రోజు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వార్షికోత్సవం.

ఆ సందర్భంలో గెస్ట్ లెక్చర్ ఇయ్యడానికి డాక్టర్ మదన్‌ని ఆహ్వానించారు.

ఆయన కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశాక స్పెషలైజేషన్ కోసం విదేశాలకు వెళ్ళాడు. అక్కడ స్పెషల్ కోర్స్‌లలో డిప్లమాలు పొంది జాపాన్‌కి వచ్చాడు. అక్కడ మూడు సంవత్సరాలపాటు ఒక ప్రసిద్ధ కంపెనీలో స్పెషలైజ్డ్ ట్రైనింగ్ తీసుకున్నాడు. ఆ కంపెనీయే ఆయనకి మంచి జీతం, ఇతర సదుపాయాల మీద మంచి ఉద్యోగాన్ని ఆఫర్ చేసింది కాని స్వదేశం మీదున్న అభిమానంతోపాటు తెలిసిన మిత్రులు తాము స్థాపించిన 'ట్వెంటీఫస్ట్ సెంచురీ కంప్యూటర్స్' అన్న సంస్థకి చీఫ్ ఎడ్వయిజర్‌గా రమ్మని ఆహ్వానించడంతో ఇండియాకి వచ్చేశాడు. ఇండియాలో వున్న అన్ని కంప్యూటర్ సంస్థల కంటె హైదరాబాద్‌లో వున్న ఈ సంస్థే అతి పెద్దది. భారతీయ ప్రమాణాలతో పోలిస్తే చాలా మంచి జీతాన్ని, సదుపాయాల్ని డాక్టర్ మదన్‌కి కల్పించారు వారు.

డాక్టర్ మదన్‌కి కంప్యూటర్ సైన్స్‌లో అథారిటీ అని పేరు. ఆయనకి దేశంలోనే కాక విదేశాలలోనూ మంచి పరిగణన ఉంది. ఆయన వ్యాసాలు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రముఖ పత్రికలలో ప్రచురితమవు తుంటాయి. అటువంటి వ్యక్తి ఉపన్యాసం ఉందనేసరికి ఒక్క యూనివర్సిటీ విద్యార్థులేకాక నగరంలోని అనేకమంది కూడా వచ్చారు.

యూనివర్సిటీ కాంపస్‌లోని టాగోర్ ఆడిటోరియం సభికులతో కిటకిటలాడిపోతోంది. అంతా నిశ్శబ్దంగా ఉండి ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. సభాధ్యక్షులైన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్-డాక్టర్ మదన్‌ని గురించి వివరంగా సభికులకు పరిచయం చేశారు.

తర్వాత డాక్టర్ మదన్ ఉపన్యసించడానికి లేచారు.

సంతోషంతో సభికులు కొట్టిన చప్పట్లతో హాలు దద్దరిల్లిపోయింది. వారికి వినమ్రతతో తలవంచి నమస్కరించాడు డాక్టర్ మదన్.

నవ్వుముఖంగా ఆయన తన ఉపన్యాసాన్ని ప్రారంభించాడు.



''గౌరవనీయులైన అధ్యక్షుల వారికి, వేదికమీదున్న పెద్దలకు సభికులకూ అందరికీ నా నమస్కారములు. సాధారణంగా నాకు ఇటువంటి సమావేశాలలో పాల్గొనే తీరిక ఉండదు. కాని ఇది కంప్యూటర్ ఇంజనీరింగ్‌కి సంబంధించిన వారు ఏర్పాటు చేసిన సమావేశం కావడంతో తప్పనిసరిగా వచ్చాను. ఈ సమావేశం కేవలం విద్యార్థులూ, అధ్యాపకులకు పరిమితమైనదయ్యుంటే నేను ఇచ్చే ఉపన్యాసపు స్థాయి వేరుగా ఉండేది. అయితే ఇక్కడ ఎందరో ఈ రంగం గురించి పరిచయం లేనివారు ఉండడంవల్ల అందరికీ ఆసక్తిని కలిగించే కొన్ని సామాన్య విషయాలను ప్రస్తావించదలుచుకొన్నాను.''

సభలో మళ్ళీ చప్పట్లు మ్రోగాయి. ఈసారి చప్పట్లు కొట్టినవారు ప్రధానంగా విద్యార్థులు, అధ్యాపకులు కానివారు.

''నిజం చెప్పాలంటే కంప్యూటర్ అనేది చాలా సామాన్యమైన పరికరం. కాల్క్యులేటర్లు రాకముందు విద్యార్థులూ వ్యాపారస్థులూ ఉపయోగిస్తుండిన స్లైడ్ రూల్ ఒక విధమైన కంప్యూటరే. ఇంకా చెప్పాలంటే మన తాతల కాలం నుంచీ పిల్లలకు కూడికలు, తీసివేతలు నేర్పడానికి తీగలకి రంగుల గోలీలు ఉండే పలకలు కంప్యూటర్లకి ప్రోటోటైప్స్ అంటే తొలి రూపాలు అనుకోవచ్చు. ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉన్న కంప్యూటర్ ఏదంటే కాల్క్యులేటర్. ఎన్నో ఘన కార్యాలు నిర్వహిస్తున్న కంప్యూటర్లు మౌలికంగా నిర్వహించేవి రెండే రెండు-కూడిక, తీసివేతలు. మరి హెచ్చవేత, భాగాహారముల సంగతేమిటి? నిజానికి ఈ రెండూ కూడా కూడిక, తీసివేతలకు మారురూపాలే. ఎలాగంటే ఉదాహరణకి నాలుగు నాలుగులెంత

అన్న ప్రశ్న వచ్చిందనుకోండి. మనకి ఎక్కాలు వచ్చు కనుక నాలుగు నాలుగులు పదహారు అనేస్తాం. నిజానికి ఈ పదహారు ఎలా వచ్చింది? నాలుగుని నాలుగుసార్లు కలిపితే అంటే 4+4+4+4 చేస్తే వచ్చిందన్నమాట. కంప్యూటర్ ఇలాగే లెక్కిస్తుంది. అదే భాగాహారమనుకోండి. 9/3 అన్న దానిని మనం అలవాటుగా 9/3=3 అని చెప్పేస్తాం. అదే కంప్యూటర్ అయితే 9 నుంచి 3ను తీసుకుంటూ వెళ్తుంది. అంటే 9 - 3 = 6, 6 - 3 = 3 ఇలా అన్నమాట. అంటే కంప్యూటర్లు నిర్వహించేవి ప్లస్, మైనస్‌లే అయితే మరి ఈ కంప్యూటర్ల ప్రత్యేకత ఏమిటి? మనం ఎక్కాల్ని కొద్ది సంఖ్యలకి కొద్దిరెట్లు మాత్రమే చేయగలం. కంప్యూటర్ అలా కాదు. లక్షలు కోట్లు ఉన్న సంఖ్యలని కూడా గుణించగలదు. భాగించగలదు. అన్నిటినీ మించిన ప్రత్యేకత వీటికున్న వేగం. ఎంత పెద్ద లెక్కనైనా ఊహకి అందనంత వేగంతో చెయ్యగలవు కంప్యూటర్‌లు''.

డాక్టర్ మదన్ ఉపన్యాసం సాగుతోంది. సభికులలోనుంచి ఒకరు కాగితం మీద ఒక ప్రశ్న రాసి అధ్యక్షులకి పంపించారు.

అది చూస్తూ అధ్యక్షులవారు కొంచెం ముఖం ముడుచుకొని ''సభికులకు ఒక విజ్ఞప్తి. ఇది వార్షిక సమావేశంకాని చర్చా వేదిక కాదు. అందువల్ల ఎవ్వరూ ప్రశ్నలు పంపవలదని మనవి'' అన్నారు మైకును దగ్గరకు లాక్కుని.

డాక్టర్ మదన్ అధ్యక్షుల ముందున్న కాగితాన్ని పరికించి చూశారు. దానిమీద కంప్యూటర్‌కి సంబంధించిన ప్రశ్న ఉంది.

''చూడండి. ఉత్సాహంకొద్దీ వారు ప్రశ్న పంపినపుడు సమాధానం చెప్పకుండా దాటేసి నిరుత్సాహపరచడం భావ్యంకాదు.

అందువల్ల కేవలం ఐదు ప్రశ్నలకు సమాధానం చెప్తాను. వాటిని ఆధారంచేసుకొనే నా ఉపన్యాసాన్ని కొనసాగిస్తాను' అన్నాడు డాక్టర్ మదన్.

అదే విషయాన్ని సభికులకు తెలియజేసి తనకివచ్చిన కాగితం మీది ప్రశ్నను చదివాడు అధ్యక్షులవారు.

కంప్యూటర్ మౌలికంగా గణకయంత్రం అన్నారు. బాగానే ఉంది. కాని పెద్ద పెద్ద కంప్యూటర్‌లు సమాచారాన్ని విశ్లేషిస్తూ విచక్షణా జ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాయి. మరి వీటికి ఆలోచన ఉందంటారా? ఉంటే ఇవి మానవ మస్తిష్కంతో సమానమైనవా? లేదా ఇంకా ఎక్కువ ప్రతిభకలిగినట్టివా? ఇదీ ప్రశ్న.

ఆ ప్రశ్న విని చిరునవ్వు నవ్వాడు డాక్టర్ మదన్.

''ఎంత గొప్ప కంప్యూటర్ కూడా మానవ మస్తిష్కాన్ని మించలేదు. ఎందుకంటే ఆ కంప్యూటర్‌లను రూపకల్పన చేసి తయారుచేసింది మానవ మస్తిష్కమే కనుక. అయితే కంప్యూటర్‌లో వున్న గొప్పతనమల్లా అమిత వేగంతో నిర్ణయాలు తీసుకోవడం, పరిష్కారాలు సూచించడం. ఇవి కూడా మనిషి అందించిన సమాచారం ఆధారంగానే ఉంటుంది. అందువల్ల మన ఫీడింగ్ సక్రమంగా ఉంటే దాని నిర్ణయాలూ సమంజసంగా ఉంటాయి. మీకు ఉదాహరణ చెప్తాను. అమెరికాలో ఒకసారి మనుష్యులకి అత్యుత్తమమైన పోషకాహారం ఏదీ అన్న సమస్యను కంప్యూటర్‌కి ఇచ్చారు. మనిషి దేహానికి కావలసిన ప్రొటీన్లు,

కార్బోహైడ్రేటులు, ఫాట్స్, విటమిన్లు వంటివి ఏయే పరిమాణంలో ఉండాలో ఫీడ్ చేశారు. ఇవి ఉన్నటువంటి రకరకాల ఆకుకూరలు, కాయగూరాలు, పళ్ళు, చేపలు, మాంసం, గ్రుడ్లు వంటి వాటి వివరాలను కూడా అందజేశారు. కంప్యూటర్ క్షణాలలో ఆలోచించి సమాధానం చెప్పేసింది. ఏమనో తెలుసా? మనిషికి అవసరమైన నిష్పత్తిలో పోషక పదార్థాలున్నది పచ్చగడ్డియని"-

హాలు నవ్వులతో మార్మోగిపోయింది.

ఆ సందడి తగ్గాక మళ్ళీ ఉపన్యాసం మొదలుపెట్టాడు డాక్టర్ మదన్.

"ఇందులో కంప్యూటర్‌ను తప్పుపట్టాల్సింది ఏమీలేదు. దానికి ఫీడ్ చేసిన సమాచారం ప్రకారం సక్రమమైన సమాధానమే చెప్పింది.

"ఇదే మనిషనుకోండి. పదార్థాలలోని ఆహారపు విలువలను దృష్టిలో పెట్టుకొని మరేదైనా సూచించేవాడు కాని పచ్చగడ్డిని మాత్రం కాదు. అదే మనిషికీ కంప్యూటర్‌కీ తేడా"

హాలులో మళ్ళీ నవ్వులు విరిశాయి.

ఈ లోగా మరో ప్రశ్న అధ్యక్షుల వారిని జేరింది.

దానిని ఆయన డాక్టర్ మదన్‌కి అందించాడు.

"రిమోట్ కంట్రోల్ అంటారు. దానికి కంప్యూటర్‌కీ ఏమైనా సంబంధం ఉందా?"

ఇదీ రెండో ప్రశ్న.

"తప్పకుండా ఉంది. ఈ రెంటికీ అవినాభావ సంబంధమే ఉంది. మనుష్యుల ప్రమేయంలేకుండా దూరంతో నిమిత్తం లేకుండా కంప్యూటర్‌ల సహాయంతో ఎటువంటి క్లిష్ట కార్యాలనైనా నిర్వర్తించవచ్చు. నిజానికి ఇటువంటి కార్యాల్ని కంప్యూటర్‌లు మాత్రమే చేయగలవు కాని మనుష్యులు చేయలేరు. ఉదాహరణకి రష్యనులు చంద్రుని మీదికి ఒక మూన్‌బగ్గీని పంపారు. అది భూమినుంచి కంప్యూటర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం చంద్రుని ఉపరితలం మీద చాలా దూరం తిరుగాడింది. ఇది రిమోట్ కంట్రోల్‌తో సాధ్యమైనదే. అదే విధంగా ఈనాడు ఐ.సి.బి.యంలు అంటే ఖండాంతర క్షిపణులు భూమి మీద ఏ లక్ష్యాన్నయినా సూటిగా ఛేదించగలవు. ఇదీ రిమోట్ కంట్రోల్ వల్లనే. పోతే ఈనాడు రోబోట్‌లను అంటే మరమనుషులను తయారుచేసి అనేక పరిశ్రమలలో, సంస్థలలో వివిధ కార్యాలను నిర్వర్తిస్తున్నారు. ఉక్కు ఫ్యాక్టరీల వంటి వాటిలో అమిత ఉష్ణం ఉండే కొలిమి దగ్గర మనుష్యులు పనిచేయడం ఎంతో దుస్సాధ్యం. అటువంటి చోట్ల ఈ రోబోలు అతిసునాయాసంగా ఎన్నో కార్యాలు నెరవేరుస్తున్నాయి. జాపాన్‌లో వీటి వాడకం అత్యధికంగా ఉంది. ఇంటిలో నౌకరుగా ఆఫీసులలో అటెండర్లుగా కూడా ఈ రోబోలు ఉపయోగపడుతున్నాయి. ఇంక ముందు లోతైన గనులలో ప్రమాదకరమైన పరిస్థితులలో మనుష్యులు పనిచేయవలసిన అవసరం ఉండదు. అలాగే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎత్తయిన ఇళ్ళలో, మల్టీస్టోరీడ్ బిల్డింగ్స్‌లో మంటల్ని లెక్కచేయకుండా ఈ రోబోలువెళ్ళి ప్రాణాలుకాపాడగలవు. మంటల్ని ఆర్పగలవు. 21 శతాబ్దంలో ప్రపంచమంతటా పరిశ్రమలలో, సంస్థలలో మనుష్యులకంటే ఎక్కువగా రోబోట్‌లే దర్శనమిస్తుంటాయి. దాంతో కార్మిక అశాంతి, స్ట్రైక్‌లు, లాకౌట్లు వంటివి ఉండవు. ప్రపంచ

తళుక్కున మెదిలింది. రోబోల మూవ్‌మెంట్స్‌కి సంబంధించిన లాగ్‌బుక్ ఎంట్రీలను పరిశీలించాడు. ఆ ఐదు సందర్భాలలో కూడా ఆ ఐదు రోబోలూ రిమోట్ కంట్రోల్‌లో లేవు. ఏమాత్రం కదలికలేకుండా ఆ యంత్రాల దగ్గరే ఉంటాయి. అప్పుడు వాటికీ మామూలు ఇనుపముద్దకీ ఏమీతేడా ఉండదు. శాస్త్రజ్ఞులు మెషీన్లను చెక్‌చేసిన తర్వాత ప్రోగ్రాంని కంప్యూటర్‌కి ఫీడ్ చేసి రిమోట్ కంట్రోల్ ఆన్‌చేసి వెళ్ళిపోతారు. ఆ ప్రోగ్రాం ప్రకారం రోబోట్ తనకి అప్పజెప్పిన విధులను నిర్వర్తిస్తుంది.

ఇటువంటి పరిస్థితులలో ఆ రోబోలకి కదలిక ఎలా వచ్చినట్లు? లాగ్ ఎంట్రీల ప్రకారం, ఆ సమయంలో రిమోట్ కంట్రోల్ జరగలేదు. మరి వాటికి ఉన్నట్లుండి ప్రాణం వచ్చినట్లు ఎలా ప్రవర్తించాయి? ఆ రోజుల్లో కంప్యూటర్‌కి ఏం ప్రోగ్రాం ఫీడ్ చేశారోనని వాటిని కూడా పరిశీలించాడు మదన్. ఆ రికార్డు వివరాలు కూడా ఆ రిపోర్టులో ఉన్నాయి. వాటి ప్రకారం ఆ రోజు కూడా నార్మల్‌గా రొటీన్ ఫీడింగ్ జరిగింది కాని ప్రత్యేకించి మరేమీ లేదు. మరో విశేషం. ఆ రోబోట్‌లు ఆ శాస్త్రవేత్తలని చంపివేయగానే అచేతనం అయిపోయాయి. అంటే రిమోట్ కంట్రోల్ ఆగిపోయిందన్నమాట. దీన్నిబట్టి ఒక నిర్దిష్ట పథకం ప్రకారం ఎవరో కావాలనే వేరెక్కడనుంచో రిమోట్ కంట్రోల్ చేసి ఉద్దేశపూర్వకంగా ఆ రోబోట్‌ల చేత ఆ హత్యలు చేయించి ఉండాలి. ఇంతటి ఘాతుకం ఎవరు చేస్తారు?

ఆలోచనలతో డాక్టర్ మదన్ బుర్ర వేడెక్కిపోయింది.

ఆలోచనలను మార్చడం కోసం ఎదురుగా ఉన్న బుక్‌షెల్ఫ్ దగ్గరకెళ్ళి పుస్తకాలు తిరగవేయసాగాడు. అక్కడ అన్నీ సైంటిఫిక్ బుక్స్. 'కాస్మిక్‌రేస్' 'గామారేడియేషన్' 'పల్సార్స్' 'రేడియో అస్ట్రానమీ' వంటి పుస్తకాలు అవన్నీ. కాసేపు వాటిని తిరగవేసి వచ్చి మంచం మీద నడుంవాల్చాడు. కలత నిద్రలో కూడా దీనిని గురించిన ఆలోచనలే.

* * * *

మర్నాడు ప్రొద్దున తొమ్మిది గంటలకే సకినోవా వచ్చాడు.

అప్పటికి కాలకృత్యాలు ముగించుకుని తిరిగి ఆ రిపోర్ట్‌ను చూస్తూ కూర్చున్నాడు డాక్టర్ మదన్.

"హలో మైడియర్ ఫ్రెండ్. రాత్రి బాగా నిద్రపట్టిందా? రోబోల గురించే ఆలోచిస్తూ కూర్చున్నావా?" అంటూ తాను ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

సమాధానం ఏమీ చెప్పకుండా చిరునవ్వు నవ్వాడు మదన్.

"బైదిబై. రిపోర్టంతా చదివారనుకుంటాను. మీకేమైనా క్లూదొరికిందా?" అన్నాడు సకినోవా.

"దొరికిందని ఖచ్చితంగా చెప్పలేను కాని ఏదో అస్పష్టంగా మనసులో మెదులుతోంది" అన్నాడు మదన్.

"ఏమిటది?" ఆత్రంగా అడిగాడు సకినోవా.

"ఈ ఐదు చావులూ ఒకే సమయంలో జరిగాయి. ఐదుగురూ మంచి ప్రఖ్యాతి వున్న శాస్త్రవేత్తలు. లాగ ఎంట్రీల ప్రకారం ఆ సమయంలో రిమోట్ కంట్రోల్ జరగలేదు. ఆ సమయంలో కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో ఏ అంశమూలేదు. అంటే ఇవన్నీ ఎవరో ఒకే వ్యక్తి వేరే చోటినుంచి మరేదో పద్ధతిలో

రోబోట్లను కంట్రోల్ చేసి వాటి ద్వారా ఈ హత్యలు చేయించాడన్నమాట"

సకినోవా ముఖం కందగడ్డలాగా ఎరుపెక్కిపోయింది.

"ఫెంటాస్టిక్ నాన్సెన్స్. డాక్టర్. మీరు కూడా ఇంత అబ్సర్డ్గా, సిల్లీగా ఆలోచిస్తారనుకోలేదు. ఎనీవే యూ ఆర్ టూ స్మార్ట్. మీరు ఆ రిపోర్ట్ చదవడం అయిపోతే ఇచ్చేయండి. తీసుకుపోతాను. అది చాలా ఇంపార్టెంట్ డాక్యుమెంట్" అన్నాడు.

"మిస్టర్ సకినోవా...ఒక రిక్వెస్ట్. ఈ రోజు సరిగ్గా పన్నెండు గంటలకి మికిహిటో చనిపోయిన యంత్రం దగ్గరకి వెళ్ళి ఎగ్జామిన్ చేయాలనుకుంటున్నాను. మీరు కూడా నా దగ్గర వుంటే బాగుం టుంది" అన్నాడు మదన్.

"ఓ. ష్యూర్. యూ ఆర్ ఆల్వేస్ వెల్కం. అది సరే పెట్టుకొని పెట్టుకొని పన్నెండు గంటల ముహూర్తం పెట్టారేమిటి? అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితేనో?" అన్నాడు సకినోవా.

"మీరు నా ప్రక్కన ఉంటే నాకేం ప్రమాదం జరుగుతుంది" అన్నాడు మదన్.

"ఓకె దెన్. నేనువచ్చి మిమ్మల్ని పికప్ చేస్తాను. ఉయ్ విల్ బి దేర్ షార్ప్ బై ట్వెల్వ్".

* * * *

మర్నాడు ప్రొద్దునే పదకొండున్నరకి సకినోవావచ్చి డాక్టర్ మదన్ని వెంటపెట్టుకొని ఫ్యాక్టరీకి వెళ్ళాడు. ఇద్దరూ కొంతసేపు ఫ్యాక్టరీలో తిరిగి పన్నెండుకి ఇంకో పది నిమిషాలు ఉండగా మికిహిటో ప్రాణం తీసిన రోబో దగ్గరికి వచ్చారు.

"ఇదుగో...ఈ రోబోట్నే ఉన్నట్లుండి కదిలి మికిహిటో ప్రాణం తీసింది. ఇదిగో ఈ మెషీన్నే ఆ సమయానికి ఆయన ఎగ్జామిన్ చేస్తున్నారు. పాపం...తన పనిలో మునిగిపోయి ఉన్న ఆయన వెనకాల నుంచి వచ్చిన రోబోట్ని గమనించనేలేదు" అంటూ వాటిని చూపించాడు సకినోవా.

"ఐసీ..." అంటూ ఆ రోబోట్ దగ్గరికి వెళ్ళి దానిని పరీక్షించాడు డాక్టర్ మదన్. అది నార్మల్గా ఉంది.

"ఆ తర్వాత దీనికికాని ఈ ఫ్యాక్టరీలో మరే రోబోట్కి కాని ఆకస్మిక చలనం వచ్చిందా?" అడిగాడు మదన్.

"లేదు నెవర్" అని జవాబిచ్చాడు సకినోవా.

తర్వాత అక్కడి మెషీన్ని నిశితంగా పరిశీలించసాగాడు. అందులో ఏముందో ఏమో బాహ్య ప్రపంచాన్ని మరచి అందులో నిమగ్నమైపోయాడు.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

డాక్టర్ మదన్ వెనకనున్న రోబోట్ ఉన్నట్లుండి కదలడం మొదలుపెట్టి వెళ్ళి తన ఇనుప చేతులతో మదన పీకను చుట్టినొక్కివేయసాగింది.

డాక్టర్ మదన్ భీకరంగావేసిన కేకతో అందరూ తమ మెషిన్లను ఆపివేసి అక్కడికి పరిగెత్తుకు

వచ్చారు. అప్పటివరకూ ఎవరి పనిలోవారు నిమగ్నమై ఉండడంతో ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు.

సకినోవాతో సహా అందరూ ఆ ఉక్కు పిడికిలిని విడిపించాలని చూశారు కాని అది సాధ్యంకాలేదు. ఒక సైంటిస్ట్ పరిగెత్తుకువెళ్ళి ఆ రోబోని కంట్రోల్‌చేసే రిమోట్ కంట్రోలర్‌లను చూసి వచ్చాడు. అది ఆఫ్‌లోనే ఉంది. మరి రోబోట్‌కి చలనం ఎలా వచ్చినట్లు?

రోబో ఇనుప చేతులు మదన్ గొంతును చుట్టివేశాయేకాని ఇంకా బిగించలేదు. ఏం చేయాలో ఎవరికీ పాలుపోవడంలేదు.

"డాక్టర్ సకినోవా ఓవరాల్ పాకెట్లో రిమోట్ కంట్రోలర్ ఉంది. దానిని ఆఫ్ చేయండి. రోబోట్ ఆగిపోతుంది" అన్నాడు డాక్టర్ మదన్ హీనస్వరంతో.

"నా పాకెట్‌లోనా, నాన్సెన్స్. వాట్ డూ యూ మీన్?" అని గట్టిగా అరిచాడు సకినోవా. అతని ముఖం కందగడ్డల్లే ఎరుపెక్కిపోయింది.

'యూనో వాట్ ఐ మీన్" అన్నాడు మదన్.

వెంటనే అక్కడున్నవారిలో ఒక సైంటిస్ట్ సకినోవా పాకెట్ చూడడానికి సిద్ధమయ్యాడు.

సకినోవా రౌద్రరూపం దాల్చాడు.

"హౌ డేర్ యూ ఆర్" ఆయనేదో నాన్సెన్స్ మాట్లాడితే మీరు నమ్మడమేనా?

"ఐ స్ట్రాంగ్‌లీ అబ్జెక్ట్" అని గట్టిగా అరిచాడు సకినోవా.

ఇంతలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కొంతమంది అధికారులతో అక్కడికి వచ్చాడు.

వారిని చూడగానే సకినోవా ముఖాన కత్తివేటుకి నెత్తుటి చుక్కలేదు. పచ్చగావుండే ముఖం తెల్లగా పాలిపోయింది.

"సర్. ప్లీజ్ చెక్ సకినోవాస్ పాకెట్స్" అన్నాడు మదన్.

విశేషాధికారాలున్న పోలీసులను అడ్డగించలేకపోయాడు సకినోవా. ఇన్‌స్పెక్టర్ స్వయంగా సకినోవా జేబులు చూశాడు. ఓవరాల్ పాకెట్‌లో పాకెట్ సైజ్ రిమోట్ కంట్రోల్ ఉంది.

"సర్. దానిని ఆఫ్ చేయండి" అన్నాడు మదన్.

విచిత్రం! వెంటనే రోబో చేతులు విడివడి యథాస్థానానికి వచ్చాయి.

"మిస్టర్ ఐ.జి. సకినోవా నా మీద హత్యాప్రయత్నం చేశాడు. ఇంతకు ముందు రోబోట్‌లు చేసిన ఐదు హత్యలూ కూడా ఈయన చేయించినవే. ప్లీజ్ అరెస్ట్ హిమ్" అన్నాడు డాక్టర్ మదన్.

అక్కడ ఉన్నవారందరూ తమ చెవులను తామే నమ్మలేకపోయారు.

ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టారు.

రహస్యం బయటపడడంతో ఏ విధమైన ప్రతిఘటనా లేకుండా పోలీసులకు లొంగిపోయాడు సకినోవా.

ఇన్‌స్పెక్టర్ జనరల్ అతని చేతులకు సంకెళ్ళువేసి "మీరందరూ కూడా స్టేషన్‌కు రండి. స్టేట్‌మెంట్స్ ఇయ్యాలి" అంటూ ముందుకు సాగాడు.

* * * *

స్టేషన్లో అందరి స్టేట్‌మెంట్‌లూ తీసుకోవడం అయ్యాక "డాక్టర్ మదన్. సకినోవాయే ఈ హత్యలు చేయించాడన్న అనుమానం మీకు ఎందుకు వచ్చింది?" అని అడిగాడు ఇన్‌స్పెక్టర్ జనరల్.

"సింపుల్. రోబోలు ప్రాణంలేని యంత్రాలు. మనిషి చెప్పినట్లు చేస్తాయేకాని స్వయంగా ఏమీ చేయలేవు అటువంటిది వాటికి ఆకస్మిక చలనం వచ్చిందంటే తప్పనిసరిగా వాటి వెనక మానవ హస్తం అదృశ్యంగా ఉండి తీరాలి. ఇకపోతే హత్యకు గురియైన వార్తెదుగురూ అత్యంత మేధావులైన శాస్త్రజ్ఞులు. వారి కృషికి ముఖ్యంగా మికిహిటోకి నోబెల్ ప్రైజ్ వచ్చే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు అందరూ. ప్రతి రంగంలోనూ ప్రొఫెషనల్ జెలసీ అనేది ఉంటుంది. దానివల్ల వారితో పోటీపడలేని వ్యక్తులు అడ్డదారి గుండా పైకిరావాలని చూస్తారు. అందుకోసం తమదారికి అడ్డనుకున్నవారిని అంతంచేస్తారు. వీరు చనిపోతే వచ్చే లాభం ఎవరికి? వారి స్థాయిలోనే ఉండి నోబెల్ బహుమతి పొందగలిగేటంతటి శాస్త్రవేత్తకి. అటువంటివాడు సకినోవా తప్ప మరొకరు లేరు. సకినోవా తన పథకాన్ని అద్భుతంగా వేశాడు. బహుశా ఇది అన్‌సాల్వ్‌డ్ మిస్టరీగా ఉండిపోయేదేమో! అయితే అతని కర్మకాలి నేను రావడం, అతను తన ప్రజ్ఞను నాకు చూపించాలన్న ఉబలాటంతో ఆ రిపోర్ట్ ఇయ్యడం అతని కొంపముంచింది. ఏదో అఫీషియల్ పనిమీద వచ్చిన నేను అతనికే ఎసరు పెడ్తాననుకోలేదు.

ఈ హత్యలలో రెండు ప్రధానాంశాలు నా దృష్టికి వచ్చాయి.

ఈ హత్యల సమయంలో కంప్యూటర్‌కి ఫీడింగ్ కాని రిమోట్ కంట్రోల్‌కాని లేకపోవడం. దీనిని బట్టి ఆ హత్యలను ఆయా ఫ్యాక్టరీలలోని కంప్యూటర్ల మూలంగా కాని, ఆ ఫ్యాక్టరీలో సంబంధించిన వారు కాని చేసినట్లు అనిపించదు.

రెండవది చాలా ముఖ్యమైన అంశం ఈ హత్యలన్నీ సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకే జరిగాయి. ఈ సమయానికీ హత్యలకీ ఉన్న సంబంధం ఏమిటి? అన్‌సాల్వ్‌డ్ మిస్టరీ సిద్ధాంతాన్ని బలపరచడానికి ఈ సమయాన్ని ఎన్నుకున్నారా? కాని నాకు ఈ అంశమే సకినోవా దోషి అన్న నమ్మకాన్ని కలిగించింది. నేను జపాన్‌లో పనిచేస్తున్నప్పుడు సకినోవాతో మంచి పరిచయం ఉండేది. ఆయన సోలార్ రేడియేషన్ మీద ప్రత్యేకించి గామా కిరణాల రేడియేషన్ మీదా గొప్ప పరిశోధనలు చేశాడు. ఆయన పాకెట్‌సైజ్ రిమోట్ కంట్రోలర్‌ని రూపొందించాడు. ఇది గామా కిరణాల ద్వారా రిమోట్ కంట్రోల్ చేస్తుంది. మధ్యాహ్నం పన్నెండు గంటలకి సూర్యుడు నడినెత్తిన ఉంటాడు. ఆ సమయంలో సూర్యుని నుంచి వెలువడే గామా కిరణాలు, కాస్మిక్ కిరణాలు, సోలార్‌విండ్ వంటి ప్రసారాలు అత్యధికస్థాయిలో ఉంటాయి. సకినోవా నిర్మించిన కంట్రోలర్ ఈ గామాకిరణాలను గ్రహించి స్టాటిక్ ఎనర్జీగా ఉంచుతుంది. ఈ కిరణాలను ప్రసారంచేసి కొన్నిమైళ్ళ పరిధిలో రిమోట్ కంట్రోల్ చేయవచ్చు. అయితే ఎప్పుడైనా చేయవచ్చుగా...ఈ పన్నెండుగంటల మిడసరి లగ్నం ఏమిటి అన్న ప్రశ్న వస్తుంది. పన్నెండు గంటలకి గామా కిరణప్రసారం అత్యధికంగా ఉంటుంది కనుక ఆ సమయంలో ఏ ఇబ్బంది లేకుండా రోబోలతో పని చేయించుకోవచ్చు.

పని అయిపోగానే ఆఫ్ చేయవచ్చు. కొంచెం సేపట్లోనే ఈ గామా కిరణాలను ఉపయోగించిన సూచన కూడా ఉండదు. ఆ తర్వాత ఎవరైనా ఈ పాకెట్ కంట్రోల్‌ని చూసినా ఎవరికీ ఏ అనుమానమూ రాదు. తనకి అడ్డుగా వున్నవారు తొలగిపోతే తన కృషికి గుర్తింపు వచ్చి నోబెల్ బహుమతి వచ్చే మార్గం సుగమవుతుంది. మరో అంశం కూడా నాకు సకినోవా మీద అనుమానాన్ని కలిగించింది. ఈ ఐదు హత్యలను విచారించడానికి వేసిన కమిషన్‌కి సకినోవాయే ఛైర్మన్. ఎలక్ట్రానిక్స్‌లో అసాధారణమేధస్సు కలిగి ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తి ఆధ్వర్యంలో తయారయిన రిపోర్టు ఎంతో నిర్దుష్టంగా నిశితంగా, విపులంగా కూలంకషంగా చర్చిస్తూ వుండాలి. కాని ఆ రిపోర్టు ఏదో తప్పనిసరి తద్దినంలాగా తయారుచేసినట్లనిపించింది. పైగా 12 గంటల సమయానికున్న ప్రాధాన్యాన్ని ఇందులో ఎక్కడా ప్రస్తావించలేదు. అది పొరపాటుకాదు. డెలిబరేట్‌గా చేసినదేనని అనిపించింది. ఈ అంశం కూడా నాకు సకినోవా మీద వున్న అనుమానాన్ని బలపరిచింది.

మరునాడు సకినోవా వచ్చినపుడు నాకు కలిగిన అనుమానాల గురించి ప్రస్తావించాను. వెంటనే అతను కంగారు పడిపోయాడు.

హడావుడిగా ఆ రిపోర్టు తీసుకొని వెళ్ళిపోయాడు. అతని రహస్యాన్ని కనిపెట్టిన నన్ను కూడా మట్టుపెట్టడానికి పథకం వేస్తాడని అనుమానించాను. ఆ అవకాశం నా అంతట నేనే అతనికి కల్పించి అతన్ని రెడ్‌హాండెడ్‌గా పట్టియ్యాలనుకున్నాను. అందుకనే మికిహిటో చనిపోయిన యంత్రం దగ్గరికి తీసుకువెళ్ళమని కోరాను. నేను అనుకున్నట్లే అతను పాకెట్ కంట్రోలర్ ద్వారా గామారేడియేషన్ మూలంగా రోబోట్‌కి డైరెక్షన్స్ ఇచ్చి నన్ను చంపాలని చూశాడు".

"ఎంత దారుణం! అదృష్టం బాగుంది కాని ఆ రోబో మీ ప్రాణం తీసివేస్తే ఏం జరిగేది?" అన్నాడు ఐ.జి.

మదన్ చిరునవ్వు నవ్వాడు. "మృత్యు ముఖంలోకి వెళ్తున్న విషయం తెలిసిన నేను నా జాగ్రత్తలో ఉండనా! పన్నెండు గంటలకి సూర్యుని నుంచి కాస్మిక్ కిరణాల రేడియేషన్ కూడా అత్యధికంగా వస్తుంది. ఈ కిరణాలు గామాకిరణాల కంటే చాలా శక్తిమంతమైనవి. వీటిని గ్రహించి ప్రసారం చేయగల పాకెట్ కంట్రోలర్ నా దగ్గరుంది. సరిగ్గా పన్నెండు గంటలకి ఆరోబో నా మెడచుట్టూ ఇనపచేతులు వేయగానే నా కంట్రోలర్‌ని ఆన్ చేశాను. అందులోని కాస్మిక్ కిరణాలు, ఆ గామా కిరణాల సిగ్నల్స్‌ని న్యూట్రలైజ్ చేశాయి. అందుకే ఆ రోబో ఇంకా ముందుకు సాగలేకపోయింది. నేను అది నా పీకపిసికి వేస్తున్నట్లుగా నటించి గావుకేక పెట్టాను. నిజానికి నాకు ఏ ప్రమాదమూ జరగలేదు." అని వివరించాడు మదన్.

"అంతాబాగానే ఉంది. సరిగ్గా సమయానికి పోలీసులు ఎలా వచ్చారు?" అని అడిగాడు వారితో వచ్చిన ఒక సైంటిస్ట్.

"ఎప్పుడైతే నాకు సకినోవాయే అసలైన దోషి అన్న నమ్మకం కలిగిందో, అతను నన్ను తప్పక చంపాలని ప్రయత్నిస్తాడనిపించింది. అందుకే ప్రొద్దునే ఐ.జిని స్వయంగా కలిసి ఆ ఐదుహత్యల రహస్యం బయటపడ్తుందని, సరిగ్గా పన్నెండు గంటలకీ అక్కడకి రమ్మనికోరాను. అప్పుడు నేను ఆయనకి పూర్తి వివరాలుకాని, సకినోవాని అనుమానిస్తున్నట్లు కానీ చెప్పలేదు. కానీ నాబోటి బాధ్యత గల వ్యక్తి కోరడంతో ఆయన నా మాటలమీద విశ్వాసం ఉంచివచ్చారు" అన్నాడు మదన్.

''అరె కీర్తి కండూతి మనిషిని ఎంతటి నైచ్యానికి దిగజారుస్తుంది!'' అని ఆశ్చర్యపోయారు అక్కడివాళ్ళు.

ఆ మర్నాడే స్వదేశానికి తిరిడి వచ్చేశాడు మదన్.

* * * *

ఎనిమిది నెలలు గడచింది.

నోబెల్ బహుమతి వివరాలు వెల్లడయ్యాయి.

ఫిజిక్స్‌లో సకినోవాకు బహుమతి వచ్చింది. అయితే అతను హత్యానేరాల్లో ఇరుక్కొని కేసు విచారణలో ఉన్నందువల్ల అతని కృషిని గుర్తించినా అతనికి బహుమతి ఇయ్యకూడదని నిశ్చయించారు. ఆ వార్త చదివి ''పూర్‌ఫెలో... మిగిలిన వాళ్ళకే వస్తుందేమోనన్న భయంతో వారిని అడ్డు తొలగించాడేకాని ఏం బావుకున్నట్లు? ఆ నేరం చేయకపోయినా అతనికే వచ్చేది'' అని నిట్టూర్చాడు మదన్.

అదేరోజు జపాన్ ప్రభుత్వం నుంచి డాక్టర్ మదన్‌కి ఒక ఉత్తరం వచ్చింది. 'పరిష్కారం దొరకని హత్యానేరాలను కూపీతీసినందుకు వారి జాతీయ దినాన సన్మానించదలచినట్లు బంగారు పతకం, నగదు, ప్రశంసాపత్రం, గౌరవబిరుదం ఇయ్యనున్నట్లు' అందులో ఉంది.

'నేను పైకి రావాలనుకొని తానుపాతాళంలోకి క్రుంగిపోయి నన్ను పైకి తీసుకువచ్చాడన్నమాట సకినోవా? అందుకే అంటారు ఎవరికేది ప్రాప్తమో' అని అనుకున్నాడు డాక్టర్ మదన్.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, నవంబర్ 1987** ✪

# అంతరిక్షంలో ఆరు రోజుల ఖైదు

సూర్యునికి తొమ్మిది గ్రహాలున్నాయి. అవి బుధ, శుక్ర, భూమి, అంగారక, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్, ఫ్లూటో అనేవి. వీటిలో సూర్యునికి అతి సమీపంగా ఉన్న గ్రహం-బుధుడు. ఇది చాలా చిన్నది. దీనిమీద గాలి కాని నీరుకాని బొత్తిగా లేవు. సూర్యుని నుంచి భూమి తొమ్మిది కోట్ల మైళ్ళ దూరంలో వుండే, బుధుడు మూడు కోట్ల మైళ్ళ దూరంలోనే వున్నాడు. అందువల్ల అక్కడ భరింపరాని వేడిమి ఆ వేడిమికి సీసం కూడా కరిగిపోతుంది. ఇంక అక్కడి వెలుగు తీక్షణతను కూడా భరించలేం. భూవాసులు అక్కడికి వెళ్తే ప్రత్యేకమైన అద్దాలు లేకుండా చూస్తే కళ్ళు పోతాయి. అయితే భూమి తన ఆకర్షణ శక్తితో చంద్రుడు తన చుట్టూ తాను తిరగకుండా బంధించివేసినట్లు సూర్యుడు కూడా బుధుని బంధించివేశాడు. అందువల్ల బుధుడు ఒకవైపునే ఎల్లప్పుడు సూర్యునివైపు తిప్పి వుంచుతాడు. మనం ఎప్పుడూ చంద్రుని ఒకవైపు భాగాన్నే చూసినట్లు. ఆ వైపు నిత్యమూ నిప్పులు చెరిగే ఎండ. ఇంక రెండోవైపు ఎల్లప్పుడూ కళ్ళు పొడుచుకున్నా కానరాని కటిక చీకటి.

ఇంక రెండవదైన శుక్రుడు. దీని పరిమాణం ఇంచుమించు భూమి అంతే ఉంటుంది. అయితే అక్కడి వాతావరణం భూమి మీదకంటే ఎన్నోరెట్లు ఎక్కువగా ఉంటుంది. అక్కడ నిత్యమూ మనం ఊహించలేనంతటి భయంకరమైన ధూళి మేఘాలమూలంగా వాతావరణం కప్పబడి ఉండడంతో ఎంతటి శక్తిమంతమైన టెలిస్కోప్‌ల ద్వారా కూడా దాని ఉపరితలం మనకి కనిపించదు.

బుధగ్రహం మీద గాలి, నీరు బొత్తిగా లేకుండడంతో ఆ గ్రహం ఆవిర్భవించినప్పటినుంచీ భూమి మీద లాగా ఏవిధమైన వాతావరణ మార్పులకూ గురికాకుండా ఉండిపోయింది. అందువల్ల దీనిని పరిశోధించడం వల్ల సౌర మండల ఆవిర్భావ రహస్యం బయల్పడవచ్చు. అలాగే భూమికీ, శుక్రునికీ ఉన్న అనేక పోలికల దృష్ట్యా భూమి కూడా ఒకప్పుడు శుక్రుని వలెనే వుండి క్రమేపీ ఇప్పటిలా పరిణామం చెందిందని కొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం. అందువల్ల దీనిని పరిశీలించడం వల్ల భూమి ఆవిర్భావం, పరిణామం గురించిన అనేక రహస్యాలు తెలియవచ్చునని వారి విశ్వాసం.



కథా నిలయం
శ్రీకాకుళం

ఈ రెండు గ్రహాలను పరిశోధించే ఉద్దేశంతో "స్పేస్ స్టేషన్-వీనస్" అన్న పేరుతో అంతరిక్షంలో ఉండే పరిశోధనా కేంద్రాన్ని స్థాపించారు. అమెరికా, భారత దేశాలు సంయుక్తంగా ఏర్పరచిన ఈ కేంద్రంలో రెండు దేశాలకు చెందిన శాస్త్రవేత్తలూ ఉంటారు. బుధ, శుక్రగ్రహాలను పరిశోధించడంతోపాటు ఈ కేంద్రం నిర్వహించే మరో ముఖ్యమైన కార్యం కూడా ఉంది. అది సూర్యగోళ పరిశోధన. సూర్యుని నుంచి సౌర పవనం (సోలార్ విండ్), అల్ట్రా వయొలెట్ కిరణాలు, గామా కిరణాలు ఇంకా ఎన్నో శక్తిమంతమైన ప్రసారాలు వెలువడుతుంటాయి. అయితే భూ వాతావరణం వీటిలో చాలా భాగాన్ని హరించివేయడం వల్ల, భూమిపై నుంచి వీటిని సమగ్రంగా పరిశోధించగలగడం అసాధ్యం. ఈ స్పేస్ స్టేషన్ నుంచి ఈ పరిశోధనను నిర్దుష్టంగా జరుపవచ్చు.

స్పేస్ స్టేషన్‌లోని శాస్త్రజ్ఞులు నిత్యమూ రేడియోద్వారా భూమితో సంబంధాలు కలిగివుంటారు. అయితే ఒక్కొక్కప్పుడు సూర్యుని మీద ఉండే మచ్చల సంఖ్య పెరగడం, సూర్యుని నుంచి ఎగసే జ్వాలలు (సోలార్ ఫ్లేర్స్) అధికం కావడం వంటి కారణాల మూలంగా, అటువంటప్పుడు ఈ రేడియో ప్రసారాలకి అంతరాయం కలుగుతుంటుంది. అయినా అటువంటివి ఎక్కువ రోజులు తీవ్రంగా ఉండవు కనుక, ఆ కారణంగా కలిగే ఇబ్బందులు అంత ముఖ్యమైనవికావు. అవసరమైనప్పుడు భూమి నుంచి స్పేస్ షటిల్ ద్వారా కావలసిన ఆహార పదార్థాలు, శాస్త్రీయ సామగ్రి వంటి వాటిని వెంటపెట్టుకుని కొత్త

శాస్త్రీయ బృందాలు స్పేస్ స్టేషనకి వస్తుంటాయి. పాత బృందాలు అదే షటిల్‌లో తమ పరిశోధనలకు సంబంధించిన రికార్డులను తీసుకుని భూమికి తిరిగివెళ్తుంటాయి.

స్పేస్ స్టేషన్- వీనసను శుక్ర, బుధ గ్రహాల మధ్యన ఏర్పరచారు. ఆ రెండు గ్రహాల పరస్పర ఆకర్షణ శక్తి సమమయ్యే బిందువుకి కొంతదూరం శుక్రుని వైపుగా ఈ స్టేషన్ కక్ష్యను రూపొందించారు. అందువల్ల అది శుక్రుని ఉపగ్రహంలాగా దానిచుట్టూ ఆ కక్ష్యలో పరిభ్రమిస్తూంటుంది.

ప్రస్తుతం ఈ స్పేస్ స్టేషన్‌లో ఇద్దరు శాస్త్రజ్ఞులు వున్నారు. వారు భారతదేశంలోని షార్ కేంద్రానికి చెందిన డాక్టర్ రావ్ అమెరికాలోని నాసా కేంద్రానికి చెందిన ప్రొఫెసర్ బర్టన్‌లు. ఆ రోజు డాక్టర్ రావ్ సూర్యగోళం గురించి పరిశోధనలు చేస్తున్నారు. ఇంతలో రాడార్ స్క్రీన్ మీద ఏదో చుక్క కనిపించింది. అది అంతకుముందు పరిచయం అయినది కాకపోవడంతో బర్టన్‌ని పిలిచి చూపించాడు.

కంప్యూటర్ ద్వారా, ఇతర పరికరాల ద్వారా అదేమిటో గుర్తించారు. "మైగాడ్! ఇది ఉల్క (మిటియోర్). మహావేగంతో ఇటేవస్తోంది. దీని వ్యాసం ఒకటి రెండు అడుగుల కంటే ఎక్కువ వుండకపోవచ్చు. కానీ అంతటి వేగంతో ఆ అంతరిక్ష శిల వచ్చి గుద్దుకుంటే చాలు. స్పేస్ స్టేషన్ తీవ్రంగా దెబ్బతింటుంది" అన్నాడు బర్టన్ ఆందోళనగా. అంతరిక్షంలో ఇటువంటి ఉల్కలు అసంఖ్యాకంగా పరిభ్రమిస్తుంటాయి. కనుక అప్పుడప్పుడూ ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తుంటాయి. అయితే వాటిని వెంటనే గుర్తించి ఆటోమేటిక్‌గా అంతరిక్షంలోనే ఎదుర్కొనే మిసైల్స్ ఉంటాయి. ఇవి వాటిని ప్రేల్చి వేసి నుగ్గు నుగ్గు చేయడమో, లేదా పెద్దవైతే తమ తాకిడితో వాటి గమన మార్గాన్ని మార్చేటట్లు చేయడమో చేస్తాయి.

ఆ ఉల్క అంతకంతకూ చేరువవుతున్నట్లు రాడార్ స్క్రీన్ చూపిస్తోంది. నిజానికి ఆ రేంజిలోకి వచ్చిన ఉల్కని అప్పటికే ఆటోమేటిక్ మిసైల్ వెళ్లి ఢీకొని పేల్చివేయాలి. కాని అలా జరగకపోవడంతో ఆ సిస్టంని చెక్ చేయడానికి వెళ్లాడు డాక్టర్ రావ్.

"ప్రొఫెసర్. ఉయ్ ఆర్ ఔట్. ఈ ఆటోమేటిక్ సిస్టంలో ఏదో లోపం వచ్చింది. దాన్ని సరిచేసే లోపలే ఆ ఉల్క వచ్చి మన స్టేషన్‌ని గుద్దుకోవడం ఖాయం. ఓన్లీ ప్రావిడెన్స్ షుడ్ హెల్ప్ అజ్" అన్నాడు రావు ఆందోళనగా.

వెంటనే బర్టన్ శుక్ర తలానికి వ్యతిరేక దిశలో స్పేస్ స్టేషన్‌ని అంటివున్న రాకెట్‌ని పేల్చాడు. ఒక్క సారిగా రాకెట్ పైభాగం నుంచి జ్వాల అంతరిక్షంలోకి ఎగసింది. దానికి వ్యతిరేక దిశలో అంటే శుక్రుని వైపుకి స్పేస్ స్టేషన్ కదిలింది. ఈ చిన్న రాకెట్ ప్రేల్చినందువల్ల స్పేస్ స్టేషన్ కక్ష్యలో మార్పు రావడం కానీ, శుక్రగ్రహ ఆకర్షణను ఛేదించుకుని వెళ్లిపోవడంగాని జరుగదు. వేగంగా వెళ్ళే కారుకో, బస్సుకో సడన్ బ్రేక్ వేస్తే ఎగిరి పడ్డట్టు ఒక్క జెర్క్ ఇస్తుంది అంతే. ఆ సమయంలో అది శుక్రుని దిశగా సాగుతోంది. రాకెట్‌లో ఉన్న ఇంధనం ఖర్చయ్యే వరకూ ఇలా జరుగుతుంది. ఆ తర్వాత అవసరమైనప్పుడు శుక్ర గ్రహం దిశగా జ్వాల వచ్చేట్లు మరో రాకెట్‌ను ప్రేల్చి స్పేస్ స్టేషన్‌ను యథాస్థానానికి తీసుకు వెళ్ళవచ్చు. క్రియ ప్రతి

క్రియలు (యాక్షన్ అండ్ రియాక్షన్) ఎప్పుడూ సమంగానూ, ఎదురు బదురు దిశలలోనూ ఉంటాయన్న న్యూటన్ సూత్రాన్ని అనుసరించి ఎప్పుడూ, రాకెట్‌ని ప్రేల్చినప్పుడు దాని ఇంధన జ్వాలకు వ్యతిరేక దిశలో రాకెట్ పయనిస్తుంది. ఈ రాకెట్లు స్పేస్ స్టేషన్‌కి బిగించి ఉంటాయి కనుక వాటితో పాటే స్పేస్ స్టేషన్ కూడా ఆయా దిశలలో వెళ్తుంది.

మహావేగంతో వస్తున్న ఆ ఉల్క స్పేస్ స్టేషన్‌ని సూటిగా గుద్దుకుంటే అది సర్వనాశనం కావడం. వాళ్లిద్దరూ కూడా అంతరిక్షంలో తునాతునకలై పోవడం ఖాయం. అందుకనే ఖాయంగా చనిపోతాడనుకున్న రోగికిచివరి ప్రయత్నంగా గరళం పోసినట్లు ఈ విధంగా చేశాడు బర్టన్. మరి కొద్ది నిమిషాలలో ఆ ఉల్క వచ్చి గుద్దుకొంటుంది. ఈ లోగా స్పేస్ స్టేషన్ స్థానాన్ని మార్చగలిగితే అదృష్టం బాగుంటే ఆ ఉల్క పక్కనుంచి దూసుకుపోవచ్చు. అప్పుడు ప్రమాదం నుంచి బయట పడవచ్చు. రాకెట్ జ్వాల శుక్రునికి వ్యతిరేక దిశలో ఉండేటట్లు పేల్చడం వల్ల స్పేస్ స్టేషన్ శుక్రునివైపు ప్రయాణం మొదలుపెట్టింది. దీనికి శుక్రుని గురుత్వాకర్షణ శక్తికూడా కలియడంతో, గిలకతో నీళ్ళ చేదని లాగినట్లు అది మరింత వేగం పుంజుకుంది. బర్టన్ ఊహించిన విధంగానే స్పేస్ స్టేషన్ శుక్రగ్రహం వైపు సాగింది తన కక్ష్యను మార్చుకుని. కాని ఈలోగానే వస్తుందనుకున్న ఉపద్రవం రానేవచ్చింది.

ఉల్క మహావేగంగా వచ్చి స్పేస్ స్టేషన్‌ని గుద్దుకుంది. అయితే అప్పటికే దాని స్థానం మారి వుండడం వల్ల సూటిగా కాకుండా ఒకవైపున గుద్దుకుని వెళ్లిపోయింది. ఆ అదురుకి ఆకస్మికంగా భూకంపం వచ్చినట్లు స్పేస్ స్టేషన్ అటూ ఇటూ వూగిపోయింది. ఆ తాకిడికి చివరి భాగం విరిగిపోయి అంతరిక్షంలోకి ఎగిరిపోయింది. ఆ భాగంలోనే రేడియో ఎక్విప్‌మెంట్ ఉంది. ఆహారం, నీరు నిల్వలలో అత్యధిక భాగం అందులోనే వుంది. భయంకరమైన తుఫానులో చిక్కుకున్న కొయ్య ఓడలాగా శిథిలమయిపోయింది ఆ స్పేస్ స్టేషన్.

షాక్ నుంచి తేరుకున్నాక తమ స్పేస్ స్టేషన్ పరిస్థితిని పరిశీలించారు డాక్టర్ రావ్, బర్టన్‌లు.

ఆహార పదార్థాలు, నీరు చాలా తక్కువగా మిగిలాయి. అవి మహా అయితే పదిపన్నెండు రోజులు మించిరావు. ఇంధనం కూడా చాలా తక్కువగానే వుంది. మామూలుగా స్థిర కక్ష్యలో తిరుగుతున్న స్పేస్ స్టేషన్‌కి ఇంధనం అవసరం అంత ఎక్కువ ఉండదు కనుక కావలసిన దానిని ఎప్పటికప్పుడు స్పేస్ షటిల్ ద్వారా తెప్పిస్తుంటారు. వెంటనే ఈ ప్రమాదం వార్త రేడియో ద్వారా భూకేంద్రానికి పంపితే వారు వెనువెంటనే స్పేస్ షటిల్‌ను ఇంజనీర్లతోనూ ఇతర సిబ్బందితోనూ పంపగలరు. అప్పుడు వాళ్ళు వచ్చి స్పేస్ స్టేషన్‌కి కావలసిన రిపేర్లు చేయగలరు. ఆ షటిల్‌లోనే కావలసిన ఆహార పదార్థాలూ, నీరు పంపగలరు. కాని ఈ వార్త భూమికి జేరడం ఎలా! రేడియో ఎక్విప్‌మెంట్ పూర్తిగా నాశనం అయిపోయి అంతరిక్షంలోకి ఎగిరిపోయింది.

"నాకో ఆలోచన వస్తోంది. ప్రతిరోజూ క్రమం ప్రకారం మనం భూకేంద్రంతో మాట్లాడాలి కదా? మన దగ్గరనుంచి రెండు మూడు రోజులు ఏ కబురూ లేకపోతే మనకేదో ప్రమాదం జరిగిందని వాళ్ళు

అర్థం చేసుకోగలరు. వెంటనే స్పేస్ షటిల్‌ను పంపగలరు." అన్నాడు ప్రొఫెసర్.

లాభంలేదు ప్రొఫెసర్ బర్టన్ అంటూ తల అడ్డంగా ఆడించాడు రావ్.

"ఇప్పుడు సోలార్ ఫ్లేర్స్ చాలా ఎక్కువగా వున్నాయి. సూర్యుని మీద మచ్చల సంఖ్య కూడా పెరిగింది. ఇటువంటప్పుడు మన నార్మల్ ప్రసారాలు జామ్ అయిపోతాయి. ఈ కారణంచేత మన దగ్గరనుంచి రేడియో ప్రసారాలు అందడం లేదని భావిస్తారు తప్ప మనం ఏదో ప్రమాదంలో చిక్కుకున్నామని అనుమానించరు. తీరా వాళ్లు అసలు విషయం గ్రహించి స్పేస్ షటిల్‌ను పంపేటప్పటికి మనం ఇక్కడ శవాలుగా మారి అంతరిక్షంలో తిరుగుతుంటాం. సూర్యుని మీద అల్లకల్లోలం చాలా ఉధృతంగా ఉంది. ఇది తగ్గడానికి ఇంకా కొన్ని రోజులు పడ్తుంది. అందువల్ల కనీసం కొద్ది రోజులలోనైనా మన పరిస్థితి వారు గ్రహిస్తారేమోననుకొంటే ఆ అవకాశమూ లేదు" అంటూ వివరించాడు.

"బాడ్‌లక్. క్రిందటిసారి స్పేస్ షటిల్ వచ్చి గట్టిగా పదిరోజులు కాలేదు. మామూలుగా వచ్చేది రావాలంటే మళ్ళీ ఇంకో నెలన్నరైనా పడ్తుంది. అప్పటికి అంతా అయిపోతుంది" అంటూ తలపట్టుకున్నాడు ప్రొఫెసర్ బర్టన్.

కొంచెం ఆలోచించి "మన దగ్గర ఇంకా రాకెట్‌లు ఉన్నాయి. ఫ్యూయల్ కూడా ఉంది. మెసేజ్ రాసి రాకెట్ ద్వారా భూమికి పంపిస్తే!" అన్నాడు డాక్టర్ రావు.

"పంపవచ్చు. ఏం ప్రయోజనం? మొదటిది. ఇప్పుడు మన దగ్గర వున్న యంత్రాలన్నీ బాగా దెబ్బతిన్నాయి. వీటిని సరిచేసి సరైన టైములో, యాంగిల్‌లో రాకెట్‌ని పంపడం చాలా టైము తీసుకుంటుంది. ఇది త్వరలోనే చేశామనుకున్నా ఈ రాకెట్‌వెళ్ళి మెసేజ్ అందజేసి వాళ్లు స్పేస్ షటిల్‌ని పంపేటప్పటికి అది వచ్చేసరికి కనీసం ఇరవై రోజులు పడ్తుంది. అప్పటికి మన పని ఖాళీ" అన్నాడు డాక్టర్ బర్టన్.

"అయితే ఏమిటి గతి! అంతరిక్షంలో దిక్కులేని చావు చావ వలసిందేనా?" అన్నాడు డాక్టర్ రావు దిగాలుగా.

"చావడం ఖాయం అనుకొన్నప్పుడు దిక్కులేని చావు ఎందుకూ చావడం. వీర మరణమే పొందుదాం" అన్నారు బర్టన్.

"అంటే?"

"చూడు డాక్టర్ రావు. ఈ ఉల్క తాకిడికి మన స్పేస్ షటిల్ ఎటుపోయిందో తెలియడం లేదు. అది మాత్రం ఖాయంగా స్వతహాగా నిర్ణయించిన కక్ష్యలో ఉండదు. శుక్రునివైపుకి నెట్టబడి వుంటే క్రమంగా శుక్రుని చుట్టూ ప్రదక్షిణాలు నెమ్మదిగా చేస్తూ చేస్తూ అంతకంతకీ దగ్గరవుతూ చివరికి అమెరికన్ స్పేస్ లాబ్ భూమి మీద కూలిపోయినట్లు శుక్రుని మీద కూలిపోతుంది. కొన్ని నెలలకో, కొన్ని సంవత్సరాలకో చివరికి ఇది తప్పదు. ఒకవేళ బుధగ్రహం వైపు నెట్టబడి వుంటే అప్పుడూ బుధగ్రహం చుట్టూ తిరుగుతూ కొన్ని నెలలకో, సంవత్సరాలకో దానిమీద కూలిపోక తప్పదు. ఇవి కాకపోతే ఈసారి ఏ పెద్ద ఉల్కో

ఉంటే అది మనల్ని శాశ్వతంగా ఎటో నెట్టివేయవచ్చు. సౌర మండలం లోని ఏ గోళం మీదైనా పడ్తామో, శాశ్వతంగా ఈ మండలానికి గుడ్‌బై చెప్పి ఇతర నక్షత్రమండలాల వైపు వెళ్లిపోతామో" అన్నాడు బర్టన్.

"మైగాడ్. ఇప్పుడేమిటి చేయడం? మన పరిస్థితి చూస్తే నాకు చంద్రునిపై దిగడానికి బయలుదేరిన 'అపోలో -13' అంతరిక్ష యాత్రికుల అనుభవం గుర్తుకివస్తోంది. వాళ్ల నౌక చెడిపోవడంతో చంద్రుని మీద దిగలేకభూమికి తిరిగి రాలేక అంతరిక్షంలో బందీలైపోయి, అతి కష్టంమీద తిరిగి రాగలిగారు."

"అయితే ఒకతేడా వుంది. వారిని గురించి, వారి నౌకకు కలిగినప్రమాదం గురించీ ప్రపంచానికంతా తెలుసు. అందుకే వారి క్షేమం గురించి ప్రపంచంలోని అన్ని దేశాలూ, అందరు ప్రజలూ వారు తిరిగివచ్చే దాకా ఎంతో ఆందోళన చెందారు. లోకమంతా ఒక్క సంఘటనపై దృష్టిని కేంద్రీకరించింది. ఇది మినహా ప్రపంచ చరిత్రలో ఇలాంటి సంఘటన మరోటి లేదు. మన సంగతి ఎవరికీ తెలీదు. కనుక మనల్ని గురించి పట్టించుకొనేవారు లేరు. అయ్యో అని సానుభూతి చూపించేవారు లేరు."

"నువ్వు చెప్పింది నిజం. మన పట్ల సానుభూతి చూపేవారు వున్నా లేకపోయినా అపోలో -13 యాత్రికుల లాగా మనం కూడా ఎలాగోలా బయటపడాలి."

"దీనికి ఒక్కటే మార్గం. మనం భూమికి వెళ్ళిపోవడం"

'ఏమిటి. తుక్కుతుక్కయిన ఈ స్పేస్ షటిల్‌లోనా?"

"నో.... దటీజ్ జస్ట్ ఇంపాజిబుల్. మన దగ్గర ఎమర్జెన్సీ లైఫ్ బోట్స్ రెండున్నాయి కదా. ఒకదానిలో మనం భూమికి వెళ్ళిపోవాలి. ఇప్పుడు మనం ఉన్నది బుధ శుక్ర గ్రహాల ఆకర్షణలు పరస్పరం న్యూట్రలైజ్ అయ్యే స్థానానికి దగ్గరలో. కనుక ఇక్కడనుండి టేక్ ఆఫ్ సులువు. ఇందుకు ఎక్కువ ఇంధనం ఖర్చుకాదు. ఇప్పుడు మన దగ్గరవున్న సోఫిస్టికేటెడ్ ఫ్యూయల్‌తో రోజుకి కోటి మైళ్ళ కంటే ఎక్కువ దూరమే ప్రయాణం చేయవచ్చు. మన వెహికిల్ భూమివైపు వెళ్లిన కొద్దీ దాని ఆకర్షణ కూడా పనిచేసి నౌక ఇంకా వేగాన్ని పుంజుకుంటుంది. మొత్తంమీద ఆరేడు రోజుల్లో భూమిని చేరగలం అప్పటివరకు మనం, ఉన్న ఆహారం, నీరు, ఇంధనాలని జాగ్రత్తగా వాడుకుని గడుపుకోవాలి. సరైన యాంగిల్‌లో బ్లాస్ట్ చేస్తే ఎలాగోలా భూమిని చేరవచ్చు" అన్నాడు బర్టన్.

"కాని కాని మన దగ్గర ఫ్యూయల్ చాలా తక్కువ ఉంది. దీనితో టేక్ ఆఫ్‌కి ఇబ్బందేమీ ఉండదు. ఆ తర్వాత జర్నీకి కూడా ప్రాబ్లం ఉండదు. అయితే వచ్చిన చిక్కల్లా లాండింగ్‌తోనే. భూ వాతావరణంలో మహా వేగంతో ప్రవేశించాక, రెట్రో రాకెట్స్ పేల్చి (భూమి ఆకర్షణకి వ్యతిరేక దిశలో) దాని వేగం కంట్రోల్ చేయకపోతే నౌక వాతావరణంలోనే మండిపోతుంది. లేదా మహావేగంతో వెళ్లి సముద్రంలో కూలిపోతుంది. అదీగాక పోతే నేలమీద ఎక్కడోకూలి భయంకర సంక్షోభాన్ని సృష్టిస్తుంది. రెట్రో రాకెట్స్‌కి అవసరమైనంత ఇంధనం మన దగ్గర లేదు" అన్నాడు రావు.

"ఈ సమస్యను ఒక విధంగా ఎదుర్కోవచ్చు. మన దగ్గర వున్న సోఫిస్టికేటెడ్ ఫ్యూయల్‌తో ఇనీషియల్ బ్లాస్టినే గంటకి 13 లక్షల మైళ్ళ వేగంతో ఉండేటట్టు చేస్తే, మన నౌక అంతటి యాక్సిలరేషన్ పొందగలదు

కనుక టేక్ ఆఫ్‌కి ఎటువంటి ప్రాబ్లం ఉండదు. ఆ యాక్సిలరేషన్ మెయిన్‌టెయిన్ అయినంతకాలమూ ఫర్వాలేదు. ఈలోగా భూమికి దగ్గరవుతుంటాం కనుక దాని ఆకర్షణ శక్తి కూడా కలిసి నౌక వేగం పెరుగుతుంది. ఎటొచ్చీ మార్గ మధ్యంలో ఇతర గోళాల వ్యతిరేక ఆకర్షణ శక్తి మూలంగా వేగం తగ్గితే అప్పుడు మళ్ళీ రాకెట్లని పేల్చి ఇంధనం ఖర్చు చేయవలసి ఉంటుంది. నా అంచనా ప్రకారం ఇటువంటి సందర్భాలు చాలా తక్కువ వస్తాయి. కాకపోయినా మనం చేయగలిగింది ఇంకేమీ లేదు. రిస్కు తీసుకోవలసిందే. దీని విషయం అలా ఉంచు. ఇప్పుడు టేక్ ఆఫ్‌కి కరెక్ట్ యాంగిల్ నిర్ణయించడం కూడా చాలా కష్టం. ఎందుకంటే మన మెషినరీ అంతా దెబ్బతింది. దీనిలో ఆఖరుకి ఒక్క సెకను (డిగ్రీలో 3600 వంతు) తేడా వచ్చినా మన నౌక భూమికి శాశ్వతంగా ఉపగ్రహంగా మారిపోవడమో, ఈ సౌర మండలాన్నే విడిచిపెట్టి శాశ్వతంగా అనంతవిశ్వంలోకి వెళ్ళిపోవడమో జరుగుతుంది. అందుకే ప్రస్తుతం మనం తీసుకుంటున్నది ప్రతిదీ ఛాన్సే. అయితే ఛాన్స్, తప్పకుండా అవకాశాలు మెరుగయ్యేందుకు మన అనుభవం పనికి వస్తుంది. ఇందాకనే అన్నాను, అంతరక్షంలో దిక్కులేని చావు చచ్చేబదులు, వీర మరణమే పొందుదామని. మన ప్రయత్నాలు ఫలించి భూమికి జేరగలిగితే విజయం పొందిన వీరులమవుతాం. లేకుంటే వీరమరణం చెందిన అంతరిక్ష యాత్రికులం అవుతాం'' అన్నాడు ప్రొఫెసర్ బర్టన్ ఏమాత్రం ఆందోళన పడకుండా.

''ఓ.కె. లెటజ్ ప్రొసీడ్ దెన్'' అన్నాడు డాక్టర్ రావు.

స్పేస్ స్టేషన్‌కీ, స్పేస్ షటిల్‌కీ అనుకోని ప్రమాదాలు సంభవిస్తే ప్రాణాలు రక్షించుకోడానికి లైఫ్ బోట్స్‌ని ఏర్పాటు చేస్తారు. ఇవి ఓడల నంటి వుండేటటువంటివి కావు. ప్రాణాలు రక్షిస్తాయి కాబట్టి ''లైఫ్‌బోట్స్'' అని అన్నా నిజానికి ఇవి మీడియం సైజు రాకెట్‌లు. వీటిలో ఇద్దరు ముగ్గురు మనుష్యులు, వారికి అవసరమైన సామగ్రి, యంత్రాలు, ఇంధనం పట్టేంత జాగా వుంటుంది. యాత్రని సక్రమంగా నిర్వహించడానికి కంప్యూటర్ కూడా ఉంటుంది. అత్యవసర పరిస్థితులలో ఈ రాకెట్లను ఉపయోగించి భూమికి కాని, ఇతర గ్రహాల మీదికి కాని వెళ్తారు అంతరిక్ష యాత్రికులు.

ఉల్క తాకిడికి ఉన్న రెండు లైఫ్ బోట్‌లలోనూ ఒకటి దెబ్బతింది. రెండోది బాగానే వుంది. అదృష్టవశాత్తు దాని కంప్యూటర్ కూడా ఏమీ కాలేదు. దాంతో బ్లాస్ట్ ఆఫ్‌కి కావలసిన టైం, యాంగిల్‌లను నిర్ణయించారు. బర్టన్, రావ్‌లు. కంప్యూటర్‌కి, వారి ప్రయాణ వివరాలను ఫీడింగ్ ఇచ్చేశారు. ఇక వెంట వెంటనే ఈ లైఫ్ బోట్‌లోకి ఆహార పదార్థాలు, నీరు, ఇంధనం, ముఖ్యమైన రికార్డులను తరలించారు. దీంట్లో కూడా రేడియో ట్రాన్స్‌మిటర్ ఉంటుంది కాని అది బలహీనమైనది కావడంతో భూమికి సమీపిస్తేనే గాని, దాని ప్రసారాలు భూకేంద్రాలకు అందవు. టేక్ ఆఫ్‌కి సరిగ్గా నాలుగు గంటల ఇరవయ్యారు నిమిషాల ఏబది ఒక్క సెకండ్లుగా మహూర్తాన్ని నిర్ణయించింది కంప్యూటర్. అంటే సుమారు మరో గంట తర్వాత, అంతా కంప్యూటర్ కంట్రోల్ కావడంతో సరిగ్గా నాలుగు గంటల ఇరవయ్యారు నిమిషాల ఏబది ఒక్క సెకండ్లకు నిర్దేశించిన యాంగిల్‌లో బ్లాస్ట్ ఆఫ్ అయింది. చూపుకి అందనంతటి వేగంతో ఆకాశంలోకి దూసుకుపోయింది లైఫ్‌బోట్.

* * * *

ఆరు రోజులు గడిచాయి. ఎంత పొదుపుగా వాడినా ఇంధనం బాగానే ఖర్చవుతోంది. వాతావరణంలో ప్రవేశించాక రెట్రో రాకెట్లను పేల్చి లైఫ్ బోట్ వేగాన్ని అదుపుచేయకపోతే నౌక మండిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రతి గ్రాము ఇంధనాన్ని కూడా ఎంతో జాగ్రత్తగా వాడుతున్నారు.

ఏడో రోజు వచ్చింది.

లైఫ్ బోట్ భూ వాతావరణంలో ప్రవేశించింది. నీలం, ఆకుపచ్చకలిసిన రంగుతో, తెల్లని మబ్బులతో అద్భుతంగా మెరిసిపోతోంది. భూమి. "నేల మీద కాలిడితే వీసాలు, పాస్‌పోర్టులు అంటూ గిరులు గీసుకు కూర్చుంటాం. అంతరిక్షం నుంచి మొత్తం భూమిని ఒక్క కంటితో చూడగలుగుతున్నాం" అనిపించింది వారికి. తూర్పు పశ్చిమ దేశాల శాస్త్రజ్ఞులు కలిసి మొత్తం భూమిని ఒకటిగా చూడగలుగుతుండడం ఒక విచిత్రమైన అనుభూతి వారికి.

లైఫ్‌బోట్‌లోని మీటర్ భూ వాతావరణం సాంద్రతని ఒత్తిడిని తెలుపుతోంది. సాంద్రత పెరిగినకొద్దీ రాపిడి ఎక్కువై మండిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. ఆ ప్రమాద స్థాయిని గుర్తించి ఆ సమయానికి రెట్రోరాకెట్‌ను పేల్చడానికి కంప్యూటర్‌కి ఫీడింగ్ ఇచ్చాడు ప్రొఫెసర్ బర్టన్.

సరిగ్గా ఆ సమయానికి రెట్రో రాకెట్ పేలి స్పేస్ బోట్ వేగాన్ని తగ్గించింది.

ఇంధనం పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. కనీసం ఇంకా నాలుగుసార్లన్నా రెట్రో రాకెట్లను పేల్చవలసి ఉంటుంది. వీటిలో చివరిది చాలా ముఖ్యం. నౌక భూమి మీద పడుతున్న వేగానికి సమానమైన వేగంతో రెట్రో రాకెట్‌ను పేల్చినపుడు రెండు విరుద్ధ శక్తుల మూలంగా నౌక వేగం పూర్తిగా పోయి సాఫ్ట్ లాండింగ్ సాధ్యం అవుతుంది. అది లేకుండా భూమిని గుద్దేసుకుని సర్వనాశనం అవుతుంది. అందువల్ల ఈ చివరి దానికోసం ఇంధనం ఉంచడం తప్పనిసరి. అలా ఉంచితే వాతావరణంలో ప్రేల్చవలసిన రాకెట్లకి తక్కువ అవుతుంది. ప్రేల్చకపోతే వాతావరణం అంతకంతకీ దట్టం అవుతుంది కనుక తప్పకుండా మండిపోతుంది నౌక. ముందు నుయ్యి, వెనుక గొయ్యిగా వుంది పరిస్థితి.

లైఫ్ బోట్ డిజైన్‌ని, డీటైల్స్‌ని ముందు పెట్టుకుని శ్రద్ధగా చూస్తూ, ఏం చేయాలి అని దీర్ఘంగా ఆలోచించ సాగాడు డాక్టర్ రావ్.

ఇంధనం ఇంక కేవలం ఒక్క రెట్రో రాకెట్ పేల్చడానికే సరిపోతుంది. లైఫ్ బోట్ భూమికి లక్షన్నర అడుగుల ఎత్తున వుంది.

మరొక్కపది నిమిషాలలో ఇంకో రెట్రో రాకెట్ ప్రేల్చకపోతే వాతావరణంలో అది మండిపోవడం ఖాయం. ఆ ఒక్కటీ పేలిస్తే ఇంక వాతావరణంలో ప్రేల్చవలసిన అవసరం ఉండదు.

కాని అసలుది సాఫ్ట్ లాండింగ్ టైంలో కావాలి. అప్పుడు లేకపోతే భూమిని గుద్దుకోవడం ఖాయం.

ఆలోచించే వ్యవధి లేదు.

"డాక్టర్ రావ్. మనకి వ్యవధి లేదు. సాఫ్ట్ ల్యాండింగ్ సంగతి తర్వాత ఆలోచిద్దాం. చివరి రెట్రో

రాకెట్‌ను ప్రేల్చేస్తున్నాను" అన్నాడు బర్టన్.

"ఓ.కే. ప్రొసీడ్" అన్నాడు బర్టన్.

వెంటనే కంప్యూటర్‌కి ఫీడింగ్ ఇచ్చేశాడు బర్టన్.

సరిగ్గా సరియైన సమయానికి చివరి రెట్రో రాకెట్ ప్రేలింది. నౌక వేగం బాగా తగ్గిపోయి గాలిలో మండిపోయే ప్రమాదం తొలగిపోయింది.

భూమిని సమీపిస్తున్న కొద్దీ నౌక వేగం మళ్లీ పుంజుకుంటోంది. చివరికి వేగంగా వెళ్లి భూమి మీద పడ్తుందో, సముద్రంలో పడ్తుందో! భూమి మీద పడ్తే ఆటం బాంబ్ ప్రేలినట్లుగా ప్రేలిపోయి విపరీతమైన నష్టం కలుగుతుంది. చివరి దశలో దుర్మరణం పొందవలసి రావడం బాడ్‌లక్ అనుకున్నారు వాళ్ళు.

ఇంతలో లైఫ్ బోట్ డిజైన్ చూస్తున్న రావ్‌కి ఒక ఆలోచన వచ్చింది ఆకస్మికంగా.

"ప్రొఫెసర్. డిజైన్‌లో ఈ భాగం చూడండి. దీని డిటైల్స్ చదవండి" అన్నాడు.

అది చదివి సంతోషంతో "వండర్‌ఫుల్" అని అరిచి "గో ఎ హెడ్. స్విచ్ ఆన్ చేయండి" అన్నాడు బర్టన్.

డాక్టర్ రావు ఆ నౌకలో ఒక స్విచ్‌ని ఆన్ చేశాడు.

కొద్ది నిమిషాలలో వారి నౌకను ఎవరో పైనుంచి బలంగా పైకి గుంజుతున్నట్లనిపించింది..

ఆ లైఫ్ బోట్‌కి పైభాగాన పారాచ్యూట్‌ని అమర్చారు. స్విచ్ ఆన్ చేసినప్పుడు పై భాగం తెరుచుకుని ప్యారాచ్యూట్ పైకి ఎగసి గాలిలో విచ్చుకుంటుంది. గాలి ఒత్తిడి ఎంత ఎక్కువగా ఉంటే అంత బలంగా అది పైకి లాగుతుంది. అందువల్ల నౌక వేగం ఇంచుమించు పూర్తిగా తగ్గిపోయి నెమ్మదిగా క్రిందికి దిగుతుంది. అప్పటివరకూ లైఫ్ బోట్‌ను ఉపయోగించవలసిన అవసరం రాకపోవడం, రెట్రో రాకెట్స్ మీదనే వారి దృష్టి ఉండడంతో ఈ ప్యారాచూట్ అరేంజ్‌మెంట్ గురించి వారికి ఆలోచనే రాలేదు. ఎప్పుడైతే బోట్‌ను పైకి గుంజిన అనుభూతి కలిగిందో వెంటనే బర్టన్ "డాక్టర్ ఇట్ వర్క్‌డ్" అంటూ సంతోషంతో అరిచాడు.

డాక్టర్ రావ్ వెంటనే రేడియో ట్రాన్స్‌మీటర్ ఆన్ చేసి భూ కేంద్రాలకు తమ గురించి సందేశం పంపాడు. దానిని షార్, నాసా కేంద్రాలతోపాటు ప్రపంచంలోని ప్రముఖ కేంద్రాలన్నీ రిసీవ్ చేసుకున్నాయి.

"నా అంచనా ప్రకారం మనం మరో గంటలో అంటే మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కార్‌నికోబార్ సమీపంలో లాండ్ అవుతాం. సముద్రంలోనే దిగుతామో, నేలమీదే వాలుతామో తెలీదు. కాని ఈ ప్రాంతం కూడా మీ ఇండియాలో భాగమే కనుక నాకు చాలా సంతోషంగా ఉంది" అన్నాడు బర్టన్.

భూ కేంద్రాలు ప్రపంచంలోని అన్ని సర్వైలెన్స్ ఏజెన్సీలకి ఈ లైఫ్‌బోట్ వస్తున్న విషయం తెలియజేసి ఎలర్ట్ చేశాయి. అవన్నీ కూడా అది ఎక్కడ దిగినా పట్టుకోవడానికి ఆయత్తమయ్యాయి.

డాక్టర్ రావ్ తమ బోట్ పరిస్థితి, స్థానం గురించి ఆపకుండా రేడియో సందేశాలు ఇస్తూ వచ్చాడు.

బర్టన్ అంచనా వేసినట్లు అది కార్‌నికోబార్ దగ్గరే దిగుతుందని ఖాయం అయిపోయింది.

మరొక్క అరగంటలో రాజహంస నేలమీద వాలినట్లు ఆ లైఫ్ బోట్ కార్‌నికోబార్ ఐలాండ్ సముద్ర తీరం మీద దిగింది.

గస్తీ పడవలు వెంటనే వారిని రిసీవ్ చేసుకున్నాయి. ఈ వార్త వెంటనే ట్రాన్స్‌మీటర్ ద్వారా షార్, నాసా కేంద్రాలకి జేరిపోయింది.

మరొక్క మూడు గంటలలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన ప్రత్యేక హెలికాప్టర్ మద్రాస్ నుంచి బయలుదేరి కార్‌నికోబార్‌కి జేరింది. వెంటనే డాక్టర్ రావ్, ప్రొఫెసర్ బర్టన్‌లను తీసుకొని భారతదేశానికి బయలుదేరింది. వారు అంతరిక్షంలో సాధించిన విజయానికి గుర్తుగానె అన్నట్లు వారు వచ్చిన లైఫ్‌బోట్ సముద్ర తీరంలోనే నిటారుగా నిలబడి గర్వంగా తలెత్తుతున్నట్లు ఉంది.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, డిశంబర్ 1987** ✪

# ది థ్రిల్లింగ్ డెత్

కృత్రిమ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించడం ప్రారంభం అయ్యాక ప్రపంచ స్వరూపం మారిపోయింది. వీటివల్లనే ఈనాడు మనం దేశవిదేశాలలోని ఎన్నో టెలివిజన్ కార్యక్రమాలను చూడగలుగుతున్నాం. విదేశాలలోని వారితో లోకల్ కాల్సంత సులభంగా టెలిఫోన్లో మాట్లాడగలుగుతున్నాం. దేశాధినేతలు, ప్రముఖులు, ఉన్నచోటు నుంచి కదలకుండా టెలివిజన్ తెరపై ముఖాలు చూసుకుంటూ, పరస్పరం సంభాషించుకుంటూ సమావేశాలు జరుపుకోవడం సాధ్యమయింది. అంతేకాదు, ఉన్నచోటినుంచే ఒప్పందాలపై సంతకాలు చేసుకుని ఎలక్ట్రానిక్ మెయిల్ద్వారా మరుక్షణం ఒకరికొకరు అందజేసుకోవడం మామూలయింది. రానున్న తుఫానులను, ఉప్పెనలను ఈ కృత్రిమ ఉపగ్రహాలు నాలుగైదు రోజులు ముందే పసిగట్టి హెచ్చరికలు ఇస్తున్నాయి. ఇందువల్ల ప్రకృతి బీభత్సాలను ఆపలేకపోయినా వాటివల్ల కల్గే ప్రాణనష్టాలను కనిష్టస్థాయికి తీసుకురాగలగడం సాధ్యమయింది. ఇంతేకాదు భూమిలోపల ఎంత లోలోన ఏ మేరకు ఏఏ ఖనిజాలు ఉన్నదీ, జలవనరులు ఉన్నదీ కూడా ఇవి చెప్పగలవు. పంటలకు పట్టిన చీడపీడలను చూపగలవు. మిడతల దండురాకను ముందుగానే తెలుపగలవు. ఒకే పత్రిక వివిధనగరాల నుంచి ప్రచురితంచేసే ఎడిషన్లను ఒకేసారి అచ్చుకావడానికి దోహదం చేయగలవు. ఈ విధంగా కృత్రిమ ఉపగ్రహాలు అనంతమైన ప్రయోజనాలను అందిస్తూ మానవునికి అడుగడుగునా అండదండలుగా ఉంటున్నాయి. భారతదేశం ప్రయోగించిన "ఇన్సాట్" ఉపగ్రహాలు బహుళార్థకసాధకమైనవే. అవి ప్రధానంగా టెలికమ్యూనికేషన్స్, టెలివిజన్, వాతావరణ పరిశీలనకు ఉద్దేశింపబడ్డాయి. అయితే ఇవన్నీ మానవరహిత ఉపగ్రహాలు. ఎలక్ట్రానిక్ కంట్రోల్తో అవి పనిచేస్తూ అమూల్యమైన సమాచారాన్ని యాంత్రికంగా అందచేస్తాయి.

భారతదేశం ప్రయోగించిన తాజా ఉపగ్రహం "ఇన్సాట్" కాలపరిమితి తీరిపోబోతోంది. అందువల్ల మరో కొత్తఉపగ్రహం పంపవలసిన అవసరం ఏర్పడింది. ఇదే సమయంలో అమెరికా కూడా అంతరిక్షంలోకి ఒక స్పేస్ లేబొరేటరీని పంపే ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో శాస్త్రజ్ఞులు బాచెస్ బాచెస్‌గా వెళ్ళి నియమితకాలం అందులో ఉండి పనిచేసి తిరిగి స్పేస్ షటిల్ద్వారా భూమికి వస్తుంటారు. వారిని రిలీస్ చేయటానికి కొత్త బాచ్ అదే షటిల్లో వెళ్తుంది. వనరుల కొరతవల్ల భారతదేశానికి కొత్త ఇన్సాట్‌ని పంపటానికి ఇబ్బంది ఏర్పడుతోంది. అది ఏలులేనప్పుడు ఏ అమెరికాదో, బ్రిటన్‌దో ఉపగ్రహాన్ని అద్దెకుతీసుకొని



దాని ద్వారా తన అవసరాలు గడుపుతుంది. అయితే అదేవిధంగా వేరే దేశాలు అప్పటికే వాటిని అద్దెకు తీసుకోడానికి ఒప్పందం కుదుర్చుకుని వుంటే చాలా ఇబ్బంది అయిపోతోంది. ఇట్టి పరిస్థితుల్లో అమెరికా పంపే స్పేస లాబొరేటరీలో తమ శాస్త్రజ్ఞులను కూడా ఎందుకు అంతరిక్షంలోకి పంపకూడదు అన్న ఆలోచన వచ్చింది భారత్ ప్రభుత్వానికి. వెంటనే ఈ విషయాన్ని అమెరికా ప్రభుత్వంతో చర్చించడానికి ఉన్నతస్థాయి బృందం భారతదేశంలోని ఇస్రో కేంద్రానికి చెందిన ఉన్నతశ్రేణి శాస్త్రజ్ఞులను వెంటబెట్టుకుని అమెరికా బయలుదేరింది. భారతదేశంతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలని ఆశిస్తున్న అమెరికా ఇందుకు సుముఖతను వ్యక్తంచేసింది. పైగా అమెరికన్ శాస్త్రజ్ఞులకు భారతశాస్త్రజ్ఞుల మీద మంచి గౌరవం ఉంది. అమెరికాలో స్థిరపడిన భారతశాస్త్రజ్ఞులు కష్టించి పనిచేసేవారు కావడం, మంచి తెలివితేటలు ప్రదర్శిస్తుండడం వల్ల వారికి ఈ అభిప్రాయం ఏర్పడింది. పైగా పేదదేశమైన భారతదేశం అంతరిక్ష రంగంలోనే కాకుండా ఇతర వైజ్ఞానిక రంగాలలో కూడా అద్భుత ప్రగతిని సాధించడం కూడా ఇందుకు దోహదం చేసింది. ఫలితంగా ఇరుదేశాల ఒప్పందం సులువుగానే కుదిరింది.

ఒప్పందం ప్రకారం అమెరికాలోని నాసా కేంద్రం, భారతదేశంలోని షార్‌కేంద్రం ఈ ప్రయోగాన్ని సంయుక్తంగా నిర్వహిస్తాయి. భారతదేశంనుంచి ఇద్దరు శాస్త్రజ్ఞులు అమెరికాకు చెందిన ఇద్దరు శాస్త్రజ్ఞులు ఈ స్పేస లేబొరేటరీ లో ఉంటారు. భారతశాస్త్రజ్ఞులలో ఒకరు టెలికమ్యూనికేషన్స్ టెలివిజన్ విషయాలు చూడగా ఇంకొకరు భూగర్భవనరులు వాతావరణ విషయాలు చూస్తారు. అమెరికన్ శాస్త్రజ్ఞులలో ఒకరు

సూర్యుడు సౌరమండలంలోని గ్రహాలు, ఉపగ్రహాలు, తోకచుక్కలు, ఉల్కలు వంటి వాటిని పరిశోధించగా వేరొకరు నక్షత్రాలు, గాలక్సీలు, బ్లాక్‌హోల్స్ వాటినుంచి వచ్చే గామాకిరణాలు వంటి ప్రసారాలను పరిశోధిస్తారు. నలుగురూ కూడా కొన్నికొన్ని వేరే పరిశోధనలు కూడా జరుపుతారు. ఇవి ఏ ఒక్క దేశానికో పరిమితమైనవి కాకుండా మొత్తం మానవాళి ప్రయోజనాలకు సంబంధించి ఉంటాయి. ఈ నలుగురు శాస్త్రజ్ఞులు కూడా అంతరిక్షయానంలో అంతకుముందే తగిన శిక్షణ పొందిన వారై ఉంటారు. ఈ పథకానికి ''ఆపరేషన్ జియో'' అని పేరుపెట్టారు. స్పేస్ లాబొరేటరీకి ఇండియా యు.యస్‌ల పేర్లు కలిసి ''ఇండస్'' అని పేరుపెట్టారు. మరో తొమ్మిదినెలల్లో అంటే వచ్చే నవంబర్‌లో ఈ ప్రయోగం జరుగుతుంది.

అమెరికాలోని 'కేప్ కెనెడీ'లో ఇండస్ ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు పూర్తిఅయ్యాయి. నవంబర్ 18న సాయంత్రం నాలుగు గంటల ఇరవైనిమిషాల పదహారు సెకెండ్లకు బ్లాస్ట్ ఆఫ్‌కు ముహూర్తం నిర్ణయించారు. అమెరికాకి చెందిన మెక్‌డొనాల్డ్, గ్రిగరీలు, భారతదేశానికి చెందిన డాక్టర్ మల్‌హోత్రా, మూర్తిలు ఇండస్‌లో వెళ్ళే శాస్త్రజ్ఞులుగా ఎంపికయ్యారు. డాక్టర్ మల్‌హోత్రా, టెలివిజన్ టెలికమ్యూనికేషన్ రంగాలలో నిష్ణాతుడు. అలాగే డాక్టర్ మూర్తి భూగర్భవనరులలోనూ, వాతావరణ శాస్త్రంలోనూ విశేషానుభవం కలిగినవాడు. వీరిరువురికీకూడా ఖగోళశాస్త్రంలో అమితమైన అభిరుచి ఉంది. ఆ రంగంలో విశేషకృషి చేశారు కూడా. అమెరికన్ శాస్త్రజ్ఞులిద్దరూ వారి రంగాలలో ఎనలేని కృషిచేసి ఎన్నో కొత్త విషయాలు కనుగొన్నట్టివారు. నవంబర్ 18 వచ్చింది. ఇండస్ ప్రయోగానికి అంతా సిద్ధమైంది.

శాస్త్రవేత్తలు నలుగురూ రాకెట్ కొనభాగాన వున్న స్పేస్ లేబొరేటరీ ఇండస్‌లోకి ప్రవేశించారు.

రాకెట్‌తలుపులు మూసుకున్నాయి. ప్రయోగసమయం ఆసన్నమయింది. భారత అమెరికా దేశాల అధినేతలూ ఇతర ప్రముఖులూ, ఎందరో శాస్త్రజ్ఞులూ కేప్‌కెనెడీ కేంద్రంలోని క్లోక్ష్ ఛాంబర్‌నుంచి ప్రయోగాన్ని ఆసక్తితో గమనిస్తున్నారు.

కౌంట్‌డౌన్ ప్రారంభమయ్యింది.

పది,తొమ్మిది, ఎనిమిది, ఏడు, ఆరు, ఐదు, నాలుగు, మూడు, రెండు, ఒకటి, జీరో కాగానే విపరీతమైన శబ్దంతో క్రిందనించి కళ్ళను బైర్లుకమ్మించే కాంతివున్న మంటతోరాకెట్ పైకిలేచింది.

చూస్తుండగానే అంత పెద్ద త్రీస్టేజి రాకెట్ చిన్నగా మరింత చిన్నగా చివరికి బిందువుగామారి ఆ తర్వాతకనుమరుగై పోయింది. గ్రౌండ్ కంట్రోల్ లోని ఎలక్ట్రానిక్ యంత్రాలు అంతా సవ్యంగా ఉన్నట్లు తెలియజేశాయి. ఆపరేషన్ జియోప్రయోగం విజయవంతమయింది.

* * * *

రాకెట్ క్రమంగా గంటకి ఇరవై అయిదువేల మైళ్ళ వేగం పుంజుకున్నాక ''ఇండస్'' స్థిర కక్ష్యలో ప్రవేశించింది. దీనిని భూమికి సుమారు 35000 కిలోమీటర్లు ఎత్తున పరిభ్రమించేటట్లుచేశారు. ఆ ఎత్తున ఇండస్ వేగం భూమి వేగంతో సమంగా ఉంటుంది. అందువల్ల భూమి నుంచి గమనించేవారికి ఎప్పుడూ ఒకే స్థానంలో స్థిరంగా ఉన్నట్లనిపిస్తుంది. ఈ స్థానం భారతదేశంపైన ఉండేటట్లుగా చేశారు. ఇందువల్ల మనదేశానికి అవసరమైన టెలివిజన్ టెలికమ్యూనికేషన్ ప్రసారాలు నిరాటంకంగా సాగుతాయి. అలాగే వాతావరణ పరిశోధనలూ భూగర్భ వనరుల పరిశోధనలు కూడా నిరంతరం కొనసాగుతాయి. అమెరికా

శాస్త్రజ్ఞులు చేసే పరిశోధనలు అంతరిక్షానికి సంబంధించినవి కనుక వాటిని ఎక్కడనుంచి చేసినా పర్వాలేదు.

ఇండస్‌లోని శాస్త్రజ్ఞులు ప్రతిరోజూ నిర్ణీత సమయాలలో గ్రౌండ్ కంట్రోల్‌తో సంభాషిస్తూనే ఉన్నారు.

ఈ కక్ష్యలో కొన్ని ఇతరదేశాల సమాచార ఉపగ్రహాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ మానవరహితాలే. ఒకే కక్ష్యలో వేర్వేరు ఉపగ్రహాలున్నప్పుడు అవి ఎప్పుడైనా ఒకదానితో ఒకటి ఢీకొనే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఒకే రైలు పట్టాలపై వేర్వేరు స్థానాలలో ఎన్నో రైళ్ళు ప్రయాణించేటట్టు, కక్ష్య ఒకటే అయినా ఈ ఉపగ్రహాలు కూడా వేర్వేరు స్థానాలలో ఉండడంవల్ల ఒకదానితో ఒకటి గుద్దుకోవు. అనుకోని అవాంతరాలు వస్తే వాటిని ఎదుర్కొనేందుకు ఇండస్‌లో అనేక ఏర్పాట్లు చేశారు. ఏదైనా ఉల్కకాని కృత్రిమ ఉపగ్రహంకాని ఢీకొనే ప్రమాదం ఏర్పడితే వెంటనే ఆటోమాటిక్‌గా రాకెట్ పేలి ఇండస్ స్థానాన్ని మారుస్తుంది. ప్రమాదం తొలగిపోయాక మరో రాకెట్ పేలి దానిని యధాస్థానానికి తీసుకువస్తుంది. ఇకపోతే ఆ కక్ష్యలో పరిభ్రమిస్తున్న మొత్తం ఉపగ్రహాల సంఖ్య వివరాలు ఇండస్‌లోని శాస్త్రజ్ఞులకు అందుబాటులో ఉంచారు. ఇందువల్ల పరాయి వస్తువు ఏదైనా రాడార్ స్క్రీన్‌మీద కనిపిస్తే అది కక్ష్యలో అంతకుముందు ఉన్నదో లేనిదో కొత్తదో తెలుసుకోడానికి వీలవుతుంది.

నాలుగు రోజులు గడిచింది. ఇండస్ ప్రతిరోజూ గ్రౌండ్ కంట్రోల్‌తో సంభాషిస్తూనే ఉంది.

ఆ రోజు రాడార్ స్క్రీన్‌మీద వారికి ఒక కొత్త వస్తువు కనిపించింది. అది గుండ్రంగా రూపాయి కాసంత పరిమాణంలోఉంది. కక్ష్యలో ఉన్న ఉపగ్రహాలన్నీ వారికి తెలుసు. ఇది వాటిలోని దేదీ కాదని రూఢి అయింది. వెంటనే ఆ విషయం గ్రౌండ్ కంట్రోల్‌కి చెప్పాడు గ్రిగరీ.

వెనువెంటనే గ్రౌండ్ కంట్రోల్ ఇన్‌చార్జి గ్రాహం గ్రీన్ దానిని కూలంకషంగా పరిశీలించమనీ దాని స్థానం పరిమాణం అంచనావేయమనీ ఆదేశించాడు. వెంటనే ఇండస్‌లో ఉన్న అమితశక్తిమంతమైన టెలిస్కోప్‌ను ఆ దిశగా తిప్పారు. లేజర్ కిరణాలను దాని మీదికి ప్రసారం చేసి అది ఎంత దూరంలో ఉందో గమనించారు. లేజర్ కిరణాలు కూడా కాంతి వేగంతో అంటే సెకనుకి మూడు లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఈ కిరణాలు ఆ వస్తువుని తాకి తిరిగి రావడానికి పట్టిన సమయం బట్టి అది ఉన్న దూరాన్ని ఖచ్చితంగా లెక్క గట్టవచ్చు. వారు కనుగొన్న విషయాలు నిభ్రాంతిని కలిగించాయి. ఆ విషయాన్ని వెంటనే గ్రౌండ్ కంట్రోల్‌కి తెలియజేశారు.

"దిసీజ్ ఇండస్ మెక్‌డోనాల్డ్ స్పీకింగ్"

"యస్ దిసీజ్ గ్రాహం గ్రీన్ ఎనీథింగ్ స్పెషల్".

"యస్ ప్లీజ్ ఎవ్రిథింగ్ స్పెషల్ అన్నీ ప్రత్యేకంగా ఉన్నాయి"

అది ఇక్కడనుంచి ఐదు వందల మైళ్ల ఎత్తున ఉంది. గంటకి ముప్పయి వేల మైళ్ళ వేగంతో భూమి చుట్టూ తిరుగుతోంది. దాని ఆకారం ఎవరో చేసినట్లుగా పూర్తిగా గుండ్రంగా ఉంది. వ్యాసం వంద అడుగులుంది".

"స్ట్రేంజ్. చాలా విచిత్రంగా ఉందే! అంత పెద్దగా ఉందంటే అది కృత్రిమ ఉపగ్రహం కావడానికి వీలులేదు. పైగా ఆ ఎత్తున ఏ దేశపు ఉపగ్రహాలు కూడా పరిభ్రమించడం లేదు. ఇట్ మస్ట్‌బిఏ మిటియోర్

"మీరన్నట్టు అది ఉల్క అనుకోడానికి వీలులేకుండా ఉంది. సాధారణంగా ఉల్కలు ఒక ఆకారం అంటూ లేకుండా అడ్డదిడ్డంగా నానా రూపాలలో ఉంటాయి. అవన్నీ ప్రధానంగా శిలలు. అందువల్ల వాటికి గుండ్రని ఆకారం ఉండదు".

"ఒక పెద్ద ఉల్క భూమ్యాకర్షణ శక్తి ప్రభావంవల్ల దానికి చంద్రుని లాగా ఉపగ్రహంగా మారిపోయిందనుకుందాం. ఆ ఉల్కలో మెత్తని వదులైన మట్టి వంటి పదార్థం ఉంటే భూమి ఆకర్షణ శక్తివల్ల గోళంగా మారవచ్చు!"

"కొన్ని వందలకోట్ల సంవత్సరాల నుంచీ అంగారకుని చుట్టూ డెయిమోస్, ఫోబోస్ ఉపగ్రహాలు పరిభ్రమిస్తున్నాయి. నలభై మైళ్ళలోపు వ్యాసంతో వున్న ఇవి ఇప్పటికీ గుండ్రని ఆకారం పొందనేలేదు. ఇవి బంగాళ దుంప ఆకారంలో ఉంటాయి. అటువంటిది ఈ చిన్న ఉల్క ఇంతటి పెర్ఫెక్ట్ గ్లోబ్‌గా అవగలుగుతుంది! పైగా లేజర్ కిరణాలద్వారా తెలిసిన దాని ప్రకారం, దాని పదార్థం గట్టిగా లోహంలాగా ఉంది. మట్టి వంటి వదులు పదార్థం ఏమీలేదు.

"అంటే మీ ఉద్దేశ ప్రకారం అది కృత్రిమ ఉపగ్రహమనా?"

"అనే నా అనుమానం"

"ఇంపాజిబుల్ ఇప్పటివరకూ వంద అడుగుల వ్యాసం వున్న పెద్ద కృత్రిమ ఉపగ్రహాన్ని ఏ దేశమూ తయారుచేయలేదు"

"కాని ఇతరులెవరైనా చేసి ఉండొచ్చుగా!"

"మీ ఉద్దేశం ఇతర గోళాలకి చెందిన బుద్ధి జీవులు చేశారనా?"

"ఇటీజ్ క్వైట్ పాజిబుల్"

"ఫాంటాస్టిక్ నాన్సెన్స్-సైన్స్ ఫిక్షన్ చదివి చదివి మీ అందరి బుర్రలూ ఇలా అయిపోయాయి. ఎనీవే ఇట్ రిక్వైర్స్ క్లోజర్ అబ్జర్వేషన్"

"అదే మేమూ అనుకుంటున్నాం. దానిని నిశితంగా పరిశీలించడం అవసరం. ఆ ఉపగ్రహం గంటకి ముప్పయివేల మైళ్ళ వేగంతో తిరుగుతోంది. ఇండస్ ఇరవై అయిదువేల మైళ్ళ వేగంతో తిరుగుతోంది. అందువల్ల ఆరు రోజుల్లో అది మాకు నియరెస్ట్ పాయింట్‌కి వస్తుంది. అప్పుడు మీరు అనుమతిస్తే ఇండస్‌ను దాని సమీపంలోకి తీసుకుపోయి డాకింగ్ చేసి దానిమీద దిగి పరిశోధిస్తాం. ఇండస్ వేగాన్ని రెగ్యులేట్ చేసి దాన్ని పాయింట్ మారకుండా చేసి దాని ప్రోగ్రామ్ కేమీ భంగం రాకుండా చూస్తాం" అన్నాడు గ్రిగరి.

"ఓకే ఈ విషయం మీటింగ్‌లో పెట్టి అక్కడ తీసుకొన్న నిర్ణయం రేపుచెప్తాను" అన్నాడు గ్రాహం గ్రీన్.

ఆ రోజు ఎమెర్జెన్సీ మీటింగ కాల్‌ఫర్ చేసి ఈ విషయాన్ని చర్చకి పెట్టారు ఆయన. విషయం చాలా ఆసక్తి రేకెత్తించడంతో దాని రహస్యం ఏమిటో తెలుసుకోవాలన్న కోరిక అందరిలోనూ కలిగింది. ఆ వింత వస్తువును దానిమీద దిగి పరిశీలించడానికి ఏకగ్రీవంగా ఆమోదించారు.

అది ఇతర బుద్ధిజీవులున్న లోకంనుంచి వచ్చి ఉండవచ్చునన్న అనుమానం ఎవరికీ రాలేదు. ఎందుకంటే ఇతర నక్షత్ర మండలాలలో బుద్ధిజీవులు ఉండవచ్చుననే విషయంలో సందేహం ఎవరికీ లేకపోయినా వారు భూమికి వచ్చి ఉంటారని ఎవరూ అనుకోలేదు. ఎందుకంటే మనకి అత్యంత సమీపంలో ఉన్న నక్షత్రం ఆల్ఫాసెంటారీ నుంచి కాంతి భూమిని జేరడానికి నాలుగు సంవత్సరాలు పడ్తుంది. అంటే సెకనుకి మూడు లక్షల కిలోమీటర్ల వేగం ప్రయాణించేసినా నాలుగు సంవత్సరాలు పడ్తుంది. అందువల్ల ఇది అసంభవం-ఎంత ఎక్కువ వేగంగా ప్రయాణించేసినా ఎంతటి జీవిత కాలాలూ చాలవు. అందువల్ల ఎప్పటికైనా ఇతర నక్షత్ర మండలవాసులతో సంబంధాలు ఏర్పడాలంటే అది కేవలం రేడియో సందేశాలుగానో ఇంకా గొప్పగా అభివృద్ధి చెందితే టివి ప్రసారాలుగానో ఉండగలవు కాని భౌతికంగా రాకపోకలు సాధ్యం కావు. భాష తెలియని రేడియో సందేశాలవల్ల ప్రయోజనం ఉండదు కూడాను అంతటి దూరాలకు టివి ప్రసారాలు పంపగల అవకాశం కనుచూపు మేరలో లేదు. ఇటువంటి పరిస్థితులలో ఆ వింత వస్తువు పరలోకవాసులదై ఉండవచ్చునన్న అనుమానం ఎవరికీ రాలేదు.

మర్నాడు సందేశంలో గ్రిగరీ ప్రపోజల్‌కి ఆమోదం లభించిన విషయం తెలియజేశాడు గ్రాహంగ్రీన్.

ఇండస్‌లో నున్న నలుగురు శాస్త్రజ్ఞులకి ఆ వింత వస్తువును నిశితంగా పరిశీలించాలన్న ఉత్సాహం ఉరకలు వేస్తోంది.

మరో నాలుగు రోజులకి ఆ వింత వస్తువు ఇండస్‌కి బాగా సమీపానికి వస్తుంది. అప్పుడు ఇండస్ కంట్రోల్ మెక్‌డోనాల్డ్‌కి అప్పజెప్పి మిగిలిన ముగ్గురూ దానిమీద దిగాలనుకున్నారు. దానిని నిశితంగా పరిశోధించి తిరిగి ఇండస్‌లోకి వచ్చేయాలి. ఇదంతా త్వరత్వరగా జరగాలి. లేకుంటే భారతదేశానికి నిత్యమూ జరిగే ప్రసారానికి అంతరాయం ఏర్పడుతుంది. అందుకే అవసరమైతే కొన్ని గంటలపాటు ఈ ప్రసారాలు నిలుపు చేస్తామని ముందుగానే హెచ్చరిక పంపారు. కంప్యూటర్‌కి పూర్తి ఫీడింగ్ ఇచ్చేసి ప్రోగ్రాం అప్పజెప్పారు. అంతా ఆటో కంట్రోలే. నిజానికి మెక్‌డోనాల్డ్ కూడా వారితో ఆ వస్తువు మీదకు వెళ్లినా ఏమీకాదు. ఇండస్ దాని పని అది చేసుకుంటూ పోతుంది. సమయానికి వచ్చి వారిని ఎక్కించుకుంటుంది. కాని అనుకోని అవాంతరాలేవైనా వస్తే ఆ విషయం భూకేంద్రానికి చెప్పేవారెవరైనా ఉండాలి. అందుకు మెక్‌డోనాల్డ్‌ని ఇండస్‌లోనే ఉంచదలుచుకున్నారు. ఆ వస్తువులో అంతటి ఆసక్తికరమైన విశేషాలు ఏమైనా ఉంటే వారు వచ్చాక అతన్ని దాని మీదకు పంపవచ్చు.

నాలుగోరోజు వచ్చింది.

ఆ వస్తువు అతి సమీప స్థానానికి రాగానే రాకెట్ ప్రేల్చి ఇండస్‌ను దానికి దగ్గరగా తీసుకువెళ్ళారు. ఆ సమయంలో రెండూ ఒకే వేగంతో ప్రయాణించేట్లు ఇండస్ వేగాన్ని క్రమబద్ధం చేశారు.

క్రింద ఆ వింతగోళం ఉంది. పైన కొద్ది గజాల ఎత్తున ఇండస్ ఎగురుతోంది. ఇండస్‌లోపల తలుపులు తెరుచుకున్నాయి. మల్హోత్రా, మూర్తి, గ్రిగరీలు వరండావంటి దానిలోకి స్పేస్ దుస్తులు ధరించివచ్చారు. వారు రాగానే ఆ తలుపులు మూసుకున్నాయి. ఆ తర్వాత బయట తలుపులు తెరుచుకున్నాయి. ఒక గట్టితాడును ఇండస్‌కొక్కానికి బిగించారు. రెండోవైపు లంగర్ వంటి బరువైన ఇనుప వస్తువునుకట్టి ఆ గోళం మీదికి వదిలారు ఆ త్రాడుని పట్టుకుని క్రిందకి పాకుతూ ఒక్కొక్కరే

గోళం మీదికి దిగారు. వారు ఊహించినట్లు అది కృత్రిమ ఉపగ్రహమే ఉల్కకాదు. చాలా గట్టిలోహంతో చేయబడి ఉంది. అది ఇనుము మాత్రం కాదు. ఇరిడియం మరింకేవో కలిసిన మిశ్రమ లోహంలాగా కనిపిస్తోంది. దానిపైన సగభాగంలో ఆర్చివలె ఉంది. మొత్తం గోళంపైన అన్ని వైపులా ఇటుకల ఆకారంలో ఏవో ఉన్నాయి. వాటిలో నుంచి తీగలు లోనికి పోతున్నాయి. వాటిని చూసి "ఇవి సోలార్ సెల్స్‌లా ఉన్నాయి. ఇవి సూర్యకిరణాలను విద్యుత్తుగా మార్చి ఈ నౌక నడవడానికి ఉపయోగించి ఉండవచ్చు" అన్నాడు గ్రిగరీ. ఆ ఆర్చివంటిదాని దగ్గరకు వెళ్ళేసరికి లోనికి, వెళ్ళడానికి నడవ కనిపించింది. ముగ్గురూ అక్కడే ఆగిపోయారు. లోనికి వెళ్ళడమా మానడమా అన్న ఆలోచనలో పడిపోయారు.

"లోపల ఇతర లోకాలకు చెందిన బుద్ధి జీవుల్లున్నారేమో? లోనికి వెళ్తే ఏమి ప్రమాదం వస్తుందో" అన్నాడు డాక్టర్ మూర్తి.

"అంతటి బుద్ధిజీవులు లోపల ఉండివుంటే ఈపాటికి మన రాకను గ్రహించే ఉండాలి. వెంటనే మనం రాకుండా నిరోధించడమో వస్తే ఎదుర్కోవడమో లేదా మర్యాదగా ఆహ్వానించడమో చేసుండాలి. ఇదేమీలేదంటే ఇది వదిలేసిన అంతరిక్ష నౌక అనిపిస్తోంది" అన్నాడు మల్‌హోత్రా.

"కరెక్టు. ఇది డిఫినెట్‌గా ఎక్‌స్ట్రా టెర్రెస్ట్రియల్ సివిలిజేషన్‌కి చెందిన నౌక కాకపోతే ఎందుకనో దీనిని వదిలేశారు. అదీ కాకపోతే వాళ్ళు లోపల మరణించి ఉండాలి. లోపలకి వెళ్తే తెలుస్తుంది" అన్నాడు గ్రిగరీ.

ముగ్గురూ నెమ్మదిగా శబ్దం చేయకుండా పిల్లిలా నడుస్తూ లోనికి వెళ్ళారు. లోన ఏ జీవీ కనిపించలేదు. అయితే నూరు అడుగుల వ్యాసం వున్న గోళం కావడంతో లోపల ఒక పెద్ద ఇల్లు ఉంది. వాళ్ళకి వెనక వైపున పెద్ద గది ఉంది. దానికి ఏదో పదార్థంతో చేసిన తలుపులు ఉన్నాయి. ఆ గదిలో వింత ఆకారాల్లో ఉన్న మంచాలున్నాయి. వాటిపైన అతి మృదువైన పరుపులు మెత్తలు ఉన్నాయి. అది ఏ రకమైన దూదో ఏదైనా కృత్రిమ పదార్థమో తెలియదు. అంటే ఈ గోళంలో కొందరు చాలా కాలం ఉన్నారన్నమాట.

అక్కడి నుంచి ఎదుటివైపు వెళ్లారు. అక్కడ రకరకాల యంత్రాలు కనిపిస్తున్నాయి. వాటిమీద పరిచయంలేని అంకెలు, గుర్తులు కనిపిస్తున్నాయి. అవన్నీ మన విమానాల్లో ఉండే రకరకాల మీటర్ల వంటివి.

లోపల స్ఫటికాల వంటి గోళాలు ఎన్నో ఉన్నాయి. అవి గాజువి మాత్రం కాదు. వాటి పదార్థమేదో తెలియదు. కాని వాటిలోంచి మంచి కాంతి వస్తూలోపల అంతా వెలుగును నింపుతోంది.

"బయట పలకలవలె ఉన్నవి మనం అనుకున్నట్లు సోలార్ సెల్ అవి ఉత్పత్తి చేసిన విద్యుత్తు మూలంగా ఇవి వెలుగుతున్నాయి. ఈ అంతరిక్ష నౌక ప్రయాణానికి కావలసిన శక్తిని కూడా అవే సమకూర్చి ఉండవచ్చు" అన్నాడు గ్రిగరీ.

లోపల ఏ ప్రమాదమూలేదని రూఢి అయ్యాక అక్కడి వింతలు మెక్‌డోనాల్డ్‌కి కూడా చూపించాలనుకొన్నారు.

గ్రిగరీ బయటకు వచ్చి చేతులూపుతూ లోనికి రావలసిందిగా సంజ్ఞలు చేశాడు. అది చూసి

మెక్‌డొనాల్డ్ ఇండస్‌ని కంప్యూటర్‌కి అప్పజెప్పి ఆ త్రాడునుంచి పాకుతూ క్రిందకి దిగాడు. వచ్చే ముందు త్వరత్వరగా కాగితం మీద ఒక నోట్‌రాసి కంప్యూటర్ దగ్గర ఉంచాడు.

గ్రిగరీ మెక్ డొనాల్డ్ గోళం లోపలికి వచ్చారు.

మెక్‌డొనాల్డ్‌ని ఇంతకు ముందు తాము చూసిన లివింగ్ రూంలోకి తీసుకువెళ్లారు. అక్కడ అతను నిశితంగా పరిక్షిస్తుంటే గోడకి ఒక షెల్ఫ్ లాంటిది ఉన్నట్లు కనుగొన్నాడు. దానిని తెరిచి చూస్తే లోపల అరలో ప్లాస్టిక్ వంటి పదార్థాంతో చేసిన సీసాల్లో ఏదో ద్రవం కనిపించింది. వాటి ప్రక్కన అటువంటి దబ్బాలలో ఏదో మెత్తని పదార్థం ఉంది.

ఆ ద్రవ్యాన్ని కొంచెం నోట్లో వేసుకున్నాడు మల్‌హోత్రా.

"ఊ ఇదిస్వచ్ఛమైన నీరు" అని ఆ పదార్థాన్ని కొంచెం నాలిక్కి రాసుకున్నాడు.

"ఇది ఆహారం అన్నమాట. చాలా రుచిగా ఉంది. దేంతో చేశారో! ఇదేమిటి ఈ కాస్తకే పొట్ట ఉబ్బిపోతోంది. అబ్బ భుక్తాయాసంగా ఉంది" అన్నాడు పొట్ట సవరించుకుంటూ.

"ఇది కండెన్స్‌డ్ ఫుడ్" అన్నమాట ఈ లెక్కన ఇందులో ఉన్నది ఎన్నిసంవత్సరాలకి సరిపోతుందో సుదీర్ఘ అంతరిక్ష యాత్రలకోసం చేసుకున్న ఏర్పాట్లన్న మాట" అన్నాడు గ్రిగరీ.

"ఈ లెక్కన ఈ అంతరిక్ష యాత్రికులెవరో భూమికి వస్తూ వాటిని తమతో తెచ్చారని అనిపిస్తోంది. మరి వీరు పరలోకం నుంచి వచ్చిన వారా? భూమి మీద నుంచే వచ్చినవారా? ఈ ఉపగ్రహం భూమిచుట్టూ తిరుగుతుండడం దీనిలో భూమికి సంబంధించిన ఆహారం నీరు ఉండడంతో ఈ అనుమానం వస్తోంది" అన్నాడు మూర్తి.

"భూమి మీద స్పేస్ సైన్స్ డెవలప్ అయి అరశతాబ్దం కూడా కాలేదు" అని గుర్తు చేశాడు మల్‌హోత్రా.

"వైట్ ట్రూ. కానీ గతంలో భూమి మీద అట్లాంటిస్, లెమూరియో, గోండ్వానా లాండ్ వంటి ఖండాలు ఉండేవి. వీటి మీద చాలా గొప్ప నాగరికతలుఉండేవట ఈ ఖండాలన్నీ తర్వాత సముద్రంలో మునిగిపోయాయి. ఈ నాగరిక జీవులు వీటిని తయారు చేశారేమో ఎందుకంటే ఒక నక్షత్ర మండలంనుంచి మరోదానికి భౌతికంగా రావడం అసంభవం. ఈ ఉపగ్రహం ఇప్పటిది కాదు. అందువల్ల ఈ అనుమానం వస్తోంది" అన్నాడు మెక్‌డొనాల్డ్.

"మరి ఆ యాత్రికులేమైనట్లు! దీనిని ఎందుకు వదిలేసినట్లు! పోనీ చనిపోయారనుకుంటే ఆ శవాలేమయ్యాయి! అవంతట అవే బయటికి పోలేవు కదా. పోనీ కుళ్లిపోయాయనుకుంటే కనీసం ఎముకలయినా ఉండాలికదా! అన్నాడు మూర్తి.

"ఇన్ని వేల సంవత్సరాలైనా నీరూ ఆహారం చెడకుండా ఉంచగలిగినవారు అలాదిక్కులేని చావు వచ్చి ఉంటారనుకోను. వాళ్ళు కావాలనే దీనిని వదిలేసి వెళ్ళిఉండాలి. ఒకవేళ ఇది చెడిపోతే దీన్ని ఇలాగే వారు వచ్చిన దానికి గుర్తుగా వదిలేసి మరో నౌకలో వెళ్ళిపోయారేమో!" అన్నాడు గ్రిగరీ.

"అదే సబబనిపిస్తోంది" అన్నాడు మల్‌హోత్ర.

ఆ తర్వాత తిరిగి వారు ఆ గోళాన్ని పరిశీలించడం మొదలుపెట్టారు.

గోళానికి అడుగు భాగానికి వెళ్ళేందుకు మార్గాలున్నాయి. వాటి మీంచి కిందికి వెళ్తే మరో గది వచ్చింది. అందులోనూ ఏవేవో యంత్రాలున్నాయి. ఒక చోట కంప్యూటర్ వంటి ఆకారంలో ఒక యంత్రం కనిపించింది. దాని ప్రక్కన ఒక పిడివంటిది ఉంది.

అంతలో 'లుక్ ఎట్‌దేర్' అంటూ ఆ యంత్రం వెనుక గోడమీద వున్న ఒకచిత్రాన్ని చూపించాడు గ్రిగరీ.

అందులో విశ్వరూపం ఉంది. ఆ చిత్రానికి ఇప్పటి విశ్వరూప చిత్రానికీ కొంత తేడా వున్నా అందులో ప్రధాన నక్షత్రాలని గుర్తించడం సాధ్యమవుతోంది. అల్ఫా సెంటారీ నక్షత్రం చుట్టూ పన్నెండు చిన్న చుక్కలు ఉన్నాయి. అందులో ఐదో దాని చుట్టూ సున్న గీసి ఉంది. ఆ తర్వాత సూర్యుడు, దాని చుట్టూ పది చక్రాలు ఉన్నాయి. మూడో చుక్క చుట్టూ వలయం గీసి ఉంది. అల్ఫా సెంటారీ నుంచి సూర్యుని వైపుగా గీత గీసి ఉంది.

"హాట్సాఫ్ టుదెమ్. తాము ఎవరో. ఎంత చక్కగా చెప్పారు! అల్ఫా సెంటరీకి పన్నెండు గ్రహాలున్నాయన్న మాట వాటిలో ఐదవ దాని నుంచి వీరు వచ్చారు" అన్నాడు మెక్‌డొనాల్డ్.

మరి సూర్యుని చుట్టూ పది చుక్కలు పెట్టారు! సూర్యునికుంది తొమ్మిది గ్రహాలేగా!" అన్నాడు మూర్తి నసుగుతూ.

"సూర్యునికి పదో గ్రహం ప్లూటోకి ఆవల వందలకోట్ల మైళ్ళ దూరాన ఉందని ఎప్పటినుంచో శాస్త్రజ్ఞులు అనుమానిస్తున్నారు. అది ఉన్నదని ఇటీవల పరోక్షంగా ధృవపడింది కూడా. ఈ విషయం పేపర్లన్నీ ప్రముఖంగా ప్రచురించాయి కూడా అని గుర్తుచేశాడు గ్రిగరీ.

"మరి అల్ఫాసెంటారీ నుంచి ఎలా రాగలిగారో!" మల్‌హోత్రా ఆశ్చర్యంగా అన్నాడు.

'ఇటు చూడండి ఇక్కడేదో చిత్రం ఉంది" అంటూకొంచెం దూరంలో గోడపైనున్న మరో చిత్రాన్ని చూపించాడు మూర్తి.

"అందులో వింత ఆకారాల్లో ఇద్దరి చిత్రాలు ఉన్నాయి. ఆ ఆకారాలు చిన్నవిగా ఉండడంతో వాటి వివరాలు స్పష్టంగా తెలియడంలేదు. క్లాసులో టీచర్ మనిషి బొమ్మ వేయాలంటే ఒక సున్నా, ఐదు గీతలతో ఈ విధంగానే వేస్తారు. అందులో అవయవాలేవీ వివరంగా కనిపించకపోయినా అది మనిషిదని గుర్తుపట్టేస్తాం.అలాగే ఈ బొమ్మలో కూడా తక్కువ గీతలతో ఏవో రూపాలు గీశారు. వాటి వివరాలు తెలియకపోయినా అవి పరలోక వాసులవని తెలుస్తోంది. ఆ ఆకారాల క్రింది భాగంలో తిరిగి అల్ఫా సెంటారీ నక్షత్రం దాని పన్నెండు గ్రహాలు వాటిలో ఐదో గ్రహం చుట్టూ మళ్ళీ వలయం ఉన్నాయి. ఆ చిత్రానికి ఎదుటివైపున కొంచెం దూరంలో సూర్యుడు, పది గ్రహాలు, మూడో గ్రహం (భూమి) చుట్టూ వలయం ఉన్నాయి. వీటిపై భాగంలో మళ్ళీ అవే ఆకారాలున్నాయి. ఈ రెండింటికీ నడుమ బ్రహ్మాండమైన కాంతి పుంజం ఉంది.

ఆ చిత్రం చూసి ఆశ్చర్యంతో కొయ్యబారి పోయారు.

తెరుచుకున్నాక "ఫెంటాస్టిక్ ఇప్పుడర్థమైంది. వీరు కాంతిగా మారి భూమికి వచ్చి తిరిగి సొంత రూపాలు పొందారు" అన్నాడు మల్హోత్రా.

"లుక్స్ అబ్సర్డ్" అన్నాడు మెక్‌డొనాల్డ్.

"వై? ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారం పదార్థం కాంతిగానూ. కాంతి పదార్థంగానూ మారగలదు గదా! రేడియోలో మాట్లాడిన మాటలు ఎలక్ట్రోమాగ్నెటిక్ వేవ్స్‌గా మారి ఆ వేవ్స్ మొదటి మాటలుగా మారడంలేదా! అలాగే వీరు తమ శరీరాల్ని అంతరిక్ష నౌకల్నీ అన్నింటినీ కాంతిగా మార్చుకొని, ఆ కాంతి తిరిగి శరీరాలుగానూ అంతరిక్ష నౌకలుగానూ అయ్యే ప్రక్రియను సాధించి ఉండొచ్చు. ఆటోకంట్రోల్ ద్వారా ఇవన్నీ ఆయా సమయాలలో అయ్యేట్లు చేసి ఉండొచ్చు" అని వివరీకరించాడు గ్రిగరీ.

"ప్రాబబ్లీ" అన్నాడు మెక్‌డొనాల్డ్ బుర్ర గోక్కుంటూ.

"వన్‌మోర్ థింగ్" ఇక్కడ వున్న విశ్వరూపం చిత్రానికీ ఇప్పుడు మనం చూస్తున్న విశ్వరూపానికీ తేడా ఉంది. నక్షత్రాలు, గెలాక్సీలు-ఇవన్నీ ఒక దానినుంచి ఒకటి అమిత వేగంతో పారిపోతూ విశ్వం విస్తరిస్తోంది. అయితే నక్షత్రాలు మనకి అనంత దూరంలో ఉన్నాయి కనుక స్వల్పకాలంలో వాటి మధ్య పెరుగుతున్న దూరాన్ని మనం గమనించలేం. అదే వేలు, లక్షలు సంవత్సరాలైతే ఆ మార్పుని గుర్తించవచ్చు. ఇప్పుడు కనిపిస్తున్న ఈ విశ్వరూపం నా అంచనా ప్రకారం కనీసం యాభైవేల సంవత్సరాలనాటిది. ఈ చిత్రాన్ని మనం మాగ్నిఫై చేస్తూ పోతే ఒక స్టేజిలో మన ప్రస్తుత విశ్వరూపం వస్తుంది అన్నాడు మెక్‌డొనాల్డ్.

మైగాడ్! అంటే ఈ అంతరిక్ష నౌక యాభైవేల సంవత్సరాలనాటిదా! అప్పటినుంచి ఇది చెక్కుచెదరకుండా ఇప్పటికీ ఉందా!" అన్నాడు మల్హోత్రా ఆశ్చర్యంతో.

"నో వండర్. అది వారు సాధించిన ప్రగతికి తార్కాణం" అన్నాడు మెక్‌డొనాల్డ్.

"మన అమెరికన్లు" "వాయేజర్" అంతరిక్ష నౌకను గ్రహాల సమీపం నుంచి సౌరమండలం దాటిపోయేటట్లుగా పంపినప్పుడు అందులో మన ఉనికిని తెలిపే చిత్రాన్ని స్త్రీ పురుషుల చిత్రాల్ని అందులో ఉంచారు. అవి ఇప్పుడు సౌర సౌరమండలం దాటి నక్షత్రం మండలం వైపుకు వెళ్తోంది. ఎప్పటికైనా అది పరలోక వాసుల కంటబడితే వారికి మన ఉనికి తెలుస్తుంది" అన్నాడు గ్రిగరీ.

ఇంకా ఆ గదిలో ఏముందోనని అన్వేషిస్తున్న మూర్తికి ఒక స్విచ్ వంటిది కనిపించింది. దానిని నొక్కగానే వింత వింత శబ్దాలు వినిపించసాగాయి. అవి ఏవో భాషా పదాలుగా అనిపిస్తున్నాయి. కొంచెం సేపటికి అవి ఆగిపోయాయి. బహుశా టేప్ రికార్డర్!"

"ఇవన్నీ చూస్తే వారి ఉనికిని భూవాసులకు తెలియచేయాలనే ఉద్దేశంతోనే ఈ నౌకను ఇక్కడ కావాలని వదిలినట్లనిపిస్తోంది" అన్నాడు మల్హోత్రా.

"ఉండండి. ఒక్కసారి ఇండస్‌లోకి వెళ్ళి ఇక్కడ చూసినవన్నీ నోట్ రాసి మళ్ళీ వస్తాను" అని మెక్‌డొనాల్డ్ తాడుపట్టుకుని పైకి వెళ్ళి ఇండస్‌లో ప్రవేశించాడు. లోపల తాను చూసినవన్నీ వివరంగా రాసి ఉంచి తిరిగి వచ్చాడు.

అతను వచ్చేసరికి గ్రిగరీ "ఈ కంప్యూటర్ లోవున్న యంత్రంపైనున్న ఈ పిడి ఏమిటి? ఇది

మొత్తం మెకానిజమ్ మెయిన్ స్విచ్ ఏమోననిపిస్తోంది' అంటూ దానిని బలంగా ఒత్తాడు.

వెంటనే సముద్రం పొంగినట్లు పెద్ద శబ్దం అయింది. ఉన్నట్టుండి బ్రహ్మాండమైన కాంతి పుంజం వెలువడింది. ఆ నౌక ఆ నలుగురితో సహా కాంతిగా మారిపోయి ఆల్ఫా సెంటారీ దిశగా వెళ్ళిపోయింది.

చీమలు తేనెటీగలు ఎంతో తెలివైనవి. నాగరికత గలవి. అయినా వాటిని చిన్నచూపు చూస్తూ వాటి మీద ప్రయోగాలు చేస్తాం మనం. అలాగే మనకంటే వందలరెట్లు అభివృద్ధి చెందిన ఆల్ఫా సెంటారీ బుద్ధి జీవుల దృష్టిలో మనం చీమలు తేనెటీగలువంటి వాళ్ళం అందుకే మనల్నివారు నేర్పుగా వాళ్ల అంతరిక్ష నౌకలో బంధించి ప్రయోగాలకోసం తమ లోకానికి తీసుకుపోయారు.

ఆ బ్రహ్మాండమైన కాంతిపుంజం భూమి మీద కంటికి స్పష్టంగా కనిపించింది. ఒక కొత్త సూపర్‌నోవా బ్రద్దలైనట్లుగా భూమి అంతా దగద్ధగాయమానంగా కాంతులీనాయి. నక్షత్రాలు బ్రహ్మాండంగా పెరిగిపోయి చివరికి ప్రేలి పోతాయి. అప్పుడు పట్టపగలు కూడా కళ్ళు జిగేల్‌మనిపించగల కాంతి వస్తుంది. వీటిని సూపర్ నోవాలు అంటారు. అయితే అవి అరుదుగా జరుగుతుంటాయి.

ఆ కాంతిని చూడగానే గ్రౌండ్ కంట్రోల్ వెంటనే ఇండస్‌ని కాంటాక్ట్ చేయ ప్రయత్నించింది. కాని రెస్పాన్స్ రాకపోవడంతో ఏదో జరిగిందనుకుని రెస్క్యూ టీంతో స్పేస్ షటిల్‌ని పంపింది. వారికి మెక్‌డోనాల్డ్ రాసిన నోట్స్ కనిపించాయి. మొదటి నోట్‌లో "మేం గమనించింది. ఆల్ఫాసెంటారీ నక్షత్ర మండలంలో ఐదవ గ్రహం నుంచి వచ్చిన పరలోక వాసుల అంతరిక్ష నౌక అని రూఢీ అయింది. నా మిత్రులు దానిని చూసి నన్నుకూడా రమ్మనమనడంతో వెళ్తున్నాను. అయితే తెలియని ప్రమాదం ఏమైనా పొంచి ఉందేమో తెలియదు. అందువల్లనే ఈ నోట్ ఉంచుతున్నాను" అని ఉంది.

రెండో నోట్‌లో ఇంతకు ముందు ఒక నోట్ రాశాను. ఇపుడు మళ్ళీ వచ్చి ఈ నోట్ రాస్తున్నాను. అక్కడ మేము చూసినవన్నీ దిగువన వివరంగా రాస్తున్నాను. ప్రమాదం ఏ స్టేజిలో ముంచుకొస్తుందో తెలియదు. అందువల్ల మధ్య మధ్య ఇలా వచ్చి అప్పటివరకూ చూసి ఇలా రాయాలనుకున్నాను. అంతటి బుద్ధిజీవులు ఆ నౌకని కావాలని ఊరికే వదిలేశారని అనిపించడంలేదు. భూవాసులు కూడా అంతరిక్ష శాస్త్రం అభివృద్ధి చేసుకుని ఇందులోకి వస్తే వారిని పట్టి బందీలుగా చేసి వారి లోకానికి తీసుకుపోయి మా మీద పరీక్షలు జరుపుతారేమోనని నా మనసులో ఏందుకో అనిపిస్తోంది. అయినా వెళ్తున్నాము. ఎందుకంటే చావు ఎప్పుడైనా తప్పదు. కాని గొప్ప థ్రిల్‌తో చావు వస్తుంటే దానిని వద్దనాలనిపించడం లేదు. నేను ఊహించినది జరిగితే నక్షత్ర మండలాలలో బుద్ధిజీవుల్ని కలుసుకున్న తొలి మానవులంమేము అవుతాం. చచ్చినా బ్రతికినా తిరిగి వచ్చినా ఆ థ్రిల్ వేరు అందుకే వెళ్తున్నాము. గుడ్ బైటు యు గుడ్ బైటు అవర్ ఎర్త్ మెక్ డోనాల్డ్" అని ఉంది.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, ఏప్రిల్ 1988 ✪**

# సమసిపోయిన సంక్షోభం

ప్రపంచం ఇరవై ఒకటవ శతాబ్దంలోకి దూసుకుపోయింది. వద్దని వారించినా ఆగనిది కాలం. కొత్త శతాబ్దానికి స్వాగతం చెప్పే వారెందరో వుంటే కొత్తగా ఉత్పన్నమైన సమస్యలతో సతమతమవుతున్నవారు మరెందరో ఉన్నారు.

ప్రపంచాన్ని ప్రధానంగా పీడిస్తున్న సమస్య ఇంధనం సమస్య . 20 వ శతాబ్దంలో చమురు, నేల బొగ్గుల వినియోగం విపరీతంగా ఊహకందనంతటి పరిమాణంలో జరిగింది. భూగర్భంలో ఈ నిల్వలు ఏర్పడ్డానికి కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టింది. కాని వాటిని కొన్ని దశాబ్దాలలోనే ఖర్చు చేయడం మొదలుపెట్టారు మానవులు.

20వ శతాబ్దం ఉత్తర భాగంలోనే రానున్న ఇంధన సంక్షోభాన్ని గుర్తించి పదే పదే హెచ్చరికలు చేయసాగారు. శాస్త్రజ్ఞులు. వంద సంవత్సరాలలో భూమి మీద వుండిన చమురుక్షేత్రాలన్నీ పూర్తిగా వట్టిపోతాయనీ, నేలబొగ్గు నిల్వలు సంపూర్ణంగా ఖర్చయిపోతాయనీ వారు అంచనాలు వేశారు.

కొత్తగా చమురు క్షేత్రాలను బొగ్గు గనులను కనిపెట్టినా వాటినుంచి అయ్యే ఉత్పత్తి ప్రపంచ అవసరాలకు ఎంత మాత్రం సరిపోదని వారు సాధికారికంగా ప్రకటించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోడానికి సౌరశక్తి(సోలార్ ఎనర్జీ), పవనశక్తి (విండ్‌పవర్), తరంగశక్తి (వేవ్‌పవర్), భూగర్భోష్ణశక్తి (జియోథెర్మల్ పవర్ ) వంటి ప్రత్యామ్నాయ శక్తివనరులను సమకూర్చుకోవాలని వారు సూచించారు. అయితే వీటన్నిటికీ కొన్ని పరిమితులున్నాయి. సంవత్సరంలో ఎక్కువ దినాలు ఎండ అధికంగా ఉండే ప్రాంతాల్లోనే సౌరశక్తి ఉత్పత్తి లాభసాటిగా జరుగుతుంది. పవన వేగం తగు మాత్రం ఉన్న చోటనే గాలి మరల స్థాపన ప్రయోజనవంతంగా ఉంటుంది. భూగర్భోష్ణశక్తి చాలా ఖర్చుతో కూడినది కాగా తరంగశక్తి సముద్ర ప్రాంతాల్లోనే సాధ్యమవుతుంది. అయినప్పటికీ అగ్రరాజ్యాలు ఖర్చుకు వెనుకాడక ఈ పద్ధతులన్నింటినీ సాధ్యమయినంత ఎక్కువగా ఉపయోగించాలనీ సంక్షోభాన్ని ఎదుర్కొనే పథకాలు రూపొందించుకున్నాయి. కాని ఆ స్తోమత లేని అభివృద్ధి చెందుతున్న దేశాలు, పేద దేశాలూ విపరీతమైన ఒత్తిడికి గురి అయ్యాయి.

2030 సంవత్సరం వచ్చేసరికి ఈ సంక్షోభం తారాస్థాయికి అందుకుంది. మరొక రెండు మూడు దశాబ్దాలలో చమురు నిల్వలు, బొగ్గు నిల్వలు పూర్తిగా హరించుకుపోతాయి. అన్ని దేశాలలోని శాస్త్రజ్ఞులూ



అందరికీ అందుబాటులో వుండే ప్రత్యామ్నాయ శక్తి వనరులను రూపొందించడం కోసం నిర్విరామకృషి జరుపుతున్నారు.

ఇరవయ్యవ శతాబ్దం ఉత్తర భాగంలో కృష్ణా, గోదావరి బేసిన్‌లో జరిపిన పరిశోధనలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఈ పరిశోధనలను అమెరికాకు చెందిన కాంటినెంటల్ ఆయిల్ కంపెనీ, మన ఓ.ఎన్.జి.సి(ఆయిల్ అండ్ నాచ్యురల్ గాస్ కమిషన్) సంయుక్తంగా నిర్వహించాయి. ఫలితంగా ప్రపంచంలోనే అతి పెద్ద చమురు, గాస్ నిక్షేపాలుగల క్షేత్రాలతో పోల్చదగ్గవి బయటపడ్డాయి. ఈ ఉత్పత్తులను లాభసాటిగా తీయగల అవకాశం కనిపించడంతో భారతదేశం, అమెరికాలు సంయుక్తంగా ఒక కంపెనీ పెట్టాయి. దానిపేరు "ఇండస్ అయిల్‌కార్పొరేషన్" 'ఇండియా" పదంలోని "ఇండ్"కి "యుఎస్' ' కలిపి రెండు దేశాల భాగస్వామ్యాన్ని సూచించే విధంగా ఈ పేరు పెట్టారు. ఈ కంపెనీ ఉత్పత్తులు భారతదేశ ఇంధన అవసరాలను పూర్తిగా తీర్చగలగడమేకాక ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేయడానికి కొంత మేరకు సరిపోతాయి. కాని ఇందువల్ల ప్రపంచ స్థాయిలో ఏర్పడిన సంక్షోభం తీరదు.

కాంటినెంటల్ అయిల్‌కంపెనికి అమెరికాలో వున్న చమురు క్షేత్రాలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. అది జరిగితే ఆ కంపెనీ మూతపడక తప్పదు. దశలవారీగా సిబ్బందిని రిట్రెంచ్ చేయడంకూడా మొదలు పెట్టారు. దాంతో కార్మికుల ఆందోళనకూడా ప్రారంభమయింది. సంయుక్త నిర్వహణలో వున్న ఇండస్ కంపెనీ నుండి వచ్చే లాభాలు, ఆ కంపెనీని నడపడానికి ఎంత మాత్రం సరిపోవు. అందువల్ల భవిష్యత్తు

అంధకార బంధురంగా గోచరించి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు డైరెక్టర్లు ఈ నేపథ్యంలో ఈ కంపెనీ వార్షిక సమావేశం అమెరికాలోని ఆరిజోనాలో జరుగుతోంది.

బిజినెస్ మీటింగ్‌లో చివరి అంశంగా "ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్" అన్న అంశం చర్చకి వచ్చింది. ఛైర్మన్ హెరాల్డ్ విల్సన్ లేచి "ఫ్రెండ్స్. మన కంపెనీ యాన్యువల్ రిపోర్టులో మన సంస్థ ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితిని గురించి వివరంగా ప్రస్తావించడం జరిగింది. అందువల్ల దీనిని గురించి ప్రత్యేకంగా చెప్పవలసిందేమీ లేదు. ఈ గడ్డు, పరిస్థితినుంచి బయటపడడానికి నిర్మాణాత్మకమైన సూచనలను చేయవల్సిందిగా గౌరవనీయ సభ్యులను కోరుతున్నాను" అన్నాడు.

సభలో మౌనం పరిఢవిల్లింది. నిశ్శబ్దత తాండవించింది. ఎవ్వరూ ఏమి మాట్లాడలేదు. ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు.

"అయితే సూచనలేవీ లేనట్లేనా?" అన్నారు. ఛైర్మన్.

సభలో ఎవరో లేస్తున్న అలికిడి అయింది. అందరి తలలూ అటే తిరిగాయి. పాల్ జాన్సన్ అన్న మెంబర్ లేచి నిలబడ్డాడు.

అతను ఏమి చెప్తాడా అని అందరూ ఆతురతతో చూస్తున్నారు.

"ఫ్రెండ్స్ నేను చెప్పగల పద్ధతి ఏదీలేదు. కాకపోతే ఒక్క సూచన చేయదలిచాను. ఈ సంక్షోభాన్ని అంతమొందించగల సూచనను ఇయ్యగలిగిన వారికి మంచి బహుమతి ఇస్తామని ప్రపంచంలోని ప్రముఖ పత్రికలన్నింటిలో ప్రకటించండి. ఈ నాలుగు గోడల మధ్య, పరిమిత సంఖ్యలో వున్న మెంబర్ల నుంచి సూచనలు రావు. కాని ఈ విశాల ప్రపంచంలో మేధావులెందరో ఉన్నారు. వారికెవరికైనా మంచి ఆలోచన రావచ్చు" అన్నాడు.

సభలో అక్కడక్కడా హేళనగా నవ్వులు వినిపించాయి.

"ఇందులో నవ్వడానికేమీ లేదు. మహామహా శాస్త్రవేత్తలకుకూడా రాని ఆలోచనలు ఒక్కోసారి అతి సామాన్య వ్యక్తికి వస్తాయి. అయితే అడిగేవారెవరూ లేక వారు పైకి చెప్పరు. ఆకర్షణీయమైన బహుమతిని ఇస్తే ఎందరో బాగా ఆలోచించి మంచి సూచన లియ్యడానికి ప్రయత్నిస్తారు" అన్నాడు పాల్ సీరియస్‌గా

"వెల్ లెటస్ థింక్ ఓవరిట్" అన్నాడు విల్సన్.

"ఇందువల్ల ప్రయోజనం ఉంటుందని నమ్ముతున్నారా?" అన్నాడు ఒక మెంబర్

"వెల్. ఇటీస్ ఓన్లీ యాన్ ఎటెంప్ట్. ప్రయత్నం చేయడంలో తప్పులేదుగా! ప్రవాహంలో కొట్టుకు పోయేవాడు పనికిరావని తెలిసికూడా పుల్లల్ని గడ్డి పరకల్నీకూడా పట్టుకుంటాడు. లెటస్ ట్రై ఇన్ దిస్ వే' అన్నారు ఛైర్మన్.

దాంతో ఆ సూచనకి అందరూ మూజువాణి అంగీకారం తెలిపారు.

అతిత్వరలోనే ప్రపంచంలోని ప్రముఖ పత్రికలన్నింటిలోనూ ఈ ప్రకటన వెలువడింది.

"పెట్రోలుకి ప్రత్యామ్నాయాన్ని కనిపెట్టినవారికి గానీ లేదా వివరించిన వారికి రెండు లక్షల డాలర్లు బహుమతిగా ఇవ్వబడుతాయి. ఆ విధంగా తెలుపదలచుకున్నవారు కాంటినెంటల్ ఆయిల్ కంపెనీ

ఛైర్మన్ హెరాల్డ్ విల్సన్‌కు తమ సూచనలను పంపవచ్చు. లేదావారు ఇంటర్వ్యూ అవర్స్‌లో స్వయంగా వచ్చి కలువవచ్చు" అని.

నెల రోజులు గడిచాయి.

ఎవ్వరి దగ్గరనుంచి ఏ విధమైన సమాధానము రాలేదు. ఎవరూ వచ్చి ఛైర్మన్‌ని స్వయంగా కలిసింది లేదు.

ఆ ప్రకటన ఫలితం శూన్యమనే నిర్ణయానికి వచ్చాడు హెరాల్డ్ విల్సన్.

ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు పర్సనల్ సెక్రటరీ పామేలా ఛైర్మన్‌తో ఫోన్లో మాట్లాడింది.

"సార్ మిస్టర్ హంఫ్రీ, మిస్టర్ దినకర్‌రావు మీతో మాట్లాడాలనుకుంటున్నారు. ఇటీస్ ఇన్ కనెక్షన్‌విత్ దట్ అనౌన్స్‌మెంట్"

ఛైర్మన్‌కి ఆ రోజు పని ఒత్తిడి చాలా ఉంది. అయినా వారు ఆ ప్రకటన సందర్భంగా వచ్చారనగానే "ప్లీజ్ సెండ్ దెమ్ ఇన్" అని వెంటనే చెప్పేశాడు.

"గుడ్ మార్నింగ్" అంటూ లోన ప్రవేశించారు ఇద్దరూ.

"యస్. వెరీగుడ్ మార్నింగ్ ప్లీజ్ బి సీటెడ్" అన్నాడు ఆయన మర్యాదగా.

"ఐయామ్ హంఫ్రీ. జేమ్స్ హంఫ్రీ" అన్నాడు వారిలో ఒకడు.

"ప్లీజ్డ్ టు మీట్ యూ" అంటూ ముందుకి వంగి షేక్ హేండ్ ఇచ్చాడు ఛైర్మన్.

"ఐ.యామ్ దినకర్‌రావు. యాన్ ఇండియన్ సెటిల్డ్ ఇన్ అమెరికా" అన్నాడు రెండో వ్యక్తి.

'సో విత్‌యూ" అంటూ ఆయనకి కూడా షేక్ హేండ్ ఇచ్చాడు.

ఆ తర్వాత - "వెల్ బాయిస్ వాట్‌కెన్ ఐ డూ ఫర్ యూ?" అన్నాడు. అమెరికన్స్‌లో చాలామందికి ఎదుటి వాళ్ళు పెద్ద వాళ్ళయినా వాళ్ళని 'బాయిస్' అని పిలవడం అలవాటు.

"ఆయిల్ క్రైసిస్ విషయంలో మీ ప్రకటన చూశాం. ఆ విషయంలో కన్‌స్ట్రక్టివ్ సజెషన్ ఇయ్యడానికి వచ్చాం" అన్నాడు హంఫ్రీ

"ఈజ్ ఇట్?" అని ఆశ్చర్యంగా అని "వాటార్ యూ?' సైంటిస్టులా?" అని అడిగాడు.

"నేను ప్రొఫెషనల్ జియాలజిస్టుని. మిస్టర్ హంఫ్రీ స్పేస్ కార్గో షటిల్ పైలట్. మేమిద్దరం నాసా షటిల్స్‌లో ఐదేళ్ళు కలిసి పనిచేశాం. చంద్రుని నుంచి ఎన్నో ముడిలోహాల్ని నేను షటిల్‌లో భూమికి చేరవేశాను" అన్నాడు దినకర్.

"దట్స్ గుడ్. మరి ఇప్పుడు ఎక్కడ పనిచేస్తున్నారు?"

"ఎక్కడా లేదు. మా కాంట్రాక్ట్ అయిపోయింది, మళ్ళీ రెన్యూ చేసుకోలేదు. ఉయ్ ఎరన్డ్ సఫిషియంట్లీ. అందువల్ల మా ఓన్‌లాబొరేటరీలో పరిశోధనలు చేసుకుంటున్నాం. మిస్టర్ హంఫ్రీకి కూడా జియాలజీ అంటే చాలా అభిమానం. అందుకే మేమిద్దరం దగ్గరయ్యాం".

"దట్స్ ఫైన్ చెప్పండి. మీ సజెషన్ ఏమిటి?"

"భూమి మీద పెట్రోలియం అంత్యదశకి వచ్చింది. నిజమేకాని మా నమ్మకం ప్రకారం శుక్రగ్రహం మీద బ్రహ్మాండమైన పెట్రోలు నిల్వలు ఉన్నాయి. వాటిని భూమికి జేరిస్తే కొన్నివేల సంవత్సరాలకు భారీగా సరిపోతుంది."

"ఫెంటాస్టిక్! ఆయిల్ ఆన్ వీనస్ అబ్సర్డ్. మీరేమైనా సైన్స్ ఫిక్షన్ రచయితలా? మీ ఆలోచన అలాగే ఉంది."

"అలాగే అనిపించవచ్చు కాని మా ఊహకు ఆధారాలున్నాయి"

"ఇప్పటికి అనేకసార్లు అమెరికా, రష్యాలు వీనస్ మిషన్స్ సాగించాయి. కొన్ని నౌకలు ఆ గ్రహం సమీపంలోంచి దూసుకుపోతూ సమాచారం పంపగా మరికొన్ని శుక్ర ఉపరితలం మీదనే దిగాయి. మరి ఇవి ఏవీకూడా ఈ విషయాన్ని బయటపెట్టలేదే!"

"నిజమే ఇందుకు కారణాలున్నాయి. వీనస్ మిషన్స్ అన్నీ నిర్దిష్టమైన పరిమితమైన లక్ష్యాలను సాధించడానికి ఉద్దేశింపబడ్డాయి. అవి ప్రధానంగా అక్కడి వాతావరణ పరిస్థితులు ఆ వాతావరణంలో వున్న వాయువులు, నేల స్వభావం అక్కడి ఉష్ణగ్రత ఒత్తిడివంటి వాటికి సంబంధించినవి. శుక్రుని మీద భూమిమీద కంటే ఎన్నో రెట్లు దట్టమైన వాతావరణం ఉంది. ఇందులో 98 శాతం కార్బన్‌డై ఆక్సయిడ్. ఉపరితలం ఉష్ణం నాలుగు వందల డిగ్రీల సెంటిగ్రేడ్ ఉందని అక్కడ దిగిన అంతరిక్ష నౌకలు తెలియజేశాయి. దట్టమైన వాతావరణం మూలంగా భూమి మీద ఎప్పుడూ చూడనంతటి తీవ్రమైన ఇసుక తుఫానులు ఏర్పడుతుంటాయి. విపరీతమైన ఎండ వేడిమికి నేలపై ఇసుక పొడి పొడి అయి ఆ గాలులకి పైకిలేచి వాతావరణంలో చేరుతుంది. ఈ ధూళి మేఘాలు నిత్యమూ ఏర్పడుతుండడంవల్ల వాతావరణాన్ని కమ్మివేసి ఉంచుతాయి. అందుకే భూమి నుంచి ఎంత శక్తిమంతమైన టెలిస్కోప్ ద్వారా కూడా ఆ గ్రహ ఉపరితలం కనిపించదు" చెప్పుకుపోతున్నాడు దినకర్.

"ఇవన్నీ అందరికీ తెలిసినవే. వీటిలో కొత్త విషయం ఏముంది? యుకం టుది పాయింట్" అన్నాడు హెరాల్డ్ విల్సన్ అసహనంగా.

"ఆ పాయింట్ కోసమే ఈ వివరాలన్నీ చెప్తున్నాను. వీటిని ఆధారం చేసుకున్నదే నా పాయింట్. మరో విషయం. చంద్రుడు తన చుట్టూ తాను తిరగడం లేదు. అందుకనే చంద్రుని ముఖం ఒక్కటే మనం ఎప్పుడూ చూస్తాం. దాని వెనకేముందో మనకి కనిపించదు. చంద్రుడు ఈ విధంగా ఉండిపోడానికి కారణం భూమి తన ఆకర్షణ శక్తితో చంద్రుని కదలకుండా బంధించి వేయడం. ఇదే విధంగా శుక్రుడు కూడా ఆత్మ పరిభ్రమణం చేయడంలేదు. ఎల్లప్పుడూ ఒకే ముఖాన్ని సూర్యుని వైపు తిప్పి ఉంచుతాడు. బుధుడు కూడా ఇదే విధంగా సూర్యుని వైపు ఒకే ముఖం తిప్పి ఉంచుతాడు. అయితే ఆ పాయింట్‌కూ దీనికి సంబంధం లేదు. కనుక ఆ వివరాలలోకి వెళ్ళను. శుక్రుడు తన చుట్టూ తాను తిరగకుండా పోడానికి కారణం సూర్యుని ఆకర్షణ శక్తి ఒకటేనా? వేరేమైనా ఉందా? ఇప్పటివరకూ అందరు శాస్త్రజ్ఞులు అభిప్రాయం ప్రకారం సూర్యుని ఆకర్షణ శక్తి ఒక్కటే. కాని నా అభిప్రాయం ప్రకారం మరో కారణంకూడా ఉంది".

పైకి అనకపోయినా అసహనంగా కూచున్న హెరాల్డ్ విల్సన్ ముఖంలో ఒక్కసారి ఉత్సాహం చోటుచేసుకొంది. దినకర్ ఏమి చెప్పబోతున్నాడా? అని చెవులు రిక్కించి వినసాగాడు.

"మరొక్క విసయం. నేను చెప్పున్నవన్నీ నా పాయింట్‌కి రిలవెంట్. అందుకనే తెలిసిన విషయాల్ని కూడా మళ్ళీ చెప్తున్నాను. బుధుడు, భూమి, అంగారకుడు, బృహస్పతి వంటి గ్రహాలన్నీ సూర్యునికి అప్రదక్షిణం చేస్తున్నాయి. అంటే పడమర నుంచి తూర్పుకి తిరుగుతున్నాయి. కాని బుధునికి భూమికి మధ్యన వున్న శుక్రుడు మాత్రం సూర్యునికి ప్రదక్షిణం చేస్తున్నాడు. దీన్నే 'రెట్రో గ్రేడ్ మోషన్" అంటాం. దీనికి ఈ రెట్రో గ్రేడ్ మోషన్ ఎందుకు నచ్చినట్టు? దీనికి కూడా ఏ శాస్త్రవేత్త ఇంతవరకు సమాధానం చెప్పలేదు. అయితే ఈ అంశానికి నా ఆలోచన సమాధానం చెప్తుంది"

హెరాల్డ్ విల్సన్ ముఖంలో ఔత్సుక్యం ఆసక్తి మరింత ఎక్కువయ్యాయి. పిన్ డ్రాప్ సైలెన్స్‌తో వినసాగాడు.

"ఐ టెస్టెడ్ యువర్ పేషన్స్ వెరీమచ్. ఇంక అసలు పాయింట్‌కి వస్తాను. సౌర కుటుంబంలో భూమినీ శుక్రునీ కవలగ్రహాలుగా భావిస్తారు. ఎందుకంటే ఈ రెండింటికి అనేక విషయాలలో పోలిక ఉంది. అఫ్‌కోర్స్. ఆ డీటైల్స్‌లోకి ఇప్పుడు వెళ్ళను. భూమి మీద వాయురూపంలో హైడ్రోజన్ ఉండలేదు. కాని నీటిలో భాగంగా పుష్కలంగా ఉంది. రెండు హైడ్రోజన్ పరమాణువులూ, ఒక ఆక్సిజన్ పరమాణువు సంయోగం చెందితే ఒకనీటి అణువు ఏర్పడుతుంది. ఈ నీటిని విడగొడ్తే ఆక్సిజన్ వాతావరణంలోకి వెళ్ళిపోతుంది. హైడ్రోజన్ దాని పలాయన వేగం (ఎస్కేప్ వెలాసిటీ) చాలా తక్కువ కనుక భూమిమీద ఉండక అంతరిక్షంలోకి వెళ్ళిపోతుంది. మన భూవాతావరణంలో ఆక్సిజన్ గణనీయంగా ఉంది. ఇది ఇంతగా ఎలా వచ్చింది. సూర్యుని తాపానికి నీరు ఆవిరై వాతావరణంలోకి పోతుంది. ఈ ఆవిరిలో కొంత భాగం అల్ట్రావయొలెట్ కిరణాల కాస్మిక్ కిరణాల తాకిడివల్ల విశ్లేషణం చెందుతుంది. ఫలితంగా ఆక్సిజన్ వాతావరణంలో ఉండిపోతుంది. హైడ్రోజన్ శాశ్వతంగా వెళ్ళిపోతుంది. ఇంకోటి మానవులు జంతువులు వదిలిన కార్బన్‌డై ఆక్సయిడ్‌ని లేదా కర్రలు, పుల్లలువంటి సేంద్రియ పదార్థం తగలబడగా వచ్చే కార్బన్ డైఆక్సయిడ్‌నీ చెట్లు పీల్చుకుని అందులోని ఆక్సిజన్‌ని విడగొడ్తాయి. ఇది వాతావరణంలో చేరుతుంది. మరి శుక్రునిమీద ఆక్సిజన్ కార్బన్ డై ఆక్సయిడ్ రూపంలో ఉంది. మనుష్యులు, జంతువులు, చెట్లు చేమలు లేని అక్కడ అంతగా కార్బన్ డై ఆక్సయిడ్ ఎలా వచ్చినట్లు? ఇందులోనే ఉంది అసలు కిటుకు.

నా ఉద్దేశ ప్రకారం శుక్రుని మీదకూడా స్వతహాగా భూమి మీద ఏర్పడినట్లే సముద్రాలు ఏర్పడి ఉండాలి. ఈ సముద్రాలకి తోడు మరో రకం సముద్రాలుకూడా ఏర్పడి ఉండాలి. అవి ఏవంటే కార్బన్ రసాయనాల సముద్రాలు. ఈ మాట వినడానికే వింతగా ఉంది కదూ. బృహస్పతి, శనివంటి సుదూర బృహద్గ్రహాల వాతావరణంలో మిథేన్ వాయువు పుష్కలంగా ఉంది. శనికి ఉపగ్రహం అయిన టైటాన్‌పై ద్రవ రూపంలో ఉన్న మిథేన్ సముద్రాలు ఉన్నాయి. ఈ విషయం మనకి వింతగానూ కొరుకుడు పడనట్లు గానూ ఉండవచ్చు. ఉదాహరణకి ఒక గ్రహం మీద కేవలం మంచి నీటి సముద్రాలే ఉన్నాయనుకుందాం. అక్కడి వారికి మన ఉప్పునీటి సముద్రాల గురించి చెప్తే అర్థం చేసుకోడానికి ఇబ్బంది పడ్తారు. ఇదికూడా అంతే. మిథేన్ వాయువు అతిసామాన్యమైన హైడ్రోకార్బన్ దీనికి సాంకేతికం $CH_4$ అంటే దీని అణువులో ఒక కార్బన్ పరమాణువు నాలుగు హైడ్రోజన్ పరమాణువులు ఉంటాయి. ఇది తేలిగ్గా మండుతుంది. ఈ విధమైన హైడ్రోకార్బన్లు వాయు రూపంలో ద్రవరూపంలో ఘన రూపంలో

ఎన్నో ఉన్నాయి పెట్రోలియం ద్రవ రూపంలో ఉన్న హైడ్రోకార్బనన్న విషయం తెలిసిందే.

ఈవిధంగా గతంలో శుక్రుని మీద మామూలు సముద్రాలు, హైడ్రో కార్బన్ సముద్రాలూ రెండు ఉండి ఉండేవనుకుందాం. భూమి సూర్యుని నుంచి తొమ్మిది కోట్ల మైళ్ళ దూరంలో ఉండగా శుక్రుడు ఆరుకోట్ల మైళ్ళ దూరంలోనే ఉన్నాడు. అందువల్ల మనకంటే శుక్రుని మీద చాలా ఎక్కువ వేడి ఉంటుంది. ఈ వేడిమి మూలంగా శుక్రుని మీద సముద్రాలు ఆవిరైపోతుండాలి. ఆ ఆవిర్లు వాతావరణంలో ఉపరిభాగానికి చేరినప్పుడు అమిత తీక్షణమైన అల్ట్రావాయిలెట్, కాస్మిక్ రేడియేషన్‌ల మూలంగా విశ్లేషణం చెందుతూ ఉండి ఉండాలి. ఫలితంగా ఆక్సిజన్ వాతావరణంలో చేరడం, హైడ్రోజన్ అంతరిక్షంలోకి పోవడం జరుగుతూ ఉండి ఉండాలి. అయితే హైడ్రోకార్బన్‌లకి ఆక్సిజన్‌తో కలిసి మండిపోయే లక్షణం ఉంది. అందువల్ల ఒక ప్రక్క ఆక్సిజన్ విడుదలవుతుంటే మరో ప్రక్కన హైడ్రో కార్బన్ సముద్రాలు తగలబడుతుండి ఉండాలి.

ఈ విధంగా శుక్రుని మీద జలసముద్రాలు పూర్తిగా ఆవిరి అయిపోయేదాకా జరుగుతూ ఉండి ఉండాలి. ఈ ప్రక్రియలో కార్బన్ డై ఆక్సయిడ్ విడుదల అవుతుంది ఆక్సిజన్ పూర్తిగా ఖర్చు అయ్యేవరకూ ఈ విధంగా జరిగి వాతావరణం ఇంచుమించు పూర్తిగా కార్బన్ డై ఆక్సయిడ్‌తో నిండిపోయింది. అంతటితో శుక్రునిపై మంటలు ఆగిపోయాయి. పైగా కార్బన్ డై ఆక్సయిడ్ మంటల్ని ఆర్పుతుందికూడా. ఇంక ఈ హైడ్రో కార్బన్ సముద్రాలు పైనుంచి ఇగిరిపోయినా నేలలో అంతర్గతంగా తక్కువ లోతులోనే విస్తారంగా ఉండి ఉండాలి''-చెప్పడం ఆపాడు దినకర్.

''మా ఉద్దేశ ప్రకారం ఆ హైడ్రోకార్బన్ సముద్రం వేరేది కాదు. పెట్రోలియం సముద్రమే'' అని అందించాడు హంఫ్రీ.

''ఓ..... సరే మరి మీ ఊహసరియైనదని ఎలా నిరూపిస్తారు?'' అన్నాడు హెరాల్డ్ విల్సన్.

''నా పాయింట్‌కు రెలివెంట్'' అంటూ ఇందాక చాలా విషయాలు చెప్పానే వాటిద్వారా మా ఊహరైటన్న నమ్మకం మాకుంది?''

''స్ట్రేంజ్' అన్నాడు హెరాల్డ్ విల్సన్.

''శుక్రగ్రహ వాతావరణంలో 98 శాతం వరకు కార్బన్ డై ఆక్సయిడ్ ఉండడానికి ఆక్సిజన్ లేకపోవడానికి సబబైన కారణం మరేదీ కనిపించదు. పోతే రెండో పాయింట్? శుక్రుడు, బుధుడు, చంద్రుడులాగా కదలకుండా అంటే తన చుట్టు తాను తిరగకుండా ఎందుకున్నాడు. దీనికి బలీయమైన సూర్యాకర్షణ శక్తి ఒక్కటే కారణమా? మరో కారణం కూడా ఉందని నేను అనుమానిస్తున్నట్లు చెప్పాను కదా ఇదిసముద్రాలు ఉన్నప్పుడు ఏర్పడే పరిస్థితి భూమి మీద సముద్రాలకి ఆటుపోట్లు చంద్రున ఆకర్షణ వల్ల కలుగుతుంటాయన్న విషయం మనందరికీ తెలుసు. ఈ ఆటుపోటులో సూర్యుడు కూడా కొంతవవరకు కారణమే కాని సూర్యుడు చాలా దూరాన్న ఉండడంచేత ఆ ప్రభావం తక్కువ. అయితే సూర్యుడు చంద్రుడు ఒకేవైపు వచ్చినప్పుడు రెండింటి సమిష్టి ప్రభావం వల్ల గరిష్ట స్థాయిలో అలలు లేస్తాయి. తిరిగే చక్రం మీద నీళ్ళు పోస్తే దానికి వ్యతిరేకదిశలో నీళ్ళు చిమ్ముతాయి. అలాగే భూమి వేగంగా తిరుగుతున్న కారణంగా పైనున్న సముద్ర జలాలు దానికి వ్యతిరేక దిశలో కదులుతాయి. దీనికితోడు అలలు

ప్రభావంకూడా కలిస్తే ఈ ఎదురు ప్రభావం మరీ ఎక్కువగా ఉంటుంది, దీని మూలంగా భూమి ఆత్మ భ్రమణ వేగం తగ్గుతోంది. పరుగెడుతున్న గుర్రానికి కళ్ళెం లాగితే దాని వేగం తగ్గుతుంది. ఇంకా లాగితే పరుగెత్తడం ఆపి నిల్చుండిపోతుంది. మన భూమి కూడా ఇంతే. వందల కోట్ల సంవత్సరాల క్రితం ఆరు గంటలలోనే తన చుట్టూ తాను తిరిగేదట. ఇప్పుడు ఇరవై నాలుగు గంటలు తీసుకుంటోంది. ఇది ఇలా పెరుగుతూ పోయి కొన్ని వందల కోట్ల సంవత్సరాలకి భూమి కూడా తన చుట్టూ తాను తిరగడం ఆపివేస్తుందట. ఆఫకోర్స్ అప్పటికి మన వైజ్ఞానికులు అందుకు ఏదో మార్గం కనిపెట్టకపోరు. సారీ మిస్టర్ చైర్మన్ నేను మొదట్లో లెక్చరర్‌గా పనిచేశాను. అందువల్ల చిన్న విషయాలను కూడా వివరంగా చెప్పుకుపోవడం అలవాటు. సారీ ఐయాం టేకింగ్ మచ్ ఆఫ్ యువర్ టైం'' అన్నాడు దినకర్ కొంచెం సిగ్గుపడ్తూ.

''దట్సాల్ రైట్. కారీ ఆన్ ఇటీజ్ క్వైట్ ఇంటరెస్టింగ్ '' అన్నాడు ఆయన.

''కమింగ్ టుది నెక్స్ట్ పాయింట్. శుక్రుని మీద సూర్యాకర్షణ శక్తి ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది కనుక, అక్కడి సముద్రాలలో బ్రహ్మాండమైన అలలు వస్తూ శుక్రుని వేగాన్ని తగ్గించి వేస్తూ చివరికి కదలకుండా చేశాయి. అయితే దీనివల్ల శుక్రుని మీద సముద్రాలు ఉండేవన్న విషయం రూఢి అవుతుంది కాని అవి మామూలు సముద్రాలో, పెట్రోలియం సముద్రాలో, లేక రెండూనో అన్న విషయం నిర్ధారణ కాదు. అయితే వాతావరణంలో వున్న అత్యధిక కార్బన్ డై ఆక్సయిడ్‌ను గుర్తించినప్పుడు ఈ రెండు సముద్రాలు ఉంటేనే అది సాధ్యమవుతుందని తేటతెల్లమవుతుంది.

ఇంక మూడవ పాయింట్ శుక్రుని రెట్రోగ్రేడ్ మోషన్. భూమి బుధుడువంటి ఇతర గ్రహాలలాగా కాకుండా శుక్రుడు సూర్యుని చుట్టూ అపసవ్య మార్గంలో ఎందుకు తిరుగుతున్నట్లు? శుక్రుడు తనచుట్టూ తాను తిరగడం ఆగిపోవడానికి కారణాలను చెప్పాను గదా. ఆ రోజుల్లో శుక్రుడు కూడా సవ్యమైన మార్గంలో తిరుగుతుండాలి. కాని అలలు వ్యతిరేక దిశలో తోసి వేస్తుండడంవల్ల క్రమేపీ శుక్ర కక్ష్యమీద కూడా ఈ వ్యతిరేక ప్రభావం ఉండి ఉండాలి. శుక్రుడు ఆత్మ భ్రమణం ఆపివేసినప్పుడు మిగిలిపోయిన యాంగ్యులర్ మోమెంటం ఆ గ్రహాన్ని వెనక్కి నెట్టి వేస్తూండడంవల్ల దానికి రేట్రోగ్రేడ్ మోషన్ వచ్చి ఉండాలి. ఈ అంశాన్ని వివరించాలంటే మాథమెటికల్ ఫార్ములాలు వేయవలసి ఉంటుంది. అది ఇప్పుడు అనవసరం. అలల తాకిడి వల్లనే ఇలా జరగడానికి అవకాశం ఉందని తెలుసుకుంటే చాలు. అలలు ఉన్నాయని నిర్ధారణ అయినప్పుడు అది వున్న సముద్రాలు మామూలువో పెట్రోలియంవో అయి ఉండాలని కార్బన్ డై ఆక్సయిడ్‌వల్ల నిర్ధారణ అవుతోంది. ఈ కారణాలవల్ల శుక్రుడి మీద తక్కువ లోతులోనే అపారమైన పెట్రోలియం నిక్షేపాలున్నాయని నా గట్టి నమ్మకం. మీరు శుక్రుని మీదకు మమ్మల్ని పంపే ఏర్పాటు చేస్తే అక్కడి నుంచి చమురును త్రవ్వి తీసుకురాగలం'' అన్నాడు దినకర్‌రావు.

కొంచెం సేపు మౌనంగా ఉండి పోయాడు హెరాల్డ్ విల్సన్.

''ఐ థింక్ యూ ఆర్ నాట్ కన్‌విన్స్‌డ్'' అన్నాడు హంఫ్రీ.

''నాటిన్ ది లీస్ట్ ఐ యాం థింకింగ్ సమ్‌థింగ్ ఎల్స్. మీరు వీనస్ మిషన్‌కి వెళ్ళిరాగలరా'' అన్నాడు చైర్మన్.

''వైనాట్ నేను స్పేస్ షటిల్ పైలట్‌ని, మిస్టర్ దినకర్ అనుభవం ఉన్న జియాలజిస్ట్. ఎన్నో

ల్యూనార్‌మిషన్స్‌లో ఎన్నెన్నో ఖనిజాలను భూమికి తెచ్చినవాడు" అన్నాడు హంఫ్రీ.

"అయితే మా ఆలోచన మీకు నచ్చినట్లేనా?" అన్నాడు దినకర్.

"వెల్ ఐ థింక్ సో" అన్నాడు హెరాల్డ్ విల్సన్. అమెరికన్లు దేనినీ సూటిగా ఒప్పుకోరు. ప్రతిదానికీ బాగా తెలిసిన వాటికి కూడా "ఐ థింక్ సో ఐ బిలీవ్ సో ఐగెస్‌సో" అంటుంటారు.

"దెన్ లెటజ్ బి బిజినస్‌లైక్. మా ఐడియా మీకు నచ్చింది కనుక మీరు ప్రకటించిన బహుమతిని మాకివ్వాలి" అన్నాడు హంఫ్రీ.

"వెల్ దాన్నికమిటీ ముందు ఉంచి అప్రూవ్ అయ్యాక మీకు ఇస్తాం. అది సరే మీదంతా వట్ట వైల్డ్ ఇమాజినేషన్ అనుకోండి. అప్పుడు మా కంపెనీ పరిస్థితి ఏమిటి? ఇన్ని కోట్ల డాలర్లు ఖర్చు పెట్టి మిమ్మల్ని వీనస్‌కిపంపిస్తే అక్కడ ఏవీ లేకపోతే అంతా వేస్టేగా?" అన్నాడు.

"మిస్టర్ విల్సన్ మీ యాన్యువల్ కాన్ఫరెన్స్‌లో పేపర్లో ప్రకటనలు ఇయ్యడానికి కొందరు అభ్యంతరపెడ్తే మీరే "లెటజ్ ఎటెంప్ట్" అని సమర్థించారని పేపర్లో వచ్చింది. ఇదికూడా అంతే లాజికల్‌గా మా ఆలోచన రైటు. సో యూ ఎటెంప్ట్ ఇట్. ఎ ట్రయల్ మేకాస్ట్ సమ్ థింగ్ బట్ ఇటీజ్ వర్త్‌వైల్" అన్నాడు దినకర్.

"మీ కంపెనీ ఇప్పటికే నష్టాలలో నడుస్తోంది. కొన్నేళ్ళలో మూతపడవచ్చునుకూడా. ఈ వీనస్ మిషన్ సక్సెస్‌ఫుల్ అయితే మీ కంపెనీ బ్రహ్మాండంగా పుంజుకుంటుంది. ఫెయిలయితే మరికొంతముందుగానే మూతపడ్తుంది. సో యూ టేక్ ఎ ఛాన్స్" అన్నాడు హంఫ్రీ.

"వెల్ బాయిస్. దటీజ్ ట్రూ. మీ ఐడియా నాకు నచ్చింది కనుక ప్రకటించిన మొత్తం మీకు గ్యారంటీగా ఇస్తాం. పోతే వీనస్ మిషన్‌కి కమిటీ ఒప్పుకుంటే మీకు స్పేస్‌షిప్ ఏర్పాటు చేయించి మిమ్మల్నే పంపుతాం. అక్కడ ఆయిల్ దొరికి మీరే తీసుకువచ్చి అది లాభసాటి అనిపిస్తే మీరుకూడా మా కంపెనీలో షేర్ హోల్డర్స్ అవుతారు. మీకు తగినరాయల్టీ ఇప్పిస్తాం. అఫ్‌కోర్స్ ఇవన్నీ మనం తర్వాత చర్చించుకోవలసిన విషయాలు. నేను వెంటనే ఎమర్జెంట్ జనరల్ బాడీ మీటింగ్ కాల్‌ఫర్ చేస్తాను. అది అయ్యాక తెలియబరుస్తాను" అన్నాడు చైర్మన్.

"ఓకె సియూ ఎగైన్" అంటూ సెలవు తీసుకున్నారు హంఫ్రీ, దినకర్‌లు.

ఎమర్జెంట్ జనరల్ బాడీ మీటింగ్‌లో వీనస్‌మిషన్‌కి అప్రూవల్ లభించింది. నాసాకేంద్రంతో చర్చలు జరిపి తగిన స్పేస్ షటిల్‌ను హంఫ్రీ, దినకర్‌లకు అప్పచెప్పడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రకటించిన బహుమతి మొత్తాన్ని పంపుతూ ఈ విషయం తెలియజేశాడు హెరాల్డ్ విల్సన్. అది చూసి దినకర్, హంఫ్రీల ఆనందానికి అవధిలేకుండా పోయింది.

మరొక నెలలో వీనస్ మిషన్‌కి కావలసిన స్పేస్‌షిప్ సిద్ధం అయింది. ఆ యాత్రకి కావలసిన సాంకేతిక వివరాలన్నీ తయారుచేసి కంప్యూటర్‌కి ఫీడ్ చేశారు.

మరుసటి వారంలో దివాకర్, హంఫ్రీల శుక్ర గ్రహయాత్ర మొదలయింది. అనుకున్న విధంగా రెండు నెలలో శుక్రగ్రహాన్ని జేరింది స్పేస్‌షిప్. దట్టమైన ఆ వాతావరణంలో షిప్ మండి బుగ్గి అయిపోకుండా

ప్రత్యేక ఏర్పాట్లు జేసుకున్నారు. అలాగే తీవ్రమైన ఒత్తిడి, తుఫానుగాలుల నుంచి రక్షించుకోడానికి అనువుగా స్పేస్‌షిప్‌ను తయారు చేశారు. విపరీతమైన ధూళి మేఘాలు ఉండడంతో ఉపరితలం కనిపించడంలేదు. అయితే రాడార్ సహాయంతో ఎక్కడ కొండలున్నదీ పల్లపు ప్రాంతం ఎక్కడ ఉన్నదీ తెలుస్తోంది. ఎవరెస్టు కంటే ఎత్తయిన శిఖరాలున్న పర్వతాలెన్నో ఉన్నాయి అక్కడ. అతి విశాలంగానూ లోతుగానూ ఉన్న లోయలూ, మైదాన ప్రాంతాలూ కూడా ఎన్నెన్నో ఉన్నాయి. స్పేస్ షిప్ రెట్రో రాకెట్ల సహాయంతో నెమ్మదిగా దిగుతోంది. ఐదువేల అడుగుల ఎత్తుకి వచ్చేసరికి ధూళి మేఘాలు పల్చనై నేల కనిపించింది. దిగుతున్న కొద్దీ మరింత స్పష్టంగా కనిపిస్తోంది. బైనాక్యులర్స్ లోనుంచి చూస్తుంటే కొన్ని చోట్ల అతిపెద్ద గోతులు కనిపించాయి. వాటి మధ్య స్పటికాలు ఏవో మెరుస్తున్నాయి. అవి ఎండిపోయిన మామూలు సముద్రాలన్నమాట. వాటిలోని లవణాలు స్పటికాలుగా గట్టిపడి మెరుస్తున్నాయి. మరికొన్ని విశాలమైన భూభాగాలు నల్లగా కమిలిపోయి కనిపిస్తున్నాయి.

'అటు చూడు పెట్రోలు వలికిన నేల నల్లబడినట్లుగా అవి లేవూ; బహుశా అవి ఎండిపోయిన పెట్రోల్ సముద్రాలు అయి ఉంటాయి'' అన్నాడు దినకర్ వాటిని చూపుతూ.

స్పేస్‌షిప్ నెమ్మదిగా వెళ్ళి అటువంటి నేలమీద దిగింది. అక్కడి మట్టిని కొంచెం తీసి, చూశారు. అది జిగురు జిగురుగా వుండి స్పష్టంగా పెట్రోలు వాసన కొట్తోంది.

''హుర్రా'' అని అరిచాడు హంఫ్రీ ఆనందంతో.

వెంట తెచ్చిన రిగ్‌తో ఆ నేలని తవ్వారు వాళ్ళు. కొంచెం దూరం తడినేల వచ్చిన తర్వాత ఝుయ్యిమంటూ పెట్రోలు తన్నుకొచ్చింది. దాని శాంపుల్స్‌ని తీసుకుని తిరిగి స్పేస్‌షిప్‌లోకొచ్చారు. షిప్‌ని వీనస్ చుట్టూ పరిభ్రమింపజేస్తూ చమురు క్షేత్రాలు ఎక్కడెక్కడున్నాయో సర్వేచేశారు. తర్వాత భూమికి పెట్రోలుపడ్డ విషయం వైర్‌లెస్ ద్వారా తెలిపారు.

మరో రెండు నెలల్లో స్పేస్‌షిప్ పెట్రోలియంతో భూమిని చేరింది. దినకర్ హంఫ్రీకి బ్రహ్మాండమైన స్వాగతం లభించింది. ఇంధన సంక్షోభం నుంచి భూమిని కాపాడిన ఉద్ధారకులుగా ప్రజలు, పత్రికలు కీర్తించాయి.

అతి త్వరలోనే వీనస్ కాంటినెంటల్ ఆయిల్ కంపెనీ వెలిసింది. నిరంతరం అక్కడినుంచి షటిల్‌ద్వారా పెట్రోలియం సరఫరా మొదలయింది.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, మే 1988** ✪

# యెల్లోడెత్

"రాజధానిని కబళిస్తున్న అంతుపట్టని వ్యాధి"

ఆ రోజు అన్ని పత్రికలలోనూ ఉన్న పతాక శీర్షిక ఇదే.

ఆందోళనగా వివరాలు చదవసాగాడు డాక్టర్ అశ్వనీకుమార్.

ఢిల్లీనగరంలోని రామకృష్ణాపురంలోని సెక్టార్ 14లో వారంరోజుల క్రిందట ఒక వింతవ్యాధి సోకి ముందుగా ఒక లోకాలిటీలో పదిమంది మరణించారు. ఆ వ్యాధి ఏమిటో అంతుపట్టలేదు కాని గంటగంటకీ మృతుల సంఖ్య పెరిగిపోసాగింది. ఈ వ్యాధి సోకిన వారికి కళ్ళుమంటలు, ముక్కుమంట, ఊపిరితిత్తులలో మంట, ఊపిరి సరిగ్గా ఆడకపోవటం, వళ్ళంతా ఉడికిపోతున్నట్లు అనిపించడంతో మొదలై గంటలోపలే ప్రాణం పోతోంది. ఏ వైద్యం చేసినా నయం కావడంలేదు. ఆక్సిజన్ ఎక్కించినా ఊపిరి సాఫీగా అందడంలేదు. అసలు వ్యాధి ఏమిటో తెలిస్తే దాని నివారణ కనుగొనవచ్చు. అసలు అదేమిటో అంతుపట్టక పోతే చేయగలిగింది ఏమిటి? కేసుల్ని సవ్యంగా పరీక్షించాలన్నా తగిన వ్యవధి ఉంటేగా! చూస్తుండగానే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ వింత వ్యాధితో రాజధాని నగరం అట్టుడికిపోతోంది.

ఇంతలో డాక్టర్ ప్రశాంత్ అతని వెనకాల డాక్టర్ నీనా వచ్చారు అక్కడికి. ప్రశాంత్ డాక్టర్ అశ్వనీకుమార్ దగ్గర అసిస్టెంట్.

నీనా డాక్టర్ అశ్వనీకుమార్ కి కుమార్తె కాదు, పర్సనల్ సెక్రటరీ కూడ. అంతేకాదు తండ్రి జరిపే పరిశోధనలలో సహాయపడ్తుంటుంది. ఆ ముగ్గురు కూడా మాలిక్యులర్ బయాలజీలో డాక్టరేట్ పుచ్చుకున్నవారు. ప్రభుత్వ పరిశోధనా సంస్థలలో పనిచేస్తూ తన 46వ ఏట ప్రిమెచ్యూర్ రిటైర్మెంట్ తీసుకొని ఢిల్లీకి పాతికమైళ్ళ దూరంలో సొంతంగా లాబొరేటరీ నెలకొల్పుకొని ప్రశాంతంగా పరిశోధనలు చేసుకుంటున్నాడు డాక్టర్ అశ్వనీకుమార్.

గత ఐదేళ్ళలో డాక్టర్ అశ్వనీకుమార్ తన లాబొరేటరీలో జరిపిన పరిశోధనలకి, సాధించిన విజయాలకి దేశంలోనేకాక ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. ఐదేళ్ళ వయసులోనే తల్లిని పోగొట్టుకున్న నీనాను అల్లారుముద్దుగా పెంచి తన బాటలోనే తీర్చిదిద్దాడు అశ్వనీకుమార్. ఆమె ఏకైకపుత్రిక



కావడంతో నీనాని కూతురుగానే కాక కొడుకుగా భావించుకుంటున్న ఆయనకి నీనాకి ఇరవైమూడేళ్ళు వచ్చినా పెళ్ళి చేయాలన్న ఆలోచనే రాలేదు. నిత్యమూ తండ్రితోపాటు పరిశోధనలలో మునిగితేలుతుండే ఆమెకీ ఆ విషయం పట్టలేదు. డాక్టర్ అశ్వనీకుమార్ ప్రభుత్వ సర్వీసులో ఉన్నప్పుడు డాక్టర్ ప్రశాంత్ ఆయన దగ్గర అసిస్టెంట్‌గా ఉండేవాడు.

అతనిని అద్భుతమైన తెలివితేటలు. మంచి చురుకుతనం. ఎటువంటి సమస్యనైనా సులువుగాపరిష్కరించే నేర్పు. వీటికితోడు ఆకర్షణీయమైన రూపం- చక్కని ప్రవర్తన. వీటన్నిటి మూలంగా అతనంటే ఎంతో అభిమానాన్ని చూపించేవాడు డాక్టర్ అశ్వనీ కుమార్. ఆయన దగ్గర పనిచేయడం ఒక అదృష్టంగా భావించేవాడు ప్రశాంత్. ఈ విధంగా ఇద్దరికి బాగా కలసి పోవడంతో ఎప్పుడైతే డాక్టర్ అశ్వనీ కుమార్ రిటైర్మెంట్ తీసుకొని సొంత లాబొరేటరీ పెట్టుకున్నాడో ప్రశాంత్ కూడా తన ఉద్యోగాన్ని వదులుకుని ఆయన వెంట వెళ్ళి పోయాడు. అక్కడే ఉంటూ ఆ కుటుంబంలో ఒక సభ్యుడై పోయాడు.

ప్రశాంత్‌ని చూడగానే "చూశావా ప్రశాంత్. ఈ వింత వ్యాధి సెక్టర్ - 13లో కూడా ప్రవేశించిందట. ఇప్పటికి పాతికవేల మంది పైగా చనిపోయారు. ఎంతోమంది ప్రపంచ శాస్త్రజ్ఞులు వచ్చిచూసినా ఈ వ్యాధిని వ్యాపింప జేస్తున్న క్రిమి ఏమిటో అంతు బట్టడం లేదట. ఈవ్యాధి ఇలాగే వ్యాపిస్తే మరికొద్ది రోజుల్లోనే మొత్తం ఢిల్లీ నగరం పీనుగుల పెంట అయిపోతుంది. ఒక్క ఢిల్లీయే కాదు. తర్వాత దేశం మొత్తం ఆపై ప్రపంచం కూడా సర్వనాశనం అయిపోతుంది" అంటూ ఆందోళన వ్యక్తం చేశాడు.

''అవును మార్నింగ్ న్యూస్ విన్నాను. పేపర్లలో కూడా చూశాను. పేపర్లన్నింటిలోనూ ఇదే వా. సెక్టార్ -14లో ఉన్నవాళ్ళు దానిచుట్టుపక్కల సెక్టార్ వాళ్ళు ఈ వ్యాధి ఎక్కడ అంటుకుంటుందోనన్న భయంతో ఖాళీచేసి వలసపోతున్నారట'' అన్నాడు ప్రశాంత్.

''ఎయిడ్స్ వ్యాధిని గురించి భయపడినట్టు భయపడుతున్నట్టున్నారు'' అంది నీనా

''నోనో దానికీ దీనికీ ఎక్కడా కంపారిజన్ లేదు. ఎయిడ్స్ ది స్లో డెత్ ప్రాణం తీయడానికి నెలలూ, సంవత్సరాలూ తీసుకుంటుంది. ఈ వ్యాధి కేవలం కొన్ని గంటల్లోనే మట్టుపెట్టేస్తోంది.'' అన్నాడు ప్రశాంత్

''ఎగ్జాక్ట్‌లీ. చాలా కరెక్టుగా చెప్పావు. ఎయిడ్స్ రోగుల్ని దూరంగా ఉంచినట్లు వారిని చూస్తేనే మహమ్మారిని చూసినట్లు వీరిపని కూడా అలాగే అయింది. ఖాళీచేసి వస్తున్నవాళ్ళకి ఎవరూ తమ ఇళ్ళను అద్దెకియ్యడం లేదు. బస్సులలోకి ఎక్కించుకోవడం లేదు. పరాయి ఊళ్ళవాళ్ళు పొలిమేరల్లోకి కూడా అనుమతించడంలేదు. ఈ పరిస్థితులలో వేలమంది శరణార్థులవలె రోడ్ల పక్కనే ఉండి పోయారట. దీని మూలంగా శాంతిభద్రతల సమస్య, ఆరోగ్య సమస్య కూడా ఉత్పన్నమవుతున్నాయట. నిరాశా నిస్పృహలతో వారు ఎంతకైనా తెగించవచ్చు. ఏమైనా చేయవచ్చునని భయపడుతున్నారు అధికారులు. అంతా గందరగోళంగా ఉంది.'' అంటూ ఆందోళన వ్యక్తం చేసారు డాక్టర్ అశ్వనీకుమార్.

''ఆ మృతదేహాలను పరీక్షించి బాడీటిస్యూలను తెచ్చి మన లేబొరేటరీలో టెస్టుచేస్తే ఏమైనా తెలియవచ్చు.'' అన్నాడు ప్రశాంత్.

''కరెక్టు, ఎంతోమంది పరిశోధనలు చేస్తున్నారనుకో ఇప్పటి వరకు ఎవరికీ ఇది అంతుపట్టలేదు. అలా అని మనం ఊరుకుంటామా! మనమూ ప్రయత్నం చేయాలి ఎవరి పరిశోధనలు ఫలిస్తాయో! వచ్చిన చిక్కల్లా ఈ పరిశోధనలు ఎంతో సమయం తీసుకుంటాయి ఈ లోగా ప్రమాదం ముంచుకొస్తుంది. ప్రయోగాలు ఫలించి వ్యాధి నశిస్తుందో అవి ఫలించకముందే మానవాళి అంతా సర్వనాశనం అవుతుందో కాలమే చెప్పాలి. వెంటనే మనం పరిశోధనలు ప్రారంభించాలి'' అన్నాడు డాక్టర్ అశ్వనీకుమార్.

ఫోన్ గణగణ మ్రోగింది.

''హలో.... డాక్టర్ అశ్వనీకుమార్ స్పీకింగ్''

''దిసీజ్ పి.ఎస్ టుహెల్త్ మినిస్టర్ స్పీకింగ్ మినిస్టర్ వాంట్స్ టు స్పీక్ టు యు. జస్ట్ ఏ మినిట్ ప్లీజ్ బి ఆన్ లైన్''

హెల్త్ మినిస్టర్ లైన్లోకి వచ్చారు.

''గుడ్ మార్నింగ్ డాక్టర్ అశ్వనీకుమార్.''

''వెరీ గుడ్ మార్నింగ్ సర్. ఐ యామ్ ఎట్ యువర్ సర్వీస్''

''థ్యాంక్యూ చూడండి. ఇప్పుడు నేషనల్ ఎమర్జెన్సీ వచ్చింది. ఢిల్లీ నగరం నాశనం అయిపోతోంది. మొత్తం దేశమే నాశనం అయ్యేట్టుంది. ఈ ఆపదనుంచి గట్టెక్కాలంటే మీవంటి శాస్త్రవేత్తల సలహాలూ, సహకారం ఎంతైనా అవసరం. మనదేశంలో మిమ్మల్ని మించిన జీవశాస్త్రవేత్తలేరు. అందువల్ల ఈ రోజు సాయంత్రం నాలుగుగంటలకి నా ఛాంబర్‌లో ఒక మీటింగ్ ఏర్పాటు చేశాం. దానికి మీరు తప్పక రావాలి.

హోం సెక్రటరీ శ్రీ సోమయ్య ఈ మీటింగ్‌కి కన్వీనర్‌గా ఉంటారు."

"తప్పకుండా వస్తాను సార్. దటీజ్ మై డ్యూటీ. ఇప్పటివరకు నేనూ డాక్టర్ ప్రశాంత్ ఈ విషయంలో ఏమి చేయాలా అనే చర్చించుకుంటున్నాం"

"వెరీగుడ్ ఆయన్ని కూడా మీతో తీసుకురండి. ఆ...పోలీసులు ఢిల్లీ నుంచి వెళ్ళే మార్గాలన్నింటినీ సీల్ చేశారు. మీ కారు చెక్‌పోస్టు దగ్గరకి రాగానే హోండిపార్టుమెంటు అధికారులు మిమ్మల్ని రిసీవ్ చేసుకుంటారు. అక్కడినుంచి మీరు ఇక్కడికి వచ్చే ఏర్పాట్లు వారే చేస్తారు."

"థాంక్యూసర్ ఉయ్‌షల్ బి దేర్ ఆన్ టైం"

ఫోన్ పెట్టేశాక "ప్రశాంత్ విన్నావుగా హెల్త్ మినిస్టర్ కాల్. ఈ వింత వ్యాధి విషయం చర్చించడానికి ఈ సాయంత్రం నాలుగు గంటలకి ఆయన మీటింగ్ పెట్టారు. మనిద్దర్నీ రమ్మన్నారు." అన్నాడు డాక్టర్ అశ్వనీకుమార్.

నీనా దిగులుగా చూసింది.

"దిగులుపడకమ్మా. ఆయన ఆహ్వానించింది మా ఇద్దరినేననుకో. కాని నువ్వు లేకుండా ఎలా జరుగుతుంది! నువ్వు మా అమ్మాయివే కాదు. నా పర్సనల్ సెక్రటరీవి కూడా. ఆ హోదాలో నువ్వు నా వెంట ఎక్కడికైనా రావచ్చు." అన్నాడు ఆయన.

నీనాముఖం వికసించింది.

ఢిల్లీ పొలిమేరలో ఆగ్రా రోడ్‌మీద పదికిలోమీటర్ల దూరంలో చెక్‌పోస్ట్ ఉంది. అక్కడ కారు ఆపి డ్యూటీ ఆఫీసర్‌కితన కార్డు చూపించాడు డాక్టర్ అశ్వనీకుమార్. ఆయన మర్యాదగా కూర్చోమని చెప్పి ఇంటర్‌కాంలో ఎవరితోనో మాట్లాడాడు. వెంటనే లోపలనుంచి యూనిఫాంలోవున్న ఒక ఆఫీసర్ వచ్చి తనని పరిచయం చేసుకున్నాడు. ఢిల్లీలో నెలకొన్న ప్రమాదకరమైన పరిస్థితుల దృష్ట్యా... తీసుకున్న జాగ్రత్తలను ఆయన వివరించాడు.

అక్కడ వ్యాధి సోకిన శరీరం పసుపుపచ్చగా మారిపోతోంది. ఆ తర్వాత ప్రాణం పోతోంది. అది ఏమి వ్యాధో తెలియని కారణంగా దానికి 'ఎల్లోడెత్ డిసీజ్' అని పేరుపెట్టారు వారు. అది అంటువ్యాధిగా వ్యాపిస్తున్న కారణంగా ఏదైనా ఫలితం ఉండవచ్చునన్న ఆశతో ప్రివెంటివ్‌గా టీకాలు వేస్తున్నారు. ఈ టీకాలు వేసే ఏర్పాటును ఈ చెక్‌పోస్ట్‌లో కూడా చేసారు. అక్కడ వారి ముగ్గుర్నీ ఆ టీకాలు వేసుకోవాలని చెప్పారు. తర్వాత నగరంలో ఉన్న గాలి కలుషితం అయింది. కనుక ప్రత్యేకమైన ఎయిర్‌టైట్ కారును ఏర్పాటుచేశామని దానిలో వెళ్ళమనీ చెప్పారు. నిజానికి హెల్త్ మినిస్టర్ ఉన్న ప్రాంతంలో కాని అక్కడికి వెళ్ళేదారిలో కాని ఈ వ్యాధి వ్యాపించలేదు. కాని అక్కడికి వెళ్ళే దారికి రామకృష్ణాపురం కొంత సమీపంలోనే ఉండడం వల్ల ఈ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు.

వారు ముగ్గురు ఆ ప్రకారం టీకాలు వేయించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కారులో వెళ్ళారు. హెల్త్ మినిస్టర్ కార్యాలయంలో కూడా బయటినుంచి కలుషితమైన గాలిలోపలికి రాకుండా ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకొన్నారు.

డాక్టర్ అశ్వనీకుమార్ కారుని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గరాజ్‌లోకి తీసుకువెళ్ళారు. ఆ గరాజ్‌లో

బయటిగాలి రాకుండా ఏర్పాట్లు చేశారు. అక్కడినుంచి ప్రత్యేకమైన ద్వారం గుండా రిసెప్షన్ దగ్గరికి వెళ్ళారు. అక్కడ వారిని హోం సెక్రటరీ శ్రీ సోమయ్య స్వయంగా రిసీవ్ చేసుకున్నారు. రావలసిన వాళ్ళు అందరూ వచ్చాక వారిని మినిస్టర్‌గారి ఛాంబర్‌లోకి తీసుకువెళ్ళారు.

హెల్త్ మినిస్టర్, హోం మినిస్టర్ ఇద్దరూ కూడా ఆ సమావేశానికి హాజరయ్యారు. శ్రీ సోమయ్య అక్కడ ఉన్నవారినందరిని పరిచయం చేశారు "వీరు ఆనరబుల్ హెల్త్ మినిస్టర్ శ్రీ నర్సింగరావు, వీరు ఆనరబుల్ హోం మినిస్టర్ శ్రీగుర్నామ్‌సింగ్ వీరు అందరికీ తెలిసినవారే అయినా లాంఛనంగా పరిచయం చేశాను. వీరు పోలీస్ డైరెక్టర్ జనరల్ శ్రీ శ్రీవాత్సవ. ప్రజలు తమ ఇళ్ళను, ఆస్థులను వదిలిపెట్టి రోడ్ల ప్రక్కన మకాం పెట్టడంతో ట్రాఫిక్ సమస్యలు, శాంతిభద్రతల సమస్యలు తీవ్రంగా ఉత్పన్నమయ్యాయి. ఆ విషయాలు వీరు చూస్తారు. ఈయన డాక్టర్ జింగ్‌యాంగ్. టాక్సాలజీలో ప్రపంచ ప్రసిద్ధిగన్న సైంటిస్టు డాక్టర్ జింగ్ అన్న పేరుతో చాలామందికి పరిచయం. మావో కాలంలో చైనాలో మేధావులను నాశనం చేసినప్పుడు ఆయన తప్పించుకుపారిపోయి ఎన్నో దేశాలలో అజ్ఞాతవాసం గడిపారు. కొద్దినెలల క్రితం మనదేశానికి వచ్చి ఇక్కడే స్థిరపడే ఉద్దేశంతో భారత పౌరసత్వానికి అప్లయ్‌చేసాడు అది ప్రభుత్వ పరిశీలనలో ఉంది అయితే టాక్సాలజీలో ఆయనకున్న విజ్ఞానం, అనుభవం దృష్ట్యా ఈ సమస్యకు ఏదైనా పరిష్కారం సూచించగలరేమోనన్న ఆశతో ఆయన్ని కూడా ఈ ప్రత్యేక సమావేశానికి ఆహ్వానించాం."

పేరు వినడమే కాని అప్పటివరకు చూడకపోవడంతో డాక్టర్ జింగ్ వంక ఆసక్తితో చూశారు డాక్టర్ అశ్వనీకుమార్, ప్రశాంత్‌లు.

డాక్టర్ జింగ్ కూడా వాలుకన్నులతో వారి వంక చూసి చిరునవ్వు నవ్వాడు.

జింగ్ నోట్లో పొడుగాటి పైప్ ఉంది. సాధారణంగా అంతపెద్ద పైప్‌ను ఎవరూ  వాడరు. ఆ పైప్‌లోని టుబాకో డస్టు ఆరిపోయిందో లేదా వెలిగించనేలేదో కాని అందులోంచి పొగరావడం లేదు. ఆ వట్టి పైప్‌నే పీలుస్తున్నాడు ఆయన.

అది చూసి "ఈ చైనా వాళ్ళు విచిత్రమైన వ్యక్తులు" అనుకున్నాడు అశ్వనీకుమార్. పరిచయాలు పూర్తి అయ్యాక హెల్త్ మినిస్టర్ హోం మినిస్టర్‌లు పరిస్థితి తీవ్రతని వివరించి శాస్త్రజ్ఞులు ఈ సమస్యకి పరిష్కారం కనుగొనాలని కోరారు.

"ముందుగా మేము సెక్టార్ - 14 కివెళ్ళి ఈ వింత వ్యాధి ఎక్కడ మొదలయ్యింది, ఎటువైపు వ్యాపించిందీ సర్వే చేయాలి. కొందరు పేషెంట్లనూ చూడాలి. అలాగే చనిపోయిన వారి దేహాలను పరీక్షించడంతోపాటు వాళ్ళ బాడీటిస్యూలను కూడా లేబరేటరీలలో పరీక్షచేయాలి. అప్పుడే ఒక నిర్ణయానికి రాగలం." అన్నాడు డాక్టర్ అశ్వనీకుమార్

ఓ....ష్యూర్ ఇప్పుడు మీరు వచ్చిన ఎయిర్ టైట్ కార్లోనే వెళ్లవచ్చు. మిస్టర్ శ్రీవాత్సవ మీ వెంట ఉంటారు. మీకు  కావలసిన వివరాలన్నీ ఆయన చెప్పగలరు" అన్నాడు శ్రీ  సోమయ్య

"వాట్ డుయు సే డాక్టర్ జింగ్?"

అని అడిగాడు అశ్వనీకుమార్

జింగ్ కళ్లుమూసుకుని కొంచెం సేపు ఏదో దీర్ఘంగా ఆలోచించాడు. తర్వాత పైపుని గట్టిగా పీల్చి "ఓ.కే. అలాగే చేద్దాం. ముందు అక్కడికి వెళ్ళాక తర్వాత ప్రోగ్రాం ఆలోచించుకోవచ్చు" అన్నాడు.

ఆయన పైప్ పీల్చే పద్ధతి నవ్వు తెప్పించింది.

* * * *

ఎయిర్ టైట్ కారు బయలుదేరింది. ముందుసీట్లో డ్రైవర్ ప్రక్కన శ్రీవాత్సవ, ఆయన ప్రక్కన డోర్ దగ్గర డాక్టర్ జింగ్ కూర్చున్నారు. వెనకసీట్లో ప్రశాంత్, నీనా, అశ్వనీకుమార్ కూర్చున్నారు.

కొంచెం దూరం వెళ్ళే సరికి రోడ్లన్నీ, చేతుల్లో సూట్‌కేసులుతోవున్న జనంతో నిండిపోయి ఉన్నాయి. వాళ్ళందరి ముఖాలూ పీక్కుపోయి, డోక్కుపోయి ఉన్నాయి. అందరి ముఖాల్లోనూ భయం, ఆందోళన ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. వాళ్ళని సర్దడానికి పోలీసు బలగం ఉంది కాని వాళ్ళేమీ చేయలేకపోతున్నారు. ఆ జనాన్ని చీల్చుకొంటూ అతి కష్టంగా బహునెమ్మదిగా కారు నడుపుతున్నాడు డ్రైవర్. యూనిఫాంలో వున్న పోలీస్ డి.జి అందులో ఉండడం పైలట్ కారులాగా హారన్ మోగిస్తుండం వల్ల జనందాని దగ్గరగా రావడానికి భయపడ్డారు కాని లేకుంటే దానిని చుట్టుముట్టి ముందుకి సాగనిచ్చేవాళ్లు కాదు. వళ్లు తెలీని కోపంలో విచక్షణ నశించేటట్లు ఆవేదనతోనూ, ఆవేశంతోనూ ఊగిపోతున్న వారు ఏమైనా చేయవచ్చు.

కారు అతికష్టంమీద జనాన్ని దాటుకుని సెక్టార్ 14 వైపుగా వెళ్ళింది. అది సమీపిస్తుండగా జనం పల్చనైపోయారు. సెక్టార్ లోపల అంతా ఇంచుమించు నిర్మానుష్యంగా ఉంది. అంతా స్మశాన ప్రశాంతి. ఏదో దయ్యాల నగరంలో తిరుగాడుతున్నట్లుంది.

కారు సెక్టారులో ప్రవేశించింది.

ఇంతలో ఉన్నట్లుండి ఏదో కదిలిపోతున్నట్లు, రాళ్లు దొర్లిపోతున్నట్లు, భూకంపం వస్తున్నట్లు చప్పుడైంది.

అది ఏమిటా అని అటువైపు చూస్తుండగానే ఎదురుగా ఓ నూటయాభై గజాల దూరంలో నాలుగంతస్థుల మేడ కుప్పకూలిపోయింది. వెంటనే పెద్ద శబ్దం. దట్టంగా అలుముకున్న దుమ్ము.

డ్రైవర్ సడన్ బ్రేక్ వేసి కారుని ఆపాడు. ఆ అదురికి ముందుకి వెళ్లిపడ్డారు అందరూ. కొంచెంసేపు ఎదుట ఏమున్నదీ కన్పించలేదు. తేరుకున్నాక అందరూ అటే చూస్తుండిపోయారు. ఈ హఠాత్పరిణామం ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు.

డాక్టర్ జింగ్ తదేకంగా అటే చూస్తుండిపోయాడు.

కొంచెం సేపటికి మళ్ళీ కారు బయలుదేరింది.

అంతకుముందే మరికొన్ని ఇళ్లుకూడా కూలిపోయినట్లున్నాయి. గుట్టలు కనిపిస్తున్నాయి. అయితే ఆ సెక్టార్ ప్లాన్డ్‌గా కట్టింది కావడంతో విశాలమైన రోడ్లు ఉండడంవల్ల కారు వెళ్లడానికి ఇబ్బంది అనిపించడం లేదు.

"ఇప్పటివరకూ ఈ సెక్టార్‌కి పట్టిన పీడ ఒక ఎల్లోడెత్ అనే అనుకున్నాం. ఇప్పుడు పక్కా ఇళ్లు కూలడం కూడా మొదలయింది" అన్నాడు అశ్వనీ కుమార్.

"ఇది చూస్తే ఎల్లోడెత్ మనం అనుకున్నట్లు సూక్ష్మజీవుల వల్ల వచ్చిన వ్యాధి కాదేమో! అసలు అది అంటువ్యాధి కూడా కాదేమో! ఏదైనా తీవ్రమైన పొల్యూషన్ మూలంగా ప్రాణాలుపోవడం, ఇళ్లు కూలడం జరుగుతోందేమో ననిపిస్తోంది" అన్నాడు ప్రశాంత్.

డాక్టర్ జింగ్ వారిద్దరి వంక వింతగా చూశాడు.

"వాట్ డూయూసే డాక్టర్ జింగ్?" అన్నాడు అశ్వనీకుమార్.

జింగ్ పైప్‌ని గట్టిగా పీల్చి "పరీక్షించందే ఏదని ఖాయంగా చెప్పగలం? ఎనీవే ఉయ్ ఆర్ ఏయర్ అవర్ జాబ్ లెటజ్ ఫైండ్ వాట్ ఇటీజ్" అన్నాడు.

కారు ఒక పొడైన టన్నెల్ గుండా పోతోంది. టన్నెల్ చివర భాగం ఇంక కొంచెం దూరంలోనే ఉంది. ఉన్నట్లుండి అక్కడి నేలంతా కదిలిపోవడం మొదలు పెట్టింది టన్నెల్‌లో రాళ్ళు కదలిపోతున్న శబ్దం. టన్నెల్ కూలిపోతోంది. డ్రైవర్ ఒక్కసారి స్పీడ్ పెంచాడు. ఏ అవాంతరానికైనా సిద్ధపడడానికన్నట్లు ప్రశాంత్, అశ్వనీకుమార్, జింగ్ డోర్స్ తెరిచి హాండిల్స్ గట్టిగా పట్టుకున్నారు

కారు టన్నెల్‌లో నుంచి బయటకు వచ్చేస్తోంది. ఉన్నట్టుండి ధభీమంటూ టన్నెల్ కూలిపోయింది అదృష్టవశాత్తూ కారు అప్పటికి సీట్స్ ఉన్నమేరకు బయటికి వచ్చేసింది. అయితే డిక్కీమీద రాళ్లు పడడంతో అది అప్పడంలాగా అణిగిపోయింది. డ్రైవర్ సడన్ బ్రేక్ వేసాడు అప్రయత్నంగా.

అప్రయత్నంగానే డోర్ తెరిచి ఒక్క ఉదుటున బయటకు దూకాడు జింగ్. అలాగే అటు తర్వాత అశ్వనీ కుమార్ దూకేసాడు. ఇటు ప్రశాంత్ సీనా చెయ్యి పుచ్చుకుని దూకేసాడు. డ్రైవర్ శ్రీవాత్సవ అటు డోర్ తీసుకుని బయటపడ్డారు. కొంచెం సేపటివరకూ ఆ షాక్ నుంచి ఎవ్వరూ తేరుకోలేదు. డాక్టర్ జింగ్ వయసు మీరిన వాడేమో ఒకటే అయాసపడసాగాడు. ఇంతలో ఉన్నట్లుండి "నా పైప్ నా పైప్" అంటూ వెతకడం మొదలుపెట్టాడు.

అటువంటి సమయంలో పైపుని గురించి వెతకడం అందరికీ ఆశ్చర్యం కల్పించింది.

టన్నెల్ కూలినచోట లేచిన దుమ్ము ఇంకా దట్టంగానే ఉంది.

జింగ్ "నాపైప్ నా పైప్" అంటూ వెతుకుతూ ఆ దుమ్మువైపుకి పరిగెత్తుకుంటూ వెళ్లాడు. ఆ తర్వాత ఏమైంది కనిపించలేదు.

ఇంకా టన్నెల్‌కూలుతున్న శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. జింగ్ ఆ రాళ్లకిందపడి నూరుకుపోయాడేమో పత్తాలేడు. అతని ప్రవర్తన అందరికీ విచిత్రంగా అనిపించింది. బహుశా షాక్ మూలంగా మతి స్థిమితం కోల్పోయి ఆ విధంగా చేశాడేమోననుకున్నారు. అతన్ని తలుచుకుంటే వారందరికీ ఎంతో బాధ అనిపించింది.

ఇంతలో అందరికీ కళ్ళ మంటలు, ఒళ్లు చిటపటలాడడం, ముక్కు ఎండిపోయినట్లు ఊపిరి తీసుకోడం కష్టమవుతున్నట్లు అనిపించింది. గాలిలోనే ఏదో ఘాటైన వాసన ఉన్నట్లు అనిపిస్తోంది. ఇవన్నీ 'ఎల్లోడెత్' వ్యాధి లక్షణాలే.

ఇంక లాభం లేదు. అందరికీ ఎల్లోడెత్ సోకేటట్లుంది. ఇంత బతుకూ బతికి ఇంటి వెనకాల

వచ్చినట్లు చివరికి ఈ అపరస్మశానంలో దిక్కుమాలిన చావు చావాల్సివచ్చేట్లుంది. ముందు అక్కడినుంచి బయటపడాలి.

"చూడండి ఆ ఎదురుగావున్న ఇంట్లో మేము ఎయిర్ టైట్ కంపార్టుమెంట్ ఏర్పాటుచేశాం. అక్కడ ఈ పొల్యూటెడ్ ఎయిర్ రాదు. మేము ఇక్కడ ఇన్వెస్టిగేట్ చేస్తున్నప్పుడు ఆ ఏర్పాటు చేసుకున్నాం. ముందు మనం అక్కడికిపోయి ఒళ్లు కడుక్కుని మంచి గాలి పీల్చుకుందాం. అక్కడికి పోయాక నేను వైర్‌లెస్ మేసేజ్ ఇచ్చి మరోకారు తెప్పిస్తాను పదండి" అన్నాడు శ్రీవాత్సవ.

అందరూ లేచారు. అశ్వనీకుమార్ లేవగానే అక్కడ డాక్టర్ జంగ్ పైప్ కనిపించింది.

దానిని చూస్తూనే "అరే ఇదుగో డాక్టర్ జింగ్ పైప్. దీనికీ ఆయనకీ ఏమి అనుబంధమో కాని అది కనిపించకపోయేసరికి పిచ్చివాడైపోయాడు"

"ఇంతసేపూ మీరు దానిమీదనే కూర్చున్నట్టున్నారు. అందుకే కనిపించలేదు" అంటూ దానిని తీశాడు ప్రశాంత్.

ఆ పైప్‌కి గొట్టం ఒకటే కాదు పొడుగ్గా ఉంది. దస్ట్‌వేసే భాగం కూడా బాగా లోతుగా వెడల్పుగా ఉంది. ఆ పైపుని ప్రత్యేకంగా చేయించినట్లనిపించింది. ఆ గొట్టంలోని పొడిని కొంచెం చేతిలో పోసుకున్నాడు ప్రశాంత్. పైన పొగాకు పొడి ఉంది. అడుగున తెల్లని సన్నని స్ఫటికాలున్నాయి. అదేమిటోనని వాసన చూశాడు కాని దానిని గుర్తించలేకపోయాడు. బహుశా హెరాయిన్ వంటి మత్తు పదార్థం దేనినో అందులో వేసి పీలుస్తుండాలి. అందులో చైనావారికి నల్లమందు భాయిలని పేరుకూడాను అనుకున్నాడు ప్రశాంత్. ఆ పైప్‌ని జేబులో వేసుకుని 'డాక్టర్ జంగ్ కనిపిస్తే ఇచ్చేస్తాను' అన్నాడు.

"అరె... మన కారేమిటి ఇలా అయింది! రంగుని ఏదో తినేసినట్లు తూట్లు పడినట్లు అయిపోయింది!' అన్నాడు అశ్వనీ కుమార్ కారువంక చూస్తూ ఆశ్చర్యంగా.

అప్పటివరకూ ఎవరూ ఆ విషయం గమనించలేదు.

టన్నెల్ కూలింది కారు డిక్కీ మీద. ముందు బాగానికేమీ కాలేదు. అయినా అదికూడా ఇంత అకస్మాత్తుగా ఆ విధంగా అవడం అందరికీ ఆశ్చర్యం వేసింది.

ఇంకా అక్కడ ఉండడం అందరికీ బాధగా ఉండడంతో అందరూ పరుగువంటి నడకతో శ్రీవాత్సవ చెప్పిన ఇంటికి వెళ్ళారు. అక్కడ అందరూ శుభ్రంగా స్నానంచేసి మంచి గాలి పీల్చుకున్నాక ప్రాణం కుదుటపడింది.

శ్రీ వాత్సవ వైర్‌లెస్ మెసేజ్ ఇచ్చి మరో కారును వెంటనే పంపమన్నాడు. డాక్టర్ అశ్వనీకుమార్ కోరిక మేరకు ఒక మార్చ్యురీ వాన్‌ని కూడా పంపమన్నాడు. అందులో పరీక్షలకోసం కొన్ని శవాల్ని తీసుకువెళ్ళాలని ఆయన ఉద్దేశం.

మరో గంటలో ఇంకో కారు, మార్చ్యురీ వాన్ వచ్చాయి.

" మీరు శవాల్ని తీసుకొని వెళ్ళండి. నేనూ, నీనా ఇక్కడే ఉండి పరీక్షలు జరుపుతాం" అన్నాడు అశ్వనీ కుమార్‌తో ప్రశాంత్

"మీరిద్దరూ ఇక్కడ ఉంటారా!" ఎంత ప్రమాదం! అన్నాడు ఆయన.

"ఫర్వాలేదు. ఇక్కడ గాలిని పాల్యూట్ చేస్తోందేమిటో నేను కనుక్కొన్నాను. దానికి విరుగుడు ఏమిటో కూడా నాకు తెలుసు. అది అందుబాటులో కూడా ఉంది. అయితే ఈ పొల్యూటెంట్ ఎక్కడినుంచి వస్తోందో ఎందుకు వస్తోందో తెలుసుకుని అరికట్టాలి. అందుకోసం నేనూ నీనా ఇక్కడు ఉండిపోతాం. మాకేం ఫర్వాలేదు. వివరాలు తర్వాత చెప్తాను" అన్నాడు ప్రశాంత్.

శ్రీవాత్సవ అతనివంక ఆశ్చర్యంగా చూశాడు.

ప్రశాంత్ శక్తిసామర్థ్యాలమీద నమ్మకం ఉన్న అశ్వనీ కుమార్ మారు మాట్లాడకుండా అతని భుజం తట్టి వెళ్లిపోయాడు.

* * * *

ఆ చుట్టుప్రక్కల అన్నీ అంతకుముందు కాపరాలు ఉన్న ఇళ్లే. అయితే అందరూ ఖాళీ చేసి వెళ్ళిపోవడంతో ఇపుడా ఇళ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి.

ప్రశాంత్ అదే ఫ్లాట్‌లో ఉన్న ఒక రెసిడెంటల్ పోర్షన్‌లోకి వెళ్లాడు. అక్కడ వంటింట్లో కొంచెం సేపు వెతికి ఒక జార్‌లోని తెల్లని పొడిని తీసాడు. దానిని వాసన చూసి పనికి వస్తుందనుకున్నట్లు తల ఆడించి దానిని ఒక కాగితంలో పోసి కట్టుకున్నాడు. నీనా అదంతా విచిత్రంగా గమనించింది కాని మారుమాట్లాడలేదు.

ప్రశాంత్ ఆ పొడిని కొంత ఎక్కువగానే రుమాలులో పోసి మడతపెట్టి నీనాతో బయటకు వచ్చినప్పుడు దానిని వాసన చూస్తుండమన్నాడు. తానూ అలాగే చేశాడు.

ఇద్దరూ బయటకు వచ్చారు.

ప్రశాంత్ జేబులోంచి ఒక చిన్న మీటర్‌ని తీసాడు. అది గాలిలోనుంచి వస్తున్న ఘాటైన పదార్థపు స్థాయిని తెలుపుతోంది. ఆ మీటర్ రీడింగ్ ఆధారంగా ఆ వాసన స్వతహాగా ఎక్కడనుంచి వెలువడుతోందో తెలుసుకోడానికి ఎక్కువ సమయం పట్టలేదు. అది ఆ సెక్టార్‌లో ఇంచుమించు ఒక మూలగా ఉన్న విశాలమైన ఇంటినుంచి వస్తోంది.

ప్రశాంత్, నీనా ఆ ఇంటిచుట్టూ ఒకసారి తిరిగి చూశారు. ఆవరణ గోడ ఎత్తుతక్కువగా ఉండడంతో సులువుగా లోపలికి వెళ్లగలిగారు. అక్కడ బొత్తిగా నిర్మానుష్యంగా ఉండడంతో ఎవరికంటా పడలేదు.

ఇంటిలోపల ఏదో మర ఆడుతున్నట్లు శబ్దం అవుతోంది.

పిల్లిలాగా నడుచుకుంటూ అటు వెళ్లారు ఇద్దరూ.

ఒక గదిముందు స్టూల్‌మీద కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు కాపలావాడు.

మెనకాలే వెళ్ళి అతని మెడమీద గట్టిగా ఒక్క దెబ్బ కొట్టాడు ప్రశాంత్.

కయ్ కుయ్‌మనకుండా కిందపడ్డాడు వాడు.

వెంటనే వాడినోరు, కాళ్లూ చేతులూ కట్టేశాడు ప్రశాంత్.

ప్రశాంత్, నీనా నెమ్మదిగా లోపలికి వెళ్లారు. శబ్దం ఎక్కువగా వినిపిస్తోంది. కొంచెం ముందుకు వెళ్లేసరికి ఒక పెద్ద గాజు గోళం కనిపించింది. అందులో ఏదో గోధుమరంగు పదార్థం గిరగిరా తిరుగుతోంది. దానికి ఇంటికప్పునుంచి వచ్చిన పెద్ద గొట్టం ఒకటి కలిపి ఉంది. అదేవిధంగా గోళానికి అవతలివైపు నుంచి మరో గొట్టం మరోవేపు కలిపి ఉంది. దగ్గరల్లో బోలెడు బస్తాలున్నాయి.

ఆశ్చర్యం!

ఆ గోళం దగ్గర డాక్టర్ జింగ్ ఉన్నాడు. ఒక బస్తాలోని పదార్థం తీసి ఆ గోళంలో పోసాడు. గోడవైపున ఉన్న ఒక వాల్వుని మూసి గోళంలో పదార్థం వేగంగా తిరిగేటట్లు చేశాడు. ఆ తర్వాత ఆ వాల్వ్‌ని వదులుచేసాడు. అటు తర్వాత వెనక్కి తిరిగేసరికి ప్రశాంత్ నీనా కనిపించారు. ముందు ఒక్కక్షణం దిగ్భ్రాంతి చెందినా వెంటనే తేరుకుని "కమాన్ మైడియర్ ప్రశాంత్ యూ ఆర్ టూ స్మార్ట్. నాకు తెలుసు. నువ్వు వస్తావని. అయితే ఆ అమ్మాయిని కూడా తెస్తావని అనుకోలేదు. అప్పియర్ టు బి లౌ బర్డ్స్. యు కెన్ డై టుగెదర్" అంటూ పిస్టల్ తీసి గురి పెట్టాడు.

ప్రశాంత్, నీనా భయం భయంగా ఆ వాల్వ్‌వున్న గోడవైపుకి వెళ్లారు.

"తప్పించుకోడానికి ప్రయత్నం చెయ్యకు అటు దారేం లేదు. నా చేతిలో చిక్కాక ఇంక బయటకు పోవడంకల్ల" అంటూ వెకిలిగా నవ్వాడు జింగ్

"మిస్టర్ జింగ్ ఎలాగో చావబోతున్నాం. ఈ ఆపరేటస్ ఏమిటో ఇదంతా ఎందుకో చెప్పు. ఇక్కడ అడుగడుగునా నీ మేధస్సు కనిపిస్తోంది. అది తెలుసుకుని తృప్తిగా చనిపోతాం" అన్నాడు ప్రశాంత్.

తన మేధస్సుని పొగిడేసరికి ఉబ్బిపోయాడు జింగ్. చెప్పడం మొదలుపెట్టాడు.

"మీరు అనుకున్నట్లు నేను చైనా నుంచి పారిపోయి వచ్చిన శాస్త్రవేత్తను కాను. నేను శాస్త్రవేత్తనే కాని వారి ఏజంటును. మా దేశం ఇండియాని సొంతం చేసుకోవాలని పథకం వేసింది. యుద్ధం చేసి స్వాధీనం చేసుకోవడం కష్టం కాదు. కాని అంతర్జాతీయంగా అల్లరి పడతాం. పైగా ఏ అగ్రరాజ్యమో మీ అండగా వస్తుంది. అందువల్ల చాపకింద నీరు వంటి పథకం రూపొందించాం. ఈ గోళంలో ఉన్న పదార్థం చూశారా! ఇది మెగ్నీషియంకు సంబంధించిన ఒక లవణం. అది కెటలిస్టుగా (ప్రేరేపకం) పనిచేస్తుంది. గాలిలో నైట్రోజన్, ఆక్సిజన్ పుష్కలంగా ఉన్నాయి. అవి ఈ కెటలిస్టు సహాయంతో నైట్రోజన్ పెరాక్సయిడ్‌గా మారుతాయి. దాని ఫార్ములా తెలుసా?

Energy + $N_2 + 2\,O_2 \rightarrow 3\,NO_2 + H_2O \rightarrow 2HNO + NO$ ఇదే నైట్రోజన్ పెరాక్సయిడ్ ఫార్ములా.

ఇటి రెండో గొట్టంలోంచి బయట గాలిలోకి పోతుంది. అక్కడ గాలిలో ఉన్న తేమతో కలిసి నైట్రిక్ ఆసిడ్‌గా మారుతుంది. ఇది చాలా ఘాటైనది. లోహాల్ని సిమెంట్‌నీ అన్నిటినీ తినేస్తుంది. అందుకే ఇళ్లు కూలిపోతాయి. అలాగే ఆ గాలి పీల్చిన వారికి ఊపిరి ఆడనీయకుండా ఒళ్ళంతా పచ్చగా చేసి గంటల్లో ప్రాణాలు తీస్తుంది. ఈ విధంగా ఒక ప్రక్కనుంచి వేలసంఖ్యలో జనం చస్తుంటే మరో ప్రక్కన ఇళ్లు తూళ్లు సర్వనాశనం అవుతాయి. ఈ విధంగా కొద్దినెలల్లోనే ఇండియా సర్వనాశనం అవుతుంది.

అప్పుడు గాలిని శుభ్రంచేసి నెమ్మది నెమ్మదిగా మేము మీ దేశాన్ని ఆక్రమించుకుంటాం. మమ్మల్ని అడ్డేవారుండరు.

జింగ్ ఆనందంగా చెప్పుకుపోతున్నాడు.

వెనకగా కట్టుకున్న ప్రశాంత్ చేతులు ఏమో చేస్తున్నాయి.

జంగ్ మాటలు పూర్తికాలేదు. పెద్ద శబ్దంతో ఆ గాజుగోళం పగిలి ఆ ముక్కలు బాణాలలాగా జింగ్ దేహం అంతటా గుచ్చుకున్నాయి. మరు నిమిషంలో నెత్తుటి ముద్దగా మారి కూలిపోయాడు జింగ్.

నీనా చేయి పట్టుకుని పరుగుపరుగున బయటికి వచ్చాడు ప్రశాంత్.

రోడ్ మీద కొంతదూరం వెళ్ళే సరికి ఎదురుగా పోలీస్ కార్ కనిపించింది.

అందులో శ్రీ వాత్సవ, అశ్వనీకుమార్ ఉన్నారు. ప్రశాంత్ నీనాను తీసుకుని అందరు నగరానికి వెళ్లారు. దారిలో ప్రశాంత్ 'మీరెలా వచ్చారు?' అని అడిగారు.

'మేము మీకోసం వచ్చాం. మీరు అక్కడ లేకపోయేసరికి వెతకడం మొదలుపెట్టాం. ఇంతలో పెద్ద ఎక్స్‌ప్లొజన్ అయిన శబ్దం విని అటు వచ్చాం'' అన్నాడు అశ్వనీ కుమార్.

* * * *

మినిస్టర్‌గారి ఛాంబర్‌లో తిరిగి అందరూ సమావేశమయ్యారు. ఆయన 'డాక్టర్ ప్రశాంత్ ఢిల్లీ నగరాన్నే కాదు, దేశాన్నే రక్షించారు. దీనిని మీరు ఎలా సాధించారు' అని అడిగారు.

''మొదట అందరిలాగే ఇదేదో వింత వ్యాధి అని నేనూ అనుకున్నాను. కానీ ఇల్లు కూలిపోవడం లోహాల్ని తినేయడం, మనుష్యులు ఊపిరాడక చనిపోతూ పచ్చబడడం ఇవన్నీ చూస్తే ఇది యాసిడ్ ప్రభావమని ఎవరో కావాలనే చేస్తున్నారనీ అర్థం అయింది. డాక్టర్ జింగ్ వెలిగించని పైపును పీలుస్తుండడం నాలో అనుమానాన్ని రేకెత్తించింది. పైగా ఆయన టాక్సాలజిస్ట్. అంటే విష పదార్థాల గురించి తెలిసినవాడు. తర్వాత ఆయన పైపులో తెల్లని పదార్థం కనిపించింది. అది వంట సోడా అని గుర్తు పట్టాను. వంటసోడా ఆల్కలీ అంటే క్షారం. దానివల్ల ఆసిడ్ ప్రభావం తగ్గుతుంది. అందుకే దానిని పీలుస్తూ ఆసిడ్ వున్న గాలినుంచి రక్షణ పొందసాగాడు జింగ్ పైపు పోవడంతో అతను ఊపిరాడక తన ఇంటికి పరిగెత్తుకుపోయాడు అంతేకాని షాక్‌వల్ల పిచ్చివాడైకాదు. అతను మంత్రిగారి మీటింగ్‌కి వచ్చింది కూడా మన రహస్యాలు తెలుసుకోడానికే. ఎయిర్‌ని పొల్యూట్ చేస్తోంది యాసిడ్ అని తెలియగానే దానికి విరుగుడుగా రెసిడెన్షియల్ పోర్షన్‌లోని వంట సోడా తీసుకుని నేనూ, నీనా జింగ్ ఉన్న చోటికి వెళ్లాం.

అక్కడ అతను మమ్మల్ని చూసి చంపబోయాడు. కాని అతన్ని ఉబ్బేసి అసలు రహస్యం కక్కించాను. ఈలోగా అతను చూడకుండా గాలిపోయే వాల్వ్‌ను బిగించేసాను. దాంతో ఆ గాజు గోళంలో ప్రెషర్ పెరిగిపోయి అది ప్రేలిపోయి జింగ్ ప్రాణం తీసింది'' అంటూ ముగించాడు ప్రశాంత్.

ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జూన్ 1988 ✪

# మనిషి-మర

హైదరాబాద్ లో అంతర్జాతీయ రోబోట్ల ప్రదర్శన జరుగుతోంది. రోబోట్‌లను అంటే మరమనుషులను అద్భుతంగా అభివృద్ధిచేసిన దేశం జపాన్.ఇంట్లో పనిమనుషుల కింద ఆఫీసులో బాయ్‌ల కింద రోబోట్‌లను వినియోగించడం అక్కడ సర్వ సామాన్యం అయింది. అంతేకాదు. ఉష్ణం ఎక్కువగావుండే ఉక్కు ఫ్యాక్టరీలు,లోతైన గనులు,అణు విద్యుత్ కేంద్రాలు వంటి మనుషులకు ప్రమాదకరము, కష్టసాధ్యమూ అయినటువంటిచోట్ల మనుషుల బదులు రోబోట్‌లచేత పనిచేయించడం పరిపాటి ఈయింది.

ఈ విధంగా అనేక రకాల సేవలను రోబోల్ద్వారా అభివృద్ధి చెందిన చెందుతున్న దేశాలన్నీ పొందుతున్నా జపాన్ మాత్రం అగ్రగామిగా ఉంది. అందువల్ల సహజంగా జపాన్ స్టాల్‌లోని రోబోట్‌ల విన్యాసాలను చూడడానికి విపరీతంగా జనం వస్తారు. అయితే ఈ ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన స్టాల్ జపాన్ స్టాల్‌ను కంటే ఎక్కువగా ఆకర్షించడం మొదలుపెట్టింది. ఇందుకు కారణం మనుష్యులు వ్యక్తంచేసే కోర్కెలకు ప్రతిస్పందించి వెంటనే వాటిని తీర్చడం అక్కడ వున్న రోబోట్‌ల ప్రత్యేకత. అంతేకాదు ఆ రోబోట్‌లు మాట్లాడగలవు. ప్రశ్నలకూ సమాధానాలు ఇవ్వగలవు కూడా ఈ విధమైన రోబోట్‌లు ఒక వింత అయితే అటువంటివాటిని రూపొందించినది ఒక అతివ కావడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన అంశం. ఆమె ఎవరో కాదు డాక్టర్ వనజ. ఎలక్ట్రానిక్స్‌లో పోస్టుగ్రాడ్యుయేట్.

ఆ సాయంత్రం ఆ ఎగ్జిబిషన్‌లో శాస్త్రీయ చర్చా గోష్ఠిని ఏర్పాటుచేశారు. అందులో వివిధ దేశాల శాస్త్రజ్ఞులు తాము రూపొందించిన రోబోట్‌లలోని ప్రత్యేకతలను గూర్చి ప్రసంగిస్తారు. ఇతర శాస్త్రజ్ఞులూ, ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తారు. ఆ గోష్ఠిలో వివిధ దేశాల శాస్త్రజ్ఞులు తమ రోబోట్‌లలోని ప్రత్యేకతలను వివరంగా చూపారు.

కొంతసేపటికి ఎ.పి. ఎలాక్ట్రానిక్ అసోసియేషన్ వారి వంతు వచ్చింది. దాని తరపున మాట్లాడడానికి డాక్టర్ వనజ లేచారు.

హాలులో సూది పడితే వినబడేటంతటి నిశ్శబ్దం అలముకుంది.

"ఇతర రోబోలకంటే మా రోబోలకు ఒక ప్రత్యేకత ఉంది. ఇవి మనతో మాట్లాడగలవు. మన



ప్రశ్నకు సమాధానాలు చెప్పగలవు. మనం పైకి వ్యక్తం చేసిన కోర్కెలను వెంటనే నెరవేర్చగలవు. చూసేవారికి ఇవి జీవం వున్న మనుషులేమోననిపిస్తుంది." అంటూ "సేవక్... ఇలారా" అని పిలిచింది.

వెంటనే సైడ్ కర్టెన్‌లోంచి మనిషి ఆకారంలో వుండి, మనిషిలాగే దుస్తులు వేసుకున్న మరమనిషి చకచకా ఆమె బల్ల దగ్గరకివచ్చాడు. ముఖం చేతులు లోహంతో చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖంలో చిరునవ్వు ముద్రేసినట్లు అలాగే ఉండిపోయింది.

"నీ పేరు ఏమిటి?" అని అడిగింది డాక్టర్ వనజ ఇంగ్లీషులో.

"సేవక్ మాడమ్" అని బదులిచ్చాడు ఆ మరమనిషి కుడి చెయ్యి కొంచెం పైకి ఎత్తి తల కొంచెం వంచి.

హాలులో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

సద్దుమణిగాక "వీరందరూ నిన్ను చూడాలని వచ్చారు. అందరికీ నమస్కారం పెట్టు" అంది వనజ మళ్ళీ ఇంగ్లీషులో.

సేవక్ రెండుచేతులూ ఎత్తి నమస్కారం పెడ్తూ అందరివైపూ చిరునవ్వు నవ్వుతూ అర్థవృత్తాకారంలో నిలిచి "ఐయామ్ వెరీ గ్లాడ్ టూ మీట్ యూ" అన్నాడు.

హాలులో మరింత ఎక్కువగా చప్పట్లు మ్రోగాయి.

ఆ సద్దుమణిగాక ప్రేక్షకులలోనుంచి ఒకవ్యక్తి లేచి "మాడం ఇదంతా ఫ్రాడ్ అని నా అనుమానం మనిషిని మీరు రోబోట్‌లాగా వేషం వేసి ఇలా నాటకం ఆడుతున్నరేమో లేకుంటే మరమనిషి ఎలా మాట్లాడగలుగుతాడు. మన మాటలను ఎలా అర్థం చేసుకుంటాడు?" అని గట్టిగా ప్రశ్నించాడు. వనజ లేచింది. "జెంటిల్ మాన్. మీ కొచ్చిన అనుమానం సబబైనదే. మీకే కాదు ఈ అనుమానం ఇంచుమించు అందరికీ వస్తుంది. నా ప్రసంగం అయిన తర్వాత నేనెలాగూ ఎవరూ అడక్కపోయినా ఈ అనుమానాన్ని నివృత్తిచేసి ఉండేదాన్ని అడిగారు కనుక ఇప్పుడే తీరుస్తాను" అంటూ సేవక్ దగ్గరికి వెళ్ళింది. సింపుల్‌గా ఆ రోబోట్ నుంచి తలని, చేతులనీ వేరుచేసింది. లోపలన్నీ ఎన్నో చిన్నచిన్న యంత్రసామగ్రి ఉంది. అందరి అనుమానం నివృత్తి అయ్యాక తిరిగి రోబోని యథాప్రకారం కూర్చింది.

"జంటిల్‌మాన్ ఇందులో ఫ్రాడ్ ఏమీలేదని మీకు నమ్మకం కలిగిందనుకుంటాను. ఇంకా ఎవరికైనా అనుమానం ఉంటే దగ్గరికి వచ్చి స్వయంగా ఓపెన్ చేసి పరీక్షించుకోవచ్చు" అంది ఆమె.

"అవసరంలేదు ఇది ఎలా సాధించారో చెప్పండి" అని ప్రేక్షకులలోనించి మూకుమ్మడిగా ఎందరో అరిచారు.

వనజ చెప్పడం ప్రారంభించింది.

"జంటిల్‌మెన్ రోబోట్‌లకు ఏ భాషనైనా నేర్పవచ్చు. అయితే సైన్స్ రంగంలో ఇంగ్లీషుకి వున్న స్థానాన్ని అంతర్జాతీయంగా ఆ భాషకి ఉన్న ప్రాధాన్యత అనుసరించి దీనికి ఇంగ్లీషులోనే నేర్పాం. ఇంగ్లీషులో బేసిక్ వర్డ్స్ 750 వరకూ ఉన్నాయి. అంటే ఈ ఏడువందల యాభై మాటలూ నేర్చుకుంటే దైనందిన వ్యవహారాలకి అవసరమయ్యే భాష అంతా వచ్చినట్లే. ఈ పదాలలోంచి తరచుగా అవసరమయ్యే వాక్యాలను ప్రశ్నలు, సమాధానాలుగా కూడా తయారుచేసి వీటన్నింటినీ రోబోట్‌లో ఉన్న కంప్యూటర్‌కి ఫీడ్ చేశాం. ఆ వాక్యాలని నియమిత రేంజిలో ఉచ్చరించినప్పుడు అవి సిగ్నల్స్‌గా మారి వాటికి అనుగుణమైన ప్రతిస్పందనలు ఏర్పడుతాయి. వాటికి అనుగుణంగా నడుచుకుంటుంది రోబోట్. వంటకి కావలసిన సంబారాలన్నీ దగ్గర ఉంచి వంటచేసే విధానాన్ని దీనికి ఫీడ్‌చేస్తే మనం అడిగినప్పుడు కావలసిన వంటకాలు చేస్తుంది. అంతేకాదు. ఇలా చేస్తే బాగుంటుందని మనం పైకి అనుకుంటే వెంటనే దానిని చేసి చూపిస్తుంది కూడా. ఇదంతా ఇందులో వుండే మినీ సూపర్‌కంప్యూటర్ మూలంగా సాధ్యం అయింది. ఒక విధంగా చెప్పాలంటే పరిమితమైన రేంజిలో ఈ రోబో ఆలోచించి అవసరమైన నిర్ణయాలు తీసుకోగలదన్నమాట. ఈ విషయంలో మా సంస్థ ఇతర దేశాలకంటే ఘనవిజయాలు సాధించింది. ఈ విజయోత్సాహంతో మేము కేవలం మనసులో ఆలోచనలను గమనించి వాటిని అమలులో పెట్టే రోబోట్‌లసృష్టికి ప్రయత్నాలు చేస్తున్నాం"

హాలులో చప్పట్లు మారుమ్రోగాయి. అవి తగ్గాక మేడం "మీ రోబోట్‌కి 'సేవక్' అని ఎందుకు పేరు పెట్టారు?" అని అడిగారు ఎవరో.

"సింపుల్ మనకి ఎన్నోరకాలుగా సేవలు అందిస్తోంది కనుక. 'సేవక్' అని పేరు పెట్టాం. సంతోషంగా సేవలు చెయ్యాలి కనుక దానికి నిత్యమూ చిరునవ్వు అలంకారంగా ఉండేటట్లు ముఖాన్ని రూపొందించాం" అని వివరించింది వనజ.

మరికొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాక ఆ నాటి గోష్ఠి విజయవంతంగా ముగిసింది.

* * * *

భారతదేశంలో ఆడవారికి అన్ని రంగాలలోనూ పురుషులతో సమానమైన అవకాశాలున్నాయి. వైమానిక రంగంలోకూడా ఎన్నో దేశాలలోకంటే భారతదేశంలోనే స్త్రీ పైలెట్లు ఎక్కువగా ఉన్నారు. ఇలాగే అంతరిక్ష శాస్త్రంలో ఎంతో అభివృద్ధి సాధించిన మన దేశం గ్రహాంతరయానానికి కూడా పథకాలు వేసింది. సౌరకుటుంబంలో చివర్నవున్న ప్లూటోకి మానవ సహిత అంతరిక్షనౌకను పంపాలని పథకం వేసింది భారతప్రభుత్వం. మరో విశేషమేమిటంటే ఈ యాత్రలో పాల్గొనే నలుగురూ స్త్రీలే కావడం. అందుకు తగిన వ్యక్తుల ఎంపిక జరిగింది. పైలట్లనుంచి కెప్టెన్ సుచేత, కెప్టెన్ సుహాసిని ఎన్నికయ్యారు. ఎలక్ట్రానిక్స్ రంగంనుంచి డాక్టర్ వనజ, జియాలజీ విభాగం నుంచి డాక్టర్ లతలను సెలెక్టు చేశారు. డాక్టర్ సుహాసిని కున్న ఆదనపు అర్హత ఆమె నుంచి అమెచ్యూర్ అస్ట్రానమర్ కావడం. వీరందరి ఎంపిక పూర్తి అయ్యాక వారికి ఏడాదిపాటు అంతరిక్షయానంలో ప్రత్యేక శిక్షణనిచ్చారు.

షార్ కేంద్రంనుంచి అంతరిక్ష నౌకను ప్రయోగించడానికి ఏర్పాట్లు అన్నీ సక్రమంగా పూర్తి అయ్యాయి. గతంలో అంతరిక్ష ప్రయోగాలకు మనదేశం, అమెరికా సహాయంకాని, రష్యా సహాయం కాని తీసుకునేది ఇప్పుడు ఈ రంగంలో ఎంతగానో అభివృద్ధి చెందడంతో ఎవరి సాయం లేకుండా ప్రయోగాలు చేయగలుగుతోంది. అలాగే గతంలో మనకి సమీపంలోనున్న అంగారక, శుక్రగ్రహాలకి వెళ్ళడానికే అంతరిక్ష నౌకలకు సంవత్సరాలు పట్టేది.

ఇప్పుడు ఈ రంగంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధి మూలంగా చిట్టచివర్న ఉన్న ప్లూటోకి వెళ్ళిరావడానికి నాలుగు సంవత్సరాలు సరిపోతోంది. ఈ అంతరిక్ష యాత్రలో "సేవక్" తరహా రోబోట్‌లకు ప్రముఖస్థానం ఉన్న విషయం వేరే చెప్పనక్కరలేదు. అంతరిక్ష యాత్రలకు కావలసిన ఆహారపదార్థాలను ఇవి కృత్రిమంగా తయారుచేసి ఇస్తుంటాయి. అలాగే హైడ్రోజన్, ఆక్సిజన్‌ల నుంచి నీటిని తయారుచేస్తాయి. యాత్రికులకు కావలసిన సకలసదుపాయాలు చూస్తాయి. "యమ" అని పేరుపెట్టిన ఈ అంతరిక్షనౌకలో డాక్టర్‌వనజ రూపొందించిన "సేవక్"ని ఉంచారు. ప్లూటోకి మనవారు పెట్టిన పేరు "యమగ్రహం". అందుకే"యమ" అని పేరు పెట్టారు.

* * * *

నిర్ణయించిన రోజున శ్రీహరికోటలోని షార్ కేంద్రంనుంచి "యమ" బయలుదేరింది. దానిప్రయోగాన్ని భారతప్రధాని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో సహా ప్రముఖులెందరో వీక్షించారు. వేలాది ప్రజలు నరేసరి. "యమ" నియమ ప్రకారం ప్రయాణం సాగిస్తోంది. ఏ విధమైన అవాంతరాలూ లేకుండా సవ్యంగా సాగుతోంది.

యమ అంగారకుని దాటింది.

అంగారకునికీ, బృహస్పతికీ మధ్యనున్న వేలాది అల్పగ్రహాలను (ఆస్టరియాడ్ బెల్ట్) దాటింది. నిజానికి ఈ బెల్ట్‌ను దాటడమే చాలా కష్టం. ఎందుకంటే కొన్నివేల అల్పగ్రహాలు వివిధ కక్ష్యలలో

పరిభ్రమిస్తుండే ఈ ప్రాంతంలో ఏ అల్పగ్రహం, అదెంతటి చిన్నదైనా, అంతరిక్ష నౌకను ఢీకొంటే అంతే సంగతులు.

ఈ ప్రమాదాల్ని నివారించడానికి ఎన్నెన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. ఎన్నో ఏర్పాట్లు చేసుకుంటారు కాని అనుకోని ఉత్పాతం సంభవించవచ్చు. అప్పుడు ఎవరూ ఏమీ చేయలేరు. అటువంటి ప్రమాదకరమైన వైతరణివంటి ఆస్టిరియాడ్ బెల్ట్‌ను దాటి విజయవంతంగా బయటపడగలిగింది యమ. తర్వాత ఏ ఇబ్బందీ లేకుండా బృహస్పతి గ్రహాన్ని కూడా దాటి శనిగ్రహంవైపుగా దూసుకుపోసాగింది.

అయితే ఊహించని ప్రమాదం ఎదురైంది ఈ స్థితిలో అంతకు ముందు గుర్తించని తోకచుక్క ఒకటి ఆ మార్గంలో ఎదురుగా బ్రహ్మాండమైన వేగంతో వస్తోంది. అది కనుక గుద్దుకుందంటే యమ తునాతునకలైపోవడం ఖాయం. చిన్నచిన్న ఉల్కలనైతే వాటిని అంతరిక్ష నౌకనుంచే పేల్చివేయవచ్చు లేదా వాటిని మిస్సైల్స్‌తో ఢీకొట్టి వాటి గతి మార్చి దూరంగా పోయేట్లు చేయవచ్చు. కాని తోకచుక్కల కేంద్రకంలో కొన్నిమైళ్ళ వ్యాసం ఉన్న శిలలు ఉంటాయి. అందువల్ల వాటిని ధ్వంసం చేయడం కానీ, వాటిదారి మళ్ళించడం కానీ సాధ్యంకాదు. ఇంక మిగిలిన ఏకైకమార్గం అంతరిక్ష నౌక మార్గాన్ని తప్పించి ఢీకొట్టే ప్రమాదాన్ని నివారించడమే.

వెంటనే కెప్టెన్ సుచేత కంప్యూటర్ దగ్గరికి వెళ్ళి ఆ తోకచుక్క పరిమాణం, అది వస్తున్న వేగం ఆది తమ నౌకను సమీపించడానికి తీసుకునే సమయం వంటివాటిని గణించసాగింది. వాటి ఆధారంగా తమ నౌకని ఎంత వేగంతో, ఎంతకోణంలో పంపాలో నిర్ణయించడం జరుగుతుంది. నిమిషాలలో కంప్యూటర్ ఆ వివరాలన్నింటినీ పొందుపరచింది. తమ నౌక మార్గాన్ని మార్చవలసిన సమయాన్ని కూడా సూచించింది.

కంప్యూటర్ చెప్పిన సమయం ఆసన్నమయింది. ఎదురుగా తోకచుక్క బ్రహ్మాండమైన వేగంతో, బ్రహ్మరాక్షసిలాగా వస్తోంది. సమయానికి రాకెట్‌ని పేల్చి కంప్యూటర్ నిర్ణయించిన కోణంలో యమమార్గాన్ని మార్చారు.

కాని ఎక్కడో ఏదో లోపం జరిగింది. తోకచుక్క యమని ఒక ప్రక్కగా రాసుకుంటూ మహావేగంతో దూసుకుపోయింది. ఆ తాకిడికి నౌకలోని ట్రాన్స్‌మీటర్‌తో సహా ఎన్నో యంత్రాలు దెబ్బతిన్నాయి. ట్రాన్స్‌మీటర్ చెడిపోడంతో భూమితో సంబంధాలు ఆగిపోయాయి. యంత్రాలు దెబ్బతినడంతో తదుపరి ప్రయాణానికి ఆటంకం ఏర్పడింది. "యమ" అంతరిక్షంలో పల్టీలు కొట్టసాగింది.

ఆ షాక్‌నుంచి తేరుకున్నాక తదుపరి కర్తవ్యం గురించి చర్చించసాగారు ఆ నలుగురూ.

టెలిస్కోపులోంచి చూసింది కెప్టెన్ సుహాసిని.

"ఇప్పుడు మనం శనిగ్రహమండలంలో ఉన్నాం. దానికి అతిపెద్ద ఉపగ్రహమైన టైటాన్ మనకి సమీపంలో ఉంది" అని చెప్పింది ఆవిడ.

"పెద్దవాడు అంబులెన్సు కిందపడ్డట్టు ఇది చెడులో మంచి. నిజానికి మనం ఇప్పుడు అంతరిక్షంలో బందీలుగా ఉండిపోయాం. దెబ్బతిన్న యంత్రాలతో ముందుకి పోవడం అసాధ్యం. భూమితో సంబంధాలు ఆగిపోయాయి కనుక వారికి మన పరిస్థితి తెలియచేయలేం. మనకి ప్రమాదం సంభవించిందని వారు

ఊహించి మనకోసం రెస్క్యూటీంలను పంపి వారు వచ్చేసరికి మనం ఇందులో శవాల్లా మారుతాం. ఈ పరిస్థితిలో మనం టైటాన్‌మీద తప్పనిసరిగా దిగడంతప్ప మరోమార్గం లేదు'' అంది కెప్టెన్ సుచేత. అట్టి పరిస్థితిలోనూ ఆమెలోని హాస్యం తొంగిచూసింది.

''టైటాన్ మీదనా!'' అంది వనజ.

''అదే మంచిది. దానిమీద మన భూమిమీదలాగే నీరుంది. వాతావరణం ఉంది. జీవంకూడా ఏదో రూపంలో ఉండవచ్చు. అక్కడికి క్షేమంగా జేరితే భూమిమీద మనవారు మన సంగతి తెలుసుకుని వచ్చేదాకా ప్రాణాలతో ఉండవచ్చు'' అంది లత తనకున్న పరిజ్ఞానంతో.

'ఆమె చెప్పింది నిజం. టైటాన్ మనం జీవించడానికి అన్నివిధాలా అనువుగా ఉంటుంది' అంది సుహాసిని.

వెంటనే కెప్టెన్ సుచేత కంప్యూటర్ ద్వారా లెక్కలువేసి ఏ సమయంలో రాకెట్‌ను ఏ యాంగిల్‌లో పేల్చాలో నిర్ణయించింది.

సరిగ్గా ఆ సమయానికి రాకెట్‌ని ప్రేల్చారు.

యమ టైటాన్ దిశగా దూసుకుపోసాగింది.

వారంరోజులు గడిచాయి.

యమ టైటాన్‌కు బాగా చేరువయింది.

సమయానికి రెట్రో రాకెట్‌లను పేల్చి యమ వేగాన్ని అదుపుచేసి నెమ్మదిగా టైటాన్ మీద దిగేట్లు చేశారు.

వారి దిగిన ప్రదేశం కొండలూ, గుట్టలూ, గతుకులూ లేకుండా సమతలంగా ఉంది. పెద్ద చెట్లు లేవు కాని పొదలు, చిన్న చిన్న దుబ్బులు ఉన్నాయి. ఆ మొక్కలేవీ భూమిమీద ఉన్నట్టివి కావు. పైగా వాటి ఆకులూ, కాండం, ఆకుపచ్చ బాగా తక్కువగా ఉండి ఎక్కువభాగం తెల్లగా ఉన్నాయి.

''ఇక్కడ సూర్యరశ్మి బాగా తక్కువగా వస్తుందిగా. అందువల్ల తగినంత క్లోరోఫిల్ లేక ఇవి ఇలా ఉన్నాయి'' అంది లత వాటిని చూపిస్తూ.

నడినెత్తిన శనిగ్రహం దేదీప్యమానంగా మెరిసిపోతుంది.

ఆ కాంతిలో వెలుగుందే కాని వేడిలేదు. దాని వెన్నెలలు టైటాన్‌ని ముంచెత్తుతున్నాయి.

నేలమీద అక్కడక్కడ చిన్నచిన్న గుంటలు, చెరువులు వంటివి ఉన్నాయి. వాటిలో స్వచ్ఛమైన నీరుంది

''ఇంక ఇక్కడ మనం సేవక్ సహాయంతో ఒక చిన్నఇల్లు కట్టుకోవాలి'' అంది వనజ.

''నిజమే. ఆ ఇరుకు రూములో ఎంతకాలం ఉండగలం?'' అంది లత. త్వరలోనే అక్కడ దొరికిన కట్టెలూ, రాళ్ళూ వంటి వాటితో ఒక చిన్న ఇల్లు ఏర్పరుచుకున్నారు.

అక్కడి మొక్కల్ని పరీక్షించి అవి విషపూరితం కావనీ, ఆహారంగా ఉపయోగపడ్తాయనీ

తెలుసుకున్నారు. ఇంక ఆహారసమస్య కూడా తీరినట్లే.

ఆ తర్వాత చెడిపోయిన యంత్రాలను బాగుచేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు.

నెమ్మది నెమ్మదిగా టైటాన్‌మీద ఉండడానికి అలవాటుపడి పోతున్నారు. ఏపని చేయడానికైనా "సేవక్" సిద్ధంగా ఉన్నాడు.

ఒకరోజు "బాగా తలనెప్పిగా ఉంది. ఎవరేనా తల పిసికితే బాగుండును" అంది వనజ.

అన్నదే తడవుగా సేవక్ వచ్చి ఆమె తల నొక్కసాగాడు,

"సేవక్ నువ్వు పిసకడం బాగానే ఉంది కానీ నీ ముఖంమీద నవ్వు ఎప్పుడూ ఉండడమే బాగా లేదు" అంది వనజ.

"దానికి నేనేం చేయనమ్మా. ఆ నవ్వు ఉంచింది మీరే" అన్నాడు సేవక్.

ఆ మరమనిషి సమయస్ఫూర్తికి అందరూ నవ్వుకున్నారు.

'అబ్బా ....దాహంగా ఉంది" అంది లత ఆవలిస్తూ. వెంటనే గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాడు సేవక్.

ఈ విధంగా ఎవరు ఏదికావాలని అంటే వెంటనే దానిని చేయడం మొదలుపెట్టాడు సేవక్.

ఒకరోజున సుహాసిని అంది. "మనకి భూమి నుంచి రెస్క్యూ టీం ఎప్పుడు వస్తుందో! ఎప్పుడు బయటపడ్తామో. చివరికి ఇక్కడే దిక్కులేని చావు చావాలేమో"నని.

"అదినరే ఇక్కడ మనుష్యులుండడానికి అనువుగా ఉంది. మనం నలుగురు ఆడవాళ్ళం అయిపోయాం. ఒక్క మొగవాడు ఉంటేనా ఇక్కడ మళ్ళీ మానవజాతిని అభివృద్ధి చేసి ఉండేవాళ్ళం" అంది సుచేత. ఇది జరిగిన కొద్ది రోజులకే ఆమె కోరిక ఫలించే విధంగా మరో అంతరిక్ష నౌక వచ్చి వారికి సమీపంలో దిగింది.

నలుగురూ ఆత్రంగా దాని దగ్గరకి పరుగెత్తారు.

అందులో ఒకే ఒక అంతరిక్ష యాత్రికుడున్నాడు. ముప్పయ్యేళ్ళుంటాయి. అతనూ భూవాసియే. బహుశా అమెరికన్ అయి ఉంటాడు. అతని నౌక కూడా ఏదో ప్రమాదంలో చిక్కుకుని ఉంటే విధిలేక ఇక్కడ దింపి ఉంటాడు.

అయితే షాక్ మూలంగానో, దేనివల్లనో గానీ అతను స్పృహలో లేడు. ఒకవిధంగా డీప్ కోమాలోనే ఉన్నాడు.

అతను ఎంతో అందంగా ఉన్నాడు. ఒక పురుషుడు వచ్చాడన్న సంబరం లేకుండా, అతను బ్రతుకుతాడో లేదోనన్న దిగులు పట్టుకుంది వారికి.

జాగ్రత్తగా అతన్ని తీసుకువచ్చి పడుకోబెట్టి సేవలు చేయడం మొదలుపెట్టారు. నలుగురూ అతన్ని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. చేతికివున్న పచ్చని చూసి అతనిపేరు "డిక్" అని తెలిసింది వారికి. వారి ఆజ్ఞల ప్రకారం కావలసిన సేవలన్నీ చేస్తున్నాడు సేవక్.

రెండురోజులు గడిచింది. డిక్‌కి తెలివి రాలేదు కాని ప్రమాదం తప్పింది. కొద్దిరోజుల్లోనే స్పృహ వస్తుందన్న సూచనలు కనిపించాయి. ఆ నలుగురి ఆనందానికి అవధిలేదు.

ఆ రోజు నలుగురూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"మనం కోరుకొన్నట్లు అందగాడైన మగవాడు వచ్చాడు. సుచేతకి అతనిమీద మోజన్న విషయం నాకు తెలుసు. కాని అతను ఆమెకే సొంతం అయితే ఎలా?" అంది సుహాసిని.

"నాకంత స్వార్థం లేదు. మీరు మాత్రం అతన్ని అనుభవించకూడదన్నానా?" అంది సుచేత.

ముందు అతనికి పూర్తిగా తెలివిరానీండే" అంది లత.

"మనం నలుగురం సమానమే. మనకి ఈర్ష్యలు అసూయలు వద్దు. అందువల్ల డిక్‌ని మనం నలుగురం సమానంగా పంచుకుందాం" అంది వనజ.

సేవక్ చకచకా లోనికి వెళ్ళాడు.

చిరునవ్వు ముఖంతో కొద్దిసేపట్లో తిరిగివచ్చాడు.

డిక్‌ని నాలుగు సమభాగాలు చేసి తెచ్చి వారి ముందుంచాడు. ఆ భయంకర దృశ్యం చూసేసరికి నలుగురూ కొయ్యబారిపోయారు. తెప్పరిల్లాక గోడుగోడున విలపించసాగారు.

వనజ అంది "మనం డిక్‌ని సమానంగా పంచుకుందాం అన్నాంగా వెంటనే సేవక్ అతన్ని నాలుగు ముక్కలు చేసి తెచ్చాడు. ఇది మనం చేసిన భస్మాసుర సృష్టి. రోబోట్‌లు మనం చెప్పినవి అమలు పెట్టేట్లుండకూడదు. వెంటనే మెకానిజం మార్చేస్తాను " అంటూ సేవక్ వైపు వెళ్ళింది.

"ఇదే మనిషికీ, మరకీ తేడా" అంటూ నిట్టూర్చింది లత.

"ఇందాక మెడనొప్పిగా ఉంది. ఎవరైనా పిసికితే బాగుండునని అందామనుకున్నాను. అన్నాను కాదు.వచ్చి నా గొంతు పిసికేవాడు సేవక్" అంది సుహాసిని.

"నయమే, సమయానికే మేలుకున్నాం. కాకపోతే నిష్కారణంగా డిక్ బలి అయిపోయాడు. మనం ఒంటరిగా మిగిలిపోయాం" అంది సుచేత.

సేవక్‌లో ప్రతిస్పందన పరికరాలు తీసేసివచ్చి తేలిగ్గా ఊపిరితీసుకుంది వనజ.

"ఇంక అడగకుండానే మనసులో ఆలోచనల్ని గ్రహించి స్పందించే రోబోట్‌ల నిర్మాణానికి నేను చేస్తున్న పరిశోధనలకు ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్నాను". అంది డిక్ వంక బాధగా చూస్తూ.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జూలై 1988** ✪

# విశ్వాంతరాళంలో విజయయాత్ర

టీవిలో వారానికి ఒకసారి అంతరిక్షానికి సంబంధించిన ప్రోగ్రాములు ప్రసారం చేయడం మొదలుపెట్టారు. అనేక శక్తిమంతమైన టెలిస్కోపులద్వారా తీసిన చిత్రాలతోపాటు, వాయేజర్, ఎక్స్‌ప్లోరర్ వంటి అనేక అంతరిక్షనౌకలు తీసిపంపిన ఫోటోలను కూడా జోడించి వాటిని ఎంతో అందంగా రూపొందిస్తున్నారు. అంతేకాదు అవసరానికి తగ్గట్లుగా అసలుకి సరియైన నకలు అన్నట్లు అద్భుతమైన సెట్టింగులుకూడా వేసి, చిత్రాలు, స్కెచెస్ గీసి, వీటన్నింటినీ కలిపి ఎంతో ఆసక్తికరంగా రూపొందించసాగారు. ఆ చిత్రనిర్మాతలు. వీటికితోడు అతి సులభమైన భాషతో అందరికీ అర్థమయ్యే విధంగా, ఏదో సైన్స్ పాఠం చెబుతున్నట్లు కాకుండా, చక్కని కథ చెప్తున్నట్లుగా ఉంటోంది ఆ వ్యాఖ్యానం. ఈ కారణాల మూలంగా ఈ కార్యక్రమాలు ఐదేళ్ళ బాలుర దగ్గర్నుంచి ఎనభైయ్యేళ్ళ వృద్ధులవరకు అందర్నీ ఒకేవిధంగా ఆకట్టుకోసాగాయి. చిత్రలహరి చిత్రమాల, చిత్రహార్ వంటి సినీపాటల కార్యక్రమాలు, వారాంతపు చిత్రాలూ అయినా చూడకపోవచ్చునుకాని ఈ ప్రోగ్రామ్స్‌ని మాత్రం ఎవరూ మిస్ కావడంలేదు. ఇవి రామాయణ్‌తో సమానంగానో అంతకు మించో ప్రాచుర్యాన్ని పొందాయి. ప్రసారం చేసే సమయంకూడా రాత్రి తొమ్మిది తర్వాత ఉండి అందరికీ సౌకర్యంగా ఉండడంతో, తప్పనిసరి అయితే తప్ప వాటిని ఎవరూ మిస్ కావడం లేదు. ఇటీవల కొన్ని కంపెనీలు 3-డి టెలివిజన్‌లను కూడా తయారుచేస్తున్నాయి. కళ్ళకి ప్రత్యేకమైన అద్దాలు పెట్టుకుని వాటిని చూస్తున్నారు. సాక్షాత్తూ తాము అంతరిక్షంలో పరిభ్రమిస్తున్నట్లో లేదా ఇతర గ్రహాలపై తిరుగాడుతున్నట్లో అనుభూతిని చెందసాగారు. ఇంక రంగుల టెలివిజన్లలో, అందులోనూ పెద్ద స్క్రీన్‌గల మంచి కంపెనీల వాటిలో వీటిని చూస్తుంటే కలిగే అనుభూతి వర్ణనాతీతం. ఈ ప్రోగ్రాములలో మొదట నక్షత్ర మేఘాలు (నెబ్యులే) గురించి, తర్వాత వాటిలోని పదార్థం నక్షత్రాలు, నక్షత్ర కూటాలుగా (గాలక్సీలు) ఎలా మారేదీ చూపించారు. నూలుకండె, పళ్ళెం, స్వస్తిక్ చక్రం, సుడులు వంటి వివిధ విచిత్ర ఆకారాలలో ఉండే గాలక్సీల ఫోటోలను చూపారు. ఓరియన్, ఆండ్రోమెడ వంటి అద్భుతమైన గాలక్సీల చిత్రాలను చూపారు.

గుత్తులు గుత్తులుగా ఉండే గాలక్సీలను (క్లస్టర్డ్ గాలక్సీస్) ఒత్తుగా దట్టంగా ఉండే నక్షత్రాల సమూహాలను (స్టార్ క్లస్టర్స్) ప్రదర్శించారు. అవన్నీ చూస్తుంటే అనంత విశ్వంలో విజయయాత్ర చేస్తున్నట్లే అనిపించింది.



నక్షత్రాల తర్వాత సూర్యుని గురించిన కార్యక్రమం వచ్చింది. అందులో సూర్యుని రూపం, దానినుంచి వెలువడే అగ్నికీలలు (పోలార్ ఫ్లేర్స్, ప్రామినెన్సెస్), సంపూర్ణ సూర్యగ్రహణం దృశ్యం. ఆ సమయంలో ఏర్పడే కరోనా, సూర్యుని మచ్చలు వంటి వాటిని గురించి ఎంతో వివరంగా మనోజ్ఞంగా చూపించారు.

సూర్యుని తరువాత గ్రహాలకు సంబంధించిన ప్రోగ్రామ్‌లు వచ్చాయి. వాటిలో బుధుడు, ఆ గ్రహంమీదున్న వలయ పర్వతాల (క్రేటర్స్) దృశ్యాలు, బుధునికీ చంద్రునికీ కొట్టవచ్చినట్లు పోలికలు, శుక్రుడు. ఆ గ్రహంమీది దట్టమైన వాతావరణం, అక్కడ నిత్యమూ సంభవిస్తుండే భయంకరమైన పెనుధూళి తుఫానులు వంటివి చూపించారు.

ఆ తర్వాత భూమిని గురించిన కార్యక్రమం వచ్చింది. ముందు "భూమిని గురించి కార్యక్రమం పెట్టాల్సిన అవసరం ఏముంది?" అనుకున్నారు చాలామంది. తీరా చూశాక "అబ్బా... మన భూమిలో ఇంతటి అద్భుతమైన అందాలున్నాయా?" అనుకుని ఆశ్చర్యపోయారు. ఉత్తర దక్షిణ ధృవాలు, అక్కడ ఏర్పడుతుండే విచిత్రమైన ధృవకాంతులు అరోరా భోరియాలిస్, అరోరా ఆస్ట్రాలిస సహారావంటి గొప్ప ఎడారులు, ఆరిజోనాలోని గ్రాండ్ కాన్యాన్ వంటి అద్భుతమైన లోయలూ వంటివి చూసి పులకరించిపోయారు.

భూమి తర్వాత వచ్చింది అంగారకగ్రహం ఈ రెండింటికీ ఉన్న పోలికలూ, మంచుతో కప్పబడిన

దృశ్యాలూ. విశాలమైన ఎర్రని మైదానాలూ, ఎత్తయిన ఎర్రని కొండలు, పెద్దపెద్ద లోయలతో ఎంతో మనోజ్ఞంగా ఉంది అంగారక గ్రహం. తర్వాత బృహస్పతి గ్రహం గురించి చూపారు. దానిమీద విభూతి పిండి కట్లులాగా ఉండే మూడు ప్రత్యేకమైన ప్రాంతాలూ, రెండింటిమధ్య నున్న బ్రహ్మాండమైన ఎర్రని మచ్చ. ఎంతో మనోజ్ఞంగా కనిపించాయి.

తర్వాత వచ్చింది సౌరకుటుంబంలోని అత్యంత అందమైన శని గ్రహం. దాని బృహత్పరిమాణంతోపాటు దానికి ఉన్న మూడు వలయాలు సంభ్రమాన్ని కల్పించాయి.

తర్వాత యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో వంటి సుదూర గ్రహాల గురించి సూక్ష్మంగా తెలియజేశారు.

ఆ తర్వాత తోకచుక్కల గురించిన కార్యక్రమం వచ్చింది. తోకచుక్కలు, వాటి తలలు, తోకలతోపాటు, వాటి వివిధ ఆకారాలను చూపించారు. హాలీ, కోహూటక్ తోకచుక్కలపై ప్రత్యేకమైన కార్యక్రమాలను చూపించారు. వాటిలో చూపించిన దృశ్యాలు సంభ్రమాశ్చర్యానందాలను కలిగించేవిగా ఉన్నాయి.

ఇవన్నీ అయ్యాక ఉపగ్రహాల కార్యక్రమంలో భాగంగా ముందుగా చంద్రుని గురించి సవివరంగా చూపించారు.

చంద్రుడు భూమికి అత్యంత సమీపంగా ఉన్న ఇతర గోళం. పైగా మానవుడు తొలిసారిగా 1969లో కాలుమోపిన పరలోకం. దీనిగురించి మనకు తెలిసినంతగా, అంత వివరంగా, వేరే ఏ ఇతర గోళం గురించీ తెలియదు. బ్రహ్మాండమైన టెలిస్కోప్‌లద్వారా తీసిన చిత్రాలేకాక దానిపై దిగుతూ, దిగిన తర్వాత, వ్యోమగాములు తీసిన చిత్రాలుకూడా ఎన్నో ఉన్నాయి. వీటన్నింటితో అద్భుతమైన కార్యక్రమాలలో తలమానికంగా ఉన్నటువంటిదానిని నిర్మించారు.

చంద్రునిమీద ఎత్తయిన పర్వతాలు, వలయ పర్వతాలు (క్రేటర్స్), లోయలు, మైదానాలు, చీలికలు, కిరణాలు (రేస్)వంటివాటిని సవివరంగా చూపించారు. వీటికితోడు చంద్రునిమీద కాలూనడానికి, అంచెలంచెలుగా అపోలో మిషన్‌లద్వారా జరిగిన కృషిని ప్రత్యేకంగా చూపించారు. వీటిలో మొదటగా 1969లో అపోలో-11లో వెళ్ళిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వగైరాలు చంద్రునిమీద దిగి జయకేతనాన్ని పాతడం చూపించారు. అక్కడ వారి పాదముద్రలు, జరిపిన విన్యాసాలు చూపించారు. తర్వాత జరిగిన అపోలో-12 యాత్ర విజయవంతంగానే జరిగింది. దానిలో ప్రత్యేకత ఏమీ లేదు. అయితే ఆ తర్వాత జరిగిన అపోలో-13 యాత్ర విఫలమవడమే కాకుండా, పరమ భయంకరమైన అనుభవంగా మారింది. అందువల్ల దానిని గురించి సెన్సేషన్‌లో ముంచెత్తే చిత్రాన్ని నిర్మించారు. ఇందుకుగాను స్వతహాగా అందులో వెళ్ళిన అంతరిక్ష యాత్రికులను తీసుకున్నారు. వారితో కొత్తగా షూటింగ్ జరిపి, వారు తీసిన చిత్రాలను కొన్నింటిని కలిపి ఎంతో ఉత్తేజకరమైన చిత్రాన్ని నిర్మించారు. దానికి 'ది డ్రెడ్‌ఫుల్ ఎపిసోడ్ ఆఫ్ అపోలో-13' అని పేరుపెట్టారు. (అపోలో 13 భయానక ఉదంతం). ఈ కార్యక్రమం గురించి ముందుగా బాగా ప్రచారం చేయడంతో దానిని చూడడానికి అందరూ వేయి కళ్లతో ఎదురుచూడసాగారు.

* * * *

రాత్రి 9.50 అయింది.

టి.వి.లో ఇంగ్లీషు వార్తలు అయిపోయాయి.

అపోలో-13 కార్యక్రమం కోసం అందరూ ఉగ్గబట్టుక్కూర్చున్నారు.

ప్రోగ్రాం మొదలయింది.

ముందుగా అపోలో యాత్రలగురించి స్థూలంగా చెప్పి, అపోలో-13 లక్ష్యాలను వివరించాడు వ్యాఖ్యాత.

పశ్చిమదేశాలవారికి 13 చాలా దురదృష్టమైన సంఖ్య. ఆ సంఖ్య అంటే చాలా భయపడ్తారు వారు. 13 సంఖ్యని దేనికి ఉంచడానికీ ఇష్టపడరు. అనేక హోటళ్లలో గదులకి నంబర్లను కేటాయించేటప్పుడు ఈ సంఖ్యని వదిలేసి 12 తర్వాత 14 రాసేస్తారు. ఒకవేళ 13 నెంబరు ఉంచితే ఆ గదిలో దిగడానికి ఎవరూ సాహసించారు. ప్రయాణాలూ, ముఖ్యమైన పనులూ 13వ తారీఖున మానుకుంటారు. అంతగా ఉంటుంది. 13 సంఖ్య అంటే వారి భయం. ఈ భయానికి తగ్గట్టుగానే, అపోలో-13 యాత్రకి ఆదినుంచి అరిష్టాలే ఎదురయ్యాయి. దాని నిర్మాణం దగ్గర్నుంచి, అంతరిక్షంలోనికి పంపడంవరకూ అడుగడుగునా ఇబ్బందులే.

కార్యక్రమం రాకెట్‌ను పేల్చడంతో మొదలైంది. పేల్చిన వెంటనే బ్రహ్మాండమైన మంటలను ఎగజిమ్ముతూ క్షణాల్లో రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోయింది.

భూమిని చుట్టూ పరిభ్రమిస్తూ నెమ్మదిగా భూమికి దూరం అవుతోంది రాకెట్. సెకండ్ స్టేజిలో రాకెట్‌లోని దిగువభాగం విడిపోయింది. బరువు తగ్గడంతో రాకెట్‌లోని మిగిలిన భాగం మరింత వేగాన్ని పుంజుకుంది. మరికొంత సమయానికి రాకెట్‌లోని మరో భాగంకూడా విడిపోయింది. దాంతో కేవలం అపోలో-13 అంతరిక్ష నౌక మాత్రం మిగిలింది. అది మరికొన్నిసార్లు భూమిచుట్టూ తిరిగి చివరకు భూమి ఆకర్షణశక్తిని ఛేదించుకుని అంతరిక్షంలోకి దూసుకుపోయింది.

అటు తర్వాత అంతరిక్షంనుంచి భూమి కనిపించే దృశ్యాలను అద్భుతంగా చూపించారు.

బ్రహ్మాండమైన సముద్రాలు, ధృవాల దగ్గర మంచు, దట్టమైన మేఘాలు, మధ్యమధ్య భూభాగాలు- ఇలా ప్రతిదీ కన్నుల పండువగా చిత్రీకరించారు. భూభాగాలలో అమెరికా, ఇండియా, చైనా వంటివి వచ్చినపుడు వాటిని క్లోజప్‌లో చూపించారు. ఇంట్లో కూర్చుని సొంత దేశాన్ని, యావత్ ప్రపంచాన్నీ ఒకే కంట చూడగలగడం జీవితంలో మరువలేని మధురానుభూతి.

అంతరిక్ష నౌకలో ముగ్గురు యాత్రికులు ఉన్నారు. వారు ప్రత్యేకమైన దుస్తులు ధరించారు. రకరకాల యంత్రాలతో పనిచేస్తున్నారు. మధ్యమధ్య భూకేంద్రంతో మాట్లాడుతున్నారు వారు. ఒకచోటనుంచి మరో చోటకి వెళ్ళాలంటే అతి సులువుగా గాలిలో తేలుతూ వెళ్తున్నారు. వారు జగ్‌లోనుంచి నీటిని వంచితే క్రిందికి పడడంలేదు. నీళ్ళు త్రాగాలన్నా, ఆహారం తినాలన్నా అంతే. ప్రత్యేకమైన పద్ధతిలో, ప్రత్యేక పరికరాలతో చేయాల్సిందే. ఆసక్తికరెకెత్తించడంకోసం ఇటువంటి దృశ్యాలను ఆ చిత్రంలో పొందుపర్చారు.

కొంచెంసేపట్లో చంద్రుడు అంతకంతకీ దగ్గరవుతున్న దృశ్యాలు వచ్చాయి. అంతరిక్షంలోంచి చూస్తుంటే చంద్రుడు అద్భుతంగా మెరిసిపోతూ, వర్ణింపశక్యం కాని అందాలను వలికిస్తున్నాడు.

ఇంతలో అపోలో యాత్రికుల ముఖాలలో ఆందోళన ప్రస్ఫుటంగా కనిపించింది. కెప్టెన్ ఆందోళన స్వరంతో "గ్రౌండ్ కంట్రోల్.... దిసీజ్ ఫ్రం అపోలో-13" అని వైర్‌లెస్ ద్వారా అన్నాడు.

"ఎస్ గ్రౌండ్ కంట్రోల్ హియర్" అంటూ సమాధానం వచ్చింది.

"చూడండి. అంతరిక్ష నౌకలో ఏదో లోపం ఏర్పడింది. అది చంద్రునిదిశగా పోకుండా, దానిచుట్టూ తిరుగుతూ ఉండే కక్ష్యలోకి ప్రవేశించింది" అన్నాడు కెప్టెన్.

"ఉండండి. దానికి కరెక్షన్ ఇస్తాను. మీ నౌక వెళ్తున్న డైరెక్షన్, యాంగిల్ మొదలైన వివరాలన్నీ ఇవ్వండి" అన్నాడు గ్రౌండ్ కంట్రోలర్.

అవసరమైన వివరాలన్నీ ఇచ్చాడు కెప్టెన్.

క్రిందనుంచి అంటే భూమిమీద గ్రౌండ్ కంట్రోల్‌నుంచి వైర్‌లెస్ సంకేతాల రూపంలో కరెక్షన్స్ ఇచ్చారు. కాని నౌకలోని యంత్ర పరికరాలలో ఏదో లోపం ఏర్పడడంతో అది ఆ సంకేతాల్ని స్వీకరించలేదు.

"మైగాడ్. ఇది మీ సంకేతాల్ని స్వీకరించడంలేదు. మేము ఇప్పుడు అంతరిక్షంలో బందీలం అయిపోయాం. ఈ అపోలో-13 అంతరిక్షనౌక చంద్రునికి శాశ్వతంగా ఉపగ్రహంగా మారిపోతుంది. మా ముగ్గురి ప్రాణాలు కొద్దిరోజుల్లో పోతాయి. మా శవాలతో ఈ నౌక నిత్యమూ చంద్రునిచుట్టూ తిరుగుతుంటుంది" అన్నాడు కెప్టెన్.

"ధైర్యం సడలకండి. మేము ఇక్కడినుండి అన్నివిధాలా ప్రయత్నించి దానికి కరెక్షన్ ఇస్తాం. మీరుకూడా లోపం ఎక్కడేర్పడిందో తెలుసుకోడానికి ప్రయత్నించండి" అన్నాడు గ్రౌండ్ కంట్రోలర్.

"మేము ముగ్గురం అదే పనిమీదున్నాం. ఒకవేళ మా నౌక చంద్రునికి ఉపగ్రహంగా మారకపోయినా, దాని ఆకర్షణశక్తి మూలంగా, కొద్దిరోజుల్లోనే దానిని ఢీకొని ముక్కలు ముక్కలైపోవచ్చు. అపుడు నౌకముక్కలతోపాటు మా శవాల ముక్కలుకూడా చంద్రునిమీద చెల్లాచెదురుగా పడతాయి. ఏమైనా మేము బ్రతికి బయటపడేమాట అనుమానం అందుకే భూమికీ, మీ అందరికీ గుడ్‌బై చెప్తున్నాం" అన్నాడు మరో యాత్రికుడు.

ఆ తర్వాత అంతరిక్ష నౌకలోని యంత్రాలను, యాత్రికులు సరిచూసుకుంటున్నట్లూ, గ్రౌండ్ కంట్రోల్‌వారు, వారి ప్రయత్నాలను వారు చేస్తున్నట్లూ చూపించారు. మూడు రోజులు మృత్యువుతో హోరాహోరీగా పోట్లాడి, చంద్రాకర్షణ కబంధ హస్తాలనుంచి బయటపడి అపోలో-13 భూమివైపు ప్రయాణం సాగించింది. చివరికి పసిఫిక్ మహాసముద్రంలోకి దిగింది. అంతరిక్ష యాత్రికులు ముగ్గురూ క్షేమంగా బయటకు వచ్చారు.

ఆ మూడు రోజులూ ప్రపంచంలోని ప్రతివ్యక్తీ ఎంతో ఆందోళన పొందారు. ఒక్క అంశంపై ప్రపంచం యావత్తూ దృష్టిని నిలిపిన సంఘటన ప్రపంచంలో అది ఒక్కటే.

ఈ కార్యక్రమం వచ్చిన అరగంటసేపూ ప్రేక్షకులు అందరూ కుర్చీలకు అంటుకుపోయారు. దడదడలాడే గుండెలతో చూశారు. అంత ఉద్విగ్నంగా చిత్రించారు దాన్ని.

కార్యక్రమాన్ని ముగిస్తూ, అంగారకునికీ, బృహస్పతికీ మధ్య ఉన్న వేలాది అల్పగ్రహాలలో (ఆస్టరాయిడ్, 'సెరిస్', 'వెస్టా' వంటి వాటిమీద శాశ్వత స్థావరాన్ని నెలకొల్పి అక్కడనుంచి అంగారకుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో వంటి సుదూర గ్రహాలను పరిశోధించడానికి ప్రయత్నాలు

జరుగుతున్నాయని వాటిని గురించిన కార్యక్రమం ఆ సిరీస్‌లో భాగంగా ప్రసారం చేస్తామని చెప్పారు.

అంతకు ముందు నక్షత్రాలూ, గ్రహాల గురించి చూసిన కార్యక్రమం ఒకయెత్తు. ఈ అపోలో-13 కార్యక్రమం ఒకఎత్తు అంటున్నారు ప్రేక్షకులు.

ప్రపంచం 21వ శతాబ్దంలోకి దూసుకుపోయింది. అంతరిక్ష శాస్త్రం ఎంతగానో అభివృద్ధి చెందింది. చంద్రునిమీద కాలనీలు కట్టి శాస్త్రజ్ఞులు బృందాలు బృందాలుగా ఉంటూ పరిశోధనలు చేస్తున్నారు. అంతరిక్ష శాస్త్రంలో అమితంగా అభివృద్ధిని సాధించిన భారతదేశం కూడా అమెరికా, రష్యా, బ్రిటన్, జపాన్‌వంటి అత్యంత అభివృద్ధి చెందిన దేశాల సరసన ఉండి అన్నిరకాల అంతరిక్ష పరిశోధనలలోనూ పాలుపంచుకుంటోంది.

అంగారక గ్రహంమీద మానవుడు కాలూని వచ్చాడేకాని ఆ గ్రహం మీద సమగ్రమైన పరిశోధనలు జరగలేదు. బృహస్పతి మీదున్న ఎర్రనిమచ్చ, శనిగ్రహపు వలయాలు వంటివి ఇంకా అంతుచిక్కని రహస్యాలు గానే ఉండిపోయాయి. బృహస్పతికి ఉన్న గానిమీడ్, శనికి ఉన్న టైటాన్ వంటి ఉపగ్రహాల మీద వాతావరణం, నీరు ఉన్నాయి. వాటిమీద జీవం ఏదో రూపంలో ఉంటుందని శాస్త్రజ్ఞుల విశ్వాసం. వీటన్నిని సమగ్రంగా పరిశోధించాలంటే కేవలం అంతరిక్ష నౌకలను పంపితే చాలదు. వాటిని సమీపించి స్థిరమైన అంతరిక్షపరిశోధనాలను నిర్మించి అక్కడినుంచి నిత్యమూ పరిశోధనలు జరుపుతుండాలి.

భూమి తర్వాత ఉన్నది అంగారక గ్రహం.

దాని తర్వాత ఉన్నది బృహస్పతి గ్రహం.

ఈ రెండింటి మధ్యన కొన్నివేల అల్పగ్రహాలు ఉన్నాయి. వీటిని "ఆస్టిరాయిడ్స్" అని లేక "ప్లానిటాయిడ్స్" అని అంటారు. శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం ఒకప్పుడు అంగారకునికీ, బృహస్పతికీ మధ్యన భూమివంటి ఒక పెద్ద గ్రహం ఉండేది. అది ఏ కారణం చేతనో ప్రేలిపోయి కొన్నివేల ఉపగ్రహాలుగా మారిపోయింది. చిన్నచిన్న ముక్కలు కోటానుకోట్ల ఉల్కలుగా మారాయి. ఇవి భూమిని సమీపించినప్పుడు భూమి ఆకర్షణ శక్తిమూలంగా భూమిమీదపడ్తూ వాతావరణంలో ప్రవేశిస్తాయి. అక్కడ ఆ రాపిడికి మండిపోయి నేలమీద పడిపోయినట్లు అనిపిస్తాయి. వీటినే పాతకాలంవాళ్ళు నక్షత్రాల తోకలు తెగిపడ్డాయంటుంటారు. చిన్న ఉల్కలయితే వాతావరణంలో మండిపోతాయి. పెద్దవైతే మండుతూనే వచ్చి నేలమీద పడ్తాయి. మరీ పెద్దదైతే అమిత వేగంతో నేలను ఢీకొంటాయి. ఫలితంగా పెద్ద పెద్ద గోతులు, ఓ మాదిరి భూకంపాలు ఏర్పడతాయి. అయితే ఇట్టివి అతి అరుదుగా సంభవిస్తాయి. మహారాష్ట్రలోని బుల్దానా జిల్లాలోని సరస్సు ఈ విధంగా ఏర్పడిన గోయి నీటితో నిండగా ఏర్పడినదే. అంగారక గ్రహాన్ని దాటి ప్రయాణం చేయవలసిన అంతరిక్ష నౌకలకే ఈ ఉల్కల, అల్పగ్రహాల తాకిడి ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. అంతరిక్ష నౌకలను పంపేప్పుడు సాధ్యమైనంతవరకూ ఈ అల్ప గ్రహాల కక్ష్యకు దూరంగా ఉండేటట్లు వాటి మార్గాన్ని నిర్దేశిస్తారు. చిన్న ఉల్కలైతే అమిత వేగంతో వచ్చి అంతరిక్ష నౌకను ఢీకొండే ఇంక అంతేసంగతులు. అంతరిక్ష నౌక తుక్కుతుక్కయి అడ్రను లేకుండా పోతుంది. ఇట్టి ప్రమాదాలను నివారించేందుకు రాడార్ ద్వారా ఎప్పటికప్పుడు నౌకను సమీపిస్తున్న వస్తువులను గురించి సమాచారం తెలిపే ఏర్పాటు ఉంటుంది. అలాగే ఆ ఉల్కలు గుద్దుకోనీకుండా

అంతరిక్షంలోనే ప్రేల్చేసే, లేదా వాటి దిశ, గతి మార్చే ఆటోమాటిక్ రిపెల్లర్స్ ఉంటాయి. ఇటువంటి జాగ్రత్తలు ఎన్నో తీసుకునే కారణంగా, అంతరిక్ష నౌకలకి ప్రమాదాలు ఎప్పుడో కాని సంభవించవు.

అంగారకునికీ, బృహస్పతికీ మధ్యనున్న అల్పగ్రహాలలో అనువైన దానిమీద స్థావరం ఏర్పరచుకుంటే అక్కడినుంచి అంగారక గ్రహాన్నేకాక, బృహస్పతి, శనివంటి సుదూర గ్రహాలను ఎంతో బాగా పరిశోధించవచ్చు. అంతరిక్ష పరిశోధనలలో అనేక దేశాలు పాల్గొనుటుండటంవల్ల అంతర్జాతీయ అంతరిక్ష సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాయి ప్రపంచ దేశాలు. ఇందులో సభ్యత్వం ఉన్న ప్రముఖ దేశాలలో భారతదేశంకూడా ఒకటి. ఈ సంఘాలన్నీ తమ అంతరిక్ష పరిశోధనలలో పరస్పరం సహకరించుకుంటాయి. ఈ సంఘం "వెస్టా" అనే అల్ప గ్రహం మీద స్థావరాన్ని ఏర్పరచుకుని పరిశోధన శాలను నిర్మించింది. ఈ అల్పగ్రహం మీద వాతావరణం, నీరు వంటివి ఏవీ లేనందువల్ల ఏ ఇబ్బందీ లేకుండా, టెలిస్కోప్, స్పెక్ట్రోస్కోప్ వంటి సాధనాలతో గ్రహాల్నీ, నక్షత్రాల్నీ, నిరాటంకంగా పరిశోధిస్తుండవచ్చు. ఈ అల్పగ్రహం మీద కృత్రిమంగా కాలనీని నిర్మించుకుని భూవాతావరణాన్నీ, నీటినీ, ఇతర అవసరాలనూ కృత్రిమంగా ఏర్పరుచుకున్నారు. నెలానెలా స్పేస్‌షటిల్ ద్వారా కావలసిన పదార్థాలూ, వస్తువులూ వస్తుంటాయి. వీటితోపాటే శాస్త్రజ్ఞుల బృందాలూ వస్తుంటాయి. కొత్త బృందంరాగానే పాత బృందం అదే స్పేస్ షటిల్‌లో తాము సేకరించిన సమాచారాన్ని తీసుకుని భూమికి వెళ్ళిపోతుంటుంది. ఈ వెస్టా కేంద్రం నుంచి శాస్త్రజ్ఞులు అనేక అద్భుత విషయాలను కనుగొంటుంటారు.

* * * *

భూమినుంచి సరికొత్త బృందంతో స్పేస్ షటిల్ వెస్టా కేంద్రానికి బయలుదేరింది. ఇందులో ముగ్గురు సభ్యులున్నారు. వారు ముగ్గురూ భారతీయులే. వారు డాక్టర్ మధుకర్, ప్రొఫెసర్ మూర్తి, డాక్టర్ రావ్‌లు. మధుకర్, శ్రీహరికోటలో ఉన్న షార్ అంతరిక్ష కేంద్రంలో ఇంజనీర్. మూర్తి బెంగుళూరులోని ఇస్రో కేంద్రంలో సైంటిస్ట్. డాక్టర్ రావ్ అహమదాబాద్‌లోని భూకేంద్రంలో సైంటిస్ట్. ముగ్గురూ వారివారి రంగాలలో ఆరితేరినవారు. ముగ్గురూ కూడా ఖగోళ శాస్త్రంలో మంచి ప్రావీణ్యం ఉన్నవారు. అయితే వారి ముగ్గురికీ అంతరిక్ష యానం చేయడం అదే మొదటిసారి. అలాగని నౌకను నడపడంలో వారికి ఇబ్బందులు ఏవీలేవు. ఎందుకంటే వారు ముగ్గురూ అందులో సమగ్రమైన శిక్షణని పొందారు.

అంతరిక్ష నౌకలో ప్రయాణం వారికి విచిత్రమైన, అలౌకికమైన అనుభూతిని కలిగిస్తోంది.

అతి విశాలంగా, దిక్కులనన్నింటినీ కమ్ముకుని ఉన్నట్లుండిన భూమి చూస్తుండగా కుంచించుకుపోయి గోళంగా మారడం, మరువలేని మధురానుభూతి.

రోజులూ, వారాలూ గడుస్తున్నకొద్దీ భూమి అంతకంతకీ చిన్నదైపోతోంది. బక్కలాగుండిన అంగారకుడు అంతకంతకీ పెద్దగా కనిపించసాగాడు. బాట్‌మింటన్ బాల్ పరిమాణంలో ఉంటుండిన బృహస్పతి ఫుట్‌బాల్ పరిమాణంలో కనిపించసాగాడు. నల్లని ఆకాశంలో, చాందినీకి వ్రేలాడగట్టిన పాదరసం బుడ్లలాగా మెరిసిపోతున్నాయి. తారకలు భూమినుంచి చూస్తే వాతావరణం కాంతికిరణాలను చెదరగొట్టే కారణంగా, ఆకాశం నీలంగా కనిపిస్తుంది. సూర్యునికాంతి అన్నివైపులా ప్రసరించడంవల్ల, పగటిపూట నక్షత్రాలు కనిపించవు. కాని అంతరిక్షంలో పగలూ, రాత్రి అంటూ ఉండదు. అంతా దిమ్మచీకటి. అందులో

నక్షత్రాలూ, సూర్యుడూ ఉజ్వలంగా మెరుస్తూ కనిపిస్తుంటాయి. భూమిమీద వాతావరణం మూలంగా, నక్షత్రాలు మిణుకుమిణుకుమంటున్న భ్రమ కలుగుతుంది. అంతరిక్షంలో వాతావరణం ఉండనందువల్ల నక్షత్రాలూ, ఎలక్ట్రిక్ బల్బుల్లా మెరుస్తుంటాయి.

అంతరిక్షంలోని ఆ ముగ్గురికీ ఇవన్నీ విచిత్రానుభూతులే. అంతరిక్ష నౌక అంగారక గ్రహాన్ని దాటింది.

కొద్దివారాలలో అల్పగ్రహాల ప్రాంతంలో ప్రవేశించింది. అనేక చిన్న చిన్న ఉల్కలు దానివైపు దూసుకుంటూ వచ్చాయి కాని నౌకకున్న ఆటోమాటిక్ రిపెలెంట్‌లు వాటిని ఎప్పటికప్పుడు ధ్వంసం చేస్తూ వచ్చాయి.

అంతరిక్ష నౌక ఇంకొక్క వారంలో వెస్టాని చేరుతుంది.

ఆరోజు అనుకోని ఉత్పాతం జరిగిపోయింది.

సుమారు పది అడుగుల వ్యాసం ఉన్న ఒక ఉల్క అమిత వేగంతో అంతరిక్ష నౌకవైపు వస్తోంది.

అంత పెద్ద ఉల్కల్ని రిపెల్లెంట్‌లు ఏమీ చేయలేవు.

అప్పుడు ఆటోమేటిక్‌గా, దానిని నౌకనుంచి ప్రేల్చివేస్తారు. లేదా అంతరిక్ష నౌకని ప్రక్కలకి కాని, పైకికాని, క్రిందకి కాని జరిపి, డాష్ అయ్యే ప్రమాదాన్ని నివారిస్తారు. అవి తప్పిపోయాక తిరిగి అవసరమైన మార్గంలో ప్రవేశపెడ్తారు. అయితే అకస్మాత్తుగా అంతరిక్ష నౌకలో ఏదో లోపం ఏర్పడింది. ఉల్కని ప్రేల్చివేసే ఆటోమేటిక్ మిసైల్ విడుదల కాలేదు.

ఇంక మిగిలిన మార్గం, నౌక మార్గం తప్పించడమే.

ఆ ప్రయత్నం చేస్తుండగానే, నౌక కొంత జరుగుతుండగానే ఆ ఉల్క వచ్చి అంతరిక్ష నౌకని గుద్దేసింది. అయితే అప్పటికే నౌక కొంతమేరకు జరిగి ఉండటంతో ఆ తాకిడి ఒక మూలగా, కొంత భాగానికి తగిలింది. దాంతో ఆ భాగం విడివడి, అంతరిక్షంలో ఎటో దూసుకుపోయింది.

ఆ అదురుకి స్పృహతప్పిపడిపోయారు మధుకర్, మూర్తి, రావులు.

వారికి తెలివి వచ్చేసరికి కొన్ని గంటలు పట్టింది.

తెలివి వచ్చాక కూడా వెంటనే లేవలేకపోయారు.

మానసికంగానూ, శారీరకంగానూ అంతగా నీరసించిపోయారు. తర్వాత నెమ్మదిగా లేచారు.

ఆ ముగ్గురికీ స్వల్పంగా గాయాలయ్యాయేకాని పెద్ద దెబ్బలేవీ తగలలేదు.

లేచి నౌక పరిస్థితిని పరిశీలించారు.

నౌకలో సగభాగం విరిగిపోయి, విడిపోయి ఎటో వెళ్ళిపోయింది.

అదృష్టవశాత్తు ఆ నల్గురూ క్షేమంగా ఉన్న భాగంలో ఉన్నారు. అయితే విడిపోయిన భాగంలోనే రాడార్, వైరలెస్ ఎక్విప్‌మెంట్ రెట్రో రాకెట్స్ మొదలయినవి ఉన్నాయి. రెట్రోరాకెట్లు, అంతరిక్ష నౌకగోళం మీద దిగేటప్పుడు దూసుకువెళ్ళి గుద్దుకోకుండా దాని వేగాన్ని తగ్గించి నెమ్మదిగా దిగేట్లు చేస్తాయి. ఇప్పుడు ఇవన్నీ లేకపోవడంతో అంతరిక్ష నౌకకి భూమితోకాని, వెస్టామీదున్న కేంద్రంతోకాని సంబంధం పూర్తిగా తెగిపోయినట్లయింది. అంతరిక్షంలో జరిగిన ప్రమాదం గురించి వారికి తెలిపే అవకాశం లేదు.

తెలిసే అవకాశమూ లేదు.

"మైగాడ్....ఇప్పుడు మనం పూర్తిగా అంతరిక్షంలో బందీలం అయిపోయాం. మెసేజి పంపే అవకాశం లేదు. భూ కేంద్రంకాని, వెస్టా కేంద్రంకాని, మన దగ్గర్నుంచి రోజువారీ సందేశాలు అందకపోవడం వల్ల మనకేదో జరిగిందని తెలుసుకోవాల్సిందే..." అన్నాడు డాక్టర్ మూర్తి.

"ప్రమాదం జరిగిందని తెలుసుకోగలరే కాని ఎక్కడ జరిగిందో తెలుసుకోవడం చాలా కష్టం. తీరా వారు తెలుసుకుని మన కోసం రెస్క్యూషిప్‌ని పంపి, అది వచ్చేసరికి, మనం ఎవ్వరం ప్రాణాలతో ఉండం" అన్నాడు రావు.

"ఇప్పుడు మనం కేవలం అదృష్టపు దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి వున్నాం. నౌకలోని మెకానిజం అంతా బాగా దెబ్బతింది. నౌక ఎటుపోతోందో తెలియని పరిస్థితి ఆ ఉల్క అదురుకి నౌక మార్గం మారిపోయి ఉండవచ్చు. ఇదిలాపోతూ ఏ అల్పగ్రహాన్ని , గ్రహాన్నో, ఉపగ్రహాన్నో సమీపించి నూటిగాపోయి గుద్దేసుకుని ముక్కలుముక్కలయిపోవచ్చు. కాని అప్పటికి మనం ఎవ్వరం బ్రతికి ఉండం" అన్నాడు మధుకర్.

"గ్రుద్దుకుంటుందో, ఏ గ్రహానికైనా ఉపగ్రహంగా మారుతుందో ఏం చెప్పగలం? అంతా అప్పటి పరిస్థితిని బట్టి ఆధారపడి ఉంటుంది..." అన్నాడు మూర్తి.

"అపోలో - 13 యాత్రికులకి ఏర్పడిన పరిస్థితే ఇప్పుడు మనకి ఏర్పడిందన్నమాట. కారణాలు వేరైనా వారి నౌకకీ, మననౌకకీ కూడా లోపం ఏర్పడింది. అయితే ఒక్కటే తేడా. వారికి భూమితో సంబంధాలు పోలేదు. మనకి అందరితోనూ సంబంధాలు పోయాయి" అన్నాడురావు.

"ఇప్పుడు మన పరిస్థితి ఏమిటో ఖచ్చితంగా తెలుసుకోవాలి. అప్పుడే ఏదైనా పరిష్కారం కనుగొనడానికి అవకాశం ఏర్పడుతుంది. అంతరిక్షంలో నిరాశతో దిక్కులేని చావు వచ్చే బదులు కడకంటూ పోరాడుతూ వీరమరణం పొందుదాం రండి. నౌక అంతా కలియచూసివద్దాం...." అంటూ లేచాడు మధుకర్.

అతని వెంట మిగిలిన ఇద్దరూ కూడా లేచారు.

ఆ అంతరిక్ష నౌకలోని రెండు విభాగాలను వేర్వేరుగా నిర్మించి ఆ రెండింటినీ కలిపారు. ఒక భాగంలో వైర్‌లెస్ సెట్, కంట్రోలింగ్ పరికరాలు. రాడారు,కంప్యూటర్‌లు కొన్ని వున్నాయి. ఇవికాక గోడౌన్‌లాంటి దానితో, యాత్రికులకి అవసరమైన ఆహారపదార్థాలతోపాటు వెస్టాకేంద్రంలో దింపవలసిన ఆహారపదార్థాలు, శాస్త్రీయ సామగ్రి, ఆక్సిజన్ సిలిండర్‌లు ఉన్నాయి. ఈ భాగమే ఉల్క తాకిడికి మొత్తం విరిగిపోయి తుక్కుతుక్కయి అంతరిక్షంలో ఎక్కడికో వెళ్ళిపోయింది.

ఇంక రెండోభాగంలో నిత్యావసరాలకి సరిపోయే ఆహారపదార్థాలు,గాలి ఉన్నాయి. కొన్ని కంప్యూటర్ వంటి యంత్రాలు ఉన్నాయి. అదృష్టవశాత్తు ఈ భాగం అదరిందే కాని దెబ్బతినలేదు. ఈ విభాగానికి అనుకుని లోహపు గోడలతో చేసిన పెద్ద వాటర్‌టాంక్ ఉంది. దానిలో నీటిని వెస్టామీదున్న శాస్త్రజ్ఞుల అవసరాల కోసం తీసుకువెళ్తున్నారు. వీరికి అవసరమైన నీటిని ఒక టాప్‌ద్వారా తీసుకునే ఏర్పాటుంది. అక్కడున్న యంత్రాలలో రాకెట్ గతిని, దిశను చూపించేది మాత్రం బాగుంది. మిగిలినవి దెబ్బతిన్నాయి.

అంతరిక్షనౌకలో మిగిలిన ఆ భాగాన్ని నిశితంగా పరిశీలించి వచ్చాక కుర్చీలలో కూలబడ్డారు ముగ్గురూ.

"అబ్బాయి. ఇప్పుడు ఇందులో ఉన్న నీరు మన ముగ్గురికే అయితే ఏడాదిపాటు సరిపోతుంది. ఆహారపదార్థాలు పదిరోజులకి సరిపోతాయి. జాగ్రత్తగా వాడుకుంటే ఇంకో పదిరోజులు రావచ్చు. కానీ ఆ అవసరం రాదులే. ఎందుకంటే ఇప్పుడు మనకి అందుబాటులో వున్న గాలి మూడురోజులు వరకే సరిపోతుంది. ఎట్టిపరిస్థితులలోనూ అందులో వున్న ఆక్సీజన్ నాలుగోరోజు నాటికి ఖర్చయిపోవటం ఖాయం' అన్నాడు మూర్తి. రోజులు దగ్గరపడ్తుండేసరికి ఆప్యాయత పెరిగి 'అబ్బాయి' అని సంబోధించాడు.. మామూలుగా అయితే "ఏమండీ" అనో "మిస్టర్" అనో సంబోధించేవాడు.

మిగిలిన ఇద్దరూ ఆ మాటలు విని ఊరుకున్నారు.

కొద్దిసేపటివరకూ ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండిపోయారు.

"ఆ ఉల్క గుద్దుకున్నప్పుడే మన ప్రాణాలు పోయుంటే బాగుండేది. ఇలా సస్పెన్స్‌తో టెన్షన్‌తో గడుపుతూ దిక్కులేని చావు చావడంకంటే"అన్నాడు రావు.

"ఏమో బ్రతికి బయటపడ్తామేమో! ఏదైనా మార్గం గోచరిస్తుందేమో! ఎవరు చెప్పగలరు!" అన్నాడు మధుకర్.

"నాకు అర్థంలేని ఆశావాదులంటే ఒళ్ళుమంట. ఆశ ఏర్పరచుకోవడానికి కూడా అర్థం ఉండాలి." అంటూ చిర్రుబుర్రులాడాడు మూర్తి.

"మనం ఎలాగూ చావక తప్పదు. బ్రతికుండే ఈ రెండుమూడు రోజులూ, సరదాగా జోక్స్ వేసుకుంటూ బతుకుదాం" అన్నాడు రావు.

"మనకున్న సమయం చాలా తక్కువ. అదిప్పుడు ఎంతో విలువైంది. సరదాకబుర్లుమాని బయటపడే మార్గం ఏదన్నా గోచరిస్తుందేమో ఆలోచించడం మంచిది" అన్నాడు మధుకర్ కొంచెం సీరియస్‌గా.

"అదేదో నువ్వే ఆలోచించు' అన్నాడు రావు ముఖం ముడుచుకొని ఇప్పుడు అతన్ని 'నువ్వు' అనడం మొదలుపెట్టాడు.

"నేను ఎలాగూ ఆలోచిస్తాను. మిమ్మల్ని కూడా ఆలోచించమని అడుగుతున్నాను. మీరు ఆలోచించలేకపోతే మిన్నకుండండి., నన్ను డిస్టర్బ్ చేయకండి" అన్నాడు మధుకర్.

నౌక కిటికీలోనుంచి బయటకు చూశాడు మూర్తి.

వెస్టా పౌర్ణమినాడు ఉదయించే చంద్రుడిలాగా పెద్దగా కనిపిస్తోంది.

"వెస్టా బాగా పెద్దగా కనిపిస్తోంది. ఈ లెక్కన మరోవారం పదిరోజుల్లో వెస్టాను చేరవచ్చు మనం" అన్నాడు మూర్తి.

"చేరవచ్చు కాదు -గుద్దుకోవచ్చు- మన శవాలతోపాటు ఈ అంతరిక్షనౌక వెళ్ళి గుద్దుకోవచ్చు" అంటూ వాక్యాన్ని సరిచేశాడు రావు. ఆ తర్వాత గతిని, దిశని చూపించే కంప్యూటర్ దగ్గరికి వెళ్ళాడు. దానిని ఆన్‌చేసి ఏవో రీడింగ్‌లు చూశాడు.

"మైగార్" ఉల్క తాకిడి మన అంతరిక్షనౌక గతినీ, దిశనూ మార్చేసింది. మన నౌక ఇప్పుడు

వెస్టా చుట్టూ కక్ష్యలో ప్రవేశించింది. ఇంక దాని ఉపగ్రహంగా శాశ్వతంగా దాని చుట్టూ తిరుగుతూ ఉండిపోతుంది" అన్నాడు రావు ఆందోళనగా.

"పెనం మీద నుంచి పొయ్యిలోకి పడ్డట్టయిందన్న మాట మన పని. ఇంతసేపు మననౌక వెళ్ళి వెస్టాని గుద్దుకుంటుందని భయపడ్డాం. ఇప్పుడు ఈ ఉత్పాతంవల్ల అంతరిక్షంలో శవాల మ్యూజియంలామననౌక తిరుగుతూ ఉంటుంది." అన్నాడు మూర్తి బాధతో.

"గుద్దుకునే ప్రమాదం దైవికంగా తప్పిపోయింది. అలాగే దైవికంగా మనం తప్పించుకునే మార్గం కూడా దొరుకుతుందేమో ప్రయత్నం చేద్దాం" అన్నాడు మధుకర్.

"నీ ఆశావాదానికి నా జోహార్లు" అంటూ కిటికీలోనుంచి వెస్టావైపు మరోసారి చూసి తన కుర్చీలో తలపట్టుకు కూర్చున్నాడు మూర్తి.

రావు కూడా ఏమీ మాట్లాడలేదు.

మౌనంగా ఉండిపోయాడు.

కంప్యూటర్ రీడింగ్స్‌ని ముందేసుకుని సీరియస్‌గా ఆలోచించసాగాడు మధుకర్.

రావు చెప్పిన మాట నిజమే. అంతరిక్షనౌక వెస్టాకి ఉపగ్రహంగా మారింది.

అది అలా తిరుగుతూనే ఉంటుంది.

భారంగా నిట్టూర్చి, తల పట్టుకుని దీర్ఘంగా ఆలోచించసాగాడు.

ఆ రోజు ఎవరికీ ఆహారం తీసుకోవాలనిపించలేదు.

భారంగా రోజు గడిచింది.

అంతరిక్ష నౌకలో ఆక్సిజన్ త్వరత్వరగా ఖర్చయిపోతోంది. అందులో ఆందోళనతో మరింత ఎక్కువగా ఊపిరి తీసుకుంటున్నారేమో ఇంకా త్వరగా ఖర్చవుతోంది.

ముగ్గురూ దీర్ఘంగా ఆలోచిస్తున్నా ఎవ్వరికీ, బయట పడడానికి అవకాశం కన్పించే మార్గం ఏదీ స్ఫురించడంలేదు. అందుబాటులో వున్న ప్రాణవాయువు రెండు రోజులు మించిరాదు. ఎట్టి పరిస్థితులలోనూ మూడోరోజు దాటదు. మధుకర్ మళ్ళీ తాజాగా నౌక గతి, దిశలను గురించిన రీడింగ్స్ తీసుకున్నాడు. వాటిని నిశితంగా పరిశీలించాడు. వాటిలో ఏ మార్పులేదు.

నౌక ఖాయంగా ఉపగ్రహంగా మారి వెస్టా చుట్టూ పరిభ్రమిస్తోంది.

మధుకర్ లెక్కలు కట్టాడు.

ఈ కక్ష్యకి లోపలగా కనీసం ఒకటి రెండుకిలోమీటర్లు కనుక నౌక వెళ్ళగలిగితే అది ఆ కక్ష్యనుంచి విడివడి వెస్టా వైపుగా వెళ్ళిపోతుంది.

అలా జరగాలంటే నౌకకి అవతలివైపున ఏ ఉల్కో వచ్చి గుద్దుకుని గట్టి తాకిడి ఇయ్యాలి.

పెద్ద ఉల్క అయితే నౌక తుక్కుతుక్కు అవుతుంది.

మరీ చిన్నది కాకుండా సుమారుగా ఉండే ఉల్క అయితేనే ఫలితం దక్కుతుంది. కాని ఇలా

కోరుకున్నట్లు జరగడం అసంభవం. జరిగితే అది దైనికమే.

పోనీ ఏదో విధంగా కోరుకున్నట్లుగా నౌకకి తాకిడి ఏర్పడి వెళ్లిందనుకొందాం. కాని ఏం సుఖం?

కంట్రోల్ సిస్టమ్‌లేని అది తిన్నగా వెళ్ళి వెస్టాని గుద్దుకుంటుంది. అసలు ఆ తాకిడికి వెస్టాకూడా ముక్కలై అక్కడవున్న స్థావరం కూడా ధ్వంసం కావచ్చు.

అయితే ఈపాటికి భూమిమీదున్న గ్రౌండ్ కంట్రోల్ వాళ్ళు వెస్టా మీదున్న శాస్త్రజ్ఞులూ అంతరిక్ష నౌక నుంచి సమాచారం ఆగిపోవడంతో అది ప్రమాదంలో చిక్కుకుందని గ్రహించి ఉంటారు. దానికోసం అన్వేషణ కూడా మొదలుపెట్టి ఉంటారు. ఎప్పుడైతే వెస్టావైపుగా అంతరిక్ష నౌక దూసుకువస్తూ కంటబడిందో వెంటనే అది ఢీకొనకుండా చేయడానికి ఏదో మార్గం వారికి గోచరించవచ్చు. తగిన దూరానికి రాగానే వెస్టామీదున్న శాస్త్రజ్ఞులు, దాని ఉనికిని తమ టెలిస్కోప్ ద్వారా ఇతర యంత్రాలద్వారా గుర్తించగలరు అని మధుకర్ ఆశ.

అయితే అందువల్ల సుఖం ఏమిటి?

అప్పటికి ఎలాగూ తాము ముగ్గురూ మరణిస్తారు.

శవాలతో ఉన్న ఈ నౌకని రక్షించడంవల్ల ఒనగూడే ప్రయోజనం ఏమి ఉంటుంది? పైగా వారు రక్షించలేకపోతే నౌక గుద్దుకోవడంవల్ల వారి మనుగడకే ముప్పు ఏర్పడుతుందికూడాను. పరిపరి విధాలుగా పోతున్నాయి మధుకర్ ఆలోచనలు. ఉల్క గుద్దుకుని తాకిడి ఇవ్వడం అటుంచి వేరే ఏ విధంగానైనా అటువంటి తాకిడి కల్పించే అవకాశం ఉందా అని తీవ్రంగా ఆలోచించాడు. ఎంత ఆలోచించినా ఏ మార్గమూ స్ఫురించలేదు.

అసహనంగా కుర్చీలోంచి లేచి ఒక్కసారి నౌకలోపల అంతటా కలియ దిరిగాడు.

కిటికీలోనించి చూశాడు.

వెస్టా అదే పరిమాణంలో అలాగే ఉంది.

అంటే నౌక ఉపగ్రహ కక్ష్యలోనే తిరుగుతోందన్నమాట. నౌకలోనుంచి విడిపోయిన భాగంవైపు వెళ్ళాలనిపించింది.

వెంటనే లేచి తలుపు దగ్గరకు వెళ్ళాడు.

మూర్తి, రావు, అతను లేచి వెళ్ళడం చూశారేకాని ఏమీ పట్టించుకోక కుర్చీలలోనే ఉండిపోయారు.

మధుకర్ స్పేస్ సూట్‌ను సరిచేసుకున్నాడు. తలుపు తెరిచి అవతలివైపు చాంబర్‌లోకి వెళ్ళాడు. వెనకాలే తలుపులు మూశాడు.

ఎదురుగా ఛాంబర్‌కి రెండువైపులా తలుపులున్నాయి.

అవితీస్తే అంతరిక్ష నౌకలోని రెండోభాగంలోకి వెళ్ళడానికి దారి ఏర్పడుతుంది.

గాలి బయటకు పోకుండా ఉండడం కోసం ఎక్కడికక్కడే ఈ విధమైన ఏర్పాటు ఉంటుంది.

ఇప్పుడు అంతరిక్ష నౌకలోని రెండో భాగం ఊడివెళ్ళిపోయింది. కనుక తలుపులు తీస్తే ఆవలివైపు అంతా శూన్యమే.

మధుకర్ తన నడుముకీ, అంతరిక్ష నౌకకీ కలిపి ఒకతాడు కట్టుకున్నాడు.

జాగ్రత్తగా చాంబర్‌కి అవతలివైపువున్న తలుపులు తెరిచాడు. అవతలి భాగం విరిగిపోయినప్పుడు కొంతభాగం ఉండిపోయింది. అది మెట్టులా ఉండి దానిమీద నిలబడడానికి అనువుగా ఉంది. మధుకర్ జాగ్రత్తగా దానిమీద నిలబడి, తలుపు అంచుల్ని గట్టిగా పట్టుకుని బయట చూశాడు.

అంతా చిమ్మ చీకటి.

అయితే అన్ని వైపులా అమావాశ్యనాటి రాత్రి మెరిసే మిణుగురు పురుగులల్లే నక్షత్రాలు కాంతిమంతంగా మెరుస్తున్నాయి.

సూర్యుడు ఒక ప్రక్కన జాజ్వలంగా మెరుస్తున్నాడు. అయితే సూర్యుని నుంచి సుమారు ఇరవై కోట్ల మైళ్ళ దూరాన ఉండడంతో బింబం చిన్నగా ఉంది. పౌర్ణమినాటి అర్ధరాత్రి కనిపించే చందమామంత పరిమాణంలో ఉంది సూర్యబింబం. భూమికీ, సూర్యుడికీ మధ్యదూరం తొమ్మిది కోట్ల మైళ్ళే కనుక, ఇక్కడ నుంచి సూర్యుడు పెద్దగా కనిపిస్తాడు. కాని అంగారకుడు ఆ పైన నుంచి బాగా చిన్నగా కనిపిస్తాడు.

ఆ తారకలు సూర్యుడు మరో వైపు బృహస్పతీ, శని ఈ దృశ్యమంతా ఎంతో మనోజ్ఞంగా ఉంది. కాని వాటిని చూసి ఆనందించే సమయమూ, సందర్భమూ కాదది.

తాను నిలబడ్డచోటునుంచి అంతరిక్ష నౌకను అటూ ఇటూ చూశాడు మధుకర్.

చీకట్లో ఏదీ స్పష్టంగా కనిపించలేదు. ఏదో ఆలోచనవచ్చి తిరిగి లోనికి వెళ్ళాడు.

మధుకర్ లోనికివెళ్ళి తలకి హెడ్‌లైట్ పెట్టుకున్నాడు. దానిని ఆన్‌చేసి తిరిగి బయటకు వచ్చాడు. ఆ హెడ్‌లైట్‌ను ప్రసరింపజేస్తూ అంతరిక్ష నౌక బయటి భాగాన్ని నిశితంగా పరిశీలించసాగారు. అంతరిక్ష నౌకనుంచి మొదటి, రెండవ విభాగాలను అనుకుని ఎడమప్రక్కగా వాటర్ టాంక్ ఉంది. పది అడుగుల పొడవు, పది అడుగుల వెడల్పు, పది అడుగుల ఎత్తు ఉన్నదాని గోడలు గట్టి మిశ్రమలోహంతో చేయబడి ఉన్నాయి. ఆ గోడలమందం పది అంగుళాలు ఉంది. ఉల్కతాకిడికి ఈ వాటర్‌టాంక్ చెక్కుచెదరలేదు. దానిని అంటివున్న అంతరిక్ష నౌక రెండవ భాగం మాత్రం ఊడి ఎగిరిపోయింది.

ఆ వాటర్ టాంకర్‌ను చూస్తుంటే మధుకర్ మనసులో ఏదో లీలగా మెదలసాగింది. అదేమిటో స్పష్టంగా గోచరం కాలేదు. ఆలోచించగా ఆలోచించగా అకస్మాత్తుగా స్ఫురణకి వచ్చింది.

ఒకసారి మధుకర్ ఫ్రాన్సులో జరిగిన ప్రత్యామ్నాయశక్తి వనరులు అన్న గోష్ఠిలో పాల్గొనేందుకు వెళ్ళాడు. అప్పుడు అతను బాబా అణుశక్తి కేంద్రంలో పనిచేస్తుండేవాడు. ఆ తర్వాత షార్ కేంద్రానికి వెళ్ళాడు. అణుశక్తిని గురించి మాట్లాడటానికి తాను వెళ్ళాడు. ఆ సమావేశానికి వివిధ దేశాలలో వివిధ రంగాలలో కృషి చేస్తున్న శాస్త్రవేత్తలు వచ్చారు.

కొందరు సౌరశక్తిని గురించి, కొందరు పవనశక్తిని గురించి, ఇంకొందరు తరంగశక్తిని గురించి, మరికొందరు భూగర్భ ఉష్ణశక్తిని గురించి వేరే కొందరు చెత్తాచెదారం నుంచి వచ్చే శక్తి గురించి-ఇలా రకరకాలుగా ఉపన్యాసాలు ఇచ్చారు. ఫ్రాన్సులో సముద్రతరంగాలనుంచి లాభసాటిగా శక్తిని ఉత్పత్తిచేసే ప్రక్రియ ఉంది. అక్కడ ఆటుపోటులు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో సముద్రతీరంలో పెద్ద పెద్ద టాంకులు

కట్టారు. అలలు ఉవ్వెత్తుగా వచ్చినప్పుడు అవి ఆ టాంక్‌ని నింపేస్తాయి. టాంక్‌నిండాక టాంక్‌కి క్రిందనున్న తూములను తెరుస్తారు. పైనున్న నీటి ఒత్తిడి మూలంగా, వేగంగా నీరు ఆ తూములలోనుంచి బయటకి వస్తుంది. అది దిగువనవున్న టర్బయిన్‌ల మీదపడి అవి తిరిగి విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆ ప్రక్రియను ఎంతో ఆసక్తితో గమనించాడు మధుకర్. ఇప్పుడు నౌకలోని ఆ వాటర్ టాంక్‌ను చూస్తుంటే, ఫ్రాన్స్‌లో తాను చూసిన వాటర్ టాంక్ గుర్తుకి వచ్చింది. ఆ వాటర్ టాంక్‌లోంచి నీరు చిమ్మిన గ్రోని గొట్టంలోంచి వలె వేగంగా బయటకు రావడం కళ్ళముందు మెదిలింది. అలాగే రాకెట్‌ను ప్రేల్చినప్పుడు అడుగునుంచి ఉజ్వలంగా మంట దూసుకువచ్చే దృశ్యం కూడా కనులముందు మెదిలింది. వెంటనే మధుకర్ మస్తిష్కంలో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. అతని ముఖం కాంతితో కళకళలాడింది. వెంటనే వడివడిగా లోనికి వెళ్లాడు.

కంప్యూటర్ దగ్గర కూర్చుని ఏవో వివరాలు దానికి ఫీడ్‌చేసి ఏదో సమాచారం అడిగాడు. అది వెంటనే కావలసిన సమాధానం చెప్పింది. దగ్గర ఉన్న టేప్‌ని తీసుకొని జేబులో పెట్టుకున్నాడు. అతని హడావిడి అంతా చూస్తున్న మూర్తికి, రావుకి ఏమీ అర్థంకాలేదు.

"ఏమిటీ హడావుడి? ఏమైనా ఐడియా వచ్చిందా?" అన్నాడు రావు ఆశగా.

"అప్పుడే ఏమీ చెప్పలేను. నా ఆలోచనకనక సరియైనది అయితే మనం బ్రతికి బయటపడగలం. సరియైనది అయినా కాకపోయినా ఇంక వేరే మార్గంలేదు. మనం ఎలాగూ చావడానికి సిద్ధపడే ఉన్నాం కనుక ఈ ప్రయత్నం చేయాలి. ఫలిస్తే సంతోషం. లేకుంటే అందరికీ గుడ్‌బై" అన్నాడు మధుకర్.

"ఏమిటది?" అన్నాడు రావు

"ఇప్పుడు చెప్పేటైం లేదు. ప్రతినిమిషం మనకిప్పుడు విలువైనదే. ఆ మనదగ్గర డ్రిల్లర్ ఉండాలి. ఉందా?" అని అడిగాడు మధుకర్.

'ఆ ఉంది. ఇదుగో" అంటూ దగ్గరనుంచి తీసి ఇచ్చి "మేమేమైనా సహాయానికి రావాలా?" అని అడిగాడు రావు.

"వస్తే సంతోషమే" అన్నాడు మధుకర్.

"పిచ్చి పిచ్చి ఐడియాలకోసం వళ్ళు విరుచుకోదల్చుకోలేదు. చచ్చేముందైనా తీరిగ్గా ఉండనీ. నేను రాను ఇక్కడే ఉంటాను" అన్నాడు మూర్తి.

"నేను వస్తున్నాను" అంటూ మధుకర్‌ని అనుసరించాడు రావు. చాంబర్‌లోని ప్లగ్ పాయింట్‌కి డ్రిల్లర్‌ని తగిలించి చేతిలో తీసుకున్నాడు మధుకర్. హెడ్‌లైట్‌ని ఆన్‌చేసి, జేబులోని టేప్‌తీసి కొలతలు వేసి వాటర్ టాంక్‌కి ఇవతలివైపు గోడమీద, డ్రిల్ చేయవలసిన చోటుని మార్క్‌చేసాడు. అతను కొలతలు వేస్తున్నంత సేపూ రావు డ్రిల్లర్‌ని చేతపట్టుకు నిలబడ్డాడు. నడుముకి తాడుకట్టుకొని రెండో కొనని ఛాంబర్ గోడకి బిగించాడు మధుకర్ బలంగా ఆ డ్రిల్లర్‌ని టాంక్ గోడకి అదిమిపెట్టి డ్రిల్ చేయసాగాడు.

కాని ఇంచుమించు అడుగు మందం ఉన్న గోడకి రంధ్రం పడడం అంటే మాటలా! డ్రిల్లర్ బర్, బర్‌మని శబ్దం చేస్తోందేకాని లోనికి చొచ్చుకుపోవడంలేదు. నిలబడడానికి సరియైన చోటులేదు. కేవలం

అవతలి ఛాంబర్‌లో విరిగిపోగా మిగిలిన మెట్టువంటిదానిమీద నిలబడి ఈ క్లిష్టమైన పనిని చేయాలి. అసలే మానసికంగానూ, శారీరకంగానూ చాలా అలిసిపోయి ఉన్నాడు. అటువంటి సమయంలో ఇబ్బందికరమైన పరిస్థితులలో, క్లిష్టమైన కార్యం చేయడంతో కొంచెం సేపటికే విపరీతమైన అలసట వచ్చింది. దానికి తోడు ఒంటిమీదున్న స్పేస్ సూట్‌కూడా చాలా ఇబ్బందికరంగా ఉంది.

మధుకర్ పరిస్థితినంతా గమనిస్తున్నాడు రావు. "కొంచెంసేపు నేను డ్రిల్ చేస్తా. నువ్వు ఇవతలకి రా" అంటూ ముందుకి వెళ్ళాడు రావు.

అంతే 'కెవ్వు'మని కేకవేస్తూ శూన్యంలోకి పడిపోయాడు. చేతిలోని డ్రిల్లర్‌ని క్రిందికి వదిలేసి రానూ శూన్యంలోకి దూకాడు మధుకర్. ఈతరానివాడు పద్తే పైకీ క్రిందకీ పల్టీలు కొట్టినట్లు శూన్యంలో పడి కొట్టుకుంటున్నాడు రావు. అతను పడ్డప్పటి ఊపు వేగం ముందుకి నెట్టుంటే అంతరిక్ష నౌక ఆకర్షణశక్తి దగ్గరికి లాగుతుంటే మధ్యలో అటూ ఇటూ ఊగుతున్నాడు. ఆ కటిక చీకటిలో అతను కనిపించేవాడు కాదు. కాని అతని నుదుటిమీద కూడా హెడ్ లైట్ ఉండడంతో ఎక్కడ ఉందీ తెలిగ్గా గుర్తుపట్టడం సాధ్యం అయింది.

స్విమ్మింగ్‌పూల్ గట్టుమీదనుంచి నీటిలోకి దూరంగా గెంతినట్లు తానున్న మెట్టుమీదనుంచి శూన్యంలోకి ఒక గెంతు గెంతాడు మధుకర్. అతని నడుముకి తాడు ఉంది కనుక భయంలేదు. ఆ శూన్యంలోనే కాళ్లూ చేతులూ విదిలిస్తూ ముందుకి సాగి కొంచెం సేపట్లో రావుని సమీపించాడు. అతనికి తన చేయి అందించాడు. రావు పట్టుకున్నాడు. వెంటనే వెనుదిరిగి నడుముకి ఉన్న తాడును బలంగా లాగుతూ నౌకని సమీపించారు ఇద్దరూ. నెమ్మదిగా మెట్టుఎక్కి ఛాంబర్‌లోకి ప్రవేశించారు. రావు కొంచెం తేరుకున్నాక "నీవు విశ్రాంతి తీసుకో నేను ఒక్కడ్నీ చూసుకుంటాను"అన్నాడు మధుకర్.

"ఏం ఫర్వాలేదు నేనుకూడా నడుముకి తాడు కట్టుకుంటాను" అన్నాడు రావు.

"సరే ముందు కొంచెం సేపు విశ్రాంతి తీసుకుందాం" అంటూ టాంక్‌వైపుకు వెళ్లి ఆ డ్రిల్లర్‌ని పైకి తీసాడు.

"మైగాడ్ దీని మొన విరిగిపోయింది. ఫినిష్" అంటూ తలపట్టుకున్నాడు మధుకర్.

"అరే...అదెలా జరిగింది? టాంక్ గోడమందం మరీ ఎక్కువగా ఉండడం వల్ల విరిగిపోయి నట్టుంది" అన్నాడు రావు.

"అదేం కాదు నేను కంగారుగా డ్రిల్‌ని క్రిందికి పడేసాను. అందువల్ల విరిగిపోయింది" అన్నాడు మధుకర్.

"అరే... ఇదంతా నామూలంగా జరిగింది. నేను తొందరపడకుండా జాగ్రత్తగా వచ్చిఉంటే ఇలా అయ్యేది కాదు"అన్నాడు రావు బాధపడ్తూ.

"నువ్వు మంచి ఉద్దేశంతోనే వచ్చావు. అయినా ఇలా జరిగితే అందుకు ఎవరేం చేస్తారు? ఇది మన దురదృష్టం" అన్నాడు మధుకర్.

"ఇప్పుడు ఏమిటి చెయ్యడం?" అన్నాడు రావు దిగులుగా.

"ముందు లోపలికి పోయి విశ్రాంతి తీసుకుందాం. భోజనం చేసి ప్రశాంతంగా ఆలోచించి ఏం చేయాలో నిర్ణయిద్దాం" అన్నాడు మధుకర్.

ఇద్దరూ లోనికి వెళ్ళారు. మూర్తి మానసికమైన అలసటవల్లనో, దిగులుతోనో, కుర్చీలో మగతగా కళ్ళుమూసుకుని కూర్చున్నాడు. ఆయనని లేపి ఈ విషయం అంతా చెప్పడం అనవసరం అనిపించింది. ఆహారం తీసుకోడానికి ఏర్పాటు చేస్తుండగా మూర్తికి మెలుకువ వచ్చింది.

ముగ్గురూ ఆహారం తీసుకున్నాక "రావుకి ఈ రోజు పెద్ద గండం తపిపంది" అంటూ జరిగింది చెప్పాడు మధుకర్. మూర్తి నిర్లిప్తంగా నవ్వాడు.

"పోయివుంటే మనకంటే ఒకటి రెండు రోజులు ముందుగా పోయి ఉండేవాడన్నమాట. చావును ముందుపెట్టుకొని ఒక గండం గడిచిందని మురిసిపోతే ప్రయోజనం ఏమిటి?" అన్నాడు.

రావు, మధుకర్ ఏమీ మాట్లాడలేదు.

తర్వాత ఎవరి సీట్లలో వారు కూర్చుని విశ్రాంతి తీసుకోసాగారు.

మధుకర్ అయితే తీవ్రంగా ఆలోచించసాగాడు.

కొంచెం సేపటికి ఉన్నట్లుండి లేచి "రావ్..మన దగ్గర గాస్ కట్టర్ ఉందిగా?" అన్నాడు.

"ఆ.... ఉంది..." అంటూ తీసి ఇచ్చాడు రావు.

వెంటనే దానిని తీసుకుని బయలేదేరాడు మధుకర్.

ఛాంబర్ దాటి, మెట్టుమీద జాగ్రత్తగా నిలబడి గాస్ లైటర్‌ను ఆన్ చేశాడు.

నాజిల్‌లో నుంచి ముందుగా ఎర్రని, తర్వాత తెల్లని, ఆ తర్వాత నీలం మంట వచ్చింది. ఆ మంటతో మార్కు చేసిన చోట కాల్చాడు.

అది ఎంతో దట్టమైన గోడ. పైగా ప్రత్యేకమైన మిశ్రమ లోహాలతో చేసినట్టిది. ఎంత వేడి ఉన్న మంటను పంపినా అది కరగడం లేదు.

పదినిమిషాలు అయింది.

ఇరవై నిమిషాలు గడిచింది.

అరగంట దాటింది.

అయినా ఆ గోడకి ఏమీ చలనం ఉన్నట్లనిపించడం లేదు. గాస్ ఫ్లేమ్‌లో లోపం ఉందనుకోవడానికి లేదు. స్పేస్ దుస్తులు ఉన్నా కూడా దాని వేడి వంటికి తగులుతున్నట్లనిపిస్తోంది. నిరాశతో నిస్పృహతో నీరసం వచ్చేస్తోంది.

మధ్యలో ఒకసారి రావు వచ్చి కొంత సేపు కట్టర్‌ని పట్టుకున్నాడు. అయినా చలనం లేదు.

"లాభం లేదు మధుకర్. ఈ గోడ ప్రత్యేక లోహాలతో చేయబడింది గదా! అది కరగడానికి ఈ వేడి చాలదని తెలుస్తోంది. వృధా..... మన శ్రమంతా వృధా" అన్నాడు రావు బాధగా.

"చూద్దాం మరి కొంచెం సేపు చూద్దాం" అంటూ తిరిగి తాను ఆ కట్టర్‌ని తీసుకున్నాడు మధుకర్.

ఐదు నిమిషాలు గడిచింది.

మార్క్ చేసిన చోట ఎర్రని మచ్చ ఏర్పడింది.

చూస్తుండగా అది మరింత ప్రకాశవంతం అవుతూ చుట్టూరా వ్యాపించసాగింది.

మధుకర్ ఆనందానికి అవధి లేదు.

చివరికి అది పనిచేస్తోంది. "సక్సెస్" అని బిగ్గరగా అరిచాడు.

మరి కొద్ది నిమిషాలలో ఒక గుండ్రటి బిళ్ళ ఊడి శూన్యంలోకి పడిపోయింది.

పెద్ద శబ్దంతో ఆ రంధ్రంలోంచి నీరు బయటకు ధారగా అమిత వేగంతో వచ్చింది.

అయితే వచ్చీ రాగానే శూన్యంలో ఉన్న చల్లదనానికి మంచుగడ్డలుగా మారి తిరిగి ఆ ముక్కలు ఎటో పోతున్నాయి. ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

"పద మన పని అయింది" అంటూ గాస్ కట్టర్‌ని ఆఫ్‌చేసి ఇవతలకు వచ్చాడు మధుకర్.

ఇద్దరూ లోనికి వెళ్ళారు.

అప్పటికి సుమారు పది నిమిషాలు గడిచింది.

మధుకర్ గతి, దిశను తెలిపే యంత్రం రీడింగ్స్ చూశాడు.

సందేహం లేదు. అంతరిక్షనౌక కక్ష్యలోంచి బయటపడినట్లు వేగం పుంజుకుంటూ వెస్టా దిశగా వెళ్తున్నట్లు అది చూపింది. నౌకకి స్వతహాగా ఉన్న వేగం, నీటి ధార ముందుకి నెట్టున్నవేగం, వెస్టా ఆకర్షణ శక్తి ఈ మూడు కలిపి అంతకంతకీ వేగాన్ని పుంజుకుంటూ అది వెళ్తోంది.

సంతోషం పట్టలేక అరుపులూ చప్పట్లూ మొదలుపెట్టారు ఇద్దరూ. ఆ అలికిడికి లేచి కూర్చుని "ఏమి జరిగింది?" అన్నాడు మూర్తి కంగారుగా.

జరిగింది చెప్పారు ఇద్దరు.

"అసలు నీకి ఐడియా ఎలా వచ్చింది?" అన్నాడు రావు.

"ఇందులో ఉన్నది రాకెట్‌లో ఉన్న సూత్రమే. రాకెట్‌ని పేల్చినపుడు మంట ఎటువైపు వస్తుందో దానికి వ్యతిరేక దిశలో రాకెట్ వెళ్తుంది. ఇది క్రియ-ప్రక్రియ (యాక్షన్ అండ్ రియాక్షన్) అన్న మాట. అదేవిధంగా వేగంగా నీటి ధార బయటకు వచ్చినప్పుడు దానికి వ్యతిరేక దిశలో ఒత్తిడి ఉంటుంది. అయితే వాటర్ టాంక్‌లు నేలలో బిగించి కట్టాం కనుక అవి కదలవు. అంతరిక్ష నౌకకి ఉన్న వాటర్ టాంక్ స్థిరంగా లేదు కాబట్టి దానికి కలిగిన ఒత్తిడి దానిని దానితో పాటు మొత్తం అంతరిక్ష నౌకనీ వ్యతిరేక దిశలో నెట్టుంది. మన వాటర్ టాంకర్‌ను చూసినపుడు ఫ్రాంసులో సముద్ర తీరాల్లో కట్టిన వాటర్ టాంక్‌లు వాటి నుంచి నీటి ధారలు వెలువడుతుండడం నాకు గుర్తుకి వచ్చింది. అదే సమయంలో రాకెట్‌ని పేల్చేటప్పుడు జ్వాలలు రావడం దానికి వ్యతిరేక దిశలో రాకెట్ వెళ్ళడం జ్ఞప్తికి వచ్చింది. ఈ రెండింటిలోనూ ఇమిడి ఉన్న సూత్రం ఒకటేనని స్ఫురించింది. వెంటనే అందుకు పూనుకున్నాను. రావు సహకారంతో పూర్తి చేశాము అని వివరించాడు మధుకర్.

"అంతా బాగానే ఉంది. కాని ఏం ప్రయోజనం? ఇప్పుడిది వేగంగా వెళ్ళి వెస్టాను గుద్దుకుని ముక్కలు ముక్కలవుతుంది. ఇంత శ్రమా వృథా అన్నాడు మూర్తి దిగులుగా.

"అదేంకాదు ఏ సూత్రం మనల్ని ఇప్పుడు కాపాడిందో అదే సూత్రం అప్పుడూ రక్షిస్తుంది" అన్నాడు మధుకర్.

"ఎలా?" అన్నాడు రావు ఆశ్చర్యంగా.

"మన నౌక వేగం పుంజుకుని వెస్టా వైపు వెళ్తోంది కనుక ఇంక దానికి నీటి ధార వల్ల కలిగే తోపుడు అనవసరం. వెస్టా ఆకర్షణ శక్తే దానికి చాలు. అందువల్ల మనం వెంటనే ఒక రేకు తీసుకుని చేసిన కన్నాన్ని వెల్డ్ చేసి పూడ్చేయాలి. ఇలా చేయడం వల్ల నీరు వృథా కాదు. తర్వాత ఇప్పుడు రంధ్రం చేసిన దానికి సరిగ్గా ఎదురువైపు అంటే వెస్టావైపు మరో రంధ్రం చేసి నీటిని వదలడానికి సిద్ధంగా ఉంచాలి. మన నౌక వేగం, వెస్టా ఆకర్షణ శక్తులను బట్టి ఏ సమయంలో ఎంత దూరంలో ఈ నీటిధారను వదలాలో కంప్యూటర్‌కి ఫీడ్ చేసి తెలుసుకోవాలి. సరిగ్గా ఆ సమయానికి రెండో రంధ్రాన్ని తెరిచి నీటిని వదలాలి. ఈ ధార వెస్టా వైపు ఉంటుంది కనుక నౌక దానికి వ్యతిరేకంగా వెళ్లాలని ప్రయత్నిస్తుంది. అయితే వెస్టా ఆకర్షణ ఈ త్రోపుడు శక్తికంటే కొంత ఎక్కువగా ఉండేటట్లు చూసుకుంటాం కనుక నౌక వేగం బాగా తగ్గి నెమ్మది నెమ్మదిగా వెస్టా మీద దిగుతుంది. అంటే ఈ వాటర్ టాంకే రెట్రో రాకెట్‌లాగా పని చేస్తుందన్నమాట" అని వివరించాడు మధుకర్.

"శభాష్" అంటూ ఉషారుగా కుర్చీలోంచి లేచి మధుకర్ భుజం చరిచాడు మూర్తి. అంతటి ఉత్సాహం కనిపించడం ఆయనలో అదే మొదటిసారి.

"రావ్...పద రంధ్రం వెల్డ్ చేద్దాం" అంటూ లేచాడు మధుకర్.

"ఉండండి. నేనూ వస్తాను" అంటూ గాస్ కట్టర్‌ను తీసుకున్నాడు మూర్తి.

తగిన రేకుని వెతికితీసుకు వచ్చాడు రావు.

మరో నలభై నిమిషాలలో వెల్డింగ్ కార్యక్రమం పూర్తయింది. ఆ తర్వాత వాటర్ టాంక్ అవతల వైపుకి వెళ్ళి ఒక గంట సేపు కష్టపడి రంధ్రం చేశారు.

అందులోని నీరు బయటికి పోకుండా గట్టిమూత పెట్టారు. పని అంతా సవ్యంగా అనుకున్నట్లు జరిగాక తృప్తిగా లోపలికి వచ్చారు ముగ్గురూ.

కిటికీలోంచి చూస్తూ "మధూ....రావ్...అటు చూడండి. వెస్టా ఎంత పెద్దగా కనిపిస్తోందో! అని అరిచాడు మూర్తి.

"అవును మనం దగ్గరకి వచ్చేస్తున్నామన్నమాట" అన్నాడు రావు మధుకర్ బిజీగా కంప్యూటర్‌కి ఫీడింగ్ ఇయ్యసాగాడు. అది ఏ సమయంలో రెండో రంధ్రాన్ని వదలాలో చూపించింది. మరి కొన్ని గంటలలో ఆ సమయం రానే వచ్చింది. వెంటనే వెస్టా వైపున ఉన్న వాటర్ టాంక్ గోడ రంధ్రాన్ని తెరిచారు.

ఒక్కసారి కాలర్ పుచ్చుకుని పైకి ఎవరో గుంజినట్లనిపించింది ముగ్గురికీ.

వేగంగా వెళ్తున్న నౌకకి సడన్‌గా బ్రేక్ పడ్డట్టు అవడంతో ఆ అనుభూతి కలిగింది.

తర్వాత - అంతరిక్ష నౌక నెమ్మదిగా ప్రయాణం మొదలుపెట్టింది. నీటి మీద తేలియాడుతున్న హంసలాగా నెమ్మదిగా దిగుతున్న పారాచూట్ లాగ, అతి నెమ్మదిగా వెస్టామీద దిగింది.

ఆకాశంలో తగు దూరంలో ఉండగానే అంతరిక్ష నౌక వస్తున్న విషయం గ్రహించారు. వెస్టా మీదున్న శాస్త్రజ్ఞులు అయితే ఏ విధమైన రేడియో సందేశం లేకపోవడంతో చాలా ఆందోళనతో దాని రాకకోసం ఎదురు చూడసాగారు. అంతరిక్ష నౌక సురక్షితంగా వెస్టా మీద దిగి అందులోంచి ముగ్గురు యాత్రికులు సజీవంగా వెలికి రావడంతో వారి సంభ్రమానందాలకు అవధులు లేవు.

మధుకర్ దిగుతూనే వాటర్ టాంక్‌కి చేసిన రంధ్రాన్ని వెంటనే పూడ్చించవలసిందిగా అక్కడి శాస్త్రజ్ఞులకు చెప్పాడు. ఎందుకంటే అందులో ఉన్నది అమూల్యమైన నీరు. దానిని వెస్టామీదున్న శాస్త్రజ్ఞులకోసం తెచ్చారు. అది పోయిందంటే తిరిగి కొత్త నౌక వచ్చే వరకూ నీటికి కటకటే. ఇప్పటికే అంతరిక్షంలోకి చాలా పోయింది. మొత్తం పోతే ఇంక చెప్పేదేముంది.

మధుకర్‌కీ, మూర్తికీ, రావుకీ ఘనస్వాగతం ఇచ్చారు. వెస్టామీదున్న శాస్త్రజ్ఞులు వారు క్షేమంగా వచ్చిన విషయం వెంటనే భూకేంద్రానికి తెలియజేశారు వైర్లెస్‌ద్వారా. భూకేంద్రం వారికి, భారత ప్రజలకు యావత్ ప్రపంచానికి వర్ణింపనలవికాని ఆనందం కలిగింది.

మరో గంటలో భూమి నుంచి సందేశం వచ్చింది.

భారత ప్రధాని స్వయంగా ఈ యాత్రికులతో మాట్లాడాలనుకుంటున్నారట.

ఆ వార్త విని ఆనందంతో ఉక్కిరి బిక్కిరయిపోయారు వారు. అంతలో ప్రధాని లైన్‌లోకి వచ్చారు.

"మైడియర్ హీరోస్. మిమ్మల్ని చూసి నేను, మన దేశ ప్రజలు ఎంతైనా గర్విస్తున్నాం. భారత శాస్త్రవేత్తలు మేధస్సులోనూ, శౌర్య, ధైర్యాలలోనూ ఎవరికీ తీసిపోరని మీరు ప్రపంచానికి చాటిచెప్పారు. మీరాకకోసం దేశ ప్రజలందరు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు" అని ముగ్గురితోనూ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ తర్వాత మధుకర్‌ని మళ్ళీ ప్రత్యేకంగా పిలిచి అద్భుతమైన మేధస్సుతో అందరి ప్రాణాలను కాపాడి జాతి కీర్తిని ఇనుమడింపజేసిన మిమ్మల్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. దేశంలో అత్యున్నత బిరుదాన్ని అలాగే మీ రంగంలో అతి ప్రముఖ పదవిని మీకు ఇయ్యవలసిందిగా రాష్ట్రపతికి సిఫారసు చేస్తున్నాను..." అన్నారు.

"థాంక్యూ ఆనరబుల్ ప్రైమ్‌మినిస్టర్...థాంక్యూ ఫర్ యువర్ కైండ్‌నెస్" అంటూ గట్టిగా అరవసాగాడు మధుకర్.

"ఏమిట్రా మధూ...ఏమన్నా కలగన్నావా?" అంటూ కొట్టి కొడుకుని నిద్రలేపింది రాజ్యలక్ష్మమ్మగారు.

కంగారుగా లేచి అటూ ఇటూ చూస్తూ "రావు, మూర్తి ఏరీ?" అన్నాడు.

"వాళ్ళు ఇక్కడెందుకుంటార్రా, వాళ్ళింట్లో ఉంటారు. ఇది మనిల్లు" అంటూ నవ్వారు అటు వస్తున్న గోపాలరావుగారు.

"అన్నయ్యా...ఏం కలగన్నావురా?" అంటూ దగ్గరికి వచ్చారు తమ్ములూ, చెల్లెళ్ళు.

"చెప్తాను భలే కల వచ్చింది" అంటూ లేచి త్వరగా ముఖం కడుక్కుని వచ్చి కాఫీ తాగుతూ

మొత్తం కల చెప్పాడు.

"ఇది నాకు కల అనిపించడం లేదు. మొత్తం అంతబాగా గుర్తుండిపోయింది" అన్నాడు.

"భేష్ నీకు నచ్చింది కలే అయినా ప్రతిదీ చాలా తార్కికంగా చేశావు. ఇన్నాళ్ళు నువ్వు చదువుతున్న సైన్స్ పత్రికలు. పుస్తకాలు, సైన్స్ నవలలు. నీమీద ఇటువంటి ప్రభావం చూపించాయన్నమాట" అన్నారు నాన్న.

"అపోలో-13 సినిమా చూశాక అది నా మనసులో బాగా ఉండిపోయింది. చిత్రం అయ్యాక వెస్టా మీద స్థావరాన్ని ఏర్పరచే ప్రయత్నాలు జరుగుతున్నాయని కామెంటేటర్ చెప్పాడు. ఇవన్నీ కలిసి నాకు ఇటువంటి కల వచ్చిందన్నమాట. మూర్తికీ, రావుకి కూడా స్పేస్ సైన్స్ అంటే ఇష్టం. అందుకే మేం ముగ్గురం ఇందులో పాత్రలు అయ్యాం అయితే ఒకటి. అపోలో-13 యాత్రికులు వాస్తవంగా ఎంత వేదననీ, టెన్షన్‌నీ అనుభవించారో తెలియదుకాని కలలోనైనా నేను అంతకి అంతా అనుభవించాను. కలలో నేను చూసిన పరిష్కారం కూడా ఏదైనా సైన్స్ కథలో చదివానేమో... ఇంక అంతరిక్షం, వెస్టా అన్నీ కళ్ళకి కట్టినట్లున్నాయి" అన్నాడు మధు ఆనందంతో.

"ఇంక లే నాయనా...కాలేజీకి టైము అవుతోంది. కలలోనైనా అంతరిక్షయానం చేశావు. అదృష్టవంతుడివి" అన్నారు గోపాలరావుగారు.

"మధూ" అంటూ వచ్చారు మూర్తి, రావు.

"అదుగో మిగిలిన ఇద్దరు హీరోలూ వచ్చారు" అన్నారు గోపాలరావుగారు నవ్వుతూ.

"హలో!" అంటూ నోళ్ళు వెళ్ళబెట్టారు వాళ్ళు.

"అదేమిటో నేను చెప్తాలేరా ఉండండి. ఐదు నిమిషాల్లో అన్నంతిని వచ్చేస్తాను" అంటూ చర్రునలోనికి వెళ్ళాడు మధు.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జనవరి 1989** ✪

# మరవిప్పిన మర్మం

మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటల వేళ.

నగరంలో నడిబొడ్డు ప్రాంతం.

ట్రాఫిక్ రద్దీతో జనం కిటకిటతో రోడ్డు కీకారణ్యంలా ఉంది. యూనిఫాంలో ఉన్న ఎస్.ఐ రంగనాథ్ రాజ్‌దూత్‌మీద వేగంగా వెళ్తున్నాడు. అనుభవం ఉన్న పోలీస్ ఉద్యోగి అయినందువల్లనో ఏమో, ఆ ట్రాఫికను అవలీలగా ఛేదించుకుంటూ, అభిమన్యుడు పద్మవ్యూహంలోకి వెళ్తున్నట్లుగా దూసుకుపోతున్నాడు. ఎస్.ఐని చూడగానే చౌరస్తాలో వున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గట్టిగా విజిల్‌వేసి, ఆయన చూసేటట్లుగా శాల్యూట్‌చేశాడు.

అందుకు ప్రతిగా తలని వంచి మళ్ళీ పైకెత్తి ముందుకు సాగిపోయాడు ఎస్.ఐ సాధారణంగా పోలీస్ అధికారులకు తమ క్రిందివారు శాల్యూట్ చేస్తే ప్రతిస్పందించే అలవాటుండదు. అలా చేస్తే అది తమ హోదాకి తక్కువనుకుంటారు. అది గమనించనట్లే ప్రవర్తిస్తారు. అయితే ఎస్.ఐ రంగనాథ్ విషయం వేరు. పోలీసు సాంప్రదాయానికి విరుద్ధంగా ఆయన క్రిందివారిని కూడా ఆదరంగా, గౌరవంగా చూస్తాడు. ఉద్యోగంలో చేరిన కొద్ది కాలంలోనే నిజాయితీపరుడుగా, నీతికి ప్రతీకగా పేరుగాంచాడు. దొంగలకు సంఘ విద్రోహ శక్తులకు సింహస్వప్నంగా మారాడు. దాంతో ప్రజలకు ఆయనపట్ల ఎనలేని గౌరవభావం ఏర్పడింది. అవసరానికి ఆదుకునే ఆపద్బాంధవుడిగా భావించసాగారు. అదే మిగతా అధికారులకు కంటగింపయింది. ఆయన మంచిపేరు తెచ్చుకోడం, ఘరానా దొంగలను, స్మగ్లర్లను కూడా పట్టేస్తుండడంతో వారు అసూయతో ఉడికిపోయారు.

ఎవరేమనుకున్నా అంకిత భావంతో తన విధిని నిర్వర్తించుకోసాగాడు ఆయన. మోటార్ సైకిల్ మలుపు తిరిగింది. ఆ దగ్గర్లోనే సినిమాహాల్ ఉంది. ఆరోజున ఏదో కొత్త సినిమా విడుదలయినట్లుంది. జనం టిక్కెట్లకోసం కిటకిటలాడుతున్నారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో వేగం తగ్గించాడు రంగనాథ్.

ఇంతలో ఎదురుగుండా రాంగ్ డైరెక్షన్‌లో ఒక అంబాసిడార్ కారు వచ్చి ఇంచుమించు మోటార్ సైకిల్‌ను గుద్దుకోబోయింది. సడన్ బ్రేక్ వేసి రాజ్‌దూత్‌ని ఆపి క్రిందికి దిగాడురంగనాథ్.

అంబాసిడర్ కూడా ఆగింది.



తలుపులు తీసి డ్రైవర్‌తో సహా నలుగురు క్రిందికి దిగారు.

డ్రైవర్ వంక చూస్తూ "ఏయ్. రాంగ్ డైరెక్షన్‌లో వచ్చావు. నీకు డ్రైవింగ్ లైసెన్సు ఉందా?" అంటూ గద్దించి అడిగాడు రంగనాథ్.

"మాకు లేని లైసెన్సు లేదురా. రైట్ డైరెక్షన్‌లో నిన్ను పైకి పంపించే లైసెన్సు కూడా ఉంది" అన్నాడు వారిలో ఒకడు.

తలెత్తి అటు చూశాడు రంగనాథ్.

ఆ మాటలన్నది ఎవరోకాదు పేరుమోసిన స్మగ్లర్ అబ్దుల్లా. అతనంటే పోలీసులతో సహా అందరికీ సింహస్వప్నమే. బడా రాజకీయవేత్తలకు ఉన్నత పోలీస్ అధికారులకూ అతను ఆప్తమిత్రుడు. తాను కోట్లు సంపాదిస్తూ వాళ్ళకి వేలు విదిలిస్తుంటాడు. అందుకే అతని నీడని తాకడానికి కూడా క్రింది పోలీసులు భయపడతారు. అయితే మూడు రోజులక్రితం అతను దొంగబంగారం చేరవేస్తున్నాడని తెలిసి రెడ్ హాండెడ్‌గా పట్టుకోడానికి వెళ్ళాడురంగనాథ్ సమయానికి ఎవరో సమాచారమందించడంతో తప్పించుకుపోయాడు అబ్దుల్లా. ఆ పగ మనసులో పెట్టుకుని ఇప్పుడు తనమీదకి వచ్చాడన్నమాట!

"అబ్దుల్లా....నువ్వా..." అన్నాడు రంగనాథ్.

"అవును శేనేరా. నన్నే పట్టుంకుందామనుకుంటున్నావురా! ఇక్కడే ఈ నడిరోడ్డుమీద వందలమంది

చూస్తుండగా నిన్ను నిలువునా కాల్చేస్తాను. ఎవరడ్డొస్తారో చూస్తాను'' అంటూ పిస్టల్ తీసాడు అబ్దుల్లా.

ఈ గలాభాకి జనం బోలెడుమంది చేరారు. ఏదో యాక్సిడెంట్ అయిందనుకుని ట్రాఫిక్ కానిస్టేబుల్ అటు పరుగెత్తుకు వచ్చాడు. ఆ సమయానికి అదే దారినపోతున్న మరో ఇద్దరు పోలీసు ఆఫీసర్లు కూడా జీపు ఆపి అటు వచ్చారు.

వాళ్ళందర్నీ చూస్తూ ''ఒరేయ్. ఇంతమంది జనమే కాదురా. పోలీస్ ఆఫీసర్లముందే నీ ప్రాణాలు తీస్తారా'' అంటూ వరుసగా నాలుగుసార్లు పిస్టల్ పేల్చాడు.

మారు మాటలేకుండా కుప్పకూలిపోయాడు రంగనాథ్. నిమిషాల్లో అక్కడ రక్తపు మడుగు ఏర్పడింది.

ఎప్పుడైతే పిస్టల్ శబ్దం వినిపించిందో జనం అంతా ఎక్కడివాళ్ళక్కడ పుంజాలు తెంపుకుని పారిపోయారు. క్షణాల్లో నిర్మానుష్యం అయిన ఆ రోడ్డుమీద అబ్దుల్లా, అతని అనుచరుల కారు నిరాటంకంగా వెళ్ళిపోయింది.

వాళ్ళు వెళ్ళిపోయాక తిరిగి జనం అక్కడికి బిలబిలలాడుతూ చేరుకోసాగారు. ఆ దారుణాన్ని కళ్ళతో చూసికూడా, ట్రాఫిక్ కానిస్టేబుల్ మిగిలిన ఇద్దరు పోలీసు అధికారులూ అప్పుడే అక్కడికి వచ్చినట్టు నటిస్తూ ''ఏమైంది! ఏమైంది? తప్పుకోండి'' అంటూ జనాన్ని అదిలించడం మొదలుపెట్టారు.

మరికొంత సేపట్లో వేరే ట్రాఫిక్ సిబ్బంది వచ్చి జనాన్ని, వాహనాల్ని మళ్ళించడం, పోలీసు అధికార్లు ఫోటోగ్రాఫర్లు వచ్చి ఫోటోలు తీసుకోవడం, అంబులెన్స్ వచ్చి రంగనాథ్ శవాన్ని హాస్పిటల్‌కి తీసుకుపోవడం వంటివి జరిగాయి.

కోర్టులో రంగనాథ్ హత్యకేసు విచారణ జరుగుతోంది. ముగ్గురు పోలీసు ఉద్యోగస్థులతో సహా కొన్ని వందలమంది అబ్దుల్లా రంగనాథ్‌ని పిస్టల్‌తో కాల్చి చంపడాన్ని ప్రత్యక్షంగా చూశారు. కాని ఏ ఒక్కరు కూడా ఆ విషయాన్ని సాక్ష్యంగా చెప్పడానికి ముందుకు రాలేదు. ప్రతివారు కూడా హత్య జరిగిన సమయంలో అబ్దుల్లాని అక్కడ చూశామన్నవారుకాని, అతను కాలుస్తుండగా చూసినట్లుకాని ఎవరూ చెప్పలేదు. కనీసం అతనిచేతిలో పిస్టల్‌ని చూసినట్టుగా కూడా ఏ ఒక్కరూ చెప్పలేదు.

అబ్దుల్లాకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పే ధైర్యం ఎవరికీ లేదు. చెప్తే ఆ వ్యక్తి కోరి మృత్యువుని తెచ్చుకున్నట్లే. పోలీసులకు కూడా చూసింది చెప్పడానికి ధైర్యం లేదు. రంగనాథ్ వంటి పోలీస్ అధికారినే కాల్చి చంపినవానికి తమ ప్రాణాలు తీయడం ఒక లెక్కా, పైగా అవసరమనిపించిన చోట డబ్బు గుప్పించేవాడు అబ్దుల్లా. ఫలితంగా అతనికి వ్యతిరేక సాక్ష్యమే లేకపోయింది.

ఆ రోజు ఆ కేసులో చివరి హియరింగ్,

అబ్దుల్లా బోనులో నిలబడి ఉన్నాడు.

''మిలార్డ్, ఈ కేసుకు సంబంధించిన సాక్షులందర్నీ విచారించడం పూర్తి అయింది. ఈ సాక్ష్యులవల్ల ముద్దాయి నేరం చేసినట్లు ఎంతమాత్రం రుజువుకాలేదు. కనుక నిర్దోషి అయిన నా క్లయింట్‌ను విడుదల చేయవలసిందిగా కోర్టువారికి విన్నవించుకుంటున్నాను'' అంటూ ముగించాడు ముద్దాయి తరపు వకీలు ఆనందరావు.

కోర్టులో సూది పడితే వినిపించేటంత నిశ్శబ్దం అలముకుంది.

ఇంక జడ్జిగారు తమ తీర్పున ప్రకటించడమో, లేదా తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడమో తరువాయి.

న్యాయమూర్తితో సహా కోర్టుకి వచ్చిన అశేష జనవాహిని అందరికీ తెలుసు అబ్దుల్లా హత్య చేశాడని. కాని తగిన సాక్ష్యం లేనందువల్ల కొట్టుకుపోతోంది కేసు. హంతకుడు నిర్దోషి అన్న ముద్రతో పెద్ద మనిషిలా బయటకు రాబోతున్నాడు. న్యాయం నడివీధిలో ఉరికంబం ఎక్కబోతోంది.

జరుగుతున్న అన్యాయానికి హృదయం దహించుకుపోతోంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాగర్‌కి. కళ్ళకి గంతలువుండే న్యాయదేవత విగ్రహం కళ్ళముందు మెదిలింది. అందుకే అంటారు న్యాయస్థానాలకి చెవులే కాని కళ్ళు లేవని. ఈ కేసు ఎలా తిరగతోడాలా, దోషిని ఎలా పట్టియ్యాలా అన్న ఆలోచనతో ఆయన మస్తిష్కం సతమతమవుతోంది. పక్కనుంచి ఎవరో వీపుమీద తట్టి నెమ్మదిగా "సార్" అని పిలవడంతో అటు తిరిగాడు సాగర్.

"సార్ నా పేరు అనిల్. నా వివరాలు తర్వాత చెపుతాను. ఈ కేసులో నేను కీలకమైన సాక్ష్యంతో దోషిని పట్టియ్యగలను. న్యాయమూర్తికి చెప్పి నాకా అవకాశం ఇప్పించండి" అన్నాడు ఆయన.

ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడిచేతికి తెప్పదొరికినట్లయింది సాగర్‌కి.

"మిలార్డ్. ఒక ముఖ్యమైన విన్నపం ఈయన అనిల్. ఈ కేసులో కీలక సాక్ష్యాన్ని అందజేయగలనంటున్నారు. అందుకు ఆయనకి అవకాశం ఇప్పించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను" అన్నాడు సాగర్.

కోర్టులో అందరిమెడలూ అనిల్ వంక తిరిగాయి.

అబ్దుల్లా కూడా అతనివంక ఆశ్చర్యంగా చూడసాగాడు.

"సరే. సాక్షిని ప్రవేశపెట్టండి" అన్నాడు న్యాయమూర్తి.

అనిల్ బోనులోకి ప్రవేశించాడు ప్రమాణం చేయమంటుండగా.

"మిలార్డ్ ఒక చిన్న మనవి" అన్నాడు.

అసహనంగా చూశారు జడ్జిగారు.

"నేను స్వయంగా చెప్పే సాక్ష్యం ఏమీలేదు. అందువల్ల ప్రమాణం చేసే అవసరం లేదు."

"మరి" అన్నాడు న్యాయమూర్తి కనుబొమలు చిట్లిస్తూ.

చేతిలో వున్న మెడికల్ కిట్‌వంటి దానిని పైకి ఎత్తి చూపుతూ.

"మిలార్డ్ ఇది నేను రూపొందించిన యంత్రం. దీనిని ముద్దాయికి కనెక్ట్ చేస్తే అతని ఆలోచనలను రికార్డుచేసి మాటలుగా వినిపిస్తుంది. మనిషి అబద్ధం చెప్పినా మనసు నిజమే చెప్తుంది. కనుక, వాస్తవం బయట పడుతుంది" అన్నాడు అనిల్.

"నో...నో.. ఇటువంటి లై డిటెక్టర్ల సాక్ష్యాన్ని కోర్టు గుర్తించదు" అన్నాడు న్యాయమూర్తి.

"మిలార్డ్. ఇది లైడిటెక్టర్ కాదు అది అబద్దం చెప్పున్న మనిషి లోనయ్యే సంఘర్షణవల్ల ఏర్పడిన ఒత్తిడిని నమోదు చేసి అబద్ధం చెప్పున్నట్లు సూచిస్తుంది. నా యంత్రం అలాకాదు. మనిషి మస్తిష్కంలోని ఆలోచనలను యధాతధంగా రికార్డుచేసి మాటలుగా ప్రసారం చేస్తుంది."

"ఈ లక్ష్యాన్ని కన్‌క్లూజన్ ప్రూఫ్‌గా తీసుకోకపోయినా, కోరాబోరేటివ్ ఎవిడెన్స్‌గా గుర్తించవచ్చుని నా విన్నపం" అన్నాడు సాగర్.

"అలా అయినప్పటికీ కేవలం సంబంధిత వ్యక్తి అనుమతిస్తేనే దీనిని ఉపయోగించవచ్చు. అంతేకాని ముద్దాయిని కోర్టు బలవంతం చేయలేదు" అని పరిస్థితిని వివరించారు న్యాయమూర్తి.

"తమ అనుమతితో ముద్దాయిని అడుగుతాను" అని అబ్దుల్లా వంక తిరిగి "మిస్టర్ అబ్దుల్లా...ఈ యంత్రాన్ని నీమీద ప్రయోగించడానికి ఒప్పుకోవలసిందిగా కోరుతున్నాను" అన్నాడు సాగర్.

అబ్దుల్లా ముఖం కోపంతో అరుణవర్ణమయింది.

"నేనెందుకు ఒప్పుకోవాలి" అన్నాడు గర్జిస్తూ.

"అది నీ ఇష్టం. నిజంగా నీవు నేరం చేయకపోతే నీకు భయపడాల్సిన అవసరం లేదు" అన్నాడు సాగర్.

"నాకెందుకు భయం? అని ఒక్క నిమిషం ఆలోచనలోపడ్డాడు. అబ్దుల్లా" మహామహా సాక్ష్యాలే మట్టికొట్టుకుపోయాయి ఇంక ఈ యంత్రం బయటపెట్టేది ఏముంటుంది? ఇందుకు ఒప్పుకోకపోతే తప్పుచేశాను కనుకనే ఒప్పుకోలేదని నలుగురూ అనుకుంటారు. పరోక్షంగా నా నేరం రుజువవుతుంది. ఇందుకు ఒప్పుకుంటే నిర్దోషి కనుకనే నిర్భయంగా ఒప్పుకున్నాడని నలుగురూ అనుకుంటారు - బాగా ఆలోచించి "సరే. ఏం పరీక్షలు చేసుకుంటారో చేసుకోండి" అన్నాడు.

"మిస్టర్ అనిల్. యువర్ ప్రొసీడ్" అన్నాడు న్యాయమూర్తి.

"యస్ మిలార్డ్" అంటూ తన కిట్‌తో అబ్దుల్లా దగ్గరికి వచ్చాడు అనిల్

పైకి బింకం ప్రదర్శించినా గుండెలు గుభిల్లుమన్నాయి అబ్దుల్లాకి.

డాక్టర్ అనిల్ తన కిట్‌ను అబ్దుల్లా నిలబడ్డ బోనుపక్కన ఒక బల్లమీద ఉంచి తెరిచాడు. అందులోంచి ఒక గాజు తొట్టెను తీసి బల్లమీద పెట్టాడు. అందులో ఆకుపచ్చని ద్రవం ఒకటుంది. దానిలో రెండు మెటల్ రాడ్స్ ఉన్నాయి. వాటినుంచి పొడుగాటి వైర్‌లు ఉన్నాయి. వాటి చివర టెలిఫోన్ ఆపరేటర్లు పెట్టుకునే హెడ్‌గేర్‌లు వంటి రెండు రాగి డిప్పలు, ఒక వంపు కడ్డీతో కలపబడివున్నాయి. ఆ రాగి డిప్పలు రెండూ రెండు ఎలక్ట్రోడ్స్ అన్నమాట.

ఆ రెండు ఎలక్ట్రోడ్స్‌ను అబ్దుల్లా తలకు తగిలించాడు డాక్టర్ అనిల్.

గ్లాస్ కేస్‌లోంచి రెండు వైరులు మెటల్‌రాడ్స్‌నుంచి బయటకు వచ్చి టేపిరికార్డర్ వంటి దానికి కలిపి ఉన్నాయి. స్విచ్‌మీద చేయివేసి సిద్ధంగా ఉంచి "మీరు ముద్దాయిని ప్రశ్నించండి" అన్నాడు సాగర్‌తో.

"మిస్టర్ అబ్దుల్లా. ఒకే ఒక్క ప్రశ్న అడుగుతాను, నిజం కప్పిపెట్టకుండా సమాధానం చెప్పండి. ఇన్‌స్పెక్టర్ రంగనాథ్‌ని మీరు హత్య చేశారా లేదా" అడిగాడుసాగర్.

ప్రశ్న పూర్తి అవగానే స్విచ్ ఆన్‌చేశాడు. అనిల్. టేప్ తిరుగుతున్న సన్నని శబ్దం వచ్చింది.

"మహామహావాళ్ళే నా దగ్గరికి రావడానికి భయపడేవారు. నా అనుగ్రహంకోసం పెద్ద పోటీలు పడేవారు అటువంటిది ఈ ఛోక్రా ఈ ఎస్.ఐ. రంగనాథ్ నన్ను పట్టుకోడానికి వచ్చి ప్లానంతా పాడుచేస్తాడా? అటువంటివాడిని గోటితోనే తుంచివేస్తాను. వదిలిపెట్తానా? అందుకే మళ్ళీ ఏ ఆఫీసరు ఇంతటి సాహసం చేయకుండా పట్టపగలు నడిరోడ్డున వందలమంది చూస్తుండగా కాల్చి చంపాను. అది చూసిన పోలీసులు మాత్రం సాక్ష్యం చెప్పగలిగారా" అబ్దుల్లా ఆలోచనలు పాదరసంలాగా సాగిపోతున్నాయి.

అబ్దుల్లా పెదవులు కదలనేలేదు. ఆ ఆలోచనలు మాత్రం మాటలుగా లోవాయిస్‌లో టేప్‌మీద రికార్డు అయిపోయాయి. అతను పెదివి విప్పేలోపునే స్విచ్‌ని ఆఫ్‌చేసి టేప్‌ని రివర్స్‌చేసి వాల్యూం పెంచి టేప్‌ని ప్లే చేశాడు అనిల్.

ఈసారి రికార్డయిన మాటలు కోర్టులో అందరికీ స్పష్టంగా వినిపించాయి.

"ఇప్పుడేమంటావు అబ్దుల్లా?" అంటూ గర్జించి అడిగాడు సాగర్. అప్పటిదాకా "మీరు" అని సంబోధించినవాడు ఇప్పుడు "నువ్వు" అనేశాడు.

ఇంకేమీ మాట్లాడలేక నేరాన్ని ఒప్పుకున్నడు అబ్దుల్లా.

అతని తలకున్న హెడ్‌గేర్స్‌ని తొలగించాడు అనిల్.

తీర్పును వాయిదా వేస్తూ కోర్టును చాలించాడు న్యాయమూర్తి.

అబ్దుల్లా చేతులకి బేడీలు వేసి తీసుకుపోయారు పోలీసులు.

అనిల్ ప్రక్కనుంచిపోతూ "బేటా అప్పుడే ఏమయింది! చూస్తావు నా తడాఖా" అంటూ కళ్ళతో నిప్పులు కక్కుతూ వెళ్ళాడు అబ్దుల్లా.

అనిల్ తన యంత్రాన్ని కిట్‌లోకి సర్దేశాడు. ఆయనా, సాగర్ బయటకు రాగానే పత్రికా విలేకరులు ఈగల్లా చుట్టుముట్టారు. ప్రశ్నల వర్షం కురిపించారు.

"చూడండి. ఇప్పుడు నేనేమి చెప్పలేను. నా పరిశోధన ఇంకా ప్రయోగదశలోనే ఉంది. దీని ఫలితాలను నేను ముందుగా సైన్టిఫిక్ కౌన్సిల్‌కీ, ప్రభుత్వానికి తెలియచేయాలి. నేను సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్ వారి అనుమతితోనే దీని వివరాలు బయట పెట్టగలను" అంటూ వినయంగా నచ్చచెప్పి బయటపడ్డాడు అనిల్.

"మిస్టర్ అనిల్ నా ఛాంబర్‌లోకి వెళ్దాం రండి" అన్నాడు సాగర్.

లోపల కూర్చున్నాక "మిస్టర్ అనిల్ మీది బందరుకదూ?" అన్నాడు.

"అవును. మీదీ బందరేనని నాకూ తెలుసు. కాకపోతే పరిచయం లేదు" అన్నాడు అనిల్.

"నిజమే. మనిద్దరిదీ ఒకే ఊరయినా, ఇప్పుడు ఒకే ఊళ్ళో ఉంటున్నా, ఇంతకాలం ఒకరితో ఒకరు కలుసుకోలేదు. ఈ కేసుద్వారా ఎంతో ఆత్మీయులమయ్యాం చూడండి" అన్నాడు సాగర్.

"ఒక్కోసారి ఇలాగే స్నేహాలు అనుకోకుండా ఏర్పడుతుంటాయి" అన్నాడు అనిల్.

"ఈ సందర్భంగా రేపు సాయంత్రం హోటల్ అశోకాలో డిన్నర్ చేద్దాం. యువిల్‌బి మై గెస్ట్" అన్నాడు సాగర్.

"అలాగే. ఆప్యాయంగా ఆహ్వానిస్తే కాదంటానా? రేపు సాయంత్రం ఆరు గంటలకి డైరెక్టుగా అక్కడికే వస్తాను?" అన్నాడు అనిల్.

"నో...నో...నేనేవచ్చి మిమ్మల్ని పికప్ చేస్తాను. మీ అడ్రస్ ఇయ్యండి" అని తన విజిటింగ్ కార్డ్ ఇస్తూ "ఇదే నా ఇల్లు, లేబొరేటరీ రెండూనూ" అన్నాడు.

అది చూసి "అరే. మీకూ మా ఇంటికి పెద్ద దూరం లేదు" అంటూ తన విజిటింగ్ కార్డ్ కూడా ఇచ్చాడు సాగర్.

అప్పటికి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు అనిల్.

మర్నాడు సాయంత్రం ఆరు గంటలకే తన కారులో అనిల్ ఇంటికి వచ్చాడు సాగర్.

ఆయన వచ్చిన విషయం సెక్రటరీ ద్వారా తెలుసుకుని మేడపైనుంచి క్రిందికి దిగివచ్చాడు అనిల్.

"వెల్‌కం టు యు మిస్టర్ సాగర్. దీసీజ్ ప్రభ మై సెక్రటరీ, అసిస్టెంట్ ఎట్ సెట్రా ఎట్ సెట్రా" అంటూ తన సెక్రటరీని పరిచయం చేశాడు.

"హౌడుయుడు" అంటూచిరునవ్వుతో బదులిచ్చింది ప్రభ.

"ప్రభా మేం పైకి వెళ్ళి లేబరేటరీలో మాట్లాడుతుంటాం. ఒక గంట తర్వాత హోటల్ అశోకాలో మా లంచ్ ఉంది. ఇఫ్ యు వాంట్ యు కెన్ గో" అన్నాడు అనిల్.

"కొంచెం సేపుండి రేపటి ప్రోగ్రాం అంతా ఫిక్స్ చేసుకుని వెళ్తాను" అంది ప్రభ.

"దట్స్ ఫైన్. పైకి వెళ్దాం. రండి మిస్టర్ సాగర్" అంటూ మెట్లవైపు దారి తీశాడు అనిల్.

ఇద్దరూ కూర్చున్నాక "మిస్టర్ అనిల్ యు డిడ్ ఎస్ప్లెండిడ్ జాబ్. అసలు మీరు కోర్టుకు ఎందుకు వచ్చారు? మీరే కనక ఆ సాక్ష్యం లాగకపోతే ఆ రోగ్ స్కాట్ ఫ్రీగా ఎస్కేప్ అయ్యుండేవాడు" అన్నాడు సాగర్.

"చూడండి. అబ్దుల్లా పచ్చినెత్తురు తాగే గూండా.వాడికి రాజకీయ నాయకుల, పోలీసుల అండ ఉంది. అందుకే వాడి నీడను తాకడానికి కూడా అందరూ భయపడుతారు. అటువంటిది రంగనాథ్ వంటి ఒక నిజాయితీ పోలీసు ఆఫీసర్‌ని వాడు నడిరోడ్డుమీద దారుణంగా హత్యచేస్తే ఆ విషయం సాక్ష్యం చెప్పడానికి ఎవరూ ముందుకు రాలేదు. రంగనాథ్ నిజాయితీకి ప్రతిఫలం-ప్రాణాలు పోవడం. నిజాయితీగా బ్రతకాలని జీతంతో బ్రతికే ఆయన కుటుంబం వీధిన పడడం ఇది చూసేసరికి నా కడుపు రగిలిపోయింది. సంచలనం కలిగించిన ఈ కేసు వివరాలు ఎప్పటికప్పుడు ఆసక్తితో చదువుతూ వచ్చాను. ఎప్పుడైతే హంతకుడని అందరికీ తెలిసిన అబ్దుల్లా నిర్దోషిగా బయటపడబోతున్నాడో ఇంక తట్టుకోలేకపోయాను. నా యంత్రంతో నిజాన్ని బయటపెట్టాలనుకున్నాను. ఆ తర్వాత సంగతి మీకు తెలిసిందే" అన్నాడు అనిల్.

"ఊ చాలా బాగుంది. ఇంతకీ మీ యంత్రం అతని ఆలోచనలను ఎలా బయటపెట్టింది? సీక్రెట్ కాకపోతే చెప్పండి" అన్నాడు సాగర్.

సీక్రెట్ ఏమీ లేదు. సైన్స్ని రహస్యంగా ఉంచడం సైంటిస్టుల సాంప్రదాయానికే విరుద్ధం. నేను కనుగొన్న దానిలో ప్రత్యేకించి విశేషం ఏమీ లేదు. మనిషి శరీరంలో జరిగే అనేక ప్రక్రియలు విద్యుత్ సంబంధమైనవేనని తెలిసిన విషయమే. నరాలు, నాడులు విద్యుత్ తరంగాలద్వారానే సంకేతాలను అందుకుని తమ విధులను నిర్వర్తిస్తాయి. అంతేకాదు మనిషి మెదడులో కలిగే ఆలోచనలు కూడా విద్యుత్తరంగాలను సృష్టిస్తాయి. వీటిని "బయో కరెంట్స్" అంటాం. అయితే ఇవి అమిత బలహీనంగా ఉండడంవల్ల మామూలు విద్యుత్ పరకరాలతో వీటిని గుర్తించడం సాధ్యంకాదు. మెదడులో అనేక గ్రంథులలో వివిధ ఎమినోయాసిడ్లు ఉంటాయి. జీవపదార్థం ఏర్పడడంలో వీటి పాత్ర ఎంతో ప్రధానంగా ఉంటుంది. విద్యుత్ తరంగాలను ప్రసారం చేయడంలో ఈ ఎమినోయాసిడ్స్ మంచి మీడియంగా వ్యవహరించగలవని నేను కనుగొన్నాను. నేను రూపొందించిన యంత్రంలో గ్లాస్‌కేస్‌లో మీరు చూసిన ఆకుపచ్చ ద్రవం ఈ విధమైన ఒక ఎమినో యాసిడే. దానిలో ఎలక్ట్రోడ్స్ ఉంచి వెండివైర్లతో మనిషి కణతలకు కనెక్ట్ చేస్తే ఎలక్ట్రిక్ సర్క్యూట్ కంప్లీట్ అవుతుంది. వెండిని ఎన్నుకోడానికి కారణం వెండి చాలా మంచి విద్యుత్ వాహకం కావడం. దీనిలో రెసిస్టెన్స్ చాలా తక్కువగా ఉంటుంది. నేను రూపొందించిన యంత్రం మస్తిష్కంలోని విద్యుత్ తరంగాలను శక్తిమంతం చేస్తుంది టెలిఫోన్‌లో మాటలు విద్యుత్‌గా మారి, తిరిగి ఆ విద్యుత్ మాటలుగా మారినట్లే నేను రూపొందించిన యంత్రం మస్తిష్కంలోని తరంగాలను శక్తిమంతం చేయడమేకాకుండా, ఆ ఆలోచనలు సృష్టించిన విద్యుత్ తరంగాలను మాటలుగా మార్చి టేప్‌మీద రికార్డు చేయగలదు" అని వివరించాడు అనిల్.

"అద్భుతంగా ఉంది ఈ లెక్కన ఈ యంత్రంలో ఎవరి ఆలోచనలనైనా బయటపెట్టించి న్యాయం జరిపించవచ్చునన్నమాట"

"ఆ మాట నిజమమేకాని అందువల్ల అనర్థాలు కూడా ఉన్నాయి"

"ఎలా?"

"ఒక ఐరావతంలాంటి సుందరి తన అందం గురించి చెప్పమని భర్తని వేధిస్తోందనుకుందాం. మామూలుగా అయితే ఆయన ఆమె మనసు నొప్పించకుండా ఉండడానికి "ఆహా నీవు రంభవి. ఓహో...ఊర్వశి నీముందు దిగదుడుపు" అంటాడు. ఆవిడకి అనుమానం వచ్చి ఈ యంత్రాన్ని ఆ మానవుడిమీద ప్రయోగించిందనుకోండి. వెంటనే "ఈ గున్న ఏనుగు జలగలా నన్ను పీడిస్తోంది ఏమిట్రా' అని అనుకున్నాడో సహజంగా ఈ మాటలనే యంత్రం రికార్డు చేస్తుంది. ఇంకేముంది? కొంపలు అంటుకుపోతాయి. అప్పడాల కర్ర తీసుకుఒని ఆవిడ ఆ నిర్భాగ్యుని వెంట పడుతుంది.

"నిజం అత్యధిక సందర్భాలలో చేదుగా ఉంటుంది.ఎవరికీ నష్టం లేనప్పుడు అందమైన అబద్ధాలు ఆడడం నిజ జీవితంలో తప్పనిసరి. అటువంటప్పుడు మనసులోని నిజాలు మర్మంలేకుండా బయట పడ్డుంటే మనుగడ సాగించడం అసాధ్యం అవుతుంది. అందువల్ల ఈ యంత్రాన్ని అత్యవసర సమయాల్లో, కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే వాడడం మంచిది అని నా అభిప్రాయం" అన్నాడు అనిల్.

''నిజం. మీరు ఎంతో దూరం, ఎంతో లోతుగా ఆలోచించారు. నాకు అంత దూరం ఆనలేదు'' అన్నాడు సాగర్.

"శాస్త్రజ్ఞుడిగా అది నా బాధ్యత. ఒక పరిశోధన జరిపినప్పుడు దాని పూర్వాపరాలూ, మంచి చెడ్డలూ, అది తీసుకురాగలిగే ఫలితాలు అన్నీ ఆలోచించాలి. ఎందుకంటే విజ్ఞానం రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. దానిని ఎంతో జాగ్రత్తగా ప్రమాదానికి ఆస్కారం లేకుండా ఉపయోగించాలి''

"ఒకే. ఇంక మనం బయలుదేరుదాం. కబుర్లతో కడుపు నింపేసుకుంటే అక్కడేం తింటాం'' అంటూ లేచాడు సాగర్.

''యస్ పోదాం...'' అంటూ తానూ లేచాడు అనిల్.

మర్నాడు సాయంత్రం ఆరున్నర అయింది. చలికాలం ముదరడంతో బాగా చీకటి పడింది.

ప్రభ కంగారుగా ఫోన్ చేసింది సాగర్‌కి.

"సార్. నేను అనిల్‌గారి సెక్రటరీ ప్రభను మాట్లాడుతున్నాను''

"ఏమిటి సంగతి?''

''సార్ డాక్టర్ అనిల్ రూంలోపల గడియపెట్టి ఉంది. లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఎంత పిలిచినా పలకడం లేదు. ఇంటర్‌కంలో పిలిచినా రెస్పాన్స్ లేదు నాకు ఎందుకో భయంగా ఉంది.''

"ఇంతసేపు నువ్వక్కడ లేవా?''

"ఉన్నాను సార్. ఐదింటికి ఆయన నన్ను పిలిచి నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళి ఏవో కొన్ని బుక్స్ , రికార్డ్స్ తెమ్మన్నారు. వాటిని తెచ్చి వచ్చేసరికి ఇదీ పరిస్థితి''

"ఇంట్లో ఇంకెవరూ లేరా?''

"ఇంకెవరుంటారు సార్. ఆయన బ్రహ్మచారి కదా!''

"ఓ. అలాగా ఈ విషయం పోలీసులకు కాని, ఇంకెవరికి కాని ఫోన్ చేశావా?''

"లేదు సార్. ఏం చేయాలో తోచక మీకే చేస్తున్నాను''

''సరే. ఇప్పుడే వస్తున్నాను'' అంటూ ఫోన్ పెట్టేశాడు సాగర్.

మరో పది నిమిషాలలో అనిల్ ఇంటిని చేరుకున్నాడు సాగర్. కారు శబ్దం విని ప్రభ ఎదురువచ్చింది.

ఆమెని చూస్తూనే "ఏమైనా తెలిసిందా?'' అన్నాడు సాగర్.

"లేదు సార్. మళ్ళీ మళ్ళీ పిలిచాను. అయినా జవాబు లేదు.''

అనిల్ లేబొరేటరీకి వున్న వెంటిలేటర్లు ప్రక్కలకు ఉన్నాయి.

అంటే ముందు వీధివైపు, వెనక పెరడువైపు ఉన్నాయి.

ఎంటో రూఫింగ్ పైకి ఎక్కి వెనక వెంటిలేటర్‌లోంచి చూశాడు సాగర్. లోపల ఎవరూ లేరు.ఫాన్ తిరుగుతూనే ఉంది. లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. బల్లలు, కుర్చీలు చిందరవందరగా ఉన్నాయి. బల్లమీద పుస్తకాలు క్రిందపడివున్నాయి. అక్కడ పెనుగులాట ఏదో జరిగినట్లుగా స్పష్టంగా తెలుస్తోంది.

వెంటనే లోపలకి తిరిగివచ్చి బలంగా తలుపును కాలితో తన్నాడు సాగర్. రెండు మూడు తన్నులకు బోల్టు ఊడి తలుపు తెరుచుకుంది.

ఒక్క ఉదుటున సాగర్, ప్రభ లోనికి ప్రవేశించారు. బాత్‌రూంకి అనుకుని వున్న మెట్లగది తలుపు తెరిచిఉంది. దానిద్వారా పెరట్లోకి దిగారు.

"ఎవరో గాంగ్ వచ్చి డాక్టర్ అనిల్‌ని కిడ్నాప్ చేసి ఇటునుంచి తీసుకుపోయారన్నమాట. ఈ పెరటి వెనకాల ఖాళీస్థలమే కాని ఇళ్ళేమీ లేకపోవడంతో ఇట్నుంచి తేలిగ్గా ఆయన్ని ఎత్తుకుపోయారు"

"ఎవరు చేసి ఉంటారు ఈ పని?"

"ఇంకెవరు... అబ్దుల్లా గాంగే. వాళ్ళు ఈ విధంగా పగ తీర్చుకుంటారని అనుమానించకపోవడం నా బుద్ధి పొరపాటు" అంటూ నొచ్చుకోసాగాడు సాగర్.

"ఇప్పుడేమిటి చేయడం?"

"ముందు పోలీసులకి ఫోన్ చేయాలి. వారు ఇక్కడికి రాగానే వారితో ఆలోచించి తర్వాత సంగతి చూడాలి" అంటూ ఫోన్ దగ్గరికి వెళ్ళాడు సాగర్.

ప్రభ ఈలోగా లేబరేటరిలోకి వెళ్ళింది.

ఫోన్ చేశాక తానూ లేబొరేటరిలోకి వచ్చాడు సాగర్.

ప్రభ ఎక్స్‌పెరిమెంటల్ టేబుల్ ప్రక్కన నిలబడి ఉంది. ఆ బల్లమీద ఒక చిన్న బీకర్‌లో ఆకుపచ్చ ద్రవం-ఆ యంత్రంలోని గ్లాసుకేస్‌లో ఉన్నటువంటిదే ఉంది. ఆమె ఆ బీకర్‌ని తీసుకొని ఆ ద్రవాన్ని గడగడా త్రాగసాగింది.

ప్రభ చేస్తున్న పనేమిటి? ఆమె అనిల్‌ని ప్రేమించి అతనికేదో అయిందన్న భయంతో ఆత్మహత్య చేసుకోవడం లేదుకదా?

కంగారుగా ముందుకు దూకుతూ "ప్రభా! ఏమిటి నువ్వు చేస్తున్న పని?" అంటూ దగ్గరకు వెళ్ళాడు సాగర్. అప్పటికే ఆ ద్రవాన్ని త్రాగడం పూర్తి చేసింది ప్రభ.

"ప్రభా. ఏమిటి నువ్వు చేసిన పని?" అంటూ భుజం కుదుపుతూ గద్దించి అడిగాడు సాగర్.

చూస్తుండగా ఆమె వళ్ళు జ్వరంతో పేలిపోతున్నట్లు వేడెక్కింది. కళ్ళూ ఒళ్ళూ ఎర్రబడిపోయాయి. శ్వాస వెచ్చగా వస్తోంది. మూర్ఛపోతున్నట్లుగా ఆమె వాలిపోయింది.

వెంటనే ఆమెని కుర్చీలో కూర్చోబెట్టి బల్లమీదున్న నీళ్ళ గ్లాస్ తీసుకొని ఆమె ముఖాన్ని నీటితో తుడవసాగాడు సాగర్.

అతి కష్టంమీద మాట్లాడుతూ "నా గురించి కంగారు పడకండి. ఈ ఎఫెక్ట్ కొంచెంసేపు ఉంటుంది. ముందు డాక్టర్ అనిల్‌ని వెతికే సంగతి చూడండి" అంది ప్రభ.

మరో పది నిమిషాలలో పోలీస్ జీప్ అక్కడికి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ అబ్రహాం మరి కొందరు కానిస్టేబుల్స్ అందులోకి వచ్చారు. కానిస్టేబుల్స్‌ని క్రిందనే ఉంచి తాను లోనికి వచ్చాడు అబ్రహాం.

ఆయనను మెట్లమీదే రిసీవ్ చేసుకుని వెంట తీసుకువెళ్ళి లేబరోటరీలోని పరిస్థితిని చూపించాడు సాగర్.

ఈలోగా ప్రభ తేరుకుంది.

"ఊ...ఇది అబ్దుల్లా గాంగ్ పనే. సందేహంలేదు. పదండి. మీరిద్దరూ కూడా మా వెంట రండి. ఉయ్ హావ్ టు ఛేజ్ ది కల్ ప్రిట్స్" అంటూ చక చకా మెట్లు దిగసాగాడు అబ్రహాం.

ప్రభ త్వరత్వరగా ఇంటికి తాళం పెట్టింది.

అందరూ పోలీస్ జీప్ ఎక్కారు.

ముందుగా అబ్రహాం వైర్‌లెస్ సెట్ తీసుకుని అన్ని పోలీసు స్టేషన్లకూ మెసేజ్ ఇయ్యవలసిందిగా కంట్రోల్ రూంకి చెప్పాడు. నగరంనుంచి వెళ్ళే అన్ని దారులదగ్గరా కాపలా వుంచి ప్రతి వాహనాన్ని చెక్ చేయమని ఆ మెసేజ్ సారాంశం.

జీప్ తుఫాన్ మెయిల్‌లాగా దూసుకుపోతుంది.

విజయవాడ రోడ్ మీద హయాత్‌నగర్ దాటి జీప్ పోతోంది.

వెనకాలనుంచి అమిత వేగంతో ఒక అంబాసిడర్ కారు పోలీసు జీప్‌ను రాసుకుంటూ వెళ్ళిపోయింది. ఆ కారులోపల లైట్లు లేవు. క్షణంలో చూసిన ఆ చూపులోనే కారులో నలుగురు బలిష్టులు - వారి మధ్యకాళ్ళూ చేతులూ కట్టివేసి ఒక వ్యక్తి ఉన్నట్లు అనిపించింది సాగర్‌కి.

ఆ కారు తాకిడికి జీప్ ప్రక్కకి వెళ్ళి డ్రైవర్ ఆపడంతో కీచుమంటూ ఆగింది. దానిని మళ్ళీ రోడ్‌మీదకి త్రిప్పి నడిపేలోగా ముందు కారు కనిపించనంత దూరం వెళ్ళిపోయింది.

ఆ కారులో డాక్టర్ అనిల్‌ను గూండాలు కట్టి తీసుకుపోతున్నట్లు నాకు అనిపిస్తోంది" అన్నాడుసాగర్.

"సందేహం లేదు వాళ్ళు అబ్దుల్లా మనుష్యులే అయ్యుండాలి. మనల్ని గుర్తుపట్టి మన జీప్‌కి ప్రమాదం కల్పించడానికి ప్రయత్నించి ఉండవచ్చు" అన్నాడు అబ్రహాం.

మరో పది నిమిషాలు ఆ అంబాసిడర్ వెళ్ళిన వైపే పోలీసు జీప్ వెళ్ళింది. కాని ఆ కారు జాడలేదు.

ఇంతలో ఉన్నట్లుండి ప్రభ శ్రద్ధగా ఏదో ఆలకిస్తున్నట్లుగా నిటారుగా కూర్చుని, అందర్నీ మౌనంగా ఉండమన్నట్లు సంజ్ఞ చేసింది.

"ఆ కారులో కట్టేసి ఉన్నది డాక్టర్ అనిలే. ఇప్పుడు ఆ కారు విజయవాడ రోడ్‌మీద పోతోంది. ఇప్పుడే చౌటుప్పల్ దాటింది. కారుని అటువైపు పోనీండి. ఇతర సెర్చి పార్టీలకు కూడా ఈ మెసేజ్ పంపండి" అంది ప్రభ.

అబ్రహాం ఏదో అనబోయేసరికి "ముందు మెసేజ్ పంపండి?" అంది ఆర్డరిస్తున్నట్లుగా.

అబ్రహాం వెంటనే మెసేజ్ పంపాడు.

ప్రభ మళ్ళీ అందుకుంది. ఆ కారు నెంబరు ఎపిటి 5471. రంగు గచ్చకాయ రంగు. చౌటుప్పల్ దాటి నాలుగు కిలోమీటర్లు వెళ్ళింది" అంది.

మెసేజ్ మళ్ళీ సెర్చి పార్టీలకు వెళ్ళింది.

మరో ఇరవై నిమిషాలలో అన్నివైపులనుంచీ పోలీస్ కార్లు ఆ అంబాసిడర్‌ను చుట్టుముట్టాయి. ఆశ్చర్యంతో కొయ్యబారిపోయారు అబ్దుల్లా మనుష్యులు. వారు పోలీసులను ఎదిరించాలని విఫల ప్రయత్నం చేశారు. కాని ఫలితం లేకపోయింది. అంతా నిమిషాల మీద జరిగిపోయింది.

డాక్టర్ అనిల్ ఇంట్లో అందరూ సమావేశమయ్యారు.

"మిస్ ప్రభా...యు బికేమ్ ఎ వండర్‌ఫుల్ ప్రాబ్లమ్ ఫర్ అజ్. టెలిపతీ ద్వారా చెప్పినట్లు ఆ దొంగల ఆచూకిని ఎలా చెప్పగలిగావు?" అన్నాడు సాగర్.

"నేను చెప్పిందేముంది! డాక్టర్ అనిల్ తాను ఎక్కడున్నదీ చెప్పారు. నేను దానిని రిపీట్ చేసాను. అంతే" అంది ప్రభ నవ్వుతూ.

"వాట్!" అంటూ ఆశ్చర్యపోయాడు సాగర్.

"అవును సార్. టెలిపతీ ద్వారానే ఇదంతా జరిగింది. మనకి తెలిసిన టెలిపతీలో ఏ యంత్రాల సహాయమూ ఉండదు. కేవలం అమితశక్తిమంతమైన ఆలోచనా తరంగాలు అవతలి వ్యక్తి మస్తిష్కంలోకి ప్రవేశిస్తాయి. మా విషయంలో యంత్రం సహాయం ఉంది" అన్నాడు అనిల్.

అంటే మీరు మెసేజ్ ఇస్తారని ప్రభకి ముందే తెలుసునన్నమాట.

"ఇంకా మిమ్మల్ని సస్పెన్స్‌లో ఉంచడం అన్యాయం. వివరంగా చెప్తాను వినండి" అంటూ ప్రారంభించాడు అనిల్.

"ఇంతకు ముందు నా యంత్రం ద్వారా ఆలోచనలను మాటల రూపంలో రికార్డు చేయడం మీరు చూశారు. నా పరిశోధనలను కొనసాగిస్తుండగా నాకు మరో ఆలోచన వచ్చింది. విడిగా గ్లాస్‌కేస్‌లో అమినో యాసిడ్‌ను పోసి సర్క్యూట్‌కు కంప్లీట్ చేసే బదులు దానిని మనిషి శరీరంలోనే ఉంచి కంప్లీట్ చేయవచ్చుగా అని. అందుకుగాను ముందుగా నాపైనే ప్రయోగం చేసుకున్నాను. అబ్దుల్లా మనుష్యులు నాపై పగ తీర్చుకోడానికి ప్రయత్నిస్తారని ఊహించాను. దానికి సిద్ధపడి, వారు రావడం గమనించి బీకర్‌లో ఉన్న ద్రవం సగం త్రాగేశాను. అంతకుముందే ప్రభకు చెప్పి ఉంచాను. నాకేదైనా ప్రమాదం జరిగితే బీకర్‌లో ఉన్న మిగిలిన సగం ద్రవం తాగేయమని. అందువల్ల నా ఆలోచనలు తనకి అందుతాయని, తన ఆలోచనలు నాకు చేరుతాయనీ చెప్పాను. ఈ ద్రవం శరీరంలో ఉండడంవల్ల శరీరం ట్రాన్స్‌మీటర్‌గానూ, రిసీవర్‌గానూ కూడా పనిచేస్తుందన్నమాట. ఈ ద్రవంలో చేసిన మార్పులవల్ల విద్యుత్తరంగాలుగా మారిన ఆలోచనలను తగు మాత్రం శక్తిగల రేడియో తరంగాలుగా, వైర్లతో నిమిత్తం లేకుండా పంపడం సాధ్యం అయింది. ఎలక్ట్రోడ్స్ పెట్టి టేప్‌రికార్డర్‌నీ కలిపితే ఆలోచనలు మాటల రూపంలో రికార్డు అవుతాయి. అదిలేకుండే ఒకరి ఆలోచనలు ఇంకొకరికి అర్థం అవుతాయి. ఒకరి మెసేజ్ ఇంకొకరు స్వీకరించగలరు. అయితే ఈ ద్రవాన్ని త్రాగిన వెంటనే విపరీతంగా అలసట వస్తుంది. రియాక్షన్ వచ్చి తీవ్రమైన జ్వరం వచ్చినట్లు అవుతుంది. కాని ఇది ఎంతో సేపు ఉండదు. ఈ వివరాలన్నీ ప్రభకు ముందే చెప్పాను. అబ్దుల్లా మనుషులు ప్రభలేని సమయంలో నా లేబొరేటరిలోకి దూసుకువచ్చి లోపల గడియపెట్టి నన్ను కట్టేశారు.

అప్పటికే కొంతసేపు పెనుగులాడాను. అయితే ద్రవం త్రాగడంవల్ల అలసటగావున్ననన్ను సులువుగా బంధించి తీసుకుపోయారు. మిగిలిన విషయం మీకు తెలిసిందే" అంటూ ముగించాడు అనిల్.

"అద్భుతంగా ఉంది. ఆ సమయంలో ప్రభ అక్కడ లేకపోవడమే మంచిదయింది. ఉండివుంటే ఆమెనీ బంధించేవారు. ఈ విషయం నాకు కాని, పోలీసులకు కాని తెలిసేది కాదు" అన్నాడు సాగర్.

"అవును ఆ మాట నిజం. సాయంత్రం ప్రమాదం జరగవచ్చునని ఊహించి కావాలనే నేను ప్రభను బయటకు పంపించాను" అన్నాడు అనిల్.

"మీ ముందు చూపు అద్భుతం. ఇంతటి ముందు చూపున్న మీరు మీ జీవిత భాగస్వామిని ఎందుకు ఎన్నుకోలేదు? అఫ్‌కోర్స్ దీసీజ్ యువర్ పర్సనల్ ఎఫేర్" అన్నాడు సాగర్.

"ఎన్నిక పూర్తి అయింది. మిస్ ప్రభ విల్ బి మై లైఫ్ పార్టనర్" అన్నాడు అనిల్ ప్రభ వంక ఓరగా చూస్తూ.

"ఓ. ఈజిట్. మై కంగ్రాట్స్ టు బోత్ ఆఫ్ యు" అన్నాడు సాగర్.

"కాని ఒక ఎమెండ్‌మెంట్" అంది ప్రభ.

ఇద్దరూ ప్రశ్నార్థకంగా చూశారు.

"ముందు మేము త్రాగిన ద్రవానికి విరుగుడు తీసుకోవాలి. ఒకరిమీద ఒకరికి ఎంత ప్రేమున్నా, కొంత కాలానికి ఆమోజు తగ్గి ఏదో సందర్భంలో ఒకరిమీద ఇంకొకరికి విసుగు, కోపం రావచ్చు. ఈ ద్రవం శరీరంలో వుంటే ఒకరి ఆలోచనలు ఇంకొకరికి ఎప్పుడూ తెలుస్తునే ఉంటాయి. అందువల్ల మంచికంటే చెడే ఎక్కువ జరుగుతుంది. మనసు మనం కావాలనుకున్నప్పుడు తెరుచుకోవాలేగాని, మిగిలిన సమయాల్లో మూసుకునే ఉండాలి'" అంది ప్రభ.

"వండర్‌ఫుల్ డాక్టర్ అనిల్ ప్రభకు మీకన్నా ముందుచూపు ఎక్కువ ఉంది" అన్నాడు సాగర్.

"మరి నా అసిస్టెంట్ అంటే ఏమనుకున్నారు! అందుకేగా అసిస్టెంట్ నుంచి లైఫ్ పార్టనర్‌గా ప్రమోట్ చేస్తోంది" అన్నాడు అనిల్ నవ్వుతూ.

"మరి దీనికి విరుగుడు ఉందా?" అన్నాడు సాగర్ అనుమానంగా.

"విరుగుడు కనుక్కోపోతే ఆ పరిశోధన పూర్తి కానట్లే లెక్క. విరుగుడు లేనప్పుడు దానిని ప్రయోగించడం కూడా జరగదు. దీనికి విరుగుడును ఎప్పుడో కనుగొన్నాను" అన్నాడు అనిల్.

"వెరీగుడ్. అయితే ఆలస్యం ఎందుకు ప్రభా... నీ చేత్తోనే ఆ విరుగుడిని నా సమక్షంలో అనిల్‌కిచ్చి నువ్వు కూడా పుచ్చుకో" అన్నాడు సాగర్.

'యస్. సర్' అంటూ లోనికి వెళ్ళింది ప్రభ.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, ఫిబ్రవరి 1990** ✪

# ప్రాణం వచ్చిన ప్రతిమ

**శే**ఖర్ చక్కని చిత్రకారుడు. అందమైన బొమ్మల్ని ఎందరో గీయగలరు. కాని శేఖర్ గీసిన చిత్రాలు చూస్తుంటే సజీవ వ్యక్తుల సన్నిధిలో ఉన్న అనుభూతి కలుగుతుంది. ఆ ఊరిలో స్థానిక ప్రముఖులు చిత్రశాల ఒకదానిని నిర్మించతల పెట్టారు. అందులో ఒక ప్రత్యేక విభాగంలో బౌద్ధ చిత్రకళను తెలిపే చిత్రాల ప్రతిరూపాలను నెలకొల్పాలని వారి సంకల్పం. ప్రముఖ చిత్రకారుడైన శేఖర్‌కి ఆ బాధ్యతలను అప్పగించారు వారు. స్వతహాగా బౌద్ధ చిత్రకళపట్ల ప్రత్యేక అభినివేశం గల శేఖర్ అందుకు మహదానందంగా ఒప్పుకున్నాడు.

అమరావతి, నాగార్జునకొండ వంటి ఆంధ్రదేశంలోని బౌద్ధక్షేత్రాలను దర్శించుకుని. బౌద్ధ చిత్రకళ, శిల్పకళలకు కాణాచి, వాటి ఉన్నత శిఖరాలకు దర్పణం అనదగ్గ అజంతా జేరుకున్నాడు శేఖర్.

ఆ గుహ మధ్య ధ్యానముద్రలో వున్న బుద్ధభగవానుని నిలువెత్తు విగ్రహం ఉంది. దానికి అటూ ఇటూ చిన్న చిన్న శిల్పాలున్నాయి. గైడ్ ఆ బుద్ధభగవానుని విగ్రహం మీద ఫ్లడ్‌లైట్‌ను ఫోకస్ చేశాడు.

"అయ్యా... అమ్మా... జాగ్రత్తగా చూడండి, ఈ విగ్రహ శిల్పంలో ఒక విశేషం ఉంది ఇప్పుడు చూడండి, మీకు ధ్యానముద్రలోనున్న బుద్ధభగవానుడు కనిపిస్తాడు. అవునా?" అంటూ సందర్శకుల ముఖాలవైపు చూశాడు.

బుద్ధభగవానుని ముఖంలో అనిర్వచనీయమైన ప్రశాంతత, అలౌకికమైన ఆనందం గోచరిస్తున్నాయి. ధ్యానముద్రలోనున్న భగవానుని చూస్తూనే అప్రయత్నంగా చేతులెత్తి నమస్కరించాడు శేఖర్.

అటు తర్వాత గైడ్ విగ్రహానికి ఎడమవైపుగా వెళ్ళాడు.

"జెంటిల్‌మన్. ఇటురండి. ఇక్కడనుండి భగవానుని విగ్రహాన్ని బాగా గమనించండి" అంటూ విగ్రహం ముఖంపై అటువైపు నుండి ఫోకస్ చేశాడు గైడ్.

విచిత్రం?! భగవానుని ముఖంలో ఏదో దిగులు, ఏమిటో ఆలోచిస్తున్న భావం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

"బుద్ధ భగవానుడు ప్రజల కష్టాలకు కరిగిపోయి దీనంగా ఉన్నాడు. చూశారా?" అన్నాడు గైడ్.



శేఖర్‌కి కలిగిన మనోభావాలను అతని మాటలు ధృవపరిచాయి.

ఈసారి కుడివైపుకు వచ్చాడు గైడ్.

''ఫ్రెండ్స్.. ఈసారి ఈ కుడివైపునుంచి చూడండి. శిల్పి చాతుర్యం ఎంత గొప్పదో గమనించండి' అంటూ ఆవైపునుంచి లైట్‌ను ఫోకస్ చేశాడు.

మహా విచిత్రం! అటువైపునుంచి చూస్తే భగవానుడు చిద్విలాసంగా చిరునవ్వు నవ్వుతూ. భావాతీతమైన కరుణాదృక్కులతో చూస్తున్నట్లుగా ఉంది.

''చూడండి. ప్రజలకు మార్గం చూపించగల దివ్యజ్ఞానాన్ని పొంది ఆనందంతో భగవానుడు ఎంత ప్రసన్నంగా, చిద్విలాసంగా ఉన్నాడో!'' అంటూ శిల్ప చాతుర్యం గురించి వివరిస్తూ అన్నాడు గైడ్.

ఆ అజ్ఞాత శిల్పి శిల్ప విజ్ఞానానికి అచ్చెరువొందుతూ ఆ బొమ్మ ముందు సజీవశిల్పాలలాగా, ఆ రాతి బొమ్మల మధ్య ప్రాణంగల బొమ్మలలాగా నిలబడి పోయారు సందర్శకులు.

''ఇటురండి. ఈ కుడ్య చిత్రాలలోని విశేషాలు చూద్దురుగాని'' అంటూ ముందుకు సాగాడు గైడ్. చేతిలో ఎలక్ట్రిక్ లైట్ ఉంచుకునే.

మౌనంగా అతనిని అనుసరించారు సందర్శకులు.

ఆ గోడమీద అద్భుతమైన వర్ణ సమ్మేళనంతో, బుద్ధుని జీవితంలోని కొన్ని ప్రధాన ఘట్టాలు ఒక

క్రమంలో చిత్రించబడి వున్నాయి. ఫ్లడ్‌లైట్ కాంతిలో అవి అద్భుతంగా కనిపిస్తున్నాయి. ఎక్కువ కాంతి లేనిదే ఏమీ కనిపించని ఆ చీకటి గుహలో ఆ అద్భుత శిల్పాలను ఎలా చెక్కారా, అచ్చెరువు గొల్పే ఆ చిత్తరువులను ఎలాగ గీశారా అని ఆశ్చర్యపోతూ వాటివంక చూడాసాగాడు శేఖర్.

ఒకచోట ఐదుచిత్రాలు ఒక క్రమంలో చిత్రించి ఉన్నాయి. మొదటి ఫలకంలో ఒక గున్న ఏనుగు వయసుమీరిన తల్లి ఏనుగుకు తండ్రి ఏనుగుకు సపర్యలు చేస్తోంది. కొంచెం దూరంలో వేటకు వచ్చిన ఒకరాజు, అతని పరివారం కనిపిస్తున్నారు.

రెండవ ఫలకంలో సైనికులు ఆ గున్న ఏనుగుని బంధించి రాజధానికి తీసుకుపోతున్నారు.

మూడవ ఫలకంలో తల్లిదండ్రులకు దూరమైన దిగులుతో ఆహారాన్ని ముట్టకుండా మొరాయిస్తున్న ఏనుగు, అహింసామార్గాన్ని బోధిస్తున్న భగవానుడు చిత్రించబడి ఉన్నాయి.

గౌతమబుద్ధుని బోధనల వల్ల ప్రభావితుడైన రాజు, ఆ గున్నను తిరిగి అడవికి పంపించివేయడం దానిని తల్లి ఏనుగు, తండ్రి ఏనుగు ఆప్యాయంగా స్పృశిస్తూండడం గీయబడివున్నాయి. నాలుగవ చిత్రంలో గున్న ఆగమనం మూలంగా అవ్యాజ్యానందాన్ని అనుభవిస్తున్న భావం, ఆనందభాష్పాలతో ఆ మూడింటి కన్నులు చెమ్మగిల్లడం అత్యద్భుతంగా రచించాడు చిత్రకారుడు.

ఐదవ చిత్రంలో బుద్ధుడు ముందుకి సాగుతుంటే, స్త్రీ పురుష వివక్ష లేకుండా అశేషజనవాహిని ఆయనను అనుసరిస్తుండడం చిత్రించి ఉంది.

ఆ చిత్రాలవంక పరిశీలనగా చూడసాగాడు శేఖర్. ఐదవ చిత్రంలోని ఒక అత్యంత సుందరమైన స్త్రీమూర్తి అతని దృష్టిని ఆకర్షించింది. ఆమె ఒక రాజకుమారిలాగా ఉంది. రాజభవనంలోని ఒక స్థంభానికి ఆనుకుని ఒక కాలు వెనక్కి మడిచి, ఆ జనంలో ఎవరి వంకనో విచారంగా చూస్తోంది. ఆమె ముఖంలో వ్యక్తం అవుతున్న దిగులు, ఆవేదన సజీవంగా చిత్రీకరించి ఉన్నాయి.

ఆమె ఎవరో.. ఏమో! ఆమె అనుభవిస్తున్న ఆవేదనను చూస్తుంటే హృదయంలో చేయిపెట్టి కెలికినట్లయింది శేఖర్‌కి. ఎవరో గుండెల్ని పిండి చేస్తున్నట్లనిపించింది.

ఈ ఐదు చిత్రాలలోని విశేషాలు చెప్పు గైడ్ కేవలం ఏనుగున్న కథ చెప్పి 'అహింసామార్గంలో ప్రజలు బుద్ధుని అనుసరించారు' అంటూ ముక్తసరిగా ముగించి మరో బ్యాచ్‌కి చెప్పడానికి వెళ్ళిపోయాడు. ఆ స్త్రీ మూర్తిని గురించి అడగాలని అనుకున్నాడే కాని శేఖర్‌కి ఆ అవకాశం లేకపోయింది. నిజానికి ఆమె ఎవరో, ఆమె కథ ఏమిటో అతనికి కూడా తెలిసి ఉండకపోవచ్చు. "ముఖ్యమైన విశేషమేమైనా ఉంటే అతను చెప్పి ఉండకపోతాడా!" అనుకుంటూ ఆ గుహనుంచి బయటకు వచ్చాడు శేఖర్, ఆ స్త్రీ మూర్తిని గురించిన ఆలోచనలే అతనిని వెంటాడసాగాయి. అతని మనస్సులో మెదులుతున్నది. చిత్రకారుని చాతుర్యం కాదు. జీవకళ ఉట్టిపడుతున్న ఆ స్త్రీ మూర్తి చెప్పుకోలేని ఆవేదనతో అక్కడ నిలబడ్డట్లనిపిస్తోంది. ఆమె దిగులు ఏమిటో కాని శేఖర్ సున్నితహృదయాన్ని కలచివేసింది. ఇంక ఇతర విశేషాలేవీ చూడాలని అనిపించలేదు. ఆమెని గురించే ఆలోచిస్తూ గుహ బయట ఒక బండమీద కూర్చుండిపోయాడు. కళ్ళు మూసుకుని నుదురు నులుముకుంటూ దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

ఘల్లుఘల్లున కింకిణీస్వరాలు వినిపిస్తున్నాయి ఆ శబ్దం అంతకంతకు దగ్గర కాసాగింది.

ఆలోచలను ఆపి అటువైపు చూశాడు శేఖర్.

ఆశ్చర్యం!

ఎవరిని గురించి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నాడో ఆ స్త్రీ మూర్తి, అతనివైపే నడిచివస్తోంది.

నిశ్చేష్టుడై ఆమెవంకే చూడసాగాడు శేఖర్.

ఆమె నెమ్మదిగా వచ్చి శేఖర్ ముందు నిలబడింది. కొంచెం తేరుకుని "మీరు... మీరు ఎవరు?" తడబడుతూ అడిగాడు శేఖర్.

"ఆ....నేనే..." అంది ఆమె.

"ఆ చిత్రంలో..."

"....ఉన్నది నేనే."

"అదెలా సాధ్యం? బొమ్మకి ప్రాణం వస్తుందా?"

"ఏం ఎందుకు రాకూడదు? ఒక చిత్రకారుడు తన మనసంతా నిలిపి నా చిత్రాన్ని రచించి అందులో జీవకళ నింపాడు. మరొక చిత్రకారుడు సర్వాన్నీ మరిచి నా గురించే ఆలోచిస్తూ తన మనసుతో నన్నిక్కడకు లాక్కునివచ్చాడు" అంది ఆమె చిరునవ్వు నవ్వుతూ అయితే ఆ చిరునవ్వు ఆమె ముఖంలో అలముకొన్న దిగులను మాత్రం దూరం చేయలేకపోయింది.

ఏమి అనాలో అర్థంకాక "నువ్వెవరు?" అని నువ్వు అన్నందుకే నాలుక కరుచుకొని "మీరెవరు?" అన్నాడు శేఖర్.

"పర్వాలేదు" ఆత్మీయులైన మీరు నన్ను "నువ్వు" అనొచ్చు. అలా అంటేనే నాకు తృప్తిగా ఉంటుంది" అంది ఆమె.

"సరే మీరెవరో, మీ కథ ఏమిటో చెప్తారా?" అన్నాడు శేఖర్ మళ్ళీ మీరంటూ ఆమె నిర్లిప్తంగా నవ్వి "చెప్తాను. శతాబ్దాలనుంచీ, సహస్రాబ్దాలనుంచీ గుండెలో గూడుకట్టుకుని ఉన్న ఈ దిగులును ఆత్మీయులతో కాక ఇంకెవరితో చెప్పుకుంటాను?

-ఇది వేల సంవత్సరాలనాటి మాట. ఆంధ్రదేశంలోని దక్షిణ చాళుక్యుల రాకుమారుని నేను. నా పేరు మణిమేఖల. నా తండ్రి నిజయాదిత్యుడు. ఎంతో కీర్తి ప్రతిష్టలు గడించిన వంశం మాది. మా నాన్నగారు పేరు ప్రఖ్యాతులు తెలిపి, మా రాజ్యంగుండా వెళ్ళే రాజులు, రాకుమారులు ఆయన దర్శనం చేసుకొని సత్కారాలు పొంది మరీ వెళ్ళేవారు.

ఒకరోజున ఉత్తరదేశంనుంచి మగధ రాజకుమారుడు విక్రముడు దేశాటనం చేస్తూ మా రాజ్యానికి వచ్చాడు. మంది మార్బలంతో అట్టహాసంగా వస్తున్న అతనిని రాజభవనం పై అంస్థులోని గవాక్షంలో నిలబడి చూశాను. శ్వేతాశ్వంపై మధ్యందిన మార్తాండునిలా వెలిగిపోతూ ఉన్నాడతను. అతనివంక నేను చూసిన సమయానికే అతనూ నా వంక చూశాడు. మా ఇద్దరి చూపులూ కలిశాయి. మొదటి చూపులోనే

అతనికి నా మనసుని అర్పించేశాను. అతనికి కూడా నాపై మనసు కలిగిన విషయం తెలుసుకుని మా తండ్రిగారు కూడా ఎంతో సంతోషించారు. ఆ తర్వాత పెద్దలు సంప్రదించుకుని మా వివాహం ఖాయపరిచారు. వారి ఆచారం ప్రకారం, ఆడ పెళ్ళివారమైనా మేమందరం మగధరాజ్యానికి తరలివెళ్ళాం.

మాకు విడిదిగా చక్కని రాజభవనాన్ని ఇచ్చారు. సకల సౌకర్యాలూ కల్పించి సమస్త మర్యాదలూ చేశారు.

పెళ్ళికి ఇంక మూడు రోజులే వ్యవధి ఉంది. ఊరంతా రంగరంగ వైభోగంగా అలంకరించారు. ఇంతలో బుద్ధ భగవానుడు ప్రజలను ప్రబోధిస్తూ ఆ నగరానికి వస్తున్న వార్త తెలిసింది. మా వివాహ సమయంలో ఆ భగవత్ స్వరూపుడు వస్తున్నందున అందరం ఎంతో ఆనందించాం. ఆ మహామనీషి ఆశిస్సులతో మా దాంపత్యం పది కాలాలు పచ్చగా ఉంటుందని ఆశించాం.

అయితే వరం అవుతుందనుకున్న ఆ మహామనీషి రాకే నాకు శాపం అవుతుందనుకోలేదు. మర్నాడు వివాహం అనగా భగవానుడు నగర ప్రవేశం చేశాడు. ఆయనలో ఏమి ఆకర్షణ ఉందో ఏమో నగరం నగరం ఆయన వెంట కదిలింది. వీధిలో కలకలం విని గవాక్షంలో నిలబడి చూడసాగాను. భగవానుడు ముందు నడుస్తుంటే "సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి" అంటూ జనం ప్రవాహంలాగా వెనక వెళ్ళసాగారు.

జనం మధ్యలోనున్న ఒక వ్యక్తిని చూసి నేను కొయ్యబారిపోయాను. ఆతడెవరోకాదు. ముండనం చేయించుకొని కాషయాంబరాలు ధరించి సన్యాసం స్వీకరించి, స్వామి వెంట వెళ్ళిపోతున్న విక్రముడు.

ఆ దృశ్యం చూసి నానోట మాట రాలేదు. అతడూ నావంక చూశాడు. రెండు చేతులు ఎత్తి నాకు నమస్కరించి, సెలవు తీసుకుంటున్నట్లుగా సాగిపోయాడు. ప్రాపంచిక బంధాలు తెంచుకొని తాను వెళ్ళిపోయినా నాకు మాత్రం శాశ్వతంగా విషాదమే మిగిలిపోయింది. అప్పటినుంచి దిగులుతో, అతడు వెళ్ళినవంకే చూస్తూ ఇలా శిలగా మారి నిలిచిపోయాను" అంటూ తన కథను ముగించింది మణిమేఖల.

"అరె...ఎంతటి విషాదగాథ! మరి ఎన్నాళ్ళీ తపస్సు?" అన్నాడు శేఖర్.

"నేను...పొరపాటు చేశాను. వారిని అనుసరించి నేను కూడా సన్యాసిని కావలసింది. ప్రజల దైన్యం చూసి చలించిపోయే భగవానుడు నా ఆవేదనను చూసి తానూ దిగులుపడుతున్నాడు. ఏవో దైన్యదృక్కులు ప్రసరిస్తున్నాడు. ఆయన చిరునవ్వుతో ప్రసన్న దృక్కులతో నన్నొక్కసారి కరుణిస్తే చాలు. ఈ భవబంధాలు తెంచుకుని నేను వారు ఎక్కడున్నా వెళ్ళివారి శిష్యురాలిని అవుతాను" అంది ఆమె.

"భగవానుడు ఎప్పుడూ కరుణామయుడు. నా వెంటరా ఆయన ప్రసన్న దృక్కులను నీకు చూపిస్తాను" అంటూ లేచి గుహలోని బుద్ధవిగ్రహంవైపు నడవసాగాడు శేఖర్.

ఆమె శేఖర్‌ని అనుసరించింది.

విగ్రహం కుడివైపునకు రాగానే "స్వామిని చూడు. ఎంత ప్రసన్నంగా ఉన్నాడో?" అంటూ చూపించాడు శేఖర్.

"నిజం... స్వామి నన్ను కరుణించాడు. ఈనాటితో నా కర్మ పరిపక్వం అయింది" అంటూ భగవానుని

ముందు మోకరిల్లింది మణిమేఖల.

"సార్..అందరూ తిరిగి వెళ్ళిపోతున్నారు. ఇంకా ఇక్కడే ఉన్నారేమిటి?" అంటూ గైడ్ భుజంతట్టి లేపేసరికి ఈ లోకంలోకి వచ్చాడు శేఖర్.

"పదండి. బస్ బయలుదేరే టైం అయింది" అంటూ ముందుకు నడిచాడు గైడ్.

"ఇప్పుడే వస్తున్నాను" అంటూ చకచకా గుహలోకి వెళ్ళాడు శేఖర్.

సిగరెట్ లైటర్ వెలిగించి చిత్రంవంక చూశాడు శేఖర్.

ఆశ్చర్యం! ఈసారి మణిమేఖల ముఖంలో దైన్యం లేదు.

అనిర్వచనీయమైన తృప్తి కనిపిస్తోంది.

బుద్ధభగవానుని విగ్రహం వైపు చూశాడు.

స్వామి ముఖంలో దిగులు లేదు.

తాను కాంచింది కలో, చూస్తున్నది భ్రమో తెలియక నుంచుండిపోయాడు. చిత్రం! ఆ శిల్పం చూసి తన మనసే ఆ కథను అల్లుకోలేదుకదా అని ఆశ్చర్యపోయాడు శేఖర్.

క్రింద బస్ హారన్ వినిపించేసరికి చివరిసారిగా మణిమేఖల చిత్రంవైపు చూసి భారంగా బయటికి వెళ్ళాడు శేఖర్.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జూన్ 1990** ✪

# నలభై ఎనిమిది గంటలు

"ఏమోయ్.... నీకో గుడ్‌న్యూస్....." అంటూ వచ్చాడు ప్రకాశం.

"ఏమిటది?" అంది నిర్మల ఉత్సాహంగా.

"అనిల్ కూడా రానీ....ఒకేసారి చెప్తా" అంటూ ఊరించాడు ప్రకాశం.

"ఇక్కడే ఉన్నాను నాన్నగారు" అంటూ గదిలోంచి వచ్చాడు అనిల్.

"ఇంక మీ సస్పెన్స్ ఆపి సంగతేమిటో చెప్పండి" అంది నిర్మల.

"ఆఫీషియల్ డ్యూటీమీద పదిరోజులు అండమాన్స్‌కి వెళ్తున్నానోయ్"

"అండమాన్సా! అజన్మఖైదీలను అండమాన్స్‌కి పంపుతుండేవారట వెనకటి రోజుల్లో. అక్కడికి వెళ్లడం మీకు గుడ్ న్యూసా... భలేవారే" అంది నిర్మల నిరుత్సాహంగా.

"అదంతా స్వాతంత్ర్యం రాకపూర్వం నాటిమాట. ఈనాడు అండమాన్స్ గొప్పపిక్నిక్ స్పాట్. అంతేకాదు. ఆనాడు లోకమాన్య తిలక్, వీర్‌సావర్కర్ వంటి మహనీయులను ఉంచిన జైలు కూడా పవిత్రమైన యాత్రాస్థలమే"

"నాన్నగారు....అండమాన్ నికోబార్ దీవులు చాలా అందంగా ఉంటాయట కదా అన్ని వైపులా సముద్రం ఎటు చూసినా కొబ్బరి చెట్లు, రబ్బరుచెట్లు, టేకు చెట్లు ఉండి ఎంతో అందంగా ఉంటాయటకదా!"

"నిజమే. అయితే ఇదంతా జనవాసాలలో సేద్యం చేస్తుండే చోట. అసలు నరమానవుడంటూ లేని ద్వీపాలు కొన్ని వందలున్నాయి. వాటిమీద దట్టమైన అడవులు-కాలుపెట్టడానికే కష్టంగా ఉంటుంది. కొన్ని ద్వీపాలలో ఇప్పటికీ అసలు నాగరికత ఏ మాత్రం తెలియని ఆదిమజాతులవారున్నారు. ఇతర జాతుల మనుష్యులు కంటబడితే వారిని ప్రాణాలతో వదిలిపెట్టరు. మరికొన్ని ఆదిమ జాతులవారు నరమాంస భక్షకులు కూడాను"

"అఘోరించినట్లుంది. ఇటువంటి చోటికి వెళ్ళడం గుడ్‌న్యూసా?" అంది నిర్మల మళ్లీ విసుగుపడుతూ



"నేను చెప్పినవన్నీ జనవాసాలు లేకుండా దట్టమైన అడవుల మధ్యనవుండే వాటిని గురించి. ఇప్పుడు అండమాన్స్‌లో మన తెలుగువారితో సహా లక్షల మంది భారతీయులు ఉన్నారు. పిక్నిక్ పెట్టుకుంటే ప్రకృతి సౌందర్యం పరవళ్ళు తొక్కే అటువంటి చోటికే పెట్టుకోవాలి. "అందువల్ల మనందరం అక్కడికి పోదాం"

"అంతదూరం వెళ్ళాలంటే బోలెడు ఖర్చుకాదూ?" అంది నిర్మల.

"వెళ్ళి రావడానికి వారం పదిరోజులు పడ్తుంది కదా! మరి నా స్కూల్ పోదూ?" అన్నాడు అనిల్ దిగులుగా.

""నేనిలాగూ అఫీషియల్ డ్యూటీమీద వెళ్తున్నాను. మీ ఇద్దర్నీ ఎల్.టి.సి. మీద తీసుకువెళ్తాను. దీంతో ప్రయాణఖర్చులు కలిసివస్తాయి. పైఖర్చులు ఎక్కడికిపోయినా తప్పవు."

"మరి..."

"ఆ...ఆ...నీ స్కూల్ సంగతే చెప్పబోతున్నాను. వెళ్ళేటప్పుడు విమానంలో వెళ్దాం. వచ్చేటప్పుడు ఓడలో వద్దాం. రెండూ చూసినట్లుంటుంది. నీకెలాగూ దసరా సెలవులే కదా... మహా అయితే మరో నాలుగైదు రోజులు సెలవు పెడ్తువుగాని.

"కాని ఇంకా వర్షాకాలం పోలేదు. వెళ్ళిందగ్గర్నుంచి వచ్చేవాన, పోయేవానగా ఉందంటే పిక్నిక్‌కి వెళ్ళిన తృప్తి ఉండదు" అంది నిర్మల.

''నువ్వన్నది నిజమేకాని ప్రకృతి అందాలు చూడాలంటే వర్షాకాలంలోనే చూడాలి. ఎటుచూసినా పచ్చదనం - పొంగి పొరలే సెలయేర్లు, ఎగసిపడే సముద్రం - పిక్నిక్‌ని పూర్తిగా ఎంజాయ్ చేయాలంటే ఇటువంటప్పుడే వెళ్లాలి. ఇక వానలంటావా? అవి అడపాతడపా కురుస్తూనే ఉంటాయనుకో. ఎడతెరిపి లేకుండా కాదుగా! ఇంక అనుమానాలు పెట్టుకోకుండా ప్రయాణానికి సిద్ధంకా. ఇంక వారమే ఉంది'' అన్నాడు ప్రకాశం.

* * * *

విమానం మద్రాసులో బయలుదేరి అండమాన్స్ ముఖ్యపట్టణమైన పోర్ట్‌బ్లయర్ జేరింది. విమానం కొంతదూరం వెళ్ళాక ఎటుచూసినా సముద్రమే తప్ప భూమి అంటూ కనిపించలేదు. ఒకప్రక్కన చెప్పలేని ఆనందం. మరో ప్రక్కన చెప్పుకోలేని భయం - అంతా థ్రిల్లింగ్‌గా ఉంది.

మన నగరాలతో పోలిస్తే పోర్ట్‌బ్లయర్ చిన్న పట్టణమే. అండమాన్స్‌ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో ప్రభుత్వం అక్కడికి వలసపోదలచుకున్న వారికి భూముల్ని, నివాసస్థలాన్ని ఇచ్చి అనేక సదుపాయాలు కల్పించింది. దాంతో భారతదేశంలోని అనేకమంది ప్రజలు ముఖ్యంగా దక్షిణాదివారు, బెంగాలీలు, బీహారీలు అక్కడికి వలసపోయారు. ఫలితంగా అది మినీ ఇండియావలె తయారయింది.

అయితే అందరికీ కామన్ భాష ఒకటి ఉండాలి కనుక హిందీ, ఇంగ్లీష్ బయట వినిపించే భాషలయ్యాయి. ఆ తర్వాత ఎక్కువగా వినిపించేవి బెంగాలీ, తమిళం తెలుగు, మళయాళ భాషలు. అక్కడివారు భారతీయులే అయినా మెయిన్‌లాండ్ నుంచి వందలమైళ్ళ దూరాన, అది కూడా సముద్రానికి ఆవల ఉండడంతో వేరే దేశంలో ఉన్నట్లే అనిపిస్తుంది.

వెళ్ళినరోజు కొంత విశ్రాంతి తీసుకుని ఊరిలో తిరగడానికి బయలుదేరారు ప్రకాశం, నిర్మల, అనిల్‌లు. మర్నాడు కూడా పోర్టుబ్లయర్, అక్కడ చూడవలసిన విశేషాలు చూడడంతో సరిపోయింది. మూడోరోజున ముగ్గురూ నికోబార్ దీవికి ముఖ్యపట్టణమైన కార్‌నికోబార్‌కి వెళ్ళారు.

నికోబార్ చాలా అందమైన ద్వీపం. దానికి సమీపంలో కొన్నివందల చిన్న చిన్న ద్వీపాలున్నాయి. వాటిలో అత్యధికమైన వాటిలో జనసమూహం లేదు. అయితే కొన్నింటికి కార్‌నికోబార్ నుంచి మోటార్ బోటులో సరదాగా వెళ్ళిరాగల సదుపాయం ఉంది. డ్రైవింగ్ తెలిసిన వాళ్ళయితే తగిన రుసుము చెల్లించి సొంతంగా నడుపుకుంటూ వెళ్ళి రావచ్చు.

ప్రకాశానికి మోటార్ బోట్‌డ్రైవింగ్ వచ్చు. మొదట్లో అతను ఉద్యోగం చేసింది నేవీలోనే. ఆ తర్వాత అందులో రిటైర్మెంట్ తీసుకొని ఒక మంచి ప్రయివేట్ కంపెనీలో ఆకర్షణీయమైన ఆఫర్‌వస్తే అందులో రీజినల్ మేనేజర్‌గా జేరాడు.

ప్రకాశం తన ఐడెంటిటీ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు మొదలైనవి చూపించి రుసుము చెల్లించి ఒక మోటారు బోటును అద్దెకు తీసుకున్నాడు.

అప్పటికి ప్రొద్దున తొమ్మిదిగంటలయింది. సాయంత్రానికల్లా తిరిగి వచ్చేయాలి. వెళ్ళవలసిన మార్గం, దూరం ముందే నిర్దేశించబడి వుంటాయి కనుక గస్తీ పడవలు, ఇటువంటి అద్దె పడవలన్నింటినీ ఓ కంట కనిపెడుతూనే ఉంటాయి.

* * * *

కమ్ముకోసాగాయి.

"ఏమండి గాలి వచ్చేటట్లుంది. తిరిగి వెళ్ళిపోదాం పదండి" అంది నిర్మల ఆందోళనగా.

అనిల్‌కి ఒక ప్రక్కన భయం వేస్తున్నా, ఆ వింత అనుభవం ఆసక్తిని కల్పిస్తోంది.

"అవును నిజమే వెళ్ళిపోదాం " అంటూ మోటారు బోటును వెనక్కి తిప్పాడు ప్రకాశం. అది వాలుగాలి కావడంతో మోటారు బోటు మరింత వేగంగా దూసుకుపోసాగింది. ఒక్కొక్కసారి ఆ వేగానికి నీటిమీద లేడిలా ఎగిరి ముందుకు పడుతోంది. ఆ గాలి జోరుకి బోటును కంట్రోలు చేయడం కష్టమవుతోంది.

మరికొంచెం సేపట్లోనే జోరున కుండపోతగా వర్షం ప్రారంభమైంది. దానికితోడు భయంకరంగా శబ్దం చేస్తూ సుళ్ళుసుళ్ళుగా తిరుగుతున్న పెనుగాలి. దానిమూలంగా ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలమీద ఎగిరెగిరి పడుతూ గుండ్రంగా గిరికీలు కొట్టడం మొదలుపెట్టింది మోటారు బోటు.

ఆ ముగ్గురికీ ప్రాణాలమీద ఆశపోయింది ఏరికోరి మృత్యువు పిలిస్తే వెతుక్కుంటూ ఈ అండమాన్స్‌లో దిక్కుమాలిన చావు చావడానికి వచ్చినట్లు అనిపించింది. కానీ కంగారుపడిపోతే బోటు నడపడం మరింత కష్టం అవుతుందని, లోపల ఎంత ఆందోళనగా వున్నా పైకి కనిపించనీయక, గోలచేయక అత్యంత సంయమనాన్ని ప్రదర్శించారు నిర్మల, అనిల్.

ప్రకాశం గంభీరంగా, ఏమీ మాట్లాడకుండా దృష్టినంతా బోటుమీదనే కేంద్రీకరించి నడుపసాగాడు. మరికొంచెం సేపట్లో కొంతదూరంలో ఒకద్వీపం, దానిమధ్య నుంచి పొడుచుకొచ్చిన ఒక కొండా కురుస్తున్న వానలోంచి మసక మసకగా కనిపిస్తున్నాయి. అల్లంత దూరంలో నేల కనిపించడంతో ప్రాణం లేచివచ్చినట్లయింది. ముందుగా అక్కడికి జేరుకుంటే ప్రాణాలు నిలబడతాయి. ఆ తర్వాత సంగతి తర్వాత చూసుకోవచ్చు.

అతి కష్టంమీద ఆ ద్వీపం వైపు బోటును మరల్చాడు ప్రకాశం. వాలుగాలి జోరుగా వీస్తుండడంతో రివ్వున వెళ్ళిపోతోంది బోటు. కొంచెం సేపట్లో వెనకవైపునుంచి సరుకుచెట్లు నుంచి ఈలవేస్తున్నట్లు శబ్దం రాసాగింది. అది అంతకంతకూ ఎక్కువ కాసాగింది.

ఆ శబ్దంతోపాటు సముద్రంలో ఏదో అల్లకల్లోలం అయినట్లుగా ఉన్నట్లుండి ఒక పదిమీటర్ల ఎత్తుగల అల ప్రచండవేగంతో నెట్టుకువచ్చింది. ఆ అలవచ్చి విరుచుకుపడడంతో బోటుమీద కంట్రోలు తప్పిపోయింది. అసలు ఏమిజరిగిందో అర్థం అయ్యేలోపలే అమిత వేగంతో వచ్చిన అలతో కొట్టుకు పోయింది బోటు.

అలా ఆ మహా అలతోపాటు అమితవేగంగా వెళ్ళిన ఆ బోటు ఎదురుగుండా ద్వీపం మీదనున్న కొండకి బలంగా గుద్దుకుంది అంతే. మరు క్షణంలో తునాతునకలై పోయింది.

* * * *

కళ్ళు తెరిచి చూసేసరికి నీటిమీద తేలియాడుతున్నట్లనిపించింది అనిల్‌కి. ఎండకి ఒళ్ళు చిటచిటలాడుతోంది. ఎటు చూసినా సముద్రం.

అంతకుముందు ఎంతో అల్లకల్లోలంగా ఉండిన ఆ సముద్రం ఏమీ ఎరగనట్లు మామూలు అలలు తప్ప ప్రశాంతంగా ఉంది.

అసలు ఏమి జరిగిందీ అర్థం కాలేదు అనిల్‌కి. తాను ఎక్కడ ఉన్నదీ తెలియలేదు. తాము వెళ్తుండిన మోటారు బోటు పగిలిపోవడం గుర్తుకి వచ్చింది. అమ్మా, నాన్న జ్ఞాపకం వచ్చేసరికి భయంతో వళ్ళు బిగుసుకుపోయింది.

బిగ్గరగా "అమ్మా...... నాన్నా ...." అని అరిచాడు. ఆ అరుపులు గాలిలోనే కలిసిపోయాయి. కట్టలు తెంచుకున్నట్లు ఏడుపురాసాగింది. కష్టంమీద ఆపుకున్నాడు.

అసలు తాను ఎక్కడ ఉన్నానా అన్న ఆలోచన వచ్చింది అతనికి. ఎటు చూసినా నీళ్ళే. మరి ఆ నీటిమీద తాను ఎలా ఉండగలిగినా అన్న అనుమానం వచ్చింది. మెడప్రక్కకు వంచి చూశాడు. ఏదో పెద్ద బల్లవంటి దానిమీద పడుకుని ఉన్నట్లనిపించింది. అది విరిగిపోయిన తమ మోటారు బోటులోని ఒక చెక్క కాదుకదా!

ఉన్నట్లుండి ఆ చెక్క పైకి లేస్తున్నట్లనిపించింది.

అది చెక్క కాదు. బ్రహ్మాండమైన తిమింగలం!

అది పైకిలేచి పిచికారిలోనుంచి నీటిని వదిలినట్లు పెద్ద శబ్దం చేస్తూ నోటితో నీటిని వదిలింది. ఆ తర్వాత మళ్ళీ దేహంపైభాగం ఇంచుమించు నీటి మట్టానికి సమంగా ఉండేటట్లుగా కిందికి వెళ్ళింది.

అంటే తాను అంతసేపూ ఉన్నది తిమింగలం వీపు మీదనన్నమాట! ఆ వాస్తవం గుర్తించగానే భయంతో రక్తం గడ్డకట్టుకుపోయింది అనిల్‌కి. బిగ్గరగా అరవాలనుకున్నాడు. కాని భయంతో నోరు పెగల్లేదు. కాళ్ళూ చేతులూ ఆచేతనమైపోయాయి. ఏం చేయాలో తోచలేదు.

కొంచెం సేపటికి కొంతదూరంలో నీటిమీద నురగలు నురగలు ఉన్నట్లుగా కనిపించింది.

తిమింగలం ఆ నురుగులవైపు దూసుకుపోసాగింది.

దాంతో ఆ నురుగులలో కల్లోలం వచ్చి అలజడి ప్రారంభమైంది.

తిమింగలం మహావేగంతో అటు వెళ్ళసాగింది.

మరికొంతదూరం వెళ్ళేసరికి ఆ నురగలు ఏమిటో అర్థం అయింది అతనికి.

అవన్నీ పెద్దపెద్ద నీటి తాబేళ్ళు. ఒక్కొక్కటి సుమారు నాలుగడుగులు కైవారం కలిగి ఉండ వాటిని స్వాహా చేయడానికే తిమింగలం వెళ్తోంది.

ఏమి చెయ్యాలా అని అనిల్ ఆలోచిస్తుండగానే ఒక పెద్ద తాబేలును చటుక్కున నోటకరుచుకుంది తిమింగలం. ఆ అదను చూసి తన ప్రక్కనుంచే వెళ్తున్న ఒక పెద్ద తాబేలు మీదకి జరిగిపోయి దానిని గట్టిగా పట్టుకున్నాడు అనిల్.

ఈ హఠాత్సంఘటనకు తాబేలు బెదిరింది. తిమింగలానికి దూరంగా వేగంగా వెళ్ళిపోసాగింది.

సముద్రతాబేళ్ళు నీటిలో ఎక్కువ దూరం-పోవట! అవి ఉన్నాయంటే తీరం సమీపంలోనే ఉంది

అని అర్థం. ఎప్పుడో ఏదో పుస్తకంలో చదివిన విషయం గుర్తుకువచ్చింది అనిల్‌కి. కొంచెం సేపట్లో అతను ఊహించినట్లుగానే కొంచెం దూరంలోనే ఒక ద్వీపం కనిపించసాగింది. దానిమీద కొండలులేవు. అందువల్లనే బాగా దగ్గరికి వస్తేనేకాని కనిపించలేదు.

తీరం దగ్గరికి రాగానే అనిల్ తాబేలును వదిలి నీటిలోకి దూకి ఈదుకుంటూ ఒడ్డుకు వెళ్ళిపోయాడు. ఒడ్డు చేరాక భయంతో ఏకబిగిన పరుగెత్తి అలసట వచ్చాక ఆగిపోయాడు.

అప్పటివరకు ప్రాణభయం. ఇప్పుడు ఆ భయం పోయాక ఎక్కడలేని నీరసం అలముకుంది. ఆకలి పట్టి పీడించసాగింది. అమ్మా నాన్నా మళ్ళీ జ్ఞాపకానికి వచ్చారు. వాళ్ళు ఏమయ్యారో ఏమో! సముద్రానికి ఎలి అయిపోయారో లేదా తనలాగే ఎక్కడికైనా కొట్టుకుపోయారో! ఇద్దరూ కలిసే ఉన్నారో ఎవరికివారు విడిపోయారో! అన్నీ ప్రశ్నలే. దేనికీ సమాధానం దొరకదు.

బిగ్గరగా ఏడవాలనిపించింది అనిల్‌కి. కాని అండమాన్స్‌లోని కొన్ని ద్వీపాలలో ఆదిమజాతులు, నరమాంసభక్షకులు ఉంటారని నాన్నగారు చెప్పిన విషయం గుర్తుకి వచ్చింది. అందువల్ల తాను నోరు మెదపకూడదు. జాగ్రత్తగా సంచరిస్తూ అక్కడ ఎవరైనా ఉన్నారో లేదో తెలుసుకోవాలి. ఆ తర్వాత తాను అక్కడ చిక్కుకుపోయిన సంగతిని ఎలాగైనా బయటి ప్రపంచానికి తెలియజేయాలి. ఆ ద్వీపం మీద ఆహారం ఏమైనా దొరికితే తిని ఆకలిని తీర్చుకోవాలి.

ఓపికను కూడగట్టుకని లేచాడు అనిల్. నెమ్మదిగా ఆ ద్వీపం మీద తిరగడం మొదలుపెట్టాడు.

అది చాలా చిన్నద్వీపం. అయితే అదృష్టవశాత్తూ దానిమీద కొబ్బరిచెట్లున్నాయి. అవి కూడా పొట్టిరకాలు. కాయలు చేతికి అందేటంత ఎత్తులో ఉన్నాయి. రెండు కొబ్బరికాయలు కోసుకున్నాడు. వాటిని కొండరాళ్ళకేసి కొట్టాడు. అవిలేతకాయలు కావడంతో తేలిగ్గానే పగిలాయి. ఆ నీళ్ళు తాగి , లేతకొబ్బరితిన్నాడు. ఆకలి, దాహం తీరడంతోప్రాణం లేచినట్లయింది.

చేతికున్న వాచీ చూసుకున్నాడు అనిల్. అదిఆటోమేటిక్ వాచ్ కావడంత ఆగిపోకుండా టైం చూపిస్తోంది. తారీఖు ముల్లు 12 మీద ఉంది. తాము బోట్‌లో పిక్నిక్‌కి బయలుదేరింది 11న. అంటే క్రిందటి రోజున. సమయం 10గంటలు చూపిస్తోంది. అంటే సుమారు ఒకరోజుపాటు అచేతనంగా సముద్రంలో కొట్టుకు వచ్చాడన్న మాట. మరి తిమింగలం వీపుమీదికి ఎలా జేరినట్టు?

ఏమో! మనుష్యులను తినివేసే తిమింగలం తన ప్రాణాలను కాపాడడం ఎంత విచిత్రం ! అంతా భగవంతుని దయ కాకపోతే నడి సముద్రంలో పడిపోయిన తాను బ్రతికి బయటపడ్డమేమిటి! అమ్మా నాన్నా కూడా ఇలాగే బ్రతికి బయటపడితే ఎంత బాగుంటుంది! అంతేకాదు తాను వాళ్లను కలుసుకోవాలి ఎలా? ఎక్కడ?

నెమ్మదిగా లేచి ఆ ద్వీపం మీద జాగ్రత్తగా తిరగసాగాడు అనిల్. అది చాలా చిన్నదీవి. దాని వైశాల్యం గట్టిగా నాలుగు కిలోమీటర్లు కూడా ఉండదు. దానిమీద ఎవరూ ఉన్నట్లు లేదు.

అయితే అక్కడక్కడ కొట్టి పడవేసిన కొబ్బరికాయలు ఉన్నాయి. అవతలివైపు తీరంమీద కొన్ని ఖాళీ విస్కీ సీసాలు కనిపించాయి. అంటే అప్పుడప్పుడు అక్కడికి ఎవరైనా వస్తుంటారన్నమాట. వాళ్లుచేపల పడవలవాళ్లో, పిక్నిక్‌కి వచ్చేవారో ఎవరైనా కావచ్చుననిపించింది అనిల్‌కి. ఈ లెక్కన అదృష్టం బాగుంటే

ఎవరైనా త్వరలోనే వచ్చి తన ప్రాణాలు కాపాడవచ్చు. తాను బ్రతికి బట్టకట్టే యోగం ఉంది కనుకనే ఇప్పటి వరకూ బ్రతికాడో యేమో!

ద్వీపానికి మరోవైపున కొంచెం దట్టంగా చెట్లు ఉన్నాయి. అక్కడికి వెళ్ళాడు అనిల్. చెట్ల అవతల ఏవో మాటలు - ఏదో అలికిడి అవుతున్నట్లు అనిపించింది. వాళ్ళు మామూలు మనుషులో-నరమాంస భక్షకులో-ఆ విషయం తెలుసుకోందే ముందుకి వెళ్లడం మంచిదికాదు. జాగ్రత్తగా నేలమీద బల్లిలా పాకుతూ ముందుకి వెళ్లాడు అనిల్. నెమ్మదిగా వెళ్లి ఒక పెద్ద చెట్టు వెనకాల నక్కాడు.

అవతలివైపున నలుగురు మనుష్యులు తీరం మీదికి ఏవో పెట్టెలు దించుతున్నారు.

కొంచెం దూరంలోనే ఒక ట్రాలర్ కన్పిస్తోంది. వారు దానిలోనే వచ్చారన్నమాట.

చెట్టు చాటునుంచి వాళ్ళని జ్ఞాత్తగా గమనించసాగాడు అనిల్.

మంచి దుస్తుల్లో వున్న ఇద్దరు ఆ పెట్టెల్ని తెరిపిస్తున్నారు. ఒక దాంట్లో తెల్లని పొడివున్న ప్లాస్టిక్ పాకెట్లు ఉన్నాయి. మరో దాంట్లో బంగారు కడ్డీలు, బిస్కట్లు ఉన్నాయి. పేపర్లలో చదవడం, టి.వి.లో చూడడం వల్ల ఆ పొడి హెరాయిన్ అని ఇట్టే అర్థమయిపోయింది. అనిల్‌కి. వీళ్ళంతా స్మగ్లర్స్. ఈ దీవిని తమ దొంగ కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారన్నమాట. తను అంతకుముందు చూసిన విస్కీ సీసాలు వీళ్ళో, వీళ్లలాంటి వాళ్లో ఉపయోగించినవై ఉంటాయి. తాను వీళ్ల కంటపడితే ప్రమాదం.

కొంచెం సేపట్లోనే వాళ్లు సరుకుని సర్దుకుని తాము వచ్చిన ట్రాలర్‌లోనే వెళ్లిపోయారు. సాయం చేయగల మనుష్యులు దగ్గర వుండీ, వాళ్ల సాయం పొందలేని తన దురదృష్టానికి విచారించాడు అనిల్.

వాళ్లు వెళ్లిపోయాక ఒక ఆలోచన వచ్చింది అనిల్‌కి. అక్కడవున్న ఎండిపోయిన కొబ్బరి ఆకులు రెండు తీసుకొని వాటిమీద బాల్ పెన్‌తో తన వివరాలు, తాను ఎక్కడో తెలియని ద్వీపంలో చిక్కుకు పోయిన విషయం, అక్కడ స్మగ్లింగ్ కార్యకలాపాలు జరుగుతుండిన వైనం రాసి ఒక ఖాళీ విస్కీ సీసాలో పెట్టి మూత గట్టిగా బిగించాడు.

తర్వాత దానిని బలంగా సముద్రంలోకి విసిరాడు. అది అలలమీద తేలుతూ గాలివాలుకి ఎటో దూరంగా వెళ్లిపోయింది. భారమంతా భగవంతుడిమీద వేశాడు.

ఆ తర్వాత తన షర్టు తీసి ఒక కర్రకు కట్టి గాలిలో ఊపసాగాడు. అది అటునుంచి పోయే ఏ ఓడలోని వారి కంటకాని, పైనుంచి ఎగిరే విమానం కంటకాని పడుతుందేమోనని ఆశ.

* * * *

కళ్లు తెరిచి చూసేసరికి ప్రకాశం. నిర్మలకి చుట్టూ ఎందరో ఆదిమజాతివారు వింతగా చూస్తూ కనిపించారు. వాళ్ళు కళ్ళు తెరవగానే వారిలో వారు ఏదో మాట్లాడుకోసాగారు. ఇద్దరూ నెమ్మదిగా కూర్చుని తాము ఎక్కడ ఉన్నామని సంజ్ఞలతో అడిగారు. వారు ఏదో సంజ్ఞలతో సమాధానం చెప్పారు. కాని అదేమిటో వారికి అర్థం కాలేదు.

అంతలో ఒక పెద్ద ఆయన వింత దుస్తులతో, నెత్తిమీద ఈకల టోపీతో వచ్చాడు. అతను బహుశా ఆ ప్రజల పెద్ద కాబోలు. ఆయన రాగానే అక్కడ మూగిన వారు తప్పుకుని దారి ఇచ్చారు. ఆయన

ప్రకాశాన్నీ, నిర్మలనీ చూస్తూ ఏదో అడిగాడు. అదేమిటో వారికి అర్థం కాలేదు.

ఆ తర్వాత అతను తన జాతివారికి ఏదో చెప్పాడు.

వెంటనే వాళ్లు వాళ్లిద్దర్నీ లేవమని సంజ్ఞ చేసారు.

వాళ్లు లేవగానే వెంట ఉండి ఎక్కడికో నడిపించుకుపోయారు.

కొంచెం దూరంలోనే ఒక దేవాలయం వంటిది ఉంది. అందులో భయంకరమైన కాళికమ్మవారి వంటి కొయ్య విగ్రహం ఒకటి ఉంది.

ఆ విగ్రహం ముందు ఆ ఇద్దర్నీ నిలబెట్టారు వాళ్లు.

ఆ దేవతకు తమను బలి ఇస్తారనిభయపడ్డారు ప్రకాశం, నిర్మల, అసలే అనిల్ ఏమయ్యాడోనని దిగులుపడ్తున్న వారికి ఈ ఉత్పాతం మిన్ను విరిగి మీదపడ్డట్లయింది.

* * * *

ఆకాశంలో మిలమిల మెరుస్తూ చక్కర్లు కొట్తోంది హెలికాప్టర్. క్రింద నేలమీద నుంచి గుడ్డ ఊపుతున్న అనిల్ దాని కంటపడ్డాడు.

హెలికాప్టర్ నెమ్మదిగా నేలని సమీపించింది. సుమారు ఒక ఇరవై అయిదు అడుగులు ఎత్తున ఉండగానే అందులోంచి త్రాటి నిచ్చెన కిందికి దిగింది. దానిని పట్టుకుని జాగ్రత్తగా హెలికాప్టర్‌లోకి వెళ్లాడు అనిల్.

ఆ ద్వీపంలో అమ్మవారి విగ్రహం ముందు ఏవో పూజలు జరుగుతున్నాయి. ప్రకాశం, నిర్మలకి బొట్లు పెట్టి మెళ్లో దండలు వేశారు. వారందరూ కూడా బొట్లు పెట్టుకున్నారు.

ఇంతలో అక్కడికి తెల్లని గౌను, నల్లని గడ్డం వున్న ఒక క్రైస్తవ ఫాదర్ వచ్చాడు. ఆయన్ని చూడగానే ఆదిమజాతివారు గౌరవంగా నమస్కరిస్తూ ప్రక్కకి తొలిగారు.

ఆయన ఇంగ్లీషులో ప్రకాశంతో మాట్లాడాడు. తన పేరు రెవరెండ్ జాన్సన్ అనీ, ఆ దీవిలో మిషన్ నడుపుతున్నానని చెప్పాడు తమ సంగతంతా క్లుప్తంగా ఆయనకి చెప్పాడు ప్రకాశం. ఆయన ఆదిమజాతివారికి ఏదో చెప్పాడు. వెంటనే వాళ్లు జాన్సన్‌కీ, ప్రకాశం దంపతులకీనమస్కరించి వెళ్లిపోయారు.

తర్వాత రెవరెండ్ జాన్సన్ వారిద్దర్నీ తన కాటేజీకి తీసుకువెళ్లాడు. అక్కడే వారికి స్నానాలకీ, భోజనాలకీ ఏర్పాటుచేసాడు. ఈ లోగా వైర్‌లెస్‌లో కార్‌నికోబార్‌తో మాట్లాడాడు. అది అక్కడ నుంచి ఎక్కువ దూరం కాదట.

మరో రెండు గంటలలో హెలికాప్టర్ వచ్చి ప్రకాశంను, నిర్మలను పికప్ చేసుకుంది. ఫాదర్ జాన్సన్ దగ్గర సెలవు తీసుకుని వారు సంతోషంగా వెళ్లిపోయారు. అయితే అనిల్ గురించే వారి దిగులు. ఆ విషయం హెలికాప్టర్ పైలెట్‌కి చెప్పారు వారు. సెర్చిపార్టీ ఆ తుఫానులో చిక్కుకుపోయిన వారి గురించి హెలికాప్టర్‌లో బయలుదేరిందనీ, వారు అంతటా గాలిస్తున్నారనీ చెప్పాడు.

అనిల్ కార్ నికోబార్ చేరేసరికి అప్పటికే ప్రకాశం, నిర్మలా అక్కడ ఉన్నారు. అనిల్ సజీవంగా రావడం చూసి తమ కళ్ళను తాము నమ్మలేకపోయారువారు. ఇద్దరూ ఎదురెళ్ళి కొడుకుని గాఢంగా

వాటేసుకున్నారు. ఆ ముగ్గురి ఆనందానికి అవధులు లేవు. ఆ దృశ్యం చూసిన అందరికీ కళ్లు చెమర్చాయి.

ఎప్పుడైతే ప్రకాశం నడుపుతుండిన మోటారు బోటు గల్లంతు అయిందో, దానికోసం సెర్చి పార్టీ బయలుదేరింది.

అయితే రెవరెండ్ జాన్సన్ ఇచ్చిన సమాచారం మూలంగా ప్రకాశం, నిర్మలలను రక్షించడం సులువయింది. అనిల్ తెలివిగా కర్రకి కట్టిన గుడ్డను ఊపుతుండడం వల్ల హెలికాప్టర్ అతన్ని గుర్తించడం సులువయింది.

అనిల్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ట్రాప్‌చేసి అకస్మాత్తుగా దాడిచేసి స్మగ్లర్స్ ముఠాని అరెస్టు చేయగలిగారు కస్టమ్స్ అధికారులు.

సముద్రంమీద కలిగిన భయంకరమైన అనుభవంతో తిరుగు ప్రయాణాన్ని కూడా విమానంలోనే చేసి క్షేమంగా స్వగృహం చేరుకున్నారు ఆ ముగ్గురూ.

ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జూలై 1990 ✪

# ఆపరేషన్ ఆల్ఫా సెంటారీ

సుకుమార్ మంచి ప్రతిభ ఉన్న రేడియో మెకానిక్. స్వాతంత్ర్యం రాక ముందు మనదేశంలో రేడియోలు ఉత్పత్తి అయ్యేవి కావు. విదేశాల నుంచి దిగుమతి అయిన సెట్లే మార్కెట్లో ఉండేవి. వాటి కనీస ధర ఐదువందల రూపాయలపైనే ఉండేది. అందువల్ల కేవలం సంపన్నులు, మధ్యతరగతిలో ఉన్నత వర్గం వారూ మాత్రమే వాటిని కొనుక్కోగలుగుతుండేవారు. ఆరోజుల్లో రేడియో ఉన్నవాడు ధనికుడి కిందే లెక్క. ఆ రోజుల్లో ఫర్వాలేదు కానీ స్వాతంత్ర్యం వచ్చాక, పోనుపోను దిగుమతులమీద ఆంక్షలు ఎక్కువ అవడంతో వాటి స్పేర్ పార్ట్స్ దొరకడం మానేశాయి. దాంతో రిపేరు వచ్చిందంటే చాలా సెట్లు మూలపడేవి. అటువంటి మొండి రేడియోలను రిపేర్ చేయడం సుకుమార్‌కి ప్రత్యేక హాబీ. ఆరోజు సుకుమార్ తన వర్క్‌షాప్‌లో చాలా బిజీగా ఉన్నాడు. ఆ చిన్న గదిలో ఎన్నెన్నో రకాల రేడియో సెట్లు చిన్నవీ, పెద్దవీ, స్వదేశానివీ, విదేశాలవీ, ట్రాన్సిస్టర్‌లు, టు ఇన్‌వన్‌లు, స్టీరియోలు ఒకటేమిటి అన్ని రకాలవి ఉన్నాయి. కాబినెట్లు ఊడదీసినవి కొన్నీ, తీయనివి కొన్ని వివిధ ఆకారాలలో ఉండడంతో ఆ గది రేడియో ఆస్పత్రిలాగా ఉంది.

సుకుమార్ ఒక పెద్ద రేడియో సెట్‌ని పరీక్షిస్తున్నాడు. అది ఎన్నో ప్రత్యేకతలు కలిగి, అతి బలహీనమైన వేవ్ లెంగ్త్‌లను కూడా బలంగా పట్టుకోగలిగిన శక్తిమంతమైన ఎంతో ఖరీదైన విదేశీ సెట్. అది ఒక మాజీ నవాబుగారిది. ప్రత్యేక వస్తువులను కొనడంలో ప్రత్యేక హాబీగల ఆ నవాబుగారు దానిని ప్రాణప్రదంగా చూసుకుంటుంటారు. కాలప్రభావంతో దానికేరోగం వచ్చినా, మూలపడేయడానికి ఆయన మనసొప్పలేదు. సుకుమార్ పేరువిని దానిని బాగుచేయడానికి అతని దగ్గరకు పంపించాడు. ఆ రేడియో గుర్రు గుర్రుమంటోంది. ఇండికేటర్ ఏదో బాండ్‌లో ఉంది. దానిని నెమ్మదిగా తిప్పుతున్నాడు సుకుమార్. ఇండికేటర్ ఒక చోటికి వచ్చేసరికి ఆ గుర్రు శబ్దంలోంచి ఒక తీరులో వస్తున్న శబ్ద పరంపర అతి నెమ్మదిగా వినిపించసాగింది. నిశితమైన సుకుమార్ చెవులు ఆ బలహీనమైన శబ్దాలను పసికట్టగలిగాయి. అవి అంతకుముందు ఎప్పుడూ విన్న శబ్దాలు కావు. ఆశ్చర్యం పట్టలేకపోయాడు. టైం చూశాడు. 9.30 అయింది. కిటికీలోంచి బయటకు చూశాడు. నల్లని ఆకాశం మీద తెల్లని చుక్కలు చాందినీకి కట్టిన పాదరసం బుడ్డలలె ధగధగా మెరుస్తున్నాయి. ఆ కృష్ణపక్షమి రాత్రి చాలా ప్రశాంతంగా ఉంది. వెంటనే టేప్ రికార్డర్



ఆన్ చేసి ఆ శబ్దాలను రికార్డు చేయడం మొదలుపెట్టాడు. పక్కనే ఉన్న నోట్‌బుక్‌లో టైము నోట్‌చేసి ఆ ప్రసారం గురించిన వివరాలు అతిక్లుప్తంగా రాసుకున్నాడు. తిరిగి అతి శ్రద్ధగా ఆ శబ్దాలను వినడం మొదలుపెట్టాడు. అతని ముఖం ఉద్వేగంతో నిండిపోయింది.

విజయానంద్ నెమ్మదిగా ఆ గదిలో అడుగుపెట్టాడు. మిత్రుడు సుకుమార్ భుజం మీద నెమ్మదిగా చేయి వేశాడు "ఏమిటి అంత సీరియస్‌గా ఉన్నావు?" అంటూ.

ఉలిక్కిపడి వెనక్కి చూశాడు సుకుమార్. ఆనంద్‌ని చూస్తూ మాట్లాడవద్దన్నట్లు ముక్కుమీద వేలేసుకుని సంజ్ఞ చేశాడు. సంగతి గ్రహించిన విజయానంద్ మారు మాట్లాడకుండా తాను కూడా శబ్దాలను శ్రద్ధగా ఆలకించడం మొదలుపెట్టాడు.

కొంచెం సేపట్లో ఆ శబ్దాల ప్రసారం ఆగిపోయింది. అది పూర్తిగా ఆగిపోయిందని నిర్ధారణ చేసుకుని టైం చూసి. తిరిగి బుక్‌లో నోట్ చేశాడు సుకుమార్. ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు.

"ఏమిటి అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావు?" అన్నాడు విజయానంద్.

"రేడియోలో విచిత్రమైన శబ్దాలు వచ్చాయి. నువ్వు వచ్చేసరికి వాటినే నేను వింటున్నాను. నువ్వు కూడా విన్నావేమో!" అన్నాడు సుకుమార్.

— ఆపరేషన్ ఆల్ఫా సెం

"లేదు. నేను చివరలో వచ్చాను. అందువల్ల సరిగా వినలేదు అన్నాడు విజయానంద్.

సుకుమార్ వెంటనే టేప్ రికార్డర్‌లోని టేపని రివర్స్ చేసి ఆ తర్వాత ఆన్ చేశాడు. వాల్యూమ్‌ని మాక్సిమంకి పెంచాడు. అంతకుముందు రేడియోలోవిన్న శబ్దాలు తిరిగి రాసాగాయి. అవి అయిపోగానే "ఇవేమిటో నువ్వు చెప్పగలవా!" అని అడిగాడు సుకుమార్.

"ఇదేమీ భాషలాగా లేదు. ఒకవేళ ఏదైనా భాషే అయితే నాకు తెలిసినంత వరకూ ఈ భూప్రపంచంలో ఇటువంటి భాషేమిలేదు" అన్నాడు విజయానంద్. అతను వృత్తిరీత్యా శాస్త్రవేత్త అయినా ప్రవృత్తిరీత్యా భాషా శాస్త్రం మీద ఉన్న ప్రత్యేక అభిమానం వల్ల ప్రపంచంలోని ఇంచుమించు ప్రతి భాషనీ అంతోఇంతో పరిశోధించి పరిచయం ఏర్పరచుకున్నాడు.

"అవును. నువ్వు చెప్పింది నిజం. ఇది భాష కాదు. మన ప్రపంచంలోనే కాదు మరే లోకంలోనూ కూడా మాట్లాడే భాష కాదు" అన్నాడు సుకుమార్.

"మరి!" ప్రశ్నార్థకంగా చూశాడు విజయానంద్.

"ఇవి మరేదో లోకంలోని బుద్ధి జీవులు మన భూమికి ప్రత్యేకంగా పంపిస్తున్న సంకేతాలని నాకు అనిపిస్తోంది. ఈ సంకేతాల ద్వారా వారు తమ ఉనికిని మనకు తెలియజేస్తున్నారని నా అనుమానం" అన్నాడు సుకుమార్ ఆలోచిస్తూ.

పరలోకవాసులు పంపిస్తున్నారని ఎలా అనుకోడం! భూమి మీద నుంచే ఎవరో పంపిస్తుం డొచ్చుగా!" అన్నాడు విజయానంద్.

"నిజమే. మన భూవాసుల సంకేతాలు వేరుగా ఉంటాయి. పైగా ఈ వేవ్‌లెంగ్త్‌లో భూమి మీద ఏ స్టేషన్ నుంచీ ప్రసారాలు జరగవు. నిజానికి ఇటువంటి శబ్దాలను నేను మొదటిసారిగా ఎనిమిది సంవత్సరాల కిందట విన్నాను. అప్పుడే నేను వీటిని సుదూరలోకాల నుంచి వస్తున్న వాటివిగా అనుమానించాను. అవి ఫలానా నక్షత్ర మండలం నుంచి వస్తున్నాయని కూడా ఒక నిర్ధారణకు వచ్చాను. దానిని ధ్రువ పరచుకోవడానికి ఒక ప్రయోగాన్ని చేశాను. నా అనుమానమే కనుక నిజమైతే ఈ ఏడాది ఇదేరోజుల్లో తిరిగి అట్టి సంకేతాలే వస్తాయని ఊహించాను. నా ఊహ నిజం అయింది. నవాబ్‌గారి ఈ రేడియో చాలా శక్తిమంతమైంది. అందుకే వీటిని సులువుగా పట్టగలిగింది. ఆ... ఇవే సంకేతాలు ఇంకా పదిరోజులు వస్తాయి" అన్నాడు సుకుమార్ ఆనందోద్వేగంతో ఊగిపోతూ.

"అరే! ఎంత విచిత్రం! మరి నాక్కూడా నువ్వెప్పుడూ చెప్పలేదే!" అన్నాడు విజయానంద్ ముప్పిరి గొన్న ఆశ్చర్యంతో.

"ఎలా చెప్తాను! అప్పటికి మన స్నేహం ఏర్పడందే" అన్నాడు సుకుమార్ నవ్వుతూ.

"అది సరే. వాళ్లు భూవాసుల కోసమే ఈ సంకేతాలు పంపుతున్నారని ఎలా చెప్పగలవు? మరేలోకం వారి కోసమైనా కావచ్చుగా! ఈ విశాల విశ్వంలో మానవకోటి ఉన్నలోకం మనది ఒకటే కాదుకదా!" అన్నాడు విజయానంద్.

"నిజమే. కాని ఇది మనకోసమేనని నిక్కచ్చిగా చెప్పగల ఆధారాలున్నాయి. ఏమంటే ఈ సంకేతాలు

ఇరవై నాలుగు గంటలకొకసారి వస్తున్నాయి. అంటే వారికి మన దినపరిమాణం 24 గంటలని తెలుసునన్నమాటేగా! ఐతే అంగారక గ్రహం మీద కూడా దినప్రమాణం ఇరవై నాలుగు గంటలే కదాని నువ్వు అడగవచ్చు. కానీ మన భూమిని గురించి బాగా తెలుసుకున్నవారికి భూమి మీద మాత్రమే బుద్ధి జీవులు ఉన్నారనీ, అంగారకుని మీద లేరని తెలియడంలో వింతలేదు. అందుకే ఇది ఖాయింగా భూవాసులకోసమేనని చెప్పవచ్చు. మరి ఇవి ఎక్కడ నుంచి వస్తున్నాయన్న అనుమానం సహజంగా వస్తుంది. నా అనుమానం ప్రకారం ఇవి మనకి అత్యంత సమీపంలో ఉన్న ఆల్ఫా సెంటారీ నక్షత్ర మండలానికి చెందిన గ్రహం నుంచి వస్తున్నాయి".

"బాగుంది! నీ అనుమానికి ఆధారమేమిటి? నువ్వేదో ప్రయోగం చేశానన్నావు. అదేమిటి?" అని కుతూహలంతో అడిగాడు విజయానంద్.

"మనకి అత్యంత సమీపంలో ఉన్న నక్షత్ర మండలం ఆల్ఫా సెంటారీ శాస్త్రజ్ఞుల అనుమానం ప్రకారం ఇది సరిగ్గా మన సౌర మండలాన్ని పోలి ఉంటుంది. ఈ మండలంలో ఉన్న ప్రాక్షిమా సెంటారీ నక్షత్రానికి అన్ని విధాలా మన భూమిని పోలిన గ్రహాలు ఉన్నాయట. అక్కడ మానవులను పోలిన అమితమైన అభివృద్ధిని సాధించిన బుద్ధి జీవులు ఉండవచ్చుననివారి అనుమానం. మన భారతీయ శాస్త్రజ్ఞులలో కొందరు మనం చెప్పుకునే విశ్వామిత్ర సృష్టి ఇక్కడే జరిగిందని భావిస్తున్నారు. బహుశా అక్కడి బుద్ధి జీవులు మన భూమి మీద నాగరికత సాధించిన మానవాళి ఉన్నట్లు గుర్తించి ఉండవచ్చు. అందుకనే వారు రేడియో తరంగాల ద్వారా మనతో సంబంధాల పెట్టుకోవడానికి ప్రయత్నిస్తుండవచ్చు. అయితే వీరి భాష మనకి తెలియదు. అందువల్ల భాషతో నిమిత్తం లేకుండా మనం అర్థంచేసుకోగల సంకేతాలను వారు పంపుతుండాలి. కాని అవి నిత్యమూ పంపడం సాంకేతికంగా సాధ్యమూ కాదు. అవసరమూ లేదు. పైగా నిరంతరంగా పంపితే అవి బుద్ధి జీవులు ఉద్దేశపూర్వకంగా పంపుతున్న సంకేతాలని గుర్తించడం కష్టం. కనుక వారు అనుకూలమైన కాలంలో నిర్ణీత పద్ధతిలో అర్థం చేసుకోగల విధంగా పంపుతుండినవి కనుక ఇవి తప్పక అల్ఫా సెంటరీ నక్షత్ర మండలం నుంచి వచ్చినవే అని నిర్ధారించాను" అని కొంచెం ఆగాడు సుకుమార్.

"సరే. మరి నువ్వు చేసిన ప్రయోగమేమిటి?" అని అడిగాడు విజయానంద్.

"అదే చెప్పబోతున్నా. అల్ఫా సెంటారీ నక్షత్ర మండలం నాలుగు కాంతి సంవత్సరాల దూరంలో ఉందన్న విషయం తెలిసినదేగా. అంటే సెకనుకి ఒక లక్షా ఎనభై ఆరువేల మైళ్ళ వేగంతో ప్రయాణం చేసే కాంతి, అక్కడ నుంచి మనకు రావడానికి నాలుగు సంవత్సరాలు పడుతుందన్నమాట. కనుక వారి సంకేతాన్ని అర్థం చేసుకున్నట్లుగా తెలియజేయడానికి వారి సంకేతాన్నే తిరిగి ప్రసారం చేస్తూ మరొక విధమైన సంకేతాన్ని జోడించి పంపాను. అది వారు అర్థం చేసుకుంటే ఆ విషయం తెలియజేయడానికి నా సంకేతాన్ని అనుకరిస్తూ మరో సంకేతం ఈ సమయంలో పంపుతారని ఊహించాను. అయితే నా సంకేతం వారికి చేరడానికి నాలుగేళ్ళు తిరిగి వారి ప్రతి సంకేతం రావడానికి మరో నాలుగేళ్ళు మొత్తం ఎనిమిదేళ్ళు పట్టింది. నిజానికి ప్రతిసంవత్సరం ఈ సమయంలో వారి సంకేతాలు వస్తూనే ఉన్నాయి. కానీ వారి జవాబు అందడానికి ఎనిమిదేళ్ళు అవసరం కనుక ఈ సంవత్సరం మాత్రమే నా సంకేతాన్ని అనుకరించిన సంకేతం వచ్చింది. కనుక నా ఊహ అక్షరాలా నిజమైందన్న మాట" అంటూ ఆనందంతో ఉప్పొంగి పోయాడు సుకుమార్..

'నీ మేధాశక్తికి నా జోహార్లు' అని ఆనందంతో మిత్రుని ఆలింగనం చేసుకున్నాడు విజయానంద్.

"వారు కొన్నివేల కోటానుకోట్ల మైళ్ళ దూరం నుంచి సంకేతాలు పంపగలుగుతున్నారంటే వాళ్ళు అత్యున్నతంగా వికాసం చెందిన బుద్ధిజీవులన్నమాట. కాని నువ్వు అంతటి దూరంలో ఉన్న ఆ నక్షత్రమండలానికి ఏ విధంగా రేడియో తరంగాలు పంపగలిగావు" అని అడిగాడు విజయానంద్.

"లేజర్ కిరణాలు అత్యంత శక్తిమంతమైనవన్న విషయం నీకు తెలిసినదే కదా! అటు తర్వాత హైడ్రోజన్ వాయువు అత్యల్ప పరిమాణంలోనైనా కూడా ఈ అనంత విశ్వం అంతా ఆవరించి ఉంది. అందువల్ల ఈ వాయువును మీడియంగా ఉపయోగించి లేజర్ కిరణాలను రేడియో తరంగాల రూపంలో పంపితే అవి ఈ విశ్వాంతరాళంలో ఎంతటి దూరానికైనా చొచ్చుకు పోగలవు. అటువంటి తరంగాలను ప్రసారం చేయగల యంత్రాన్ని రూపొందించ గలిగాను" అన్నాడు సుకుమార్ సగర్వంగా.

విజయానంద్ ఆనందానికి అవధిలేదు.

"నాకు తెలుసు సుకుమార్. నువ్వు బ్రతుకు తెరువు కోసం ఈ రేడియో రిపేర్ షాపు పెట్టుకున్నా నీలోదాగిఉన్న శాస్త్రజ్ఞుడు నీ చేత కొత్త కొత్త విషయాలు కనిపెట్టిస్తూనే ఉంటాడు. నిజానికి ఇది వర్క్‌షాపు కాదు. నీలేబొరేటరీ. ఇంతకాలం నేను కేవలం వృత్తిరీత్యా శాస్త్రజ్ఞుడిని మాత్రమే. ఇంకముందు నీకు చేదోడువాదోడుగా ఉండి నీతోపాటు కొత్తకొత్త విషయాలు కనిపెట్టడంలో సహకరిస్తాను". అన్నాడు ఆవేశంగా.

అంతకంటేనా! నీవంటి మేధావి సహాయం నాకు లభిస్తే దివిలోని చుక్కల్ని భూమికి రాల్చమా!" అన్నాడు సుకుమార్. మరి కాసేపటికి ఇంటికి వెళ్ళిపోయాడు విజయానంద్.

సుకుమార్ మంచి స్వీయప్రతిభ గల మేధావి. ఎన్నెన్నో శాస్త్రీయ విషయాలలో పరిశోధనలు జరిపి ఎన్నో కొత్త విషయాలు కనుగొన్నాడు. ఎన్నెన్నో కొత్తపరికరాలు రూపొందించాడు. అతనికి ఖగోళశాస్త్రం అంటే ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. అతని పరిశోధనలు ఎంతో విలువైనవైనా పెరటి చెట్టు మందుకు పనికిరాదన్నట్లు స్వదేశంలో అతనికి గుర్తింపు కరువైంది. కాని అతనికి విదేశ శాస్త్రవేత్తల నుంచి పరిశోధనా సంస్థలనుంచి మంచి ప్రోత్సాహం లభిస్తుండడంతో నిరాశ పొందక స్వదేశంలోనే పరిశోధనలను కొనసాగిస్తూ వస్తున్నాడు. తీరిక సమయంలో రేయింబవళ్ళనక తన వర్క్‌షాప్‌ని అంటివెనకనే ఉన్న లేబరేటరీలో తన పరిశోధనలను జరుపుకుంటుంటాడు.

సుకుమార్ కనుగొన్న విషయం ప్రపంచమంతటా పెద్ద సంచలనాన్ని రేపింది. అతని జీవిత విశేషాలను ఫోటోలతో సహా ప్రచురించని పత్రిక ప్రపంచంలో లేదంటే అతిశయోక్తి కాదు. వెంటనే అతడు 'పుట్టినదేశం' సుకుమార్ మావాడు అని లోకానికి చాటి చెప్పింది. పరిస్థితిలో వచ్చిన మార్పుని చూసి నవ్వుకున్నాడు సుకుమార్.

ఎప్పుడైతే తనకి ప్రపంచ ప్రఖ్యాతి లభించిందో, తాను ఏ నాటినుంచో కలలుకంటున్న విశ్వాంతరాళ యాత్రకి రూపకల్పన చేయాలని అనుకున్నాడు సుకుమార్. వెంటనే ప్రపంచంలోని ప్రముఖ పత్రికలన్నింటికీ. తాను ఆల్ఫాసెంటారీనక్షత్ర మండలానికి వెళ్ళి సజీవంగా తిరిగి రాగలననీ, అది సఫలం కావడానికి తనకి ఆర్థిక సహాయం చేయమనీ ప్రపంచ ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. దానికి ప్రతిస్పందిస్తూ అభివృద్ధి చెందిన దేశాల నుండి, వ్యక్తుల నుంచీ సంస్థలనుంచీ కూడా అతనికి భూరివిరాళాలు అందడం మొదలు పెట్టాయి.

దానితో రెట్టించిన ఉత్సాహంతో తన పరిశోధనలను ముమ్మరం చేశాడు సుకుమార్. విజయానంద్ సుకుమార్‌కి అన్ని విధాలా సహాయకారిగా ఉంటున్నాడు. అయితే రేడియో తరంగాలనైతే ఆల్ఫా సెంటారీకి పంపగలిగాడే కాని, కాంతికే నాలుగు సంవత్సరాలు పట్టే ఆ సుదూర ప్రయాణాన్ని భౌతికంగా చేయడం ఎలాసాధ్యం అన్న అనుమానం అతన్ని పీడించసాగింది. కాని మిత్రుని శక్తి సామర్థ్యాల మీదున్న అచంచల విశ్వాసంతో పైకిమాత్రం ఏమీ అనలేదు.

ఆనాడు విజయానంద్ మామూలుగా సుకుమార్ లేబొరేటరీకి వెళ్ళాడు. గత కొన్ని రోజులుగా సుకుమార్ వర్క్‌షాప్ పని పూర్తిగా మానేసి పూర్తికాలం తన లేబొరేటరీ పరిశోధనలలోనే గడుపుతున్నాడు. అలికిడి వినగానే తలఎత్తి చూశాడు. ఆనందం పట్టలేక "విజయ్, విజయం సాధించాను. కనిపెట్టేశాను" అంటూ విజయానంద్‌ని గాఢంగా కౌగిలించుకుని ఉషారుగా అరుస్తూ గిరగిరా తిప్పడం మొదలుపెట్టాడు.

"అరె... ఏమిటి సంగతి? త్వరగా చెప్పు" అని విజయానంద్ అడుగుతున్నా వినిపించుకోకుండా కొంతసేపు అలాగే గంతులు వేసి, ఆ తర్వాత ఆవేశంతో చెప్పసాగాడు సుకుమార్.

"విజయ్.... మనం ఆల్ఫా సెంటారీకి వెళ్ళిరావచ్చు. అందుకు సాధనం కనిపెట్టేశాను. "అన్నాడు ఆనంద పారవశ్యంతో.

'అసంభవం.... కాంతివెళ్ళి రావడానికే ఎనిమిది సంవత్సరాలు పడుతుందే. మరి మనకి అదెలా సాధ్యం?" అన్నాడు విజయానంద్.

" అంటే ఈ సుకుమార్ శక్తి సామర్థ్యాల మీద నీకు పూర్తి నమ్మకం లేదన్నమాట. ఒక్క ఆల్ఫా సెంటారీయే ఏమిటి? ఇంకా వందల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న నక్షత్ర మండలాలకు కూడా మనం వెళ్ళిరావచ్చు" అన్నాడు సుకుమార్.

సుకుమార్‌కి పిచ్చెక్కలేదు కదా అన్న అనుమానం వచ్చింది విజయానంద్‌కి.

ఆ అనుమానపు చూపులు గమనించి "వాని పిచ్చిమాటలు కావు విజయ్. నిజమే చెప్తున్నాను. మనం కాంతి వేగంతో ప్రయాణం చేస్తాం" అన్నాడు సుకుమార్.

"అసంభవం. ఐన్‌స్టీన్ సూత్రం ప్రకారం ఏ పదార్థమూ కాంతి వేగాన్ని అందుకోలేదు. ఆ సూత్రం తప్పుకావడానికి వీలులేదు" అన్నాడు విజయానంద్ బుర్రగోక్కుంటూ.

"ఐన్‌స్టీన్ సూత్రం తప్పని నేననలేదే. ఆ సూత్రం ప్రకారమే మనం వెళ్ళగలమంటున్నా" అన్నాడు సుకుమార్.

"అదెలా సాధ్యం?" అని గొణిగాడు విజయకుమార్.

"ఇలా" అంటూ ఒక పెట్టె తెరిచాడు సుకుమార్.

"మ్యావ్" అంటూ ఒక పిల్లికూన బయటకు వచ్చింది. దానిని మళ్ళీపెట్టెలో పెట్టి మూతవేశాడు సుకుమార్. ఆపెట్టెకున్న స్విచ్‌లు ఏవో ఆన్‌చేశాడు. వెంటనే మళ్ళీ మూతతీశాడు. అందులో పిల్లిలేదు!

ఆశ్చర్యంతో కొయ్యబారి పోయాడు విజయానంద్.

"కొంచెం దూరంలో ఉన్న మరొక పెట్టెమీదున్న స్విచ్‌లు మళ్ళీ వేశాడు సుకుమార్. ఈ సారి ఆ

పెట్టిమూత తీశాడు అందులోంచి మ్యావ్ అంటూ అదే పిల్లికూన బయటకు వచ్చింది.

విజయానంద్ సంభ్రమాశ్చర్యాలకు అంతులేదు. అది కలో కనికట్టో తెలియలేదు అతనికి. కొంచెం తెప్పరిల్లాక "మ్యాజిక్ ఎప్పుడు నేర్చావు?" అని అడిగాడు.

"మ్యాజిక్ కేవలం మెజిషియన్ మాత్రమే చేయగలడు. ఇది మ్యాజిక్ కాదు. నూటికి నూరుపాళ్ళు వాస్తవం. నీ చేతులతో నువ్వే చేసిచూడు." అంటూ తాను చేసినదంతా విజయానంద్ చేత చెప్పి చేయించాడు సుకుమార్.

విజయానంద్ ఏమీ మాట్లాడలేకపోయాడు.

చాలా విచిత్రంగా వుంది కదూ. ముందు నేనూ నమ్మలేకపోయాను. నేను చేసింది సిద్ధాంత రీత్యా సాధ్యమేనని నాకు తెలిసినా ప్రయోగపూర్వకంగా అది సాధ్యపడుతుందనుకోలేదు. ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారం పదార్థాన్ని శక్తిగానూ, శక్తిని పదార్థంగానూ మార్చవచ్చునన్న విషయం తెలిసిందేగా! నేను రూపొందించిన ఈ యంత్రం ద్వారా పిల్లి శక్తిగా మారిపోయింది. మళ్లీ అదేవిధంగా ఇదే యంత్రం ద్వారా శక్తి పిల్లిగా మారిపోయింది. రేడియోలోను, టెలిఫోన్‌లోను మనం మాట్లాడిన మాటలు ఏవిధంగా విద్యుచ్ఛక్తిగా మారి, తిరిగి ఆ విద్యుచ్ఛక్తి మనం మాట్లాడిన పద్ధతిలోనే ఏ విధంగా శబ్దంగా మారుతుందో అదే పద్ధతిలో పదార్థం శక్తిగానూ, ఆ శక్తి తిరిగి పదార్థంగానూ మారిపోయాయి. కనుక శక్తిగా మారిపోయిన ఈ పదార్థం కాంతివేగంతో ప్రయాణం చేయగలదు. ఇదే సూత్రాన్ని ఉపయోగించి మనం మనల్ని శక్తిగా మార్చుకుని విశ్వాంతరాళంలో విజయవిహారం చేసి, కావాలనుకున్న గ్రహాలమీద వాలి తిరిగి మానవరూపం పొంది ఆ తర్వాత మళ్లీ కావాలనుకున్నప్పుడు శక్తిరూపంలో మన భూమిని జేరి తిరిగి మనుష్యులుగా మారవచ్చు" అంటూ ఒక్క బిగిన చెప్పుకుపోయాడు సుకుమార్.

"అద్భుతం...పరమాద్భుతం" నీ పరిశోధన ప్రపంచ చరిత్రనేకాక దాని గతినే మార్చివేస్తుంది. ఈ అద్భుత విజయానికి నిన్నెలా అభినందించాలో తెలియడంలేదు. అంతా బాగానే వుంది. కాని ఇక్కడ నువ్వున్నావు కనుక శక్తిని తిరిగి పదార్థంగా మార్చి పిల్లికి అసలు రూపం మళ్ళీ తెచ్చావు. అదే మనం నక్షత్ర మండల యాత్ర చేస్తుంటే మన రూపం మనకి తిరిగి ఎవరు ఇస్తారు" అని సందేహాన్ని వెలిబుచ్చాడు విజయానంద్.

అది ఏమీ సమస్యే కాదు. ఈ కంప్యూటర్ యుగంలో సమాధానం దొరకని సమస్య ఉండదు. ఆటో మేటిక్ కంట్రోల్ వల్ల ముందుగానే టైం సెట్ చేసి నిర్ణీత సమయానికి మన రూపం మనకు వచ్చేట్లు చేసుకోవచ్చు. లేదా గ్రౌండ్ కంట్రోల్‌లో ఉన్న మన శాస్త్రజ్ఞులు దీనిని సులువుగా నిర్వహించగలరు.

"ఓ...ఇంక అల్ఫా సెంటారీ ప్రయాణమొక్కటే తరువాయన్నమాట. అది తలచుకుంటేనే నా ఒళ్లు ఆనందంతో ఉప్పొంగిపోతోంది. ప్రయాణం ఎప్పుడా అని ఉవ్విళ్లూరుతున్నాను" అన్నాడు ఆనంద్.

"అవును. సిద్ధంగా ఉండు. కాని అక్కడి సృష్టి. మానవాళి ఎలా ఉంటుందో మనకి తెలియదు. బహుశా మన భూమి మీది సృష్టిలాగా ఉండకపోవచ్చు. వారి రూపాలను మన కళ్లు గుర్తించలేకపోవచ్చు. వారి శబ్దాలను మన చెవులు వినలేకపోవచ్చు. కనుక వాటిని గుర్తించగల యంత్రాలను రూపొందిస్తున్నాను. ఇవి పూర్తి కాగానే మనం ప్రపంచ వ్యాప్తంగా ప్రకటించి ప్రయాణానికి సిద్ధపడవచ్చు" అన్నాడు సుకుమార్.

''వెరీగుడ్.. ఇంక నేను వెళ్ళి వస్తాను'' అని సెలవు తీసుకున్నాడు విజయానంద్.

కొద్దిరోజుల్లోనే తన పరిశోధనా ఫలితాలను సైన్స్ కాంగ్రెస్ ముందుంచాడు సుకుమార్. వాటిని నిశితంగా పరిశీలించి విశ్వాంతరయానం సాధ్యమేనన్న అతని అభిప్రాయంతో ఏకీభవించారు. వారు ఆ శాస్త్రజ్ఞులతో ఒక సంఘం ఏర్పాటు చేయబడింది. వారు సుకుమార్, విజయానంద్‌లను 'అల్ఫాసెంటారీ' నక్షత్ర మండలానికి పంపే ఏర్పాటు చేయడానికి ఏకగ్రీవంగా తీర్మానించారు. అందుకు కాగల ఖర్చుని భరించడానికి అభివృద్ధి చెందిన దేశాలతో పాటు అనేక దేశాలు ముందుకు వచ్చాయి, అందుకు కావలసిన సన్నాహాలు చురుకుగా ప్రారంభమయ్యాయి. ఈ వార్తలతో ప్రపంచం అంతా అట్టుడికి పోయింది. ఎవరినోట విన్నా ఈ వింత సంగతుల గురించి చర్చలే.

* * * *

మరికొన్ని నెలల్లోనే అల్ఫాసెంటారీ యాత్రకి ఏర్పాట్లన్నీ పూర్తి అయినాయి. దీనికి 'ఆపరేషన్ అల్ఫాసెంటారీ'' అని పేరు పెట్టారు శాస్త్రజ్ఞుల బృందం. గ్రౌండ్ కంట్రోల్ అత్యాధునిక యంత్రాలను అమర్చింది. వీటిని ప్రముఖ శాస్త్రవేత్తలు పర్యవేక్షిస్తున్నారు.

మరికొంత సేపట్లో సుకుమార్, విజయానందలు ప్రత్యేక దుస్తులతో వచ్చారు. ఎల్లరూ ఆనందంతో అభినందనలు తెలుపుతున్న ప్రజాసమూహానికి శాస్త్రవేత్తలకీ వీడ్కోలు చెప్పి నౌకలోకి ప్రవేశించారు వారిద్దరూ.

మరికొంచెం సేపట్లో గ్రౌండ్ కంట్రోల్‌లోని యంత్రాలు పనిచేయడం మొదలుపెట్టాయి. మరుక్షణంలో నౌక స్థానంలో ఒక పెద్ద మెరుపు మెరిసింది. ఉత్తర క్షణంలో ఆ మెరుపు కూడా మాయమైపోయింది. ఆ నౌక అందులోని సామగ్రి సుకుమార్, విజయానంద్‌లతో సహా కాంతిగా మారిపోయి, కాంతివేగంతో విశ్వాంతరాళంలోకి చొచ్చుకుపోసాగింది. దాని గమనాన్ని గ్రౌండ్ కంట్రోల్‌లోని శాస్త్రజ్ఞులు శ్రద్ధగా గమనించసాగారు. అంతా సవ్యంగా సాగుతుండడంతో వారి మనసులు సంతృప్తితో నిండిపోయాయి.

* * * *

నాలుగు సంవత్సరాలు గడిచాయి. అంతరిక్ష నౌక తన గమ్యం చేరుకుంటోంది. కాంతి ప్రసారంగా సాగిపోతున్న ఆ నౌక గమనాన్ని భూమి మీదున్న గ్రౌండ్ కంట్రోల్ దాని శక్తిమంతమైన యంత్రాలు గ్రహించగలుగుతున్నాయి. అది ఉద్దేశించిన తీరులో సాగిపోతుండడంతో 'ఆపరేషన్ అల్ఫా సెంటారీ' ప్రయోగం విజయవంతమవుతుందన్న విశ్వాసం శాస్త్రజ్ఞులలో కలిగింది. వారి ఆనందోత్సాహాలకి అవధిలేదు.

అంతరిక్ష నౌక 'సెంటారీ' అల్ఫా సెంటారీనక్షత్ర మండల పరిధిలోకి ప్రవేశించింది. సూర్యునికి భూమి ఉన్నంతటి ఇంచుమించు దూరంలోనే ప్రాక్సిమా సెంటారీ నక్షత్రానికి (అల్ఫా సెంటారీ నక్షత్ర మండలంలో ఉన్న నక్షత్రాలలో ప్రాక్సిమా సెంటారీయే భూమికి అత్యంత సమీపంలో ఉన్న నక్షత్రం. ఇది సూర్యుని పోలి ఉంటుంది) భూమికి కవల అన దగ్గ గ్రహం ఒకటుంది. దీని మీదా వాతావరణం, నదులు, సముద్రాలు, మంచు, ప్రాణికోటి అన్నీ ఉన్నాయి. ఆ గ్రహపు ఆకర్షణ వలయంలోకి ప్రవేశించగానే, కంప్యూటర్‌లో ముందుగా చేసుకున్న ఏర్పాటు ప్రకారం, కాంతి రూపంలో సాగిపోతున్న సెంటారీ నౌక స్వరూపం పొందిన యాంత్రిక నౌకగా మారిపోయింది. దానితోపాటు సుకుమార్, విజయానంద్‌లకు ఎప్పటి సజీవ రూపం వచ్చేసింది. వెంటనే వారు అంతరిక్ష నౌకను తను అధీనంలోకి తీసుకున్నారు. నౌక

కిటికీలోనుంచి వారు బయటకు చూశారు. ఎటు చూసినా ఆకాశం నల్లగా ఉంది. దాని మధ్య నక్షత్రాలు పాల ముంజెల్లా మెరుస్తూ వ్రేలాడుతున్నాయి. తమ దగ్గరున్న ఛార్టుని చూసి భూమితో సహా సౌరమండలంలో ఉన్న పాలపుంత నక్షత్ర మండలాన్ని (మిల్కీవే గాలాక్సీ), సూర్యునీ గుర్తించగలిగారు.

మరొకవైపు వారు చేరుకోబోతున్న గ్రహం అంతకంతకూ పెద్దదవుతూ కనిపిస్తోంది. నౌకలోని యంత్రాలు ఆ గ్రహపు స్వరూప స్వభావాలను తెలియజేస్తున్నాయి. అది ఇంచుమించు భూమిలాగానే ఉండడమే కాకుండా దాని వాతావరణ పీడనం, స్వభావం కూడా ఇంచుమించు భూమిపై వాటిని పోలి ఉన్నాయి. కాకపోతే ఆ గ్రహం మీద జలభాగం, భూభాగం ఇంచుమించు సమానంగా ఉన్నాయి. ఉన్నతమైన పర్వతాలు కొన్ని స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరికొన్ని పర్వత శిఖరాలు సముద్రంలో నుంచి పైకి పొడుచుకు వచ్చి ద్వీపాలలాగా అనిపిస్తున్నాయి.

సెంటారీ ఆ గ్రహానికి బాగా చేరువయింది. దానిమీద వృక్షజాలం కనిపిస్తోంది. కాని అది భూమి మీద లాగా పచ్చగా లేదు. కాలిన బూడిద రంగులో ఉంది. ఆ కొండల మధ్య చదునైన ప్రదేశాన్ని చూసుకుని అక్కడ నౌకను దింపాడు సుకుమార్.

"ఏమిటీ వృక్షజాలం! చాలా విచిత్రంగా ఉంది. ఇవన్నీ మురికి గాజుతో చేసినట్లున్నాయి" అన్నాడు విజయానంద్ వాటివంక చూస్తూ.

సుకుమార్ వాటిని పరీక్షించడానికి ఒక కొమ్మ విరిచి చూశాడు. మన భూమి మీద ప్రాణికోటి అంతా 'కార్బన్ సైకిల్'తో ఏర్పడింది. సిలికాన్ ధాతువు మూలంగా కూడా జీవజాలం ఏర్పడే అవకాశం ఉందని మన శాస్త్రవేత్తలు అనుమానిస్తూ వచ్చారు. వారి ఊహ నిజమేనని ఇప్పుడు తెలుస్తోంది. ఇవన్నీ సిలికాన్ సైకిల్ ద్వారా ఏర్పడిన వృక్షాలు. ఈ లెక్కన ఇక్కడి జంతువులు, మనుషుల రూపాలు కూడా చాలా విచిత్రంగా అసలు మనం గుర్తుకూడా పట్టలేనట్లుగా ఉన్నా ఆశ్చర్యపోనక్కరలేదు అన్నాడు సుకుమార్.

ప్రశ్నార్థకంగా అతని వంక చూశాడు విజయానంద్.

"అవును నిజమే! ఎందుకంటే కాంతి ప్రసారంలో మన కన్ను చూడగలిగింది. కేవలం ఏడు శాతమే. ఏ పదార్థమైనా దానిమీద పడే కాంతిలో ఎక్కువ భాగాన్ని హరించుకుని కొంత భాగాన్ని మాత్రమే తిరిగి ప్రసారం చేస్తుంది. ఈ కాంతి మన కన్ను గుర్తించగలిగినదైతే ఆ పదార్థపు రూపు రేఖలను మనం చూడగలుగుతాం. ఇక్కడి వస్తువులు, జీవ జాలం దీనికి భిన్నమైన కాంతిని ప్రసారం చేస్తే మనం వాటిని చూడలేం. ఉదాహరణకి ఈ వస్తువులు ఎక్స్‌రేలను ప్రసారం చేస్తే వాటిని మన కళ్లు గుర్తించలేవు కనుక ఎదుటనే వున్నా ఆ వస్తువులు మనకు కనిపించవు" అంటూ వివరించాడు సుకుమార్.

"అబ్బా" అంటూ ఉన్నట్లుండి ముందుకు పడ్డాడు విజయానంద్. "ఏమైంది" అంటూ ఆదుర్దాగా అడిగాడు సుకుమార్.

"ఎవరో నన్ను బలంగా గుద్దుకున్నారు" అన్నాడు విజయానంద్ లేస్తూ.

"అయితే నా అనుమానం నిజమేనన్నమాట. మనం ఇక్కడి మనుషులను చూడలేం. అలాగే వారు కూడా మనల్ని చూడలేకపోయుండవచ్చు. ఉండు ఇప్పుడే వస్తాను" అంటూ హడావుడిగా నౌకలోకి వెళ్లి ఒక రకమైన బైనాక్యులర్స్‌ని తీసుకువచ్చాడు సుకుమార్.

అందులోంచి చూస్తూ "ఇదిగో చూడు. కొంచెం దూరంలో ఈ లోకపు మనుషులు ఎలా తిరుగుతున్నారో!" అంటూ బైనాక్యులర్స్‌ని విజయానంద్‌కి ఇచ్చాడు.

విజయానంద్ ఉత్సాహంగా దానిలోంచి చూడసాగాడు. కొంచెం దూరంలో ఒక నగరం కనిపిస్తోంది. విచిత్రమైన భవనాలు, వింత ఆకారంలో వున్న మనుష్యులూ, ఆకాశంలో విచిత్ర రూపాల్లో ఎగురుతున్న పక్షులూ, దూరంగా వింత వింత ఆకారాలలో తిరుగాడుతున్న జంతువులు అంతా పరమాద్భుతం మహాద్భుతంగా ఉండి అతన్ని నిశ్చేష్టున్ని చేశాయి. కొంచెం ముందు ఒక వ్యక్తి పరుగెట్టుకు పోతున్నాడు.

"ఆ....అతనే నన్ను గుద్దుకుని ఉంటాడు" అని అరిచాడు. సుకుమార్ నౌకలోకి తిరిగి వెళ్లి అటువంటిదే మరో బైనాక్యులర్ తీసుకువచ్చాడు. దానిలోంచి చూస్తూ "అవును. అలాగే ఉంది. అతను భయపడి పోయి పరుగిడుతున్నట్లున్నాడు. బహుశా నువ్వు అతనికి కనిపించి ఉండవు. అందుకే వెళ్తూ వెళ్తూ నిన్ను గుద్దేశాడు. దాంతో భయపడిపోయి ఈ వింత సంఘటన గురించి తనవారికి చెప్పడానికి వెళ్తున్నట్లున్నాడు. కనుక ఏ ప్రమాదమూ రాకముందే ఇక్కడినుంచి మరోచోటికి పోదాం" అంటూ దారి తీశాడు సుకుమార్.

దారిలో"మనం వారిని చూడగలిగేటట్లు ఎలా చేశావు' అని అడిగాడు విజయానంద్.

"ఏముంది. ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుచ్ఛక్తిని ఎక్కువగానూ, తక్కువగానూ కావలసిన విధంగా మనం మార్చేసుకోవడంలేదా. అలాగే ఈ బైనాక్యులర్స్‌లోని అద్దాలు ఇక్కడి వస్తువులు ప్రసారం చేసే వేవ్‌లెన్‌గ్త్ లను మన కళ్ళు గుర్తించగల వేవ్‌లెన్‌గ్త్‌లకు మారుస్తాయి. అందువల్ల దీనితో మనం ఇక్కడి వాటిని చూడగలం" అంటూ విశదీకరించాడు సుకుమార్.

"ఫైన్ అయితే ఒక అనుమానం ఇక్కడి మనుష్యులనీ, జంతువులనీ, ఇతరవస్తువులనీ చూడలేకపోతున్నాం. కాని చెట్లని చూడగలిగాం. ఇదెలా సాధ్యం?" అని అడిగాడు విజయానంద్.

"ఏముంది సింపుల్, మన భూమి మీద చెట్లనే చూడు. అవి ఆకుపచ్చగా ఉంటాయి. ఎందుకని వాటిలో క్లోరోఫిల్ ఉంటుంది కనుక. మరి మనుష్యులకీ జంతువులకీ క్లోరోఫిల్ ఉండదుకనుక అవి పచ్చగా ఉండవు. అంటే వృక్ష నిర్మాణానికి జంతు నిర్మాణానికీ మౌలికమైన తేడా ఉందన్నమాట. అలాగే ఇక్కడి చెట్లు సిలికాన్‌తో ఏర్పడ్డాయి. సిలికాన్ ప్రసారం చేసే కాంతిని మనకళ్ళు గుర్తించగలవు. అందుకే వాటిని చూడగలిగాం" అని వివరించాడు సుకుమార్.

మరికొంచెం సేపట్లో వారు నగరం పొలిమేరలకు చేరుకున్నారు. అక్కడ కొందరు మనుష్యులు వస్తూపోతున్నారు. వారి రూపాలు కూడా ఇంచుమించు మనుష్యుల రూపాలనే పోలిఉన్నాయి. అయితే పొట్టిగా ఉన్నారు. వారు ఏదో మాట్లాడుకుంటున్నట్లు వారి పెదవులు కదులుతున్నాయి, కానీ శబ్దాలు మాత్రం వినిపించడంలేదు.

"ఊ" అంటూ తలపంకించాడు సుకుమార్. జేబులోంచి రెండు చిన్న డబ్బీలవంటి వాటిని తీసి చెవుల్లో పెట్టుకున్నాడు. అలాగే మరో రెండింటిని తీసి విజయానంద్‌కి ఇచ్చాడు. ఉత్తరక్షణంలో ఆ మనుష్యులు మాట్లాడుకుంటున్న మాటలు, నగరం లోని రణగొణ ధ్వని, పక్షులు జంతువుల అరుపులూ, అన్నీ స్పష్టంగా వినిపించసాగాయి. అయితే వారి భాష అర్థం కాలేదు.

"ఏమిటి వింత?" అని అడిగాడు విజయానంద్.

"ఏముంది" ఇక్కడ ఉత్పన్నమవుతున్న శబ్దాలన్నీ మనం వినలేని అల్ట్రాసొనిక్స్, అంటే వినిపించని శబ్దాలు. శబ్దం ఫ్రీక్వెన్సీ సుమారు ఇరవైవేల తరంగాలను దాటితే మన చెవులు వినలేవు కదా! ఇవి అటువంటివన్నమాట. ట్రాన్స్‌ఫార్మర్‌లోలాగానే వినిపించని ఈ అల్ట్రాసొనిక్స్‌ని మనం వినగలిగేటట్లుగా మారుస్తుంది మన చెవుల్లోని యంత్రం" అన్నాడు సుకుమార్. వారు నగరం వంక చూస్తూ మాట్లాడుకుంటున్నారు. ఇంతలో వెనకాల నుంచి బలమైన హస్తాలు ఇద్దరినీ ఒకేసారి పట్టుకున్నాయి. భయంగా ఒక్కసారి అరచి ఇద్దరూ వెనక్కి చూశారు. బైనాక్యులర్స్‌లోంచి ఆ లోకం వాసుల చేతుల్లో తాము చిక్కడం. వెనకాల నుంచి ఎందరో మనుష్యులు తండోపతండాలుగా వస్తుండడం కనిపించింది. తాము మిత్రులమనీ, శత్రువులు కామనీ తెలిసేటట్లు రకరకాల భంగిమలు చేశాడు సుకుమార్, కానీ వారికి అవేమీ అర్థమయినట్లు లేదు. తమవంక వింతగా చూస్తూ వారిలో వారు వింతగా నవ్వుకుంటున్నారు. వారి చేతుల్లో అద్దాలవంటివి ఏవో ఉన్నాయి. వాటిలోంచి వారు తమని చూస్తున్నారు. అంటే ఆ అద్దాలు కూడా తమ బైనాక్యులర్స్ వంటివన్నమాట.

కొద్ది నిమిషాలకు వారు సుకుమార్‌ని, విజయానంద్‌నీ తీసుకువెళ్ళి ఒక మ్యూజియం వంటి దానిలో వారిని బోనుల్లో ఉంచారు. కొంచెం దూరంలో వారి నౌకను ఉంచారు. తర్వాత వెళ్ళిపోయారు.

వీరు బాగా అభివృద్ధి చెందిన బుద్ధిజీవులు. మరి మన పట్ల ఇంత అనాగరికంగా ప్రవర్తిస్తున్నారేమిటో!" అన్నాడు విజయానంద్ బాధగా.

"అది సహజమే, చీమలు, తేనెటీగలు ఎంతో అభివృద్ధి చెందిన జీవాలు. వాటిలో కూడా మనుషులను పోలిన సంఘనిర్మాణం ఉంది. వాటిలో రాజులు, రాణులు, బానిసలు, ఉంటాయి. వారికి కేటాయించిన విధులే కాక ఆఖరికి వర్గ వ్యవస్థ కూడా ఉంది మనుషుల్లో లాగానే. అయినా మనం వాటిని హీనంగా చూడడంలేదూ. అలాగే మనకన్నా ఎన్నోరెట్లు అన్నివిధాలా అభివృద్ధి చెందిన వీరి కంటికి మనం అల్పజీవాల్లాగా కనిపిస్తుండడంలో ఆశ్చర్యం లేదు. ఒక వేళ చీమలు, తేనెటీగలు మనతో మాట్లాడాలని ప్రయత్నాలు చేసినా, సంకేతాలు పంపినా మనకి అర్థం కాదు. పట్టించుకోం. ఎందుకంటే వాటికీ మనకి అంతటి అంతరం ఉంది. కనీసం మనం వాటి భావాలను అర్థం చేసుకునే ప్రయత్నం కూడా చేయం. ఆ ఆలోచనే మనకి రాదు. అలాగే వీరూను. వారికి సరిగ్గా అర్థమయ్యేట్లు చెప్పలేం. వారు మనల్ని అర్థం చేసుకోవాలనుకోరు" అన్నాడు సుకుమార్ బరువుగా నిట్టూరుస్తూ.

"మరి ఇపుడేమిటి చేయడం?" అన్నాడు విజయానంద్ దిగులుగా.

"బాధపడకు, అభివృద్ధి అంతరం ఎంతగానో ఉన్న వీరితో మనం ఇప్పట్లో సంబంధాలు పెట్టుకోలేం కనుక ఇక్కడి నుంచి భూమికి వెళ్ళిపోవడమే మార్గం. ఇంకా మనం ఇక్కడే ఉంటే మనం గినీపిగ్స్ మీద ప్రయోగాలు చేసినట్లు మన మీద పరీక్షలు మొదలుపెడ్తారు అన్నాడు సుకుమార్.

"మరి ఎలా వెళ్ళడం!" అని అడిగాడు విజయానంద్ సుకుమార్ బైనాక్యులర్స్‌లో నుంచి నలువైపులా చూశాడు. సమీపంలో ఎవరూలేరు.

"ఇలా" అంటూ చిన్న చాకు వంటిది తీసి ఏదో బటన్ నొక్కాడు అది బోను ఊచల్ని వెన్నని

కోసినంత తేలికగా నిశ్శబ్దంగా కోసేసింది. ఇద్దరూ బయటపడ్డారు.

సమీపంలో ఉన్న కొన్ని మొక్కల్నీ, కొమ్మల్నీ, చిన్నచిన్న పురుగుల్నీ తీసుకుని తమ నౌకలోకి వెళ్ళారు.

"ఇది లేజర్ కిరణాలను కేంద్రీకృతంచేయడం వల్ల తయారైన కత్తి. ఇది ఎంతటి గట్టి వస్తువులనైనా అవలీలగా కోసివేస్తుంది". అంటూ నౌకలోని యంత్రాలను సరిచేయడం మొదలుపెట్టాడు సుకుమార్.

మరుక్షణంలో ఆ నౌక వారితో సహా కాంతిగా మారిపోయి అనంతాకాశంలో భూమండలం వైపుగా దూసుకుపోయింది.

**ఉదయం దినపత్రిక, ఆగస్టు, సెప్టెంబరు 1993** ✪

# గుండెల్లో గుండె

ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. దాంతో రాజకీయ పార్టీలలో స్తబ్దతపోయి చైతన్యం చోటుచేసుకుంది. పార్టీ కార్యాలయాలన్నీ తిరునాళ్ళలో దుకాణాల్లాగా వచ్చేపోయేవారితో కిటకిటలాడుతున్నాయి. మంది బలం చూపితేనే కాని పార్టీ అధినేతల ముఖాలలో మందహాసం కనిపించదని భావించి ప్రతి అభ్యర్థీ మందుబలంతో మందలను పోగుచేసి తమ మందిబలాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒక వర్ధమాన నాయకుడు మెళ్ళో దండలు వేసుకుని ముఖాన కుంకుమబొట్టు పెద్దగా నిలువుగా పెట్టుకుని చేతులు జోడించి చిరునవ్వులు చిలకరిస్తూ జీపులోనో, టాపులేని కారులోనో నిలబడి రోడ్డుమీద పోయే ప్రతివారికీ తల పదేపదే వంచుతూ నమస్కారాలు వర్షిస్తుంటాడు. ఆ వెనకనే మరికొన్ని కార్లూ, ఇంకొన్ని మోటారు సైకిళ్ళూ, స్కూటర్లు, ఆ వెనక సైకిళ్లబారులూ, వారివెంట పాదచారులూ, ఈ సంరంభం అంతా ఒళ్ళు బలిసినవారి పెళ్ళి ఊరేగింపులా సాగిపోతూ ఉంటుంది. "ఫలానావాడు జిందాబాద్ - ఫలానా పార్టీకి జై" వంటి నినాదాలు మిన్నుముట్టి సాటిలైట్స్‌ను తాకి తిరిగి భూమిని జేరే టి.వి. సిగ్నల్స్‌లాగా నలువైపులనుంచి ప్రతిధ్వనిస్తుంటాయి. పార్టీ ఆఫీసు లేదా నామినేషన్ వేసే ఆఫీసు దగ్గరయ్యేసరికి నినాదాల జోరు ఎక్కువవుతుంది. మద్దతుదారులు పూనకం పూనిన గణాచారులులాగా ఊగిపోతూ ఇల్లు ఊగిపోయే స్థాయిలో నినాదాలు చేస్తుంటారు. ఆ ఊగిపోవడానికి చుక్కబలంకూడా చక్కని కారణాలలో ఒకటి. ఇంక నామినేషన్ వేసేరోజున ఎల్లయ్యగారు రెండు వందలమంది మందీ మార్బలంతో వస్తే, పుల్లయ్యగారు మరో వందమందితో మరిన్ని వాహనాలతో వేంచేస్తారు. కామయ్యగారు ఇంకో రెండువందలమదినికలుపుకుని బాణసంచా పేలుస్తూ, టపాకాయలు కాలుస్తూ వస్తారు. భీమయ్యగారు ఇవన్నీ కాక పెద్ద బ్రాస్‌బాండ్‌మేళంతో వస్తారు. ఇలా ఎవరు ఎన్నివిధాల బలప్రదర్శన చేసినా పార్టీ నాయకుల అంతరంగాల్లోని అంచనాలు, ఆలోచనలు వేరుగా వుంటాయి. వారి 'ఎస్టిమేట్'లకు కొలమానాలు వేరుగా వుంటాయి. ధనబలం, కులబలం, కండబలం, గుండెబలం వగైరా బలాలన్నీ బలంగా పనిచేస్తాయి. ఆ ఊరు రాజకీయంగా చాలా చైతన్యవంతమైనది. ఆ నియోజకవర్గ ప్రజలు అనిమిషులవలె ఎప్పుడు ఎవరికి పట్టం కడ్తారో, పెద్దపీట వేస్తారో, ఎంతటి తల పండిన రాజకీయవేత్తలకూ అంతుపట్టదు. ఆ ఊరి ప్రత్యేకత ఏమిటంటే అక్కడ ఏ రాజకీయ పార్టీ అయినా ఓడిపోతే దాని ప్రభావం మిగిలిన నియోజకవర్గాలమీదకూడా వుంటుంది. అందుచేత ఏ పార్టీకూడా ధైర్యంచేసి సొంత జండామీద నిలబడదు.



ఏ ఇండిపెండెంట్ అభ్యర్థినో తమమీద ఇండిపెండెంట్‌గా నిలబెట్టి తెరవెనుకనుంచి మద్దతునిస్తుంది. ఆ అభ్యర్థి ఓడిపోయినా పార్టీ పరాజయం పొందినట్లనిపించదు. గెలిస్తే తెరవెనకనుంచి మద్దతిచ్చిన పార్టీలోకి దూరిపోతాడు. ఈ చాణక్యాన్ని అన్ని రాజకీయపార్టీలు అవలంబిస్తూనే వుంటాయి.

ఈసారి ఎన్నికలలో ప్రధానంగా రంగంలో వున్నవి తెల్లదుస్తుల పార్టీ, పచ్చగుడ్డల పార్టీ. వీటితరపున జయారావు, శ్యామారావు అభ్యర్థిత్వాలు ఖాయం అయ్యాయి.

ఇక రెట్టించిన ఉత్సాహంతో ఇద్దరూ రంగంలోకి దుమికారు. పొట్టేళ్లుగా పుట్టివుంటే తలతో ఢీకొని బరిలో బుర్రలు బద్దలుకొట్టుకునేవారు. అయితే ప్రజాస్వామ్యం మరీ పొంగి పొరలుతుండడంతో నోళ్లకి మాత్రమే పనిపెట్టి తిట్లవర్షంతో సంతృప్తిపడసాగారు. వారి ఉపన్యాసాలలో తాము గెలిస్తే చేయ తలపెట్టిన ఘనకార్యాల గురించిన ప్రస్తావన మచ్చుకి కూడా కనిపించేదికాదు. శ్యామారావు దగుల్బాజీ అని జయారావు, జయారావు 420 అని శ్యామారావు ఇలా తిట్టినతిట్టు తిట్టకుండాకొత్త కొత్త తిట్లను కనిపెడ్తూ ఆ తిట్లను కొత్త తరహాలో జనం ముందు వదులుతూ శ్రోతలకు కావలసినంత ఉచిత వినోదం కల్పించసాగారు. అంతేకాదు, ఈసారి ఎన్నికలలో ఆడియో కేసెట్లు, వీడియో కేసెట్లు ముమ్మరంగా విడుదల అయ్యాయి. వీటిలో వ్యంగ్యాత్మకంగా, అన్యాపదేశంగా జోకులు, చెణుకులు, నాటికలు, గేయాలు, రూపకాలు వగైరా వగైరా ఆకాశవాణి, దూరదర్శన్‌ల వారికి కూడా తెలియని కొత్త కొత్త ప్రక్రియలలో కూడా ప్రాద్యూస్‌చేసి జనం మీదికి వదలసాగారు. ఇవికాక వీధినాటకాలు, బుర్రకథలు, జానపద గీతాలు వంటివి ఎక్కువగా

పల్లెప్రజల పాలిట పద్మాయి. ఇంక రథయాత్రలు సరేసరి. మొత్తంమీద ఆంధ్రావని అంతా నవచైతన్యంతో, కొత్త యౌవనంతో పెళపెళలాడిపోతోంది. ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ ఆత్మస్తుతీ, పరనిందా దినచర్యలో భాగం అయ్యాయి. పరస్పర దూషణలు పరిమితులు దాటిపోయాయి. వారి అభిమానులూ, వీరి అనుచరులూ ఒకచోట తారసిల్లడం తటస్థిస్తే కొట్టుకోవడం రూలు అయిపోయింది. జయరావు, శ్యామారావు ఎప్పుడూ ఒంటరిగా ఎదురుపడలేదు. కాని పడి వుంటే ఒకరినొకరు చంపుకునేవారే.

ఎలాగైతేనేం! ఎన్నికల పర్వం ముగిసింది. ఆ యుద్ధకాండ ముగిసేసరికి స్మశాన ప్రశాంతత నెలకొంది జయరావు విజయం పొందాడు. అయితే చావుతప్పి కన్నులొట్టబోయినట్లు కేవలం 111 ఓట్ల మెజారిటీతో గెలిచాడు. అన్యాయం, అక్రమం, రిగ్గింగ్, దొంగోట్లు ఈ ఎన్నిక చెల్లదు అంటూ రుద్రతాండవం చేయసాగాడు శ్యామారావు. తిరిగి ఓట్లు లెక్కింపు జరగాలని పట్టుబట్టాడు. ఆయన కోరిక మేరకు తిరిగి ఓట్ల లెక్కింపు జరిగింది. అందువల్ల కేవలం పై పదకొండు ఓట్లు తగ్గాయికాని ఎన్నికల ఫలితం మాత్రం మారలేదు. శ్యామారావు అగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు. అక్రమాలతో గెలిచారని ఎగస్పార్టీవారినీ గెలిపించలేకపోయినందుకు తమ వారినీ తరతమ బేధం లెకుండా పక్షపాత రహితంగా తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. ఎంతటి అస్మదీయుడైనా ఎదుట పడితే కరిచేటట్లు, కొరికేటట్లు ప్రవర్తించసాగాడు. దాంతో ఆ ఉగ్రనరసింహావతారం దగ్గరకు వెళ్లడానికి ఎవరూ ధైర్యం చేయలేకపోయారు. తిట్టి తిట్టి అలసిపోయాకె శాంతించాడు శ్యామారావు. కాలం ఎటువంటి గాయాలనైనా మాన్పుతుంది. అయితే ఎన్నో అక్రమాల పట్టికనొకదానిని తయారుచేసి జయరావు ఎన్నిక చెల్లదంటూ కోర్టులో కేసు వేశాడు. కోర్టులో తనకు తప్పక విజయం సిద్ధిస్తుందన్న ధీమాతో ఆశాజీవిగా బ్రతకసాగాడు శ్యామారావు.

కొద్దికాలం గడిచింది. శ్యామారావు పెట్టిన కేసు కోర్టులో ఊరగాయలో ముక్కలాగా నానుతూనే వుంది. అతని గుండెలో పగ మాత్రం భగభగమని పైకి అనకపోయినా నివురుగప్పిన నిప్పులా లోలోపలే రాజుకుంటోంది. ఆ ఊరిలోని పెద్దలు కొందరికి కల్యాణ మంటపం కమ్ ఫంక్షన్ హాల్ కట్టించాలన్న సత్సంకల్పం కలిగింది. దానికి నిధులు సమకూర్చే నిమిత్తం మదరాసునుంచి, హైదరాబాదునుంచి సినీ కళాకారులను రప్పించి బ్రహ్మాండమైన కార్యక్రమం ఒకదానిని ఏర్పాటు చేశారు. ఆ ప్రోగ్రాంకి పురప్రముఖులు ఎందరినో ఆహ్వానించారు. సహజంగా ఊరి ఎమ్మెల్యే అయిన జయరావునీ, గతంలో ఒక వెలుగు వెలిగిన మాజీ ఎమ్మెల్యే శ్యామారావునీ పిలిచారు. ఆ నియోజకవర్గపు ఎం.పి అయిన రాజుగారిని ఆనాటి ఫంక్షన్‌కి అధ్యక్షుని చేశారు. జయరావుకి మెమెంటోలు ప్రదానంచేసే బాధ్యతను అప్పజెప్పారు. ఎంతచెడ్డా శ్యామారావు కూడా పలుకుబడిగల ఊరిపెద్ద. పైగా గతంలో ఎమ్మెల్యేగా వుండడమేకాకుండా కింగ్‌మేకర్ అని అనిపించుకున్నంతటి పలుకుబడిగలవాడు. అదృష్టం తిరగబడి వెంట్రుకవాసిలో విజయం తన్నిందికాని మరోసారి ఎన్నికలు జరిగితే గెలిచే అవకాశాలు పుష్కలంగా వున్నవాడు అంతదాకా ఎందుకు? కోర్టు కేసు అతని పక్షాన అయిందంటే జయరావుని ఓతోపు తోసి అమాంతం ఎమ్మెల్యేగానూ, ఆ తర్వాత అమాత్యునిగానూ రాగలిగినవాడు. అందువల్ల ఆయనను ఎప్పుడూ ప్రసన్నునిగా చేసుకోవడం అవసరం. ఇవన్నీ ఆలోచించి శ్యామారావుకు సావనీర్‌ని విడుదలచేసే గౌరవం కల్పించారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వేదికమీదకు ఆహ్వానించారు. యాదృచ్ఛికంగానో, ఉద్దేశపూర్వకంగానో వారు ఉభయులూ ప్రక్క ప్రక్క ఆసనాలలో కూర్చోవడం జరిగింది. ప్రైవేట్‌గా త్వం శుంఠః త్వం శుంఠః అని తిట్టుకున్నా అది

సభావేదిక కాబట్టి, సభామర్యాదలు అంటూ కొన్ని అఘోరించాయి కనుక, పైకిమాత్రం ముఖాలకు నవ్వులు పులుముకుని, ఆపేక్షలు ఒలకబోసుకుంటూ, నోళ్లు వెడల్పు చేసుకుని అట్టహాసం కాకపోయినా మందహాసాలతో హుందాగా మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. అది చూసినవారికి "కలయో-కలియుగ మాయయో, సభా మహత్యమో అన్నంత ఆశ్చర్యం కలిగి వారి అన్యోన్యం కలకాలం వుండాలని కోరుకున్నారు. సావనీర్ విడుదల చేసే సందర్భంలో శ్యామారావు చిరుప్రసంగం చేశారు. ఊరిపెద్దల సత్సంకల్పాన్ని కొనియాడుతూ. శ్రమపడి సమీకరించిన నిధులను పరాన్నభుక్కులు, పందికొక్కులు తినకుండా జాగ్రత్త పడాలి అని హెచ్చరించారు. "పందికొక్కులు" అన్నమాటను ఉచ్చరిస్తున్నప్పుడు ఓరకంట తన వంక కొంటెగా చూసినచూపు సూటిగా జయరావు గుండెలో ఈటెలా దిగింది.

ఆ తర్వాత మెమెంటోల ప్రదానం అయ్యాక జయరావు ప్రసంగించాడు. మర్యాద వాచకాం అయ్యాక అన్యాపదేశంగా శ్యామారావుని దెప్పిపొడిచాడు. నిస్వార్థంగా ఊరిపెద్దలు నిధులు ప్రోగుచేసినా ఈనగాచిన పంటను మింగివేయడానికి నక్కలు కాచుకుని వుంటాయని నిలువెల్లా స్వార్థంగల తోడేళ్లు నిధులను స్వాహా చేయడానికి సిద్ధంగా వుంటాయని, వాటిని దరిదాపులకు రాకుండా తరిమికొట్టాలని అవసరమైతే అంతం చేయాలని హెచ్చరించాడు. ఇద్దరూ తిరిగి యధాస్థానాలలో కూర్చున్నాక ముఖాలు కందగడ్డలుగా మారినా, మీగడ తరగల్లాగా ముఖాలకు కాస్తంత చిరునవ్వుని పులుముకున్నారు. అధ్యక్షులవారు కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా సన్మానించడంకోసం వేదికకు ఒక ప్రక్కగా వెళ్లారు. శ్రీవారు అటు వెళ్లగానే శ్యామారావు నిప్పులు చెరిగే కళ్లతో "ఏమిటి నా అంతం చూస్తావా...నీ తరమా... నీ అబ్బ తరమా" అన్నాడు నెమ్మదిగా ప్రక్కనే వున్న జయరావుతో.

"నీ అంతం చూడడానికి నా అబ్బను పిలవనక్కరలేదు. నేను ఒక్కడిని చాలు" అన్నాడు. జయరావు మెల్లగా.

"నువ్వేం చూస్తావు. నీ గుండెలోనో గూడుకట్టుకుని కూర్చుంటా. పక్కలో బల్లెంలా నిలుస్తా ఏమిటనుకుంటున్నావో!"

"నా గుండెల్లో ప్రవేశించావంటే నీ పని అంతే. పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిలాగా, సాలెగూట్లో చిక్కుకున్న ఈగలాగా అక్కడే సమాధి అయిపోతావు. ఏమనుకుంటున్నావో! పక్కలో బల్లెం అంటున్నావు. అసలు నీకు బొక్కలుకూడా మిగలవు".

"చూద్దాం ఎవరు ఎవరిని ఏంచేస్తారో!"

"అలాగే చూద్దాం!"

అధ్యక్షులవారు తిరిగి యధాస్థానానికి రావడంతో శ్యామరావు, జయరావుల సరస సంభాషణకి తెరపడింది. మళ్లీ మందహాసం ముఖాలకు ఎక్కింది. నిర్వాహకుల వందన సమర్పణతో సభ విజయవంతంగా ముగిసింది.

జయరావు తన నియోజకవర్గంలో తరచుగా పర్యటనలు చేస్తూ ప్రజలను కలుసుకోసాగాడు. అలా చేస్తే ముఖ్యమంత్రిగారి కంటబడడమో, వార్తలు వారి చెవికిచేరడమో జరిగి, మంత్రివర్గ విస్తరణలో తనకు ఓ మంత్రి పదవి దొరకవచ్చునని ఆశ.

శ్యామరావుకూడా ఆ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించసాగాడు. పదవి కోల్పోయినవారి ముఖం ప్రజలు చూడరని అయనకు బాగా తెలుసు. అందువల్ల వారి ముఖాలను తానే చూడాలనుకున్నాడు. ఆ విధంగా చేస్తుంటే ఏవో కార్యక్రమాలు పెట్టి వారి మధ్యన తిరుగుతుంటే అవే పెట్టుబడిగా మారి భవిష్యత్‌లో తనకు విజయ ప్రాప్తికి దోహదపడ్తాయని నమ్మకం.

ఒకసారి పర్యటనలో వుండగా జయరావుకి అమితమైన గుండెనెప్పి వచ్చింది. వెంటనే హుటాహుటిన ఆస్పత్రిలో జేర్పించారు. అది తీవ్రమైన గుండెపోటు అనీ, అయితే మొదటిసారి కావడం, వెనువెంటనే వైద్య సహాయం లభించడంవల్ల ప్రమాదం తప్పిందనీ వైద్యులు చెప్పారు. ఆయన పర్యటనలు బొత్తిగా మానేసి పూర్తి విశ్రాంతి తీసుకోవాలని హెచ్చరికలాంటి సలహా ఇచ్చారు. ఆయన గుండె బాగా దెబ్బతిందనీ, మరో అటాక్ వస్తే వేరే గుండెను ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సిన అవసరం కలగవచ్చునని కూడా సూచనప్రాయంగా చెప్పారు ఆయన బంధువులకు.

జయారావుకి గుండె జబ్బు వచ్చిందని తెలిసి పట్టరాని సంతోషంతో పరవశించిపోయాడు శ్యామారావు. "ఈ ఓటిగుండెవాడా నన్ను తనగుండెలో బిగిస్తానని ప్రగల్భాలు పలికింది" అనుకుని నవ్వుకున్నాడు. తన పర్యటనలను మరింత ఉధృతంగా జరుపసాగాడు. ప్రజలు తన ముందు ఏమంటారో తెలుసు. వెనుక తన గురించి ఏమి వ్యాఖ్యలు చేస్తున్నారో తెలుసుకోవడంకోసం మారువేషాల్లో ఒంటరిగా సంచరించడంకూడా మొదలుపెట్టాడు. అటువంటప్పుడు ఆయన ఆచూకీ ఆయన అంతరంగికులకు కూడా తెలిసేదికాదు.

జయరావు ఆరోగ్యం కొంత కుదుటపడింది. తిట్టేనోరూ, తిరిగే కాలూ ఊరుకోవన్నట్లు వద్దన్నా వినకుండా మళ్లీ పర్యటనలు మొదలుపెట్టాడు. డాక్టర్ హెచ్చరిక ఆయన చెవిన వేస్తే ఆ ఓటిగుండె కాస్తా నూటిగా ఆగిపోతుందేమో, ట్రాన్స్‌ప్లాంట్ వ్యవధికూడా లేకుండా పోతుందేమోన్న భయంతో చెప్పలేకపోయారు ఆయనవాళ్లు.

ఆరోజు పర్యటనలో వుండగా జయరావుకి రెండోసారి ఉధృతంగా హార్ట్ ఎటాక్ వచ్చింది. వెంటనే ఆయన్ని ఆఘమేఘాలమీద సూపర్‌స్పెషాలిటీస్ ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు పరీక్షించి నలభై ఎనిమిది గంటల్లోగా హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ చేయాలనీ లేదా బ్రతకడం కష్టమనీ తేల్చి చెప్పేశారు. ఈ లోగా ఆరోగ్యవంతుడైన వ్యక్తి ఎవరైనా యాక్సిడెంట్‌లో చనిపోతే ఆ గుండెను సేకరించి ట్రాన్స్‌ప్లాంట్ చేయవచ్చునని చెప్పారు. అటువంటి గుండెకోసం అన్ని ఆస్పత్రులనూ అలెర్ట్ చేశారు. జయరావు బంధువులు, అభిమానులు ఆరోగ్యవంతుడైన వ్యక్తి ఎవరైనా యాక్సిడెంట్‌లో మరణించాలని, ఆ గుండెతో జయరావు బ్రతకాలనీ కోరుతూ ప్రార్థనలు మొదలుపెట్టారు. వేయి దేవుళ్లకు లక్షమొక్కులు మొక్కుకున్నారు.

భగవంతుడు వారి మొర ఆలకించాడో ఏమో ఎవరో ఆరోగ్యవంతుడైన నడివయస్కుడు ప్రమాదవశాత్తు రైలుక్రింద పడి మరణించాడనీ, అతని ముఖం గుర్తుపట్టలేనంతగా శిథిలం కావడంతో అతడు ఎవరైనదీ తెలియలేదనీ, మనిషి ఊరివానిలా అనిపిస్తున్నాడనీ, వేరే ఆధారాలు ఏవీ లేవనీ వార్త వచ్చింది. వెంటనే అతని గుండెను సేకరించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. వైద్యులు మొక్కుబడిగా పోస్టుమార్టంచేసి గుండెను భద్రంగా తీసి చేతికిచ్చారు. జయరావుకి హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ విజయవంతంగా

జరిగింది. రెండు మూడు వారాలలోనే పనులన్నీ యధాప్రకారం చేసుకోగలుగుతున్నాడు. అయితే వైద్యుల హెచ్చరిక మీద టూర్లు బొత్తిగా మానివేశాడు. అయితే ఆయనలో ఏదో మార్పు వచ్చింది. రానురాను అది ప్రస్ఫుటం కాసాగింది. విపరీతమైన కోపం, అసహనం రాసాగాయి. ప్రతివారినీ తిట్టడం, కొట్టేంత పనిచేయడం మొదలుపెట్టాడు. తనకి సంబంధించిన మనుష్యులైతే మరీనూ. వాళ్లని చూస్తే అగ్గిమీద గుగ్గిలం అయిపోసాగాడు. అద్దంలో తనను చూసుకున్నా విపరీతమైన కోపం వచ్చేది. కోపంతో అద్దాన్ని పగలగొట్టేవాడు. ఎవరిమీదనో ప్రతీకారం తీర్చుకోవాలన్న కోరిక ప్రబలంగా వున్నట్లనిపిస్తుండేది. ఆ ప్రగాఢ వాంఛతో గుండె బ్రద్దలైపోతుందేమోననిపించేది. చూసేవారికి అసలు ఈయన జయరావేనా అన్న అనుమానం వస్తుండేది.

పాండవుల అరణ్యవాసం, అజ్ఞాతవాసం పన్నెండేళ్లు. రాముని అరణ్యవాసం పద్నాలుగేళ్లు. శ్యామరావు అజ్ఞాతంగా మారువేషాలలో ఎంత తిరిగినా రెండు మూడు వారాలు మించి వుండేదికాదు. ఈ ఈసారి రెండు నెలలు గడుస్తున్నా ఆయన అయిపులేడు. ఆయన కుటుంబీకులు, అనుచరులు, ఆశ్రితులు, అభిమానులు అందరూ ఆందోళనతో అలమటించసాగారు.

జయరావు వింత ప్రవర్తన మితిమీరుతుండడంతో ఆయన్ని సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకువెళ్లారు. వాళ్లు జయరావుకి అమర్చిన గుండె, ఆయన్ని విపరీతంగా ద్వేషించేవ్యక్తి ఎవరిదో అయి వుండాలని అందుకే ఆయన తనపైన, తనవారిపైన ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నాడని తెలిపారు. ఇది ముదిరితే ఆయన హత్యలుకూడా చేయగలడనీ లేదా ఆత్మహత్యకూడా చేసుకోవచ్చుననీ హెచ్చరించారు. తమ వైద్యబృందం కూలంకషంగా చర్చించి తగిన చికిత్స త్వరలోనే మొదలుపెట్టామని చెప్పారు. ఎప్పుడైతే ఈ విషయం రూఢీ అయిందో శ్యామరావు అంతర్ధానానికీ, జయరావు వింత ప్రవర్తనకీ సంబంధం లేదుకదా అన్న అనుమానం వచ్చింది. ఈ కొత్తకోణంలో పరిశోధన ప్రారంభించేసరికి శ్యామరావు మారువేషంలో సంచరిస్తుండగా రైలు క్రిందపడి మరణించారనీ, ఆయన గుండెనే జయరావుకి అమర్చడం జరిగిందన్న విషయం బయటపడింది. ఎంత కట్టడిచేసినా ఈ వార్త గుప్పుమంది. జయరావుకీ తెలిసింది.

జయరావు ఆనందానికి అవధులు లేవు. "ఒరే శ్యామరావు... నువ్వు నన్ను చంపుతానని ప్రగల్భాలు పలికావు. ఇప్పుడు నువ్వే చచ్చావు. అంతేకాదు. నేనన్నట్లు నా గుండెల్లోనే బందీ అయ్యావు. ఇప్పుడేం చేస్తావు?" అంటూ పగలబడి నవ్వసాగాడు.

లోపలనుండి తన గుండె అతి త్వరగా విస్తరిస్తున్నట్లు అనిపించింది.

"నీ గుండెల్లో గూడుకట్టుకుని వుండి నీకు శాంతిలేకుండా చేస్తానని" ఎవరో అంటున్నట్లు అనిపించింది. తన ఎదను ఎవరో నలిపివేస్తున్నట్లు చీల్చివేస్తున్నట్లు అనిపించింది. జయరావు కొత్త గుండె ఆనందాతిరేకాన్ని తట్టుకోలేకపోయిందో, శ్యామరావు ప్రతీకారపు పరవళ్ళను భరించలేకపోయిందో కాని పగిలిపోయింది.

"అమ్మా" అని అరుస్తూ ఎదపై చేయి వుంచుకుని కుప్పకూలిపోయాడు జయరావు. పాల పొంగు చల్లారినట్లు అదిరిపడుతున్న గుండె ఆగిపోయింది.

ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, అక్టోబర్ 1996 ✪

# సమాధిలో చైతన్యం

"అమెరికా 2010 సంవత్సరంలోగా అంగారక గ్రహం మీదికి వ్యోమగాములను పంపడానికి పథకాలు రచిస్తోందట. ఈ రోజు పేపర్లో వచ్చింది, చూశావా?" అని అడిగాడు ప్రొఫెసర్ కిరణ్‌కుమార్.

"చూశాను. అసలు 1985లోనే అంగారకుని మీదకు ఇద్దరు అంతరిక్ష యాత్రికులను పంపాలని అమెరికాలోని నాసా కేంద్రం పథకాలను రూపొందించింది. కాని కుదరలేదు. తిరిగి ఈ శతాబ్దంలోగానైనా యాత్ర జరిపించాలని ప్రయత్నాలు చేసింది. కాని ఫలించలేదు. మరో రెండు దశాబ్దాలకైనా విజయం సిద్ధిస్తుందా అనేది అనుమానమే" అన్నాడు శ్యాంసుందర్. ఆయనా ప్రొఫెసరే.

"అదేమిటి శ్యాం. 1969లో ముగ్గురు వ్యోమగాములు చంద్రుని చేరగలిగారు కదా! వారిలో నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రతలంపై తొలిసారి పాదం మోపాడు. అతని వెనకే ఆల్డ్రిన్ కూడా అడుగుపెట్టాడు. కాలిన్స్ అంతరిక్ష నౌకను కంట్రోల్ చేస్తూ పైనుంచి చంద్రప్రదక్షిణాలు చేశాడు. అటువంటి అమెరికాకి అంగారక గ్రహయాత్ర అసాధ్యం అంటావా?" అన్నాడుకిరణ్.

"అసాధ్యం, అనను కాని బహు కష్టసాధ్యం అంటాను. చంద్రమండల యాత్రకి మూడురోజులు మించి అవసరంలేదు. కనక అది సాధ్యం అయింది. అదే అంగారకుని చేరాలంటే కనీసం పదిపన్నెండు నెలలు పడుతుంది. వ్యోమగాములు కనీసం ఇద్దరైనా ఉండాలి. వెళ్ళిరావడానికి కనీసం ఏణ్ణార్థం పడుతుంది. అంతకాలానికి వారిద్దరికీ సరిపడా ఆహారపదార్థాలు, సరుకులూ, సంభారాలు ఎన్ని ఉండాలి! అన్ని పట్టడానికి ఎంత పెద్ద అంతరిక్ష నౌక కావాలి? అంతటి నౌకను అంతరిక్షంలోకి నెట్టడానికి ఎంతటి శక్తి అవసరమవుతుంది! ఎంతపెద్ద రాకెట్‌ను నిర్మించవలసి ఉంటుంది! ఇవన్నీ అంత సులవుగా పరిష్కారం దొరకని సమస్యలు. వీటికి ఆచరణాత్మకమైన పరిష్కారం లభించినప్పుడే గ్రహాంతర యానం సుసాధ్యమవుతుంది. అప్పటివరకు మనుషులు లేని వ్యోమనౌకలను పంపి యంత్రాలతోకాని, రోబోట్‌లతో కాని పరిశోధనలు జరిపిస్తుండవలసిందే."

"ఇప్పుడు సోజర్నర్, పాత్‌ఫైండర్ వంటివి అంగారకుని మీద పరిశోధనలు చేస్తున్నట్లన్నమాట."

"కరెక్టు. రోబోట్‌లను పంపితే ఇంకా విస్తృతంగా పరిశోధనలు జరపవచ్చు. సోజర్నర్స్, పాత్‌ఫైండర్‌లు ఎంతటి విలువైన సమాచారాన్ని పంపుతున్నాయో తెలుసుగా! ఇవి ఆ గ్రహం మీద మానవుడు కాలూనగల ప్రదేశాలను గుర్తించి ఆ సమాచారాన్ని భూమికి పంపుతాయి. అందువల్ల ఆ సమాచారం ఆధారంగా



చేపట్టే యాత్రలు సురక్షితంగా జరుగుతాయి."

"అది సరే. ఇంతకుముందు కొలంబియా, డిస్కవరీ వంటి స్పేస్ షటిల్స్‌లోనూ, మీర్‌వంటి అంతరిక్ష నౌకలోనూ, రోదసీ యానం చేసిన వ్యోమగాములు కొందరు అంతరిక్షంలో యోగాసనాలకు సంబంధించిన ప్రయోగాలు చేశారనీ, అవి ఆసక్తిదాయకమైన సత్ఫలితాలను ఇచ్చాయనీ, సైన్స్ జర్నల్స్‌లో చదివాను. వాటి ప్రయోజనం ఏమిటి?"

"మన హైద్రాబాద్‌కి చెందిన రాకేష్‌శర్మ, రష్యన్ వ్యోమనౌకలో అంతరిక్ష యానం చేసినప్పుడు యోగాసనాలపై పరీక్షలు చేశాడు. అమెరికా, రష్యాలు అంతరిక్షంలో యోగాసనాలపై పరీక్షలను ఏ ఉద్దేశ్యంతో చేశారో తెలీదుకాని, యోగాసనాలు శరీర ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయని, మెరుగుపరుస్తాయని తెలిసినదే. అంతరిక్ష యాత్రికులకి, భారరహిత స్థితిలో ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుంది. అటువంటి పరిస్థితిని యోగాసనాలు ఏవిధంగా చక్కబరచగలవో తెలుసుకోడానికి ఈ పరీక్షలు జరిపి ఉండవచ్చు. ఆ.... అన్నట్టు కైరోలో న్యూఫైండింగ్స్ ఇన్ మాలిక్యులార్ బయాలజీ అన్న అంశంపై ఇంటర్నేషనల్ సెమినార్ జరగబోతోంది కదూ! దీనిలో ప్రత్యేకించి యోగా రిసెర్చ్ పై ఒక సెషన్ ఉంది. ఈ సెషన్‌లో యోగా ఇన్‌స్పేస్ ట్రావెల్ అని ఒక టాపిక్ ఉంది. ఆ టాపిక్‌పై ప్రెజెంట్ చేసే పేపర్లలో కొత్త విషయాలు ఎన్నో బయట పడవచ్చు" అన్నాడు శ్యాం సుందర్.

''మనం పనిచేస్తోంది సి.సి.ఎం.బిలో కదా! మనకి ఈ సెమినార్ విశేషాలు చాలా ఆసక్తిని కల్పిస్తాయి'

"మన సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ ఇటువంటి సెమినార్‌లకు తన ప్రొఫెసర్‌లను, సైంటిస్టులనూ పంపుతూ ఉంటుంది. ఈసారి కూడా ఇన్విటేషన్ వచ్చి ఉండవచ్చు. మరి వాళ్ళు ఎవరిని పంపిస్తారో!"

''మనల్ని పంపిస్తే ఎంత బాగుంటుంది!"

"నిజమే. మనిద్దరిలో కనీసం ఒకర్ని పంపినాచాలు."

"కానీ... ఇంకా మూడునెలల టైం ఉందిగా!చూద్దాం."

లంచవర్ అయిపోతుండడంతో మిత్రులిద్దరు తమ తమ డిపార్ట్‌మెంట్‌లకు వెళ్ళిపోయారు.

హైద్రాబాద్‌లోని సి.సి.ఎం.బిలో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ శ్యాంసుందర్‌లు సైంటిస్టులుగా ప్రవేశించారు. సీనియారిటీ ననుసరించి డాక్టర్ శ్యాంసుందర్ ప్రొఫెసర్‌గా ప్రమోట్ అయ్యాడు. కిరణ్ సీనియర్ సైంటిస్టుగా వుండి ప్రొఫెసర్ పోస్టు ఖాళీ వస్తే అందులో అడిషినల్ చార్జితో పనిచేస్తున్నాడు. ఇద్దరు పనిచేసేది జెనెటిక్ ఇంజనీరింగ్ శాఖలోనే. వారు నిత్యము జీన్స్ డి.ఎన్.ఎ బయోకెంట్స్ వంటి జన్యు సంబంధమైన విషయాలలో పరిశోధనలు చేస్తుంటారు. అందుకే వారికి యోగ విషయాలపై ప్రత్యేక ఆసక్తి.

* * * *

ఆరోజు సి.సి.ఎం.బి డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి శ్యాంసుందర్‌ని, కిరణ్‌ని తన ఛాంబర్‌కి పిలిచాడు.

"మిస్టర్ శ్యాం, మిస్టర్ కిరణ్....స్వామీ రామానంద పేరువిన్నారుగా" అని అడిగారు ఆయన.

"విన్నాను. హిమాలయాల్లో హరిద్వార్‌లోనో, హృషీకేశ్‌లానో ఉంటారని చదివాను.ఆయన గొప్ప యోగి అనివిన్నాను'' అన్నాడు శ్యాం.

"ఆయన సమాధిలో రోజుల తరబడి ఉంటారని, పరీక్షల నిమిత్తం శాస్త్రజ్ఞుల ముందు సమాధిలోకి వెళ్లారని నేనూ చదివాను''అన్నాడు కిరణ్.

కరెక్టు. అమెరికాలోని నాసా సంస్థ యోగ శక్తులపై ప్రత్యేక ఆసక్తి చూపిస్తోంది. స్వామీ రామానంద గురించి వారు విన్నారు. అందువల్ల వారి శాస్త్రజ్ఞుల సమక్షంలో డిమాన్‌స్ట్రేషన్ ఇమ్మనీ కోరింది. సమాధి స్థితిలో ఉండగా ఆయనపై పరీక్షలు నాసా వారికే కాదు-మన సి.సి.ఎం.బి కి కూడ చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. అందువల్ల దానికి మీ ఇద్దర్నీ డిప్యూట్ చేస్తున్నాను. వచ్చే నెలలో వెళ్లడానికి సిద్ధంగా ఉండండి' ' అన్నాడు డాక్టర్ కుమారస్వామి.

''థాంక్యూసర్ థాంక్యూ... ఉయ్ ఆర్ గ్రేట్‌ఫుల్ టుయు'' అన్నాడు శ్యాం సంతోషాతిరేకంతో.

''మి టూ సార్. మీరన్నట్లు ఈ పరీక్షలు మన సెంటర్‌కి చాలా హెల్ప్‌ఫుల్‌గా ఉంటాయి" అన్నాడు కిరణ్.

మరోవిషయం. మరో మూడునెలల్లో ఈజిప్టులోని కైరోలో ఇంటర్నేషనల్ సెమినార్ జరగబోతుంది. మన ఇన్‌స్టిట్యూట్‌నుంచి ఇద్దర్ని పంపమని ఆహ్వానం వచ్చింది. ఎవర్ని పంపేది ఇంకా డిసైడ్ చేయలేదు.

ఆ ఇద్దరూ మీరేకావచ్చు. అదే జరిగితే ఢిల్లీలో మీరుచేసే అబ్జర్వేషన్‌లు మీకు ప్లస్‌పాయింట్స్ అవుతాయి' అన్నాడు డాక్టర్ కుమారస్వామి మళ్ళీ.

"మీకు ఏంచెప్పాలో అర్థంకావడంలేదు సార్. యు ఆర్ అవర్ గాడ్ ఫాదర్' అన్నాడు శ్యాం ఆనందాతిరేకంతో

"దట్సాల్‌రైట్. క్యారీ ఆన్. ఆల్ దిబెస్ట్'' అన్నారాయన.

* * * *

ఢిల్లీలో సామీ రామానంద ఇచ్చే యోగ ప్రదర్శనకు రంగం సిద్ధమైంది.ఆయన ఆశ్రమంలో గాలీ,వెలుతురు చక్కగా వచ్చే గదిలోకి రామానందకి తల్పం ఏర్పాటుచేసారు. నాసానుంచి ఒకశాస్త్రజ్ఞుల బృందం వచ్చింది. సి.సి.ఎం.బి నుంచి డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ కిరణ్‌లు అలాగే మరికొన్ని ఇతర సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు వచ్చారు. అందరూ కలసి సుమారు ఇరవైమంది ఉన్నారు.

సామీ రామానంద సూర్యోదయాన్నే శుచిగా స్నానం చేసి పూజాదికాలు నిర్వహించి తనకు ఏర్పాటు చేసిన హాలులోకి వచ్చారు. అక్కడ సమావేశమై ఉన్న శాస్త్రజ్ఞుల బృందాన్ని, పత్రికా ఆకాశవాణి, టీవీలకు చెందిన రిపోర్టర్‌లను ఉద్దేసించి ప్రసంగించారు.

"నేను మరో పదినిమిషాలలో అంటే సరిగ్గా ఏడు గంటలకు నాసా ఏర్పాటు చేసిన గదిలోకి ప్రవేశిస్తాను. అప్పుడు మీరు పరీక్షలు జరపవచ్చు. నేను పూర్తిగా సమాధి స్థితిలోకి వెళ్ళాక నేనుండగానే గదికి తాళాలు వేసి, సీలు చేసి తాళంచెవులు మీవద్దనే ఉంచుకొండి. మీరు కావాలనుకున్నప్పుడు రోజూ గది తలుపులు తెరచినన్ను పరీక్షించవచ్చు. అటుతర్వాత మళ్లీ గదికి తాళాలు వేసి సీలు చేయండి. ఈ రోజునుంచి సరిగా ఏడవరోజు ఉదయం ఏడుగంటలకు తిరిగి చైతన్నంలోకి వస్తాను నేను చైతన్యంలోకి వచ్చేముందునుంచి పూర్తిగా చైతన్యం పొందేవరకు మీరు మళ్ళీ పరీక్షలు జరపవచ్చు. అంటూ ముగించారు.

శాస్త్రజ్ఞులు స్వామీజికి ధన్యవాదాలు తెలిపారు. స్వామీరామానంద తన గదిలోనికి వెళ్లి తల్పం మీద శవాసన భంగిమలో వెల్లకిలా పడుకుని కనులు మూసుకున్నారు.

కొందరు ఆగదంతా క్షుణ్ణంగా పరిశోధించారు. ఆ గదిలో స్వామీజి పడుకున్న తల్పం తప్ప వేరేమీలేదు.

శాస్త్రవేత్తలు ఆయన శ్వాసను, గుండె కొట్టుకోవడాన్ని రక్తపుపోటును పరీక్షించారు. అవన్నీ నార్మల్‌గా ఉన్నాయి. క్రమేపీ అవన్నీ మందగించసాగాయి. మరికొన్ని నిముషాలలోని శ్వాస, హృదయ స్పందన పూర్తిగా ఆగిపోయాయి. రక్తపోటుకూడా పూర్తిగా స్తంభించిపోయింది.

"ఇది మన మెడికల్ టెర్మనాలజీలో క్లినికల్ డెత్' అన్నాడు నాసా కేంద్రానికి చెందిన డాక్టర్ రిచర్డ్.

"మామూలుగా వ్యక్తి చనిపోయిన కొద్దిగంటలలో రిగర్ మార్టిస్ వస్తుంది. మరి స్వామీజీ విషయంలో ఏమి జరుగుతుందో! అన్నాడు శ్యాంసుదర్.

"రిగర్ మార్టిస్ అంటే ఏమిటి సార్? అనిఅడిగాడు ఒక పత్రికా విలేకరి.

"మనిషిమరణించిన కొద్దిగంటలకు దేహం నీలిరంగుకు మారుతుంది చర్మం బిర్రెక్కి పోతుంది. దీనిని రిగర్ మార్టిస్ అంటారు. " అని వివరించాడు కిరణ్.

స్వామీజీ దేహానికి రిగర్ మార్టిస్ రావడం లేదని ధృవీకరించుకున్నాక నాసా శాస్త్రజ్ఞులు ఆ గదికి గట్టి తాళాలువేసి, సీలుచేసి బయటకు వచ్చారు. తర్వాత ప్రతిరోజూ శాస్త్రజ్ఞులందరూ గది తలుపులుతీసి స్వామీజీ దేహాన్ని పరీక్షించారు. రిగర్ మార్టిస్ రాలేదు. నిద్రపోతున్నట్లుగా స్వామీ రామానంద అచేతనంగా పడుకుని ఉన్నారు. అయితే జీవవ్యాపారాలైతే ఏవీ బొత్తిగా లేవు. ఏడవరోజున ఉదయం ఏడుగంటలు కావస్తుంటె శాస్త్రజ్ఞులందరిలో ఉత్కంఠత కట్టలు తెంచుకుంటుంది. విలేకరులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఏడుగంటలు అవుతుండగా స్వామీజీ గదిలో తలుపులు తెరిచారు. స్వామీ రామానందలో శ్వాసప్రక్రి ప్రారంభమైంది. శాస్త్రజ్ఞులు పరీక్షించడం మొదలుపెట్టారు. గుండె కొట్టుకోవడం ప్రారంభమై నెమ్మదిగా వేగం పుంజుకోసాగింది. సరిగ్గా ఏడుగంటలు అయ్యేసరికి స్వామీజీకి శ్వాస, దేహ ఉష్ణం, రక్తపోటు అన్నీ మామూలు స్థాయిని జేరాయి. నిద్రనుంచి లేచినట్లు స్వామీజీ కళ్ళు తెరిచి లేచికూర్చున్నాడు. తర్వాత పద్మాసనం వేసుకుని కళ్ళు మూసుకుని కొంచెంసేపు మౌనంగా ప్రార్థన చేశారు.

శాస్త్రజ్ఞుల ఆశ్చర్యానికి అవధులు లేవు. ఇతరుల ఆనందాశ్చర్యాలకు హద్దులు లేవు. స్వామీజీ అందర్నీ హాలులో సమావేశమవమన్నారు. కొద్దిసేపట్లోనే ఆయన కూడా వచ్చి తన ఆసనంపై ఆశీనులయ్యారు.ప్రొఫెసర్ రిచర్డ్ "స్వామీజీ... ఏడురోజులపాటు సకలజీవవ్యాపారాలూ స్తంభించి, మృతదేహంలా ఉండి తిరిగి చైతన్యంలోకి రావడం ఎలా సాధ్యం?" అని అడిగాడు. ఈనాటి సైన్స్‌కి సమాధానాలు దొరకని విషయాల నెన్నిటినో ప్రాచీన భారతీయులు కనుగొన్నారు. అలాగే మానవ దేహానికి ఉన్న అద్భుతశక్తుల గురించి కూడా తెలుసుకున్నారు. శరీరం మూడు సందర్భాలలో చైతన్యాన్ని కోల్పోతుంది. అవి నిద్ర, మృత్యువు, సమాధి స్థితి అనేవి. మొదటి రెండూ మీకు తెలుసు. మూడవది ఇప్పుడు ప్రత్యక్షంగా చూశారు. నిద్రలో శ్వాసతీయడం తప్పితే జ్ఞానేంద్రియాలేవీ ఇంచుమించు పనిచేయవు. అయితే ఇది తాత్కాలికం. మృత్యువు సంభవించినప్పుడు జ్ఞానేంద్రియాలు పనిచేయడం, శ్వాస, హృదయచలనం పూర్తిగా ఆగిపోతాయి. ఇంక సమాధి స్థితిలో యోగి తన ఇష్టానుసారం సకలజీవవ్యాపారాలనూ నియంత్రించగలడు' అని వివరించారు.

"స్వామీజీ... యోగి సమాధిలోకి వెళ్ళాక చైతన్యం కోల్పోతాడు కదా! మరి తిరిగి చైతన్యంలోకి ఏవిధంగా రాగలుగుతున్నాడు?" అని అడిగాడు కిరణ్.

"సమాధిస్థితి అన్నది సృష్టిలో ఉన్నదే. గొంగళిపురుగును చూడండి, ఆకులు బాగా మేసి గూడు కట్టుకుని దీర్ఘనిద్రలోకి వెళ్తుంది. అప్పుడు దాని జీవవ్యాపారాలన్నీ ఆగిపోతాయి. అయినా నిర్ణీత సమయానికి గూడుపగలకొట్టుకుని సీతాకోకచిలుక రూపంలో బయటకు వస్తుంది. ఎన్నో అల్పజీవాలు, క్రిమికీటకాలు, ముఖ్యంగా ధృవప్రాంతాలలో ఉండేవి వాతావరణం అనుకూలించినప్పుడు ప్రధానంగా శీతాకాలంలో నిద్రావస్థలోకి వెళ్ళిపోతాయి. దీనినే శాస్త్రీయ పరిభాషలో హైబర్నేషన్ అంటారు. ఇదంతా ఎలా జరుగుతోంది! కోడి తొలిజామునే సరిగ్గా సమయానికి ఎలా కూస్తుంది! ఇవన్నీ నాచ్యురల్ ఇన్‌స్టింక్ట్ అని మీరనవచ్చు. కాని ఆ ఇన్‌స్టింక్ట్ ఏవిధంగా పనిచేస్తుంది?"

"క్షమించండి స్వామీజీ. నేను అడిగింది అచేతనంగా ఉన్న దేహాన్ని చైతన్య స్థితిలోకి తీసుకురావడానికి ఏ శక్తి ప్రేరేపిస్తుంది?" అని అంటూ అడ్డు తగిలాడు కిరణ్.

"అదే చెప్తున్నా. మనలో చాలామంది ఏ అలారం అవసరం లేకుండా ఎంతటి నిద్రలో ఉన్నా కావాలనుకున్న సమయానికి మెలకువ తెచ్చుకోగలరు. వారికి బలీయమైన మనోసంకల్పమే అలారం అన్నమాట. అలాగే యోగులు జాగృతం కాగలరు. కంప్యూటర్‌లో ప్రిసెట్ ప్రోగ్రాంలాగా ముందుగానే వారి జాగృత శక్తి సెట్‌అయి ఉంటుంది. ఈ విషయాలన్నీ అర్థం కావాలంటే సరియైన గురువు దగ్గర శిక్షణ పొందాలి" అని వివరించారాయన. డిమాన్‌స్ట్రేషన్ పూర్తికావడంతో శాస్త్రవేత్తలందరూ తమ తమ ప్రదేశాలకు వెళ్ళిపోయారు.

* * * *

హైదరాబాద్‌కి తిరిగి వచ్చాక డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ కిరణ్‌లు డాక్టర్ కుమారస్వామిని కలిసి ఢిల్లీ విశేషాలపై రిపోర్టు రాసిచ్చారు. స్వామిగారు "వెరీగుడ్, మీకో గుడ్‌న్యూస్. మన సి.సి.ఎం.బి సెలక్షన్ కమిటీ కైరోసెమినార్‌కి మీ ఇద్దరినీ పంపడానికి సెలక్ట్‌చేసింది. పోయి రండి హావ్ ఎ హేపీ జర్నీ, ఆల్ ది బెస్ట్" అన్నారు.

తమ చెవులను తాము నమ్మలేకపోయారు మిత్రులిద్దరూ. "పేరుకి సెలక్షన్ కమిటీ కాని సెలక్ట్ చేసింది మీరే సార్, మాపై మీకున్న అభిమానం అటువంటిది. మీ మేలును ఎప్పటికీ మరిచిపోలేం" అన్నాడు శ్యాం.

చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు స్వామిగారు.

* * * *

కైరోలో అంతర్జాతీయ సెమినార్ మూడురోజులు జరుగుతుంది. మొదటిరోజున నాసాకు చెందిన ప్రొఫెసర్ నిక్సన్ తన పేపర్‌లో ఆసక్తికరమైన అనేక విషయాలను వెల్లడించాడు. జపాన్‌లోని టోక్యో విశ్వవిద్యాలయంలోని బౌద్ధ జెన్ యోగులమీద కొన్ని పరిశోధనలను జరిపారట. అలాగే అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్శిటీలో కొందరు భారతీయ యోగుల మీద పరిశోధనలు చేశారు.

ఈ అందరు యోగుల దేహాంతర్గతస్థితికీ ఈజిప్టు పిరమిడ్స్‌లోని మమ్మీల దేహస్థితికి పోలికలను కనుగొన్నారట. దీనినిబట్టి ఆ మమ్మీలు సమాధి స్థితిలోనున్న వ్యక్తుల దేహాలు కాదుకదా అన్న అనుమానం వారికి కలిగిందట.

మిషిగన్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ లారెన్స్ మరో విభ్రాంతికరమైన విషయాన్ని పేర్కొన్నారు. వారి శాస్త్రజ్ఞుల బృందం ఈజిప్షియన్ మమ్మీల జీవ కణాలను పరిశోధించిందట. ఆ కణాలు ఏమాత్రం చెడిపోకుండా ఎప్పుడైనా తిరిగి జీవచైతన్యం పొందే స్థితిలో ఉన్నాయట. దానినిబట్టి ఆ మమ్మీల మృతదేహాలా, లేక సమాధిస్థితిలో ఉన్న దేహాలా అన్న అనుమానం వచ్చిందట. ఈ వింతమైన విభ్రాంతికర విషయాలను ఆ మిత్రులిద్దరూ ఆ రాత్రి చాలాసేపు చర్చించుకున్నారు.

"మనిషి సమాధిస్థితిలో సాధించగలిగితే ముందుగా టైంసెట్ చేసుకుని కావాలనుకున్నప్పుడు మెలకువ తెచ్చుకోవచ్చునని ధృవపడింది. అటువంటప్పుడు అంతరిక్ష యాత్రికులు సమాధిస్థితిలో ప్రయాణం

చేస్తే వారు గమ్యం చేరుకుంటుండగా మెలకువ తెచ్చుకోవచ్చు. అప్పుడు ఆహారం, నీరు అధికమొత్తంలో నిలవచేయడం వంటి సమస్యలు ఉండవు. ఎంతటి సుదూర గ్రహాలకైనా ప్రయాణం చేయవచ్చు"అన్నాడు శ్యాం.

"బ్రిలియంట్ ఐడియా స్వామీ రామానంద వంటి వారు అర్హులైన అంతరిక్ష యాత్రికులకు తగిన శిక్షణ ఇవ్వగలరు. మనం ఈ సూచనని నాసా కేంద్రానికి పంపుదాం. ఆ మధ్య నాసా కేంద్రం గ్రహాంతర యానానికి సులభమైన మార్గాన్ని సూచించినవారికి బహుమతి నిస్తామని ప్రకటించింది కూడా" అన్నాడు కిరణ్.

"అవును. సరిగ్గా చెప్పావు. నాసా నుంచి వచ్చిన డాక్టర్ రిచర్డ్స్ వంటివారు ఢిల్లీలో స్వామీ రామానందపై జరిగిన పరిశోధనలను స్వయంగా గమనించారు. అందువల్ల నాసా కేంద్రం మన సూచనలు సీరియస్‌గా పరిశీలించవచ్చు" అన్నాడు శ్యాం.

* * * *

త్వరలోనే తమ ఆలోచనలను వివరంగా తెలుపుతూ డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ కిరణ్‌కుమార్‌లు నాసా కేంద్రానికి తమ సూచనలను పంపారు. దాని సాధ్యాసాధ్యాలను బాగా పరిశీలించిన నాసా కేంద్రం ఆ సూచనను ఆమోదించింది. ఈ విషయంలో వారు స్వామీరామానంద సహాయాన్ని కోరారు. అందుకు ఆయన అంగీకరించారు. అటు తర్వాత ఎంపిక చేసిన కొందరు అంతరిక్ష యాత్రికులకు స్వామీజీ సమగ్రమైన యోగశిక్షణను ఇచ్చారు.

ఏడాది గడిచిపోయింది. ఒక శుభముహూర్తాన ఇద్దరు శిక్షణ పొందిన యాత్రికులు కేప్ కెనడిలో అంతరిక్ష నౌకలో ప్రవేశించారు. నౌక భూవాతావరణాన్ని దాటుతున్న సమయంలో వారు సమాధిస్థితిలోకి వెళ్ళిపోయారు. ఆ గ్రహాంతర నౌక అంగారక దిశగా దూసుకుపోయింది.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జనవరి 1999** ✪

# ఒక మనిషి ఇద్దరైతే

"హలో ప్రదీప్...." అంటూ లాబ్‌లోకి ప్రవేశించాడు ప్రశాంత్. ప్రదీప్ ఏమీ పలకలేదు. కనీసం వెనుదిరిగి కూడా చూడలేదు.అసలు ప్రశాంత్ రాకనే గమనించలేదు. ఎదురుగా ఉన్న టి.వి స్క్రీన్ మీద ఇ.సి.జి ఫ్లక్చుయేషన్స్‌ని సీరియస్‌గా గమనిస్తున్నాడు. పరిస్థితిని గ్రహించాడు ప్రశాంత్. మిత్రుని డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక చప్పుడు కాకుండా స్టూలుమీద నెమ్మదిగా కూర్చున్నాడు.

ఐదునిమిషాలు గడిచింది. టి.వి.ని ఆఫ్‌చేసి లేచినుంచున్నాడు ప్రదీప్. వెనుదిరిగేసరికి ప్రశాంత్ కనిపించాడు.

"హలోప్రశాంత్.... ఎంతసేపైంది వచ్చి?" అనడిగాడు.

"ఇప్పుడిప్పుడేలే. ఎవరు వచ్చింది. ఎవరు పోయిందీ తెలుసుకునే స్థితిలో ఉన్నావా నువ్వు? ఇలాగే ఇంట్లో కూర్చుంటే దొంగలు పడి దోచుకుపోయినా తెలియదు." అన్నాడు ప్రశాంత్ నవ్వుతూ.

"దాచుకున్నదేమైనా ఉంటేగా దోచుకుపోవడానికి ఇంట్లో ఉండేవి కూడాఇవేగా. టెస్ట్‌ట్యూబులు, కెమికల్స్, సైన్టిఫిక్ ఎక్విప్‌మెంట్ వగైరా. వాటిని దోచుకుపోవాలంటే నీవంటి సైన్టిస్టే రావాలి." అన్నాడు ప్రదీప్ నవ్వుతూ.

"అది సరేకాని... అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావు. దేన్ని గురించి?" అని అడిగాడు ప్రశాంత్ కుతూహలంతో.

"ప్రశాంత్. ఈ రోజు నాకు ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను. నా పరిశోధనలో నేను విజయం సాధించాను. ఇది ప్రపంచగతినే మార్చి వేస్తుంది". అన్నాడు ప్రదీప్ పట్టరాని ఆనందంతో మిత్రుని భుజాలు పట్టుకుని కుదిపివేస్తూ.

"నువ్వు చేస్తోంది మెదడు మార్పిడిని గురించిన పరిశోధన అని నాకు తెలుసు. బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్‌ని సక్సెస్‌ఫుల్‌గా చేయగలిగానా?" అనడిగాడు ప్రశాంత్ విభ్రమంతో.

"అవును. ఇలారా. " అంటూ ముందుకి నడిచాడు ప్రదీప్. ప్రశాంత్ అనుసరించాడు.

"ఇదుగో... ఈ గ్లాస్‌కేసులో కుందేలుంది చూశావా?" అన్నాడు గ్లాసకేసులోకి చూశాడు ప్రశాంత్.



అనస్థీషియా ఇచ్చిన తెల్లనికుందేలు ఒకటి అచేతనంగా, ముడుచుకుని కూర్చున్న విధంగా ఉంది. దాని తలపైన ఆపరేషన్ చేసి కుట్టినచిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దాని తలకు అటూ ఇటూ హెడ్‌ఫోన్ వంటివి ఉన్నాయి. వాటినుంచి దగ్గరలోని టి.వి.కి కనెక్టింగ్ వైర్‌లు ఉన్నాయి. ఆ టి.వి. స్క్రీన్ వంకే అంతవరకూ ప్రదీప్ చూస్తూ ఉంది.

" ఈ కుందేలుకి బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్ చేశాను. ఇంతకుముందు ఎన్నో ప్రయత్నాలు, ప్రయోగాలు చేశాను కాని ఏదీ పూర్తిగా సక్సెస్‌పుల్ కాలేదు. ఈసారి సెంట్‌పర్సెంట్ సక్సెస సాధించాను. " అన్నాడు ప్రదీప్ విజయగర్వంతో.

"రియల్లీ! కంగ్రాట్యులేషన్స్. ఈ ట్రాన్స్‌ప్లాంట్ ఎప్పుడు జరిగింది?" అనడిగాడు ప్రశాంత్ ఆనందాతిరేకంతో.

"72 గంటలయింది. బాడీఫంక్షన్స్ అన్నీ నార్మల్‌గా ఉన్నాయి. కొత్త మెదడు కొత్తతలలో చక్కగా అతుక్కుంది. ఇప్పుడు మనుష్యులకి కూడా బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్ సాధ్యమవుతుంది. ఇంక నా కృషి ఆ దిశలోనే సాగుతుంది."

"ఇందాక టి.వి. స్క్రీన్‌మీద ఇ.ఇ.జి.ని చాలా సీరియస్‌గా చూస్తున్నావు. అందులో ఏమన్నా విశేషం ఉందా?"

"ఎలక్ట్రో ఎన్‌సెఫెలోగ్రాఫ్ (ఇ.ఇ.జి) మెదడునుంచి వచ్చే విద్యుత్తరంగాలను వేవ్స్ గా చూపిస్తుంది కదా! ఇందాక నేను చూస్తున్నది ఈ కుందేలుకి కొత్తమెదడు అమర్చాక తీసిన గ్రాఫ్ ఇదిగో ..... ఈ ఇ.ఇ.జిని చూడు. ఇది ఈ కుందేలుకి ఆపరేషన్ చేయకముందు తీసిన గ్రాఫ్. అంటే పాతమెదడు గ్రాఫన్న మాట. ఈ రెండింటినీ పోల్చి చూడు" అంటూ డ్రాయర్‌లోనుంచి ఒక ఇ.ఇ.జి.ని తీసి ప్రశాంత్ చేతికిచ్చాడు ప్రదీప్.

ప్రశాంత్ రెండు గ్రాఫ్‌లనూ శ్రద్ధగా చూశాడు.,

"ఈ మొదటిగ్రాఫ్ నార్మల్‌గా ఉంది. కాని ఈ రెండో ఇ.ఇ.జిలో వయులెంట్‌ఫ్లక్చ్యువేషన్స్ కనిపిస్తున్నాయి. ఎందుచేతనో" అన్నాడు.

"ఈ కుందేలు డొమిస్టికేటెడ్ యానిమల్ ఇది మన లేబరేటరీలో మన పెంపకంలో నిర్భయంగా పెరిగింది. అందుకనే ఏ భయాలూ, వత్తిడులూ లేకుండా ఉండిన దీని మొదటి ఇ.ఇ.జి ప్రశాంతంగా, నార్మల్‌గా ఉంది. అయితే దీనికి మరో కుందేలు మెదడు అమర్చాను. దానికి అనస్థీషియా ఇయ్యడానికి పట్టుకున్నప్పుడు దానిని ఏమీ చేస్తామోనన్న భయం దాని మెదడులో గూడుకట్టుకుని ఉండిపోయి ఉండాలి. భయంతో స్పందించిన ఆ మెదడును తీసి మొదటి కుందేలుకు అమర్చాను. ఈ బ్రెయిన్ నార్మల్ ఫంక్షన్ మొదలుపెట్టాక కూడా భయతరంగాలు వెలువడుతూనే ఉన్నాయన్నమాట. అందుకనే రెండో మెదడు ఇ.ఇ.జిలో వయొలెంట్ ఫ్లక్ట్యేషన్స్ కనిపించాయి." అని వివరించాడు ప్రదీప్.

"ఎక్స్‌లెంట్. అది సరే తొలిసారిగా క్రిష్టియన్ బార్నార్డ్ గుండె మార్పిడి చేసినప్పుడు అది ఒక అద్భుతం. కానీ ఈనాడు అది సర్వసామాన్యం. కిడ్నీ, లివర్, పాన్‌క్రియాస్ ట్రాన్స్‌ప్లాంట్‌లు కూడా సామాన్య విషయాలైపోయాయి. మరి హ్యూమన్ బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ ఇప్పటికీ ఎందుకు సాధ్యం కాలేదు?" అని అడిగాడు ప్రశాంత్.

"గుండె, కాలేయం, మూత్రపిండాలు, పాన్‌క్రియాస్‌ల విషయంలో ముఖ్యంగా కలువవలసింది ప్రధాన రక్తనాళాల్ని. మెదడు విషయం ఇలాకాదు.మస్తిష్కంలో లక్షల సంఖ్యలో జ్ఞానేంద్రియాలకు సంబంధించిన న్యూరాన్‌లు ఉంటాయి. వీటిద్వారానే స్పందనలు కలుగుతాయి. అందువల్ల రక్త నాళాలతోపాటు, ఈ న్యూరాన్‌లకు కూడా సరియైన విధంగా జతపరుచవలసి ఉంటుంది. ఈ కలుపడంలో హెచ్చుతగ్గులు వస్తే జ్ఞానేంద్రియాలు పనిచేయవు. కొత్త మెదడు సరిగా ఇమడలేక క్రమేపీ కృశించి చివరకు ఆ వ్యక్తి ప్రాణం పోయే అవకాశం ఉంది. అందువల్లనే ఇప్పటివరకు బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ సాధ్యం కాలేదు " అని విడమరచి చెప్పాడు ప్రదీప్.

"మరి నువ్వెలా సాధ్యం చేయగలిగావు?" అని కుతూహలంగా అడిగాడు ప్రశాంత్.

"ఈనాడు మన డాక్టర్‌లు స్కల్ ఓపెన్ చేయకుండా మెదడుకి సంబంధించిన అనేకరకాల ఆపరేషన్‌లను చేయగలుగుతున్నారు. ఇందులో ప్రధానపాత్ర వహిస్తున్నవి లేజర్ కిరణాలు. కపాలం తెరవకుండానే మెదడుకి ఆపరేషన్ చేయగలుగుతున్నప్పుడు, స్కల్ ఓపెన్‌చేశాక లేజర్‌కిరణాలతో బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంటేని నిర్దుష్టంగా చేయడం సాధ్యమేననిపించింది. నా ఊహ నిజమై ఈ కుందేలు కపాలంలో కొత్తమెదడు చక్కగా అమరింది. ఏవిధమైన గాయాలు లేకుండా న్యూరాన్‌లు, రక్తనాళాలూ చక్కగా

అతుక్కున్నాయి అందుకు 72గంటలలోపే పడుతుంది." అని వివరించాడు ప్రదీప్.

"అయితే నెక్ట్స్‌స్టెప్ ఏమిటి?" అని అడిగాడు ప్రశాంత్.

"ఇంకేముంది! హ్యూమన్ బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్. నాకు ఏదైనా యాక్సిడెంట్‌లో బ్రెయిన్ బాగాదెబ్బతిని మృత్యువు ఖాయం అయినటువంటి లేదా బ్రెయిన్ కాన్సర్ వంటి వ్యాధులతో ఈ రోజో, రేపోచావు ఖాయం అనుకున్నట్టివి కాని కేసులు కావాలి. వీరికి ప్రయోగాత్మకంగా బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తాను. అందుకోసం ఆరోగ్యంగా తాజాగా ఉన్నటువంటి మెదడు కావాలి. అటువంటివి ఎక్కడ దొరుకుతాయి? యాక్సిడెంట్‌లో సడన్‌గా చనిపోయినా బ్రెయిన్‌కి దెబ్బతగలనటువంటి కేసులలో దొరుకుతాయి. అటువంటి మెదడుతో బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తాను. ఆ వ్యక్తి అదృష్టం బాగుండి ఆపరేషన్ సక్సెస్‌పుల్ అయిందా అతనికి పునర్జన్మే. సైన్స్‌కి ఘనవిజయం. ఒకవేళ ఆపరేషన్‌ఫెయిలయి ఆ వ్యక్తి మరణించినా, అతని చావు రోజుల్లోనే ఉంది కనుక ఎవరికీ బాధ అనిపించదు. కాని ఆ అనుభవం తదుపరి ఆపరేషన్స్‌కి పనికి వస్తుంది" అన్నాడు ప్రదీప్.

"ఆరోగ్యవంతమైన మెదడు అంత తేలిగ్గా దొరుకుతుందా? యాక్సిడెంట్‌లో చనిపోయినట్లు తెలిసి, ఆ బాడీని తెచ్చి మెదడు తీసి పేషెంట్ దగ్గరకు తెచ్చీ, ట్రాన్స్‌ప్లాంట్ చేయడానికి సమయం ఉంటుందా?" - సందేహం వ్యక్తం చేశాడు ప్రశాంత్.

"నీ ప్రశ్న చాలా అమెచ్యూరిష్‌గా ఉంది. ఒక సైంటిస్ట్ అడగాల్సినదిగా లేదు నీపేరు ప్రశాంతే కాని ప్రశాంతంగా ఆలోచించడం లేదు" అన్నాడు ప్రదీప్ నవ్వుతూ.

ప్రశాంత్ ముఖం ముడుచుకున్నాడు. అతను హర్టయిన విషయం గ్రహించి "సీరియస్‌గా తీసుకోకు, సరదాకి అన్నాను. సైంటిస్టులకి అబ్సెన్ట్‌మైండెడ్‌గా ఉండడం మామూలేగా. నేనూ అంతే." అంటూ నవ్వాడు.

ప్రశాంత్ కూడా నవ్వాడు.

"నేత్రదానం చేయదలచుకున్న వ్యక్తులు చనిపోయినప్పుడు చనిపోయిన ఆరుగంటలలోగా వారి కన్నులను తీసి భద్రపరిచి కావలసినప్పుడు వాడుకోవడం లేదా! అలాగే యాక్సిడెంట్‌లో చనిపోయిన వ్యక్తి మెదడు డామేజ కానప్పుడు, అతను చనిపోయిన ఆరుగంటలలోగా దానిని తీసి లిక్విడ్ నైట్రోజన్‌లో భద్రపరిస్తే అటుతర్వాత ఎప్పుడైనా వాడుకోవచ్చు. సాధారణంగా యాక్సిడెంట్ జరిగినవ్యక్తి చనిపోయినప్పుడు రెండుమూడు గంటలలోనే ఆ బాడీని మార్చ్యురీకి తరలించడం జరుగుతుంది. మార్చ్యురీ ఆస్పత్రికి అనుబంధంగా ఉంటుంది కనుక ఆ ఆస్పత్రిలో ఆ వ్యక్తి మెదడును తీసి భద్రపరచగల అవకాశం ఉంటుంది. అందువల్ల ఈ విషయంలో ప్రాబ్లెం ఉండదు." అంటూ వివరించాడు ప్రదీప్.

"ఇప్పటి వరకూ ఇలా మెదడును తీసి భద్రపరిచే పద్ధతి లేదు. మరి ఈ విషయం అందరికీ తెలిసేదెలా?" అనడిగాడు ప్రశాంత్.

"మన ప్రయోగాలను వివరిస్తూ మన ఇన్‌స్టిట్యూట్ తరఫున పేపర్లలో ప్రకటనలను ఇద్దాం ముఖ్యమైన హాస్పటల్స్‌కి ఉత్తరాలు రాద్దాం. పోస్టుమార్టం అయిన తర్వాత ఆరోగ్యవంతమైన మెదళ్ళను భద్రపరచి మను తెలియజేయడం కాని పంపడం కాని చేయమని రిక్వెస్టు చేద్దాం. అలాగే ఆశలు వదులుకున్న

కేసులను బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్ కోసం ఐచ్ఛికంగా మనకి రిఫర్ చేయమని ప్రజలను కోరుదాం" అన్నాడు ప్రదీప్.

"గుడ్ ఐడియా. అలాగే చేద్దాం ఆల్‌దిబెస్ట్ టు యు. ఇంక నేను నా వింగ్‌కి వెళ్తాను." అంటూ లేచాడు ప్రశాంత్.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీలో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ ప్రశాంత్‌లు రిసెర్చ్ సైన్టిస్టులు. ప్రదీప్ హ్యూమన్ ఫిజియాలజీ డిపార్టుమెంట్‌లోనూ, ప్రశాంత్ బయోకెమిస్ట్రీ శాఖలోనూ రిసెర్చి చేస్తున్నారు. ప్రదీప్ సాధించిన విజయం ప్రపంచమంతటా గొప్ప సంచలనాన్ని సృష్టించింది. వారు పత్రికలలో చేసిన ప్రకటనకి మంచి ప్రతిస్పందన వచ్చింది. ప్రమాదాలలో చనిపోయిన వ్యక్తుల శవాలకు చెందిన ఆరోగ్యవంతమైన మెదడులు రెండు నెలలలోనే ఎనిమిది వచ్చాయి. వాటిని వారి బంధువులు ఐచ్ఛికంగా దానం చేశారు.

ఆరోజున ఒక కేసు వచ్చింది. తీవ్రమైన బ్రెయిన్ కాన్సర్‌తో బాధపడుతూ రెండుమూడురోజులు కంటె బ్రతకని ఒక నడివయస్కుని వారి బంధువులు తీసుకువచ్చి ట్రాన్స్‌ప్లాంట్ కోసం అప్పజెప్పారు. ఆయన సాంప్రదాయ కుటుంబానికి చెందిన పండితుడు. పేరు రామశాస్త్రి.

డాక్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ విజయవంతంగా జరిగింది. మూడురోజుల్లోనే కొత్త మెదడు చక్కగా అమరింది.

మర్నాడు రామశాస్త్రిగారికి స్పృహ వచ్చింది. తన బెడ్ దగ్గర ఉన్నవారిని వింతగా చూడసాగాడు. ఏదో భాషలో ఏమిటేమిటో అనసాగాడు. ఆయన ప్రవర్తన ఎవరికీ అర్థంకాలేదు. ఆపరేషన్ చేసిన వైద్యబృందం కంగారుపడి న్యూరోస్పెషలిస్ట్‌కి కబురు చేశారు. ఆయన వచ్చేసరికి కూడా రామశాస్త్రి ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు. ఆమాటలు విన్న డాక్టర్ మెహతా "ఈయన గుజరాతీలో మాట్లాడుతున్నాడు. శాస్త్రిగారికి గుజరాతీ వచ్చా?" అని అడిగాడు స్పెషలిస్ట్ మెహతా.

"లేదండి మా నాన్నగారికి తెలుగు, సంస్కృతం తప్ప మరో భాషరాదు. గోదావరి జిల్లాలో మారుమూలగ్రామంలో ఉండడంతో కనీసం ఇంగ్లీషు కూడా ఏమాత్రం రాదు. వైద్యం కోసమే ఇక్కడికి తీసుకువచ్చాం" అన్నాడు.

డాక్టర్ మెహతా రామశాస్త్రిగారితో ఏదో మాట్లాడారు. ఆయన గుజరాతీలో మాట్లాడడంతో శాస్త్రిగారి ముఖం విప్పారింది. ముఖంలో అప్పటివరకు చోటుచేసుకున్న ఆందోళన తొలగిపోయి ప్రశాంతత ఛాయలు చోటుచేసుకోసాగాయి.

కొంచెంసేపు మాట్లాడాక ఆమన శాస్త్రిగారి బంధువులతో అన్నారు. "ఈయన తనపేరు మహమ్మద్ ఉస్మాన్ అని చెప్తున్నాడు. అహమ్మదాబాద్‌లోని ఒక మసీదులో ఇమాంగా ఉన్నాడట. ఏదో పనిమీద హైదరాబాద్‌కి వచ్చాడట. చార్మినార్ దగ్గర మక్కామసీదుకి వెళ్తున్నాడట ఆటోలో తానెక్కుడున్నాడు, తనకేమైంది అని అడుగుతున్నాడు"

"అదేమిటి.... ఆపరేషన్‌లో ఏదో తిరకాసువచ్చి సంధి ప్రేలాపనలు చేస్తుండవచ్చు. ఉండండి నేనడుగుతాను." అంటూ శాస్త్రిగారి కొడుకు విశ్వం "నాన్నగారూ... నేను.. మీ విశ్వాన్ని. నన్ను గుర్తించలా.

ఇదుగో అమ్మ... సరిగ్గా చూడండి." అంటూ తండ్రితో అన్నాడు.

"ఏమండీ... నేను మీ జానకిని. ఒక్కసారి సరిగ్గా చూడండి." అంది ఆవిడ గద్గద స్వరంతో.

రామశాస్త్రిగారు అయోమయంగా చూశారు. తర్వాత డాక్టర్ మెహతా వాళ్ళు ఏమి మాట్లాడుతున్నారో తనకి అర్థం కాలేదని చెప్పాడు.

"ఈయనకి మీరు మాట్లాడేదేమీ అర్థం కాలేదు. ఈయనకి తెలుగు బొత్తిగా రాదు. ఉండండి. ఒకపని చేద్దాం." అంటూ బాయ్... ఒక మిర్రర్ తీసుకుని రా." అన్నాడు వార్డ్‌బాయ్‌తో. మరో ఐదునిమిషాలలో దగ్గర్లో ఉన్న డార్మిటరీనుంచి అద్దాన్ని తీసుకువచ్చాడు వార్డ్‌బాయ్.

ఆ అద్దాన్ని డాక్టర్ మెహతా "ఉస్మాన్‌సాబ్. ఈ అద్దంలో ఒకసారి చూడండి." అంటూ అద్దాన్ని ఆవ్యక్తి ముందుంచాడు.

అద్దంలో తనరూపాన్ని చూస్తూనే కెవ్వుమని కేకవేశాడు ఆ వ్యక్తి.

"ఇదేమిటి... నా రూపం ఇలా మారిపోయింది ఏమిటి? నా గడ్డం ఏది? నాకు ఈ పిలక వచ్చిందేమిటి? నా షేర్వాణీ, సుర్మా ఏమయ్యాయి? అసలు నేనెవర్ని? నాకేమయింది?" అంటూ కంగారు కంగారుగా ప్రశ్నలు కురిపించాడు. అంతలో ఆవేశం పెరిగిపోయి విరుచుకుపడి స్పృహ కోల్పోయాడు.

వెంటనే డాక్టర్ మెహతా ఆయనకి నిద్ర ఇంజక్షన్ ఇచ్చాడు. "ఆయన్ని కొంతసేపు ప్రశాంతంగా పడుకోనీయండి. ఈలోగా ఆ తర్వాత ఏంచేయాలో ఆలోచిద్దాం" అంటూ జేబులోని సెల్యూలార్ ఫోన్ తీసి కొంచెం దూరంగా వెళ్ళి ఎవరితోనో ఏదో మాట్లాడాడు మళ్ళీ వచ్చి.

"ఇది చాలా మిస్టీరియస్ కేసు. ఇప్పుడే పోలీసుకంట్రోల్ రూంతోనూ, ఉస్మానియా హాస్పటల్ సూపరింటెండ్‌తోనూ మాట్లాడాను. చార్మినార్ దగ్గర ఒక ఆటోయాక్సిడెంటయి ఒక వ్యక్తి అక్కడికక్కడే మరణించాడనీ ఆ బాడీకి పోస్టుమార్టం చేసి, మెదడును తీసి భద్రపరచి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీకి పంపామని హాస్పిటల్ సూపరింటెండెంట్ చెప్పాడు. పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడానని ఆయన మృతుని దేహాన్ని తర్వాత గుర్తించామని, ఆయన పేరు మహమ్మద్ ఉస్మాన్ అనీ అహ్మాబాద్ నివాసి అని తెలిసిందనీ చెప్పారు" అన్నాడు.

"అంటే ఈయన చెప్తోంది నిజమేనన్న మాట! ఇదేమిటో అంతా గందరగోళంగా ఉంది." అన్నారు విశ్వంగారు తలగోక్కుంటూ.

"వాళ్ళిద్దర్నీ రమ్మన్నాను. వాళ్ళు వచ్చాక ఈ కేసు గురించి డిటెయిల్డ్ డిస్కషన్ చేద్దాం. యాంటీరూంలోకి పోయి మాట్లాడుకుందాం రండి. కమాన్ డాక్టర్ ప్రదీప్. యూటూ డాక్టర్ ప్రశాంత్ మీరుకూడా రండి." అని "బాయ్.. మా కోసం ఎవరు వచ్చినా మేమున్న రూమ్‌లోకి పంపించు" అని చెప్పారు.

అందరూ యాంటీరూమ్‌లోకి వెళ్ళి కూర్చున్నారు.

"డాక్టర్ ప్రదీప్... కెన్‌యూ త్రో ఎనీలైట్ ఆన్‌దిస్ మిస్టరీ?"అని అడిగాడు డాక్టర్ మెహతా.

గొంతు సవరించుకున్నాడు డాక్టర్ ప్రదీప్.

"ఇది నేను ఊహించని పరిణామం డాక్టర్ మెహతా కుందేలుకి బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేసినప్పుడు కొత్తమెదడుతో భయాందోళనలను గమనించానే కాని భావోద్రేకాలు కనిపించలేదు. అది జంతువు కాబట్టి ఆలోచనలు, భావాలూ ఉండకపోవడవం సహజం. అయితే ఆలోచనలూ, భావాలూ, భాషా ఉన్నట్టి మానవుల మస్తిష్కాల పరిస్థితి వేరు. మనిషికి వ్యక్తిత్వాన్ని కల్పించేది మెదడే కాని దేహం కాదు అని ఇప్పుడర్థం అవుతోంది."

"అంటే మీ ఉద్దేశం..." అంటూ ఏదో చెప్పబోయాడు డాక్టర్ ప్రశాంత్.

"నన్ను పూర్తిగా చెప్పనీండి. మైక్రోఫోన్ వెనకాలున్న వ్యక్తి తెలుగులో మాట్లాడితే తెలుగు మాటలు వినిపిస్తాయి. ఏ శబ్దాలు చేస్తే ఆ శబ్దాలు వినిపిస్తాయి. మనిషి నోరు కూడా మైక్ వంటిదే. ఆ వ్యక్తి దేహంలో ఉన్నమెదడు ఏభాషలో మాట్లాడితే ఆ భాషాపదాలనే నోరు బహిర్గతం చేస్తుంది. ఇంతకుముందు రామశాస్త్రిగారి మస్తిష్కపు తెలుగు పలుకులను ఆయన నోరు పలికింది. కాని ఇప్పుడు అదేదేహంలో గుజరాతీ మాటలను నోరు వెల్లడీ చేస్తోంది. అంటే ఇప్పుడు ఒక మనిషిలో దేహం ఒకరిది- వ్యక్తిత్వం మరొకరిది అయింది. ఈ వైరుధ్యాన్ని ఈ కొత్తదేహం ఎలా స్వీకరిస్తుందో ఎలా ఎడ్జస్టవుతుందో ఇప్పుడే చెప్పలేను". అన్నారాయన.

ఇంతలో ఉస్మానియా హాస్పటల్ సూపరింటెండ్ డాక్టర్ ఆత్మారాం, చార్మినార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయరామారావు అక్కడికి వచ్చి తమని పరిచయం చేసుకున్నారు.

"గ్లాడ్ టు మీట్ యు. ప్లీజ్ బి సీటెడ్" అంటూ వారిని కూర్చోబెట్టి జరిగిన సంఘటన వివరాలు చెప్పాడు డాక్టర్ మెహతా.

"వెరీ ఇంటరెస్టింగ్" అన్నారిద్దరూ.

"డాక్టర్ ఆత్మారాం. ఐయామ్ డాక్టర్ ప్రదీప్, జస్ట్ ఒన్ క్వెశ్చన్" అంటూ ఏదో అడగబోయాడు డాక్టర్ ప్రదీప్.

"జస్ట్ ఒన్‌మినిట్ . సారీ... నేను ఇక్కడివారిని పరిచయం చేయలేదు కదూ. ఈయన డాక్టర్ ప్రదీప్. వీరు డాక్టర్ ప్రశాంత్. ఇద్దరూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయో టెక్నాలజీలో రీసెర్చి సైంటిస్టులు. అఫ్‌కోర్సు యు నో మి. ఆయామ్ డాక్టర్ మెహతా. ఆయన మిస్టర్ విశ్వం. ఇందాక చెప్పానే.. ఆ బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ అయిన రామశాస్త్రిగారి అబ్బాయి. ఆవిడ జానకమ్మగారు. శాస్త్రిగారి భార్య." అంటూ పరిచయాలు పూర్తిచేశాడు డాక్టర్ మెహతా.

"మీ గురించి మీ సక్సెస్‌ఫుల్ బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ గురించి పేపర్స్‌లో చదివాను డాక్టర్ ప్రదీప్. గ్లాడ్‌టుమీట్‌యూ" అన్నారు డాక్టర్ ఆత్మారాం.

"సావిత్‌మి" అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయారావు.

"చెప్పండి డాక్టర్ ప్రదీప్. మీరేదో అడగబోయారు. అన్నాడు డాక్టర్ ఆత్మారాం.

"మీరు బ్రెయిన్‌ను మాకు పంపినప్పుడు ఎటాచ్‌డ్ ఫారంలో యాక్సిడెంట్ జరిగిన తేదీ, సమయం, స్థలం, పోస్టుమార్టం చేసిన తేదీ, సమయం వంటి వివరాలు ఇస్తూ అన్‌ఐడెంటిఫైడ్ బాడీ' అని రాశారు.

కాని ఈ శవం అహమ్మదాబాద్ నివాసి మహమ్మద్ ఉస్మాన్‌ది అని తెలుస్తోంది. మరి అన్‌ఐడెంటిఫైడ్ అని ఎలా రాశారు?"అని అడిగాడు డాక్టర్ ప్రదీప్.

"నిజమే. ఆ శవం మాకు గుర్తుతెలియనిదిగానే వచ్చింది. రికార్డ్సులో అలాగే నమోదయింది. గుర్తు తెలియని శవం కావడంతో. తలకి గాయాలు కాకపోవడంతో మెదడుని తీసి భద్రపరిచి ఆ తర్వాత మీకు పంపాం." అన్నాడు డాక్టర్ ఆత్మారాం.

"మీ ప్రశ్నకు సమాధానం నేను చెప్తాను." అన్నాడు విజయారావు. అందరూ అటు చూశారు.

"యాక్సిడెంట్ అయినప్పుడు ఆటోనుజ్జునుజ్జు అయింది. ఆటో డ్రైవర్‌తీవ్రగాయాలై ఆస్పత్రిలో ఉన్నాడు. ఇప్పటికీ కోమాలోనే ఉన్నాడు. ఆటోలో ఈ శవం లభ్యం అయినా సమయానికి ఆయన గురించిన వివరాలేవీ మాకు దొరకలేదు. అందుకే గుర్తుతెలియని శవంగా ఆస్పత్రికి పంపాం. అక్కడ అలాగే నమోదైంది. అయితే ఆ తర్వాత తుక్కుతుక్కయిన ఆటోను పరీక్షిస్తుంటే సీటు వెనకాల ఇరుక్కుని అతని హాండ్‌బాగ్ దొరికింది. అందులో ఆయన పేరూ, అతని అడ్రసూ, కొన్ని కాగితాలూ, సుమారు వేయిరూపాయల నగదూ ఉన్నాయి. ఆ వ్యక్తి ఎవరో తెలియడంతో ఆ వివరాలు ఆస్పత్రికి పంపాం. అహ్మదాబాద్‌లోని ఆతని కుటుంబీకులకి తెలుపవలసిందిగా అక్కడి పోలీస్ స్టేషన్‌కి వైర్‌లెస్ మెజేజ్ పంపించాం" అన్నాడాయన.

"అలాగా... అయితే మార్చ్యురీలో రికార్డ్సులో ఈ వివరాలు ఎక్కుంటాయి. అది వేరే డిపార్టుమెంటు కావడంతో ఆ వివరాలు నాకు తెలీదు." అన్నాడు డాక్టర్ ఆత్మారాం.

"ఎక్కాయి. మా మెసేజ్ అందుకుని నిన్న అతని భార్య, కొడుకు వచ్చి నన్ను కలిశారు. శవం ఉస్మానియా మార్చ్యురీలో ఉందని తెలిపి ఆయన వస్తువులు క్లెయించేయడానికి కావలసిన ఫారంలు ఇచ్చాను. వాళ్ళు శవాన్ని ఇక్కడే ఖననం చేసి వెళ్తామని చెప్పారు. ఈ ప్రమాదానికి ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా రావచ్చుననీ, అందుకు అప్లైచేయమనీ, ఈరోజు వచ్చి నన్ను కలవమనీ చెప్పాను. ఇప్పటో మరికొంచెం సేపట్లోనే రావచ్చు. వాళ్ళు వస్తే ఇక్కడికి పంపమని చెప్పి వచ్చాను." అని చెప్పాడు విజయారావు.

ఇంతలో వార్డ్ బాయ్ వచ్చి బురఖావేసుకున్న ఒక ముస్లిం స్త్రీని, ఒక యువకుడినీ ప్రవేశపెట్టాడు.

ఆ స్త్రీ విజయారావుని చూస్తూనే "ఆదాబ్ సాబ్" అంది. ఆ యువకుడు "ఆదాబ్‌సాబ్... అస్సాలామాలేకుం " అన్నాడు.

"ఆయీయే ఉదర్‌భైటీయే " అని కుర్చీలు చూపించి

"ఇదుగో మాటల్లోనే వచ్చారు. ఈవిడ పర్వీన్ బేగం. చనిపోయిన మహమ్మద్ ఉస్మాన్ భార్య. ఈతను ఆయన కొడుకు అక్రం" అంటూ పరిచయం చేశాడు. వాళ్ళు అందరి వైపూ చూస్తూ చేయి ఎత్తి అభివాదం చేశారు.

"ఉస్మాన్‌సాబ్ లాష్ తీసుకుపోయారా?' అని అడిగాడు విజయారావుగారు.

"హాఁసాబ్. నిన్ననే తీసుకుని ఈ నగరంలోనే ఖననం చేశాం. బడీ అఫ్‌సోస్‌కీ బాత్‌హై సాబ్" అన్నాడు అక్రం. మీరు ఉస్మాన్ ఆవాజ్‌ను గుర్తుపట్టారు కదూ?" అని అడిగాడు విజయారావు.

''అదేమిటి సాబ్. అలా అడిగారు?'' అన్నాడు అక్రం.

''ఏం లేదు '' అన్నాడు విజయారావు.

''సార్... ఆ పేషెంట్‌కి మళ్ళీ స్పృహవచ్చింది. ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు. మనిషి బాగా ఆవేశంగా ఉన్నాడు''.అంటూ వచ్చి డాక్టర్ మెహతాకి చెప్పాడు వార్డ్‌బాయ్.

''అరే అప్పుడే తెలివి వచ్చిందా! ఎమోషన్స్ చాలా ఎక్కువగా ఉన్నాయన్న మాట అందుకే నిద్ర ఇంజక్షన్ ఎఫెక్టు తగ్గినట్లుంది. '' అంటూ లేచాడు డాక్టర్ మెహతా.

తాను కూడా లేస్తూ అక్కడున్నవారిని ''మీరు కూడా రండి'' అన్నాడు విజయారావు.

అందరూ రామశాస్త్రి బెడ్‌వద్దకు వెళ్ళారు. ఆయన గుజరాతీలో ఏదేదో అంటున్నాడు.

పర్వీన్ కంటబడగానే ''బేగంజాన్. క్యాసేహో'' అన్నాడు. రామశాస్త్రి విప్పారిన కన్నులతో.

ప్రక్కనున్న అక్రంను చూచి ''అక్రం మియా.. తుంభీ ఆయే'' అన్నాడు ఆనందాతిరేకంతో.

పర్వీన్, అక్రంలు కంగారుగా ఆయన వంక చూసి తర్వాత ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.

''బీబీజాన్ ముఝె పెహచానా నహీ, క్యాహువా ఆప్‌సబ్‌కూ, క్యాహువా ముఝె'' అని మళ్ళీ అడిగాడు రామశాస్త్రి.

''ఆప్‌కౌన్‌హో'' అంది పర్వీన్.

''మై కౌన్‌హూఁ! తేరీమరద్‌కు నహీ పెహచాన్‌తా'' అంటూ ఆవేశంగా అరిచి మళ్ళీ స్పృహకోల్పోయాడు రామశాస్త్రి.

''ఏ సబ్‌క్యా హై సాబ్? ఇనోకౌన్ హై'' అంది పర్వీన్ విజయారావు వంక చూస్తూ.

''చెప్తాను... మీరు ఆయన గొంతును గుర్తు పట్టారా'' అని అడిగాడు విజయారావు.

''ఆయన మాటతీరు సరిగ్గా మా నాయనది లాగే ఉంది. అయితే గొంతు శబ్దంలో తేడా ఉంది. ఇంతకీ ఈయన ఎవరు సాబ్'' అని అడిగాడు అక్రం.

ఈలోగా డాక్టర్ మెహతా రామశాస్త్రిగారికి మరో స్ట్రాంగ్‌డోస్ సెడేటివ్ ఇంజక్షన్ ఇచ్చాడు. ఆయన గాఢనిద్రలోకి జారుకున్నారు.

''రండి.. మనందరం మళ్ళీ అక్కడికి పోయి మాట్లాడుకుందాం.'' అంటూ దారి తీశాడు. తిరిగి అందరూ ఆ యాంటి రూంలో సమావేశమయ్యారు.

అందరూ కూర్చున్నాక ''ఏ సబ్‌క్యాహైసాబ్'' అని అడిగింది పర్వీన్ బేగం విజయారావుని.

''మీరు బెడ్ మీద చూసిన పేషెంట్ పేరు రామశాస్త్రి. బ్రెయిన్ కాన్సర్‌తో బాధపడుతూ చనిపోయే స్థితికి వచ్చాడు. అందువల్ల ఆయనకి బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. అంటే ఆయన మెదడును తొలగించి దాని స్థానంలో ప్రమాదంలో చనిపోయిన ఉస్మాన్ సాబ్ మెదడును పెట్టారు. రామశాస్త్రిగారు బ్రతికారు. అయితే ఉస్మాన్‌సాబ్‌గా. మెదడు ఉస్మాన్‌సాబ్‌ది కనుక ఆయన తన వాళ్ళని అంటే మిమ్మల్ని గుర్తించి మాట్లాడాడు. అయితే దేహం శాస్త్రిగారిది కావడంతో మీరు ఆయన్ని గుర్తించలేకపోయారు.'' అంటూ

వివరించాడు విజయారావు.

"వో కైసాహోతా సాబ్?" అంది పర్వీన్ కోపంగా.

"మా అంగీకారం లేకుండా మా నాయన మెదడును ఎలా తీశారు సాబ్?" అన్నాడు అక్రం ఆవేశంగా

"ఆవేశపడకండి. ఉస్మాన్‌సాబ్ యాక్సిడెంట్‌లో చనిపోయినప్పుడు ఆయనెవరో తెలియలేదు. గుర్తుతెలియని శవంగానే ఆయన శవాన్ని మా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆరోగ్యవంతంగా ఉన్న ఆయన మెదడు మరొకరికి ప్రాణదానం చేస్తుందన్న నమ్మకంతో దానిని తీసి డాక్టర్ ప్రదీప్ గారికి పంపారు.దానిని రామశాస్త్రిగారికి అమర్చడం జరిగింది. ఆ తర్వాతనే మహమ్మద్ ఉస్మాన్‌సాబ్‌ని గుర్తించడం జరిగింది. ఉస్మాన్‌సాబ్ చనిపోయినా ఇంకొకరిని బ్రతికించారు." అంటూ సవివరంగా తెలియజేశాడు డాక్టర్ ఆత్మారాం.

'ఇప్పుడు ఏమిటి చేయడం?" అంది పర్వీన్ ఆందోళనగా.

"ఆయన ఆకారం రామశాస్త్రిగారిదైనా మనిషిమాత్రం మహమ్మద్ ఉస్మాన్‌గారే. ఆయన ఉస్మాన్‌సాబ్‌గానే బ్రతకగలరు. మీతోనే జీవించగలరు. అయితే ఈ కొత్తరూపంలో అడ్జస్టు కావడానికి ఆయనకీ, మీకూ కూడా కొంతకాలం పట్టుంది." అన్నాడు డాక్టర్ మెహతా.

నై...నై... ఐసాకైసా హోతా" అంటూ రుసరుసలాడింది పర్వీన్‌బేగం. అదెల్లా కుదురుతుంది సాబ్! మా నాయన లాష్‌ని పాతిపెట్టినాం కూడా. ఇంక మా నాయనెక్కడున్నాడు? ఆయన చనిపోయాడు. ఈ శాస్త్రిజీ, గీస్త్రీజీతో మాకేం సంబంధంలేదు" అన్నాడు అక్రం.

"హాఁ మాకేమీ రిస్తాలేదు మేం పోతున్నాం. బహుత్ బహుత్ షుక్రియా." అంటూ రుసరుసలాడుతూ బయటకు నడిచింది పర్వీన్. వెనకాలే అక్రం కూడా వెళ్ళాడు

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. వారి దయనీయ పరిస్థితి అర్థం అవుతూనే ఉంది. వారిని వారించీ ప్రయోజనం లేదని ఊరుకున్నారు.

భారంగా నిట్టూర్చాడు డాక్టర్ మెహతా.

"విశ్వంగారూ... మీరే మంటారు? ఈయన్ని తీసుకువెళ్తే మీ నాన్నగారు మీ కళ్ళముందు కదలాడుతున్నట్లే ఉంటుంది. అయితే ఆయన మహమ్మద్ ఉస్మాన్‌నుంచి రామశాస్త్రిగా మారడానికి చాలాకాలం పట్టవచ్చు. మీరు ఓపిగ్గా, సహనంతో నెమ్మది నెమ్మదిగా రామశాస్త్రిగారి అలవాట్లు, ఆచారాలు, ఆలోచనలు, పద్ధతులూ అలవాటు చేయవలసి ఉంటుంది. మీయత్నం ఫలించవచ్చు కాని గ్యారంటీగా చెప్పలేం. ఆయన మహమ్మద్ ఉస్మాన్‌గా భావించుకుని ఇంట్లోంచి పారిపోనూవచ్చు. నిత్యం సమస్యలు సృష్టిస్తూ ఉండవచ్చు. వీటన్నిటినీ మీరు భరించవలసి ఉంటుంది" అన్నాడు డాక్టర్ మెహతా.

"మా వారి రూపం ఉన్నా మనిషి ఆయన కానప్పుడు ఆయన్ని మేం ఎలా స్వీకరించగలం?" అంది జానకమ్మ.

"ఆయన్ని మానాన్నగారుగా అంగీకరించడం అసంభవం. అదిసరే. మనిషికి వ్యక్తిత్వాన్ని కల్పించేది మెదడన్నారు. మరి తొలగించిన మా నాన్నగారి మెదడు ఎక్కడుంది" అని అడిగాడు విశ్వం.

''మామూలుగా అయితే ఆపరేషన్ అయిపోయాక వ్యర్థమైనవాటి నన్నీ పాతిపెట్తాం. కాని కొన్ని వైద్య పరీక్షల కోసం ఆ మెదడుని భద్రపరిచాం. ఎందుకలా అడిగారు?'' అన్నాడు డాక్టర్ మెహతా.

''మా దృష్టిలో మా నాన్నగారు చనిపోయారు. అందుచేత ఆమెదడును మాకిచ్చేయండి. దానికి దహనసంస్కారాలు చేస్తాం. మరో వ్యక్తి మెదడుకు చోటిచ్చిన ఈ దేహంతో మాకు సంబంధం లేదు'' అన్నాడు విశ్వం.

''సరే మీ ఇష్టం. అది మీకు చెందింది. రేపే దానిని మీకు ఇచ్చే ఏర్పాట్లు చేస్తాను.'' అన్నాడు డాక్టర్ మెహతా.

''అలాగే రేపు వచ్చి కలుస్తాను.'' అన్నాడు విశ్వం.

''మీరు డాక్టర్ ప్రదీప్‌ని కలవండి.'' అని ప్రదీప్‌తో ''డాక్టర్ ప్రదీప్ అది మీ లాబ్‌లోనే ఉందిగా దానిని వీరికి ఇచ్చివేయండి'' అన్నాడు.

''అలాగే మీరు రేపు కలవండి'' అన్నాడు ప్రదీప్

విశ్వం, జానకమ్మగారు వెళ్ళిపోయారు

''డాక్టర్ ఆత్మారాం. ఇన్‌స్పెక్టర్ విజయారావులుకూడా వెళ్ళిపోయారు. అవసరమైతే కబురు చేయమని చెప్పా.

''ఇప్పుడు చాలా విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. ఈయన్ని అటు రామశాస్త్రిగారి మనుష్యులూ, ఇటు ఉస్మాన్‌సాబ్ మనుష్యులూ వదిలేశారు ఇప్పుడు ఈయన ఏమైపోతాడు. ఎలా జీవిస్తాడు? అసలు ఈ సంఘర్షణని తట్టుకోగలడా?'' అన్నాడు డాక్టర్ ప్రశాంత్.

''నిజమే. ఈయన కోలుకున్నాక అసలు తన రూపంతో రాజీపడలేడు. అయినా మనసు పీకుతుంది. కనుక అహ్మదాబాద్ వెళ్తాడు కాని అక్కడ వాళ్ళు ఈయన్ని తన్ని తగలేస్తారు. నిజానికి ఈయనది చాలా దారుణమైన పరిస్థితి. '' అన్నాడు డాక్టర్ మెహతా.

''ఈ పరిణామం నేను ఊహించలేదు. బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్ సక్సెస్‌ఫుల్‌గా జరిగినా, వ్యక్తిత్వానికీ దేహానికీ సంఘర్షణ తప్పదు. ఈ సంఘర్షణలో మానసికంగా దెబ్బతిన్న ఆ వ్యక్తిఎక్కువరోజులు బ్రతక్కపోవచ్చు. వైజ్ఞానిక పరంగా మనం విజయం సాధించినా వాస్తవంలో మెదడు మార్పిడి అపజయం పొందక తప్పదనే అన్పిస్తోంది.'' అన్నాడు డాక్టర్ ప్రదీప్.

''సార్... రామశాస్త్రిగారి పరిస్థితి క్షీణిస్తోంది. పల్స్ రేట్ బి.పి. పడిపోతున్నాయి. డ్యూటీ డాక్టర్‌కి కబురుచేసి ఇటొచ్చాను. అంటూ వచ్చింది డ్యూటీలో ఉన్న నర్స్.

''మైగాడ్...'' అంటూ చకచకా ముందుకి వెళ్ళాడు డాక్టర్ మెహతా. ఆయన వెనకే డాక్టర్ ప్రదీప్. డాక్టర్ ప్రశాంత్‌లు కూడా వెళ్ళారు. వాళ్ళు వెళ్ళేసరికి డ్యూటీ డాక్టర్ వచ్చి పేషెంట్ బి.పి. చెక్ చేస్తున్నాడు. బి.పి ఆపరేటస్‌ను తాను అందుకున్నాడు డాక్టర్ మెహతా బి.పి ఒకపక్క పడిపోతున్నా ఉన్నట్లుండి తీవ్రమై ఫ్లక్ట్యువేషన్స్ వస్తున్నాయి. పల్స్‌రేటులో కూడా ఆకస్మికంగా మార్పులు కలుగుతున్నాయి.

''ఈయనకి సెడేటివ్ ఇచ్చి నిద్రపుచ్చినా మానసికంగా తీవ్రమైన ఆందోళనతో కొట్టుమిట్టాడు

తున్నాడు సహజంగా అది ఈయన బ్లడ్ ప్రెషర్ మీద పనిచేస్తుంది. " అన్నాడు డాక్టర్ మెహతా

ఇంతలో ఉన్నట్లుండి పైకి లేచాడు రామశాస్త్రిగారు పట్టరాని ఆవేశంతో.

"నా భార్య, నా కొడుకు నన్ను గుర్తుపట్టడంలేదు నేనెవరంటున్నారు, వాళ్ళకేమైంది? అసలు నాకేమైంది? నా రూపం మారిపోయుంది." అంటూ అరవసాగాడు.

"మళ్ళీ సెడెటివ్ ఇంజక్షన్ ఇయ్యమంటారా?" అని అడిగాడు డ్యూటీడాక్టర్.

"వద్దు.. కొంచెం సేపు అరిస్తే ఆయన ఆవేశం చల్లారుతుంది. ఆ తర్వాత నెమ్మదిగా జరిగిన విషయం ఆయనకి చెప్పి, కొత్తజీవితానికి రాజీపడవలసిందిగా నచ్చచెప్పాలి." అన్నాడు డాక్టర్ మెహతా.

రామశాస్త్రిగారు అరుస్తూనే ఉన్నాడు.

"ఒక విషయం నాకూ అర్థం కావడంలేదు. ఈయన కొంతసేపు గుజరాతీలో, కొంతసేపు ఉర్దూలో మాట్లాడుతున్నాడు. ఇలా ఎందుకు చేస్తున్నాడు." అన్నాడు డాక్టర్ ప్రశాంత్.

"సింపుల్. గుజరాత్‌లో చాలామంది ముస్లింలకు మాతృభాష గుజరాతీయే. కొద్దిమంది మాత్రం ఇళ్ళల్లో ఉర్దూ మాట్లాడతారు. వ్యాపారం చేసే వారికీ, ఎక్కువగా టూర్‌లలో ఉండేవారికీ మతపరమైన కార్యకలాపాలు నిర్వహించేవారికీ ఉర్దూ బాగా వస్తుంది. ఉస్మాన్‌సాబ్ మసీదులో ఇమాం కనుక సహజంగా ఉర్దూ వస్తుంది. ఇంట్లోకూడా వాళ్ళు ఉర్దూనే మాట్లాడుతారన్నమాట. అందుకే భార్య కొడుకులని చూసినప్పుడు ఉర్దూలో మాట్లాడాడు. మనల్ని చూసినప్పుడు మనం బయటివారమన్న ఉద్దేశంతో గుజరాతీలో మాట్లాడాడు. ఇప్పుడు అంతర్మథనం చెందుతున్నాడు కాబట్టి ఆయన ఆలోచనలు ఉర్దూలోనే బహిర్గతం అవుతున్నాయి. " అని వివరించాడు డాక్టర్ మెహతా. ఉస్మాన్‌గారి ఆవేశం కట్టలు తెంచుకుంటోంది. అప్పటివరకూ అరుపులు, కేకలూ వేస్తున్నవాడు ఆవేశంతో ఊగిపోవడం మొదలుపెట్టాడు. ముఖం ఎర్రబారిపోతోంది. కళ్ళు ఉబ్బాయి. ఉచ్ఛ్వాశ నిశ్వాసాలు తీవ్రంగా వస్తున్నాయి. వాటివేడి ప్రక్కనున్న డాక్టర్ మెహతాకి తగులుతోంది.

"లాభం లేదు. మీరు సెడెటివ్ ఇంజక్షన్ ఇచ్చేయండి. " అన్నాడు డాక్టర్ మెహతా డ్యూటీ డాక్టర్‌తో.

ఆయన ఇంజక్షన్ తెచ్చేలోపలే పెద్ద అరుపు అరిచి వెనక్కు విరుచుకు పడిపోయాడు రామశాస్త్రి. అరుపులు ఆగిపోయాయి కళ్ళు తేలిపోయాయి.

డాక్టర్ మెహతా కంగారుగా రామశాస్త్రి నాడిని చూశాడు ఆ తరువాత స్టెతస్కోప్‌తో ఆయన గుండెను పరీక్షించాడు, ఆయన పరీక్షిస్తుండగానే శాస్త్రిగారి గుండె ఆగిపోయింది. తుది శ్వాస విడిచాడు.

"మైగాడ్! హిఈజ్ నోమోర్ పూర్‌ఫెలో ఆవేశం తట్టుకోలేక పోయాడు" అన్నాడు

"వెరీ ట్రాజిక్ ఎండ్." అన్నాడు డాక్టర్ ప్రదీప్.

"మీరు కొంచెం సేపుండి, ఈ డెడ్‌బాడీని మార్చ్యురీకి పంపించండి" అన్నాడు డ్యూటీడాక్టర్‌తో డాక్టర్ మెహతా.

"రండి మనం రూంలో కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాడు ప్రదీప్, ప్రశాంత్‌ల వంక చూస్తూ.

ముగ్గురూ మళ్ళీ రూంలో సమావేశమయ్యారు.

" ఈ సంఘటన చూస్తుంటే "ఆపరేషన్ సక్సెస్‌ఫుల్ బట్ ది పేషెంట్ డైడ్," అన్న సామెత గుర్తుకు వస్తోంది" అన్నాడు ప్రశాంత్.

ఆ సీరియస్ సిట్యుయేషన్‌లో కూడా ముగ్గురికీ నవ్వువచ్చింది.

"నువ్వన్నట్లు బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్స్‌ని సక్సెస్‌ఫుల్‌గా చేయగలగవచ్చు. కానీ వాటివల్ల సమస్యలతోపాటు సత్ఫలితాలూ ఉండవు. అని అనిపిస్తోంది " అన్నాడు డాక్టర్ ప్రదీప్.

"ఈయన బాడీకి పోస్టుమార్టం చేద్దాం. ఈయన మృతికి కేవలం ఉద్రేకమేనా, వేరే కారణాలు కూడా ఉన్నాయా అన్న విషయం తేలుతుంది. ఈలోగా పోస్ట్‌మార్టం ఆఫ్ ఈవెంట్స్ చేద్దాం". అన్నాడు డాక్టర్ మెహతా.

డాక్టర్ ప్రదీప్.ప్రశాంత్‌లు ఆయన వంక ప్రశ్నార్థకంగా చూశారు.

"అవును జరిగిన సంఘటనలను విశ్లేషించడం కూడా అవసరమే. ఈ మహమ్మద్ ఉస్మాన్ అహ్మదాబాద్ నుంచి హైదరాబాద్‌కి వచ్చాడు. చార్మినార్ దగ్గరున్న మసీదుకి ఆటోలో వెళ్తున్నాడు. అకస్మాత్తుగా ప్రమాదం జరిగి తక్షణం ప్రాణం కోల్పోయాడు. ఈ సంఘటన అకస్మాత్తుగా జరగడంతో ఆయనకి హైదరాబాద్ రావడం, ఆటోలో వెళ్తుండడం వరకే గుర్తుంది. అందుకే రామశాస్త్రి దేహంలో స్పృహ వచ్చాక తన ఆటో ప్రయాణం వరకూ చెప్పి. ఆ తర్వాత ఏం జరిగిందని మనల్ని అడుగుతున్నాడు. తన రూపం మారిపోయినందుకు కంగారు పడ్తున్నాడు కాని, మహమ్మద్ ఉస్మాన్‌గా తాను. మరణించిన విషయం తిరిగి రామశాస్త్రి విషయంలో జీవించిన విషయం అతనికి తెలియదు. తెలుసుకోలేడు. ఇప్పుడు చెప్పినా అర్థం కాదు. ఈయనకి ఆవేశం తగ్గి విషయం అంతా తెలుసున్నా రాజీపడినా, తనని తనవారూ, పెరవారూ కూడా స్వీకరించక తిరస్కరించడం తథ్యం కనుక, దారుణమైన మానసిక వేదనకు లోనవుతాడు. ఆ చిత్రవధను తట్టుకోలేక కృంగికృశించి కొద్దికాలంలోనే చనిపోకతప్పదు. ఈ పరిస్థితి ఈయనకే కాదు. బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ జరిగిన ఎవరికైనా తప్పదు. ఒక వేళ పురుషుని కపాలంలో స్త్రీ మెదడుని కాని, స్త్రీ శిరంలో పురుషుని మెదడునికాని ఉంచి బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్ చేస్తే ఆ ఫలితాలు ఇంకా దారుణంగా ఉంటాయి. ఎందుకంటే వ్యక్తిత్వం, దేహం మధ్య సంఘర్షణే కాకుండా, స్త్రీ పురుష మానసిక తత్వాలలో ఉండే తేడా వల్ల కూడా కొత్త సమస్యలు ఎదురవుతాయి. రెండు విధాలుగా భయంకరమైన పరిణామాలు ఎదురవుతాయి. అందువల్ల ఇంక మనం ఈ బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్‌లకి ఫుల్‌స్టాప్ పెట్టడం మంచిది." అన్నాడు డాక్టర్‌మెహతా.

"మీ అభిప్రాయాలతో నేను ఏకీభవిస్తున్నాను. అది సరే. ఇప్పుడు ఈ శవాన్ని ఏం చేయడం. అటు ఉస్మాన్‌మనుష్యులు. ఇటు రామశాస్త్రిగారి వాళ్ళూ మాకు సంబంధంలేదంటే మాకు సంబంధం లేదంటూ వెళ్ళిపోయారు. అందరూ ఉండికూడా దిక్కులేని శవంలాగా పూడ్చిపెట్టడమేనా? మెదడు ఉస్మాన్‌ది కనుక పూడ్చడమా? శాస్త్రిగారి దేహం కనుక కాల్చడమా? ఇవి కొత్త సమస్యలు" అన్నాడు డాక్టర్ ప్రదీప్.

"దోమల కరణం బతికి బాధించాడు, చచ్చీ సాధించాడు' అన్న సామెత గుర్తుకు వస్తోంది నాకు" అన్నాడు ప్రశాంత్. ఇద్దరూ నవ్వారు ఆ మాటలకు.

"ఈ శవాన్ని కాల్చొవద్దు, పూడ్చొవద్దు దీనిని మెడికల్ మ్యూజియంలో ఎగ్జిబిట్‌గా ఉంచుదాం. మాస్కోలో లెనిన్ మృతదేహం, గోవాలో సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ శవం ఉన్నట్లు, బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్‌కి మెమోరియల్‌గా ఉండి సందర్శకుల నాకర్షిస్తుంటుంది. విజ్ఞాన శాస్త్రంలో విజయాలే కాదు వాటి వెనుక అపశ్రుతులు కూడా ఉండవచ్చునని గుర్తుచేస్తుంటుంది" అన్నాడు డాక్టర్ మెహతా.

"మీ ఐడియా బాగుంది. అలాగే చేద్దాం" అన్నాడు ప్రదీప్.

"కాగల కార్యం గంధర్వులే తీర్చారన్నట్లు, కావలసిన కార్యాన్ని డాక్టర్ మెహతా సూచించారు." అన్నాడు ప్రశాంత్.

ముగ్గురూ నవ్వుకున్నారు.

"టెన్షన్స్ మధ్య గడిపే మన మెడికల్ ప్రొఫెషన్‌లో మీ వంటివారి జోక్స్ మంచి రిలీఫ్". అన్నాడు డాక్టర్ మెహతా.

ముగ్గురూ మళ్ళీ నవ్వుకున్నారు

**ఆంధ్రప్రభ వారపత్రిక, 23-10-2000** ✪



కె.ఆర్.కె. మోహన్

18-11-1933లో మచిలీపట్నంలో జననం. బి.ఏ. వరకు విద్యాభ్యాసం. 1953లో పోస్టల్ శాఖలో జేరి 1991లో హెడ్ పోస్టుమాస్టర్‌గా పదవీవిరమణ.

తెలుగు, ఇంగ్లీషు రెండింటిలోనూ విస్తారంగా కథలు, నవలలు, కవితలు, వ్యాసాలు, పుస్తక సమీక్షలు వంటి అన్ని ప్రక్రియలలోనూ 5,000కు పైగా రచనలు చేశారు. రెండుజాతీయ పురస్కారాలే కాక తెలుగు, ఇంగ్లీషులలో 44 బహుమతులు, పురస్కారాలు పొందారు. 1971లో 'వక్రించిన సరళరేఖలు' నవల ఉర్దూ అనువాదం 'రోషన్‌సాయె'కి కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ బహుమతి. 1994 లో మాధ్యమాల ద్వారా అత్యుత్తమంగా సైన్స్, టెక్నాలజీల ప్రచారం గావించినందుకు భారత ప్రభుత్వపు NCSTC Award ను 50,000 నగదు మొత్తాన్ని బొంబాయిలోని నెహ్రూప్లానిటోరియం డైరెక్టర్ డాక్టర్ రావల్‌తో పంచుకోవడం (ఈ పురస్కారం లభించింది ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో ఈయనొక్కరికే.

1976లో International P.E.N. Seoul (Korea) వారు 22 ఆసియా దేశాలనుంచి ఎంపిక చేసిన కథలలో భారతదేశానికి చెందిన ఐదు కథల్లో "The God Forsaken" అన్న కథవారి "Asian Literature" అన్న గ్రంథంలో ప్రచురితం. పాలగుమ్మి పద్మరాజుగారి 'గాలివాన' తర్వాత అంతర్జాతీయ స్థాయిలో ఎంపికైన కథ ఇది.

1994లో ''రెలవెన్స్ ఆఫ్ వివేకానందాస్ మెసేజ్'' అన్న వ్యాసానికి సహారా ఇండియా కలకత్తా వారి ప్రత్యేకబహుమతి.

అథర్స్ గిల్ట్ ఆఫ్ ఇండియా వారి జాతీయస్థాయి పోటీలో "The wheels of Lord Chariot" అన్న కథకు తృతీయబహుమతి.

అనేక రచనలు విదేశీపత్రికలు, పుస్తకాలలో ప్రచురితం.

పలురచనలు ప్రధానభారతీయ భాషలతోపాటు, ఇంగ్లీషు డానిష్ భాషలలోకి అనువాదం అయ్యాయి.

1995 లో భోపాల్ లోని అఖిలభారత భాషాసాహిత్య పరిషత్ వారిచే ''సాహిత్యశ్రీ'' బిరుదు ప్రదానం.

1996లో కలకత్తాలోని Indian Board of Alternative Medicine వారిచే వైద్యేతర రంగాలలో విశిష్టకృషికి గుర్తింపుగా ''శిరోమణి'' (గౌరవ డాక్టరేట్) ప్రదానం.

కృష్ణను పరిచయం చేసిన ''తేనెమనసులు'' చిత్రానికి కథారచన. సైన్స్‌ఫిక్షన్‌లో 80 కథలు, మూడు నవలలూ, ఆరునాటకాలు రాశారు.

సాహిత్యానికి, సైన్స్‌కి సంబంధించిన అనేక జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో పాల్గొని ప్రసంగాలు, పత్రసమర్పణ చేశారు.

పలుసాహిత్య, సైన్స్ సంస్థలలో సభ్యత్వమే కాక, కార్యవర్గంలో పదవులు కూడా నిర్వహించారు. ఇండియన్ అసోసియేషన్ ఫర్ సైన్స్‌ఫిక్షన్ స్టడీస్‌కి ఇప్పుడు వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు.